# Nigah - Balagopal

# నిగాహ్



బాలగోపాల్

# నిగాహ్

(1998 - 2003)

కె. బాలగోపాల్

దేవులపల్లి పబ్లికేషన్స్

హైదరాబాద్

**నిగాహ్** (నిఘా)
***Nigah***

ఏప్రిల్ 2011

కవర్ : **మోహన్**

వెల : రూ. 150/-

ప్రచురణ : **దేవులపల్లి పబ్లికేషన్స్,** హైదరాబాద్

ముద్రణ : **నవ్య ప్రింటర్స్,** హైదరాబాద్

ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

: **ప్రజాతంత్ర ఆఫీసు**
ఫ్లాట్ నెం. 1-ఎ, ఇండస్ట్రియల్ పార్క్
ఐడిఎ, ఉప్పల్, హైదరాబాద్ - 500 039
ఫోన్ : 95023 20616

**వేమన వసంతలక్ష్మి**
301, శ్రీరామ్ రెసిడెన్సీ
ప్రియకాలనీ, గుడిమల్కాపూర్,
మెహదీపట్నం, హైదరాబాద్ - 500 028
ఫోన్ : 040-23537969



# ప్రజాతంత్రకు ఇప్పుడెవరు రాస్తారు?

**బా**లగోపాల్ ఆకస్మిక మరణం వల్ల దేశంలోని ప్రజాతంత్ర ఉద్యమాలకు, మానవహక్కుల ఉద్యమాలకు ఎంత తీరని నష్టం జరిగిందో 'ప్రజాతంత్ర' అనే 'చిన్న' వారపత్రికకు అంతకంటే ఎక్కువ నష్టం జరిగింది.

హంగులూ ఆర్భాటాలూ కోట్లాది రూపాయల పెట్టుబడులూ లేకుండా ప్రారంభమై దాదాపు 12 సంవత్సరాలుగా ఎన్నో కష్టాలు ఎదుర్కొని కూడా ఆగకుండా నడుస్తున్న పత్రిక ప్రజాతంత్ర. పత్రిక ప్రారంభమైన తొలి నెలలలోనే ప్రజాతంత్రలో 'నిగాహ్' రాయడం ప్రారంభించారు బాలగోపాల్.

అప్పట్లో ప్రజాతంత్ర సంపాదకుడిగా నేనే ఆయనను అడిగాను పత్రికకు ఒక కాలమ్ రాయండి అని. ఆయనను అడిగినట్టే మరికొందరు పెద్దలను కూడా అడిగాను. కొందరు రాస్తామని ముందుకు వచ్చారు. మరికొందరు ఎంతకాలం నడుస్తుందిలే పత్రిక స్థిరపడనీ అప్పుడు ఆలోచిద్దాం అన్నారు. రాయడానికి ముందుకొచ్చిన వాళ్లలో కూడా కొందరు అనేక కారణాల వల్ల మధ్యలో మానేసారు.

ఒక్క బాలగోపాల్ మాత్రమే కాలమ్ రాయడం ప్రారంభించినప్పటి నుంచి చనిపోయే ముందు దాకా ఏ ఒక్కసారీ ఆపకుండా ప్రజాతంత్రకు **'నిగాహ్'** రాసాడు. తీరిక లేనంత పనిలో ఉండి కూడా, రాష్ట్రమంతటా తిరుగుతూ ప్రజల సమస్యల మీద చేస్తున్న ఉద్యమాల ఒత్తిడిలో ఉండి కూడా ఆయన ప్రజాతంత్రకు పదిహేను రోజులకోసారి కాలమ్ రాయకుండా ఉండలేదు. ఏదో ఒక విధంగా కాలమ్ ప్రజాతంత్రకు చేరేట్టు చూసేవాడు.

ఈ పన్నెండేళ్ల కాలంలో ఆయన ప్రజాతంత్రలో తన కాలమ్‌లో బహుశా తడమని అంశం లేదు. మొదట్లో నేను కాలమ్ రాయాలని కోరినప్పుడు ఏం రాయమంటావు? అని అడిగాడు. మీ ఇష్టం మీరు ఏది రాసినా సరే అన్నాను. రాయడం మొదలు పెట్టాడు, ఎక్కడా ఆపలేదు.

బాలగోపాల్ చనిపోయిన రోజు ఆయన ఇంటి దగ్గరనే అనుకుంటా ఒక మిత్రుడు అజయ్ (ప్రస్తుత ప్రజాతంత్ర సంపాదకుడు) తో చెప్పిన మాటలు ఏ విషయంలోనైనా సరే అది ఎంత చిన్నదైనా సరే బాలగోపాల్ కమిట్‌మెంట్‌ను గుర్తు చేస్తాయి. చనిపోయే కొద్దిరోజుల ముందు బాలగోపాల్ ఏ తెల్లవారుఝామునో ఆ మిత్రుడి ఇంట్లో కిటికీ నుంచి ఓ కవర్ జారవిడిచి వెళుతుంటే మెలకువగానే ఉన్న అతను తలుపు తెరిచి ఏమిటి అట్లా వెళ్లిపోతున్నారని అడిగితే అర్జెంట్‌గా ఊరు వెళ్లాలి, ప్రజాతంత్రకు నా కాలమ్ అందజేయండి అని చెప్పి వెళ్లిపోయాడట. ఒక వారం ప్రజాతంత్రకు కాలమ్ రాయకపోతే అడిగేవాళ్లు లేరు, కానీ ఆయన కమిట్‌మెంట్ అటువంటిది.

మొన్న 12వ తేదీన బాలగోపాల్ సంస్మరణ సభ రోజు ఉదయం మరో మిత్రుడు కోదండ్‌ను (ప్రొఫెసర్ కోదండరామ్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు), నేను 'కాఫీ విత్ సాక్షి' ఉదయం కార్యక్రమంలో కలుసుకున్నప్పుడు ప్రజాతంత్రకు బాలగోపాల్ రాసిన కాలమ్ ప్రస్తావన వచ్చింది. అప్పుడు కోదండ్ జ్ఞాపకం చేసుకున్న మాటలు పెద్ద పెట్టుబడులకు నోచుకోక కమిట్‌మెంట్‌తో నడిచే పత్రికల పట్ల బాలగోపాల్ కన్‌సర్న్‌ను గుర్తు చేస్తాయి.

చాలామంది బాలగోపాల్‌తో అనేవాళ్లు ప్రజాతంత్రలో మీరు రాస్తున్న కాలమ్‌లో చాలా వైవిధ్యం ఉంది. అనేక విషయాల మీద మీ విశ్లేషణ, అభిప్రాయం తెలుస్తున్నది. కానీ ప్రజాతంత్రలో రాస్తే ఎక్కువమంది చదవరు కదా ఏదైనా పెద్ద పత్రికకు రాయరాదా అని. అప్పుడు బాలగోపాల్ ఈ పత్రికలకే రాయాలి, మనం రాయకపోతే ఇటువంటి పత్రికలకు ఎవరు రాస్తారు? అని చెప్పారట. ఈ విషయం కోదండ్ చెప్పాడు నాకు.

ప్రజాతంత్రకు ఏమైనా రాయండి అని అడిగితే మొహం చాటేసిన వాళ్లూ ఉన్నారు. రెమ్యునరేషన్ ఏమిస్తారు? అని అడిగినవాళ్లూ ఉన్నారు. స్వతంత్రంగా నిలబడటానికి 'ప్రజాతంత్ర' సాగించిన ప్రయత్నానికి చేయూతగా నిలిచి రచనలు చేసిన వాళ్లూ ఉన్నారు. ఐతే వేర్వేరు కారణాల వల్ల చాలామంది ప్రజాతంత్రకు రాయడం మానేసారు. బాలగోపాల్ మాత్రం చివరి దాకా తన కాలమ్ **'నిగాహ్'** కొనసాగించాడు. ప్రజాతంత్ర పాఠకులు ఆయన అభిప్రాయాలను ఇకపైన చదవలేరన్నది జీర్ణించుకోజాలని విషయం.

మధ్యలో ఒక్కసారి బాలగోపాల్ కాలమ్ అందలేదు. ఏం జరిగిందోనని వసంతకు ఫోన్ చేసాను. 'నాకు తెలియదయ్యా ఆయన రాయనంటున్నాడు, ఆయనతోనే మాట్లాడుకో' అన్నది.

అదే సాయంత్రం ఆనంద్‌నగర్‌లో ఆయన ఇంటికి వెళ్లాను. ఇద్దరు, ముగ్గురు క్లయింట్‌లు ఉన్నారు. అప్పుడే కోర్టు నుండి వచ్చినట్టున్నాడు. బాలగోపాల్ దగ్గర నాకు ఎంత చనువు ఉందో ఆయనంటే అంత భయం కూడా. కొందరితో అంతే. వాళ్లు నిర్వహిస్తున్న ఉద్యమాలతో, వాళ్లు నాయకత్వం వహిస్తున్న లేదా ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థల్లో సభ్యుడిగా లేకున్నా వాళ్ల కట్టుబాట్లు, క్రమశిక్షణల పరిధిలోకి రాకున్నా, ఒకళ్లిద్దరంటే నాకు ఉన్న ఆ భయం వాళ్ల పట్ల ఉన్న గౌరవం, అభిమానం వల్లనే అనుకుంటాను. అటువంటి వాళ్ల కోవలోకి వచ్చే వ్యక్తి బాలగోపాల్.

ఏందిట్లా వొచ్చినావ్ అన్నాడు బాలగోపాల్. జంకుతూనే మాట్లాడాలె అన్నాను. క్లయింట్‌లను మాట్లాడి పంపించేసాడు. ఏంటి సంగతి అంటే కాలమ్ రాయనన్నారట అన్నాను.

నువ్వు జియ్యర్ స్వామిని తీసుకొచ్చి పత్రిక ఫంక్షన్ చేస్తుంటే నేనెందుకు రాయాలి? అన్నాడు. నాకు ఇది తట్టనే లేదు. అంతకు కొద్దిరోజుల ముందే ప్రజాతంత్రను హైదరాబాద్ నగరంలో సాయంకాల దినపత్రికగా తీసుకొస్తే బాగుంటుందనే ఆలోచన ప్రజాతంత్ర యాజమాన్యానికి వచ్చింది. ఆ సాయంకాల పత్రికను చినజియ్యర్ స్వామి ఒక ఫంక్షన్‌లో ఆవిష్కరించారు.

బాలగోపాల్ కాలమ్ ఆపేస్తాననడానికి అది కారణమని నాకు తట్టనే లేదు. ఏం చెయ్యాలో తెలియక మౌనంగా కూర్చున్నాను. ఆయనే కల్పించుకుని సరే రాస్తాను, కానీ ఈ వారం చినజియ్యర్ స్వామిని విమర్శిస్తూ రాస్తే వేసుకుంటావా అన్నాడు. 'తప్పకుండా' అన్నాను. ప్రజాతంత్రలో ఆ సమస్య ఎప్పుడూ లేదు. అన్ని అభిప్రాయాలూ ప్రజలకు చేరాలన్నదే ఆ పత్రిక అభిమతం.

అయితే, ఎందుకో గాని బాలగోపాల్ తాను అన్నట్టుగా జియ్యర్ స్వామికి వ్యతిరేకంగా ఏమీ రాయలేదు. ఆ తరువాత ఎప్పుడూ ఆయన కాలమ్ ఆగలేదు. సాహిత్యం మీద ఆయన అభిప్రాయాలకు సంబంధించిన చివరి ఇంటర్వ్యూ కూడా ప్రజాతంత్రలోనే వచ్చింది. దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం ప్రజాతంత్ర ప్రచురించిన ఒక ప్రత్యేక సాహిత్య సంచికలో బాలగోపాల్‌ను ప్రస్తుత ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ఇంటర్వ్యూ చేసారు.

ఆయన ఆకస్మిక మరణం కారణంగా **'నిగాహ్'** కాలమ్ ఆగిపోవడాన్ని మించిన బాధాకరమైన విషయం నా వరకు నాకు ఇంకొకటి ఉండదు. దాదాపు 230 వారాలు ఆయన కాలమ్ నడిచింది ప్రజాతంత్రలో. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి (ఇపిడబ్ల్యూ) వంటి గొప్ప పత్రికల వాళ్లే అడిగి రాయించుకునే స్థాయి బాలగోపాల్‌ది. ఆయనకు మాత్రం అవేమీ పట్టవు. ఆ తేడాలు ఆయనకు ఉండవు. అందుకే మనం రాయకపోతే ప్రజాతంత్రకు ఎవరు రాస్తారు? అని ప్రశ్నించాడు.

నిజానికి, కొంతకాలంగా బాలగోపాల్ ప్రజాతంత్రలో రాసిన వ్యాసాలన్నిటినీ పుస్తకంగా తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నాం మేం. అందుకు అవసరమైన సహకారం అందించడానికి వసంత ముందుకు వచ్చింది. ప్రూఫ్‌లు చూడటం, మిస్సింగ్‌లను సరిచేయడం వంటి పనులు కూడా చేసింది వసంత.

ఇప్పుడు ఆయన లేడు ఆయన రచనలు ఉన్నాయి. వాటిలో ఆయన ఆలోచనలున్నాయి, అభిప్రాయాలున్నాయి, ప్రజల హక్కుల రక్షణ పట్ల ఆయన ఆకాంక్షలున్నాయి. వాటన్నిటిని మరింత మంది ప్రజల దగ్గరకు చేర్చే ప్రయత్నం ద్వారా ప్రజాతంత్ర ఆయనకు నివాళులు అర్పించదల్చుకున్నది.

ప్రజాతంత్ర కుటుంబం తరఫున బాలగోపాల్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

– అక్టోబర్ 2009

**బా**లగోపాల్ ఆకస్మిక మృతి చెందిన వెంటనే ప్రజాతంత్రలో నేను రాసిన వ్యాసం ఇది. కొన్ని అనివార్య కారణాల వలన మేము తీసుకొద్దామనుకున్న నిగాహ్ సంపుటి సంవత్సరం పైగా ఆలస్యమైంది. అందుకు చింతిస్తూ 115 వ్యాసాలతో కూడిన మొదటి సంపుటిని ఇప్పుడు మీ ముందుకు తీసుకొచ్చాం. మిగతా 118 వ్యాసాలతో త్వరలో రెండో సంపుటిని కూడా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం. అడిగిన వెంటనే 'వ్యాఖ్యాన బాల వ్యాకరణం' పేరుతో అద్భుతమైన ముందుమాట రాసిచ్చిన 'వార్త' దినపత్రిక సంపాదకులు టంకశాల అశోక్‌కు, ఎంతో అర్థవంతమైన కవర్ బొమ్మను వేసిచ్చిన ఆర్టిస్టు మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. మా మిగతా పుస్తకాలలాగే ఈ పుస్తకాన్ని కూడా తెలుగు పాఠకలోకం ఆదరిస్తుందని ఆశిస్తున్నాం.

**– దేవులపల్లి అమర్**

దేవులపల్లి పబ్లికేషన్స్ తరఫున

మార్చి 2011

# వ్యాఖ్యాన బాల వ్యాకరణం

**బా**లగోపాల్ ఆదివాసుల నుంచి అంతర్జాతీయ విషయాల వరకు వివిధాంశాలపై రాసిన వ్యాఖ్యలు ఇవన్నీ. ఇవి పది పన్నెండేళ్ళ క్రితం 1998–2003 మధ్య ప్రజాతంత్ర పత్రికలో వెలువడ్డ వ్యాసాలు. వాటిని పుస్తక రూపంలో ఇంతకాలం ఎందుకు తేలేదని ప్రచురణకర్తలను మనం కావాలంటే ప్రశ్నించవచ్చుగాని, రోజువారీ ఘటనలపై వ్యాఖ్యలను పదేళ్ళ తర్వాత పుస్తకంగా వేస్తే ఉపయోగమేమిటని మాత్రం పెదవి విరవలేము.

ఎందువల్ల? నా ఉదాహరణతో చెప్తాను. ఇవి ప్రజాతంత్రలో వెలువడుతుండగా నేను ఒక్కటంటే ఒక్కటైనా చదవలేదు. ఇపుడు దశాబ్దం తర్వాత చదివినా, వాటికి వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ ఉపయోగం ఉంటుందని అర్థమయింది. వీటిని అప్పుడే చదివినవారు మళ్ళీ చదివినా, ఎవరైనా కొత్తగా చదివినా, నాతో ఏకీభవిస్తారనుకుంటున్నాను.

దైనందిన పరిణామాలపై చేసే పత్రికా వ్యాఖ్యలకు సర్వసాధారణంగా కొద్దిరోజుల తర్వాత విలువ ఉండదు. ఇందుకు మినహాయింపులు ఉండవని కాదుగాని తక్కువే. ఒక ఘటన లేదా పరిణామం గురించి, ఘటించిన లేదా పరిణమించిన అంశాలకు పరిమితమై వ్యాఖ్యానించినవి కొన్నుంటాయి. అటువంటివీ బాగుండవచ్చుగాని వాటికి దీర్ఘకాలిక విలువ ఉండదు. కొందరు తమ వ్యాఖ్యాన పరిమితిని విస్తరించవచ్చు గాని, అప్పటికీ ఆ వ్యాఖ్యకు విలువ కొంత పెరిగినా దీర్ఘకాలికత మాత్రం రాదు.

అది వచ్చేదెప్పుడు? బాలగోపాల్ వ్యాఖ్యలను చదివితే అర్థమవుతుంది. ఒక్క పరమాణువులో విశ్వం దాగి ఉందన్నట్లు, మన చుట్టూ రోజువారీగా జరిగే ఘటనలను, పరిణామాలను చుట్టుకుని అనేక విషయాలుంటాయి. వాటికి పరస్పర సంబంధం ఉంటుంది. ఆ విధంగా ఘటనలకు లోతు, విస్తృతి ఏర్పడతాయి. అటువంటి స్థితిలో, ఒక ఘటన అనే పరమాణువు నుంచి మన దృష్టి ఆ ఘటనతో ముడిపడిన విశ్వాన్నంతా

చుట్టి చూస్తే తప్ప విషయం నిజంగా బోధపడదు. అట్లా బోధపరచుకుని రాసిన వ్యాఖ్యలకు దీర్ఘకాలిక విలువ ఏర్పడుతుంది.

ఒక ఘటన గురించి రాసే ఆ విధమైన వ్యాఖ్యలో రచయిత వర్తింపజేసే సూత్రాలను పాఠకుడు గ్రహించినపుడు, వాటిని తనంతటతానే ఇతర ఘటనలకు కూడా వర్తింపజేసి అవగాహన చేసుకోగలడు. పాఠకుడిని ఒక వ్యాఖ్య చదవటం ద్వారా, ఇతర ఘటనలను మళ్ళీ వ్యాఖ్యలతో అవసరం లేకుండా అవగాహన చేసుకోగల స్థాయికి మేధోపరంగా సిద్ధపరచగలగటమే నిజమైన దీర్ఘకాలిక విలువ. ఒక వ్యాఖ్యలో రచయిత అనుసరించిన దృష్టికి, పాటించిన విశ్లేషణా సూత్రాలకు ఆ విధంగా అన్నింటికీ వర్తించే సార్వకాలికత కూడా అబ్బుతుంది. సూటిగా చెప్పాలంటే ఆ వ్యాఖ్య ఒక సైన్స్ అవుతుంది. ఆపిల్ పండు కిందకే ఎందుకు పడుతుందన్న ప్రశ్నకు కనుగొన్న జవాబు, ఆ పండు కిందకు పడటానికే గాక ఇతరాలకూ జవాబు చెప్పిన సైన్స్‌గా మారినట్లన్న మాట.

బాలగోపాల్ ఒక విషయంపై వ్యాఖ్యానించదలచినపుడు దానిని తీసుకుని లేబరేటరీకి వెళతాడు. దానిపై తన అభిప్రాయాలు తనకు అప్పటికే ఉంటాయి సహజంగా. అయినప్పటికీ సదరు అభిప్రాయాలతో సహా విషయాన్నంతా సైంటిస్ట్ వలె మళ్ళీ శోధిస్తాడు. ఒకోసారి విషయం ఉద్వేగాన్ని కలిగించేది అయినా ఉద్వేగపడడు. పరీక్ష నాళికలో వేసి రసాయనిక పరీక్షలు జరుపుతాడు. ఆ విషయాలు అనేకం తాను అప్పటికే పరీక్షించినవి అయినందున ఆ ఫలితాలకు అనుగుణంగా అభిప్రాయాలను వ్యక్తీకరిస్తూనే, కొత్త ఫలితాలు ఎదురుపడినపుడు నిర్వికారంగా స్వీకరిస్తాడు. స్వపర భేదాలు లేకుండా, నిర్మొహమాటమైన విధంగా తప్పొప్పులు ఎత్తి చూపి వ్యాఖ్యానించే ఆయన లక్షణం దీనినుంచి వచ్చిందే.

ఇవన్నీ ఎట్లా సాధ్యం? ఒకటి అధ్యయనం: పుస్తకాధ్యయనం, సమాజాధ్యయనం. రెండు ఆలోచన: నిర్వికారమైన, నిర్భమకారమైన రీతిలో. మూడు సైంటిస్టు వంటి విశ్లేషణ: ఆయా ఘటనలనే గాక, తన తత్పూర్వ ఆలోచనలను కూడా విశ్లేషించుకోవటం. నాలుగు అతనొక కూల్ గై. పూర్తి నిలకడ మనిషి. ఇవన్నీ తన వ్యాఖ్యల్లో కనిపిస్తాయి. పైన చెప్పుకున్న ఇతర లక్షణాలూ ఉండనే ఉన్నాయి. ఇవన్నీ ఉన్న వ్యాఖ్యాత, మనకు కూడా అందుబాటులో గల అవే వివరాల నుంచి మనకు తట్టని కోణాలను మన ముందుకు తేగలుగుతాడు. అది ఒకోసారి మనకు, అరె ఇది ఇంత సులభమైన ఆలోచనా అనిపించి విస్మయపరుస్తుంది. అటువంటివి ఈ వ్యాఖ్యల్లో అనేకం ఉన్నాయి. హడావుడిగా కాకుండా నెమ్మదిగా చదివితే మీకే కన్పిస్తాయి. వీటికి దీర్ఘకాలిక విలువ రావటానికి అది కూడా ఒక కారణం. మొదట అచ్చయి పదేళ్ళు దాటినా నాకు ఇప్పటికీ శ్రద్ధగా చదవాలనిపించింది అందుకే.

బాలగోపాల్ వృత్తిరీత్యా జర్నలిస్టు కాదు. తన వృత్తి, వ్యాపకం ఏమిటో మనకు తెలుసు. ఇతరత్రా ఏమేమిటో తెలుసు. అదంతా అయినవారే ఇటువంటి వ్యాఖ్యలు రాయగలరా? ప్రశ్న అది కాదు. వృత్తి రీత్యా జర్నలిస్టులు అయినవారు, కాకపోయినప్పటికీ వ్యాఖ్యలు రాసేవారూ బాలగోపాల్ వ్యాఖ్యలు చదివి, తమ చుట్టూ జరిగే ఘటనల గురించి, పరిణామాల గురించి వ్యాఖ్యానించే ముందు ఈ పద్ధతిలో విషయ పరిశీలన చేసేందుకు ప్రయత్నించవచ్చుకదా.

ఇందులోని వ్యాఖ్యలన్నీ సమగ్రమైనవని, మనం తప్పక ఏకీభవించేవని కాదు. విషయపరిశీలనా దృష్టి, పరిశీలించే పద్ధతి, తన లేబరేటరీలో తేలిన ఫలితాలను నిస్సంకోచమైన విధంగా ప్రకటించటం, కొత్త ఫలితాలు ఎదురైనపుడు భేషజాలు లేకుండా సవరించుకునే సంసిద్ధత అనే నాలుగింటి గురించి మనం మాట్లాడుతున్నాము. ఈ నాలుగింటికి సంబంధించి బాలగోపాల్‌కు సిద్ధాంతాలు, ఆచరణలు, అకడమిక్స్, జర్నలిజపు వ్యాఖ్యలు అనే తేడాలు లేవనాలి. ఎందులోనైనా ఇదే పద్ధతి పాటించేవాడనుకుంటా. అసలు తన వ్యక్తిత్వమే అట్లా రూపొందినట్లున్నది. తను వ్యాఖ్యానించే అంశం ఆదివాసులా, పౌరహక్కులా, చంద్రబాబా, కాశ్మీరా, టిబెట్టా, రైతులా, లాయర్ల సమ్మెనా, సాధారణ దొంగలా, మెదడువాపా, మత విద్వేషాలా అనే వ్యత్యాసాలు లేవు. ఇందులోని అన్ని వ్యాఖ్యలకూ ఇది వర్తిస్తుంది.

ఆలోచనాపరులెప్పుడూ అసమ్మతి (అసంతృప్తి కాదు) వాదులుగానే ఉండాలి. సామాజిక జీవిగా తను దృష్టిపెట్టిన వివిధాంశాలలో అసమ్మతివాదిగానే ఉంటూ వచ్చిన ఆయన అభిప్రాయాలు ఈ వ్యాఖ్యలలో వ్యవస్థపట్లనే గాక, విప్లవవాదుల విషయంలో, పౌరహక్కుల గురించిన చర్చలో, స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు అన్ని అంశాలలో కనిపిస్తాయి. వీటిలో అనేకం పూర్తి నిడివి వ్యాసాలుగా రాసి ఉంటే బాగుండు కదానని కూడా అనిపిస్తాయి. మనకు తెలిసి, చదివి, రాసిన విషయాలను కొత్త కోణాలలో విడమరచి చెప్తాయి. లేదా ప్రశ్నలు వేసి ఆలోచింప జేస్తాయి. కొన్నయితే, ఇందులో రాసేందుకు ఏముందనుకుంటాము మనం. కాని, అటువంటి అంశాలు కూడా తీసుకుని రాసి, వాటిలో అర్థం చేసుకోవలసిన జీవితం, సమాజం చాలా ఉందని చూపగలడు బాలగోపాల్.

“అరె, ఇంత సులభంగా, ఇట్లా కూడా ఆలోచించవచ్చునే”, అని పలుచోట్ల మనకు అనిపింపజేయటం బాలగోపాల్ తరహా ఆలోచనాపరులు, వ్యాఖ్యాతలలో గమనించదగ్గ విశేషం. ఆ శైలిని చందమామ కథలను పోలిన చందమామ వ్యాఖ్యాన శైలి అంటే అతికినట్లు ఉంటుందనుకుంటాను. అంతే కాదు. అక్కరలేని మేధోవిన్యాసాలు, అట్టహాసాలు లేకుండా సులభంగా, సూటిగా ఆలోచించటం నుంచే

బాలగోపాల్ తరహాలో సరైన విశ్లేషణలు, కొత్తకోణాల వెలికితీత చేయవచ్చనుకుంటాను. అటువంటి ఆలోచనా శైలి, ఇటువంటి రచనా శైలి ఒకదానికొకటి సరిపోతాయి. రెండూ చందమామ లక్షణాలే.

ఈ వ్యాఖ్యల్లో నాకు ప్రత్యేకంగా బాగనిపించిన ప్రశ్నలు, విశ్లేషణలు, కోణాలు కొన్ని ఉన్నాయి. దొంగలు, పర్యావరణం, బంద్‌లు, అబ్రహాం, రాంరెడ్డి అనే వ్యక్తులు, లాయర్లు, జడ్జీలు, మొదలైనవి. వాటిలో ఒక్కొక్క వ్యాఖ్య జోలికి పోవటం లేదిక్కడ. ఇతర అంశాలు సరేసరి కాగా, ఈ తరహావి చదివినపుడు అనిపించేది ఏమంటే, విషయాలను ఎంత లోతుగా, విస్తృతంగా అధ్యయనం చేసినా, సూక్ష్మపరిశీలనాలు కూడా చేయగలిగితే తప్ప సమాజం అర్థం కాదు. అందుకు ఒకోసారి మన అభిప్రాయాలను పక్కన ఉంచి తెల్లకాగితాలుగా మారటం అవసరమేమో.

జర్నలిస్టులైనా, ఇతర వ్యాఖ్యాతలైనా ఇటువంటి పరిశీలనలు చేయటం అసాధ్యమా? అనుకోను. కావలసింది ఆ దృష్టిని అలవరచుకోవటం. ఈ పుస్తకం చదివిన వారికి అట్లా అలవరచుకోవాలనే కోరిక మాత్రం తప్పక కలుగుతుందని చెప్పగలను. నాకు కలిగిందని వేరే చెప్పనక్కర లేదనుకుంటాను.

**– టంకశాల అశోక్**

# ఇందులో..


1. ఈ హత్యలు ఆపండి 17
2. పాపం కాశ్మీరీలు 21
3. 'దొంగలకు' కూడ పౌరహక్కులుంటాయి 26
4. వర్గీకరణ మళ్లీ మొదటికి 30
5. అమర్త్యసేన్‌ను అనుసరించాలంటే మన పాలకులు ఏం చేయాలి? 33
6. ముంబాయిలో ఆ రోజు 37
7. బంద్‌లు, కోర్టులు, ప్రజాస్వామ్యం 41
8. గడచిన సంవత్సర కాలంలో మానవహక్కుల పరిస్థితి 45
9. పాకిస్తాన్-భారత్‌ల మైత్రి : పీపుల్స్ ఫోరం కృషి 50
10. 'తుమ్మల' ఫార్ములా ఆదివాసులను సంతృప్తి పరచేనా? 54
11. చట్టాన్ని కదిలించే హక్కు కార్మికులకే ఎందుకివ్వకూడదు? 57
12. రద్దు చేయాల్సింది ప్రభుత్వాలను కాదు, హింసను! 61
13. చంద్రబాబు 'విజన్'లో ఆదివాసులు 64
14. చంద్రబాబు 'విజన్'లో గ్రామీణ పేదలు 67
15. 'రంగురాళ్ల' తవ్వకాలు-ఒరిస్సా ఆదర్శం 71
16. అతి రాజకీయ సారం! 74
17. ఒక అబ్రహాం కథ 77
18. ఆదివాసీ హక్కులకు గండ్లు 81
19. పదవి కోసం రాజ్యాంగ సంస్కృతిని ధ్వంసం చేయొద్దు 84
20. వీరయ్య మరణం 87
21. కార్గిల్‌కు ఒక కార్గిల్ కోణం ఉంది 91
22. ఒకరి దేశభక్తి ఒకరికి ప్రాణసంకటం 94
23. యుద్ధం-శాంతి-ప్రజాస్వామ్యం 97
24. నిషేధాల నుండి తెలంగాణకు విముక్తి ఎప్పుడు? 101
25. ఒక మంచి మనిషికి జోహార్లు 104

26. కోడెల బాంబులు చెప్పిన సత్యం 108
27. ఎన్నికల అక్రమాలకు పోలీసు హింస పరిష్కారం కాదు 111
28. నియోగి సంస్మరణ 115
29. రాజీవ్ గాంధీ హత్యకేసు ముద్దాయిల ప్రాణాలు కాపాడటానికి ఆఖరు ప్రయత్నం 118
30. పోప్‌ను ఏమడుగుతారు? ఏం చెప్తాడు? 122
31. ఉద్యోగాలకు ముప్పు 125
32. మెదడువాపుకు పందులు కారణమా? 128
33. సమాచార స్వేచ్ఛ 131
34. రిజర్వేషన్లు: సుప్రీంకోర్టు రాజకీయాలు 134
35. విద్యార్థుల నిరసనకు ఆహ్వానం 137
36. మళ్ళీ రైతుల ఆత్మహత్యలు 140
37. టిబెటన్లు ఏమయితే ఎవరికేం పట్టింది? 143
38. అది నేరమే కాని దానికి శిక్ష లేదు 146
39. సిపిసి సవరణలు అన్యాయమైనవే కానీ వకీళ్ల నిర్వాకం సంగతేమిటి? 149
40. ఈ ప్రాకులాట అవమానకరం 153
41. కుంటిసాకుల నీడన చట్టం 156
42. చర్చలు ఎవరికి అవసరం? 159
43. ఈ కరువు మళ్లీ వస్తుంది జాగ్రత్త 163
44. 114వ మేడే వచ్చింది, పోయింది 166
45. ప్రాజెక్టుల ఎండమావులు 169
46. ధరలెందుకు పెరగవు? 172
47. న్యాయవాదులకు వేరే న్యాయమా? 175
48. ముద్దాయిని మెజిస్ట్రేటు చూస్తే చాలా? 178
49. నిజమైన ఐఎస్ఐ ఏజెంట్లు 181
50. కాశ్మీరీ విషాదం 184
51. లైసెన్స్ హంతకుల ప్రమాదం 187
52. సమాధానాలు లేని ఉక్రోషం 190
53. రాజ్‌కుమార్ కిడ్నాప్: సుప్రీంకోర్టు నష్టం చేయకుంటే ఉద్ధరించినట్టే 193
54. బస్తీలను తొలగించాలా అభివృద్ధి చేయాలా? 196
55. మనుషులు లేని 'పర్యావరణం' 199

56. అక్కరకు రాని పంట బీమా పథకం 202
57. ఎవరు చూడొచ్చారులే! 205
58. పాత ప్రశ్నలే మరొకసారి 208
59. ఇది మనందరి సమస్య కూడ 212
60. హిందుత్వవాదుల లక్ష్యమేమిటి? 216
61. హురియత్ కాన్ఫరెన్స్‌తో ఈ చెలగాటం ఎందుకు? 220
62. ఇది మన నోరు మూయించే సాకు మాత్రమే 223
63. ఫుట్‌బాల్ అయిపోయిన రాజ్యాంగం 227
64. కరెంటు చార్జీల సీజన్ మళ్ళీ వచ్చింది 230
65. ముల్లా మహమ్మద్ ఉమర్‌కు సలాములు 233
66. న్యాయానికివి రోజులు కావు 236
67. 'సంఘటిత నేరస్తుల' గురించి రాయడమూ నేరమే 239
68. గమ్యం లేని రాయబారం 242
69. అలుపెరుగని చొరబాటు 245
70. చేసేది చేస్తూ ఉపదేశాలెందుకు? 248
71. తులసీదాసును చంపడానికి సిఐ ఎందుకు భయపడాలి? 251
72. కాశ్మీర్ గురించి మనమైనా సత్యం మాట్లాడుదాం.... 255
73. తెలంగాణ ఉద్యమానికి నిర్దిష్టమైన కార్యక్రమాలు అవసరం 259
74. భ్రమలే అయితే వాటి వెంట పరుగులు తీయడం దేనికి? 263
75. ఇప్పుడు జరగవలసింది ప్రతీకారం కాదు 267
76. ఈ ఆధునిక అగ్రహారాలను చూడండి 271
77. బలవంతపు మౌనం 274
78. హింసకూ ప్రతిహింసకూ తల ఒగ్గవద్దు 279
79. రాజకీయ స్వేచ్ఛ పత్రికలకు వుంటే చాలునా? 282
80. యుద్ధమంటే మనకెంత ఇష్టం 285
81. ఇంకొక్కసారి అదే గోడు 289
82. మనకేం కావాలి? 292
83. కొందరికి పారదర్శకం కొందరికి ప్రాణాంతకం 295
84. చావు ఖర్చులు వద్దంటున్న మద్దువలస నిర్వాసితులు 298
85. మృత సంస్కృతి 302
86. కొల్లేటివాసుల కొంప కొల్లేరయింది 306
87. ప్రజాస్వామ్యానికి ప్రథమ శత్రువులు 310

88. వేయి నాల్కల హిందూత్వం 313
89. ఏది పాకిస్తాన్ కుట్ర? 317
90. 'విశ్వ' హిందువులకు ఒక హెచ్చరిక 320
91. వామపక్షాలకు అభినందనలు 323
92. ఇది చేతకాని ప్రభుత్వమా? లేకపోతే నీతిలేని ప్రభుత్వమా? 327
93. ఎన్నికలలో పోటీ చేయడానికి నేరస్తులందరూ అనర్హులేనా? 331
94. తోలాపిలో కులనిర్మూలన 334
95. గుజరాత్‌ను కాశ్మీర్‌తో పోల్చడం సబబేనా? 337
96. మన్నెవార్‌లకు మద్దతు ఇద్దాం 340
97. బందిపోటు దొంగలు–హక్కులు 344
98. ఇంకా ఎంత మానవరక్తం ప్రవహించాలి 349
99. అటవీవాసులకు పెద్దముప్పు 352
100. ఉట్టికెక్కి ఆపైన స్వర్గానికెక్కుదాం 356
101. విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం 359
102. ప్రజలు మాత్రమే త్యాగాలెందుకు చేయాలి? 362
103. సకాలంలో నోరు విప్పుదాం 366
104. డిసెంబర్ 13 : దానికి ప్రతీకారం 369
105. ప్రజాస్వామ్యానికి నిజమైన సవాలు 372
106. స్పష్టమవుతున్న అమెరికా ఎజెండా 375
107. బుష్ గడ్డ మీదనే నిరసనలు 378
108. ఊహాత్మక ఆందోళన కాదు 381
119. గర్వించడానికి ఏమీ మిగలదు 384
110. ఆధిపత్య సంక్షేమ సంఘం! 388
111. ఇది కూడ గో హత్యే 391
112. అశోక్ గెహలాట్‌కు అభినందనలు 394
113. కరువు, కరువు పనులు, కరువు దాడులు 398
114. వేయి నాల్కల వాజ్‌పాయి 402
115. సీమాంతర ఉగ్రవాదం 405

# ఈ హత్యలు ఆపండి

గుర్తు తెలియని వ్యక్తులొచ్చి మనుషులను తీసుకుపోయి చంపడం చాలా భీతిగొలిపించే ఘటన. అసలు హత్యే భీతిగొలిపిస్తుంది. అయితే ఫలానా వారిని ఫలానవారు ఫలాన కారణంగా చంపారంటే ఆ కారణం న్యాయమైన దనుకున్నా కాదనుకున్నా ఆ వార్తలో ఒక నిర్దిష్టత ఉంది, అందులో కొంత భద్రత ఉంది. చనిపోయిన వాడు ఆ పరిస్థితి తెచ్చుకోకుండ ఉంటే చచ్చేవాడు కాడుగదా అనే ఆలోచన మనకు భద్రత ఇస్తుంది.

'ఆ పరిస్థితి' అనేది తెచ్చుకోకుండ ఉండడం అన్ని సందర్భాలలోను సాధ్యం కాకపోవచ్చు. తెలంగాణలో నక్సలెట్లతో సంబంధం పెట్టుకున్నవారి నెవరినయినా పోలీసులు పట్టుకు పోగలరు, జైలులో పెట్టగలరు, చంపగలరు కూడ. ఇది అన్యాయం, చట్టవిరుద్ధం అని పౌరహక్కుల ఉద్యమకారులూ ప్రజాతంత్ర వాదులూ ఎంతగా ఆందోళన చేసినా పోలీసు యంత్రాంగం ఈ అక్రమాలు మానుకోవడం లేదు.

కాబట్టి 'ఆ పరిస్థితి' తెచ్చుకోకుండ బతకడం ఉత్తమం అని తెలంగాణలో ఇప్పుడు చాలామంది అనుకుంటున్నారు. నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకోకుండ బతికితే పోలీసుల చేతిలో పడకుండ ఉండవచ్చునని భావిస్తున్నారు. పోలీసు యంత్రాంగానికి కావలసింది కూడా ఇదే. 'చంపుతాం, జైలులో పెడతాం, హింసిస్తాం' అన్న బెదిరింపులతో ప్రజలను నక్సలైట్లకు దూరం చేయడమే వారికి కావాలి.

కానీ ఈ పరిష్కారం ఆచరణ సాధ్యం కాదని కూడ అందరికీ తెలుసు. నక్సలైట్లు ఒక రాజకీయ ఉద్యమం నడుపుతున్నారు. అది పేదప్రజల, పీడిత వర్గాల ప్రయోజనాలతో సన్నిహితంగా ముడిపడి ఉన్న రాజకీయ ఉద్యమం. ఆ ప్రయోజనాలన్నిటికీ ఎం.ఎల్ పార్టీల వ్యూహంలోనే సమాధానం ఉందని అందరూ ఒప్పుకోకపోవచ్చు. ఆ వ్యూహం కొన్ని ప్రయోజనాలను సాధిస్తూ అదే సమయంలో మరికొన్ని కొత్త సమస్యలు తెచ్చి పెడుతున్నదని కూడ భావించవచ్చు.

అయినప్పటికీ సిపిఐ (ఎం.ఎల్) పార్టీల రాజకీయ పంథా పీడిత ప్రజలతోనూ వారి అవసరాలతోనూ ముడిపడి ఉన్న పంథా అనేది ఎవ్వరూ కాదనలేని విషయం. అటువంటప్పుడు పేదప్రజలకు నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకోకుండా బతకడం 'ఆ పరిస్థితి తెచ్చుకోకుండ ఉండడం' ఎట్లా సాధ్యం అవుతుంది?

పేదలకే కాదు. నక్సలైట్లు అనేక సామాజిక రాజకీయ విషయాలలో జోక్యం చేసుకుంటుంటారు. పంచాయతులు చేస్తుంటారు. అన్యాయం చేస్తే తప్పుగానీ వాళ్లు పంచాయతులు చేయడమే తప్పుకాదు, వాళ్ళ దగ్గరకు సమస్యలు తీసుకుపోవడమే తప్పు కాదు. వేరే ఎక్కడా న్యాయం జరగనప్పుడు, వాళ్లు న్యాయం చేస్తారన్న నమ్మకం ఉంటే వాళ్ల దగ్గరికెందుకు పోకూడదు? పోలీసుల దృష్టికీ, పోలీసుల దృష్టితో తయారు చేసిన పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్‌వంటి చట్టాల దృష్టికీ అది తప్పనిపిస్తుందిగానీ వేరే ఏ దృష్టికీ అనిపించదు.

అందువల్ల 'ఆ పరిస్థితి తెచ్చుకోకుండ ఉండడం' తెలంగాణలో దాదాపు ఏ వర్గానికీ సాధ్యం కాదు, సాధ్యం చేసుకోవలసిన అవసరమూ లేదు.

అయితే ఇదంతా ఒకెత్తు. నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకున్న వారిని పోలీసులు పట్టుకుపోతారు, పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద కేసులు పెడతారు, చంపుతారు అనే బెదిరింపులో ఒక వికృతమైన తర్కమైనా ఉంది. ఆ బెదిరింపును తప్పించుకోవడం తెలంగాణలో బతికే వారికి ఎంత కష్టమైనా దానికి ఫలానా మార్గం ఉంది అన్న భరోసా ఉంది.

కానీ ఇప్పుడు గుర్తు తెలియని వ్యక్తులొచ్చి చంపిపోవడం మొదలయింది. గత సంవత్సరం నుండి ఇది మొదలయింది. మొదట క్రాంతిసేన అన్నారు. గ్రీన్‌టైగర్స్ అన్నారు, బ్లాక్ టైగర్స్ అన్నారు. కానీ ఏ పేరు లేకుండా కూడ జరుగుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కామారెడ్డి డివిజన్‌లో తెల్లబట్టలలో ఉన్న వ్యక్తులెవరో వచ్చి పొలం దున్నుకుంటున్న ఒక రైతును, రోడ్లో పోతున్న మరొకరిని ఎత్తుకు పోవడం, ఆ తరువాత కొంత సేపటికి ఆ వ్యక్తి 'ఎన్‌కౌంటర్' అయిపోవడం జరిగింది. వారిని అపహరించిన వ్యక్తులు తెల్లబట్టల పోలీసులు కారు. పోలీసులకు సన్నిహితంగా మెలుగుతున్న 'మాజీలు'. వాళ్లను అక్కడున్న ప్రజలు గుర్తించారు. వాళ్లు పోలీసు సిబ్బంది కారనీ, వాళ్లకు ఎవరినీ నిర్బంధించే అధికారం లేదనీ, చంపే అధికారం అసలే లేదని ప్రజలకు తెలుసు. అయినా వాళ్లు బహిరంగంగానే ఆయుధాలు పట్టుకొని తిరుగుతుంటే, మనుషులను అపహరించి తీసుకుపోతుంటే, కాల్చి చంపుతుంటే నిస్సహాయంగా చూస్తూ ఉండడం తప్ప ప్రజలు ఏమీ చేయలేకపోయారు.

పంజాబులో ఏడెనిమిది సంవత్సరాలు నడిచిన ఖలిస్తాన్ ఉద్యమం కూడా ఇటువంటి పరిస్థితిని చివరి దశలో చూపింది. అదెంత భయానక వాతావరణాన్ని సృష్టించిందో పంజాబు ప్రజలిప్పటికీ మరచిపోలేదు. కాశ్మీరులోనూ అస్సాంలోనూ నాగాలాండ్‌లోనూ ఇటువంటి 'గుర్తుతెలియని హంతకుల' హత్యలు నిత్యం జరుగుతున్నాయి. వాళ్లనొక్కొక్కసారి స్థానిక ప్రజలు గుర్తుపట్టవచ్చు కూడ. నిజానికి వాళ్లు 'గుర్తు తెలియని వ్యక్తులు' అనేదానికంటే కూడా ఒకరిమీద చేయి వేయడానికి ఏ అధికారమూ, అర్హత లేని వారనేది ముఖ్యమైన విషయం. అటువంటి వాళ్లు యధేచ్ఛగా హత్యలు చేస్తుండడం ఖాకీ సిబ్బంది అత్యాచారాల కంటె అనేక రెట్లు ఎక్కువగా భయం గొలిపిస్తుందనేది పంజాబు, కాశ్మీర్, అస్సాంల వర్తమాన చరిత్రతో పరిచయం ఉన్న వారందరూ ఎరిగిన విషయం.

అయితే దీని తరువాత మరొక దశ ఉంది. అదే పంజాబులో ఆఖరిదశ అయింది. ఆ దశ తరువాత 'ఖలిస్తాన్ ఉద్యమం' నిలవలేదు. కాశ్మీర్, అస్సాంలలో మిలిటెన్సీ ఇప్పుడు ఈ దశకు చేరుకుంది. దానికి తట్టుకుంటుందో లేదో చూడాలి.

ఇటు పోలీసులు, అటు పోరాటకారులు ఒకరి కుటుంబ సభ్యులనొకరు హతమార్చుకోవడం ఈ దశ లక్షణం. పంజాబులో ఇది పెద్దెత్తున జరిగింది. ప్రజలలో విపరీతమైన భయం, జుగుప్సలను కలిగించింది.

తెలంగాణలోనూ ఇది మొదలయిందా? కరీంనగర్ జిల్లాలో జరిగిన కాచాపూర్-ఇందుర్తి హత్యలు, మంథని 'ఆంధ్రప్రభ' విలేకరి రమేశ్‌పైన పీపుల్స్‌వార్ హత్యా ప్రయత్నం ఈ ప్రశ్నలకు తావు కల్పిస్తున్నాయి. క్రూరులయిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులను హెచ్చరిస్తూ కొన్ని సంవత్సరాల క్రితం పీపుల్స్‌వార్ బాధ్యులొకరు హెచ్చరిక జారీ చేసినప్పుడు ఆ బెదిరింపు విమర్శకు గురయింది. అటువంటి ఉద్దేశ్యం తమకు లేదని ఆ పార్టీ నాయకులప్పుడు స్పష్టం చేసారు. కానీ కత్తుల సమ్మయ్య సోదరి గట్టమ్మ హత్యనూ, జడల నాగరాజు బంధువయిన విలేఖరి రమేశ్ పైన హత్యా ప్రయత్నాన్నీ ఏ విధంగా అర్థం చేసుకోవాలి? సమ్మయ్య, నాగరాజు పీపుల్స్‌వార్ దళ సభ్యులుగా ఉంటూ తాము చేయదలచుకున్నది చేసారు. వాళ్లమీద వాళ్ల కుటుంబ సభ్యుల ప్రభావం ఉండే అవకాశం తక్కువే. సమ్మయ్య, నాగరాజుల బంధువులయిన పాపానికి విలేఖరి రమేశ్‌పైన, గట్టమ్మపైన దాడి చేయడం కంటే, తమపార్టీ సభ్యులయినవారు ఆ స్థాయికి ఎట్లా దిగజారగలిగారని పీపుల్స్‌వార్ ఆలోచించుకోవడం ఉచితంగా ఉంటుంది.

గట్టమ్మ హత్యకు ప్రతీకారంగా 'గుర్తు తెలియని వ్యక్తులు' గౌరీశంకర్ అని పిలవబడే దుస్స ప్రభాకర్ తండ్రినీ అన్ననూ చంపారు. అతను పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ సభ్యుడు. అతని వ్యవహార శైలిపైన చాలా ఫిర్యాదులున్నాయి. అతని తొందరపాటు ప్రవర్తన వల్ల నష్టపోయిన వారు చాలామంది హుస్నాబాద్, హుజూరాబాద్ ప్రాంతాలలో ఉన్నారు. అయితే ఆ బాధితులు కూడ ఈ హత్యాకాండను హర్షించరు, సమర్థించరు.

ఈ రకమైన హత్యలు పీపుల్స్‌వార్ సాధించదలచుకున్న సమాజ పరివర్తనకు పనికిరావు, పోలీసు యంత్రాంగం కాపాడవలసిన చట్టబద్ధ పాలనకూ తగవు. ఈ వాస్తవాన్ని ఇరువురూ ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిది. ఇటువంటి చర్యలు వీరికైనా, వారికైనా ప్రజాదరణనూ ప్రజలలో గౌరవాన్నీ పోగొడతాయి. ప్రజాదరణ కోల్పోయి సమాజ పరివర్తన సాధించడం ఎంత అసాధ్యమో, ప్రజలలో గౌరవం కోల్పోయిన పోలీసు యంత్రాంగం శాంతి భద్రతల్ని సమర్థంగా నిర్వహించడమూ అంతే అసాధ్యం. ఇప్పటికే తెలంగాణలో పోలీసులంటే సర్వత్రా అసహ్యం ఉంది. నక్సలైట్లను ఆదరించేవాళ్లో వ్యతిరేకించే వాళ్లో కూడా ఉన్నారుగానీ పోలీసులకు ఏ సామాజిక వర్గంలోనూ ప్రజాదరణ శూన్యం.

వీరికైనా వారికైనా ప్రజాదరణ, లేక ప్రజామోదం ఎంత ఉందనేది మన సమస్య కాదు. ఇప్పటికే చాలా ఆటవికంగా తయారయిన తెలంగాణ పరిస్థితి ఇంకింత దిగజారొద్దనేది మన కోరిక. దానిని ఇరు పక్షాలూ మన్నిస్తాయని ఆశించి ఊరుకుంటే ప్రయోజనం ఉండదు. గొంతెత్తి మాట్లాడాలి ఇద్దరితోనూ మాట్లాడాలి. నక్సలైట్లు పాటించవలసిన విప్లవ విలువలనూ పోలీసు యంత్రాంగం పాటించవలసిన చట్టబద్ధ పాలనా విలువలనూ ప్రాతిపదిక చేసుకొని మాట్లాడాలి. పౌరస్పందన వేదిక వారు ఈ మధ్య తీసుకొచ్చిన ప్రచురణ శీర్షిక సూచించినట్టు 'మూడో గొంతు' వినిపించాలి. దానికి తెలంగాణలోని ఆలోచనాపరులంతా సిద్ధం కావాలి.

అక్టోబర్ 18, 1998

# పాపం కాశ్మీరీలు

**కా**శ్మీర్ ప్రజలంత దురదృష్టవంతులు ఈ దేశంలో ఎవరూ ఉండరు. వాళ్ల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఇండియా–పాకిస్తాన్‌లు 50 ఏళ్ల కింద వాళ్ల భూభాగాన్ని రెండుగా పంచుకున్నాయి.

ఇప్పుడు వాళ్ల 'విముక్తి' పోరాటం కూడ వాళ్ల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఇస్లామిక్ సనాతనవాదుల చేతిలోకి పోతున్నది.

కాశ్మీరీలలో ఇస్లామిక్ సనాతనవాదులు లేనేలేరని కాదు. ఉన్నారు. కానీ ఈ రోజు కాశ్మీరీ మిలిటెన్సీని తమ చేతులలోనికి తీసుకున్న హర్కత్–ఉల్–అన్సార్ వంటి 'పాన్ ఇస్లామిక్' సంస్థల ప్రాపంచిక దృక్పథం కాశ్మీర్‌లో పెద్దగా ప్రభావం ఉన్న దృక్పథం కాదు. ప్రపంచ ముస్లింలందరూ ఒక్కటనీ, ఎక్కడున్నా వారు మొదట ముస్లింలే తప్ప వేరే ఏదీ కాదనీ, వారి రాజకీయ దృక్పథంలో ఇస్లాం కేంద్ర విషయమనీ పాన్ ఇస్లామిక్ వాదులు నమ్ముతారు. కానీ ఇస్లాం పట్ల గాఢమైన అభిమానం ఉన్న కాశ్మీరీలు సహితం తమ కాశ్మీరీ జాతీయతను మరచిపోవడానికి ఇష్టపడరు. కాశ్మీరు భూభాగమన్నా కాశ్మీరీ సంస్కృతి అన్నా వారికి గాఢమైన అభిమానం.

ఈ అభిమానం వల్లనే కాశ్మీరీలు 1947లో అత్యధిక ప్రజామోదంతో పాకిస్తాన్‌లో చేరడం కంటె ఇండియాలో భాగం కావడం మేలనుకున్నారు. పాకిస్తాన్‌లో నెలకొల్పబోతున్న ఇస్లామిక్ రాజ్యం తమ సాంస్కృతిక వైవిధ్యాన్నీ ప్రత్యేకతలనూ గౌరవించదనీ, నూతన భారత పాలకులు నెలకొల్పబోయే లౌకిక ప్రజాతంత్ర రాజ్యంలో అది సాధ్యం అవుతుందనీ వారు భావించారు. ఈ రెండు దేశాలలో ఇదో అదో తేల్చుకోవలసిన అవసరమేమీ లేదనీ, కాశ్మీరు స్వతంత్రంగా ఉండవచ్చుననీ ఆశించిన వారు లేకపోలేదు గానీ అది ఆచరణ సాధ్యం కాదని ఎక్కువమంది భావించారు.

అయినా ఆ ఆలోచన కాశ్మీరులో చావలేదు. ఒక బలమైన కోరికగా ఉండిపోయింది. ఇండియా కల్పించిన లౌకిక ప్రజాతంత్ర రాజ్యంలోని మంచి చెడుల

సంగతి ఎలా ఉన్నా, భారత పాలకుల సార్వభౌమత్వ ప్రయోజనాల ముందు అది తల వంచవలసిందేనని కాశ్మీరీలు త్వరలోనే గుర్తించారు.

మళ్లీ 'ఆజాదీ' కాశ్మీరులో బలమైన నినాదం అయింది. 1990-91 ప్రాంతంలో అది స్వతంత్ర, లౌకిక, ప్రజాతంత్ర కాశ్మీర్ కావాలన్న కాంక్షగానే ముందుకొచ్చింది. కానీ 1992 తర్వాత, వివిధ కారణాల వల్ల, పాకిస్తాన్‌లో కాశ్మీర్‌ను విలీనం చేయాలనే మత రాజకీయ కాంక్షదే కాశ్మీర్ మిలిటెన్సీలో పైచేయి అయింది. ఆ కారణాలలో ముఖ్యమైనది, మత రాజకీయ మిలిటెన్సీకే పాకిస్తాన్ ఆర్థిక, సైనిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉండడం. ఆ సహాయం లేకుండ కాశ్మీరీలు భారత సైన్యంపైన యుద్ధం చేయలేరు. అందువల్ల కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయాలన్న కోరిక కాశ్మీరీలలో మెజారిటీ కోరిక కాకపోయినప్పటికీ, కాశ్మీరీ మిలిటెన్సీలో ఆ ఆలోచనా సరళిదే పై చేయి అయింది.

దాదాపు 1992 నుండి  కాశ్మీర్‌లో నెలకొన్న ఈ పరిస్థితి పోనుపోను మరింత వికృత రూపం తీసుకోవడం మొదలయింది. కాశ్మీరీ మిలిటెన్సీ మరింతగా పాకిస్తాన్ చేతులలోనికి, ఆపైన  హర్కత్-ఉల్-అన్సార్, ఇఖ్వాన్ ఉల్  ముస్లిమీన్‌ల వంటి 'పాన్ ఇస్లామిక్' సంస్థల చేతులలోనికి పోయింది.

దాని పర్యవసానం హిందువుల విచ్చలవిడి ఊచకోత. కాశ్మీరీ మిలిటెన్సీ  కాశ్మీరీల చేతిలోనే ఉన్నన్నాళ్లు, కేవలం హిందూ మతస్తులయినందుకు ఎవ్వరినీ కాశ్మీర్‌లో చంపటం జరగలేదు. ఆర్ఎస్ఎస్ బాధ్యులనూ, కాశ్మీరీ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన హిందువులనూ చంపారు. ఈ హత్యలు అన్నీ సమర్థనీయమని కాదుగానీ, కేవలం మతపరంగా హిందువులయినందుకు కాశ్మీర్‌లో ఆనాడు ఎవ్వరినీ చంపలేదు. ఆ విషయానికి కాశ్మీరీలు గర్వించేవారు కూడా.

కానీ కాశ్మీరీ మిలిటెన్సీ బయటి దేశాల ఇస్లామిక్ మిలిటెంట్ల చేతిలోకి పోయిన కొద్దీ ఇటువంటి హత్యాకాండ పెరిగింది.  కాశ్మీరీలు గర్వంగా చెప్పుకునే కాశ్మీరీ సంస్కృతికి నిలయమైన కాశ్మీర్ లోయలో కాక కాశ్మీర్‌లో యకూ జమ్ముకూ మధ్య నున్న పీర్‌పంజల్ పర్వత శ్రేణుల ప్రాంతంలో ఈ హత్యాకాండ ఎక్కువగా జరుగుతున్నది.

ఉధంపూర్ జిల్లాలోని ప్రాణ్‌కోట్‌లో ఈ సంవత్సరం ఏప్రిల్ 17-18 రాత్రి 26 మందిని, పూంచ్ జిల్లా సురాన్‌కోట్‌లో మే 5న ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని, దోడా జిల్లాలోని దేశా గ్రామంలో అదేరోజున మృతదేహాన్ని శ్మశానానికి తీసుకుపోతున్న వారిపైన కాల్పులు జరిపి ఏడుగురిని, దోడా జిల్లాలోని ఛాప్నారిలో జూన్ 20న

రెండు పెళ్లిబృందాల పైన కాల్పులు జరిపి 25 మందిని, దోడా జిల్లా కిష్త్వార్ తాలూకాలోని రెండు గ్రామాలలో జూలై 27–28 రాత్రి 16 మందిని, పూంచ్ జిల్లా సురాన్‌కోట్ తాలూకాలోని నాలుగు గ్రామాలలో ఆగస్ట్ 4 రాత్రి 19 మందిని సాయుధ మిలిటెంట్లు కాల్చిచంపారు. చనిపోయిన వారందరూ హిందువులే. కేవలం చేతికి చిక్కిన వాళ్లను చంపి బీభత్సం సృష్టించాలన్న అమానుష తర్కానికి వారు బలి అయ్యారు తప్ప వారి హత్యలకు వేరే కారణమేమీ లేదు. నిజానికి హతులలో చిన్నపిల్లలు కూడా చాలా మంది ఉన్నారు.

జమ్ము ప్రాంతంలో జరిగిన ఈ హత్యలేకాక కాశ్మీర్‌లోనూ ఒక ఘటన జరిగింది. జనవరి 25న శ్రీనగర్ నుండి లదాఖ్ పోయే రహదారిపైన ఉన్న గందర్బల్ తాలూకాలోని వంధమా గ్రామంలో 23 మంది హిందూ పండిట్‌లను మిలిటెంట్లు కాల్చి చంపారు.

ఈ హత్యలు చేసిన మిలిటెంట్లు స్థానికులు కారని అన్ని పత్రికలూ రాసాయి. వాళ్లంతా పాకిస్తాన్‌లోని శిక్షణ శిబిరాలలో శిక్షణ పొంది కాశ్మీర్‌లో పోరాటం చేయడానికి వచ్చిన పాకిస్తానీలు, ఆఫ్ఘాన్‌లు, ఇతర పశ్చిమాసియా దేశస్థులు. కాశ్మీరీ మిలిటెన్సీ పూర్తిగా కాశ్మీరీ సంస్థ అయిన జమ్ము–కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ చేతి నుండి కొంత వరకు పాకిస్తాన్ ప్రభావంలో ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ చేతిలోనికి, ఆ తరువాత అధిక భాగం విదేశీ ముస్లిం మతవాదులయిన వృత్తి మిలిటెంట్ల సంస్థలయిన హర్కత్–ఉల్–అన్సార్, లష్కర్–ఇ–తొయిబా వంటి సంస్థల చేతిలోకి పోయిన వైనానికి పర్యవసానమే ఈ హత్యాకాండ. ఇప్పుడు ముస్లిం సనాతనవాద వృత్తి మిలిటెంట్ల అగ్రపోషకులలో ఒకడయిన ఒసామా బిన్‌లాడెన్ కాశ్మీర్ మీద దృష్టి సారించాడని తెలుస్తున్నది. కాశ్మీర్‌ను ఎట్లాగయినా 'విముక్తి' చేయడానికతను సంసిద్ధంగా ఉన్నాడట. భారతదేశం కూడ ఎట్లాగయినా కాశ్మీర్‌ను 'కాపాడడానికి' సిద్ధంగా ఉంది. కాశ్మీర్ వివాదంలోని భిన్నపక్షాలు ఉపయోగిస్తున్న ఈ భాష విన్నప్పుడు ఎవరు ఎవరి నుండి ఎవరిని 'కాపాడుతున్నారో' 'విముక్తి చేస్తున్నారో' అర్థం కాదు. తమ జీవితం, తమ భవితవ్యం, తమదికాని రాజకీయ అజెండాలలో ఇరుక్కుపోవడం కాశ్మీరీలు గడచిన యాభై ఏళ్లుగా అనుభవిస్తున్న దురదృష్టం. మొదట అది భారత్–పాకిస్తాన్‌ల పోటీ జాతీయవాద అజెండాలో ఇరుక్కుంది. తరువాత అమెరికా–సోవియట్ రష్యాల ప్రచ్ఛన్న యుద్ధ అజెండాలో ఇరుక్కుంది. ఆ పైన పాన్–ఇస్లామిక్ వాదుల సనాతనవాద అజెండాలో ఇరుక్కుంది. ఈ జగన్నాటకంలో లేటెస్టుగా తెరమీదికి వచ్చిన వాడు ఒసామాబిన్ లాడెన్. ఈ మధ్య బిల్‌క్లింటన్ ప్రభుత్వం ఇతని మీద బాంబు దాడి చేసినప్పుడితను పత్రికలకెక్కాడు. కానీ నిజానికి

ఇతనినీ ఇతని వంటి మరి కొందరు ముస్లిం సనాతనవాద మిలిటెంట్లనూ రాజకీయవేత్తలనూ పోషించిందీ పెంచిందీ అమెరికాయే. అఫ్ఘానిస్తాన్ నుండి సోవియట్ రష్యాను తరిమేయడానికి పాన్ ఇస్లామిక్ మిలిటెన్సీ పనికొస్తుందని భావించిన అమెరికాయే ఈ అరబ్బు కోటీశ్వరుడిని అఫ్ఘానిస్తాన్‌లో ప్రవేశపెట్టింది. అమెరికా అవసరం తీరిపోయిందిగానీ అతనికి వేరే అవసరాలున్నాయి కాబట్టి వాటి సాధనకోసం అఫ్ఘానిస్తాన్‌లో తన 'పోరాటం' కొనసాగిస్తున్నాడు. అది ఇప్పుడు బిల్‌క్లింటన్‌కు ఇబ్బందికరంగా తోచవచ్చును గాక.

ఒక్క బిన్‌లాడెన్ మాత్రమే కాదు. హర్కత్–ఉల్–అన్సార్ వంటి పాన్ ఇస్లామిక్ మిలిటెంట్ సంస్థలు కూడా అఫ్ఘానిస్తాన్ నుండి సోవియట్ రష్యాను తరిమేయడానికి పనికొస్తాయని అమెరికా ఒకనాడు వాటిని ప్రోత్సహించింది. ఇప్పుడది ఏకుమేకయి కూర్చునేసరికి హర్కత్–ఉల్–అన్సార్ 'టెర్రరిస్టు' సంస్థ అని అమెరికా ప్రకటించింది. అయినా ఆ సంస్థ తన పేరును హర్కత్–ఉల్–ముజాహిదీన్‌గా మార్చుకొని తన కార్యకలాపాలు ఎప్పటిలాగే కొనసాగిస్తున్నది.

ఈ పరిణామాల పర్యవసానంగా జమ్ము–కాశ్మీర్‌లో నివసించే హిందూమతస్తుల పైన జరుగుతున్న ఘోరమైన హత్యాకాండను నిర్ద్వంద్వంగా ఖండించడం, వారిలో నెలకొన్న అభద్రత పట్ల సానుభూతి చూపించడం ఎంత అవసరమో దాదాపు ఏడు దశాబ్దాలుగా ఆ రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర విషయంగా ఉన్న కాశ్మీరీ జాతీయవాదాన్ని ఈ పరిణామాలు భ్రష్టుపట్టించి సనాతనవాద మిలిటెన్సీగా దానిని తిరగరాస్తున్న తీరును గుర్తించడం, దానికి ప్రపంచం ముందు బాధ్యత వహించవలసి వస్తున్న కాశ్మీరీ ముస్లింల సందిగ్ధస్థితి పట్ల సానుభూతి చూపించడం కూడ అంతే అవసరం. తమ 'విముక్తి' పేరుమీద జరుగుతున్న ఈ సనాతనవాద మతవాద హింసను వాళ్లు పూర్తిగా దూరం ఉంచనూ లేరు, అదే సమయంలో అందులో ఉన్న అనాగరిక విద్వేష రాజకీయాలను ఆమోదించనూ లేరు.

హిందువుల పట్ల ద్వేషం కాశ్మీరీ జాతీయవాదంలో ఏనాడూ ఒక ముఖ్యలక్షణం కాదు. ఉద్యమాలు–ముఖ్యంగా మిలిటెంట్ పోరాటాలు–తమలోని ద్వేషాన్ని మామూలుగా గొప్పగా భావిస్తాయి. తాము ఒకరిని ద్వేషిస్తున్నట్టు కనపడుతున్నందుకు సిగ్గుపడే గుణం కాశ్మీరీలలో మాత్రమే కనిపిస్తుంది. 'మేము ద్వేషిస్తున్నది ఇండియానే తప్ప ఇండియన్స్‌ను కాదు' అని అడగకుండానే కాశ్మీరీలో చాలామంది సంజాయిషీ చెప్తుంటారు.

అటువంటి వాళ్లిప్పుడు తమ 'విముక్తి' పేరుమీద హర్కత్–ఉల్–ముజాహిదీన్ వంటి

సంస్థలూ, ఒసామా బిన్‌లాడెన్ వంటి వాళ్లూ సాగిస్తున్న విద్వేష రాజకీయాలను కాదనలేక అవుననలేక సతమతం కావడం బాధాకరమైన విషయమే. పోనీ వాళ్లకీ అంతర్వేదన తప్ప వేరే నష్టమేమీ లేదా అంటే చాలా ఉంది. ఎనిమిదేళ్లుగా భారత సైనిక బలగాలు కాశ్మీర్‌లో పెద్దఎత్తున ఊచకోతకు పాల్పడుతున్నాయి. మిలిటెంట్ల చేతిలో హిందువులు చనిపోతే మనకి ఇక్కడ వార్త అవుతుంది గానీ ప్రతిరోజూ సైనిక బలగాల చేతిలో చనిపోతున్న కాశ్మీరీ ముస్లింల చావు ఇక్కడ వార్త కాదు. కాశ్మీరీ మిలిటెన్సీ మత సనాతనవాదుల చేతిలోకి పోయేకొద్దీ దానిని కారణంగా చూపించి కాశ్మీరీ ముస్లింలను మరింత పెద్దెత్తున చంపడం భారత సైనిక బలగాలకు సులభం.

నవంబర్ 1, 1998

# 'దొంగలకు' కూడ పౌరహక్కులుంటాయి

పౌరహక్కుల ఉద్యమం చేసే పనులలో ప్రజామోదం లేనివి చాలా ఉంటాయి. వాటిని సూత్రప్రాయంగా తాను నమ్మి ఆచరిస్తూ ప్రజామోదం పొందడానికి కృషిచేయడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలలో ఒకటి.

నక్సలైట్ల ఎన్‌కౌంటర్ల కంటే దొంగల పేరిట ఎన్‌కౌంటర్‌లో చంపబడేవారి విషయంలో పౌరహక్కుల ఉద్యమం చేసే ఆందోళనకు ప్రజామోదం సంపాదించడం మరీ కష్టం. నక్సలైట్లంటే సామాన్య ప్రజలలో చాలామందికి అంతో ఇంతో సానుభూతి ఉంటుంది. కొందరికి తెలిసి, కొందరికి తెలియక ఉంటుంది. వాళ్ళతో రాజకీయంగా విభేదించే వాళ్లకు కూడా వాళ్లంటే కొంత గౌరవం ఉంటుంది. నక్సలైట్ల ఎన్‌కౌంటర్లు అన్యాయమన్నా పౌరహక్కుల ప్రచారానికి ప్రజామోదం పొందడం ఆ కారణంగా కొంత సులభమే. కాకపోతే ఆ పార్టీలే తమ దుందుడుకు ప్రవర్తన వల్ల ఈ ప్రయత్నానికి నష్టం చేసాయి. తమ హింసాత్మక చర్యలను నిజంగా క్రూరులయిన ప్రజాశత్రువులకే పరిమితం చేసి ఉంటే ఎన్‌కౌంటర్ వ్యతిరేక పౌరహక్కుల ప్రచారం కొంత సులభతరం అయి ఉండేది. అయినప్పటికీ, 'వాళ్లు చంపేటప్పుడు లేని తప్పు వాళ్లను చంపినప్పుడే వచ్చిందా' అనే వాళ్లూ ఉంటారు. నాకెందుకొచ్చింది అని నిర్లిప్తంగా ఉండేవాళ్లూ ఉంటారు.

అది వేరే విషయం. దొంగలు, బందిపోట్లు విషయం వచ్చేసరికి వాళ్ల హక్కుల గురించి మాట్లాడే మాటలకు ప్రజామోదం పొందడం మరీ కష్టం. దొంగలను కాల్చి పారేయడం ఒక విధానంగా ప్రభుత్వం తీసుకోలేదు కాబట్టి సరిపోయింది గానీ తీసుకొని ఉంటే దానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం చాలా కష్టం అయి ఉండేది.

పూర్తిగా అట్టడుగున ఉన్న పేదలను మినహాయిస్తే సమాజంలో మిగిలిన వారందరికీ ఎంతో కొంత ఆస్తి ఉంటుంది. భూమి కాకపోతే ఇల్లు, ఇంటిసామాన్లు ఉంటాయి. కోళ్లు, గొర్రెలు, మేకలు ఉంటాయి. అందువల్ల దొంగలంటే కోపం

అసహ్యం చాలా ఉంటుంది. ముఖ్యంగా రాత్రి వేళ ఇళ్లు దోచుకునే దొంగల ముఠాలంటే వ్యతిరేకత ధనిక వర్గాలలోనేకాక ఇతరులలో కూడా బలంగా ఉంటుంది.

ఈ వ్యతిరేకతకు మరొక కారణం కూడా ఉంది. దొంగల ముఠాలలో ఎక్కువగా కొన్ని కులాలవారు ఉంటారు. యానాది, ఎరుకల, బోయ, లంబాడీ, వడ్డెర, తెలగపాముల మొదలైన కులాలకు చెందిన వ్యక్తులతో కూడిన దొంగల ముఠాలే ఎక్కువ కనిపిస్తాయి. దీనికి గల చారిత్రక కారణాలు విశ్లేషించడానికిది సందర్భం కాదుగానీ, మన కులవ్యవస్థలో ఇటువంటి కులాలకు మొత్తంగానే దొంగలు, బందిపోట్లు అన్న ముద్ర పడింది. బ్రిటిష్ వాళ్లు 'క్రిమినల్ జాతుల' జాబితాయే ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 'క్రిమినల్ జాతులు' అన్న మాట ప్రభుత్వ రికార్డుల నుండి తొలగిపోయింది గానీ ఆ భావన పోలీసుల మెదళ్లనుండి తొలగిపోలేదు, కుల సంస్కృతి విషం తలకెక్కిన సమాజం ఆలోచన నుండి కూడా తొలగిపోలేదు.

ఫలానా కులం వాళ్ళంతా బందిపోట్లు, లేకపోతే దొంగసారా బట్టీలు పెట్టేవాళ్లు, లేకపోతే కిరాయి హంతకులు అన్న అభిప్రాయం ఉన్నచోట ఆ కులాన్నే నీచంగా, హీనంగా చూడడం మన కుల సంస్కృతిలో సాధ్యమే. అప్పుడు వాళ్ళను పోలీసులు పట్టుకొని కాల్చేసినా, కొట్టి చంపేసినా తక్కిన సమాజం చాలా నిర్లిప్తంగా ఉండగలదు.

క్రమంగా మన పోలీసు వ్యవస్థ ఈ పాలసీవైపే పోతున్నదా అన్న అనుమానం వస్తున్నది. కోర్టులో కేసులు రుజువు చేసే ఓపికగానీ అంతవరకు ఆగే ఓపికగానీ మన పోలీసు యంత్రాంగానికి లేదు. మన కోర్టులను 'బూర్జువా కోర్టులు' అని ఎంతగా నిందించినా వాటిలో పేద దొంగలకు కూడ కొన్ని సౌకరాలున్నాయి. నేరం సంపూర్ణంగా రుజువయ్యేదాకా శిక్షపడదు. నేరం రుజువు చేసే బాధ్యత కేసుపెట్టిన పోలీసులదే తప్ప నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిపైన లేదు. దీనికి ప్రాసిక్యూషన్ చాలా నేర్పుగా, ఓపికగా సాగాలి. అంత ఓపిక లేని పోలీసులు పట్టుకోగానే కాల్చి పారేసి ఎన్‌కౌంటర్ కథ ప్రకటించడం సులభమని అనుకుంటారు. పై స్థాయిలో దీనికి ఆమోదం లేకపోతే ఎస్ఐ స్థాయి పోలీసులు ఈ పాలసీని అమలు చేయలేరు.

ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలలో ఇది చాలా కాలంగా జరుగుతున్నది. 'ఎన్‌కౌంటర్‌లో గజదొంగ మృతి' అనేది అక్కడి పత్రికలలో తరచుగా దర్శనమిచ్చే వార్త. ఒక దశలో ఉత్తరప్రదేశ్ పోలీసులు చేపలు పట్టుకునే మల్లా కులస్తులను పెద్దసంఖ్యలో ఎన్‌కౌంటర్ పేరిట చంపుతున్నారన్న అభియోగం వచ్చింది.

మన రాష్ట్రంలో కూడ ఈ వికృతమైన విధానానికి పునాది పడుతున్నట్టుంది. నక్సలైట్లను ఎన్‌కౌంటర్ల పేరిట చంపే చరిత్ర ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కనీసం మూడు నాలుగేళ్లుగా 'బందిపోట్లు'గా పిలవబడే వాళ్లను ఎన్‌కౌంటర్ల పేరిట చంపడం జరుగుతూనే ఉంది. మొదట్లో అంతరాష్ట్ర దొంగలు అంటూ మరాఠీ మాట్లాడే వారిని చంపేవారు. ఈ దొంగలు స్థానికులు కారు కాబట్టి వారి గురించి బాధపడేవారెవరూ లేరు. కానీ ఆ తరువాత స్థానికులను చంపడం కూడ మొదలయింది. ఈ అక్టోబరు నెలలోనే నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు 'దొంగలను' పోలీసులు కాల్చి చంపారు. ఎన్‌కౌంటర్లంటే విని ఎరుగని ప్రాంతాలకు కూడ పాకింది ఈ జబ్బు. ప్రకాశం జిల్లాలో గడచిన కొద్ది నెలల్లోనే ఆరుగురిని పోలీసులిట్లా చంపారు. జైలులో–అంటే జుడీషియల్ కస్టడీలో– ఉన్నవాళ్లను ఒక కోర్టు నుండి మరొక కోర్టుకు తీసుకుపోయే నెపంతో దారిలో కాల్చి చంపిన ఘటనలు ప్రకాశం జిల్లాలోనేకాక ఖమ్మంలోనూ జరిగాయి. అక్టోబరు నెల 6వ తేదీన చిత్తూరు జిల్లాలో పోలీసులు కుమ్మరిగుండ్ల గోపాల్‌ను, అతని తమ్ముడు సుబ్రమణ్యంను జైలు నుండి కోర్టుకు తీసుకుపోతూ దారిలో కాల్చి చంపారు. వాళ్లిద్దరూ 'నర హంతకులు'గా పేరుపడ్డారు. దాదాపు 40 మంది పేదలను – ఇంటి బయట రాత్రి నిద్రిస్తున్న వాళ్ళను–నరికి, తలలు పగలగొట్టి చంపి వంద రెండు వందల రూపాయలు, కొద్దిపాటి బంగారం దోచుకున్నారు. చాలామంది స్త్రీలను రేప్ చేసారు. వాళ్లను పోలీసులు పట్టుకోవడం జరిగింది. కోర్టుకు అప్పగించడమూ జరిగింది. నలభై చిల్లర కేసులూ పెట్టి విచారిస్తే ఒకదానిలో కాకపోతే ఒక దానిలో వాళ్లకు శిక్షపడేదే. వాళ్లు చేసినవి చాలా హేయమైన నేరాలు కాబట్టి ఏ కొంచెం అవకాశం దొరికినా వాళ్లకు కోర్టు ఉరిశిక్ష కూడ వేసేది. బహుశా క్షమాభిక్ష కూడ దొరికి ఉండేది కాదు.

అయినప్పటికీ వారిని పోలీసులు కాల్చి చంపి చట్టమంటే తమకున్న చులకన భావాన్ని ప్రకటించుకున్నారు. దొంగలు, బందిపోట్లు, చీకటి హంతకులు – వీళ్లంటే సమాజంలో సానుభూతిలేదని గ్రహించిన పోలీసు యంత్రాంగం చట్టానికి తూట్లు పొడిచి ఈ హత్యలు చేస్తున్నది. ఈ హత్యల ఫలితంగా ఆ నేరాలు తగ్గుతాయో లేదోగాని ఖాకీనేరాలు పెరుగుతాయి. తూట్లు పడిన చట్టం మన హక్కులను కాపాడలేదు. మనకు భద్రత కల్పించజాలదు. చట్టబద్ధ పాలనను, చట్టం పోలీసుల అధికారానికి పెట్టిన పరిమితులను అమలు చేయించుకోవడం చాలా అవసరం. దానికి ఏ మినహాయింపులూ ఇవ్వకూడదు. ఇస్తే నష్టపోయేది సామాజికంగా ఆర్థికంగా

బలహీనులయిన వాళ్లే. పోలీసు యంత్రాంగం చట్టానికి కట్టుబడి పనిచేస్తే చాలు. అది అదుపు చేయలేని నేరాలను సమాజమే అదుపు చేసుకోవాలి. బలప్రయోగం ద్వారా కాదు. నేరానికి గల సామాజిక ఆర్థిక వైయక్తిక కారణాలను అన్వేషించి నివారణ మార్గాలు వెతకడం ద్వారా. దానికి కొంత సమయం, కొంత కృషి అవసరం. కానీ అంత లోపల నేరాలు పెరిగిపోతున్నాయన్న ఆత్రుతలో చట్టాన్ని పక్కనపెట్టి హత్యలు చేసే అధికారం పోలీసులకిస్తే మన ప్రాణాలతో బాటు మన నాగరికత కూడ ధ్వంసం అవుతుంది.

నవంబర్ 15, 1998

# వర్గీకరణ మళ్లీ మొదటికి

**చం**ద్రబాబునాయుడు ప్రభుత్వం షెడ్యూల్డు కులాల వర్గీకరణ కోసం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌ను రాష్ట్ర గవర్నర్ రంగరాజన్ రాష్ట్రపతికి పంపించడంతో వర్గీకరణ కథ మళ్లీ మొదటికొచ్చింది. నాకెందుకు పంపారు? దీనితో నాకేం పని? అని రాష్ట్రపతి దానిని వెనక్కి పంపిస్తే తప్ప వర్గీకరణ ఇప్పట్లో జరగదు. మాదిగ కులస్తులు ఇన్నాళ్లు చేసిన ఉద్యమం ఇప్పట్లో ఫలితాన్ని అందుకోదు.

గవర్నర్ నిర్లక్ష్యం ఆశ్చర్యకరమైనది, అనవసరమైనది.

ని
గా
హ్

ఆయన ఎవరి సలహా మేరకు ఈ పని చేసారో ఆయనే చెప్పాలి. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో గవర్నర్ ఈ పని చేయవచ్చునని రాజ్యాంగంలోని ఆర్టికల్ 213(1) అంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్ ఏదైనా కేంద్ర చట్టానికి వ్యతిరేకమైనా, లేక రాష్ట్రానికీ కేంద్రానికీ కూడ చట్టం చేసే అధికారం ఉన్న విషయానికి సంబంధించినదయినా లేక హైకోర్టు అధికారాలను కుదించి వేసేదయినా గవర్నర్ ఈ పని చేయవచ్చు. ఈ ఆర్డినెన్స్‌కు ఆ లక్షణాలేవీ లేవు. వర్గీకరణ గురించి ఇప్పటికి చట్టమేదీ లేదు. అది రాజ్యాంగంలోని 'కన్‌కరెంట్ లిస్టు' (ఉమ్మడి జాబితా)లో లేదు. అది హైకోర్టు అధికారాలను ఏ మాత్రం కుదించదు.

నిజమే, గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయంపైన జారీ చేసిన ఆర్డినెన్స్ మన రాష్ట్ర హైకోర్టు కొట్టేస్తూ, షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ కోటాను వర్గీకరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని చెప్పింది. కానీ అది హైకోర్టు అభిప్రాయం మాత్రమే. రాజ్యాంగ శాసనం కాదు. పైగా హైకోర్టు చాలా కృత్రిమమైన తర్కంతో ప్రతిపాదించిన అభిప్రాయం. దానిని గవర్నర్ రాజ్యాంగ శాసనంతో సమానంగా భావించి ఆర్డినెన్స్ రాష్ట్రపతి పరిశీలనకు పంపించడం పూర్తిగా అనవసరమైన చర్య. దాని బదులు ఆయన దానిపైన సంతకం చేసి జారీ చేసి ఉంటే మాలమహానాడు ఎట్లాగూ కోర్టుకెక్కి ఉండేది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో వ్యక్తం చేసిన అభిప్రాయం ఎంతవరకు

సమంజసమనేది ఏదో ఒక రోజు న్యాయస్థానాలలోనే తేలి ఉండేది. ఎంత కాలం పట్టినా దానికొక ముగింపు ఉండేది. కానీ ఇప్పుడు రాష్ట్రపతి ఈ ఆర్డినెన్స్‌కు సమ్మతించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించదలచుకుంటే, దేశమంతటా ఇదే సమస్య ఉత్పన్నం అవుతుందన్న భయంతో కేంద్ర ప్రభుత్వం సమ్మతించదు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా సమ్మతించడానికి రాష్ట్రపతి బహుశా తట పటాయించవచ్చు.

దళితులలో అంతర్గత న్యాయం రాజ్యాంగ నియమాలలోనూ, కోర్టు తీర్పులలోనూ ఇరుక్కొని ఉండనవసరం లేదు. సామాజిక సమస్యలు సామాజికంగా పరిష్కారమై ఆ తరువాత చట్టం రూపం తీసుకుంటే ఆ పరిష్కారం సహజంగానూ స్థిరంగానూ ఉంటుంది. అంతవరకు చట్టం కావాలని బలహీనులయిన వారు డిమాండ్ చేయడం తప్పని నా అభిమతం కాదు. పరిష్కారం కోసం పెట్టే ఒత్తిడిలో ఆ డిమాండ్ కూడ భాగమే. పైగా రాజ్యానికి సంక్షేమ బాధ్యత కూడ ఉంది కాబట్టి సంక్షేమం కొరవడిన వారు ప్రభుత్వం తమకు అనుకూలంగా చట్టం చేయమని కోరడంలోనూ తప్పులేదు.

అయినప్పటికీ సమస్యకు సామాజిక పరిష్కారాన్ని అన్వేషించడం అవసరం. అది విజయవంతమైతే ప్రభుత్వం చేసే చట్టం ఆటంకాల నెదుర్కోదు. చట్టం చూపించే పరిష్కారం సామాజికంగా ఆమోదం పొందుతుంది. పరిష్కారం స్థిరంగా, నిలకడగా ఉంటుంది.

మన రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాల వర్గీకరణ విషయంలో ఈ సామాజిక పరిష్కారం కోసం ప్రయత్నమే జరగలేదు. షెడ్యూల్డు కులాలలో సాపేక్షంగా వెనుకబడినవారు తమ వాటా తాము కోరుకోవడం న్యాయమని సాపేక్షంగా ముందున్న వారు సూత్రప్రాయంగా ఒప్పుకొని ఉంటే, దళితుల ఐక్యత దెబ్బతినకుండా వర్గీకరణ ఏ విధంగా చేయాలన్న ఆలోచన ఇరుపక్షాలూ చేసి ఉండవచ్చును. దళితుల ఐక్యతకు నష్టం జరగకుండా వెనుకబడిన వారికి న్యాయం జరిగి ఉండేది.

ఈ వైఫల్యానికి ఎవరు బాధ్యులని ఇక్కడ నేను ఏకరువు పెట్టవలసిన అవసరం లేదు. ఒక రకంగా ప్రజాఉద్యమాలలో ఉన్నవారందరమూ బాధ్యులమే. దళిత ఉద్యమ నాయకత్వం కొంచెం ఎక్కువ బాధ్యత స్వీకరించవలసి ఉంటుందేమో.

ఈ వైఫల్యం ఫలితంగా దళితులు ఒకరికొకరు దూరం కావడం, ఒకరి కార్యక్రమాల కొకరు హాజరు కాకుండ ఉండడం, వర్గీకరణ కోరుకున్న వారిని అవతలి వర్గం తెలుగుదేశం ఏజెంట్లని నిందించడం, వాళ్లు వీళ్లను నయా బ్రాహ్మణులు అనీ, తమ ప్రధాన శత్రువులనీ నిందించడం జరిగింది. పెత్తందారీ కులాలకిది చాలా ధైర్యం

నిగాహ్

ఇచ్చింది. 'అసలు రిజర్వేషన్లు మొత్తంగా తీసేస్తే పోలేదా?' అనడానికి వాళ్లు సాహసిస్తున్నారు. 'రిజర్వేషన్ల వల్ల వచ్చేది చీలికేనని మేం ఎప్పుడో చెప్పాం' అని తెగించి అంటున్నారు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. మాదిగ తదితర వెనుకబడిన దళిత కులాలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయం చేకూర్చే వర్గీకరణ డిమాండ్‌ను అందరూ ఆమోదించి, ఇతర విషయాలలో దళితులందరూ ఉమ్మడిగా చేయవలసిన పోరాటాలకు అవసరమైన ఐక్యతను నిలబెట్టడం కోసం కృషి చేయవలసి ఉంది. ఐక్యంగా చేయవలసిన పోరాటాలు చాలా ఉన్నాయి. అంటరానితనానికి వ్యతిరేకంగానే కాదు. రిజర్వేషన్ల సక్రమమైన అమలు కోసం మాత్రమే కాదు. విద్యా ఆరోగ్య హక్కుల కోసం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, భూమి కోసం, ప్రకృతి వనరులపైన హక్కు కోసం పోరాటాలు చేయవలసి ఉంది.

ఈ అవసరాన్ని గుర్తించడానికి సంకుచిత ప్రయోజనాలను పరిమితులను అధిగమించే దూరదృష్టి కావాలి. విశాల దృక్పథం కావాలి. అది ఇవాళ ఉందా లేదా అని తర్కించుకొని కూర్చోవడానికిది సమయం కాదు. మనం ప్రయత్నం చేస్తే తప్ప పరిస్థితులు మారవు.

నవంబర్ 29, 1998

# అమర్త్యసేన్‌ను అనుసరించాలంటే మన పాలకులు ఏం చేయాలి?

నోబెల్ బహుమతి వచ్చిన అర్థశాస్త్రవేత్త అమర్త్యసేన్‌ను కీర్తించడానికి మన పాలకులకు అభ్యంతరమేమీ ఉండదు. ఒక భారతీయుడికి బహుమతి రావడం భారతదేశానికి గర్వకారణమే. గర్వకారణాలు మనకెక్కువ లేవు కాబట్టి దొరికిన దాన్ని పట్టుకొని ఊరేగడానికి మన వాళ్లకు అభ్యంతరమేం ఉండదు. ఈ మేరకు అమర్త్యసేన్‌కూ సుస్మితా సేన్‌కూ తేడా ఏమీ లేదు.

అయితే అమర్త్యసేన్ ఘనతను చూసి మన భాగ్య విధాతలు సంతృప్తి చెందడానికి ఇంకొక కారణం కూడ ఉంది. ఆయన ఆర్థిక విధానాలలో సరళీకరణనూ ప్రపంచీకరణనూ సమర్థిస్తాడు. అవి మంచివేనని, దేశానికి అవసరమేననీ అంటాడు. ఆ మేరకు వామపక్షాల, ప్రజాతంత్రవాదుల విమర్శను తిప్పికొట్టడానికి అమర్త్యసేన్ పనికొస్తాడు.

కానీ భారత పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల గురించి అమర్త్యసేన్ చేసిన విశ్లేషణను జాగ్రత్తగా చదివితే ఆయన ఆలోచనలలో మన పాలకులు సంతోషించడానికీ ప్రజాతంత్రవాదులు బాధపడటానికీ ఏమీ లేదు.

సరళీకరణను, ప్రపంచీకరణను అమర్త్యసేన్ బేషరతుగా సమర్థించడు. వాటివల్ల పేదప్రజానీకానికి మేలు జరగా లంటే అందుకు కావలసిన 'శక్తి' లేక 'సామర్థ్యం' వారికి ప్రభుత్వం ముందుగా కల్పించవలసి ఉంటుందంటాడు. అది లేకుండా ప్రపంచీకరణ చేపడితే దానివల్ల కొందరికి మేలు, కొందరికి కీడు జరుగుతుందనీ పేదరికం పెరుగుతుందనీ అసమానతలు పెరుగుతాయనీ అంటాడు.

మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటిమాటికీ ఉదాహరణలుగా చూపించే సింగపూర్, దక్షిణకొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్‌లు (వాటి బాటలోనే

నిగాహ్

పోతున్న థాయిలాండ్, చైనాలు) ప్రపంచీకరణ చేపట్టక ముందే భూసంస్కరణలు చేపట్టాయి. అక్షరాస్యత బాగా సాధించాయి. ఆరోగ్యం విషయంలో ఒక కనీస ప్రమాణాన్ని సాధించాయి. ఇవి చేయబట్టి ఆ దేశాలు చేపట్టిన సరళీకరణ, ప్రపంచీకరణ క్రమాల వల్ల పేదలు కూడ కొంత ప్రయోజనం పొందగలిగారు. వారి జీవన ప్రమాణాలు కూడ పెరిగాయి.

కానీ ఇవి సాధించకుండ–పేదల చేతిలో కొంత శక్తిసామర్థ్యాలు పెట్టకుండ ప్రపంచీకరణ బాటలో ఆర్థిక వ్యవస్థను పెడితే అందుకు విరుద్ధమైన ఫలితాలు ఉంటాయని అమర్త్యసేన్ అంటాడు. దీనికి బ్రెజిల్‌ను ఉదాహరణగా చూపిస్తాడు. బ్రెజిల్ చేపట్టిన సరళీకరణ ఫలితంగా ఆ దేశ జాతీయ ఆదాయం పెరిగింది, తలసరి ఆదాయమూ పెరిగింది. కానీ దాంతోపాటు పేదరికం పెరిగింది, పేదల జీవన ప్రమాణాలు పడిపోయాయి, అసమానతలు పెరిగాయి, హింసాదౌర్జన్యాలు పెరిగాయి.

ఇండియా ఈ విషయంలో బ్రెజిల్ బాటలో ఉంది తప్ప తైవాన్ బాటలో కాదు. దక్షిణ కొరియా బాటలో కాదు, చైనా బాటలో కాదు అని అమర్త్యసేన్ అంటాడు. ఈ విమర్శను మన పాలకులు ముఖ్యంగా చంద్రబాబు నాయుడు–అర్థం చేసుకుంటే అమర్త్యసేన్ తమ విధానాలకు మద్దతు ఇస్తున్నాడని ఇంకెప్పుడూ అనరు.

భూ సంస్కరణలు పేదల చేతిలో ఆదాయాన్ని పెడతాయి. విద్య, ఆరోగ్యాలు పనిలో నైపుణ్యాన్నీ, శక్తినీ పెంచుతాయి. వీటితో పాటు పాలనా విధానాలను ప్రభావితం చేయగల రాజకీయ స్వేచ్ఛనూ, పాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించే సంస్కరణలనూ, సంప్రదాయక సాంఘిక అసమానతలు తొలగించడం ద్వారా ప్రజలకు పెరిగే సామాజిక అవకాశాలనూ కూడ అమర్త్యసేన్ ప్రజల 'శక్తి సామర్థ్యాల'లో భాగంగా లెక్కిస్తాడు. ఇవి పెరగనిదే దేశాన్ని సరళీకరణ బాటలోనూ ప్రపంచీకరణ బాటలోనూ పెడితే అది చాలా నష్టానికీ కష్టాలకూ దారితీయగలదని హెచ్చరిస్తాడు.

ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛల విషయంలో ఇతర మూడవ ప్రపంచదేశాల కంటే భారతదేశం కొంచెం మెరుగేగానీ తక్కిన విషయాలలో చాలా వెనుకబడి ఉంది. విద్య, వైద్యం, పేదరికం అనే మూడు విషయాలలో ఆఫ్రికాలోని అతివెనుకబడిన దేశాలతో బాటు భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు అట్టడుగు స్థానంలో ఉన్నాయి. దీని గురించి ఏమీ చేయకుండ ప్రపంచీకరణ చేపడితే అది చాలా చేటు చేస్తుందన్న అమర్త్యసేన్ విమర్శను మన పాలకులు సీరియస్‌గా తీసుకున్నట్టయితే, వారి పాలనా విధానాలను చాలా మార్చుకోవలసి ఉంటుంది.

భారతదేశంలో అక్షరాస్యత 50 శాతం మాత్రమే ఉంది. అంటే నూటికి 50 మంది నిరక్షరాస్యులని అర్థం. దక్షిణ కొరియాలో అక్షరాస్యత 97 శాతం, హాంగ్‌కాంగ్‌లో 100 శాతం, థాయిలాండ్‌లో 94 శాతం, చైనాలో 80 శాతం. స్త్రీలలో అక్షరాస్యత మన దేశంలో 39 శాతం మాత్రమే కాగా చైనాలో 68 శాతం, దక్షిణ కొరియాలో 95 శాతం, థాయిలాండ్‌లో 92 శాతం.

ఆరోగ్య ప్రమాణాల మాటకొస్తే, భారతదేశంలో సగటు జీవితకాలం 59 సంవత్సరాలు కాగా తూర్పు ఆసియా దేశాలన్నిటిలోనూ (అంటే సరళీకరణ, ప్రపంచీకరణ ద్వారా వేగంగా అభివృద్ధి సాధించిన దేశాలలో) అది 70 సంవత్సరాలకు పైనే ఉంది. పసిపిల్లలలో మరణం రేటు భారతదేశంలో 1000 జననాలకు 79 కాగా, దక్షిణకొరియాలో 13 మాత్రమే, థాయిలాండ్‌లో 26 మాత్రమే, చైనాలో 31 మాత్రమే.

ఈ అభివృద్ధిని ఆ దేశాలు సరళీకరణ ద్వారా సాధించినది కాదు. సరళీకరణ క్రమం మొదలుపెట్టక ముందే ఆ దేశాలలో భూ సంస్కరణల అమలు వల్ల, బాధ్యతాయుతమైన విద్యా ఆరోగ్య విధానాల వల్ల దీనికి ప్రాతిపదిక ఏర్పడి ఉండింది. చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం తన పద్ధతిలో అ అభివృద్ధి సాధించగా, ఇతర తూర్పు ఆసియా దేశాలలో కమ్యూనిస్టేతర (కమ్యూనిస్టు వ్యతిరేక అనొచ్చు కూడ) ప్రభుత్వాలు తమ పద్ధతిలో సాధించాయి. విద్యా ఆరోగ్య రంగాలలో భారతదేశం ఈనాడు (అంటే తాను సరళీకరణ విధానాలు చేపట్టేనాటికి) సాధించిన ప్రగతి కంటే, తూర్పు ఆసియా దేశాలు ఆనాడే (అంటే తాము సరళీకరణ విధానాలు చేపట్టేనాటికి) ఎక్కువ సాధించి ఉన్నాయి. అందువల్లనే ఈ దేశాలలో సరళీకరణ, ప్రపంచీకరణల వల్ల జాతీయ ఆదాయం పెరగడమే కాక పేదల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. కానీ ఆ ప్రాతిపదిక లేకుండ ప్రపంచీకరణ బాటలో బయలుదేరిన భారతదేశంలో అదే జరుగుతుందన్న నమ్మకం లేదు. బ్రెజిల్‌లో లాగ జాతీయ ఆదాయం ఒక వైపు పెరుగుతుండగా మరొకవైపు పేదరికం పెరగగలదు. ప్రజలలో అనారోగ్యం, అవిద్య పెరగగలవు. చంద్రబాబునాయుడు నమూనా సరళీకరణ ఇదే పరిణామానికి దారితీయగలదని అమర్త్యసేన్ హెచ్చరిస్తాడు.

మన పాలకులు అమర్త్యసేన్‌ను నిజంగా ఆదరించదలచుకుంటే ఈ హెచ్చరికను పట్టించుకోవాలి. కాని పట్టించుకునే సూచనలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పట్టించుకోకపోగా, సంక్షేమ విధానాలను వెనక్కి తీసుకుపోతున్నారు. ప్రజలకు శక్తి సామర్థ్యాలు కల్పించే అంశాలలో అమర్త్యసేన్ విద్య, ఆరోగ్యం ఆదాయ వనరులనే కాక సామాజిక సమానత్వాన్నీ రాజకీయ ప్రజాస్వామ్యాన్నీ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్నీ కూడ లెక్కబెడతాడు. తూర్పు ఆసియాదేశాలు, చైనాలకంటే ఒక్క

ప్రజాస్వామ్యం విషయంలో మనకు మెరుగయిన రికార్డు ఉందని అమర్త్యసేన్ మెచ్చుకుంటాడు. అది అందరూ ఒప్పుకునే వాస్తవం కూడ. దానిని కాపాడుకుంటూ సంక్షేమ విధానాలను పెంపొందించే పద్ధతిని మన ప్రభుత్వాలు అనుసరిస్తే ప్రపంచీకరణ వల్ల ప్రజల మీద పడే దెబ్బను కొంతయినా ఉపశమింప చేయగలుగుతారు. కానీ మన పాలకులు ప్రపంచీకరణకు సంక్షేమ విధానాలే కాదు, ప్రజాస్వామ్యం కూడ అడ్డమనే భావిస్తున్నారు. రెండింటినీ ధ్వంసం చేస్తున్నారు. ఈ వాస్తవానికీ అమర్త్యసేన్‌కు ఇస్తున్న మెచ్చుకోలుకూ పొంతన ఏమీ లేదు.

# ముంబాయిలో ఆ రోజు

డిసెంబర్ 6 మళ్లీ వచ్చింది. బాబ్రీమసీదు కూల్చివేతనూ ఆ తరువాతి పరిణామాలనూ జ్ఞాపకానికి తెచ్చింది.

ఆ పరిణామాలలో అతి భయంకరమైనది ముంబాయిలో జరిగిన ఊచకోత. బాబ్రీ మసీదు కూల్చివేత గురించి విన్న ముంబాయి ముస్లింలు 1992 డిసెంబర్ 7–10 తేదీల మధ్య ముంబాయి నగరంలో సృష్టించిన అల్లరి ఒకెత్తయితే, దానికి ప్రతీకారంగా 1993 జనవరి 6–10 తేదీల మధ్య శివసేన మూకలు నగర పోలీసుల సహకారంతో సృష్టించిన బీభత్సం దానికి పదిరెట్లు ఎక్కువ.

ఈ అల్లర్లపైన న్యాయ విచారణ జరిపిన శ్రీకృష్ణ కమిషన్ తన నివేదిక సమర్పించే సమయం వచ్చేసరికి శివసేనే ఆ రాష్ట్రంలో అధికారానికి వచ్చి కూర్చుంది. శివసేన–బిజెపి పాలకులకు శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఎంత మాత్రం నచ్చలేదు. 'అది హిందూ వ్యతిరేక నివేదిక. దానిని ఆమోదించడానికి నేనేమైనా పాకిస్తాన్ ప్రధాన మంత్రినా?' అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి అన్నాడు. కానీ వాళ్ల దురదృష్టమేమిటంటే ఆ నివేదిక రూపొందించిన న్యాయమూర్తి ముస్లిం కాదు. పోనీ కమ్యూనిస్టు కాదు, నాస్తికుడూ కాదు. జస్టిస్ శ్రీకృష్ణ ప్రతిరోజూ పూజలు చేసే బ్రాహ్మణుడు. అయితే నిజాయితీగల న్యాయమూర్తి కాబట్టి తన కళ్లముందు కనిపించిన వాస్తవాలను కప్పిపెట్టే ప్రయత్నం చేయకుండా ఉన్నదున్నట్లు నివేదికలో పొందుపరిచాడు.

1992–93లో జరిగిన ఆ అల్లర్లపైన నివేదికను ఆయన 1998లో సమర్పించాడు. పోలీసులపైన, శివసేన తదితర సంఘ్ పరివార్ సంస్థలపైన స్పష్టమైన అభియోగాలు పెట్టాడు. అవన్నీ ఇప్పుడు చెప్పుకొని ఏం ప్రయోజనమంటే, అప్పట్లో కేవలం కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్న హిందుత్వ వాదులిప్పుడు దేశంలోనే అధికారంలో ఉన్నారు. ఇతర పార్టీలకూ వీరికీ ఒక తేడా ఏమిటంటే వీళ్ల ఆలోచనారీతికి ఉండే

ప్రభావాన్ని వీళ్లకొచ్చే వోట్లను బట్టి అంచనా వేయలేము. అధికార యంత్రాంగంలోనూ మేధావులలోనూ అది చాలా లోతుగా పాకిపోయింది. దాని దుష్ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎన్నికల విశ్లేషణ సరిపోదు. అన్ని సామాజిక రంగాలలోనూ దానిని విశ్లేషించాలి.

1992 డిసెంబర్ –1993 జనవరి నాటి ముంబాయి అల్లర్లలో ఆ నగర పోలీసు యంత్రాంగం శివసేనతో చేతులు కలిపిన వైనం చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ మిలాఖత్‌ను సవివరంగా చూపించడం జస్టిస్ శ్రీకృష్ణ చేసిన గొప్ప మేలు. హిందుత్వ వాదుల ఆలోచనా రీతిని వ్యతిరేకించే ప్రజాతంత్ర ఉద్యమాల ముందు ఎంత కష్టతరమైన బాధ్యత ఉందో ఈ నివేదిక చెప్పకనే చెప్తుంది.

కొన్ని వివరాలను పునశ్చరణ చేసుకోవడం కంటే డిసెంబర్ 6ను జ్ఞాపకం చేసుకోవడానికి మేలయిన మార్గమేదీ లేదు.

'శివసేన బీభత్సమే ప్రజలకు రక్ష' (Sivasena's terror is public safety) అనేది ఆనాడు ముంబాయి నగర వీధులలో మార్మోగిన నినాదం. శివసేన కార్యకర్తలు ఈ నినాదం ఇచ్చుకుంటూ ఊరేగింపులు తీసారు. ఊరేగింపుల గురించి ఎప్పటికప్పుడు రిపోర్టు తయారుచేసిన ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ నినాదాన్ని ఉన్నదున్నట్టే రాసారు. కానీ శ్రీకృష్ణ కమిషన్ విచారణ మొదలయ్యేసరికి పోలీసు పెద్దలు 'బీభత్సం' అన్న మాటను చెరిపేసి దాని స్థానంలో 'దర్శనం' అన్నమాటను (మరాఠీ భాషలో ఈ రెండూ దగ్గరగా ఉంటాయి) రాసిపెట్టారు. ఇలా రిపోర్టులను దిద్దిన సంగతి గ్రహించిన జస్టిస్ శ్రీకృష్ణ ఈ విషయాన్ని తన నివేదికలో రెండు చోట్ల ప్రస్తావించారు.

నివేదికలో పదేపదే ప్రస్తావించిన విషయం మరొకటి ఉంది. హిందువుల గుంపులూ ముస్లింల గుంపులూ దొమ్మీకి దిగిన ఘటనలలో ఎంత మందికి గాయాలయ్యాయి, ఎవరి ఆస్తులెంత నాశనం అయ్యాయి అనేది లెక్కతీస్తే నష్టపోయిన వారిలో హిందువులూ ముస్లింలూ కూడా ఉంటారు. కానీ ఆ దొమ్మీలను అదుపుచేయడానికి పోలీసులు తీసుకున్న చర్యలలో గాయపడిన వారిని, చనిపోయిన వారిని చూస్తే ఎక్కువ భాగం ముస్లింలే ఉంటారు. కేవలం ముస్లింలే అల్లరి చేసినట్టు, పోలీసులు వారిని అదుపు చేసినట్టు అనిపిస్తుంది. దీనిని బట్టి ఇరుపక్షాలూ దొమ్మీకి దిగినచోట పోలీసులు తమ బలప్రయోగాన్నంతా ముస్లింల మీదనే కేంద్రీకరించారని అర్థమవుతుందని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు.

చర్య తీసుకున్నప్పుడు కూడా ముస్లింల పైననయితే నేరుగా కాల్పులు జరిపి చాలా ప్రాణాలు తీసారుగానీ హిందువుల దగ్గరి కొచ్చేసరికి చాలా సందర్భాలలో

గాలిలోకి మాత్రమే కాల్పులు జరిపారని జస్టిస్ శ్రీకృష్ణ చాలా ఉదాహరణలిచ్చి వివరిస్తారు.

శివసేన వారు అల్లర్లకు జనాన్ని సమీకరించడానికి ఉపయోగించిన సాధనం 'మహాఆరతి' అనే సంబరం. ముంబాయి నగరమంతటా కర్ఫ్యూ ఉన్నా కూడ డిసెంబర్ – జనవరి నెలల్లో ఈ మహాఆరతులు నిరాఘాటంగా సాగుతూనే ఉన్నాయి. ప్రతీ మహాఆరతిలోనూ శివసేన, బిజెపి నాయకులు ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు ఇవ్వడం, తంతు ముగిసిన తరువాత తిరిగి పోయే జనం ముస్లింల ఇళ్లపైన, దుకాణాలపైన దాడులకు పాల్పడడం రివాజుగా జరిగింది. కానీ ఏ ఒక్క రోజు కూడ మహాఆరతులను అరికట్టడానికి పోలీసులు ప్రయత్నం చేయలేదు. ఎందుకుచేయలేదని విచారణ సందర్భంగా జస్టిస్ శ్రీకృష్ణ పోలీస్ అధికారులను అడిగితే 'అవి కేవలం మతపరమైన కార్యక్రమాలు కాబట్టి ఆపలేదు' అని జవాబు చెప్పారు. ప్రతీ మహాఆరతి తరువాత ముస్లింలపైన దాడులు జరుగుతూనే ఉన్నప్పటికీ పోలీసులలో ఈ అభిప్రాయం మారలేదు.

ముస్లింలపైన దాడులు జరిగిన అనేక సంఘటనలలో బాధితులు స్థానిక శివసేన కార్యకర్తలను దోషులుగా పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదులిచ్చారు. కానీ ఏ ఒక్క కేసులోనూ పోలీసులు ఆ నిందితులను అరెస్టు చేయలేదు. ఎందుకని అని విచారణ సమయంలో జస్టిస్ శ్రీకృష్ణ పోలీస్ అధికార్లను ప్రశ్నిస్తే, ఎసిపి, డిసిపి స్థాయి పోలీసు అధికారులు సహితం 'వాళ్లను అరెస్టు చేస్తే అల్లర్లవుతాయని చేయలేదు' అని, 'అసలే బాగా లేని పరిస్థితి మరింత దిగజారుతుందని భయపడి అరెస్టు చేయలేదు అని జవాబు చెప్పారు. అంతేకాదు, నిందితుల పేర్లు– ఇంటిపేరు, నివాస స్థలంతో సహా బాధితులు ఇచ్చిన కేసులతో పాటు అత్యధిక భాగం కేసులు కొంత కాలానికి 'అంతుచిక్కని' కేసులుగా మూసి వేయబడ్డాయి. శివసేన కార్యకర్తలను అరెస్టు చేస్తే 'ముంబాయి తగలబడుతుంది' అని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రే భయం, అశక్తత వ్యక్తం చేసాడంటే శివసేన టెర్రర్ ఎంతటిదో అర్థమవుతుంది. 'అయినప్పటికీ ముంబాయి తగలబడకుండా తప్పించుకోలేదు కదా' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలో ఔచిత్యం ఉంది.

తమ మీద జరుగుతున్న దాడి గురించి పోలీసులకు చెప్పి రక్షణ పొందుదామని ప్రయత్నం చేసిన ముస్లింలకు అనేక సందర్భాలలో చాలా చేదు అనుభవం ఎదురయింది. నిజానికి ముస్లింలపైన జరిగిన అనేక దాడులు పోలీస్ స్టేషన్లకూ పోలీస్ పికెట్‌లకూ కేవలం ఫర్లాంగు, రెండు ఫర్లాంగుల దూరంలో జరిగాయి.

భయపడి పోలీసులకు ఫోన్ చేసిన ముస్లింలకు 'పాకిస్తాన్‌కు పోరాదా, ఇక్కడుంటే ప్రమాదం కదా' అని, 'ఒక ముస్లిం చచ్చిపోతే ఒక పీడ తగ్గినట్టే'ననీ జవాబు లభించింది. జస్టిస్ శ్రీకృష్ణ పేర్లు, పోలీస్ స్టేషన్లతో సహా ఇటువంటి అనేక ఘటనలు నమోదు చేసారు. 'ఈ నివేదికను ఆమోదించడానికి నేనేం పాకిస్తాన్ ప్రధానమంత్రినా' అని మనోహర్ జోషి చేసిన వ్యాఖ్యకూ పోలీసుల వ్యాఖ్యలకూ ఉన్న పోలిక కాకతాళీయం కాదు. మతాన్నీ జాతినీ ప్రాతిపదిక చేసుకున్న ఫాసిస్టులు కేవలం అధికార పీఠాన్ని చేజిక్కించుకోవడం ద్వారా తమ ఆధిక్యతను నెలకొల్పరనీ, అన్ని సామాజిక రంగాలనూ అదుపులోకి తీసుకుంటారనీ ఫాసిజం చరిత్ర తెలుపుతుంది. పార్టీలతోనూ పార్టీ సిద్ధాంతాలతోనూ ప్రమేయం లేకుండ నడుచుకోవాలని చెప్పుకునే పోలీసు యంత్రాంగం, బ్యూరోక్రసీ క్రమంగా హిందుత్వ వాదం ప్రభావంలోకి పోతూ ఉన్నాయి. విద్యారంగాన్ని ఆక్రమించుకోవడానికీ చారిత్రక పరిశోధన పైన ఆధిక్యత నెలకొల్పడానికీ వాళ్లు చేస్తున్న ప్రయత్నాలు చూస్తూనే ఉన్నాం. ఇదంతా ఆయా వ్యవస్థల వెలుపలి నుండే చేస్తున్నారనుకోనక్కర లేదు. హిందుత్వవాద భావజాలాన్ని నమ్మేవారు అన్ని రంగాలలోనూ ఉన్నారు. లోపలి నుండి వాళ్లు, బయటి నుండి సంఘ్ పరివార్ సంస్థలు సకల సామాజిక జీవిత రంగాలనూ లోబరుచుకునే పని చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికీ సమతకూ నష్టకరమని నమ్మేవారు అన్ని రంగాలలోనూ ఈ ప్రయత్నాలను ఎదుర్కోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేయడానికి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఉపయోగపడితే ఆ న్యాయమూర్తి కృషి సఫలం అయినట్టే.

డిసెంబర్ 27, 1998

# బంద్‌లు, కోర్టులు, ప్రజాస్వామ్యం

అప్పుడెప్పుడో కేరళ హైకోర్టు బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తే దానిని జోక్‌గా తీసుకున్నాము. నిజానికి 'హర్తాళ్' అనేది గాంధీ ఉపయోగించిన బలమైన నిరసన సాధనాలలో ఒకటి. బ్రిటిష్ హయాంలోనూ పోలీసులు బలవంతంగా దుకాణాలు తెరిపించిన ఘటనలు, బంద్ నిర్వాహకులను తన్నిన ఘటనలూ ఉన్నాయి గానీ బంద్ నిర్వహించడాన్ని నేరంగా ప్రకటిస్తూ బ్రిటిష్ పాలకులు చట్టమెన్నడూ చేయలేదు. కాంగ్రెస్ వారి మాటకొస్తే, హర్తాళ్ నిర్వహించడం తమ హక్కుగానే వారు భావించారు. అది 'రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటించడానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 50 ఏళ్లు పట్టింది.

కేరళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇప్పుడు దానిని అనుసరించి పాట్నా హైకోర్టు మొన్నటి 11వ తేదీనాటి దేశవ్యాప్త బంద్‌ను రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించింది. బీహార్ పోలీసులు వెనువెంటనే 'ఎవరయినా దుకాణాలు మూయిస్తే మేము బలవంతంగా తెరిపిస్తాం' అని ప్రకటించారు. అక్కడికి కోర్టు తీర్పు లేకపోతే వాళ్లు ఆ పని చేయనట్టు.

ఈ న్యాయమూర్తుల ఆలోచనలు అర్థం చేసుకోవడం సహితం కష్టంగా ఉంది. బంద్ పాటించమని నిర్వాహకులు ఎవరినయినా బలవంతం చేస్తే అది నేరం అవుతుంది. ఆ సంగతి కొత్తగా న్యాయస్థానాలు చెప్పనవసరం లేదు. దానికి రాజ్యాంగ వ్యాఖ్యానమూ అవసరం లేదు. అది ఐపిసీలోని పలు సెక్షన్ల కింద నేరం అవుతుంది. కానీ బంద్ పిలుపు ఇవ్వడమే 'రాజ్యాంగ విరుద్ధం' అంటే అర్థమేమిటి? గాంధీ నిర్వహించిన హర్తాళ్‌ల మాటేమిటి? (అప్పుడు దేశానికొక రాజ్యాంగమే లేదు కాబట్టి అది రాజ్యాంగ విరుద్ధం కాదంటారేమో! అట్లాగయితే మనకొక రాజ్యాంగం వచ్చినందుకు ప్రజలు బాధపడవలసి ఉంటుంది)

నిజమే, బంద్‌ను స్వచ్ఛందంగా పాటించడానికీ భయపడి పాటించడానికీ అన్ని సందర్భాలలోనూ కచ్చితమైన తేడా ఉండదు. జనబలంగానీ కండబలంగానీ (తూటా బలం అని కూడ అనాలేమో) ఉన్నవాళ్లు బంద్ పిలుపు ఇస్తే, పాటించకపోతే ఏం నష్ట పోవలసివస్తుందోనని 'ముందు జాగ్రత్తగా' జనం పాటిస్తుంటారు. స్కూళ్లకు సెలవులిచ్చేస్తారు. బస్ సర్వీసులు రద్దు చేసేస్తారు. దుకాణదారులు తమంతట తామే అంగళ్లు మూసేస్తారు. ఇదేదీ జరగకపోతే బంద్ నిర్వాహకులు ఒక బస్సు అద్దాలు పగలగొట్టినా లేక ఒక దుకాణాన్ని బలవంతంగా మూయించినా చాలు, మిగిలినవన్నీ 'స్వచ్ఛందంగా' మూతపడి పోతాయి. ఈ పరిస్థితిలో ఏది బలవంతం, ఏది స్వచ్ఛందం అని తేల్చి చెప్పటం కష్టం.

కానీ దీనికి పరిష్కారం బంద్ పిలుపునే రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించడం కాదు. ప్రజలలో అత్యధికులు స్వచ్ఛందంగా పాల్గొన్న బంద్‌లను అందరం ఎరుగుదుము. అందరినీ కదలించే ఒక దౌర్జన్యానికి వ్యతిరేకంగా బంద్ పిలుపు ఇచ్చినప్పుడు, ఒక ప్రాంతం మొత్తానికి సంబంధించిన సమస్యపైన బంద్ పిలుపు ఇచ్చినప్పుడు మెజారిటీ ప్రజలు ఇష్టపూర్వకంగానే బంద్‌లో పాల్గొంటుంటారు. అటువంటి పిలుపు సహితం 'రాజ్యాంగ విరుద్ధం' అనడంలో అర్థమేమయినా ఉందా?

బంద్‌ను ఒక నిరసన సాధనంగా ఉపయోగించే విషయంలో రాజకీయ ఉద్యమాలు నిగ్రహం పాటించక పోవడం వల్ల తరచుగా బంద్‌ల పట్ల ప్రజలలో వ్యతిరేకత వ్యక్తమయ్యే విషయం సత్యమే. ప్రజల నిరసనకంటే బంద్ పిలుపు ఇచ్చిన వారి ఆధిపత్య ప్రదర్శన తరచుగా ప్రచారం అవుతుంది. ఆ మధ్య హైదరాబాద్ నగరంలో ఒక బిజెపి నాయకుడు గుండెపోటుతో మరణించినప్పుడు ఆ పార్టీ బంద్ నిర్వహించింది. 'వాడి గుండె ఆగిపోయి వాడు చచ్చిపోతే మేమంతా బంద్ ఎందుకు పాటించాలి' అని విసుక్కుంటూనే నగరవాసులు బంద్ పాటించారు. బిజెపికి నగరంలో ఉన్న కండ బలానికి భయపడే పాటించారు. జార్ఖండ్, గూర్ఖాలాండ్ తదితర ఉద్యమకారులు 48 గంటల బంద్‌లు, 72 గంటల బంద్‌లు నిర్వహిస్తుంటారు. (మన రాష్ట్రంలో పీపుల్స్‌వార్ కూడ 48 గంటల బంద్ పిలుపు ఇచ్చిన సందర్భాలున్నాయి) దేనికి బంద్ పిలుపు ఇవ్వాలో, ఏ రూపంలో బంద్ నిర్వహించాలో అర్థం చేసుకోలేని రాజకీయ పార్టీలు, ఉద్యమాలు ప్రజలలో బంద్‌లపట్ల వ్యతిరేక భావం నెలకొనడానికి కారణమయ్యాయి. కోర్టులు 'బంద్‌లు రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటిస్తే, దాని వల్ల తమ హక్కు పోయిందని ప్రజలు గుర్తించక, ఇతరులను ఇబ్బంది పెట్టే రాజకీయ పార్టీల హక్కుపోయిందని సంతోషించే స్థితి వచ్చింది. ఇది రాజకీయ పార్టీల, ఉద్యమాల స్వయంకృతాపరాధం.

కానీ పౌర సమాజంలో నిగ్రహం లేమికి, క్రమశిక్షణ లేమికి, ముందుచూపు లేమికి సమాధానం నిర్బంధ చట్టాలుకాదు, నిర్బంధం పెంచే కోర్టు తీర్పులు కావు. ప్రజాస్వామ్య అవకాశాల దుర్వినియోగానికి జవాబు ఆ అవకాశాలను తొలగించటం కాదు. క్రమశిక్షణ, ముందు చూపు, నిగ్రహం పెంపొందించటం.

దీనికి న్యాయస్థానాలు చేయగలగింది కొంచెమే. వారు దానికే పరిమితమైతే గంభీరంగా ఉండేది. బంద్ పిలుపు ఇచ్చేటప్పుడు దానివల్ల దినకూలి మీద బతికే వాళ్లకు, ఏ రోజుకారోజు పొట్టపోసుకునే వ్యాపారాలు చేసుకునే వాళ్లకు, రోగ గ్రస్తులయి అర్జెంటుగా ఆస్పత్రికి పోవలసిన వాళ్లకు, దూరప్రాంతాల నుండి వచ్చి రైల్వేస్టేషన్‌లోనూ, బస్‌స్టాండ్‌లోనూ ఇరుక్కుపోయే వాళ్లకు కలిగే కష్టనష్టాల గురించి ఆలోచించాలనీ, బాధ్యతతో పిలుపు ఇవ్వాలనీ రాజకీయ ఉద్యమకారులను హెచ్చరించడం ఉచితంగా ఉంటుందిగానీ ఈ కారణాలు చూపించి బంద్‌లు రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించడం ఉచితమెట్లా అవుతుంది? ప్రజాస్వామ్యానికి అవసరమైన బాధ్యతాయుతమైన వైఖరి అందరూ పెంపొందించుకున్నప్పుడు ప్రజాస్వామ్యం మెరుగవుతుందిగానీ బాధ్యత కొరవడిందని చెప్పి నిర్బంధం పెంచితే మెరుగవుతుందా?

ఉద్యమాలకు ఈ హెచ్చరికలు చేయడంతో పాటు న్యాయస్థానాలు ప్రభుత్వానికి కొన్ని ఆదేశాలు ఇచ్చి ఉండవచ్చును. బంద్‌వల్ల కూలి చేసుకునే అవకాశం కోల్పోయిన వారికి ప్రభుత్వం ఏమీ చేయలేక పోవచ్చునుగానీ, ఆస్పత్రులకు అర్జెంట్‌గా పోవలసి ఉన్న వారి కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు. వాటిని వాడుకునే పద్ధతిని ప్రజలకు ముందుగానే తెలియచేయవచ్చు. దీనికి సంబంధించిన ఆదేశాలు న్యాయస్థానాలు ప్రభుత్వానికి జారీచేసి ఉంటే బాగుండేది. బంద్‌ను ప్రజాస్వామ్యానికి విఘాతంగా కాక ప్రజాస్వామ్యంలో భాగంగా చూడగలిగితే న్యాయస్థానాలకు ఈ విషయం తోచి ఉండేది. ఆ దృష్టి లేకపోవడం దురదృష్టకరం.

ప్రజలు తమ ప్రజాస్వామ్య అవకాశాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో చెప్పే నిర్ణేతలు తామేనన్న అహంభావం న్యాయమూర్తులలో పెరగటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఈ మధ్య శివసేన గుండాలు దాడి చేసిన 'ఫైర్' సినిమా నిర్మాత సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసినప్పుడు, ఆ కేసును విచారణకు స్వీకరించిన న్యాయమూర్తులు కేసు వేసిన వారికి జారీ చేసిన ఆదేశం దీనికొక ఉదాహరణ. 'కేసు వేసారు కాబట్టి ఇంక ఈ విషయం గురించి బయట మాట్లాడడం మానేయండి' అన్నారు. 'మీకు ఏ వేదిక కావాలో ఎంచుకోండి. కోర్టు కావాలా, పత్రికలు కావాలా?' అన్నారు. రెండూ కావాలనకూడదా? అంటే తప్పేముంది. న్యాయస్థానాలు ప్రజాస్వామ్యంలో భాగమైనట్టే

పత్రికలు కూడా భాగమే. ఉన్న చట్టాల ప్రకారం న్యాయ నిర్ణయం చేసి హక్కులు నిలబెట్టడానికి న్యాయస్థానాలు ఉపయోగపడితే, హక్కుల గురించి చర్చ జరపడానికీ ప్రజలను చైతన్యవంతులు చేయడానికీ పత్రికలు ఉపయోగపడతాయి. రెండింటినీ ఒకేసారి ఎందుకు ఉపయోగించుకోకూడదు? 'న్యాయం కోసం నా దగ్గరి కొచ్చావు కాబట్టి వాడి దగ్గరికి పోవద్దు' అనే పద్ధతిలో న్యాయమూర్తులు హెచ్చరికలెందుకు జారీ చేయాలి?

ఇది మంచి పోకడ కాదు. ప్రజాస్వామ్యానికీ, ప్రజాస్వామ్య హక్కులకూ ఆరోగ్యకరం కాదు.

జనవరి 3, 1999

# గడచిన సంవత్సర కాలంలో మానవహక్కుల పరిస్థితి



**మా**నవ హక్కులు అనేది విశాలమైన రంగం. ఒక సంవత్సర కాలంలో అందులో వచ్చిన మార్పులను సమీక్షించాలంటే సులభం కాదు. ముఖ్యమైనవి మాత్రం ప్రస్తావించి వదిలి పెడదామంటే ఏవి ముఖ్యం, ఎవరికి ముఖ్యం అన్న ప్రశ్న వస్తుంది.

కాబట్టి కొన్ని స్థూలమైన పోకడలను ప్రస్తావించడం ఉచితంగా ఉంటుంది. చాలా కొట్టొచ్చినట్టు కనిపించే ఒక విషయం ఏమిటంటే, బాగా ప్రాచుర్యం పొందిన కొన్ని రకాల మానవ హక్కుల సమస్యల గురించి మాట్లాడకుండ ఉండడం ఈ రోజు ఎవ్వరికీ సాధ్యం కావడం లేదు. అయినప్పటికీ ఆ సమస్యల ఉధృతి ఏ మాత్రం తగ్గకపోగా బహుశా పెరుగుతున్నదేమో. చట్ట సభలలో స్త్రీలకు రిజర్వేషన్ గురించి చాలా పట్టుదలగా ఆందోళన చేస్తున్న సిపిఐ, సిపిఐ(ఎం) వంటి పార్టీలు తమ అధిష్టానంలో స్త్రీలకు ఒక్క శాతం కూడ స్థానం కల్పించకపోవడాన్ని అందరూ గుర్తించారు, విమర్శించారు. ఇది కాకతాళీయమయిన విషయం కాదు. ఒక సామాజిక పోకడ. సామాజిక న్యాయం అనే భావనకు సంబంధించి అందరూ మాట్లాడేది ఒకటి, జరిగేది ఒకటి అనే హిపోక్రసీ ఒక సామాజిక లక్షణం అయిపోయింది.

దీనిని చాలా రకాలుగా వ్యాఖ్యానించుకోవచ్చు. అసలు అందరూ మాట్లాడే న్యాయబద్ధమైన మాటలలోనే నిజాయితీ లేదని కొట్టి పారేయొచ్చు. ఇందులో కొంత నిజం ఉండవచ్చును గానీ ఇది పూర్తి సత్యం కాదనుకుంటాను. సామాజిక న్యాయం విషయంలో బాధిత ప్రజా సమూహాల నుండి నిజమైన ఒత్తిడి సమాజం మీద ఉంది. దానికి లభించే స్పందనంతా బూటకం అనుకోవడం సబబుకాదు. మరి ఏ విధంగా అర్థం చేసుకోవాలి? మానవహక్కులు, ప్రజాస్వామ్య విలువల కోణం నుండి చూసినప్పుడు దీనికొక వ్యాఖ్యానం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సమాజంలో విస్తృతంగా

ప్రచారం పొందిన భావాలు ఎంత త్వరగా వ్యవస్థిత నియమాలుగా మారుతాయనేది ఒక ప్రజాస్వామ్య వ్యవస్థకుండే బలాన్నీ, దాని 'మెచ్యూరిటీ'ని సూచిస్తుంది. ఇది రాజకీయ ప్రజాస్వామ్యానికేకాదు, సాంఘిక జీవితంలో ప్రజాస్వామ్య సంస్కృతికి కూడా వర్తిస్తుంది. ఈ అర్థంలో మనది రాజకీయంగానూ సాంఘికంగానూ కూడా చాలా బలహీనమైన ప్రజాస్వామ్యం. ఇక్కడ 'ప్రజాభిప్రాయం' అనే దానితో నిమిత్తం లేకుండా నడుచుకోవడం, నడుచుకొని సాగించుకోవడం చాలా సులభం. పోలీసులూ ప్రభుత్వ అధికారులేకాదు, రాజకీయ పార్టీలు, న్యాయస్థానాలు, ఉద్యమాలు, కళాకారులూ అందరికీ, అన్నిటికీ ఇది సాధ్యం.

స్త్రీల మీద అత్యాచారాల గురించి మాట్లాడని వాళ్ళెవరూ ఇవ్వాళ లేరు. అంతమాత్రం చేత వరకట్నం చావులు తగ్గలేదు. రేప్‌లు తగ్గలేదు. లైంగిక వేధింపులు తగ్గలేదు. వీటి విషయంలో పోలీసులలోనూ న్యాయస్థానాలలోనూ సమాజంలోనూ ఉండే ఉదాసీన వైఖరిలోనూ మార్పు లేదు. బాధితురాలికి న్యాయం చేయడంకంటే పంచాయితీ చేసి, రాజీ చేసి సర్దుబాటు చేసి కుటుంబం పరువు, కులం పరువు కాపాడుకునే వైఖరే ఈ విషయాలలో ప్రధానంగా ఉంది. పోలీసులే కాక న్యాయస్థానాలు సహితం దీనినే ప్రోత్సహిస్తున్నాయి.

ని
గా
హ్

ఎన్‌కౌంటర్ హత్యలు అన్యాయమని ఈ రోజు హక్కుల సంఘాలేకాదు, తెలంగాణలో భూస్వాములు సహితం అంటున్నారు. చాలా కాలం ఎన్‌కౌంటర్ల విషయంలో నోరు విప్పని న్యాయస్థానాలు సహితం ఎన్‌కౌంటర్ అంటే హత్యేనని ఈ మధ్యకాలంలో తీర్పునిస్తున్నాయి. ప్రతీ ఎన్‌కౌంటర్ ఘటనపైన హత్య కేసు నమోదు చేసి స్వతంత్ర నేర పరిశోధన జరిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ 1997 ఫిబ్రవరిలో దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ సర్క్యులర్ జారీ చేసింది. అయినప్పటికీ ఎన్‌కౌంటర్ హత్యలు ఆగకపోగా మన రాష్ట్రంలోనయితే 1968 తరువాత ( అంటే నక్సలైట్ ఉద్యమం మొదలయినప్పటి నుండి) ఏ సంవత్సరమూ జరగనంత పెద్దసంఖ్యలో 1998లో జరిగాయి. డిసెంబర్ 3వ వారం నాటికే ఎన్‌కౌంటర్ మరణాల సంఖ్య 250 దాటింది. హైకోర్టు జోక్యం చేసుకుని సిబిఐ పరిశోధన గానీ జిల్లా కోర్టు విచారణగానీ ఆదేశించిన కొద్ది సంఘటనలు తప్ప వేరే ఏవీ ఏ రకమైన నేర పరిశోధనకూ నోచుకోలేదు.

లాకప్ హత్యల విషయం కూడ అంతే, కస్టడీ మరణాల గురించి ప్రజలు తరుచుగా ఆందోళన చేస్తున్నారు. కానీ ప్రభుత్వం వైఖరి మాత్రం మారలేదు. చాలా కాలం ప్రజలూ పౌరహక్కుల ఉద్యమాలూ పెట్టిన డిమాండ్‌ల ఫలితంగా 1998 ఫిబ్రవరిలో

మొట్టమొదటిసారి ప్రభుత్వం లాకప్ మరణానికి 20వేల ఎక్స్-గ్రేషియా నిర్దేశిస్తూ జివో జారీ చేసింది. ఏ రకంగా చూసినా ఇది అతి తక్కువ. నక్సలైట్లు చంపిన వారికి ఇచ్చే నష్టపరిహారంతో పోల్చినా, ఇది చాలా తక్కువ. కానీ నష్టపరిహారం గురించి ఈ మాత్రం జివో అయినా జారీ అయింది గానీ, కస్టడీ మరణాలకు బాధ్యులయిన పోలీసులను శిక్షించే విషయంలో ప్రభుత్వం అనాసక్తి ఎప్పటిలాగే ఉంది. అది లేనిదే ఈ నేరాలు తగ్గవు. శిక్ష పడుతుందన్న భయం లేకపోతే నేరాలు తగ్గవని వేరే విషయాలలో ప్రభుత్వానికి చెప్పనవసరం ఉండదు. ఈ విషయంలో చెప్పే ప్రయోజనం ఉండదు.

రాజకీయాలలో ఈ రోజు అందరూ అతి ఎక్కువగా మాట్లాడే విషయాలలో కులం ఒకటి. దళిత బహుజన కులాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించుకోని పార్టీ ఏదీ ఇవాళ భారతదేశంలో లేదు. రాజకీయ నుడికారంలో అదొక ముఖ్య అంశం అయింది. అందరూ ఇంతగా కట్టుబడి ఉన్నప్పుడు సంపూర్ణమయిన అభ్యున్నతి సంగతి పోనీయండి, కనీసం గ్రామాలలో టీ షాపులలో దళితులకు వేరే గ్లాసులు పెట్టే దురాచారమైనా అంతమయి ఉండాలి. కానీ మన రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఈ మధ్యయుగాల సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. చిత్తూరు, కర్నూలు, విజయనగరం జిల్లాలలో ఇది అతి ఎక్కువగా కనిపిస్తుంది. ఆ దురాచారం పాటించే గ్రామాలలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలుంటాయి. గ్రామ పెద్దలు ఈ పార్టీకో ఆ పార్టీకో చెంది ఉంటారు. దళితుల పట్ల పాటిస్తున్న అంటరానితనాన్ని ఆ గ్రామాలలో ఎవరయినా ధిక్కరిస్తే వారిని అదుపు చేయడంలో చురుకయిన పాత్ర నిర్వహించేది ఈ 'గ్రామ పెద్దలే'. జాతీయస్థాయిలోనూ రాష్ట్రస్థాయిలోనూ ఈ పార్టీలు ప్రవచించే దళిత జనోద్ధరణకూ ఈ గ్రామాలలో వారి అనుయాయుల ప్రవర్తనకూ పోలిక ఏమీ ఉండదు.

దళితులపైన భౌతిక దాడులు కారంచేడు, చుండూరుల స్థాయిలో 1998లో జరగలేదు. కర్నూలు జిల్లా వేంపెంట మారణ కాండను వీటితో పోలుస్తూ చాలా ఆందోళన జరిగింది గాని అది ఎంత ఘోరమైన ఘటన అయినప్పటికీ ప్రాథమికంగా ఫ్యాక్షన్ స్వభావం గల ఘటన. కారంచేడు, చుండూరుల స్వభావం వేరు, దాని స్వభావం వేరు. అయినప్పటికీ రాష్ట్రంలో మొత్తం మీద దళిత ప్రజలపైన భౌతిక దాడులు తగ్గాయనడానికి ఆధారాలేమీ లేవు. బౌతిక దాడులే కాక ఇతర హక్కుల అతిక్రమణ కూడా సాగుతూనే వుంది. రిజర్వేషన్ల అమలులో ఎడతెరిపి లేకుండా పెరుగుతున్న 'బ్యాక్‌లాగ్'లు దీనికొక ఉదాహరణ. రిజర్వేషన్లు పాటించడం ఇష్టం లేకపోవడం తప్ప దీనికి వేరే కారణమేదీ లేదు. ఈ విషయంలో ఈ మధ్యకాలంలో

వార్తలకెక్కిన సంస్థ విశాఖపట్నంలోని అతి ప్రాచీన విద్యాలయమయిన ఎవిఎన్ కాలేజి. ఆ కాలేజీని ఇప్పటికీ ఒక బ్రాహ్మణ అగ్రహారంగా నడుపుతున్నారంటే అతిశయోక్తి కాదు. తప్పనిసరయి ఎస్సి, బిసి కులాలకు చెందిన వారిని అధ్యాపకులుగా తీసుకున్నా వారిని 'ఎయిడ్' లేని పోస్టులలో పార్ట్‌టైం అధ్యాపకులుగా తీసుకోవడం, 'ఎయిడ్' వచ్చి రెగ్యులరైజ్ చేసే అవకాశం ఎప్పుడొచ్చినా బ్రాహ్మణ కులస్తులకే ఆ అవకాశం ఇవ్వడం ఆ కాలేజీ యాజమాన్యానికి వాడుక అయిపోయింది. అయితే ఎయిడెడ్ కాలేజీలు మాత్రమే కాదు, విశ్వవిద్యాలయాలు సహితం ఇందుకు మినహాయింపు కాదు.

ఆదివాసీల '1 ఆఫ్ 70' ఆందోళనలు ముందుకు తెచ్చిన ఏజెన్సీ భూముల సమస్య ఈ సంవత్సరకాలంలో బలంగా ముందుకొచ్చిన మానవ హక్కుల సమస్యలలో ఒకటి. ఎందుకంటే ఏజెన్సీ భూముల సమస్య కేవలం చట్టబద్ధ పాలనకు సంబంధించిన సమస్యకాదు. అది ఆదివాసీల మనుగడకు సంబంధించిన సమస్య. అన్ని మానవహక్కుల విషయాలలాగానే ఈ విషయంలో కూడ న్యాయానికి అనుకూలంగా మాట్లాడకుండ ఉండడం ఇప్పుడెవరికీ సాధ్యం కావడం లేదు. కానీ ఆచరణలో మాత్రం ఒక్క సిపిఐ(ఎం) తప్ప వేరే ఏ పార్లమెంటరీ పార్టీ ఆదివాసీలకు అండగా లేదు. '1ఆఫ్ 70' ని ఆదివాసియేతరులకు అనుకూలంగా లోపాయికారీగా సవరించాలన్న ప్రయత్నంలోనే అందరూ తలమునకలయి ఉన్నారు. లక్ష్మీపార్వతి అయితే మొహమాటం వదిలిపెట్టి ఆదివాసీల హక్కులకు వ్యతిరేకంగా మైదాన ప్రాంతాల అగ్రకులాలవారు చేస్తున్న ధర్నాలలో పాల్గొనింది కూడ.

ఈ సమస్యను ఖమ్మం జిల్లాలో తుమ్మల నాగేశ్వర రావు చాలా నేర్పుగా పరిష్కరించేసాడని ముఖ్యమంత్రి అతనికి ఆ మధ్య కితాబు ఇచ్చాడు (ఇది అతను జింక మాంసం కేసులో ఇరుక్కోకముందు సంగతి). అతను చేసిందేమిటంటే, '1 ఆఫ్ 70' వివాదాలు లేవదీసి గిరిజనేతర రైతుల, భూముల మీదికి పోకుండ ఉంటే ప్రభుత్వ పోరంబోకులు వెతికి ఆదీవాసీలకు ఇస్తామని హామీ ఇవ్వడం. ఇది న్యాయమూ కాదు, ఆదివాసీల భూమి ఆరాటానికి జవాబూ కాదు.

ఈ నిర్దిష్టమైన విషయాలు ఒకెత్తయితే, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని చోదక శక్తిగా తీసుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని చూస్తున్న మన ముఖ్యమంత్రి ఆలోచనలు మరొకెత్తు. వెనుకబడిన దేశాలకు సహితం – 'ఐ.టి.' అవసరమే కావచ్చును గానీ అది వెనుకబాటుతనం నుండి బయట పడేయగల చోదక శక్తి కాజాలదు. అది జరగాలంటే ప్రజలకు ఉన్న ఉపాధి అవకాశాలు కాపాడాలి, లేనివారికి కొత్తగా

జీవనాధారం చూపించాలి. చేతి వృత్తుల మీద ఆధారపడే వారి జీవనాధారాన్ని రక్షించాలి. ఇవన్నీ చేస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలి. ఈ అభివృద్ధిలో పాల్గొనడానికి, ప్రయోజనం పొందడానికి అవసరమైన కనీస విద్యా, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. ఇవి లేని 'హైటెక్' ఆర్థిక విధానం మధ్యతరగతిలోని కంప్యూటర్ నిపుణులకు ఉపాధి అవకాశాలు పెంచగలదు, ఆదాయాలూ బాగా పెంచగలదు. కానీ ఆర్థిక పురోభివృద్ధిని సాధించలేదు. సాధించిన మేరకు అందులో సమతుల్యం ఉండదు.

ఒక వైపు హైదరాబాద్ పరిసరాలలో ప్రపంచమంతటి దృష్టినీ ఆకర్షించిన హైటెక్ సిటీ లేక ఇన్ఫోటెక్ సిటీని ఆవిష్కరించిన సంవత్సరమే, శుభ్రమైన తాగునీరు లేకపోవటం వల్ల, వైద్యసదుపాయాలు కొరవడం వల్ల, ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాలలో కనీసం 1000 మంది – అందులో ఎక్కువ భాగం గిరిజనులు చనిపోవడం ఈ వికృతమైన ఆర్థిక విధానానికి సంకేతం. మానవ హక్కులను కాలరాసే ఈ ఆర్థిక విధానం దుష్ఫలితాలు రాబోయే కాలంలో ఇంకా చూడబోతాం. దీనిని నిలువరించడానికి, సవరించడానికి మనం పూనుకోకపోతే రాబోయే సంవత్సరాల మానవ హక్కుల సమీక్ష మరింత విషాద భరితంగా ఉంటుంది.

జనవరి 10, 1999

# పాకిస్తాన్-భారత్‌ల మైత్రి : పీపుల్స్ ఫోరం కృషి

ప్రభుత్వాలు యుద్ధం చేస్తుంటే ప్రజలు స్నేహం చేయగలరు.

ఇది వట్టి నమ్మకంగా ఉండిపోతే గుడ్డి నమ్మకం అనిపించుకుంటుంది. నిజానికి ప్రజలలో అంతో ఇంతో ద్వేషభావం లేకుండా–లేనట్టయితే కల్పించకుండా–ప్రభుత్వాలు యుద్ధాలు చేయలేవు. కానీ దీనిని ప్రయత్న పూర్వకంగా అధిగమించి స్నేహ హస్తం అందియ్యడం సాధ్యమన్న నమ్మకం గుడ్డినమ్మకం కాదు. అదొక ఆచరణాత్మకమైన కార్యక్రమం. ఎంత ఫలితమిస్తే అంత మేలు చేసే ప్రయత్నం.

నిగాహ్

భారత్–పాకిస్తాన్‌ల విషయంలో ఈ ప్రయత్నం ఒక అయిదారు సంవత్సరాలుగా సాగుతున్నది. 'పాకిస్తాన్–ఇండియా పీపుల్స్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ' అనే ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రయత్నం జరుగుతున్నది. ఈ మధ్య పెషావర్‌లో జరిగిన నాల్గవ వార్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, రూపొందించుకున్న కార్యక్రమాలను బట్టి చూస్తే ఇది నాలుగు కాలాల పాటు నిలబడే ప్రయత్నంగానే కనిపిస్తుంది.

మొదలు పెట్టినప్పుడు ఎవరూ అనుకోలేదు. కాశ్మీర్ విషయంలో ఇరు దేశాలూ మొండి వైఖరి అనుసరించి కాశ్మీరీలకు చాలా నష్టం చేయడమే కాక, తమ మధ్య ఉండగల ఆర్థిక పారిశ్రామిక సంబంధాలకూ సాంఘిక సంబంధాలకూ చాలా నష్టం చేసుకుంటున్నాయన్న ఆవేదనతో భారతదేశానికి చెందిన పిడికెడు మంది మానవ హక్కుల కార్యకర్తలూ వారి పాకిస్తానీ సహచరులూ "ఏదో ఒకటి చేస్తే బాగుంటుంది' అంటూ ఈ ప్రయత్నం మొదలుపెట్టారు.

'ఈ రెండు దేశాలూ యుద్ధం చేసుకోవలసిన అగత్యమేమీ లేదు' అనే సంక్లిష్టమయిన నినాదంతో ఈ ప్రయత్నం ప్రారంభమయింది. ఆర్థికంగా, సాంస్కృతికంగా

భారత్–పాకిస్తాన్‌ల మధ్య సామాన్య లక్షణాలు, అవసరాలు చాలా ఉన్నాయి. నిజానికి సాంస్కృతికంగా ఎంత సారూప్యత ఉందనేది దక్షిణ భారతదేశంలో ఉండే మనకు సులభంగా అర్థంకాదు. ఆర్థికంగా కూడ దేశ విభజన కృత్రిమమైన ఎల్లలు సృష్టించకుండా ఉండి ఉంటే మన గుజరాత్, పంజాబ్, జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రాలతో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ సన్నిహితంగా ముడి పడి ఉండేది. శాంతి ఉంటే ఈ ఆర్థిక సాంఘిక సంబంధాలను పునరుద్ధరించుకొని ఇరు దేశాలూ చాలా ప్రయోజనం పొందవచ్చు.

అంతేకాకుండా యుద్ధ ప్రమాదం పేరుమీద ఈ రెండు దేశాలూ విపరీతంగా ఖర్చు పెడుతున్నాయి. భారతదేశం తన జాతీయ ఆదాయంలో మూడు శాతం రక్షణ కోసం ఖర్చు పెడుతున్నది. పాకిస్తాన్ అదే మొత్తంలో ఖర్చు పెట్టాలన్నా అది ఆ దేశ జాతీయ ఆదాయంలో మరింత ఎక్కువ శాతం అవుతుంది. ఈ రెండు దేశాలూ విద్యమీదగానీ, వైద్యం మీదగానీ, సాంఘిక సంక్షేమం మీదగానీ అందులో పావువంతు కూడా ఖర్చు పెట్టలేకపోతున్నాయి. ఈ రకంగా చూసినా శాంతి కోసం కృషి చేయడం ఇద్దరికీ మంచిదే.

కానీ ఈ రెండు దేశాల పాలకులకే ఈ కృషిని వదిలేస్తే అది ఎప్పటికీ జరగదు. యుద్ధ వాతావరణాన్ని కొనసాగించడంలో వాళ్ల ప్రయోజనాలు వాళ్లకున్నాయి. అందువల్ల ప్రజల వైపునుండి చొరవ అవసరం అన్న అవగాహనతో ఈ ప్రయత్నం మొదలయింది.

'శాంతి'తో పాటు 'ప్రజాస్వామ్యం' అనే అంశాన్ని కూడ చేర్చాలని ఇరు దేశాల ప్రతినిధులూ మొదట్లోనే అంగీకరించారు. దేశంలోపల ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటేనే శాంతికోసం ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టే అవకాశం ప్రజలకు ఉంటుంది. ఆ విధంగా ఈ వేదిక 'ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ' అనే పేరుతో ఆవిర్భవించింది. పేరుకు 'పీపుల్స్ ఫోరం' అని ఉన్నా ప్రస్తుతానికి ఇందులో ఎక్కువగా పాల్గొంటున్నది పట్టణ ప్రాంత మధ్యతరగతి బుద్ధి జీవులే. ఒక చెప్పుకోదగ్గ తేడా ఏమిటంటే భారతదేశంలో ఈ వేదిక సభ్యులు ఎక్కువగా మానవ హక్కుల కార్యకర్తలు, సర్వోదయవాదులు, ఇతర రాజకీయ కార్యకర్తలు కాగా, పాకిస్తాన్‌లోని సభ్యులలో మానవ హక్కుల కార్యకర్తలతో పాటు వ్యాపారస్తులు చాలామంది ఉన్నారు. ఈ రెండు దేశాల మధ్య శాంతి స్థాపన ఆర్థికంగా మనకంటే పాకిస్తాన్‌కు మరింత అవసరం అని ఇది బహుశా సూచిస్తుందేమో.

ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వానికి ప్రాతిపదికగా ఇప్పటికే చాలా ప్రచారం జరిగి ఉంది కాబట్టి అది అసత్యం అని ప్రజలకు నచ్చజెప్పడం వేదిక తన మీద

వేసుకున్న ఒక ముఖ్య భారం. స్నేహంగా ఉంటే ఇద్దరమూ ఎంత పొందగలమో, లేకపోవడం వల్ల ఇద్దరమూ ఎంత కోల్పోతున్నామో ప్రజలకు వివరించి చెప్పడం మరొక ముఖ్య కర్తవ్యం. ఇవేవీ సులభమైన పనులు కావు. ఎందుకంటే భారతదేశ చరిత్ర గురించి, జాతీయోద్యమం గురించి, దేశ విభజన గురించి, హిందూ ముస్లిం విభేదాల గురించి, అన్నిటికీ మించి కాశ్మీర్ గురించి ఇరు దేశాలలోనూ బలంగా ప్రచారం అయి ఉన్న విద్వేష పూరితమైన అభిప్రాయాలతో ఈ అసత్యాలు ముడి పడి ఉన్నాయి. ఈ అభిప్రాయాలను ప్రచారం చేయడం తన రాజకీయ కర్తవ్యంగా పెట్టుకున్న ముస్లింలీగ్, జమాతె ఇస్లామీలు పాకిస్తాన్ రాజకీయ సామాజిక జీవితంలో తొలినాటి నుండి బలమైన శక్తిగా ఉండగా, ఇక్కడ అదే కర్తవ్యం పెట్టుకున్న హిందూత్వ వాదులు గడచిన దశాబ్ద కాలంలో చాలా బలపడ్డారు. వీరి ప్రతిఘటనను అధిగమించి ఈ రెండు దేశాలమధ్య శాంతి సుహృద్భావాల వాతావరణాన్ని నిలబెట్టడానికి కృషి చేయడం పెద్దపనే. కానీ అది జరగనిదే ప్రభుత్వాల మీద తమ విధానాలు మార్చుకోవాలన్న ఒత్తిడి ఉండదు.

ఇప్పటికే 'పీపుల్స్‌ఫోరం' నిర్వహించిన నాలుగు వార్షిక సభలలో–తొలుత ఢిల్లీలో, తరువాత లాహోర్‌లో, తరువాత కలకత్తాలో, తరువాత పెషావర్‌లో–రెండు దేశాల నుండి దాదాపు 400 మంది సభ్యులు హాజరయ్యారు. రెండు దేశాల మధ్య పారిశ్రామిక, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక సంబంధాల గురించి, యుద్ధ ప్రమాదం గురించి, అంతర్గత ప్రజాస్వామ్యం గురించి, కాశ్మీర్ గురించి, ఒక్కొక్క సెషన్‌లోనూ వివరంగా చర్చలు జరిపారు. శాంతి సుహృద్భావాలను పెంపొందించడానికి ఒక్కొక్క రంగంలోనూ ఏమి చేయవచ్చునో గుర్తించి తదనుగుణంగా తీర్మానాలు చేసారు.

ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శించే అవకాశం మన దేశంలో ఇప్పటికింకా ఉంది. ( హిందుత్వవాదులు ఇంకొన్నాళ్లు అధికారంలో కొనసాగితే అది కూడ ఉండకపోవచ్చుననడానికి ముంబాయి నగరంలో బాల్‌థాకరే నెలకొల్పిన రాజ్యం సూచిస్తుంది. ) పాకిస్తాన్‌లో అదంత సులభం కాదు. ముఖ్యంగా కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ పాలక విధానాలను బహిరంగంగా విమర్శించడం అక్కడ కష్టం. అయినప్పటికీ పాకిస్తానీ ప్రజాతంత్ర వాదులు ఈ వేదికలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఉత్సాహం గొలిపే విషయం. అయితే ప్రస్తుతానికి రెండు దేశాలలోనూ వేదిక ప్రచారం రాష్ట్రాల రాజధాని నగరాలను దాటి కిందకి దిగలేదు. దానిని కిందికి తీసుకుపోవలసిన కర్తవ్యం శాంతి కాముకులందరి మీదా ఉంది.

అణుబాంబు ప్రయోగం 'పీపుల్స్ ఫోరం'కు ఒక పరీక్షగా నిలిచింది. భారతదేశం అణు పరీక్ష నిర్వహించడం, పాకిస్తాన్ దానికి జవాబుగా తాను కూడా నిర్వహించడం రెండు దేశాలలోని ప్రజాతంత్ర వాదులకు ఒక సవాలు విసిరింది. పీపుల్స్ ఫోరం ఈ సవాలును విజయవంతంగా ఎదుర్కొందనే చెప్పాలి. రెండు దేశాలలోనూ 'పీపుల్స్ ఫోరం' బాధ్యులు వెంటనే స్పందించి ఈ పోటాపోటీ అణు విస్ఫోటనాలు అనవసరమైన ప్రయోగాలని అభిశంసించారు. గుజ్రాల్ భారత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నెమ్మదిగా ప్రారంభించిన చర్చల ప్రక్రియను ఈ ప్రయోగాలు వెనక్కి తీసుకుపోయాయనీ ఇరు దేశాల మధ్య శాంతి సుహృద్భావాలు నెలకొనే సుదినాన్ని కనీసం ఒక దశాబ్దం వెనక్కి నెట్టాయనీ విమర్శించారు.

పీపుల్స్ ఫోరంలో రెండు దేశాలలోనూ ప్రభుత్వంలో ఒకప్పుడు ముఖ్య పదవులు నిర్వహించిన పెద్దలు కొంతమంది ఉండడం వల్లనేమో, ఇప్పటి దాకా వీసా పాస్‌పోర్ట్‌ల విషయంలో రెండు ప్రభుత్వాలూ వేదికను ఇబ్బంది పెట్టడం లేదు. కానీ అంతకు మించి వేదిక తీర్మానాలకూ డిమాండ్లకూ స్పందించడం లేదు. ప్రజలలో ఈ అభిప్రాయాలు బలంగా నెలకొనేదాకా స్పందిస్తారని ఆశించడానికి ఆస్కారం కూడా లేదు.

నిగాహ్

జనవరి 24, 1999

# 'తుమ్మల' ఫార్ములా ఆదివాసులను సంతృప్తి పరచేనా?

పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివాసీల '1 ఆఫ్ 70' పోరాటాన్ని ఏవిధంగా ఎదుర్కోవాలో అర్థం కాక అధికారులు, గిరిజనేతర పెద్దలూ సతమతమవుతుండగా పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి ఎంఎల్ఏ తుమ్మల నాగేశ్వరరావు అక్కడి ఆదివాసీల ఆందోళనకు సమాధానం కనుక్కొని ఉద్రిక్తతలను చల్లార్చాడనీ అతని 'ఫార్ములా'ను పశ్చిమ గోదావరిలోనూ అమలు చేయాలనీ మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సహచరుడికి కొంత కాలం కింద కితాబు ఇచ్చిన సంగతి పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి.

నిగాహ్

అంత ప్రముఖంగా ప్రచురించని విషయం ఏమిటంటే, తరువాత కొంత కాలానికి తుమ్మలవారి స్వంత ఊరయిన గండుగుల పల్లిలోనే వారి స్వంత భూమిలోనే (లేదా వారు స్వంతమని భావిస్తున్న భూమిలోనే) 26 ఎకరాలలో వరి కుప్పలు కొట్టడానికి వీలులేదని ఆదివాసీలు ఆందోళనకు దిగారు. అందులో ప్రభుత్వ భూమి చాలా ఉందనీ షెడ్యూల్డు ప్రాంతంలో ప్రభుత్వ భూమి గిరిజనేతరులకు చెందడానికి వీలు లేదు కాబట్టి దానిని గుర్తించి తుమ్మల కుటుంబం స్వాధీనం నుండి దానిని తొలగించి ఆదివాసీలకు పంచాలని డిమాండ్ చేసారు. డిసెంబర్ 3వ వారంలో మొదలయిన ఆందోళన నాకు తెలిసి ఇప్పటికీ ముగియలేదు. పొలంలోని కుప్పలు ఎక్కడున్నవి అక్కడే ఉన్నాయి.

ఆర్థికంగా ఇది 'తుమ్మల' కుటుంబానికి పెద్దదెబ్బేం కాదు. ఇప్పుడంటే వాళ్లు భూములు పంచుకున్నారు గానీ ఒకప్పుడు 500 ఎకరాల భూమి ఉన్న కుటుంబం వారిది. అందులో ఇప్పుడు ఆదివాసీలు ఆపిన 26 ఎకరాలు ఒకరిద్దరి వాటాకు వచ్చిన భూమి కావచ్చు. ఆ ఒకరిద్దరిని కష్టకాలంలో మిగిలిన వాళ్లు ఆదుకోగలరు. కానీ వారి 'ప్రతిష్ట'కూ వారి ముఖ్యమంత్రి గారి 'ప్రతిష్ట'కూ ఇది దెబ్బే. అయితే

ఇంతా చేసి తుమ్మల ఫార్ములా ఏమిటి? షెడ్యూల్డు ప్రాంతాలలోని తమ భూములను గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆదివాసీలు ఆందోళన చేస్తున్నారు. దీనిని ఆదివాసీలు రెండు స్థాయిలలో అర్థం చేసుకుంటున్నారు. ఒక అర్థంలో 'అక్రమం' అంటే చట్టవిరుద్ధం అని. 1916లో బ్రిటిష్ పాలకులు ఏజెన్సీ ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం చేసినప్పటి నుండి షెడ్యూల్డు ప్రాంతాలలో ఆదివాసుల భూములు బయటివారి ఆధీనంలోకి యథేచ్ఛగా పోకుండా నియంత్రించే ఆధికారం ప్రభుత్వానికి ఉంది. 1970లో ఈ చట్టాన్ని సవరించి చాలా బలం చేకూర్చారు. ఆ సవరణనే '1 ఆఫ్ 70' అంటారు. ఒక అర్థంలో ఆదివాసీలు ఆందోళన చేస్తున్నది '1 ఆఫ్ 70' అమలు గురించి. అయితే ఆదివాసీల పోరాటానికి అంతకంటే లోతైన అర్థం కూడా ఉంది. అడవి తమది, అడవి భూమి తమది. అడవి భూమి గిరిజనేతరుల చేతిలోకి చట్టవిరుద్ధంగా పోవడమేకాదు, 'చట్టబద్ధంగా' పోవడం అనేదాన్ని కూడా ఈ దృక్పథం ఆమోదించదు. ఆదివాసీల పోరాటంలో ఈ రెండు అర్థాలు కలగలిసి ఉన్నాయి. ప్రభుత్వ అధికారులతోనూ పత్రికలవారితోనూ మాట్లాడేటప్పుడు చట్టం పరిధిలో మాట్లాడడం శ్రేయస్కరం కాబట్టి ఆ పరిధిలోనే మాట్లాడుతారుగానీ ఏ కొంచెం సానుభూతి చూపించినా 'అడవి మాది, అడవి భూమి మాది' అన్న ధ్వనితో మాట్లాడతారు.

తుమ్మల 'ఫార్ములా' ఏం చేస్తుందంటే ఈ రెండు అర్థాలూ కాక మూడవ అర్థానికి ఆదివాసీల ఆరాటాన్ని కుదించాలని చూస్తుంది. షెడ్యూల్డు ప్రాంతంలోని గిరిజనేతరుల పట్టా భూమిలో ఒక్కొక్క సర్వేనెంబరును తీసుకొని 'ఇది ఎప్పుడు మీ చేతిలోకి వచ్చింది? ఎవరి చేతి నుండి మీ చేతిలోకి వచ్చింది?' అని విచారించే పద్ధతిని ('1 ఆఫ్ 70' ఇటువంటి విచారణకు అవకాశం కల్పిస్తుంది) మానుకొమ్మని ఆదివాసీలకు తుమ్మల నాగేశ్వరరావు హితవు. జరిగిందేదో జరిగిపోయింది. దానినిప్పుడు తవ్వి తీయొద్దంటాడు. అయితే ప్రభుత్వ భూమి షెడ్యూల్డు ప్రాంతంలో ఎక్కడయినా ఎంత పెద్దమొత్తంలోనయినా గిరిజనేతరుల చేతిలో ఉంటే, దానిని మాత్రం వెలికితీసి ఆదివాసీలకే ప్రభుత్వం పంచుతుందనీ దానితో ఆదివాసీలు సంతృప్తి చెందాలనీ అంటాడు.

'పట్టా భూముల గురించి '1 ఆఫ్ 70' వివాదాలు లేవదీయొద్దు. పోరంబోకులు ఎవరి దగ్గరున్నా తీసి మీకిస్తాం' అన్న ఇతని పరిష్కారం నిజానికి కొత్తది కాదు. దాదాపు మూడేళ్లుగా పోరుగున్న ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం ప్రాంతాలలో నడుస్తున్న ఆదివాసీల ఆందోళనకు జవాబుగా ఆ జిల్లా అధికార యంత్రాంగం సహితం ఈ పరిష్కారాన్నే సూచించింది. ఎటొచ్చీ ఆదివాసీలు దానితో సంతృప్తి చెందలేదు. తమ హక్కులు తాము

నిగాహ్

వదులుకోవలసిన అవసరం లేదని భావించారు. మరి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల ఆదివాసీలు ఈ 'తుమ్మల ఫార్ములా'ను ఆమోదించారా అంటే వారిచ్చే జవాబు ఏమిటంటే, తమ పోరాటం ఇంకా తొలిదశలో ఉంది కాబట్టి ప్రస్తుతానికి ప్రభుత్వ భూములను విముక్తి చేసే కార్యక్రమాలను మాత్రమే పెట్టుకున్నామనీ పోనుపోను జీలుగుమిల్లి ఆదివాసీల లాగ పట్టా భూములపైన '1 ఆఫ్ 70' పోరాటం కూడ చేపడతామనీ అంటారు.

నిజానికి ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమినంతా వెలికి తీసినా అది ఆదివాసీల భూమి దాహాన్ని ఏ మాత్రం తీర్చదు. దానికే పరిమితమై తమ హక్కులను వదులుకోవలసిన అవసరమూ ఆదివాసీలకు లేదు. అంతే కాకుండా ఇక్కడున్న ఇంకొక ప్రమాదం ఏమిటంటే ప్రభుత్వ భూముల స్వాధీనానికి మాత్రమే ఆదివాసీలు పరిమితమయినట్టయితే వారి పోరాటం గిరిజనేతర చిన్నరైతులతోనూ ఎస్‌సి బిసి కులాలతోనూ ప్రధానంగా జరిగే ప్రమాదం ఉంది. పెద్ద రైతుల కబ్జాలో ప్రభుత్వ భూములు లేవని కాదు. కాని వారి దగ్గర అవే కాక పట్టా భూములూ విస్తారంగా ఉన్నాయి. ప్రభుత్వ భూములను ఆదివాసీలకు ఇచ్చేయమంటే వారు ఉదారంగా ఇచ్చేస్తారు కూడా. ప్రభుత్వ భూములు మాత్రమే–లేక అవే ప్రధానంగా –ఉన్నవారు ఎస్‌సి బిసి కులాలకు చెందిన చిన్న రైతులు. వారికీ ఆదివాసీలకూ తగాదా పెట్టడం తప్ప 'తుమ్మల ఫార్ములా' సాధించేది పెద్దగా ఏమీ ఉండదు. అతని ఉద్దేశ్యం అదే అవునో కాదో అతనే చెప్పుకోవాలి.

అదట్లాగుంచి, నిజంగా ఈ రోజు ఆదివాసీలలో మేల్కొన్న ఆకాంక్షలకు జవాబు చెప్పాలంటే '1 ఆఫ్ 70' కూడ సరిపోదు. అంటే చట్టవిరుద్ధంగా గిరిజనేతరులకు పట్టా అయిన భూమినంతా వెలికి తీసి ఆదివాసీలకు అప్పగించినా అది ఆదివాసీల భూమి సమస్యను పరిష్కరించదు. అదివాసీలలో చదువుకున్న కొత్త తరం ముందుకొచ్చి తమ అవసరాల గురించి బలంగా ఆందోళన చేసే కొద్దీ ఈ సమస్య రాబోయే రోజులలో తీవ్రరూపం తీసుకోనుంది. ఆదివాసీల భూమి సమస్యను ఎం.ఎల్. పార్టీలు వ్యక్తం చేసినప్పుడు వారి సాయుధ పోరాట వ్యూహాన్ని కారణంగా చూపించి ప్రభుత్వం అణచివేత ప్రయోగించింది. ఇప్పుడు ఆదివాసీలే తమ కొత్త చైతన్యము, సంఘటితమైన పట్టుదల తప్ప వేరే ఏ ఆయుధమూ లేకుండ ఉద్యమిస్తున్నారు. వారినిప్పుడు అణచివేయడానికి ప్రభుత్వం దగ్గర సాకులూ లేవు. అట్లాగని వారి ఆకాంక్షలకు జవాబు వెతికే రాజకీయ సంస్కారమూ లేదు. 'తుమ్మల ఫార్ములా' వంటి చిట్కాలు చూపించి తాత్కాలికంగా కాలక్షేపం చేసే విజ్ఞతే మన పాలకుల దగ్గరున్నది.

# చట్టాన్ని కదిలించే హక్కు కార్మికులకే ఎందుకివ్వకూడదు?

రెండవ జాతీయ లేబర్ కమిషన్‌ను నియమిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య ప్రకటించింది. 'ప్రస్తుత పరిస్థితులకు' తగినటువంటి కొత్త చట్టాలనూ, చట్ట సవరణలనూ సూచించమని ప్రభుత్వం ఆ కమిషన్‌ను అడగనుంది.

ఇప్పుడున్న చట్టాల అమలు గురించి ప్రభుత్వం కొంచెం ఆలోచిస్తే బాగుండునని చాలా మంది కార్మికులు బహుశా అంటారేమో. ఇప్పుడున్న చట్టాలు కార్మికులకు సంపూర్ణమైన భద్రత, సగౌరవంగా బతకడానికి అవసరమైన జీవన ప్రమాణం కల్పించకున్నా కొన్ని ముఖ్యమైన హక్కులయితే కల్పించాయి. కానీ వాటి అమలు చాలా అధ్వాన్నంగా ఉంది.

దీనికి అనేక కారణాలున్నాయి. కానీ వాటిలో ముఖ్యమైనదేమిటంటే తమకు చట్టంలో ఉన్న హక్కుల అమలు కోసం నేరవిచారణ వ్యవస్థను కదిలించే హక్కు కార్మికుల చేతిలో లేకపోవడమేనని చెప్పాలి. కార్మికుల హక్కుల అతిక్రమణను నేరంగా నిర్వచించిన చట్టాలలో సహితం ఆ నేరాన్ని గురించి నేరుగా పోలీసులకు గానీ న్యాయస్థానానికి గానీ ఫిర్యాదు చేసి న్యాయం పొందే అవకాశం కార్మికులకు లేదు.

ఉదాహరణకు ఏదైనా ఒక గనిలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడానికి ప్రభుత్వం దగ్గర లైసెన్స్ పొందకుండా ఏ యాజమాన్యమూ కాంట్రాక్ట్ కార్మికులను నియమించకూడదని కాంట్రాక్ట్ కార్మికుల (రద్దు, నియంత్రణ) చట్టం అంటుంది. ఆ పని చేస్తే 3 నెలల జైలు శిక్ష వేయవచ్చునని కూడ అంటుంది. కానీ ఒక యజమాని ఆ పనిచేస్తే చట్టవిరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికులుగా నియమించబడిన కార్మికులు అతనిపైన పోలీస్ స్టేషన్‌లోగానీ కోర్టులో గానీ ఫిర్యాదు చేసి అతనిని జైలులో

పెట్టించలేరు. అసలు వారికి కేసు పెట్టే హక్కేలేదు. 'అయ్యా కేసు పెట్టండి' అని కార్మిక శాఖ అధికారులను కార్మికులు అడుక్కోవాలి. వారు పెడితేనే కేసవుతుంది.

ఒక్క కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోనే కాదు, దాదాపు అన్ని కార్మిక చట్టాలలోనూ ఈ పరిస్థితి ఉంది. తమ హక్కుల రక్షణ కోసం అందరూ నేరుగా న్యాయస్థానాల దగ్గరికి పోగలరు గానీ ఒక్క కార్మికులు మాత్రం పోలేరు. పారిశ్రామిక ఉత్పత్తి నిరంతరాయంగా సాగడం దేశప్రగతికి అవసరం కాబట్టి దానికి ఆటంకం కలిగించే పరిస్థితి రాకుండా కార్మిక–యాజమాన్య వివాదాలను పరిష్కరించాలన్నది కార్మిక చట్టాల వైఖరి. పారిశ్రామిక ఉత్పత్తి వల్ల దేశ ప్రగతికి మేలేమీ జరగదని కాదుగానీ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అంతకంటే ప్రాథమికంగా అది పెట్టుబడి దార్లకు లాభాలు సాధించిపెట్టే సాధనం. కానీ కార్మిక యాజమాన్య వివాదాలలో వీరే యజమానులు. అంటే వివాదంలో ఒక పక్షం ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో వివాదాన్ని పరిష్కరించాలనీ రెండవ పక్షం హక్కులు కాపాడాలనీ చట్టం భావిస్తుంది. ఈ వైఖరి రెండవ పక్షానికి తరచుగా అన్యాయం చేయగలదని గుర్తించడానికి పెద్దగా వివేచించనక్కరలేదు.

దీనిని సాధించడానికి 'చట్టాన్ని కదిలించే బాధ్యత'ను బాధితుల చేతి నుండి తీసేసి ప్రభుత్వ అధికార్ల చేతిలో పెట్టారు. వాళ్లు తొందరపడి కేసులు పెట్టి యాజమాన్యాలను చికాకు పెట్టకుండా (తద్వారా పారిశ్రామిక శాంతికి భంగం కలిగించకుండా) 'సంయమనం' పాటిస్తారు. అంటే యాజమాన్యాలు చేసే అనేక నేరాలు చట్టం కళ్లలో పడవు. నిజానికి ఈ కార్మిక శాఖ అధికారులు (అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌లు, ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్లు, ఇతర కార్మిక చట్టాల కింద నియమితులైన ఇన్స్‌పెక్టర్లు) ఎక్కువగా చేసే పని యజమానులను బుజ్జగించడం, ప్రాధేయపడడం. 'ఇంకొకసారి ఈ నేరం చేయొద్దు' అని హెచ్చరించడం (మాకు కూడా ఇటువంటి సదుపాయాలు ఉంటే ఎంత బాగుంటుందని జేబు దొంగలు అనుకుంటారేమో!) 'ఈసారి చేస్తే కఠిన చర్య తీసుకుంటాను' అని ఊరికే బెదిరించడం, కార్మికుల అభియోగానికి జవాబు చెప్పమని యాజమాన్యాలకు నోటీసు జారీ చేయడం, ఆ నోటీసుకు జవాబు చెప్పకపోతే మళ్లీ నోటీసు ఇవ్వడం, లేదా మరీ ఒళ్లు మండితే వారిని తీవ్రంగా అభిశంసిస్తూ ఆర్డర్ జారీ చేయడం–దీనితో వారి సమయం గడిచిపోతుంది. ఏ చర్యా తీసుకోకుండా ఫైళ్ల మీద ఫైళ్లు పోగుచేయడంలో కార్మికశాఖ అధికార్లకు ఎవ్వరూ పోటీ రాలేరు.

చట్టాల వైఖరిలోనే ఉండే ఈ లొసుగు కాక కార్మికశాఖలోని అవినీతి మరొక పెద్ద ప్రతిబంధకం. మన ఇంట్లో ఒక దొంగతనం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

పోలీసుల నిర్లక్ష్యం వల్ల గానీ అవినీతి వల్లగానీ చర్యతీసుకోకపోతే మనమే స్వంతంగా కోర్టులో కేసు వేసుకోవచ్చు. అందులో ఆచరణలో ఎన్ని సమస్యలున్నా కనీసం సాధారణ నేరాల విషయంలో ఈ ప్రత్యామ్నాయం పౌరులకు ఉంది. కార్మికులకు మాత్రం లేదు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరించే యజమానులపైన కేసు పెట్టి ప్రాసిక్యూట్ చేయవలసిన బాధ్యతను కార్మికశాఖ అధికారులు డబ్బులు తిని నిర్లక్ష్యం చేస్తే కార్మికులు స్వంతంగా కేసు పెట్టలేరు. వాళ్ల చుట్టూ పదిసార్లు తిరిగి విసిగిపోయి ఊరుకోవాలి. లేదంటే వారి విధి నిర్వహణ బాధ్యత వారికి జ్ఞాపకం చేయడానికి హైకోర్టులో కేసువేయాలి. అది ఖర్చుతో కూడుకున్న విషయం కాబట్టి కార్మికులందరికీ సాధ్యం కాదు. సాధ్యపడినా మన హైకోర్టులు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వకుండా వారి విజ్ఞప్తి పరిగణనలోకి తీసుకొని 'తగిన చర్య తీసుకోండి' అంటూ ఆర్డర్లు జారీ చేస్తాయి. అటువంటి ఆదేశాలకు భయపడే బాపతయితే అధికార్లు మొదటే తమ డ్యూటీ చేసి ఉండేవారు కదా!

పైగా ఏ సాధారణ నేరస్తుడూ పోలీసులకు ఇవ్వలేనంత పెద్ద మొత్తంలో లంచాలను కంపెనీల యజమానులు కార్మికశాఖ అధికారులకు ఇవ్వగలరు. అందుకే ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ ఏం చేస్తుంటాడని అడిగితే అప్పుడప్పుడొచ్చి కూల్‌డ్రింకులు తాగి సేఠ్ ఇచ్చిన 'కవర్' జేబులో పెట్టుకొని పోతుంటాడని కార్మికులు అంటుంటారు.

మనది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కాబట్టి పరిశ్రమల యజమానుల లాభార్జనను చట్టం లెక్కలోకి తీసుకోకుండా ఉండాలని కోరుకోవడంలో బహుశా అర్థం లేదేమో. అయితే దేశ ఉత్పత్తి అవిచ్ఛినంగా సాగాలన్న అవసరం పేరిట ఈ వైఖరిని చట్టంలోకి ప్రవేశపెట్టారు కాబట్టి ఈ ఉత్పత్తి పట్ల పెట్టుబడిదార్లకెంత 'బాధ్యత' ఉంటుందో కార్మికులకూ అంత బాధ్యత ఉంటుందని గుర్తించాలని కోరడం అసమంజసం కాదు. వాళ్లకది లాభార్జనకు సాధనమయితే వీళ్లకు జీవనాధారం. కార్మికులు మాత్రం ఉత్పత్తి పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తిస్తారని ఎందుకనుకోవాలి? యజమానుల నేరాల గురించి చట్టాన్ని కదిలించే హక్కు కార్మికుల చేతులలో పెట్టేస్తే ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమయి పోతుందని భావించవలసిన అవసరమేముంది? 'దేశ ఉత్పత్తి' పేరిట కాపాడదలచుకున్నది పెట్టుబడిదార్ల నేరాలనయితే తప్ప ఇది అవసరం కాదు.

రెండవ జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్న సందర్భంలో చాలా కాలంగా కార్మిక ఉద్యమం పెడుతున్న ఈ విమర్శను పునశ్చరణ చేసుకుంటున్నాము గానీ జాతీయ లేబర్ కమిషన్ ఏర్పాటుకు, దీనికీ ఏ సంబంధమూ ఉందని ఎవరూ అనుకోవడం లేదు. ప్రభుత్వం ఉద్దేశ్యం ఇప్పటికీ కార్మిక చట్టాలలో ఉన్న లొసుగులను సవరించడం కాదు. 'ప్రస్తుత పరిస్థితులకు' తగినట్టి సవరణలు చేయడం అంటే ఆర్థిక సరళీకరణకూ

గ్లోబలైజేషన్‌కూ తగిన రీతిలో కార్మిక చట్టాలను సవరించడం. దానికి కావలసింది కార్మికుల కుండే భద్రతను తగ్గించి యాజమాన్యాల 'స్వేచ్ఛ'ను పెంచడం. అంటే కార్మికులు మరింతగా అసంఘటిత రంగంలోకి నెట్టబడుతున్న సరళీకరణ క్రమాన్ని చట్టబద్ధం చేయడం. ఈ పాపానికి పరిహారంగా 'అసంఘటిత రంగ' కార్మికుల హక్కుల గురించి కొత్త ప్రతిపాదనలు కూడా జాతీయ లేబర్ కమిషన్ నుండి కోరబోతున్నారంట!

# రద్దు చేయాల్సింది ప్రభుత్వాలను కాదు, హింసను!

లక్ష్మణ్‌పూర్–బాతె, రుఖ్‌సాగర్ భీగా, నారాయణ్‌పూర్... అంతకు ముందు పారస్‌భీగా, పిప్రా, బెల్చి... మధ్యలో దలాల్‌చక్, బథానీటోలా, హైబస్‌పూర్...

ఇది బీహార్‌లో కుల పెత్తనం లిఖిస్తున్న రక్త సిక్తమయిన చరిత్ర. నిజానికి ఈ హత్యలు దాదాపు నిత్యం జరుగుతుంటాయి. కాని హతుల సంఖ్య రెండంకెలలో ఉన్నప్పుడే అది బీహార్ బయట వార్త అవుతుంది. అప్పుడు కొంత దుమారం చెలరేగుతుంది. అందరూ కొన్ని రోజులు బీహార్ గురించి మాట్లాడుతారు. అయితే బీహార్ గ్రామీణ జీవితంపైన దీని ప్రభావమేమీ ఉండదు. అది ఎప్పటిలాగే సాగుతుంటుంది.

ఈ సారి గొడవ ఇంకొంచెం దూరం పోయి రబ్రీదేవి ప్రభుత్వం బర్తరఫ్ అయింది. రుఖ్‌సాగర్ భీగాలో జనవరి, 25న, నారాయణ్‌పూర్‌లో ఫిబ్రవరి 11న జరిగిన హత్యాకాండలు రబ్రీదేవి ప్రభుత్వానికి పీకలమీదికి తెచ్చాయి. ఆమె ప్రభుత్వమైనా ఆమెకు ముందు లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వమైనా రణబీర్ సేనను ఆపడానికి ఏమీ చేయలేకపోయాయనేది సత్యమే. చేయలేకపోవడమే కాదు, చేసే ప్రయత్నమూ చేయలేదన్నా అది అతిశయోక్తి కాదు. కానీ ఇప్పటికి బీహార్‌ను పాలించిన ఏ ప్రభుత్వం ఏ 'సేన'ను అదుపు చేసిందని ఈ రోజు రబ్రీదేవిని అనడానికి?

1980లలో మొట్టమొదట భూమిసేన గురించి విన్నాం. తరువాత లోరిక్‌సేన, బ్రహ్మర్షిసేనల గురించి విన్నాం. ఈ తరువాత వచ్చాయి సన్‌లైట్‌సేన, సవర్ణ లిబరేషన్ ఫ్రంట్. చివరిగా వచ్చింది రణబీర్ సేన. దాదాపు 20 ఏళ్లుగా ఇది సాగుతూ ఉంది. ఈ 20 ఏళ్లలో అన్ని పార్టీలూ బీహార్‌ను పరిపాలించాయి. ఏ పార్టీ వాటిని ఆపలేకపోయింది. ఆపే ప్రయత్నమూ చేయలేదనే చెప్పాలి. ఆ రాష్ట్రాన్ని పరిపాలించిన

రాజకీయ పార్టీల ఎజెండాలో ఈ విషయం లేదు. వారి పరిపాలన లక్ష్యాలలో పెత్తందారీ కులాల హింసాకాండ నుండి దళితులనూ, పేదలనూ కాపాడడం అనే అంశం లేదు. అందుకోసం ప్రభుత్వాలను రద్దు చేసేటట్టయితే బీహార్‌లో ఆరు నెలలకొకసారి ప్రభుత్వాన్ని రద్దు చేయవలసి ఉంటుంది.

ఈ హింసను అరికట్టే అజెండా ఏ పార్టీకి లేకున్నా దానిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే అజెండా మాత్రం అన్ని పార్టీలకూ ఉంది. జనతాపార్టీ హయాంలో బెల్చీలో దళితుల ఊచకోత జరిగినప్పుడు ఆ గ్రామానికి మోటార్ బండ్లయినా పోగల మార్గం లేదని విని ఇందిరాగాంధీ ఏనుగెక్కిపోయింది. ఇది ఒక రకంగా వాడుకోవడం, ఇంకొక రకంగా ఈ సేనలతో సంబంధాలు పెట్టుకొని తమ బలం పెంచుకోవడం. రణబీర్ సేనతో భారతీయ జనతా పార్టీకి ఉండే సంబంధం దీనికొక ఉదాహరణ. రుఖ్‌సాగర్ భీగా, నారాయణ్‌పూర్ హత్యాకాండల్ని బిజెపియే రణబీర్ సేనను ఉపయోగించుకొని చేయించిందనీ, చాలా కాలంగా రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దు చేయడం కోసం ఎప్పుడు అవకాశం దొరుకుతుందా అని ఎదురుచూస్తున్న బిజెపి-సమతా పార్టీల కూటమి ఈ విధంగా కుట్రపన్ని అవకాశాన్ని కల్పించుకుందనీ లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన అభియోగం నిజం కావచ్చు, కాకపోవచ్చును గానీ అందులో అసంభవమేమీ లేదు. రణబీర్ సేనకు బిజెపితో ఉండే సత్సంబంధం బీహార్‌లో ఒక బహిరంగ రహస్యం. మొన్నటి పార్లమెంట్ ఎన్నికలలో రణబీర్ సేన అనేక నియోజకవర్గాలలో బిజెపి-సమత అభ్యర్థులకు మద్దతు పత్రికాముఖంగా ప్రకటించింది. అదే రణబీర్‌సేన హింసాకాండను కారణంగా చూపించి అదే బిజెపి ప్రభుత్వం బీహార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడాన్ని ఏమని వర్ణించాలో అర్థం కాదు.

లాలూ యాదవ్‌నూ, రబ్రీదేవినీ వెనకేసుకురావడం కోసం నేనీ మాటలు అనడం లేదు. సామాజిక న్యాయం గురించి మాట్లాడినంతగా ఆచరణాత్మక కార్యక్రమాలు వీరి పాలనలో కనిపించవు. అయినప్పటికీ కులమే ప్రధాన రాజకీయ నుడికారమైన బీహార్‌లో బ్రాహ్మణ, భూమి హార్, రాజ్‌పుట్, కాయస్త కులాల రాజకీయ సామాజిక ఆధిక్యతను కూలదోయడంలో ఈ రాజకీయ శక్తుల పాత్ర గణనీయమైనది. వారు ఇప్పటివరకు దళితబహుజన కులాలకు ఆత్మవిశ్వాసం ఇచ్చినంతగా భౌతిక ప్రయోజనాలు కల్పించలేకపోయారనేది సత్యమే. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వ్యవస్థ దక్షిణాది రాష్ట్రాలలో ఉన్న దానిలో పదవ వంతు కూడ బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో లేదు. సాంఘిక న్యాయాన్ని గురించి మాట్లాడే పార్టీలు అధికారంలోకి వచ్చిన ఈ దశాబ్దకాలంలో కూడా ఈ విషయంలో గణనీయమైన మార్పులేదు. అయినప్పటికి శతాబ్దాలుగా అవిచ్ఛినంగా సాగుతున్న పెత్తందారీ కులాల ఆధిక్యతకు అడ్డుకట్ట వేయడం ద్వారా ఈ శక్తులు దళిత బహుజన ప్రజానీకానికి ఇచ్చిన ఆత్మ విశ్వాసం

స్వల్పం కాదు. రాబోయే రోజులలో అది గణనీయమైన సత్ఫలితాలనీయగలదు.

అయితే అది చాలదు. పెత్తందారీ కులాల 'సేన'ల నుండి దళితులకు రక్షణ కల్పించడానికి ప్రత్యక్షమైన కార్యక్రమం అవసరం. అదేమీ ఉన్నట్టు కనిపించదు. లేకపోగా దళిత ప్రజానీకానికి నక్సలైట్ పార్టీలు అండగా నిలబడినచోట నక్సలైట్ల వ్యాప్తిని నిరోధించే పేరిట దళిత ప్రజలను పోలీసు నిర్బంధానికి గురిచేసే విధానం గతంలో ఉన్నట్టే వీరి పాలనలోనూ ఉంది. రణబీర్ సేనను వెంటాడి పట్టుకునే విషయంలో గతంలో లాగే వీరి పాలనలోనూ అధికార యంత్రాంగంలో ఆసక్తి కనిపించదు. రాజ్యాంగం పరిధిలో అధికారం చలాయించే వాళ్లెవరైనా సరే నక్సలైట్ల హింస పట్ల ఉదాసీనంగా ఉండలేరు. ఆ హింస అప్పుడప్పుడు అవాంఛనీయమైన రూపాలు తీసుకోవడం (ఉదాహరణకు ఒక నక్సలైట్ పార్టీ మద్దతుదార్లయిన దళితులనూ పేదలనూ ఇంకో నక్సలైట్ పార్టీకి చెందిన వారు చంపడం) సానుభూతిపరులను సహితం ఇబ్బంది పెట్టే విషయమే. అయినప్పటికీ బీహార్ గ్రామీణ వ్యవస్థలోని హింసాత్మకమైన సామాజిక ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ హింసను అర్థం చేసుకొని, దానిని అరికట్టడంలో చూపించే ఉత్సాహం కంటే కొంచెం ఎక్కువ ఉత్సాహం రణబీర్ సేనను పట్టుకోవడంలో చూపిస్తే 'సామాజిక న్యాయం' అజెండాగా గల పార్టీల లక్ష్యానికి ఉచితంగా ఉండేది.

లాలూ ప్రసాద్, ములాయంసింగ్‌ల వంటి నాయకుల రాజకీయాలలోని రెండు లోపాలు ఇక్కడ ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఒకటి సాంఘిక పరిస్థితుల సంస్కరణకు సంబంధించిన నిర్మాణాత్మక కార్యక్రమం లోపించడం. 'సింబాలిజం' ఎక్కువ కావడం. రెండు, వీరి రాజకీయాలు బ్రాహ్మణ, భూమిహార్, రాజ్‌పుట్ కులాల పెత్తనాన్ని అడ్డుకోవడం ద్వారా దళిత బహుజన కులాలన్నిటికీ ఉత్తేజం కల్పించినప్పటికీ, అవి యాదవుల వంటి బిసి కులాలకు పెద్ద పీట వేయడం ద్వారా దళిత కులాలలో కొంత నిరసనకు కారణం కావడం. భూమి పోరాటాలలోనూ కూలి పోరాటాలలోనూ దళితులకు వ్యతిరేకంగా యాదవులు నిలబడ్డ చోట ఈ పరిమితి స్పష్టంగా కనిపిస్తుంది.

అయితే రబ్రీదేవి ప్రభుత్వం బర్తరఫ్‌కూ ఈ పరిమితులకూ సంబంధమేమీ లేదు. ఆ బర్తరఫ్ కేవలం ఒక రాజకీయ నాటకం. బీహార్ గ్రామీణ జీవితంలో పెత్తందారీ కులాల సాంఘిక ఆర్థిక ఆధిపత్యాన్ని వ్యతిరేకించిన దళితులపైన, ఇతర అణగారిన కులాల పైన అమలవుతున్న హింసాకాండను అరికట్టడానికి రబ్రీదేవి ప్రభుత్వానికొక విధానమేదీ లేదనేది సత్యమే. కానీ గవర్నర్ భండారీ ద్వారా బీహార్‌ను పాలించాలని చూస్తున్న వాజ్‌పాయి, అద్వానీలకు ఆ ఉద్దేశ్యమే లేదు.

నిగాహ్

మార్చి 7, 1999

# చంద్రబాబు 'విజన్'లో ఆదివాసులు

పారదర్శక పరిపాలన అందించాలన్నది చంద్రబాబునాయుడు రూపొందించిన 'విజన్ 2020'లోని అంశాలలో ఒకటి. ప్రజలకు సమాచార స్వేచ్ఛ కల్పించే చట్టాలు చేస్తానని కూడ హామీ ఇచ్చాడు.

కానీ వేరే సమాచారం సంగతి దేవుడెరుగు, ఈ 'విజన్ 2020' సహితం ప్రజలకు అందుబాట్లో లేదు. నేను ఖరీదు సంగతి మాట్లాడడం లేదు. ఆ గ్రంథాన్ని విస్తృతంగా అచ్చువేసి బజార్లో అమ్మినా చాలామంది కొనుక్కోలేరనేది వాస్తవమే. అది అంత 'షోగ్గా'ఉంది. కానీ ప్రభుత్వం దానినసలు మార్కెట్లో పెట్టలేదు. కొద్ది మంది పాత్రికేయులకూ, బ్యూరోక్రాట్లకూ మాత్రమే అది అందుబాట్లో ఉంది.

'పారదర్శకత' ఈ విధంగానే ఉంటుంది కాబోలు.

'విజన్'లో అనేక విషయాలు ఉన్నాయి. అప్పుడెప్పుడో ఏదో స్వర్ణయుగంలో నదులెల్లప్పుడూ ప్రవహించేవనీ, చెట్లెప్పుడూ కాసేవనీ, పంటలెల్లప్పుడూ పండేవనీ, ప్రజలు ఐశ్వర్యారోగ్యసంపదలతో కళకళలాడేవారనీ చిన్నప్పుడు స్కూలు పుస్తకాలలో చదివాము. ఆ వయసులో కూడా ఆ కథలు నమ్మినట్టు జ్ఞాపకం లేదు.

ఇప్పుడింకొక 20 ఏళ్లకు ఆంధ్రప్రదేశ్‌లో అటువంటి స్వర్ణయుగం రాబోతుందని 'విజన్ 2020' అంటోంది. మన ముఖ్యమంత్రి గానీ, ఈ పత్రం లిఖించడంలో భాగం పంచుకున్న ఐఎఎస్ అధికార్లుగానీ, ఆస్ట్రేలియా నుండి దీనిని తయారు చేయడానికి వేంచేసిన మెక్కిన్సీ కంపెనీవారు గానీ కళ్లలో ఆశాజ్యోతులు వెలిగే లోకం తెలియని లేలేత యువకులయి వుంటే కూడ 'ఛ, మరీ ఇంత ఇదిగా మాట్లాడొద్దు' అని మందలించి ఉందుము. లేతదనాన్ని ఎప్పుడో వదిలేసుకొని కళ్లలో జ్యోతులు ఆర్పేసుకొని ముదిరి మొద్దుబారిన మన ముఖ్యమంత్రి, ఆయన అధికారగణం, ఆస్ట్రేలియా కంపెనీవారు ఇవన్నీ నమ్ముతున్నారంటే మనం నమ్మలేము.

కాబట్టి వారు హామీ ఇచ్చే స్వర్ణయుగంలోకి కొంచెం జాగ్రత్తగా తొంగిచూడడం అవసరం. చూస్తే చాలా విషయాలు కనిపిస్తాయి గానీ ఆదివాసీలకు సంబంధించిన రెండు ముఖ్యవిషయాలను మాత్రం ఇక్కడ ప్రస్తావించదలచుకున్నాను.

ఆదివాసీ ప్రాంతాలలో ఖనిజ పరిశ్రమ నిర్వహించడానికి ప్రైవేట్ కంపెనీలకు హక్కు ఉండేటట్టు చట్టంలో మార్పులు తీసుకురావాలి అనేది ఒక ప్రతిపాదన.

రెండవది ప్రతిపాదన కాదు వివరణ. 'ఏజెన్సీ ప్రాంతం' అంటే ఆదివాసీలు 50 శాతం కంటే ఎక్కువ ఉండే ప్రాంతం అని 'విజన్' ఒకచోట వ్యాఖ్యానిస్తుంది.

ఈ వ్యాఖ్యనే ముందు తీసుకుందాం. ఇది భారత రాజ్యాంగంలో ఈరోజు ఉన్న నిర్వచనం కాదు. ఏజెన్సీలో మాటువేసిన గిరిజనేతరులు చాలాకాలంగా పెడుతున్న డిమాండ్ ఇది. గిరిజనుల జనాభా 50 శాతం కంటే కిందికి పడిపోయిన ప్రాంతాలను షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తొలగించాలని వాళ్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రపతి అంగీకరించలేదు కాబట్టి అది చట్టం కాలేదు. కానీ చంద్రబాబు 'విజన్' అప్పుడే ఆ నిర్వచనాన్ని స్వీకరించేసింది. బహుశా 2020 నాటికి గిరిజనేతరుల ఈ ప్రతిపాదన చట్టమవుతుందని చంద్రబాబు అభిమతమేమో.

రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలులోని 6వ పేరాలో, రాష్ట్రపతి దేనిని షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటిస్తారో అదే షెడ్యూల్డు ప్రాంతం అని రాజ్యాంగ కర్తలు అన్నారు. షెడ్యూల్డు ప్రాంతంగా గుర్తించడానికి అక్కడ ఆదివాసీలు 50 శాతం ఉండాలని రాజ్యాంగం అనలేదు. ఆదివాసీల జనాభా 50 శాతానికి తగ్గితే అది ఏజెన్సీ కాకుండా పోతుందని కూడ రాజ్యాంగం అనలేదు. ఏదైనా ఒక ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి రాష్ట్రపతి తొలగిస్తేనే అది తొలగిపోతుందని రాజ్యాంగం అనింది.

ఆదివాసీ ప్రాంతాలలోకి బయటి వాళ్లు ప్రవేశించి స్థిరపడే కొద్దీ అక్కడ ఆదివాసీల జనాభా శాతం క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది (ఆదివాసీలు అక్కడ ఉంటుండగానే, వారి జనాభా ఎప్పటిలాగ పెరుగుతూండగానే). కాబట్టి ఏ వలస నుండయితే ఆదివాసీలను కాపాడడానికి 'షెడ్యూల్డు ప్రాంతం' అన్న భావన పుట్టిందో, ఆ వలస వల్లనే షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసీల జనాభా నిష్పత్తి పడిపోయి కాలక్రమంలో 50 శాతం కంటే తక్కువ అయిపోవచ్చు. అప్పుడు ఆ ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తీసేయాలని అనడం వికృతమైన తర్కం. గిరిజనేతరుల ఈ కుతర్కాన్ని 'విజన్ 2020' షెడ్యూల్డు ప్రాంతానికి నిర్వచనంగా మార్చేసింది.

ఆదివాసీ ప్రాంతాలలో ప్రైవేట్ రంగంలో ఖనిజ ఉత్పత్తి అనుమతించాలనడం కూడా ఆదివాసీలకు చాలా హానికరమైన ప్రతిపాదనే. అది ప్రైవేట్‌రంగమైనా

ప్రభుత్వరంగమైనా ఆదివాసీ ప్రాంతంలో గనుల తవ్వకం మొదలుపెడితే ఆదివాసీలు జీవనం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి ఆదిలాబాద్ జిల్లానే ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లాలో బొగ్గు గనులు మంచిర్యాల సమీపంలో మొదలయి దాదాపు 40 కిలోమీటర్ల పొడవున చాందా రహదారికి రెండువైపులా విస్తరించి ఉన్నాయి. ఇదంతా ఒకప్పుడు ఆదివాసీలు నివసించిన అడవిప్రాంతమే. ఇప్పుడక్కడ ఆదివాసీలు ఒక్కరు కూడ కనిపించరు. సింగరేణి గని కార్మికులలోను బహుశా ఒక్క ఆదివాసీ కూడ లేరనుకుంటాను. ఉన్నా బయటి నుండి వచ్చిన లంబాడీలుంటారు తప్ప గోండులు, కొలాంలు, నాయకపోళ్లు ఒక్కరు కూడా ఉండరు. మరి వారంతా ఏమయ్యారంటే ఆ అడవిని సింగరేణి కంపెనీకి వదిలేసి ఇంకా లోపలికి వెళ్లిపోయారు. ఈ బలవంతపు వలస వల్ల వాళ్ల జీవనం ఎంతగా దెబ్బతినిందో అంచనా వేసిన వారు లేరు.

ప్రభుత్వరంగ గని అయిన సింగరేణి ప్రభావమే ఈవిధంగా ఉంటే, ఇంక చంద్రబాబు 'విజన్' ప్రతిపాదిస్తున్న ప్రైవేట్‌మైనింగ్ ప్రభావం ఏవిధంగా ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

ఇప్పుడున్న ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు (నియంత్రణ) చట్టం (క్లుప్తంగా 1 ఆఫ్ 70 చట్టం) షెడ్యూల్డు ప్రాంతాలలో భూమిని ప్రైవేట్ (గిరిజనేతర) వ్యక్తులకు గానీ కంపెనీలకు గానీ లీజుకు ఇవ్వడాన్ని అనుమతించదు. ఆదివాసీలే ఒక మైనింగ్ కంపెనీ ఏర్పరచుకొని ఒక సొసైటీగా దానిని నడిపేటట్టయితే వారికి ఇయ్యవచ్చును. చంద్రబాబుకు, వారి సలహాదారులయిన దేశీయ విదేశీయ వ్యాపారవేత్తలకూ కావలసింది అది కాదు. పెట్టుబడి అడవులలోకి ప్రవహించే స్వేచ్ఛ. దానికి '1 ఆఫ్ 70'ని సవరించవలసి ఉంటుందని చంద్రబాబుకు తెలుసును. అందుకే విజన్ 2020లో ఈ ప్రతిపాదన. బహుశా 2020 నాటికి ఈ చట్టాన్ని సవరించి రాష్ట్రపతి ఆమోదం పొందదలచుకున్నాడేమో.

కాబట్టి వేరే వాళ్ల సంగతి ఎట్లాగున్నా విజన్ 2020 గురించి ఆదివాసీలు అప్రమత్తంగా ఉండడం అవసరం. వాళ్ల జనాభా నిష్పత్తి 50 కంటే తక్కువకు పడిపోయిన ప్రాంతాలను ఏజెన్సీ నుండే తీసేస్తారంట. మిగిలిన ప్రాంతంలో ఖనిజ ఉత్పత్తిని ప్రైవేట్ కంపెనీలకు యధేచ్ఛగా అనుమతిస్తారట. అడవి ఎక్కడుంటే అక్కడ ఖనిజాలు తప్పనిసరిగా విస్తారంగా ఉంటాయి. కాబట్టి ఇది ఏజెన్సీలోకి గిరిజనేతరుల వలసను విపరీతంగా పెంచుతుంది. ఆదివాసీల జీవితాన్నీ, జీవనాన్నీ నాశనం చేస్తుంది.

# చంద్రబాబు 'విజన్'లో గ్రామీణ పేదలు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమని చెప్పి చంద్రబాబునాయుడు తయారు చేసిన 'విజన్ 2020'లో ఎవరెవరికి ఏముందో ప్రజలు వెతుక్కోవలసిందే. ఆ విధానపత్రంలో విపరీతమైన అతిశయోక్తులతో కూడిన హామీలు ఇచ్చే అధ్యాయాలు కొన్ని ఉన్నాయి. అక్కడ వెతికి ప్రయోజనం లేదు. బైబిల్ భాషలో చెప్పాలంటే ఆ హామీల ప్రకారం క్రీ.శ. 2020 నాటికి ఇది పాలూ తేనె ప్రవహించే గడ్డ కాబోతుంది. కానీ ఆ పాలు తేనె ఎవరెవరికి ఏ విధంగా తెచ్చి ఇయ్యబోతున్నారో చెప్పే వివరాలు ఆ పత్రంలో వేరే చోట్ల ఉన్నాయి. ఆ వివరాలు ఎక్కువ లేవు. హామీల ప్రవాహంలో గులకరాళ్లలాగ అక్కడక్కడ తగులుతాయి. వాటిని జాగ్రత్తగా గ్రహించి వెలికి తీసి చూడాలి.

గ్రామీణ పేదలకు ముఖ్యంగా దళితులకు ప్రతిరోజు పని దొరకడం పెద్ద సమస్య. సంవత్సరంలో సగటున 100 రోజులు కూడ పని దొరకని వాళ్లు గ్రామీణ పేదలలో చాలా మంది ఉన్నారు. ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఒక కొత్త విధాన రచన చేస్తున్నదంటే అందులో తమకు ప్రతి రోజూ పని కల్పించే ఆలోచన ఉందేమోనని గ్రామీణ పేదలు వెతకడం సహజం.

భూమిలేని వాళ్ల చేతిలో కొంత భూమి పెడితే సంవత్సరంలో మూడు నెలలయినా తమ స్వంత భూమిలో పని చేసుకొని ఫలితం పొందగలుగుతారు. మిగిలిన తొమ్మిది నెలలలో సగం రోజులయినా వేరే చోట పని దొరికితే జీవితం ఎట్లాగో గడపవచ్చు.

కానీ 'విజన్'లో అసలే లేని విషయాలలో ఇదొకటి. భూసంస్కరణల ప్రస్తావన అందులో శూన్యం. కోర్టు వివాదాలలో ఇరుక్కున్న సీలింగ్ భూముల కేసులు వేగంగా పరిష్కారమయ్యేటట్టు చూస్తామని గానీ, భూస్వాములే బినామీగా లేక దౌర్జన్యంగా అనుభవిస్తున్న సీలింగ్ భూములను స్వాధీనం చేసుకొని హక్కుదారులయిన భూమి

లేని ఎస్.సి, ఎస్‌టిలకు పంచుతామని గానీ 'విజన్ 2020'లో మొక్కుబడి హామీ సహితం లేదు.

భూస్వాముల సీలింగ్ భూములు ప్రభుత్వం పట్టుదలగా పేదలకు పంచుతుందన్న నమ్మకం పేదలలో ఏనాడూ పెద్దగా లేదు. ప్రభుత్వ బంజర్లు, పోరంబోకుల గురించి పేదలు అనేక చోట్ల పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఈ పేదలు అత్యధిక భాగం దళితులు. ఈ భూములు భూమిలేని వారికి, అందులోనూ ప్రధానంగా ఎస్.సి, ఎస్‌టిలకు దక్కాలన్నది ప్రభుత్వ విధానమే కాబట్టి కనీసం ఈ కోరికయినా కొంత సులభంగా తీరగలిగి ఉండాలి. కానీ దానికి కూడ ఎన్నో ఆటంకాలు. అప్పటికే భూములున్న రైతులు, లేదా స్థానిక రాజకీయ నాయకుల అండదండలున్నవాళ్లు ఈ బంజర్లను, పోరంబోకులను ఆక్రమించుకొని నిజమైన అర్హులకు అందనీయకుండా చేసిన ఘటనలు కోకొల్లలు.

ఈ భూముల గురించి 'విజన్' ఏమంటుంది? అన్ని రకాల వనరులతోనూ వ్యాపారం ఎట్లా చేయించాలా అన్నది 'విజన్' దృక్కోణం. అప్పుడే 'రాష్ట్రం' బాగుపడుతుంది. 'రాష్ట్రం' బాగుపడితే అందరూ బాగుపడినట్టే. ఈ ఆలోచన బంజర్లకూ పోరంబోకులకూ కూడ వర్తిస్తుంది. ఈ భూములు మాంసం వ్యాపారం చేసే గొర్రెల పెంపక కేంద్రాలకు పచ్చిక బయళ్లుగానూ, కోళ్ల ఫారాలకు మొక్కజొన్న వంటి పోషకాహారం పండించే చేలగాను, పండ్ల వ్యాపారులకు అనువైన పండ్లతోట క్షేత్రాలుగానూ పని కొస్తాయి. కాబట్టి ఆ దిశగా వీటి వినియోగాన్ని మరల్చాలని 'విజన్' అంటుంది. మాంసం వ్యాపారంలోనూ, పళ్ల వ్యాపారంలోనూ, కోళ్లఫారాల్లోనూ భారీగా పెట్టుబడిని ఆకర్షించాలన్నది 'విజన్' ధ్యేయాలలో ఒకటి. ఆ పెట్టుబడి స్వదేశీ పెట్టుబడే కానక్కరలేదు. విదేశీ పెట్టుబడి కూడ కావచ్చు. ఆ వ్యాపారం సహితం దేశీయం కానక్కరలేదు. ఎగుమతి వ్యాపారం కూడ కావచ్చు. ః

కాబట్టి పోరంబోకులు, బంజర్లలో ఇప్పటికే పేదలకు పట్టాలు ఇచ్చి ఉంటే వారు ఆ భూములను పైరకాల వ్యాపారం చేసే కంపెనీలకూ వ్యాపారస్తులకూ కాంట్రాక్టుకు ఇచ్చే ఏర్పాటు చేస్తామని 'విజన్' అంటుంది. ఆ కంపెనీలు వీరి దగ్గరొక ఎకరం, వారి దగ్గరొక ఎకరం కాంట్రాక్టు మీద తీసుకొని సీలింగ్ చట్టాన్ని తప్పించుకొని పెద్ద కమతాలు తయారు చేసుకొని తమకు కావలసిన పశుగ్రాసం, లేక కోళ్ల దాణా లేక ఫలపుష్పాలు ఉత్పత్తి చేసుకుంటాయి. పట్టాదారులు తమకుండే వనరులతో వ్యవసాయం చేస్తే ఆ మాత్రం కిరాయి కూడ పొందలేరు కాబట్టి భూమిని కిరాయికి ఇచ్చి కూలి చేసుకొని బతకవలసి ఉంటుంది. వాళ్ల జీవితాలు ఎదుగుబొదుగు లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉండిపోతాయి.

ఇది అప్పటికే పోరంబోకులలో పట్టాలు పొందిన వారి సంగతి అయితే ఎవరికీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వని పోరంబోకులు, బంజర్లలో ('విజన్ 2020' ప్రణాళిక అమలులోకి వస్తే) ఇక ఎప్పటికీ పేదలు పట్టాలు పొందలేరు. ఆ భూమి మొత్తం కార్పొరేషన్లకు ఇవ్వబడుతుంది. కార్పొరేషన్లు ఆ భూమిపైన పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి పైన చెప్పిన విధంగా వినియోగంలోకి తెస్తాయి. మరి పేదలకు ఏమీ దక్కదా అంటే 'విజన్' కొంచెం ఉపశమనం చూపిస్తుంది. ఈ కార్పొరేషన్లలో ప్రైవేట్ పెట్టుబడిదార్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుంది. ఆ వాటాను రాష్ట్ర ప్రభుత్వం చాలా ఉదారంగా భూమి లేని కూలీల పేరిట పంచుతుంది. అంటే కార్పొరేషన్ సాగుచేసే భూమి విస్తీర్ణాన్ని బట్టి ఆ ప్రాంతంలో బ్రతికే ఒక్కొక్క భూమిలేని కూలీ కుటుంబం పేరు మీద ప్రభుత్వం వాటా (ఒక పైసాలో నూరవ వంతు కావచ్చు, ఇంకా తక్కువ కావచ్చు) పంచబడుతుంది. కార్పొరేషన్ లాభాలు సంపాదించి డివిడెండ్లు డిక్లేర్ చేసినప్పుడు ఆ కుటుంబాలకు కూడ అంతో ఇంతో వస్తుంది. ఆ లోపల దొరికిన కాడికి కూలి చేసుకొని బతుకుతుండాలి. ప్రభుత్వ భూములు భూమి లేని పేదలకు పంచాలని ఆందోళన చేస్తున్న వారందరికీ 'విజన్' ఇచ్చే సమాధానం ఇది! కూలివాళ్లంతా క్రీ.శ. 2020 నాటికి ఈ విధంగా చంద్రబాబు చలవ వల్ల పెట్టుబడిదార్లవుతారు.

భూమి సంగతి పోనీయండి. దేశంలోని భూమి లేని కూలివాళ్లందరికీ తగు మొత్తంలో భూమి పంచాలంటే ఇప్పుడున్న సీలింగ్ చట్టాలూ చాలవు, ప్రభుత్వ పోరంబోకులూ చాలవు. కనీసం వ్యవసాయేతర ఆర్థిక అభివృద్ధి పథకాలయినా పేద గ్రామీణ నిరుద్యోగులకు పని కల్పించే లక్ష్యంతో సాగుతాయా? అప్పుడు వ్యవసాయరంగంలో పని దొరకని వాళ్లు పారిశ్రామిక రంగంలోనయినా పని సంపాదించుకొని బతకగలుగుతారు.

రాష్ట్రపారిశ్రామిక అభివృద్ధి గురించి 'విజన్ 2020' చాలా చెప్తుంది గానీ అందులో గ్రామీణ పేదల ఉద్యోగ అవకాశాలకున్న స్థానం పరోక్షమైనదే. వాళ్లకు పనికల్పిస్తూ తద్వారా పారిశ్రామిక ప్రగతి సాధించే వ్యూహం 'విజన్'లో లేదు. దేశీయ విదేశీయ పెట్టుబడి పెద్దఎత్తున రాష్ట్రంలోకి ప్రవహించాలనీ, దానికి అవసరమైన రోడ్లు, రైల్వే లైన్లు, ఓడ రేవులు మొదలయిన నిర్మాణాలు ప్రభుత్వం చేపడుతుందనీ (ఇందులో కూడ ప్రైవేట్ పెట్టుబడి పెద్దమొత్తంలో ఉండబోతుందనేది వేరే సంగతి), ఆ నిర్మాణం పనులు గ్రామీణ పేదలకు పని కల్పిస్తాయనీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయనీ 'విజన్' అంటుంది. పారిశ్రామిక రంగంలో క్రీ.శ. 2020 నాటికి రూ॥ 11లక్షల కోట్ల పెట్టుబడి ప్రవేశించబోతుందని ఆశించే 'విజన్' గ్రామీణ పేదల ఉపాధి

అవకాశాలకు అందులో కల్పించే స్థానం ఇది. మామూలు భాషలో చెప్పాలంటే వారికి కల్పించేది 'తట్టపని, మట్టిపని' మాత్రమే. దీనితో నిరుద్యోగం, పేదరికం ఎంతమేరకు తీరుతాయి? గ్రామీణ పేదల జీవితాలు ఏ మేరకు బాగవుతాయి? సాంకేతికంగా ఉన్నతమైన ఉత్పత్తి రంగంలో వారికి ప్రవేశం కల్పించే ఆలోచనేమీ 'విజన్'లో లేదు. రోడ్డు పని అందరికీ ఎల్లవేళలా సరిపోయేంత కల్పించగలరా అనే ప్రశ్న అటుంచి అది వారి జీవన ప్రమాణాలను ఒక మెట్టు కూడా ఎక్కించలేదనేది సత్యం. అది జరగాలంటే వారికి భూమి అయినా దొరకాలి, సాంకేతికంగా పరిణతి చెందిన ఉత్పత్తి రంగంలోకి ప్రవేశమైనా లభించాలి. విద్యార్హత ప్రధానమైన ఉద్యోగరంగమైనా అందుబాట్లోకి రావాలి.

ఈ ఆలోచనలేవీ చేయని విజన్ గ్రామీణ పేదలకేమిస్తుంది?

# 'రంగురాళ్ల' తవ్వకాలు-ఒరిస్సా ఆదర్శం

**తూ**ర్పుగోదావరి జిల్లా అడ్డతీగల మండలం చాలా సుందరమైన ప్రాంతం. ఎత్తైన పచ్చటి చెట్లతో, ఆవల ఏముందో అన్న కుతూహలం రేకెత్తించే కొండలతో, ఎండల కాలంలో సహితం పూర్తిగా ఎండి పోని సెలయేళ్లతో చాలా హృద్యంగా ఉంటుంది.

నెమ్మదయిన ప్రకృతిలో నెమ్మదిగా బతికే ఆ ఆదివాసీ ప్రాంతానికి నాగరికతా దాహాలు పూర్తిగా కొత్తకాదు. భూమిదాహం, కలపదాహం, డబ్బుదాహం ఒక శతాబ్దం కిందే అక్కడికి వచ్చి చేరాయి. వాటి ప్రభావం పూర్తిగా కాకున్నా ఎంతో కొంత ఆదివాసీలపైన కూడా పడింది. అయినప్పటికీ ఆదివాసీ జీవన విధానం తమ స్వభావాన్ని పూర్తిగా కోల్పోలేదు. వీటి తరువాత వచ్చిన సినిమాదాహం, రాజకీయదాహం మరికొంత వికారాన్ని చేర్చాయి గానీ అడవి ఇప్పటి దాకా తట్టుకుంది.

ఇప్పుడు కొన్నేళ్లుగా ఒక కొత్త దాహం ఈ అడవిని పట్టుకుంది. అది 'రంగు రాళ్ల' దాహం. తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలలోని తూర్పు కనుమల అడవులలో విలువయిన రంగు రాళ్ల నిక్షేపాలున్నాయన్న విషయం 1993లో మొట్టమొదటిసారి బయటపడింది. ఇవి వజ్రాలంత విలువైనవి కావు గానీ అభరణాలలో పెట్టుకోవడానికి ఉపయోగపడతాయి. వీటికి మంచి మార్కెట్ ఉంది. ఒరిస్సా నుండి, మధ్యప్రదేశ్ నుండి 'వజ్రాల' వ్యాపారులు ఉత్తరాంధ్ర ఏజెన్సీకి వచ్చి స్థానిక ప్రజలచేత రాళ్లు తవ్వించి వారికి కొన్ని వందల రూపాయలిచ్చి తాము వేల రూపాయల సరుకు తీసుకుపోసాగారు. స్థానిక ప్రజలకు రోజంతా కూలి చేసినా, అడవిలో ఏదైనా ఏరుకుని తీసుకొచ్చి అమ్ముకున్నా రోజుకు 20 రూపాయలు సంపాదించడం మహా కష్టం కాబట్టి ఈ 'రంగు రాళ్లవేట'లో వాళ్లు కూడ ఉత్సాహంగానే పాల్గొనసాగారు. ఏజెన్సీ వెలుపల ఉన్న అడవి ప్రాంతాలలోనూ, ఏజెన్సీ అంచున ఉన్న ప్రాంతాలలోనూ గిరిజనేతరులే ఎక్కువగా పాల్గొనగా ఏజెన్సీ లోతట్టు ప్రాంతాలలో మాత్రం ఆదివాసీలే ఉత్సాహంగా రాత్రింబగళ్లు వేటలో పాల్గొంటున్నారు. భూమిని తవ్వి ఏదయినా

ఖనిజాన్ని తీసుకుపోయే ప్రక్రియ 'గని' నిర్వచనంలోకి వస్తుంది కాబట్టి ఇది చట్ట విరుద్ధం. అంటే అర్థం అధికారులు ఈ తవ్వకాన్ని ఆపుతారని కాదు. లంచాలు తీసుకుని సాగనిస్తారని. ఉత్తరాంధ్ర ఏజెన్సీ మండలాలలోని ఎస్ఐలూ, ఎంఆర్వోలూ, ఫారెస్ట్ సిబ్బందీ వేలాది రూపాయల 'మామూళ్లు' సంపాదించుకున్నారు. వాళ్ల చేతులు ఎంత తడిపినా వ్యాపారస్తులకు బాగా లాభాలు మిగులుతాయి కాబట్టి ఇబ్బంది లేకుండా ముడుపులు ఇచ్చుకుంటున్నారు.

ఫలానా చోట రంగు రాళ్లున్నాయంట అని తెలిస్తే చాలు, ప్రజలు అన్ని పనులూ వదులుకొని తట్ట, పార పట్టుకొని వెళ్లిపోతారు. పగలయితే అధికారులెవరయినా చూసి (లంచాలు తీసుకునే బాపతు కొనట్టయితే) ఆపుతారేమోనని రాత్రివేళ లాంతర్లు పెట్టుకొని తవ్వుతుంటారు. మామూలుగా ఆదివాసీ సంస్కృతిలో ఒకరికొకరు సహాయం చేసుకునే గుణం ఉంటుంది. కానీ రంగురాళ్ల వేటలో రాయి దొరికిన వారు అదృష్టవంతులు కాబట్టి ఒకరికి తెలియకుండా ఒకరు తవ్వుకొని వద్దామని తాపత్రయపడుతుంటారు. వాళ్లకు రాళ్లున్నాయన్న వార్త చేరవేసి వాళ్లచేత తవ్వించి తీసుకుపోయి ఏజెన్సీ తాలూకా కేంద్రంలో లాడ్జిలలో బసచేసి ఒరిస్సా వ్యాపారస్తులకు అమ్మే దళారులు కూడా తయారయ్యారు. వీళ్లు ఎక్కువగా తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల ఛోటా లీడర్లు.

వ్యాపారులు, దళారులు, అధికారులు బాగానే ఉన్నారు గానీ ఒక పద్ధతీ రీతీ లేకుండా జరిగే తవ్వకాలు ప్రజలకు అనేక సార్లు ప్రాణాంతకంగా పరిణమించాయి. గనిని శాస్త్రీయంగా తవ్వకపోతే ఏదో ఒక రోజు పైకప్పు కూలి తవ్వుతున్నవారు చనిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికి అయిదుసార్లు అటువంటి ప్రమాదాలు జరిగి 29 మంది చనిపోయారు. ఈ సంవత్సరం అడ్డతీగల సమీపంలో రెండు ప్రమాదాలలో మొత్తం ఏడుగురు ఆదివాసీలు చనిపోయారు. అంతకు ముందు (1995 మార్చి 9న) అడ్డతీగల సమీపంలోనే నలుగురు ఆదివాసీలు ఈ విధంగా చనిపోయారు. 1997 నవంబర్ 25న విశాఖపట్నం జిల్లా చింతపల్లి-పాడేరుల మధ్య ప్రాంతంలో రంగురాళ్ల 'గని' కూలి నలుగురు ఆదివాసీ బాలురు చనిపోయారు. అన్నిటికంటే మొదట జరిగిన దుర్ఘటన ఏజెన్సీ బయట జరిగింది. 1993 సెప్టెంబర్ 25న విశాఖపట్నం జిల్లాలోని పప్పుశెట్టిపాలెంలో రంగు రాళ్ల 'గని' కూలి 13 మంది చనిపోయారు. వీరంతా గిరిజనేతర పేదలే.

ప్రతిసారీ ప్రమాదం జరిగినప్పుడు కొంత గొడవ జరుగుతుంది. రంగురాళ్ల తవ్వకాన్ని ఇక మీదట కచ్చితంగా ఆపుతామని అధికారులు ప్రకటిస్తారు. కానీ అదేం జరగదు. వాళ్లకు ముట్టే ముడుపులు ముడుతుంటాయి. వ్యాపారస్తులు, బ్రోకర్లు

తవ్వకాలు ప్రోత్సహించడం కొనసాగిస్తారు. మళ్లీ ఎక్కడో ఒక చోట 'గని' కూలి జనం చనిపోయేదాకా అందరూ రంగురాళ్ల సంగతి మరచిపోతారు.

నిజానికి ఈ రంగురాళ్ల తవ్వకాన్ని నిషేధించవలసిన అవసరమేమీ లేదు. వాటికి మార్కెట్ ఉంది. వాటి తవ్వకం అడవిని నాశనం చేయదు.రంగురాళ్ళ నిక్షేపాలు అంత విస్తారంగా లేవు. అంత లోతుగానూ లేవు. వాటి తవ్వకం ఆదివాసీలకు జీవనాధారం కల్పిస్తుంది కూడ.

అందువల్ల ప్రభుత్వం రంగురాళ్ల తవ్వకాన్ని నిషేధించే బదులు క్రమబద్ధం చేయవచ్చు. 'గనుల'ను గుర్తించి ఆదివాసీల సహకార సంఘాలు ఏర్పాటు చేసి వారికే లీజుకు ఇస్తే దళారుల బెడద తప్పించవచ్చు. వారి దగ్గర ప్రభుత్వమే రాళ్లు కొనుక్కునేటట్టయితే వాటి మార్కెట్ ధరలో అధికభాగం శ్రమచేసి వాటిని తవ్విన ఆదివాసీలకే దక్కుతుంది.

నిజానికి ముడిరంగురాళ్ల కంటే వాటిని సానబెట్టినప్పుడు వచ్చే ధర చాలా ఎక్కువ. ఈ లాభం యావత్తు ఇప్పుడెవరికో పోతున్నది. వాటిని సానబెట్టడానికి కావలసిన శిక్షణ కూడా ఆదివాసీ యువకులకే ఇచ్చి దానికి కావలసిన పరికరాలు సరఫరా చేస్తే అది మంచి ఉపాధి అవుతుంది.

పొరుగున ఉన్న ఒరిస్సా రాష్ట్రం ఈ పనిచేస్తున్నట్టు వినికిడి. ఆ రాష్ట్రంలోని తూర్పు కనుమల అడవులు మన ఉత్తరాంధ్రకు కొనసాగింపే. అక్కడి కలహండి, కోరాపుట్ జిల్లాలలో కూడ ఈ రంగురాళ్ల నిక్షేపాలు బాగా ఉన్నాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వం వాటి తవ్వకాన్ని చట్టం పరిధిలోకి తీసుకొచ్చి ఆదివాసీ సహకార సంఘాలకు అప్పగించడమే కాక వాటిని సానబెట్టడంలో ఆదివాసీ యువకులకు తర్ఫీదు ఇచ్చింది. 12 వేల ఆదివాసీ కుటుంబాలు దీనిపైన బతుకుతున్నట్టు వినికిడి.

రంగురాళ్ల తవ్వకాన్ని చట్టం పరిధిలోకి తీసుకొచ్చి క్రమబద్ధం చేస్తే వచ్చే మరొక ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే తవ్వకం సరయిన పద్ధతిలో జరిగేటట్టు చూడవచ్చు. గని ప్రమాదాలు నివారించవచ్చు. ఒకవేళ ఇతర గనులలో జరిగినట్టు అప్పుడప్పుడు జరిగితే కనీసం మృతుల కుటుంబాలకు నష్టపరిహారమైనా దక్కుతుంది. ఇప్పుడు జరిగేది చట్టవిరుద్ధమైన తవ్వకం కాబట్టి అందులో చనిపోయేవారికి (ఆదివాసీలకు సహితం) ఒక్క పైసా నష్టపరిహారం కూడ దక్కడం లేదు. నిజానికి, చెప్పుకుంటే తమనే ఏమైనా అంటారేమోనని మృతుల బంధువులు చనిపోయింది తమ మనిషేనని చెప్పడానికి కూడ వెనకాడుతున్నారు.

★★★

# అతి రాజకీయ సారం!

**కాం**గ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ మధ్య హడావుడిగా నార్నూర్, సిర్పూర్ మండలాలు పర్యటించడంతో గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన వందలాది మంది దుర్మరణాలు మరొకసారి రాష్ట్రానికి జ్ఞాపకమొచ్చాయి. 399 మంది చనిపోయారని ప్రభుత్వం ప్రతిశవాన్నీ లెక్క గట్టినట్టు చెప్తుంటే దాదాపు వెయ్యి మంది చనిపోయారని పత్రికలు అప్పట్లో రాసాయి. సోనియాగాంధీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ వారు ఆ సంఖ్యను 2185 చేసారు.

తెలుగుదేశం ప్రభుత్వం మీద వీలయినంత పెద్దనింద వేయాలని కాంగ్రెస్ వారు, నిందను వీలయిన మేరకు తప్పించుకోవాలని తెలుగుదేశం వారు సోనియాగాంధీ పర్యటన సందర్భంగా రేపిన దుమారంలో ఒక్క విషయం కనబడకుండా పోయింది. అదేమిటంటే ఏ పరిస్థితులయితే ఆ వందలాది దుర్మరణాలకు దారి తీసాయో అవి ఈనాటికీ  కొనసాగుతూనే ఉన్నాయి. తిరిగి ఈ వర్షాకాలంలో వందలాదిగా జనం చావరన్న నమ్మకం కలిగించడానికి ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో ఏమీ చేయలేదు. కాంగ్రెస్ వారు చంద్రబాబునాయుడు మీద దుమ్మెత్తి పోయడానికి ఈ చావులను వాడుకోవడమే తప్ప అవి పునరావృతం కాకుండా నివారించడానికి నిర్దిష్టమైన డిమాండ్లతో ఉద్యమమెప్పుడూ చేయలేదు.

నిజానికి నిర్దిష్టంగా పెట్టవలసిన డిమాండు ఒక్కటే. ప్రతి జనావాసానికీ రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేయాలి. గ్రామం అనే బదులు జనావాసం అనడానికి ఒక కారణం ఉంది. గ్రామానికి హామ్లెట్లు ఉంటాయి. ఆదిలాబాద్ వంటి అడవులు, కొండలు ఉన్న జిల్లాలో ఈ హామ్లెట్లు అనేకం ప్రధాన గ్రామానికి దగ్గరగా ఉండవు. కాబట్టి ప్రధాన ఆవాసాల దగ్గర నీళ్లట్యాంక్ ఉన్నా అందరికీ శుభ్రమైన మంచి నీరు అందదు. అందువల్లనే ప్రతీ జనావాసానికీ (అది పది గుడిసెల గూడెమే అయినప్పటికీ) ట్యాంకు గానీ చిన్నదో పెద్దదో నీళ్లతొట్టిగానీ

కట్టాలి, బోర్లనుండి కరెంటు మోటారు ద్వారా వాటిని నింపాలి, తరచుగా అందులో మందు కొట్టి నీటిని శుభ్రంగా ఉంచాలి.

ఆశ్చర్యం, ఆగ్రహం కలిగించే విషయం ఏమిటంటే ఐ.టి. గురించీ హైటెక్ గురించీ మాట్లాడుకుంటున్న ఈ శతాబ్దాంతంలో ఆదిలాబాద్ జిల్లాలోని 3000 చిల్లర జనావాసాలలో కేవలం 600 చిల్లర జనావాసాలకు మాత్రమే రక్షిత మంచినీటి పథకాలు అందుబాట్లో ఉన్నాయి. అంటే నూటికి 20 శాతం జనావాసాలకు మాత్రమే శుభ్రమైన తాగునీరు ఉంది. దీనికి కాంగ్రెస్ వారూ తెలుగుదేశం వారూ ఇద్దరూ బాధ్యులే కాబట్టి వారు ఒకరినొకరు తిట్టుకుంటుంటే మనం వింటూ ఉండడంలో అర్థం లేదు.

దాదాపు అన్ని జనావాసాలలోనూ బోర్లున్నాయి. జిల్లాలో మొత్తంగా 11వేల చిల్లర బోర్లున్నాయని ప్రభుత్వం అంటుంది. వేసవిలో అవి ఎండిపోతే జనం అడవులలోకి పోయి ఏ వాగు నుండో వంక నుండో నీళ్లు తెచ్చుకుంటారు. అవి శుభ్రంగా ఉంటాయన్న భరోసా లేదు. దీనితో అతిసార వ్యాధి మొదలవుతుంది. వర్షాకాలం వచ్చాక బోర్లు తిరిగి పని చేస్తాయిగానీ వర్షం నీటితో కొట్టుకొచ్చి భూగర్భ జలంలో భాగమయ్యే  కాలుష్యమంతా బోర్లనుండి బయటికొస్తుంది. బోరు నీటిని సిమెంటు తొట్టిలోను ట్యాంక్‌లోను నిల్వ చేసి సరఫరా చేసేటట్లయితేనే డిడిటి చల్లడం ద్వారా దానిని శుభ్రపరచవచ్చు. అది 20 శాతం జనావాసాలలో మాత్రమే ఉందని పైన చెప్పాను. మిగిలిన ఊళ్ల జనం అశుభ్రమైన బోరు నీళ్లు, అవి కూడ లేని చోట అశుభ్రమైన వాగులు, వంకల నీళ్లు తాగాలి. ఇవి మళ్లీ అతిసార వ్యాధికి కారణం అవుతాయి. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన అతిసారం చావులు ఎక్కువగా జూలై ఆగస్ట్ నెలల్లో జరిగాయి. ఆపైన ఈ వర్షం నీరంతా డ్రైనేజీ లేకపోవడం వల్ల నిలవ ఉండి దోమల పోషక కేంద్రాలుగా మారతాయి. మలేరియా వ్యాధి దీని పర్యవసానం.

ఇది ప్రతీ సంవత్సరం ఉండేదే. కానీ గత సంవత్సరం ఎండలూ వానలూ కూడ చాలా ఎక్కువ కావడంతో చావులు మరీ ఎక్కువయ్యాయి. అంతకు ముందు ప్రతీ సంవత్సరం 50 మందో 60 మందో చనిపోయేది. 1998లో వందలాదిగా చనిపోయారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే గత సంవత్సరం జరిగిన అపారమైన మరణాల నుండైనా ప్రభుత్వం గుణపాఠం తీసుకుందా అనేది. ఏవేవో నిర్మాణాలకు (హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు వగైరా) వేలాది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న

ప్రభుత్వం ఆదిలాబాద్ జనావాసాలలోని ప్రజలకు శుభ్రమైన మంచి నీరు సరఫరా చేయడానికి ఎంత మాత్రం ఖర్చు పెట్టింది? గతంలో ఏం జరిగిందన్న సంగతి అటుంచి, ఇప్పటికైనా మేల్కొని ప్రతీ జనావాసానికీ అత్యవసర ప్రాతిపదికన రక్షిత మంచినీటి పథకం కల్పించే ప్రయత్నమేమైనా చేపట్టిందా?

ఏమంత చేయలేదు. 1998-99 సంవత్సరంలో మరొక 400 జనావాసాలకు మాత్రమే రక్షిత మంచినీటి స్కీంలు నిర్మించే ప్రణాళికను ప్రభుత్వం చేపట్టింది. అది రాబోయే వర్షాకాలం లోపల పూర్తయినా అప్పటికింకా జిల్లాలో 65 శాతం జనావాసాలకు రక్షిత మంచి నీటి పథకాలు ఉండవు. నూటికి 65 జనావాసాలకు శుభ్రమైన మంచినీరు లేకుండా 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టబోతాయి.

ఇది ఎట్టి పరిస్థితులలోనూ క్షమించరాని నిర్లక్ష్యం. ఆదివాసీలు ఎక్కువ సంఖ్యలో నివసించే ఆదిలాబాద్ జిల్లా విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడం మరీ క్షమించరాని విషయం. కనీసం ఒక సంవత్సరం జరిగిన ఘోరం నుండి నేర్చుకొని ఇంకెప్పుడూ జరగకుండా ఉండడానికి కావలసిన వ్యవస్థాగతమైన ప్రయత్నాలు అత్యవసర ప్రాతిపదికన చేయకపోతే ఆ ప్రభుత్వాన్ని గురించి ఏమనుకోవాలి?



తన తప్పుకంటే ఆదివాసీల తప్పే ఎక్కువ అని బుకాయించడానికి కూడా ప్రభుత్వం చాలా ప్రయత్నం చేసింది. అతిసార వ్యాధి అంత పెద్దఎత్తున ప్రబలడానికి కారణమేమిటన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా, వ్యాధి సోకిన ఆదివాసీలు మూఢనమ్మకాల వల్ల వైద్యం చేయించుకోవడానికి ఇష్టపడక చనిపోయారని ప్రభుత్వం వాదించింది. కానీ ప్రభుత్వ వైద్యాధికారుల కథనం ప్రకారమే అతిసార వ్యాధి సోకిన వారిలో నూటికి 60 శాతం 24 గంటల లోపల చనిపోయారు. 24 గంటల లోపల ఆస్పత్రికి పోయి వైద్యం చేయించుకునేంత దగ్గరలో ఆదివాసీలకు ఆస్పత్రులు అందుబాట్లో ఉన్నాయా? ఉండకపోవడానికి మూఢనమ్మకాలు కారణమా లేక తెలంగాణలోని ఒక మారుమూల జిల్లా అయిన ఆదిలాబాద్ గురించి, అందులోని ఆదివాసీల గురించి మన పాలకులకు పట్టింపు లేకపోవడం కారణమా?

ఇప్పటికయినా అత్యవసర ప్రాతిపదికన ప్రతీ జనావాసానికీ రక్షిత మంచినీటి సరఫరా కల్పించాలన్న ఒత్తిడి ప్రభుత్వం మీద పెట్టడం అవసరం. ఆ ఊసు లేకుండా చంద్రబాబునాయుడును రాజశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డిని చంద్రబాబు నాయుడు ఎన్ని తిట్లు తిట్టినా ఆదిలాబాద్‌కూ అందులోని ఆదివాసీలకూ ఒరిగేదేమీ లేదు.

మే 2, 1999

# ఒక అబ్రహాం కథ

ఏప్రిల్ 4వ తేదీన ఆర్మూర్ నుండి నిజామాబాద్‌కు పోయే రోడ్డు పక్కన అబ్రహాం అనే దళిత యువకుడిని 'గుర్తుతెలియని వ్యక్తులు' కాల్చి చంపారు. 12 సంవత్సరాల వయసున్న తన మేనల్లుడిని వెనక కూర్చోబెట్టుకుని అతను తన స్వంత ఊరయిన కమ్మరపల్లి మండలం ఉప్పులూరు నుండి నిజామాబాద్‌కు పోతుండగా వారిని వెనక నుండి వెంబడించిన వ్యక్తులు దారిలో ఆపి అబ్రహాంను కాల్చి చంపారు.

అబ్రహాంను మేమే చంపాం అని ఇప్పటిదాకా ఎవరూ ప్రకటించలేదు. పోలీసులు ఎన్‌కౌంటర్ కథ అల్లలేదు. వేరే ఎవరూ అతన్ని ఇన్‌ఫార్మర్ అనలేదు. అయితే చంపింది పోలీసులే అని మాత్రం ఇప్పుడు అత్యధికులు నమ్ముతున్నారు.

అతను చనిపోయిన రోజు ఇంత స్పష్టమైన అభిప్రాయం లేదు. అబ్రహాంను చంపింది 'పోలీసులయినా అయి ఉండాలి, లేదా పీపుల్స్‌వార్ అయినా అయి ఉండాలి' అని మొట్టమొదట జనం అనుకున్నారు. న్యాయంగానయితే పోలీసులు చంపదగ్గ వ్యక్తులూ విప్లవకారులు చంపదగ్గ వ్యక్తులూ వేరు వేరు కోవలకు చెందిన వారయి ఉండాలి. ఎప్పుడో చాలా అరుదుగా తప్ప ఒక వ్యక్తిని గురించి 'వీళ్లయినా చంపి ఉండవచ్చును, వాళ్ళయినా చంపి ఉండవచ్చును' అనుకునే పరిస్థితి ఉండకూడదు. కానీ తెలంగాణలో ఈ పరిస్థితి అరుదేం కాదు. తెలంగాణకు సంబంధించిన అవాంఛనీయమైన వాస్తవాలలో ఇదొకటి.

కాబట్టి ఎవరో ఒకరు ప్రకటిస్తే చంపిందెవరో తెలుస్తుంది లెమ్మని జనం అనుకున్నారు. కానీ అటువంటిదేం జరగలేదు. అబ్రహాంను చంపింది 'జనశక్తి' వాళ్లని కొన్నాళ్ల తర్వాత పోలీసులు ప్రకటించారు. అబ్రహాం స్వగ్రామానికి సమీపంలోని పాలెం నివాసి అయిన సురేందర్ అనే మరొక దళిత యువకుడిని ఈ మధ్య పీపుల్స్‌వార్ చంపింది. అతను 'జనశక్తి'లో పనిచేసి బయటకు పోయాడు. దళితులను సంఘటితపరుస్తూ రాజకీయంగా చురుగ్గా పని చేస్తున్నాడు. అతనిని పీపుల్స్‌వార్

వాళ్లు చంపినందుకు ప్రతీకారంగా జనశక్తి వారే అబ్రహాంను చంపారని పోలీసులు మొదట వ్యాఖ్యానించారు. ఇటువంటి ఘటనలు జరిగే ఉన్నాయి కాబట్టి ఈ కథలో అసంభవమేమీ లేదు. ఒక 'జనశక్తి' నాయకుడి పేరిట అబ్రహాంను చంపింది తామేనన్న ప్రకటన కూడా పత్రికా కార్యాలయాలకు వచ్చింది. అయితే వెనువెంటనే అబ్రహాం హత్యతో తమకేమీ సంబంధం లేదనీ, అతనిని తాము చంపినట్టు పత్రికలలో వచ్చిన ప్రకటన వట్టి బూటకమనీ 'జనశక్తి' స్థానిక బాధ్యులు ప్రకటించారు. వాళ్లు ఆ పని మేము చేయలేదని చెప్పాలే తప్ప 'వాళ్లు చేయరు' అని ప్రజలు అనుకునే పరిస్థితి (ఒక్క జనశక్తి గురించే కాదు, అన్ని ఎం.ఎల్ పార్టీల గురించి) లేకపోవడానికి కారణమేమిటని ఈ పార్టీలు ఆలోచించనంత కాలం పోలీసులు ఇటువంటి కథలు ఎన్నయినా అల్లగలరు. అల్లి ప్రజల చేత నమ్మించగలరు కూడ.

ఆ తరువాత పోలీసులు లైన్ మార్చారు. అబ్రహాంను చంపింది ప్రజాపంథా (న్యూ డెమోక్రసీ) వాళ్లని ప్రచారం చేయసాగారు. దానికి కూడ ఒక కారణం చూపించారు. అబ్రహాం తన ఊరిలో రమేశ్ యాదవ్ అనే తెలుగుదేశం నాయకుడికి సన్నిహితంగా ఉండేవాడనీ, ఇద్దరికీ ఫైనాన్స్ వ్యవహారాలతో సంబంధాలున్నాయనీ రమేశ్ యాదవ్ న్యూడెమోక్రసీకి కొంచెం దగ్గర కాగా అబ్రహాం పీపుల్స్‌వార్‌కు కొంచెం దగ్గర అనీ, కాబట్టి న్యూడెమోక్రసీ వారే అబ్రహాంను చంపారని ప్రచారం చేసారు. ఆ ఊరికీ ఆ మనుషులకూ సంబంధించి ఇది నిజమైనా కాకున్నా ఇటు వంటి ఉదంతాలు తెలంగాణలో జరగకపోలేదు కాబట్టి న్యూడెమోక్రసీ వారే ఇది అబద్ధం అని ప్రకటించేవరకు 'ఏమో, నిజమేనేమో,' అనుకునే వాతావరణం ఉండింది. ఆ పార్టీ ఎక్కువగా హత్యలు చేయదు కాబట్టి ఈ కథ నిజం కాదని కూడా ఎవరూ అనుకోలేదు. ఆ పార్టీ హత్యలు తరచుగా చేయని మాట నిజమేగాని ఇతర ఎం.ఎల్. పార్టీలకూ, సిపిఐ, సిపిఐ(ఎం)లకూ దగ్గరి వారయిన వ్యక్తులను ఆ పార్టీ చంపిన ఘటనలు ఉన్నాయి కాబట్టి వాళ్లే ఈ హత్య మేము చేయలేదని ప్రకటించేంతవరకు 'ఏమో, అయి ఉండవచ్చు'ననుకునే వాతావరణమే ఉండింది.

నిజానికి ఎం.ఎల్ పార్టీల మధ్యనున్న ఈ అవాంఛనీయమైన వాతావరణాన్ని వాడుకొని పోలీసులే అబ్రహాంను హతమార్చారని నమ్మడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు. అతని హత్యోదంతం మీద పోలీసుల సంతకం స్పష్టంగా ఉంది. మోటార్‌సైకిల్ మీద జాతీయ రహదారి వెంబడి పట్టపగలు ఒక వ్యక్తిని తరిమి రోడ్డుపక్కనే కాల్చిచంపి వెళ్ళిపోవడం పోలీసులకు మాత్రమే సాధ్యమయ్యే పని. 'గుర్తుతెలియని వ్యక్తుల' రూపంలో పోలీసులొచ్చి హత్య చేసి వెళ్ళిపోయిన ఘటనలు నిజామాబాద్ జిల్లాలో ఇంకా కొన్ని జరిగి ఉన్నాయి. అబ్రహాం హత్య ఆ నమూనాలోనే ఉంది.

పోలీసులు–అన్నల చర్చ అటుంచి అబ్రహాం హత్య చాలా బాధాకరమైన ఘటన. అతను ఒక దళిత కుటుంబంలో పుట్టి కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుకున్నాడు. ఆ రోజు గ్రూప్–1 పరీక్షలు రాయడానికి నిజామాబాద్ పోతున్నాడు. తన గ్రామంలో అనేక అభివృద్ధి పనులకు తోడ్పడ్డాడు. విరాళాలు సేకరించి స్కూలు, ఆస్పత్రుల నిర్మాణం కోసం కృషిచేసాడు. పోరాట చిహ్నంగా గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం పెట్టించాడు. గ్రామంలో కూలివాళ్ల డిమాండ్లకు బాసటగా నిలబడి వాటి సాధనకు తోడ్పడ్డాడు. అదే సమయంలో ఫైనాన్స్‌లో తలదూర్చి స్థానిక తెలుగుదేశం నాయకులతో కలిసి వ్యవహారం నడిపాడు. అందులో వాళ్లకేవో తేడాలొచ్చాయని కూడా అంటారు.

దళితులయినా ఇతర బడుగువర్గాల ప్రజానీకమయినా అభివృద్ధి సాధించాలంటే వారి నుండే అబ్రహాం వంటి వ్యక్తులు పుట్టి పైకి రావడం చాలా అవసరం. అటువంటి వ్యక్తులు రాజకీయ కార్యకర్తలు కావచ్చు. కాకపోవచ్చు. రాజకీయ కార్యకర్తలయినా పూర్తిగా తమ ప్రజల బాగుకే నిబద్ధులయి ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అయినా కాకున్నా బడుగు ప్రజానీకానికి తలలో నాలుకగా ఉంటూ చదువూ చొరవా సామాజిక అభినివేశం కలిగి ఉన్న అబ్రహాంలు సామాజిక పురోగమనానికి అవసరం. వారు సాధించే ప్రగతి ఒక్కొకసారి కేవలం వారి స్వంత అభివృద్ధిగానే కనిపించినా దానిని కేవలం ఆ విధంగానే చూడడం తప్పవుతుంది. అందులో ఎంతో కొంత మేరకు బడుగు ప్రజల అభివృద్ధి ఇమిడి ఉంటుంది. వేరే ఏ రూపంలో కాకున్నా ఇతర దళితులకు వారిచ్చే ఆత్మ విశ్వాసం రూపంలోనయినా ఉంటుంది.

అయితే తెలంగాణ దుర్గతిలో ఒక ముఖ్య విషయమేమిటంటే అబ్రహాం వంటి వ్యక్తి కావడం ఇక్కడ ప్రమాదకరం. ఇతరులకు కాదు, తనకే ప్రమాదకరం. అటువంటి వ్యక్తులు ఎం.ఎల్.పార్టీల వైపు ఆకర్షితులు కావడం సహజం. కానీ ఆ పార్టీలలో పూర్తిగా చేరకపోవచ్చు. అంతటి ఏకీభావం వారిలో ఉండకపోవచ్చు. పూర్తి స్థాయిలో చేరితే వారికి కొంత కాలమయినా భద్రత ఉంటుంది. కానీ వారికి చేరువ మాత్రమే అయి బయట బతికితే (అబ్రహాం లాగా) ఏదో ఒక రోజు పోలీసులకు టార్గెట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. లేదా ఒక ఎం.ఎల్. పార్టీకి చేరువయితే ఇంకొక ఎం.ఎల్ పార్టీకి కంటగింపై ఏదో ఒక రోజు మూల్యం చెల్లించుకునే ప్రమాదం ఉంటుంది. లేదా ఎం–ఎల్ పార్టీలకు దగ్గర కాకుండా తెలుగుదేశానికో, కాంగ్రెస్‌కో దగ్గరయి సర్పంచ్‌గానో, ఎంపిటిసిగానో గెలిచినా, గెలవాలని ఆశపడినా ఎం.ఎల్.పార్టీలకు కంటగింపయ్యే ప్రమాదం ఉంటుంది. ఆ వ్యక్తి స్థాయి ఏమిటని

చూడకుండా కాంగ్రెస్ ఏజెంటనో, తెలుగుదేశం ఏజెంటనో 'అన్నలు' భౌతికదాడికి గురిచేసే ప్రమాదం ఉంటుంది.

ఏవిధంగా చూసినా తెలంగాణలో అబ్రహాంలకు భద్రత లేదు. వాళ్లు 'అన్నల'లో చేరినా చేరకున్నా లేదు. కానీ ఇది అబ్రహాంల వ్యక్తిగత సమస్యకాదు. తెలంగాణ పీడిత ప్రజల సమస్య. తమ నుండి అబ్రహాంలు పుట్టి పైకి రాకుండా ఆ ప్రజలు బాగుపడగలరా? ఒకరు పోతే వెయ్యి మంది వస్తారని నినాదాలు ఇస్తుంటాం గానీ నిజంగా రారని మనకు తెలుసు. తెలంగాణకు సంబంధించిన అతి ముఖ్యమైన సమస్యలలో ఒకటయిన దీని గురించి ఆలోచించే వారెవరు? ఆలోచిస్తే పోలీసులకే కాదు. విప్లవ కమ్యూనిస్టు పార్టీలకు కూడా 'శత్రువు'లవుతామని జంకేవారే ఎక్కువ!

# ఆదివాసీ హక్కులకు గండ్లు

నోరున్నవాళ్లకు జరిగే చిన్న చిన్న అన్యాయాలు సహితం బాగా ప్రచారం అవుతుంటాయి. కానీ నోరు లేని వాళ్లకు ఎంత పెద్ద అన్యాయం జరిగినా అది కనీసం వార్త కూడా కాదు.

ఆదివాసీలలో విద్యను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో 1986లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆదివాసీ (అంటే ఏజెన్సీ) ప్రాంతంలో ఉన్న స్కూళ్లన్నిటిలోనూ అధ్యాపకుల పోస్టులు స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని ఈ జీవో చెప్తుంది.

దీని వల్ల రెండు లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వం ఉద్దేశించినట్టుంది. ఒకటి– టీచర్లు స్థానిక ఆదివాసీలే అయితే అక్కడే ఉండడానికి అభ్యంతరం చెప్పరు. ఇతరులకు ఏజెన్సీలో పోస్టింగ్ వేస్తే బయటికి బదిలీ చేయించుకునే పైరవీతోనే కాలమంతా గడుపుతారు. ఆదివాసీ అధ్యాపకులు కొంతమేరకైనా తమ వారి బాగోగులు కోరుకుంటారు. కాబట్టి కొంచెం శ్రద్ధగా చదువు చెప్పే అవకాశం కూడ ఉంది. అవసరమైనప్పుడు తమ భాషలో (ఒక ప్రత్యేకమైన భాష ఉన్న తెగలయితే) బోధించగలరు. తమవారే అధ్యాపకులు కావడం ఆదివాసీ పిల్లలకు సహితం మానసిక స్థయిర్యాన్నీ, చదువుకోవడానికి ప్రోత్సాహాన్నీ ఇస్తుంది.

రెండవ లక్ష్యమేమిటంటే చదువుకున్న ఆదివాసీలకు ఉద్యోగాలు దొరకడం చదువుకోవడానికి ప్రోత్సాహం ఇస్తుంది. ఆదివాసీలకు ఉద్యోగరంగాలలో ఉన్న 6 శాతం రిజర్వేషన్ వల్ల కొద్ది మందికి మాత్రమే ఉద్యోగాలు దొరకగలవు. ఆ కొద్ది ఉద్యోగాలు ఏజెన్సీ బయట బతికే ఆదివాసీ తెగలు తీసేసుకుంటున్నాయి. ఉద్యోగాలు దొరకని చదువుపట్ల ఏజెన్సీలోని ఆదివాసీలకు పెద్దగా ఆసక్తి ఉండదు. కనీసం స్థానికంగా టీచరు పోస్టులయినా దొరుకుతాయన్న నమ్మకం ఉండడం ప్రోత్సాహకంగా పనిచేస్తుంది.

జీవో బాగానే ఉందిగానీ టిటిసి పూర్తి చేసిన ఆదివాసీలు తగు సంఖ్యలో లేకపోతే ఏం చేయాలన్న ప్రశ్నవస్తుంది. దానికి జవాబుగా 10వ తరగతి దాకా చదువుకున్న ఆదివాసీ లెవరికయినా టీచర్ పోస్టులు ఇయ్యవచ్చుననీ, ఆ తరువాత వారిని డెప్యుటేషన్‌మీద పంపించి పూర్తి చేయించవచ్చుననీ ప్రభుత్వం నియమం పెట్టింది. హైస్కూల్ అధ్యాపకుల విషయంలో అది సాధ్యం కాకపోవచ్చును. కాబట్టి అక్కడ మట్టుకు అర్హత గల ఆదివాసీ అభ్యర్థులు దొరికే దాకా తాత్కాలికంగా ఆదివాసీయే తరులను నియమించవచ్చుననీ, అర్హత గల వారు దొరకగానే వీరిని తొలగించాలనీ ప్రభుత్వం మరొక జీవో జారీ చేసింది.

ఈ 'తాత్కాలికం' అనే దానిని పర్మనెంట్ చేసుకోవడానికి గిరిజనేతర అధ్యాపకులు చేసిన ప్రయత్నాల గురించి, అందుకోసం న్యాయస్థానాలను వాడుకున్న వైనాన్ని గురించి చెప్పుకోవడానికి ఇది సందర్భం కాదు.

అసలుకే మోసం తీసుకురావడానికి స్వయంగా అధికారులే చేస్తున్న ప్రయత్నాల గురించి ఇక్కడ మాట్లాడుకోవాలి. నిజానికి ఏజెన్సీలో ఆదివాసీలకే అధ్యాపక పోస్టులు ఇవ్వాలన్న నియమం వల్ల ఆదివాసీలలో ఒక కొత్తతరం అధ్యాపకులు పెద్దసంఖ్యలోనే ముందుకొచ్చారు. దీని వల్ల ప్రభుత్వం దృష్టిలో ఉన్న పై రెండు లక్ష్యాలే కాక మరొక ముఖ్యమైన సామాజిక లక్ష్యం కూడ నెరవేరింది.

నిగాహ్

రిజర్వేషన్లు పొందే అణగారిన కులాలు, ఆదివాసీలలో 'క్రీమీలేయర్' గురించి మాట్లాడేటప్పుడు చాలామంది అర్థం చేసుకోని ఒక విషయం ఏమిటంటే, ఆ కులానికి లేక తెగకు ప్రత్యేకమైన పరిస్థితుల గురించి మాట్లాడడానికి, వారి ఆకాంక్షలను వ్యక్తం చేయడానికి ఒక ప్రాతినిధ్య వర్గంగా కూడా రిజర్వేషన్లు పొందినవారు ఉపయోగపడగలరు. వారందరూ అన్ని సందర్భాలలోనూ తమ తోటివారి క్షేమాన్ని గురించి నిబద్ధతతో ఆలోచించకపోవచ్చు. తమ స్వంత బాగు చూసుకొని సంతృప్తి చెందే బాపతు చాలామంది ఉండవచ్చు. అయినప్పటికీ సామాజికంగా అత్యవసరమైన ఈ పాత్రను తొలితరం లబ్దిదారులు ఏదో ఒక మేరకు నిర్వహిస్తారనేది గుర్తించవలసిన విషయం. వాళ్లందరినీ టోకుగా తమ వ్యక్తిగత ప్రయోజనాలు మాత్రమే చూసుకొని తమ ప్రజలనుండి వేరు పడిపోయే 'క్రీమీలేయర్'గా చూడటం పెత్తందారీ కులాల దృక్కోణానికి చెందిన వైఖరి.

ఈ ప్రయోగానికి గండి కొట్టే ప్రయత్నం అధికారులే చేస్తున్నారన్నాను కదా. గత సంవత్సరం విశాఖపట్నం జిల్లాలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా పాఠశాల అధ్యాపకులను ఎంపిక చేసినప్పుడు ఏజెన్సీ వెలుపల ఉన్న స్కూళ్లతో బాటు ఏజెన్సీలోని స్కూళ్ళను కూడ కలిపేసి పై జీవోకు పూర్తిగా విరుద్ధంగా ఉమ్మడిగా ఎంపిక చేశారు.

దానితో ఏజెన్సీలోని పాఠశాలలలోని 883 అధ్యాపక పోస్టులకూ గిరిజనేతరులే ఎంపిక అయ్యారు!

అదృష్టమో దురదృష్టమో గానీ వారిలో చాలామంది మారుమూల గిరిజన గూడేలలో పనిచేయడానికి ఇష్టపడక పోవడం వల్ల అందులో 300 చిల్లర పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. 534 పోస్టులలో మాత్రం గిరిజనేతరులు అధ్యాపకులుగా చేరారు.

అధ్యాపకుల నియామకం కేవలం విద్యాశాఖ ద్వారా జరిగేటట్టయితే తాము చేసిన తప్పిదానికి ఉండే సామాజిక పర్యవసానం అర్థం కాక చేసారని అనుకోవచ్చు. కానీ అధ్యాపకుల నియామకం జరిగేది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో. వీరికి గిరిజన సంక్షేమాన్ని చూసుకునే బాధ్యత కూడ ఉంది. అయినప్పటికీ ఇది జరిగిందంటే చట్టాలలో ఆదివాసీలకు అనుకూలమయిన అంశాలు కొన్ని ఉన్నా, రాజకీయాలలోనే కాక అధికార యంత్రాంగంలోనూ ఆదివాసీయేతరుల ప్రయోజనాల ప్రాబల్యం చాలా ఉండడం దానికి కారణం. వేరే ఎక్కడయినా ఒక వర్గానికి రిజర్వ్ చేయబడిన పోస్టులు 883 వేరే వాళ్లకిస్తే ఎంత గొడవ జరిగేదో! కానీ విశాఖపట్నంలో ఆదివాసీలకు జరిగిన ఈ అన్యాయం నిశ్శబ్దంగా జరిగిపోయింది.

ఆదివాసీలలోని అంతో ఇంతో చదువుకున్నవారు సహితం మౌనంగా ఉండిపోయారు. కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఇది జరిగింది కాబట్టి చట్టం మారిందేమో అనుకున్నారంట.

కానీ ఈ అక్రమమయిన ఎంపికలు జరిగిన కొన్నాళ్లకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఏదో పని మీద విశాఖపట్నం వచ్చి ఈ విషయం తెలుసుకొని బాహాటంగానే తప్పు పట్టడంతో చట్టమేమీ మారలేదనీ, తమకు అన్యాయం జరిగిందనీ ఆదివాసీలకర్థం అయింది. విశాఖపట్నంలోనే కాక వరంగల్‌లో కూడా ఇదే జరిగిందని ఇప్పుడు తెలుస్తున్నది.

చట్టాలలో ఉన్న సంక్షేమం వాస్తవంలో అందకుండా చేయడానికి సమాజంలో చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆ సంక్షేమం పొందేవారికి నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేనంత కాలం ఇది సాగుతుంది.

ఇప్పుడు ఏజెన్సీలో నియమించిన గిరిజనేతర అధ్యాపకులను బయటికి బదిలీ చేసి ఏజెన్సీలో ఖాళీలను ఆదివాసీ విద్యావంతులతో నింపడం ఒక్కటే పరిష్కార మార్గం. ఆ పని చేస్తామని నోటి మాటగా ప్రభుత్వ అధికార్లు అంటున్నారు. కాని నిజంగా చేస్తారా?

మే 30, 1999

# పదవి కోసం రాజ్యాంగ సంస్కృతిని ధ్వంసం చేయొద్దు

అంతా విదేశీయం కావచ్చునంట గానీ దేశ ప్రధానమంత్రి పుట్టుక విదేశీయం కాకూడదంట.

ఇది సోనియాగాంధీ యోగ్యతకు, అర్హతకు సంబంధించిన విషయం కాదు. ఆమెకు భారతదేశం గురించి, ఈ దేశంలోని పేద, బలహీన వర్గాల ప్రజల బతుకుల గురించి, ఆరాటాల గురించి ఏమీ తెలియదు కాబట్టి ఆమె దేశానికి ప్రధానమంత్రి కావడం మంచిది కాదంటే అర్థం చేసుకోవచ్చు. ఈ దేశంలో పుట్టిన మహానుభావులకు అంతకంటే ఎక్కువ ఏం తెలుసులెమ్మని ఆమెకే వోటు వేసే వాళ్లు ఉంటారు. ఎంత తెలియదనుకున్నా వాళ్లు ఆమె కంటే మెరుగని ఆమెను తిరస్కరించేవాళ్లుంటారు. ఈ దేశపు కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతమైన విదేశీయురాలే బడుగు కులాలకూ మైనారిటీ మతాలకూ వెనుకబడ్డ ప్రాంతాలకూ న్యాయం చేయగలదని విశ్వసించే వాళ్లూ ఉంటారు. ఎన్నికల తక్కెడలో ఈ అభిప్రాయాలలో దేని తూకం ఎంత అనేదాన్ని బట్టి ఆమె అర్హత నిర్ణయించబడుతుంది.

కానీ ఆమె విదేశంలో పుట్టింది కాబట్టి ఈ దేశ ప్రధానమంత్రి అయ్యే అర్హత లేదన్న వాదన విచిత్రమయినది. ఏ విషయంలోనూ అక్కరలేని 'స్వదేశీ' ఈ ఒక్క విషయంలోనే ఎందుకక్కర కొచ్చింది? మన దేశానికి ప్రపంచ బ్యాంకు సలహాలూ ఆదేశాలూ పనికొస్తాయి. షరతులతో సహా అంతర్జాతీయ ద్రవ్యనిధి ఇచ్చే విదేశీ మారక ద్రవ్యం పనికొస్తుంది. బిల్‌గేట్స్ పనికొస్తాడు. మన నాయకులకు వారిచ్చే ప్రశంసలు పనికొస్తాయి. విదేశీ కార్పొరేషన్ల పెట్టుబడి పనికి రావడమే కాదు, అత్యవసరం కూడ అవుతుంది. కానీ ప్రధానమంత్రి జన్మస్థలం మాత్రం విదేశీయం కాకూడదంట.

ఇది సోనియాగాంధీ హక్కుల సమస్య కాదు. కాంగ్రెస్ పార్టీ భవితవ్యం సమస్యా కాదు. నెహ్రూ  కుటుంబానికి చెందిన ఒక్క చిగురుటాకయినా సరే పట్టుకొని వేళ్లాడడానికి దొరకపోతే బతకలేని ఆ పార్టీ ఉన్నా పోయినా ఒకటే. ఆ సిగ్గుమాలిన బలహీనతే తన బలమైన సోనియాగాంధీ దేశానికి ప్రధానమంత్రి అయినా కాకపోయినా ఒకటే.

కానీ ఇది మన నాగరికతకు సంబంధించిన  సమస్య. మన రాజకీయ సంస్కృతికి సంబంధించిన సమస్య కూడ.

రెండవ దాన్ని మొదట తీసుకుందాం. రెండు నాల్కల ధోరణి మన దేశ రాజకీయాల సహజ లక్షణమయిపోయింది. కానీ దేనికయినా ఒక పరిమితి ఉండాలి. సోనియాగాంధీ విదేశీయురాలని అభ్యంతరం తోచింది మరెవ్వరికో కాదు, శరద్‌పవార్‌కు. ఈయన కాంగ్రెస్ నాయకులందరిలోకీ మొట్టమొదట ఆర్థిక సరళీకరణనూ, గ్లోబలైజేషన్‌నూ ఆహ్వానించిన వ్యక్తి. ఈ రోజు చంద్రబాబునాయుడు ప్రథమ శ్రేణి 'ఆధునిక వాది'గా బహుళజాతి కార్పొరేషన్‌ల మన్ననలు పొంది ఉండవచ్చుగానీ ఒక దశాబ్దం కిందనే ఆ గుర్తింపు పొందినవాడు శరద్‌పవార్. అతనికి ఈ రోజు సోనియాగాంధీ జన్మస్థలం విదేశీయం అనే విషయం అభ్యంతరంగా తోచిందంటే ఆశ్చర్యం కలగక మానదు.

నిజానికతనికి కావలసింది ప్రధాన మంత్రి పదవి. కోరుకుంటే కోరుకోనివ్వండి, అభ్యంతరం లేదు. ఈ రోజు రాజకీయాలలో అందరూ ఉండేది అందుకోసమే. అతనొక్కడినే తప్పుపట్టనవసరం లేదు. అయితే అందుకోసం సంకుచితమైన ఆలోచనలను ప్రవేశపెట్టనవసరం లేదు. వెనకేసుకురానవసరం లేదు.

వేరే దేశాలలో 'ఈ దేశంలో పుట్టిన పౌరులకే దేశ ప్రధానమంత్రి, లేక అధ్యక్షులు అయ్యే హక్కు' ఉంటుంది అని రాసుకుంటే రాసుకోనివ్వండి. మనం రాసుకోలేదు. ఒక ఉదారమైన నియమం మన రాజ్యాంగంలో ఉన్నప్పుడు ఇతరులకు దానిని ఆదర్శంగా నిలబెట్టాలి గానీ ఇతర దేశాల రాజ్యాంగంలో ఉన్న సంకుచితమైన ఆలోచనలను మనం ఆదర్శంగా స్వీకరించి మన రాజ్యాంగాన్ని మార్చుకోనవసరం లేదు. ప్రజాస్వామ్యానికి కావలసింది ప్రజల అభీష్టాన్నీ, ప్రజాస్వామ్య విలువలనూ గౌరవించే నాయకులు. వాళ్లు ఎక్కడ పుట్టిన వారయినా కానీయండి గాక.

రాజ్యానికి చెందిన  ఏ పదవికైనా పౌరులందరూ సమానంగా అర్హులేనని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1) అంటుంది. 'పౌరులు' అంటే పుట్టుకతో పౌరులా లేక తరువాత పౌరసత్వం పొందిన వారా అన్న విచక్షణ ఆర్టికల్ 16(1)లో లేదు.

దాని గురించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలలోనూ లేదు. ఆ తరువాత పొందిన పౌరసత్వం కూడా ఈ దేశానికి చెందిన ఒక ఇంటికి కోడలయి వెనువెంటనే పొందిందా లేక చాలా కాలం తటపటాయించి పొందిందా అని సోనియాగాంధీ గురించి చేస్తున్న చర్చకు ఆర్టికల్ 16(1)లో అసలే తావులేదు.

ఆర్టికల్ 16(2) మరింత స్పష్టంగా, రాజ్యానికి చెందిన ఏ ఉద్యోగం లేక పదవి విషయంలోనయినా ఒక వ్యక్తి మతాన్ని బట్టి, జాతిని బట్టి, లింగాన్ని బట్టి, వంశాన్ని బట్టి, పుట్టిన స్థలాన్ని బట్టి, నివాసాన్ని బట్టి వివక్ష చూపించడానికి వీలు లేదని అంటుంది.

ఇది ప్రాథమిక హక్కుల జాబితాలో ఉందని నొక్కి చెప్పాలి.

'జాతిని బట్టి', 'పుట్టిన స్థలాన్ని బట్టి' రాజ్యానికి చెందిన ఏ ఉద్యోగం లేక పదవికి ఒక వ్యక్తిని అనర్హులుగా భావించడానికి వీలు లేదని ఈ ప్రాథమిక హక్కు చెప్తుండగా, సోనియా గాంధీ అర్హత గురించి చర్చ ఎందుకు? యాభై ఏళ్ల కింద మన రాజ్యాంగకర్తలు దేశ పాలనకు కావలసింది ప్రజలనూ ప్రజాస్వామ్యాన్నీ ప్రేమించే వారే తప్ప పరాయిజాతి వారు వద్దనీ, వేరే దేశాలలో పుట్టినవారు వద్దనీ నిషేధాలు పెట్టవలసిన అవసరం లేదన్న విశాల దృక్పథం అవలంబించినప్పుడు మనమీ రోజు దానిని వెనక్కి తీసుకుపోదామా?

శరద్ పవార్ సమస్యలు శరద్ పవార్‌కు ఉన్నాయనుకోండి. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొద్దిమంది యోగ్యులయిన నాయకులలో ఆయనొకడు. వేరొక పార్టీ అయితే ఆ యోగ్యత ఆయన నాయకత్వ అర్హతను పెంచేది కానీ కాంగ్రెస్ పార్టీలో అదే అతని అనర్హత అయింది. నెహ్రూ కుటుంబానికి చెందిన వారయితే యోగ్యత ఉన్నా లేకపోయినా దేశ నాయకులు కాగలరు. వేరేవారు తాత్కాలికంగా దేశ నాయకులు కావలసివస్తే పి.వి. నరసింహారావులాగ నాలుగు భాషలు మాట్లాడడానికి తప్ప వేరే దేనికీ పెద్దగా పనికిరాని వారు మాత్రమే కాంగ్రెస్ హయాంలో దేశ నాయకత్వానికి అర్హులు. అందువల్ల ప్రధానమంత్రి కావాలన్న శరద్ పవార్ కోరిక తీరకుండా ఉండిపోయింది. అందుకు 'పాపం, పవార్' అని ఒక కన్నీటి బొట్టు కార్చడానికి అభ్యంతరం లేదుగానీ, తన కోరిక తీర్చుకోవడానికి బిజెపి మార్కు సంకుచితత్వానికి సెక్యులర్ అచ్ఛాదన కల్పిస్తూ ఒక క్రైస్తవ నాయకుడినీ, ఒక ముస్లిం నాయకుడినీ వెంట వేసుకొని ఏదో సూత్రబద్ధమైన చర్చ జరుపుతున్నట్టు నటించనవసరం లేదు.

జూన్ 13, 1999

# వీరయ్య మరణం

'మే 17 (గ్రూపు' నాయకుడు వీరయ్యను మే 17నాడే పోలీసులు చంపడంలో బహుశా ఒక వెక్కిరింత ఉందేమో. "జనశక్తి" పార్టీలో ఒక సిద్ధాంత చర్చకూ విభేదానికీ మే 17 సంకేతంగా ఉండింది. ఆ సిద్ధాంత చర్చకు బాధ్యుడయిన వ్యక్తిని వేచి వేచి అదే తేదీన పట్టుకుపోయి చంపడంతో నక్సలైట్ ఉద్యమంలో జరిగే సిద్ధాంత చర్చల పట్ల తమకెంత చులకన భావముందో పోలీసులు ప్రకటించినట్టయింది. నక్సలైట్ ఉద్యమాన్ని వట్టి హింసాకాండగా చూపించడం ప్రభుత్వ నక్సలైట్ వ్యతిరేక విధానాలకు వ్యూహాత్మకంగా అవసరం అయింది. ఆ విధానంలో భాగంగా ప్రదర్శిస్తున్న క్రూరమైన హింసాకాండను సమర్థించుకోవడానికది అవసరం అయింది. ఒక సిద్ధాంతం, ఒక లక్ష్యం, ఒక సామాజిక పునాది ఉన్నాయని ఒప్పుకోకుండ ఉండడం అవసరం అయింది. ఈ వ్యూహాత్మక అవసరం పోలీసులలో ఒక వెక్కిరింత ధోరణికి దారి తీసింది. చంపదలచుకుంటే బహుశా ఏ రోజైనా చంపగలిగి ఉండిన వీరయ్యను మే 17 నాడే పట్టుకొని చంపడంలోని హేళన దీనినుండే వచ్చింది.

ఎక్కడో పట్టుకున్న నక్సలైట్ కార్యకర్తను తీసుకొచ్చి తను పని చేసిన ప్రాంతంలోనే కాల్చిపడేయడం పోలీసులకు చాలాకాలంగా ఉన్న అలవాటు. ఇది అక్కడి ప్రజల రాజకీయ మనోనిబ్బరాన్నే కాదు రాజకీయాలకుండే గాఢతను కూడ బాగా దెబ్బతీస్తుంది. అక్కడ పని చేసిన రోజులలో ఆ వ్యక్తి అక్కడి ప్రజల కళ్లకు ఒక ఉద్యమకారుడిగా, ఒక సిద్ధాంత వేత్తగా, ఒక నాయకునిగా, బహుశా ఒక వీరునిగా కనిపించి ఉండవచ్చు. ఆ వ్యక్తి ఒక దినం అక్కడే ఒక దిక్కుమాలిన శవమై పడి ఉండడం ఈ భావనను చులకన పరుస్తుంది. ఒక సిద్ధాంత చర్చకు మూలమయిన వ్యక్తిని ఒక మారుమూల గ్రామ శివారులో దిక్కుమాలిన శవంగా చూపించడం అతని సిద్ధాంతాన్నీ, సిద్ధాంత కృషినీ అదే విధంగా చులకన చేసే చర్య.

నక్సలైట్ ఉద్యమకారులు ఏ మేరకైతే సిద్ధాంత చర్చకన్నా ఆయుధాల పోటీకి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారో, ఏ మేరకయితే వారి ఉద్యమ ప్రవర్తన, వ్యక్తిగత ప్రవర్తన

సిద్ధాంత ఆశయాలకు భిన్నంగా ఉంటుందో ఆ మేరకు వారి రాజకీయాలను చులకన పరిచే ఈ పోలీసు వ్యూహానికి బలం, విశ్వసనీయత చేకూరుతాయి. తమ రాజకీయాలను వారే చులకన పరచుకుంటే ఇంక వేరే వాళ్లకు వాటిని చులకన చేసి చూపించడం ఏం కష్టం! ఇప్పుడు కొంత కాలంగా అదే జరుగుతున్నదని అంటే వారికి కోపం రావచ్చునుగానీ అది కేవలం పోలీసుల దుష్ప్రచారం కాదు.

అది పోనీయండి. బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడడాన్ని విమర్శించినప్పుడు 'వాళ్లు చంపగా తప్పులేనిది వారిని చంపితే తప్పా?' అని పోలీస్ అధికారులు ఎదురుప్రశ్న వేస్తుంటారు. వాళ్లు చంపినా, చట్టం పోలీసులకు వారిని చంపే అధికారం ఇవ్వలేదన్న జవాబు సమాజంలో సహితం చాలామందిని సంతృప్తి పరచదు కాబట్టి పోలీసులు దానిని ఖాతరు చేయరు. నక్సలైట్లు బెదిరించి డబ్బులు వసూలు చేస్తారనీ, బల ప్రయోగంతో పంచాయతులు చేస్తారనీ, అయినా వారితో చట్టం నాగరికంగా వ్యవహరించాలనడంలో అర్థం లేదనీ పోలీసులు చేసే వాదనకు సమాజంలో మద్దతు చాలా ఉంది. పౌరులు చట్టాన్ని గౌరవించకపోతే చట్టం పౌరులను గౌరవించనక్కరలేదనే తప్పుడు వాదనకు మన ఆలోచనా రీతిలో ఇంకా చాలా చోటు ఉండడం పోలీసు అత్యాచారాలకు బలం చేకూరుస్తుంది. చట్టాన్ని ఒక ప్రతీకార సాధనంగానే తప్ప నాగరికతా విలువగా చూడడం మనమింకా నేర్చుకోలేదు.

కానీ ఈ తప్పుడు ప్రమాణాల ప్రకారం కూడ వీరయ్యను పోలీసులు చంపనవసరం లేదు. అతని 'మే 17 గ్రూపు' జనశక్తి నుండి విడిపోయే క్రమంలో వారి వల్ల అనేక హింసాత్మక ఘటనలు (క్రూరులయిన ప్రజాపీడకులపైన దాడి చేసిన ఘటనలు కావు, వారి విప్లవ ప్రమాణాల ప్రకారం కూడ అసమర్థనీయమైన ఘటనలు) జరిగాయి. డబ్బున్న వాళ్లనే కాక ఏమంత లేని వాళ్లను సహితం హింసించి, లేక బెదిరించి పెద్దఎత్తున డబ్బు వసూలు చేసుకున్న ఘటనలు జరిగాయి. ఇటువంటి తప్పుడు చర్యలను విమర్శించే సంస్కృతి మన ప్రజాతంత్రవాదులలో లేదు కాబట్టి, పోలీసులు చేసే విమర్శకు విశ్వసనీయతగానీ విలువగానీ లేదు కాబట్టి, ఇవి నిరాఘాటంగా సాగాయి. పైన చెప్పిన వికృత తర్కం ప్రకారం అప్పట్లో వీరయ్య చంపదగ్గవాడే, ఎన్‌కౌంటర్ చేయదగ్గవాడే.

కానీ, 'వీరయ్య వర్గం' వేరయిపోయి నోరు తిరగని పొడుగయిన పేరు పెట్టుకొని కొత్త పార్టీగా రూపొందిన తరువాత గతంలో చేసిన ఈ హింసాత్మక చర్చలు తప్పనీ, ఇక మీదట అటువంటి చర్యలకు పాల్పడబోమనీ తీర్మానం చేసారు. దానిని పత్రికలకు ఇచ్చారు. పత్రికలు ప్రచురించాయి. అయినప్పటికీ పోలీసులు వీరయ్యను ఎందుకు

చంపినట్టు? హింస ఎన్‌కౌంటర్‌లను సమర్థించుకోవడానికి చూపించే సాకు మాత్రమేననీ, ఎన్‌కౌంటర్లకు అసలు కారణం రాజకీయమనీ చాలా కాలంగా అంటున్న విషయం వీరయ్య మరణంతో మరొక్కసారి రుజువయింది కదా?

కానీ 'ఎన్‌కౌంటర్' చేయబడే స్థితిని తెచ్చుకోవడంలో వీరయ్య పాత్ర కూడా ఉందేమో? మన దగ్గరున్న ఎం.ఎల్. పార్టీల రాజకీయ సంస్కృతి పాత్ర కూడ ఉందేమో? ఈ ప్రశ్నలు, వాటికి వెతికే జవాబులు వీరయ్య సహచరులకూ ఇతర ఎం.ఎల్ పార్టీలకూ నచ్చకపోవచ్చు. అయినప్పటికీ వేసుకోక తప్పదు. వెతకక తప్పదు.

'మే 17 గ్రూపు' పెట్టిన సిద్ధాంత చర్చకు రహస్య సాయుధ నిర్మాణంతో సంబంధమేమీ లేదు. కుల వ్యవస్థను కూలదోయడం ప్రధాన విషయం (లేక ప్రధాన విషయాలలో ఒకటి) అనుకున్నప్పుడు ఎకె47లతోనూ దళాలతోనూ పని ఏముంటుంది? పోనీ, పని ఎంత ఉంటుంది? కులాన్ని ఆయుధాలతో ఎవ్వరూ కూలదోయలేరు. దానికి ప్రధానంగా కావలసింది విస్తృతమైన సామాజిక సాంస్కృతిక కృషి. సంవాదంతో కూడుకున్న బహిరంగ కృషి. రహస్య నిర్మాణమూ ఆయుధాలూ దానికి ఆటంకమే తప్ప వాటి వల్ల ప్రయోజనమేమీ ఉండదు. బలప్రయోగం అసలే అక్కరలేదని కాదు. పెత్తందారీ కులాల భౌతిక దాడులను ఎదుర్కొనడానికి దళిత బహుజన కులాలు కూడ భౌతికంగా సిద్ధంగా ఉండక తప్పదు. కానీ కుల పెత్తనంలో భౌతిక హింస ఒకానొక అంశం మాత్రమే కాక రాశిలోనూ గుణంలోనూ అప్రధాన అంశం కూడ. ఆ అవసరం నిర్దేశించే నిర్మాణం మొత్తంగా కులవ్యతిరేక పోరాటానికి నష్టం చేస్తుంది.

ఆస్తి సంబంధాలను మార్చడమే ప్రధాన విషయం అనుకునే వాళ్లు సహితం రాజ్యాధికార సాధన కోసం చేపట్టే సాయుధ నిర్మాణం నిర్దేశించే అవసరాలకు పెద్దపేట వేయడం ఎంతవరకు సబబన్నది వేరే ప్రశ్న. ఇప్పుడున్న ఆస్తి సంబంధాలను తొలగించడానికి రాజ్యాధికార బలప్రయోగం ఉపయోగపడుతుందనుకున్నా, నూతన వ్యవస్థకు 'పునాది'గా వారు భావించే సమిష్టి సహకార సంబంధాలను పెంపొందించడంలో రాజ్యానికీ దాని బలప్రయోగ అధికారానికీ ఉండగల పాత్ర చాలా స్వల్పం. పైగా అదొక ప్రతిబంధకంగా కూడ పనిచేయగలదు.

దీనికి జవాబుగా తమ దగ్గర సాంస్కృతిక విప్లవం అనే భావన ఒకటి ఉందని వాళ్లు అంటుంటారు. కానీ వాళ్లు నమ్మే సాంస్కృతిక విప్లవం బలప్రయోగంతో కూడిన వర్గ పోరాట ప్రక్రియ. దాని వల్ల సంస్కృతిలో స్థిరమైన మార్పేదీ రాదు. భయం కొద్దీ తాత్కాలికంగా ఏదో మార్పు వచ్చినట్టు కనిపించవచ్చు గాక. నిజంగా

సాంస్కృతిక పరిణామాన్ని గురించి ఆలోచించదలచుకుంటే మావో కంటే బుద్ధుడు ఎక్కువ ఉపయోగపడతాడు. మనం ఒక సంస్కృతినీ, అది మనుషులలో ప్రోత్సహించే ప్రవర్తనా రీతులనూ వ్యతిరేకించేటప్పుడు ప్రత్యామ్నాయ సంస్కృతిని గురించి, దానిని మనుషుల ఆలోచనలలోనూ నడవడికలోనూ నెలకొల్పవలసిన అవసరాన్ని గురించి వివేచించాలని గుర్తించిన తొలి తత్వవేత్త బుద్ధుడు. ఆయన నిర్దేశించిన ఎనిమిది సూత్రాల నడవడిక నియమాలు ఇవాళ ఉన్నదున్నట్టు సరిపోకపోవచ్చు. కానీ ఆ ఆలోచనా రీతి మానవీయమైన సోషలిజానికి అవసరం.

అదట్లాగుంచి, కుల నిర్మూలన పోరాటాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గుర్తించిన 'వీరయ్య వర్గం' రహస్య పార్టీ నిర్మాణానికీ, ఎకె 47లు పట్టుకున్న దళాలకూ అందులో పెద్దగా చోటు లేదని గుర్తించే ఉండాలి. ఏదో ఒక స్థాయిలో గుర్తించినట్టు వారు తీసుకున్న కొన్ని నిర్ణయాలను బట్టి తోస్తుంది. కానీ ఆ గుర్తింపుకు నిర్ణయాత్మక స్థానం ఇవ్వలేకపోయారు. తద్వారా వీరన్నను బలితీసుకునే అవకాశం పోలీసులకు మరింత సులభతరం చేసారు.

ఎందుకివ్వలేకపోయారు? 'అదిగో, మేము చెప్పలేదా! వీరయ్య రివిజనిస్టయి పోయాడు' అని తమ పాత సహచరులు, ఇతర సాయుధ కమ్యూనిస్టు పార్టీలూ దుమ్మెత్తి పోస్తారన్న భయంతోనా? ఎం.ఎల్. రాజకీయ సంస్కృతిలో ఉన్న పెద్ద భయం ఇది. ఆయుధాలక్కరలేదంటున్నారు. దళాలు అక్కర లేదంటున్నారు అన్న నిందవేసే అవకాశం ఉంటే చాలు, ఇంక ఏ సిద్ధాంత చర్చా జరగడం సాధ్యపడదు. ఒకరు జరగనివ్వక పోవడమే కాదు, ఆ అభిప్రాయానికి వచ్చిన వాళ్లు సహితం 'నేను ఆ మాట అనడం లేదు' అని సర్దుకోవడంతోనే సరిపోతుంది. దేవుడిని గట్టిగా నమ్మే గుంపులో ఏ కొత్త ఆలోచన ప్రవేశ పెట్టాలన్నా దేవుడిమీద పదే పదే విశ్వాసాన్ని ప్రకటించక తప్పనట్టు.

వీరయ్య నక్సల్బరీ వారసత్వంలో భాగమైన ఈ భయానికి బలయ్యాడా అన్న ప్రశ్న అతని సహచరులకు గానీ ఇతర ఎం.ఎల్ పార్టీలకు గానీ రుచించదు. కానీ అడగక తప్పదు. 'లీగల్‌గా ఉండే వాళ్లను మాత్రం పోలీసులు చంపడం లేదా' అన్న ఎదురుప్రశ్న తప్ప దీనికి వారెవ్వరి దగ్గరా జవాబుందని నేను అనుకోను.

జూన్ 27, 1999

# కార్గిల్‌కు ఒక కార్గిల్ కోణం ఉంది

ఎన్నడూ భారతదేశంలో వార్తలలో ఉండే 'అదృష్టం' ఎరుగని కార్గిల్ వాసులకు ఈ మధ్య వార్తలన్నీ కార్గిల్ గురించే కావడం ఏమాత్రం ఆనందం ఇస్తుందో గానీ చాలా కోపం, నిష్ఠూరం కలిగిస్తుందనడంలో అనుమానం లేదు.

జమ్మూ-కాశ్మీరు రాష్ట్రం గురించి మాట్లాడుకున్నా, ఆ పేరు సూచించే రెండు ప్రాంతాలే కాకుండా ఆ రాష్ట్రంలో లదాఖ్ అనే మూడవ ప్రాంతం ఉందని ఎవరికీ తోచదు. జమ్మూలో మామూలు మైదాన ప్రాంత నాగరికత ఉంది. హైందవ పుణ్యక్షేత్రమైన వైష్ణోదేవీ ఆలయం ఉంది. కాశ్మీర్ సంగతి చెప్పనే అక్కరలేదు. సుందరమైన జీలం నదీలోయ, దేవదారు అడవులు, రకరకాల పళ్లతోటలు, వరిచేలు, నిత్య రాజకీయ సంచలనం, గుల్మార్గ్, సోన్‌మార్గ్ వంటి పర్యాటక కేంద్రాలు, ఇప్పుడు పదేళ్లుగా తీవ్రమైన మిలిటెన్సీ-కాశ్మీర్ గురించి మాట్లాడుకోవడానికి చాలా ఉంది.

లదాఖ్ ఒక ఎత్తైన శీతల ఎడారి. చాలా భాగం నిర్మానుష్యంగా ఉంటుంది. అక్కడి అతి తక్కువ జనాభాలో సగభాగం బౌద్ధులు, సగభాగం షియా ముస్లింలు. ఇవి రెండూ భారతదేశంలో అప్రధానమైన మతశాఖలే. రాజకీయ సంచలనం సృష్టించడానికి కావలసిన సరంజామా ఏదీ లదాఖీల దగ్గర లేదు.

లదాఖ్ ఉత్తరార్ధం కార్గిల్. శ్రీనగర్‌ను కార్గిల్‌కు కలిపే ఏకైక రహదారిని స్వాధీన పరచుకునే ఉద్దేశ్యంతో పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న చొరబాటుదారులు సరిహద్దు దాటి ముందుకు చొచ్చుకు రావడంతో కార్గిల్ వార్తలకెక్కింది. పాకిస్తాన్ వశమవుతుందని ఆ రహదారి గురించి ఈ దేశంలో అందరూ ఆవేశపడుతున్నారుగానీ 50 ఏళ్ల తరువాత కూడా కార్గిల్‌కు ఇంకొక రహదారి ఎందుకు లేదన్న ప్రశ్న ఎవరూ వేసుకోవడం లేదు. ఆ ఒక్క రహదారి సంవత్సరంలో ఆరు నెలలు మంచుతో కప్పుకుపోయి ఉంటుంది. లేనప్పుడు కూడ ఆ రహదారిలో చాలా భాగం ఇప్పటికీ తారురోడ్డు కూడా కాదు. కంకరరోడ్డు మీద ఎత్తైన జోజిలా కనుమదాటి కార్గిల్‌వాసులు రాష్ట్ర రాజధాని అయిన శ్రీనగర్ చేరుకోవాలి.

నిజానికి లదాఖ్‌వాసులెవరూ ఆ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఎక్కడా కనిపించరు. జమ్మూ-కాశ్మీర్ ప్రాంతీయులు మాత్రం లదాఖ్‌లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ కనిపిస్తారు. లదాఖీలు తమ ప్రాంతంలో పశువులు మేపుకుంటూ సారవిహీనమైన నేలలలో వేసవికాలంలో ఒక కారు బార్లీ పండించుకుంటూ అప్పుడప్పుడొచ్చే విదేశీ పర్యాటకులకు తమ సేవలు అమ్ముకొంటూ బతుకుతుంటారు. ఈ దేశం వాళ్ల గురించి ఎప్పుడూ ఆలోచించదు. వాళ్లూ ఈ దేశాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించరు. వాళ్లకు చారిత్రకంగా భారత్ అనే ఈ దేశంతో ఉన్న సంబంధం తక్కువ. సాంస్కృతికంగానూ తక్కువ. పోనీ ఈ యాభైఏళ్లలో భారత్‌లో ఉన్న పుణ్యాన ఏమైనా అభివృద్ధి పొందారా అంటే అది అంతకంటే తక్కువ. కార్గిల్ భారత భూభాగమంటూ పాకిస్తానీ చొరబాటుదార్ల మీద మనమంతా ఆవేశపడిపోతున్నాం గానీ ఆ భూభాగానికి చెందిన కార్గిల్‌వాసులు 'ఇది భారత భూభాగం' అంటూ ఏరోజూ పెద్దగా ఆవేశపడలేదు. ఈ రోజు వాళ్లు విజయానికీ వీరస్వర్గానికీ ఉవ్విళ్లూరడం లేదు. ఎప్పుడూ ఎవరికీ అక్కరలేని కార్గిల్ ఇప్పుడు సరిహద్దు కోసం అక్కరకొచ్చిందా అని విసుక్కుంటున్నారేమో. దాదాపు నాలుగేళ్లుగా నిత్యగండంగా బతుకుతున్న తమ జీవితాలలో శాంతి ఎప్పుడు నెలకొంటుందా అన్న ఎదురుచూపు తప్ప వేరే ఏ అనుభూతీ వారిలో ఉంటుందని నమ్మడం కష్టం.

కార్గిల్ సరిహద్దు మీద పాకిస్తానీల కన్నుపడి నాలుగేళ్లయింది. 1995లో మొట్టమొదటిసారి కార్గిల్ పట్టణం మీద పాకిస్తానీ తుపాకీగుళ్ల వర్షం కురిసింది. సరిహద్దు దగ్గర కొంత ఘర్షణ రేపి మిలిటెంట్లను ఆ సందడిలో సరిహద్దు దాటించడం పాకిస్తాన్ చాలాకాలంగా అనుసరిస్తున్న వ్యూహమే. ఆ మిలిటెంట్లు పాల్గొనడానికి కాశ్మీరు లోయలో ఒక పోరాటం ఉన్నంత కాలం, ఆ పోరాటం వెనక ఉన్న కాశ్మీరీ ఆకాంక్షకు మన పాలకుల దగ్గర జవాబు లేనంతకాలం, ఆ మిలిటెంట్లనూ వారిని ప్రోత్సహించే పాకిస్తాన్‌నూ తిట్టుకొని ప్రయోజనం లేదు.

కానీ ఈ వ్యూహానికి కార్గిల్‌ను అనువయిన సరిహద్దుగా పాకిస్తాన్ చాలా కాలం భావించలేదు. ఎందుకంటే పాకిస్తాన్ ప్రోత్సాహంతో కాశ్మీరీ పోరాటంలోకి చొరబడుతున్న హర్కత్-ఉల్-అన్సార్ మిలిటెంట్లు సున్నీ ముస్లింలు. కార్గిల్ వాసులు అత్యధికంగా షియా ముస్లింలు . కార్గిల్‌పైన పాకిస్తాన్ గుండ్ల వర్షం కురిపించడం మొదలు పెట్టినప్పుడు కార్గిల్‌వాసులు ఈ తేడానే ఎత్తి చూపారు. తాము షియాలు కాబట్టే పాకిస్తాన్ తమ ప్రాణాలు లెక్కచేయకుండా తుపాకి గుళ్లు కురిపిస్తున్నదని విమర్శించారు.

అటువంటి కార్గిల్‌ను పాకిస్తాన్ ఇప్పుడు మిలిటెంట్లను సరిహద్దు దాటించడానికి అనువైన ప్రాంతంగా ఎంచుకుందంటే దానికి కారణం ఉందనే వాళ్లు లేకపోలేదు. ఆర్థికంగా మధ్యఆసియా దేశాలతో సత్సంబంధాలు కోరుకుంటున్న పాకిస్తాన్, ఆ దేశాలు అత్యధికంగా షియా శాఖకు చెందినవని గుర్తించి కార్గిల్‌వాసులను దువ్వుతున్నదన్న అభిప్రాయం ఉంది. కార్గిల్ ముస్లింలు షియా శాఖకు చెందినవారే అయినప్పటికీ షియాలలో నూర్‌బక్షియా ఉపశాఖకు చెందినవారనీ ఈ ఉప శాఖ సున్నీలకు కొంత సన్నిహితమనీ అందువల్ల వారిలో తనకు ఒక పునాదిని ఏర్పరచుకోవడం అసాధ్యం కాదన్న అభిప్రాయానికి పాకిస్తాన్ వచ్చిందనీ అంటున్నారు.

మొత్తానికి భారత-పాకిస్తాన్‌ల 'కాశ్మీర్ వివాదం' ఇక కార్గిల్‌కు వ్యాపించే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లూ కార్గిల్ భారత దేశానికి సియాచిన్‌కు పోయే దారిలో ఒక స్థావరం. పాకిస్తాన్‌కు సానుభూతి దొరకని పరాయి ప్రదేశం. మారినపరిస్థితులలో కార్గిల్ భారత్‌లో దేశసమగ్రతకూ సమైక్యతకూ దేశభక్తికీ సంకేతం అయింది. పాకిస్తాన్‌కు తన యాభై ఏళ్ల వ్యూహాన్ని కొనసాగించడానికికొక కొత్త సింహద్వారమయింది. ఇన్నాళ్లూ ఇరుదేశాలకూ అక్కరలేని కార్గిల్ ఇప్పుడీ విధంగా అకస్మాత్తుగా అక్కరకొచ్చింది.

భారత-పాకిస్తాన్‌ల 'కాశ్మీర్ వివాదం' ఆధునిక చరిత్రలోని అతి వికృతమైన వివాదాలలో ఒకటి. ఇది మనుషులతో సంబంధం లేని భూవివాదం. అక్కడ బతికే మనుషుల మనోభావాలతో నిమిత్తం లేని గట్టుతగాదా. ఈ గట్టుతగాదా చుట్టూ రెండు దేశాలలోనూ అల్లుకున్న విపరీత దేశభక్తి ఆ గట్టు దగ్గర బతికే కాశ్మీరీలకూ ఇప్పుడు కార్గిల్ వాసులకూ హాస్యాస్పదంగా కనిపించక మానదు. అయితే అందులో హాస్యమేమీ లేదు. అది వారి ప్రాణాలనూ స్వేచ్ఛనూ పణంగా పెట్టి నడుపుతున్న ప్రహసనం. వాస్తవాధీనరేఖ ఇక్కడుందా అక్కడుందా అని వెతుక్కుంటున్న భారత-పాకిస్తాన్‌లకు ఆ రేఖకు అటూ ఇటూ జీవిస్తున్న రక్తబంధువులు, 'ఇక్కడసలు రేఖ ఎవడు గీయమన్నాడు' అని ఎదురుప్రశ్న వేసే పరిస్థితి ఈ రోజు లేకపోవచ్చును గానీ, ఆ ప్రశ్న ఈ రెండు దేశాలలోని ఉగ్రదేశభక్తులు తమకు తాము వేసుకోగలిగితే అందరికీ మంచిది.

జూలై 11, 1999

# ఒకరి దేశభక్తి ఒకరికి ప్రాణసంకటం

ఈ దేశంలో ముస్లింలను ఎక్కడుంచాలో అక్కడుంచడంలో దేశభక్తులంతా కృతకృత్యులయ్యారని ఇటీవలి పరిణామాలను బట్టి తెలుస్తుంది.

'కార్గిల్ యుద్ధం' మొదలయిన తరువాత ఢిల్లీ నుండి లక్నో దాకా, లక్నో నుండి విజయవాడదాకా అనేక పట్టణాల్లో ముస్లింల సభలలోనూ సమావేశాలలోను పాకిస్తాన్ మీద దుమ్మెత్తిపోస్తూ, కార్గిల్‌కు పోయి పాకిస్తాన్ పైన పోరాడడానికి తాము సిద్ధమని ప్రకటిస్తూ తీర్మానాలు చేయడం, వాటిని ప్రకటించడం జరిగింది.

ఇదొక నాగరికమైన దేశమన్న అభిప్రాయం ఉన్న వాళ్లెవరైనా ఈ వార్తలు చదివి కొంచెం సిగ్గుపడి ఉండాలి. అంటే ముస్లింలు పాకిస్తాన్‌కు అనుకూలంగానే ఉండాలనీ వారిలో 'దేశభక్తి' ఉండకూడదనీ కాదు. కానీ బలవంతంగా తాము పాకిస్తాన్‌కు వ్యతిరేకం అని ప్రకటించుకునే పరిస్థితి ఉండకూడదు. ప్రకటించుకోకపోతే ఏమనుకుంటారో అని భయపడే పరిస్థితి ఉండకూడదు. 'దేశభక్తి' కి ప్రస్తుతం చలామణిలో ఉన్న సరిహద్దు భక్తి, చిత్రపటం భక్తి అనే నిర్వచనాన్ని బలవంతంగా అంగీకరించవలసిన పరిస్థితి ఉండకూడదు. ఇష్టపూర్వకంగా ఎవరైనా అదే నిర్వచనాన్ని ఆమోదిస్తే అది వేరే సంగతి.

ఈ పరిస్థితిని ముస్లింలకు కల్పించడంలో 1990వ దశకపు హైందవ సమాజం విజయం సాధించిందనడంలో సందేహం లేదు. బిజెపికి రేపు రాబోయే ఎన్నికలలో ఓట్లు పెరుగుతాయా తగ్గుతాయా అని మాత్రమే తర్కించి ఊరుకునే వాళ్లకు సామాజిక జీవితం మీద సంఘ్‌పరివార్ నెమ్మదిగా పెంచుకుంటున్న పట్టు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. లౌకికవాదానికీ ప్రజాస్వామ్యానికీ అక్కడికంటే బహుశా ఇక్కడే ఎక్కువ ప్రమాదం ఉంది.

పాపం కార్గిల్ ముస్లింలు అందరికంటే ఎక్కువగా ఈ చేదు అనుభవాన్ని రుచిచూస్తున్నారు. కార్గిల్ గురించి ఈ దేశంలో అందరూ ప్రదర్శిస్తున్న ఆవేశపువేడి

కార్గిల్ వాసులకు కనీసం వెచ్చటి సానుభూతి కూడా ఇవ్వలేక పోయింది. ఎందుకంటే మన ఆవేశమంతా కార్గిల్ సరిహద్దు గురించేగానీ కార్గిల్‌లో బతికే మనుషుల గురించి కాదుగదా.

కార్గిల్ జిల్లా జనాభా 90 వేలు మాత్రమే. అది ఎత్తైన శీతల ఎడారి. అంతకంటే ఎక్కువ జనాభాను ఆ నేల పోషించలేదు. ఇప్పుడు ఆ 90 వేల మందిలో 35 వేల మంది శరణార్థులయ్యారంటే 'కార్గిల్ యుద్ధాన్ని ఇంకా ఇంకా కొనసాగిద్దాం' అంటూ మనమంతా ఆవేశపడుతున్న ఆ సరిహద్దు గట్టుతగాదా గట్టుకు ఇటూ అటూ నివసించే మనుషుల జీవితాలను ఎంతగా అల్లకల్లోలం చేస్తున్నదో అర్థం అవుతుంది.

ఈ 35 వేల మంది (వారితో పాటు వారి పశువులు, ఇతర చరాస్తి) ఎక్కడికి పోవాలి? కాశ్మీర్ లోయలోకి పోలేరు. కార్గిల్‌ను కాశ్మీర్‌తో కలిపే రహదారి మీదనే కదా 'టైగర్ హిల్' పోరాటం సాగుతున్నది. కాబట్టి దక్షిణాన ఉన్న లే జిల్లాలోకి పోవాలి. లదాఖ్‌లోని రెండు జిల్లాలలో కార్గిల్ ఒకటికాగా లే రెండవది. కార్గిల్ వాసులు అధికంగా షియా ముస్లింలు కాగా లే వాసులు అధికంగా బౌద్ధులు. జాతి రీత్యా ఇద్దరూ దార్ది జాతీయులే. భాషలో, జాతిలో, సంస్కృతిలో, రూపురేఖలలో వారొకటే. ఇద్దరూ కాశ్మీరీలకన్నా జమ్మూ వాసులకన్నా టిబెట్‌కు సన్నిహితులు.

కానీ ఈ ఉపఖండాన్ని పీడిస్తున్న జాడ్యం లదాఖ్‌కు కూడ పట్టుకుంది. కార్గిల్ వదిలిపెట్టి లే ప్రాంతానికి శరణార్థులుగా వలస వస్తున్న కార్గిల్ వాసులకు లే ప్రాంతంలో అనుమానం, అవిశ్వాసం ఎదురయ్యాయి. ఈ శరణార్థులు 'అవాంఛనీయమైన' వ్యక్తులని, 'సందేహాస్పదమైన' వ్యక్తులని (ఒక్క మాటలో చెప్పాలంటే పాకిస్తాన్ ఏజెంట్లని) లే (Leh) ప్రాంతంలోని ప్రముఖులు మొదటి రోజు నుండి ఆరోపణలు చేస్తున్నారు. వాళ్లను ఎక్కువ కాలం లే ప్రాంతంలో ఉండనీయకూడదని త్వరగా వెనక్కి పంపించి వేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం ఈ శరణార్థులకు పోలీసు రక్షణ కల్పించవలసి వచ్చింది.

లే ప్రాంత వాసులు వ్యక్తపరుస్తున్న ఈ అన్యాయమైన వైఖరి మానవతకే కాదు, బౌద్ధమతం స్ఫూర్తికి కూడ దూరం. లే వాసులు అందరూ ఇంత సంకుచితంగా ఆలోచిస్తున్నారని ఆరోపించడం భావ్యం కాదుగానీ ఆ ఆలోచనారీతి కార్గిల్ ముస్లింలకు తీవ్రంగా ఆందోళన కలిగించే మోతాదులోనయితే ఉంది.

ఒక్క కార్గిల్‌లోనే కాదు, మొత్తంగా సరిహద్దు అంతటా ఇదే పరిస్థితి. యుద్ధం వస్తున్నదంటే సహజంగానే సరిహద్దు వాసులు- ఏ మతానికి చెందిన

వారైనా–భయపడతారు. యుద్ధంలో వాళ్లకు మన తెలుగు దినపత్రికలు ఘనంగా కొనియాడుతున్న వీరమరణమూ ఆత్మబలిదానమూ కనిపించదు. వట్టి చావు కనిపిస్తుంది. మనం సినిమాలో విలన్‌ను హీరో తంతుంటే ఏసి హాల్‌లో కూర్చుని 'ఇంకా తన్ను! ఇంకాతన్ను!' అని ప్రోత్సహించే స్థితిలో ఉన్న అదృష్టవంతులం. పైగా దానికి దేశభక్తి అని అందమైన పేరు కూడ పెట్టుకున్నాం. సరిహద్దు వాసులు యుద్ధంలో నిజంగా తుపాకి గుళ్లదెబ్బలు రుచిచూసే దురదృష్టవంతులు.

వారిలోని ముస్లింలు తమ దురదృష్టానికి దేశభక్తి అని కూడ పేరుపెట్టుకోలేరు. దేశభక్తి కూడ నిత్యం రుజువుచేసుకోవలసిన ఒక భారమే వారికి. పాకిస్తాన్‌తో ఎప్పుడు యుద్ధం వచ్చినా సరిహద్దు గ్రామాలలోని ముస్లింలపైన సైన్యం నిఘా పెరుగుతుంది. పట్టుకుపోయి చిత్రహింసలు పెట్టిన ఘటనలనేకం. కాబట్టి మొత్తంగా సరిహద్దు ప్రాంతాలకు చెందిన ముస్లింలు సరిహద్దుకు దూరంగా దేశం లోపలి భాగంలో బంధువులున్న గ్రామాలకు వలసపోతున్నారు. ఇది కాశ్మీర్‌లోనే కాదు, గుజరాత్, రాజస్థాన్‌ల నుండి కార్గిల్ దాకా సరిహద్దు ప్రాంతమంతటా జరుగుతున్నది.

'కార్గిల్ యుద్ధం'లో ఎవ్వరికీ పట్టని ట్రాజెడీలలో ఇదొకటి. ఈ ట్రాజెడీ ప్రతిధ్వనులు దేశం లోపల కూడ వినవస్తున్నాయి. ఈ యుద్ధం అనవసరమనీ పాకిస్తాన్‌ను ఒక భూతం చేసి చూపించడం అర్ధరహితమనీ నమ్మినా ఆ మాట అనడం ఈ దేశంలోని ముస్లింలకు ఈ రోజు సులభం కాదు. అభ్యుదయ సంఘాలలోని ముస్లింలు సహితం ఈ మాటలు తమ 'హిందూ కామ్రేడ్ల' చేత అనిపించడం మేలనుకునే స్థితి వచ్చిందంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

మేరా భారత్ సహీసే మహాన్!

జూలై 25, 1999

# యుద్ధం-శాంతి-ప్రజాస్వామ్యం

పాకిస్తాన్ కంటె భారతదేశంలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువే ఉందని మనం సంతోషిస్తే అర్థం ఉంది. కానీ 'కార్గిల్ యుద్ధం' సందర్భంగా ఈ రెండు దేశాల గురించి మన దగ్గర జరిగిన చర్చలో కొన్ని విచిత్రమైన వైరుధ్యాలు కనిపిస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ వలన మన దేశం కొంత మెరుగ్గా ఉండడానికి లోతయిన రాజకీయ–చారిత్రక కారణాలున్నాయని గుర్తించకుండ, "మనం గొప్పవాళ్లము కాబట్టి" మెరుగ్గా ఉన్నామన్న అభిప్రాయమొకటి మన దేశంలో విస్తృతంగానే ప్రచారంలో ఉంది. ఇక్కడ 'మనం' అంటే హిందువులు. 'మనం' కాని వాళ్లు ముస్లింలు అని వేరే చెప్పనవసరం లేదు.

వైరుధ్య మెక్కడుందంటే ఈ అభిప్రాయాన్ని బలంగా నమ్మేవాళ్లకసలు ప్రజాస్వామ్యమంటే గౌరవం లేదు. వేరొక సందర్భంలో వాళ్లే ప్రజాస్వామ్యాన్ని ఒక బలహీనతగా ఈసడించుకుంటారు. బలాన్ని ఆరాధించే 'దమ్ములు' లేనివాళ్లే ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తారని హేళనగా మాట్లాడుతారు. కానీ, భారత–పాకిస్తాన్‌ల చర్చ వచ్చినప్పుడు హిందువుల గొప్పతనం వల్లనే భారత్‌లో ప్రజాస్వామ్యం ఈ మాత్రమైనా ఉందనీ 'ముస్లిం' దేశమైన పాకిస్తాన్‌లో అది సాధ్యమయ్యేది కాదనీ అంటుంటారు.

లౌకిక వాదం గురించి కూడ వీరికి ఇదే రకమైన అభిప్రాయం ఉంది. హిందువులు స్వతహాగా లౌకిక వాదులు కాబట్టే భారత రాజ్యం లౌకికం కాగలిగిందని వీరు తరచుగా అంటుంటారు. అదే సమయంలో లౌకిక వాదం విదేశీ భావన అనీ విదేశీ మానస పుత్రులయిన ఉదారవాదులూ వామపక్షవాదులూ దానిని దిగుమతి చేసుకొని ఈ దేశం మీద రుద్దుతున్నారనీ కూడ అంటుంటారు. తమకే గౌరవం లేని ప్రజాస్వామ్యమూ లౌకిక వాదమూ హిందువులకు సహజమని 'గర్వించడం'లో ఉన్న వైరుధ్యం బహుశా వీళ్లకెప్పుడూ తోచదు. ఆధునిక కాలంలో లౌకిక ప్రజాస్వామ్య

నిగాహ్

రాజకీయ విలువలను నిలబెట్టడానికి ప్రయత్నించిన తొలి ఆసియా దేశం ముస్లింలు మెజారిటీగా ఉన్న టర్కీ అనే చారిత్రక వాస్తవం కూడ వీరికి అక్కరలేదు. 'ముస్లిం దేశం' అనే భావనకు సౌదీ అరేబియానూ పాకిస్తాన్‌నూ అఫ్ఘానిస్తాన్‌నూ మాత్రమే ఉదాహరణలుగా చూపించి టర్కీ, ఈజిప్ట్, అల్జీరియా, సిరియా, ఇండొనేషియా వంటి దేశాలు కనబరిచే వైవిధ్యాన్ని ఆ భావననుండి వెలివేయడం వీరి వాదనకు అవసరం.

ఇదంతా ఇప్పుడెందుకు అవసరమంటే యుద్ధం 'విజయవంతం'గా ముగిసింది, ఇక శాంతిని కూడా విజయవంతంగా నిలబెట్టవలసి ఉంది. కానీ తమ మనసులలో ప్రజాస్వామ్యమంటే గౌరవం లేకపోవడమే కాక ఎదుటివారు ప్రజాస్వామ్యమంటే ఏమిటో తెలియని అనాగరికులన్న అహంభావం నిండిన వారు ఈ దేశంలో పెత్తనం చేస్తున్న తరుణంలో అది సాధ్యమా అన్న సహేతుకమైన సందేహం వస్తుంది.

యుద్ధం గురించి కూడ ప్రజాస్వామిక కోణమొకటి ఉంటుందనేది చర్చనీయాంశమయితే కావచ్చునుగానీ శాంతి ప్రజాస్వామికంగా మాత్రమే నెలకొనగలదు, నిలువగలదు అనే విషయంలో సందేహానికి పెద్దగా ఆస్కారం ఉంటుందనుకోను. కానీ ప్రజాస్వామ్యమంటే ప్రాథమికంగా గౌరవం లేనివాళ్లు, అదే సమయంలో తమకు గౌరవం లేని ప్రజాస్వామ్యం పాకిస్తాన్‌కు సాధ్యం కాదన్న చులకన భావంగల వాళ్లు, అధికారంలో ఉన్నా లేకున్నా 'ప్రజాభిప్రాయం' అని పిలవబడే దాన్ని శాసించే స్థితిలో ఉన్న వాళ్లు శాంతికోసం ప్రజాస్వామికంగా కృషి చేయగలరా? దానికి ఎదుటి వాళ్లంటే గౌరవం ఉండాలి. ప్రజాస్వామ్యమంటే గౌరవం ఉండాలి. రెండూ లేని వాళ్లు ఈ దేశాన్ని భౌతికంగానే కాక మానసికంగా తాత్వికంగా ఏలుతున్నారు.

ఎంతో ప్రజాస్వామికంగా వ్యవహరిస్తే తప్ప మనం తట్టుకోలేని సమస్య ఒకటి మనకు త్వరలోనే రావచ్చు. యుద్ధంలో గెలిచేసామని మనవాళ్లు కేరింతలు కొడుతున్నారు గానీ చివరి విజయహాసం (ది లాస్ట్ లాఫ్ అని ఇంగ్లీషులో అంటారు) పాకిస్తాన్‌దే కావచ్చు. మనం పదే పదే పాకిస్తాన్‌కు గుర్తు చేస్తున్న సిమ్లా ఒప్పందానికి విరుద్ధంగా మనం 1980లలో సియాచిన్ పైన ఎక్కి స్థావరం ఏర్పరచుకున్నామని పాకిస్తాన్ 15 సంవత్సరాలుగా ఫిర్యాదు చేస్తున్నా ప్రపంచంలో ఎవరూ పట్టించుకోలేదు. సిమ్లా ఒప్పందంలో భాగంగా ఇరుదేశాల ప్రతినిధులూ సంతకం చేసిన చిత్రపటాలలో బటాలిక్ దాకా వాస్తవాధీన రేఖ ఉందన్న విషయం స్పష్టంగా ఉందని మనవాళ్లు వాదిస్తున్నారు. ఇప్పుడు ద్రాస్ నుండి బటాలిక్ దాకా పాకిస్తాన్ దానిని అతిక్రమించిందని ఆరోపిస్తున్నారు. కానీ అవే చిత్రపటాలు సియాచిన్ ప్రాంతంలో ఆనాడు ఎవరి సైన్యమూ లేదని చూపుతాయి. ఎవరికీ చెందని ఆ శూన్య

భూభాగంలోకి పాకిస్తాన్ ప్రవేశిస్తుందేమోనని భయపడి మనం 1984లో ప్రవేశించాము. విపరీతమైన ధనప్రాణ నష్టంతో ప్రపంచంలోనే అతి ఎత్తయిన యుద్ధ స్థావరాన్ని నెలకొల్పి నిర్వహిస్తున్నాము.

ఇప్పుడు మన మాట మన్నించి ప్రపంచదేశాలు పాకిస్తాన్‌ను వాస్తవాధీన రేఖ నుండి వెనక్కి పొమ్మన్నాయి. కాబట్టి తన మాట అదే విధంగా మన్నించి మనల్ని సియాచిన్ నుండి దిగిపొమ్మని ఒత్తిడి పెట్టాలని పాకిస్తాన్ ఆశిస్తున్నది. రాబోయే రోజులలో దీని కోసం ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నంలో ఒకవేళ పాకిస్తాన్ విజయం సాధిస్తే అంతా ముగిసిన తరువాత పాకిస్తాన్ ఎక్కడ ఉన్నది అక్కడ ఉంటుంది. మనం మాత్రం సియాచిన్ నుండి కిందికి దిగి ఉంటాము.

ఈ పరిస్థితి ఒకవేళ వస్తే విపరీతమైన ఉద్రేకంతో ప్రజలను రెచ్చగొట్టడానికి ఇక్కడ చాలామంది సిద్ధంగా ఉన్నారు. ఇంతటి ఉన్మాదులు పాకిస్తాన్‌లోనూ ఉన్నారు. అంటే రెండు దేశాలూ మరొక్కసారి యుద్ధం అంచుకు రాగలవు. అది జరగకుండా ఉండాలంటే రెండు దేశాలూ పరస్పర గౌరవంతో కూర్చొని, లాహోర్ స్ఫూర్తితో అనండి, సిమ్లా స్ఫూర్తితో అనండి ఏదో ఒక ద్వైపాక్షిక స్ఫూర్తితో వాస్తవాధీన రేఖ ఎక్కడుందో చర్చించుకొని ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చి భవిష్యత్తులో కాశ్మీర్ భవిష్యత్తు కాశ్మీరీలే నిర్ణయించుకునే రోజు వచ్చేంత వరకు–దానికి కట్టుబడి ఉంటామన్న అంగీకారానికి రావడం అవసరం. ఇటువంటి ఏ చర్చలోనయినా కొంత ఇచ్చిపుచ్చుకోవడం అవసరం అవుతుంది. బహుశా పాకిస్తాన్ కార్గిల్ ప్రాంతంలో వాస్తవాధీన రేఖను గౌరవించడానికి మనం సియాచిన్ నుండి దిగి కిందికి రావలసి ఉంటుందేమో. దానివల్ల ఇద్దరూ గౌరవించే వాస్తవాధీన రేఖ స్థిరపడేటట్టయితే అది మంచిదేననుకునే వాళ్లు ఈ దేశంలో ఎంతమంది ఉన్నారు? విపరీతమైన చలిలో సియాచిన్ స్థావరాన్ని నిర్వహించడానికి డబ్బూ సైనికుల ప్రాణాలూ అర్పిస్తూ పోవటం కంటే దానిని ఇరు దేశాలకూ ప్రవేశం లేని శూన్య భూమిగా గుర్తించటం హేతుబద్ధమైన పరిష్కారమని ఒప్పుకోవడానికి ఎంతమంది సిద్ధంగా ఉన్నారు? ఈ రకమైన ఒప్పందం ఒకవేళ ఏ ప్రభుత్వమైనా చేసుకుంటే "సియాచిన్‌ను పాకిస్తాన్‌కు అప్పగించేసారు" అంటూ కృత్రిమ దేశ భక్తిని రెచ్చగొట్టి సమాజం మీద తమ పెత్తనాన్ని మరింత బలపరచుకోవడానికి దానిని వాడుకోగల కాషాయ సేనలూ ఖాకీ నిక్కర్ల సేనలూ ఇక్కడ వీధి వీధికీ ఉన్నాయి.

పాకిస్తాన్‌కు ప్రజాస్వామ్యం చాలా దూరం అనే అహంభావపూరితమైన వైఖరి మనలో ఉండడం వలన ఆ దేశంతో మన పాలకులు ఎంత అప్రజాస్వామికంగా

వ్యవహరించినా పట్టించుకునే వారెవరూ ఈ దేశంలో లేరు. మొన్నటి యుద్ధ సమయంలో మన దేశ టివి చానెల్స్‌ను గానీ పత్రికలను గానీ పాకిస్తాన్ నిషేధించలేదుగానీ మనం మాత్రం పాకిస్తాన్ అధికార టివి చానెల్ అయిన పిటివి పైననే కాక 'డాన్' అనే పాకిస్తానీ దినపత్రికపైన కూడ నిషేధం పెట్టాము. పిటివి పూర్తిగా పాకిస్తాన్ ప్రభుత్వ బాకా అంటారేమో. ఆ మాట మన దూరదర్శన్ గురించి కూడ అనొచ్చు. అయితే సమస్య అదికాదు. దాని ప్రసారాన్ని భారత దేశంలో నిషేధించడం ఎందుకు? యుద్ధ సమయంలో ఎదుటివారు ఏమంటున్నారో తెలుసుకునే స్వేచ్ఛ భారత పౌరులకు ఎందుకుండకూడదు? (హైదరాబాద్ నగరంలోనయితే పిటివి ప్రసారంపైన నిషేధం యుద్ధంతో నిమిత్తం లేకుండా చాలాకాలంగా ఉంది)

'డాన్'పైన నిషేధం ఇంకా ఆశ్చర్యం కలిగిస్తుంది. పాకిస్తాన్‌లోని రెండు ప్రధాన ఆంగ్ల దిన పత్రికలలో 'ది నేషన్' నవాజ్ షరీఫ్‌కూ అతని పార్టీకి చాలా సన్నిహితం. 'డాన్' కొంత స్వతంత్ర దృక్పథంతో పాకిస్తాన్ పాలకులనూ మత తత్వ వాదులనూ విమర్శించే పత్రిక. పాకిస్తాన్ ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలన్న దృక్కోణం ఆ పత్రికలో తరచుగా వ్యక్తం అవుతుంది. అందువల్ల 'ది నేషన్'కు లేని విశ్వసనీయత 'డాన్'కు ఉంది. అందువల్లనే మనవాళ్లు 'డాన్'పైన నిషేధం పెట్టారా? పాకిస్తాన్ పాలకుల వైఖరిని వ్యక్తం చేసే పిటివి ప్రసారంతో పాటు కొంత విశ్వసనీయతతో విమర్శనాత్మక వైఖరిని వ్యక్తం చేసే ఈ పత్రిక అమ్మకంపైన కూడ నిషేధం పెట్టడంలో గల భావం ఏమిటి? పాకిస్తానీ గొంతులేవీ ఇక్కడ వినపడొద్దనే కదా? భారత పౌరులు యుద్ధాన్ని గురించి మన పాలకుల అధికార సత్యాన్ని మాత్రమే వినాలనే కదా? యుద్ధమప్పుడు ఎదుటి వారి గొంతును ఇంత సంపూర్ణంగా నొక్కేయాలని చూసినవారు శాంతిలో ఎంత ప్రజాస్వామికంగా వ్యవహరిస్తారు?

నిగాహ్

# నిషేధాల నుండి తెలంగాణకు విముక్తి ఎప్పుడు?

**పీ**పుల్స్‌వార్‌పైన నిషేధాన్ని ప్రభుత్వం మరొక్క సంవత్సరం పొడిగించినట్టు ఈ రోజు వార్త.

మొదట ఆ పార్టీపైన 1992లో నిషేధం పెట్టినప్పుడు అది పెద్ద వార్త. తరువాత 1995లో తొలగించినప్పుడు అది వార్త మాత్రమే కాదు, ఆ తొలగింపు కోసం కృషి చేసిన వారికి చాలా సంతోషం కూడ. తిరిగి 1996లో నిషేధం విధించినప్పుడు కూడ అదొక ముఖ్యమైన వార్తే. ప్రభుత్వం ఏ పరిస్థితులలో నిషేధం తిరిగి విధించిందో విశ్లేషిస్తూ పత్రికలు వ్యాఖ్యలు రుసాయి. రాజకీయ స్వేచ్ఛ ఒకరు ఇచ్చేది కాదు కాబట్టి 'పరిస్థితుల' పేరు చెప్పి ప్రభుత్వం తీసేయగలిగింది కూడ కాదని హక్కుల సంఘాలు వ్యతిరేకించాయి.

పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద ప్రకటించే నిషేధం గడువు ఒక సంవత్సరం మాత్రమే కాబట్టి మళ్లీ మళ్లీ ప్రతీ సంవత్సరం ప్రభుత్వం పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని పొడిగిస్తూనే ఉంది. ప్రతీ సంవత్సరం జూలై నెలలో ఈ ప్రకటన వస్తుండడం వల్ల రాను రాను అందులో సంచలనం లేకుండా పోయింది.

అలవాటయిపోవడం, ఏం మాట్లాడినా ప్రయోజనముండడం లేదని నిస్పృహ చెందడం దీనికి రెండు కారణాలు కావచ్చు. కానీ బహుశా వేరే కారణం కూడ ఒకటి ఉంది. అదేమిటంటే నిషేధం పెట్టడం వల్ల పెద్దగా వచ్చిన తేడా ఏమీ లేదన్న గుర్తింపు. చట్టబద్ధమైన కార్యకలాపాలపైన ఆ పార్టీ ఎన్నడయినా ఆధారపడింది తక్కువే. ఆ పార్టీ కార్యకలాపాలు ప్రధానంగా అండర్‌గ్రౌండ్ కార్యకలాపాలుగానే ఉన్నాయి చాలా కాలంగా. నిషేధం ఈ అండర్ గ్రౌండ్ కార్యకలాపాలపైన ఎటువంటి ప్రభావం వేయలేదు. ఇకపోతే ఒక రాజకీయ భావనగా, ఆలోచనా రీతిగా, ప్రాపంచిక దృక్పథంగా దానికి

ఉండే ప్రభావం మీద ఏ నిషేధమూ పనిచేయదు. అప్పుడప్పుడు ఆ పార్టీ నిర్వహించిన లీగల్ కార్యకలాపాలపైన నిషేధం పనిచేస్తుంది గానీ వేరే దేనిమీదా పని చేయదు.

నిజానికి రాజకీయ నిషేధాలు సూత్ర ప్రాయంగా అప్రజాస్వామికమే కాక ఈ కారణంగా వృధా కూడ. ఒక పార్టీ కార్యకలాపాలలో కొన్నిటిని నిషేధం ఆపగలదుగానీ ఆ రాజకీయం సమాజం మీద వేసిన ముద్రను చెరిపేయలేదు. ఆ ముద్ర మంచిది కాదనుకుంటే దాని ప్రభావాన్ని ప్రత్యామ్నాయ రాజకీయాల ద్వారా తొలగించటం సాధ్యమవుతుందే తప్ప పబ్లిక్ సెక్యూరిటీ చట్టం ద్వారా కాదు, అటువంటి ఏ నిషేధ చట్టం ద్వారానూ కాదు.

నిషేధించి ఇన్నేళ్లయిన తరువాత కూడ ఉత్తర తెలంగాణలో పీపుల్స్‌వార్ ఉనికి కనిపించని, వినిపించని ప్రదేశంగానీ సందర్భంగానీ ఉండదు. పీపుల్స్‌వార్‌కు సంబంధించినంత వరకు ఆ నిషేధం ఎంత నిరర్థకమో అక్కడ ఏ గ్రామంలోనయినా రెండు రోజులు గడిపితే అర్థమవుతుంది. అన్ని రాజకీయాలకంటే ఆ నిషిద్ధ రాజకీయం ప్రభావమే–మంచికే కాక ఒక్కొక్క సారి చెడుకు కూడ ఎక్కువ కనిపిస్తుంది.

ఉత్తర తెలంగాణలోనే కాదు, ప్రభుత్వం నిషేధ అధికారాలు ప్రయోగించిన అన్ని ప్రాంతాలలోనూ ఈ చిత్రమే కనిపిస్తుంది. కాశ్మీర్ లాంటి చోట మరీ వికృత రూపంలో కనిపిస్తుంది. ఇప్పుడు కాదు గానీ రెండు మూడేళ్ల క్రితం కాశ్మీర్ లోయలో కనిపించేదీ వినిపించేదీ నిషిద్ధ రాజకీయమే. చట్టబద్ధమైన రాజకీయమెక్కడా కనిపించేది కాదు. అస్సాం రాష్ట్రంలోని చాలా జిల్లాల పరిస్థితీ ఇదే. దీనికి ఆ నిషిద్ధ సంస్థల బలప్రయోగం ఒక కారణం మాత్రమే. వాటి రాజకీయాలకు నిజంగానే ప్రజలలో చాలా ప్రాచుర్యం ఉంది. ఇతర రాజకీయాలకు–నిషిద్ధ సంస్థల చేతిలో భౌతిక దాడులకు గురయ్యే 'ప్రధాన స్రవంతి' రాజకీయాలకు–అసలే ప్రాచుర్యం లేదని గానీ అవి కేవలం నామ మాత్రంగా కనిపించడం వాటి వాస్తవ ప్రభావానికి అద్దం పడుతుందని గానీ అనలేము గానీ, చట్టబద్ధమైన ఆ రాజకీయ స్రవంతులకంటే చట్టం నిషేధించిన స్రవంతులకే ప్రజలలో ప్రభావం ఎక్కువ. తెలంగాణలోనయినా అంతే. ప్రజలలో అంత ప్రభావం ఉన్న రాజకీయాలను నిషేధించి అవి ఉండడానికే వీలు లేదనడం మూర్ఖత్వమే కాక నిరుపయోగం కూడ.

అయితే నిషేధానికి ప్రకటించిన ఫలితం లేకపోయినా వేరే ఏ ఫలితమూ లేకుండా పోలేదు. కనీసం రెండు ఫలితాలున్నాయి. రెండూ అవాంఛనీయమైనవే. పీపుల్స్‌వార్‌ను నిషేధించిన తరువాత ఆ పార్టీతో సంబంధముంది అనే నెపం మీద విలేఖరులను, స్థానిక ప్రజాప్రతినిధులను, వివిధ సమస్యలమీద ఉద్యమాలు నిర్వహిస్తున్న ప్రజలను, ప్రజాసంఘాలను వేధించడానికి ఆ నిషేధ చట్టాన్ని పోలీసులు విస్తృతంగా

వాడుకున్నారు. ఒకరి రాజకీయ స్వేచ్ఛను నిషేధించే పేరిట సమాజంలో పాలకులకు ఇబ్బందికరమైన అన్ని రకాల రాజకీయ స్వేచ్ఛనూ గొంతునొక్కి వేయడం అన్యాయమే కాక సమాజంలో తీవ్ర అసంతృప్తికి దారి తీయగలదని మన పాలకులకు అర్థం కావటం లేదు. ఒకవేళ రాజకీయ వాదులకు అర్థమయినా నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి సంబంధించిన విధాన రచయితలయిన పోలీసులకు అది పట్టదు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య అవకాశాలనూ పూర్తిగా ధ్వంసం చేయడం తాము ఆశించే 'శాంతి భద్రతలకే' చాలా నష్టకరం అని పోలీసు బుద్ధికి తోచదు. బహుశా తోచదనుకోవడం కూడ తప్పేమో. ఆ పరిస్థితే పోలీసుల అవసరాన్నీ బలాన్నీ పెంచుతుంది. వాళ్లకదే కావాలి.

రెండవవైపు, తమకు రాజకీయ స్వేచ్ఛ లేదు కాబట్టి ఇతరుల రాజకీయ స్వేచ్ఛను హరించే హక్కు తమకుందని పీపుల్స్‌వార్ భావిస్తుంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వీలు లేదంటూ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల గ్రామీణ నాయకులను పీపుల్స్‌వార్ కొట్టడం, తన్నడం, చంపుతాం అని బెదిరించడం ఇప్పటికే ప్రారంభం అయింది. పీపుల్స్‌వార్‌పైన నిషేధం లేకున్నా ఆ పార్టీ ఈ దాడులు చేసేదేనేమో గానీ ఇప్పుడు సమర్థించుకోవడానికి మంచి సాకు దొరికింది. "వీళ్లంతా కలిసి మాకు రాజకీయ స్వేచ్ఛ లేకుండా చేసినప్పుడు వీళ్ల రాజకీయ స్వేచ్ఛను మేమెందుకు గౌరవించాలి?" అంటారు. కాశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ నోటినుండి, అస్సాంలో ఉల్ఫా నోటినుండి (బహుశా జాఫ్నాలో ఎల్‌టిటిఇ నోటినుండి కూడ) ఈ వాదనే వినబడుతుంది. వీళ్లందరికీ అర్థం కానిదేమిటంటే తాము నిషేధిస్తున్నది తెలుగుదేశం, కాంగ్రెస్ తదితర పార్టీల స్వేచ్ఛను కాదు. ఆ పార్టీలను అభిమానించడానికీ అనుసరించడానికీ ప్రజలకుండే స్వేచ్ఛను. అవి అభిమానించదగ్గ పార్టీలా, అనుసరించదగ్గ పార్టీలా అనేది అప్రస్తుతం.

బహుశా ప్రభుత్వానికి–కనీసం పోలీసులకు–ఇదే ఇష్టమేమో. సమస్య మొత్తం పోలీస్ వర్సస్ నక్సలైట్‌గా మారి మధ్యలో అంతా శూన్యం ఏర్పడడమే వారి వ్యూహానికి తగిన పరిస్థితి. ఈ క్రమంలో తెలంగాణ గ్రామాలలోనూ పట్టణాలలోనూ చాలా బాధాకరమైన వాతావరణం ఏర్పడింది. రాజకీయ స్వేచ్ఛను పునరుద్ధరించుకోవడం–అందులో భాగంగా పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని ఎత్తివేయించడం, ఇతరుల రాజకీయ స్వేచ్ఛను పీపుల్స్‌వార్ గౌరవించేటట్టు చూడటం–ఈ వాతావరణం నుండి, ఈ పరిస్థితి నుండి తెలంగాణ బయట పడడానికి తొలిమెట్టు. రాజకీయ స్వేచ్ఛ నెలకొంటే బూటకపు ఎన్‌కౌంటర్‌లనూ విప్లవం కోసమని చెప్పి న్యాయమో అన్యాయమో అర్థం కాకుండా జరుగుతున్న హత్యలనూ ఆపడానికి అవసరమైన కార్యాచరణ తెలంగాణ ప్రజానీకానికి సాధ్యం అవుతుందేమో.

ఆగస్టు 22, 1999

# ఒక మంచి మనిషికి జోహార్లు

'రైతు స్వభావం' అంటాం. అది రైతులందరి లోనూ ఉండకపోవచ్చునుగానీ ఏదో ఒక అర్థంలో అది రైతులకు సహజం, స్వాభావికం అనుకుంటాం. ఒక్కొక్క జీవన విధానానికీ జీవిత రంగానికీ స్వాభావికమైన గుణాలు కొన్ని ఉన్నాయన్న అభిప్రాయం దీని వెనుక ఉంది. ఆ రంగంలో, లేక ఆ జీవన విధానాన్ని అనుసరించే సామాజిక వర్గంలో మెజారిటీ మనుషులలో ఆ గుణాలు ప్రదర్శితమవుతాయని ఎవ్వరూ లెక్కగట్టలేదు. బహుశా మెజారిటీ అనే అర్థంలో కాక ఆ జీవన విధానానికి ఉండే ప్రత్యేక లక్షణాలకు ఈ గుణాలు తగినవి, అతికేవి అనుకోవడం వల్ల వాటిని సహజమయినవిగా, స్వాభావికమైనవిగా భావిస్తామేమో.

రైతులలో నిష్కపటమైన భోలాతనం, వ్యాపారస్తులలో డబ్బు జాగ్రత్త, మేధావులలో పిరికితనం సహజమైన లక్షణాలుగా భావిస్తాం. అవి ఆయా వర్గాల 'స్వభావం'లో భాగమనుకుంటాం. ఈ ఆపాదిత స్వభావాలలో కొన్ని ఆకర్షణీయమైనవి, కొన్ని అనాకర్షణీయమైనవి. 'రైతు స్వభావం' అనేది ఆకర్షణీయమైనది. నిష్కపటం, భోలాతనం, ముక్కుసూటి నడవడిక, పరోపకారం మొదలయినవి ఈ ఆపాదిత గుణాలలో ముఖ్యమైనవి. ఇవి రైతులలో ఎంత మందిలో నిజంగా కనిపిస్తాయోగానీ కనిపించినప్పుడు అది సహజం అనుకుంటాం.

బయ్యారం రాంరెడ్డి రైతు. 'రైతు స్వభావం' ఉన్న రైతు. ఎంతో కొంత చదువుకున్నాడు. ఇంకా చదువుకుందామని "లా"లో చేరాడు. ఎంతో కొంత రాజకీయ జీవితం చూసాడు. ఇంకా చూద్దామని హక్కుల ఉద్యమంలో పనిచేశాడు. చదువుకున్న పట్టణ జీవులు అధికంగా ఉన్న హక్కుల ఉద్యమంలో పని చేసినప్పుడు వారికి సహజమయిన డొంక తిరుగుడు వ్యవహారశైలినీ చెవులు కొరికే సంస్కృతినీ దగ్గరి నుండి చూశాడు. రాజకీయాలలో ఉండడం వల్ల విలువలకంటే లక్ష్యాలకంటే అప్పటి ఎత్తుగడలకూ తాత్కాలిక అవసరాలకూ ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే గుణాన్ని కూడా

దగ్గరి నుండి చూశాడు. అయినా తన 'రైతు స్వభావాన్ని' వదులుకోలేదు.

బహుశా అది అతని స్వభావమేనేమో. ఏ వర్గ జీవితం నుండీ పుట్టినది కాదేమో.

అతనిది మెదక్ జిల్లా సిద్దిపేట సమీపంలోని చినగుండవెల్లి. కులానికి రెడ్డి. మధ్యతరగతి రైతు. ఒకప్పుడు సిపిఐ(ఎం)లో ఉండేవాడు. గ్రామంలో జరిగిన ఒక హత్యలో ముద్దాయిగా జైలుకు పోయాడు. కోర్టు యావజ్జీవ ఖైదు విధించింది. ఆ హత్యలో తనకు భాగస్వామ్యం లేదనీ వేరే వాళ్లు చేసిన దానిలో హతుని వర్గం కక్ష కొద్దీ తనను కూడా ఇరికించిందని నాతో పరిచయమయిన కొత్తలో అన్నాడు. "ఇతనికి హింస అంటే ఇష్టముండదు కాబట్టి అట్లా చెప్పడం మంచిద"నుకున్నాడేమో తెలీదు. ఎందుకంటే మా పరిచయం పెరిగి ఒకరి మీద ఒకరికి విశ్వాసం ఏర్పడిన తరువాత ఆ మాట మళ్ళీ ఎప్పుడూ అనలేదు. అది నిజమో కాదో నాకు ఈనాటికీ తెలీదు. తెలుసుకోవాలన్న కుతూహలం కూడా కలగలేదు. ఎందుకంటే బయ్యారం రాంరెడ్డి ఎంతటి దుర్మార్గుడైనా ఒక పథకం ప్రకారం ఒక వ్యక్తిని నిస్సహాయుడిని చేసి కోల్డ్ బ్లడెడ్‌గా చంపలేడనేది ఎంత సత్యమో, అన్యాయాన్ని సహించలేని ఆవేశంలో క్షణికోద్రేకంలో కత్తి పట్టుకోగలడనేది కూడ అంతే సత్యం. హింస అంటే సాధారణంగా గౌరవం లేని వాళ్ళు సహితం రెండవ గుణాన్ని గౌరవించగలరు.

పది సంవత్సరాల పైచిలుకు జైలు జీవితం అనుభవించి బయటి కొచ్చిన బయ్యారం రాంరెడ్డి "ఇంక రాజకీయాలూ ఉద్యమాలూ" వద్దనుకొని ఉంటే ఎవరూ అభిశంసించి ఉండరు. కానీ బయటికి రాక ముందు నుండీ కూడ బయటికి పోయిన తరువాత ప్రజా ఉద్యమాలలో చురుకుగా పని చేయాలనే రాంరెడ్డి నిర్ణయించుకున్నాడు. సమస్యల దీర్ఘకాల పరిష్కారం కోసం రాజకీయ నిర్మాణం, వ్యూహరచన చేయడం కంటే కష్టాలలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం చేయడంలో ఎక్కువ సంతృప్తి పొందే వారందరిలాగా రాంరెడ్డి కూడా పౌరహక్కుల ఉద్యమంలో పనిచేయాలని నిర్ణయించుకున్నాడు.

హక్కులకు చాలా కోణాలు ఉన్నప్పటికీ ఒక్క పోలీసు హింస గురించి మాత్రమే పని చేయడాన్ని సమర్థించుకోవడానికి కావలసిన పరిస్థితి తెలంగాణలో ఉంది. ఆ ఒక్క పనే చేసినా ఇక్కడ చేతినిండా పని ఉంటుంది. మెదక్ జిల్లాలో ఆ భారం మీద వేసుకోవడానికి పౌరహక్కుల సంఘానికి చాలా కాలం ఎవరూ దొరకలేదు. జైలునుండి బయటికివచ్చిన రాంరెడ్డి దానికి సిద్ధం కావడమే కాక తగినవాడు కూడా కావడం హక్కుల ఉద్యమం అదృష్టమనే చెప్పాలి.

ఈ నాలుగయిదేళ్లలో పోలీసులు ఎత్తుకుపోయిన పిల్లల తల్లిదండ్రులు ఎన్ని వందల మంది రాంరెడ్డి దగ్గరికి పరుగున వచ్చారో. లాకప్పులో చిత్రహింసలు

నిగాహ్

అనుభవిస్తున్నవారి బంధుమిత్రులు ఎన్ని వందల మంది ఆ బందీల విడుదలకోసం రాంరెడ్డిని నమ్ముకున్నారో. తన దగ్గరకొచ్చిన ఏ ఒక్కరికీ "నావల్లకాదు" అని రాంరెడ్డి ఏనాడూ జవాబుచెప్పలేదు. పత్రికలకు ప్రకటన ఇస్తాడు. అది పత్రికలలో మరుసటి దినం కనిపించకపోతే విలేఖరులను వెతికి పట్టుకొని ఎందుకు ప్రచురించలేదని దబాయించి రెండవ రోజు వేయించుకుంటాడు. నిర్బంధానికి బాధ్యుడైన పోలీస్ అధికారి తన మాట కొంతవరకైనా మన్నిస్తాడనుకుంటే అతనితో తానే ఫోన్‌లో మాట్లాడతాడు. లేదంటే ఏ రాజకీయ నాయకునితోనో లేదా హైదరాబాద్‌లో ఉండే పౌరహక్కుల సంఘం బాధ్యులతోనో మాట్లాడిస్తాడు. టెలిగ్రాంలు ఇస్తాడు. ఇప్పిస్తాడు. ఏదైనా చేసి చిత్రహింసలను ఆపిస్తాడు. "ఎన్‌కౌంటర్" నుండి బందీని కాపాడతాడు.

ఇదీ బయ్యారం రాంరెడ్డి మీద మెదక్ జిల్లా ప్రజలకున్న విశ్వాసం. రాంరెడ్డి ఆ విశ్వాసాన్ని శాయశక్తులా నిలబెట్టుకున్నాడు. క్రూరమైన అధికారాలు ఒంటబట్టించుకున్న మెదక్ పోలీసులు యధాప్రకారం అతనిని నక్సలైట్ అన్నారు. ఒక కేసులో ఇరికించారు. ఇంకా కేసులలో ఇరికిస్తామని బెదిరించారు. నిన్ను చంపితే దిక్కే ముందన్నారు. అయినా రాంరెడ్డి భయపడలేదనడం అబద్ధం అవుతుంది. భయం తెలియని మనుషులు మనుషులే కారు. కానీ తన భయం వల్ల ఇతరులకు తాను చేస్తున్న సహాయం దెబ్బ తినకూడదనుకున్నాడు. అందుకోసం భయాన్ని జయించాడు. రాంరెడ్డి పెద్దగా ఉన్నవాడు కాడు. బొటాబొటిగా బతికేవాడు. ఒక్కోసారి ఎవరయినా వచ్చి ఎస్‌పికి వెంటనే ఫోన్ చేయమని అడిగితే పైసలుండేవి కావు. ఎవరో ఒకరిని పది రూపాయలడిగి ఆ పని చేసే వాడే తప్ప నా వల్ల కాదనే వాడు కాడు. తనకున్న కొద్దిపాటి ఆదాయాన్ని ప్రజల హక్కుల సంరక్షణ కోసం ధారాళంగా ఖర్చుచేసే వాడు.

హక్కుల చైతన్యం ప్రాథమికంగా విలువల చైతన్యం. విలువల కోసం ఎంత కృషి చేస్తాం, ఏ మేరకు చేస్తాం, ఏ రూపంలో చేస్తాం అనే దానికి పరిమితులు ఉంటాయిగానీ విలువల చైతన్యాన్ని ఒక పరిధికే పరిమితం చేయడం సాధ్యంకాదని గుర్తించిన హక్కుల ఉద్యమకారులలో రాంరెడ్డి ఒకడు. ఇది అతని అవగాహనా లోపం అనుకునే వాళ్లు అనుకోవచ్చును గానీ రాంరెడ్డిలో ఈ స్పృహ సిద్ధాంత చర్చనుండి రాలేదు. అన్యాయానికి గురయిన అసహాయులపట్ల దయ చూపించకుండా ఉండలేని మంచితనం నుండి వచ్చింది. అన్యాయం ఎక్కడ జరిగినా ఆగ్రహం చెందకుండా ఉండలేని విలువల నుండి వచ్చింది. తన స్వభావం నుండి వచ్చింది. ఆ రకమైన విలువల చైతన్యానికి చారిత్రక స్పృహ లేదనీ సామాజిక నేపథ్యం తెలియదనీ దబాయించి విలువల చైతన్యాన్ని ఒక పరిధికే పరిమితం చేయాలని ఎంత ప్రయత్నం

చేసినా ప్రయోజనం లేదు. చారిత్రక స్పృహతోనూ సామాజిక భూమిక గురించి ఎరుకతోనూ కూడ విలువలకు స్వాభావికమైన సార్వజనీనతను నిలబెట్టుకొనడం సాధ్యమే, అవసరమే. అది స్వభావరీత్యా సహజమైన బయ్యారం రాంరెడ్డి వంటి ముక్కుసూటి మనిషికి, కపటం ఎరుగని 'రైతు' వ్యక్తిత్వానికి సులభం కూడ.

నాలుగు పదుల వయసులోనే ఆగస్ట్ 17 రాత్రి బయ్యారం రాంరెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. నిత్యం పోలీసు నిర్బంధానికి గురయ్యే మెదక్ జిల్లా ప్రజలు ఒక పెద్ద అండను కోల్పోయారు. పోలీసులు ఎంత బెదిరించినా మూయించలేని నోటిని మృత్యువు మూయించింది. రాంరెడ్డి తన జీవిత ఆచరణతో చూపించిన మార్గాన్ని మాత్రం మృత్యువు జయించదనే ఆశిద్దాం.

సెప్టెంబర్ 5, 1999

# కోడెల బాంబులు చెప్పిన సత్యం

**కో**డెల శివప్రసాదరావు ఆస్పత్రిలో బాంబులు పేలడాన్ని గురించి ఏమను కుంటున్నావని ఎవరో అడిగితే మొట్టమొదట తోచిన సమాధానం- రాయలసీమ నాయకులను చూసి ఆ మాత్రం నేర్చుకోలేక పోయాడా? అని.

భూమా నాగిరెడ్డి ఇంట్లోగానీ, పరిటాల రవి దొడ్లోగానీ, కె. ఇ. కృష్ణమూర్తి పెరట్లోగానీ (తెలుగుదేశం నాయకుల్నే ఉదాహరణగా తీసుకున్నా) బాంబులు పేలినట్లు ఎప్పుడయినా విన్నారా ?

అన్నిటా తామే యోగ్యులమని భావించే సర్కారు జిల్లాల వాళ్ళు ఈ ఒక్క విషయంలో రాయలసీమ ముఠానాయకులతో తమ కోడెల శివప్రసాదరావుకూ దేవినేని నెహ్రూకూ పోలిక లేదని ఒప్పుకోవాలేమో. కాంగ్రెస్ నాయకుడు వై.ఎస్. రాజశేఖరరెడ్డిని చూడరాదూ! ఆయన కూడా కోడెల లాగా డాక్టరే. కానీ ఆస్పత్రి లేదు. ఉన్నా అందులో బాంబులు పేలవని నిస్సంకోచంగా చెప్పవచ్చు. 'అసలు బాంబులెట్లా ఉంటాయి ?ఎప్పుడో పద్దెనిమిది ఏళ్ళ కింద పోలీసులు చూపిస్తే చూసినట్టు గుర్తు. అదే ఆఖరు. మళ్ళీ ఎప్పుడూ చూడలేదు' అని ఎంత ఠీవిగా అన్నాడు! నాయకుడి హుందాతనమంటే అట్లా ఉండాలి. ఆస్పత్రిలో బాంబుల ఫ్యాక్టరీ పెట్టి అది పేలి గుట్టురట్టయితే 'ఇది పీపుల్స్‌వార్ పని అయి ఉండాలి' అంటూ మరీ చిన్నపిల్లలు కూడా నవ్వుకునేటట్టు జోకులు వేయడం కాదు.

ఆంధ్రలో గుంటూరులాగే తెలంగాణలో మహబూబ్‌నగర్, అలంపురం, గద్వాల ప్రాంతాలలో రాయలసీమ నమూనా వాతావరణం కొంత ఉంటుంది. అయితే అలంపురం పాలెగాడు, బిజెపి నాయకుడు రవీంద్రనాథ్ రెడ్డి హైదరాబాద్‌లో బాంబులు తయారు చేయిస్తున్న ఇల్లు పేలి కూలి గుట్టు బయటపడింది. ఇది ఇప్పటి మాటకాదు. చాలా ఏళ్ళకిందటి సంగతి.

అప్పుడు రవీంద్రనాథరెడ్డికి కూడా కోడెలకు వచ్చిన అనుమానమే వచ్చింది. 'ఇది నక్సలైట్ల పనే అయి ఉండాలి' అన్నాడు. జాగ్రత్తపరుడు కాబట్టి 'ఖచ్చితంగా

చెప్పలేను గానీ వారి పనే అయి ఉంటుందని గట్టిగా అనుమానిస్తున్నాను' అన్నాడు. కోడెల కూడా అంతే. అనుమానిస్తున్నానన్నాడే కానీ ఖచ్చితంగా పీపుల్స్‌వార్ పనేననలేదు. నేరం రుజువు కాకుండానే ఖచ్చితంగా వారేననడం సంస్కారం అనిపించుకోదు కదా. కోడెల ఆస్పత్రి కాబట్టి, అక్కడ పేలిన బాంబులేకాక తయారు కావడానికి సిద్ధంగా ఉన్న పేలుడు పదార్థం కూడా దొరికింది కాబట్టి, ఇంక రుజువు కావలసిందేమీ మిగలలేదన్నట్టు కోడెల శివప్రసాదరావే బాంబులు తయారు చేస్తూ ఉండి ఉండాలని అప్పుడే నిర్ధారించేసిన మీ బోటి వారికి ఆ సంస్కారం అర్థం కాకపోవచ్చుగాక.

ఏం, పీపుల్స్‌వార్‌వాళ్ళు కోడెల ఆస్పత్రిలోనే బాంబులు చేస్తూ ఉండకూడదా? ప్రతీ రోజూ అక్కడికొచ్చి కూర్చొని బాంబులు తయారు చేసి పల్నాడుకూ, వినుకొండకూ అద్దంకి మీదుగా కరణం బలరాంగారి రణ రంగానికీ (బాంబులంటే ఎట్లాగుంటాయో అసలే తెలియని తెలుగదేశం నాయకులలో వీరొకరు)తీసుకుపోవడం లేదని మీకేం నమ్మకం? ఇంకా నయం. ఒకటి రెండు ప్రాణాలు పోతే పోయాయి గానీ బాంబులు పేలి విషయం బయటికొచ్చింది. లేకపోతే పాపం కోడెల శివప్రసాదరావుకు తెలియకుండా ఇంకెంత కాలం పీపుల్స్‌వార్ బాంబుల తయారీ సాగేదో.

నమ్మశక్యంగా లేదా? అయితే ఒక్కొక్క అడుగే తర్కించుకుందాం. పీపుల్స్‌వార్ బాంబులు ప్రయోగిస్తుంది కదా? అవును ప్రయోగిస్తుంది. అవసరమయితే వారే తయారు చేసుకుంటారు కదా? అవును చేసుకుంటారు. వారి ఇళ్ళలో వారు తయారు చేసుకోవడానికి వారికి ఇళ్లు లేవు కదా? వారి ఆస్పత్రిలో వారు తయారు చేసుకోవడానికి వారికి ఆస్పత్రులు లేవు కదా? కోడెల శివప్రసాదరావుకు ఇల్లూ ఆస్పత్రి రెండూ ఉన్నాయి కదా? మరి ఇంక అనుమానమేం మిగిలింది? ఏమంటారు? ఒకప్పుడు రాష్ట్రానికి హోం మంత్రిగా ఉండిన వ్యక్తి ఇంట్లోనే నక్సలైట్లు బాంబులు తయారుచేస్తారని నమ్మలేకుండా ఉన్నారా? బాగుంది. మరయితే ఒకప్పుడు హోంమంత్రిగా ఉన్న వ్యక్తి తానే స్వయంగా బాంబులు తయారు చేస్తాడని నమ్మగలరా? రెండింటిలో ఏది ఎక్కువ నమ్మశక్యమో అదే సత్యం అయి ఉండాలి కదా ? కాదంటారా?

నిజానికి మాజీ హోంమంత్రి ఇంట్లోనో, ఆస్పత్రిలోనో(ఉంటే సారా గోడౌన్లోనో) బాంబులు తయారు చేయడమే క్షేమమని నక్సలైట్లు భావించి ఉండవచ్చును. అజాగ్రత్త వల్ల బాంబులు పేలితే గిలితే పోలీసులు అటువైపు చూడక తప్పదుగానీ లేకపోతే అంత పెద్దమనిషి ఇంట్లో ఏం జరుగుతున్నదో పోలీసులెందుకు చూస్తారు? ఇంకొక

మాజీ హోంమంత్రి కూడ ఉన్నాడు. ఆయన పేరు ఇంద్రారెడ్డి. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నట్టున్నాడు. (ఇది రాసే సమయానికి అని జాగ్రత్త కోసం అందాం) రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుండి పోటీ చేస్తున్నాడు. ఆయన కూడా బాంబులెప్పుడూ చూసి ఎరుగడు పాపం. అయినప్పటికీ (బహుశా అందువల్లనే కావచ్చు కూడ) నక్సలైట్లు ఆయనగారి ఇంట్లోనో, పెరట్లోనో బాంబులు తయారు చేస్తూనే ఉంటారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆ ఇంటివైపు కన్నెత్తి చూడడం కుసంస్కారంగా పోలీసులు భావిస్తారు కాబట్టి నక్సలైట్లకు ఏ ప్రమాదమూ లేదనుకోండి. కానీ చేయిజారి (లేదా బక్కెట్ జారీ) అవి పేలితే సంస్కారం గింస్కారం పక్కన పెట్టి అటువైపు పోలీసులు రాకతప్పదు కదా. దానితో అప్పటిదాకా అజ్ఞానంలో ఉన్న ఇంద్రారెడ్డిగారికి కూడా జ్ఞానోదయం కలగవచ్చు... కోడెలకు కలిగినట్టు.

మీరు గమనించారో లేదో. ఒక కేంద్రప్రభుత్వ మాజీ మంత్రి, ఒక రాష్ట్ర ప్రభుత్వ మాజీ మంత్రి పార్లమెంటు కోసం పోటీ పడుతున్న కర్నూలు నియోజకవర్గంలో పోలీసులు దేనికోసమో తవ్వుతుండగా మందుపాతరలు బయటపడ్డాయి. పంచలోహ విగ్రహాలు కాదు, మందుపాతరలు. అభ్యర్థులను అనుమానించడానికి ఆస్కారమేమీ లేదు. ఎందుకంటే కోట్ల విజయభాస్కరరెడ్డి గారు కర్నూలులో అందరికీ 'పెద్దాయన'. కేంద్ర ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా చేసాడు. అటువంటివాడు ఇంత అన్యాయమయిన పని చేయడు. అతను చేయనప్పుడు అతని ప్రత్యర్థి మాత్రం ఎందుకు చేస్తాడు? చేయడు. ఇది కూడా నక్సలైట్ల పనే అయి ఉండాలి.

ఏమంటారు? మందుపాతరలు దొరికిన పత్తికొండ తాలూకాలో అసలు నక్సలైట్లే లేరంటారా? నక్సలైట్లే లేని చోట వారి మందుపాతరలెట్లా దొరుకుతాయంటారా ? మీ అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. నక్సలైట్లు ఉన్నారా లేరా అని ముందు చూసి ఆ తరువాత బాంబులూ మందు పాతరలూ వారివి కావా అని తర్కించడం అశాస్త్రీయం. అవి దొరికాయంటే అక్కడ నక్సలైట్లు ఉండే ఉండాలనీ వారి ఉనికికి సంబంధించిన వేరే గుర్తులు కనిపించకపోవడం వెనుక ఏదైనా కుట్ర ఉందేమో చూడాలనీ అర్థం చేసుకోవాలి. అది నరసరావుపేట కావచ్చు. పత్తికొండ కావచ్చు. రేపు చేవెళ్ళ కావచ్చు.

ఇన్ని విషయాలు మనకు తెలియజేసిన కోడెల శివప్రసాదరావుకు కృతజ్ఞతలు చెప్తూ ఇక సెలవు తీసుకుంటాను.

సెప్టెంబర్ 19, 1999

# ఎన్నికల అక్రమాలకు పోలీసు హింస పరిష్కారం కాదు



సెప్టెంబర్ 5వ తేదీ. రాయలసీమ జిల్లాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. కడప జిల్లా జమ్మలమడుగు కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ రెడ్డి స్వగ్రామానికి పోయే మెటల్ రోడ్డు మొదట్లో ఆ ఊరి యువకుడొకడు నిలబడి ఉన్నాడు. 'దేవగుడికి పోయే రోడ్డు ఇదేనా'? అంటే అవునన్నాడు. 'మాతో బాటు ఊరిలోకి వచ్చి పోలింగ్ స్టేషన్ చూపిస్తావా?' అంటే మొగమాటంగా నవ్వి 'నేను రాను మీరే పోయి రండి' అన్నాడు. ఏమని అడిగితే కొంచెం తటపటాయించి 'మూడు ఓట్లు వేయమని ఇచ్చినారు. ఒకటే వేసి వచ్చేసినాను. మళ్ళీపోతే మిగిలిన రెండు వేయమంటారు' అన్నాడు. ఒక మనిషి మూడు వోట్లు వేయడం విశేషం కాదు. రాయలసీమలో మాత్రమే జరిగే విషయం కాదు. కానీ ఒక గ్రామంలో వేరే ఏ అభ్యర్థి ఏజెంటునూ కూర్చోనీయకుండా చేసి ఊరిలో ఉన్న యువకులకు చెరి మూడు నాలుగు వోట్లు వేయమని 'చిట్టీలు' పంచి, అందుకు సిద్ధంగాలేని వాళ్ళు కనీసం ఆ పూట ఊరు విడిచిపెట్టి పోయే పరిస్థితి కల్పించగల 'సమర్థులు' అన్ని చోట్ల ఉండరు.

జమ్మలమడుగు కాంగ్రెస్ అభ్యర్థి తన స్వంత ఊరయిన దేవగుడిలోనే కాదు. ఆ పరిసరాలలో మొత్తం 8 గ్రామాలలో ఈ పని చేయగలిగాడు.

అతని తెలుగుదేశం ప్రత్యర్థి తక్కువవాడు కాదు. నిజానికి వీరిద్దరి కుటుంబాలకూ చాలా ఏళ్ళుగా ముఠాకక్షలున్నాయి. ఒకప్పుడు జమ్మలమడుగు ఎంఎల్ఏ అయిన తెలుగుదేశం నాయకుడు శివారెడ్డిని ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ రెడ్డి వర్గం హతమార్చింది. ప్రస్తుత తెలుగుదేశం అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఏ రామసుబ్బారెడ్డి, శివారెడ్డి దగ్గరి బంధువే. శివారెడ్డిది గుండ్లకుంట. ఆ ఊరు వ్యూహాత్మకంగా చాలా అనుకూలమైన చోట ఉంది. ఆళ్ళగడ్డ నుండి జమ్మలమడుగు వచ్చే రోడ్డు, కోవెలకుంట్ల

నుండి జమ్మలమడుగు వచ్చే రోడ్డు గుండ్లకుంట దగ్గర కలుసుకుంటాయి. జమ్మలమడుగులో బయలుదేరిన వారెవరయినా గుండ్లకుంటను దాటనిదే ఈ రోడ్డుమీదనయినా ఆ రోడ్డు మీదనయినా ఉన్న గ్రామాలను చేరుకోలేరు. గుండ్లకుంటను గుప్పిట్లో పెట్టుకుంటే ఆ ఊరికి ఆవలనున్న గ్రామాలను సునాయాసంగా ఏలవచ్చు. దివంగత శివారెడ్డి ఆ పనే చేశాడు.

అతని వారసుడు అదే ఒరవడిలో మొన్నటి ఎన్నికలనాడు గుండ్లకుంటతో కలుపుకొని ఏడు గ్రామాలలో కాంగ్రెస్ ఏజెంట్ లేకుండా చూసుకున్నాడు. ఒక్క చోట తిప్పన్నపాడులో ఏజెంట్ కూర్చోగా అతని బంధువు చేతనే అతనిని బయటికి ఈడ్పించి పంపించేశారు. ఆ ఏడు గ్రామాలలోనూ ఉల్లాసంగా ఆడుతూ పాడుతూ వోట్లు వేసుకున్నారు. మధ్యాహ్నం మూడున్నర తరువాత ప్రత్యర్థుల గుంపేదయినా జమ్మలమడుగు నుండి వస్తుందనుకున్నారో లేక మిగిలిపోయిన వోట్లన్నీ ప్రశాంతంగా వేసేసుకుందామనుకున్నారో గానీ ఒక ఎడ్లబండిని ఎడ్లువిప్పేసి గుండ్లకుంటలోకి ప్రవేశించే చోట రోడ్డుకు అడ్డంగా పెట్టారు. తమ రాజ్యానికి గేటు మూసేసారు. ఆపైన ఆ ఊరిలోనూ దానికి ఆవలనున్న ఊర్లలోనూ ఏం జరిగిందో ఆ పెరుమాళ్ళకే ఎరుక.

జమ్మలమడుగు గురించే ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. పులివెందుల, పెనుకొండ, పత్తికొండ–రాయలసీమలో చాలా చోట్ల మొన్నటి అయిదవ తేదీన కనిపించింది ఈ చిత్రమే. ఈ వికారమైన రాజకీయ సంప్రదాయాన్ని గురించి ఈ మధ్యకాలంలో చర్చ చాలా జరుగుతున్నది.

అయితే దీనిని ఎదుర్కొనడానికి అధికార యంత్రాంగం కొంత కాలంగా అనుసరిస్తున్న పద్ధతి అంతే వికారంగా ఉంది. ముఠా నాయకుల రాజకీయ విన్యాసాలను ఆపలేరు కాబట్టి మొత్తంగా ప్రజల మీద పడి చావగొట్టే అధికారాన్ని పోలీసులు, పారామిలిటరీల చేతిలో పెట్టి టోకుగా ఎన్నికల'శాంతి'ని కాపాడడం ఈ పద్ధతి. శేషన్ దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ప్రవేశపెట్టిన సంస్కరణాత్మక కృషిలోనే బీజ రూపంలో ఈ లక్షణం ఉంది. ఎన్నికలలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి అధికార యంత్రాంగం చేతిలో విపరీత అధికారాలు పెట్టడం శేషన్ నమూనా సంస్కరణల సారాంశం. ఎన్నికల కమిషన్ నుండి జిల్లా కలెక్టర్ దాకా ఎన్నికల సందర్భంగా దాదాపు విచ్చలవిడి అధికారాలు చలాయిస్తున్నారు. ఎన్నికల హింస అధికంగా ఉండే రాయలసీమ వంటి ప్రాంతాలలో ఈ అధికారం పోలీసులకు సహితం సంక్రమించింది.

కొంతకాలంగా ఎన్నికల దినం రాయలసీమలో సాధారణ పౌరులు– అందరూ పడిపడి దండాలు పెట్టే ఓటరు మహాశయులు– రోడ్లో నక్కి నక్కి నడవాలే తప్ప

స్వేచ్ఛగా సంచరించలేని పరిస్థితి ఉంది. ఓటు వేయడానికయితే ఇంటినుండి బయటికి రావచ్చు గానీ అప్పుడు కూడ 'ఓటు వేయడానికి పోతున్నాం, మమ్మల్ని తన్నొద్దు' అని తోవలో ఎదురుపడిన పోలీసులకు దండం పెట్టుకుంటూ పోవాలి. ఆ రోజున వేరే ఏ పనిమీద ఇంటి నుండి బయటకు రావడం శ్రేయస్కరం కాదు. పోలీసులూ పారా మిలిటరీ జవాన్లు గొడ్లను తరిమినట్లు ప్రజలను తరిమి కొడుతున్న దృశ్యం ఎన్నికలప్పుడు ఈమధ్య కాలంలో రాయలసీమలో ఎక్కడ చూసినా కనబడుతుంది.

ఈ ఎన్నికలలో కడప జిల్లా ప్రొద్దుటూరులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఎం.వి. రమణారెడ్డి నుండి ఎన్నికలను కాపాడడానికి మైదుకూరు రోడ్డును పోలీసులు సీల్ చేసేసారు. అతని విలాసం, అతని సామ్రాజ్యం ఆ రోడ్లో ఉన్నాయి కాబట్టి ఆ వైపు నుండి పురుగు కూడా– అభ్యర్థి జీపుల్లో కూర్చున్న లైసెన్స్ పురుగులు మినహా– ప్రవేశించకుండా ప్రొద్దుటూరును కట్టుదిట్టం చేయడం తప్ప ఎన్నికలను అతని జగద్విదితమైన రౌడీయిజం నుండి కాపాడడానికి వేరే మార్గం లేదని ఎన్నికల అధికారులు భావించినట్టున్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ఈ నిర్బంధ అధికారాలు ఎవరి దౌర్జన్యాలను అరికట్టడానికి ఉద్దేశింపబడ్డాయో వారికే ఉపయోగపడడం కూడ కద్దు. అధికారం ఎక్కడున్నా అక్కడ అవినీతి, ఆశ్రిత పక్షపాతాలు కూడా ఉంటాయి. అపరిమితమైన అధికారాలు అవినీతికి మరింత అవకాశం ఇస్తాయి.

అనంతపురం జిల్లా పెనుకొండ తెలుగుదేశం అభ్యర్థికి ఆ జిల్లా కలెక్టరు, పోలీసులు సహకరించి, అక్రమాలను అరికట్టడానికి తమ చేతిలో పెట్టబడ్డ విపరీత అధికారాలను అతని అక్రమాలకు అండగా వినియోగించిన వైనం దీనికొక ఉదాహరణ. ఆ అభ్యర్థి పరిటాల రవి. రాయలసీమలో వేరే ఏ ముఠా నాయకుడూ ఈ మధ్యకాలంలో కలిగించనంత భయం కలిగించిన వ్యక్తి.

ఈసారి అతను రాజశేఖరరెడ్డితో ఒడంబడిక చేసుకొని తాను అనంతపురం జిల్లాలో వేరే నియోజక వర్గాలలో కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేసేటట్లు, పెనుకొండలో కాంగ్రెస్ వారు బలహీనమైన ప్రత్యర్థిని పెట్టేటట్టూ అంగీకారం కుదుర్చుకున్నాడు.

ఇంక అతనికి మిగిలినది 'జనశక్తి' మద్దతు ఇచ్చిన స్వతంత్ర అభ్యర్థి రాంకుమార్. అతనిని ఎదుర్కోవడానికి రవికి ఆ జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టరు, పోలీసులు పనికొచ్చారు.ఎన్నికల సందర్భంగా వారికి ఇవ్వబడిన అపరిమితమైన అధికారాలు పనికొచ్చాయి.

రవిని కాదని ఆ జిల్లా వాళ్ళు అతని ప్రత్యర్థికి పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోలేరు. కాబట్టి బయటి జిల్లాల వాళ్లెవరూ అనంతపురంలో పోలింగ్ ఏజెంట్లుగా కూర్చోవడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ ఆదేశించాడు. వేరే ఏ జిల్లాలోనూ ఏ రోజూ లేని ఈ ఆదేశం పెనుకొండ పోలింగ్ బూత్‌లన్నిటినీ రవికి అప్పగించడానికి పనికొచ్చింది. ఈ ఆదేశాన్ని ఆసరా చేసుకొని పోలీసులు రంగంలోకి దిగి రాంకుమార్ బయటి జిల్లాల నుండి రప్పించిన కార్యకర్తలను అరెస్టు చేసి పనిలో పనిగా చాలామంది మీద రాజద్రోహం కేసులు పెట్టారు. పెనుకొండలో 'రాజద్రోహం' అదే మరి.

# నియోగి సంస్మరణ

సెప్టెంబర్ 28 శంకర్ గుహ నియోగి చనిపోయిన రోజు.

అతను హత్య చేయబడ్డాడు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలోని కంపెనీల యాజమానులతనిని కిరాయి హంతకుల చేత హత్య చేయించారు. వాళ్లకూ వీళ్లకూ కూడా సెషన్స్ కోర్టు శిక్షలు వేసిందిగానీ జబల్‌పూర్‌లోని హైకోర్టు బెంచి అందరినీ విడిచి పెట్టింది.

నియోగి అసాధారణమైన కార్మిక నాయకుడు. మొదటి అసాధారణమైన విషయమేమిటంటే అతను కార్మిక నాయకుడు మాత్రమే కాదు. అతను నడిపిన కార్మిక ఉద్యమం కేవలం కార్మిక ఉద్యమం కాదు. ప్రస్తుతమున్న సమాజం కన్న భిన్నమైన సమాజం ఏ విధంగా ఉంటుందో ప్రజా ఉద్యమాలు కొంతమేరకైనా నిర్మాణాత్మకంగా చూపించాలని నియోగి నమ్మాడు. ఎవరి బాగు వారు చూసుకోవడమే హేతుబద్ధమైన ఆలోచన అనే పెట్టుబడిదారీ తర్కాన్ని అసహ్యించుకుంటే చాలదు. దానికి ప్రత్యామ్నాయం కేవలం ఒక ఆదర్శం కాదనీ వట్టి ఆవేశం అసలే కాదనీ అది మనుషులకు సాధ్యమయ్యే జీవన శైలేననీ చూపించినప్పుడే మనకున్న అసహ్యాన్ని పదిమందిలోనూ కలిగించగలుగుతాం.

మనుషులు శ్రమనూ బాధ్యతనూ సంపదనూ సమిష్టిగా పంచుకునే జీవితాన్ని నిర్మించి చూపించడం సులభం కాదు. ప్రస్తుతమున్న దోపిడీ వ్యవస్థలో అక్కడక్కడ స్థానికంగా ఆదర్శవంతమైన జీవన పరిస్థితులను రూపొందించడం, రూపొందించి నిలబెట్టడం అసాధ్యమని దీనిని వివరించబోతారు. దోపిడీ వ్యవస్థే లేకున్నా, కొత్తగా 'అప్పుడే తయారు చేసిన' మనుషులను మన చేతిలో పెట్టినా, అది కష్టమే. దీని అర్థం నిరాశతో ఈ ప్రయత్నాన్నే వదులుకుందామని కాదు. ప్రస్తుత వ్యవస్థలో అసాధ్యంగానీ ఈ వ్యవస్థను కూలదోసిన తరువాత సులభమేననుకోవడం కంటే ఎప్పుడయినా కష్టమేనని గుర్తించి ఇప్పటినుండే సాధ్యమైన మేరకు ఒక ప్రత్యామ్నాయ

జీవన విధానాన్ని నిలబెట్టడం ఈ ప్రయత్నానికి చాలా ఉపయోగపడుతుంది. మనం మంచి కమ్యూనిస్టులు కాలేక పోవడానికి 'వ్యవస్థ' మాత్రమే కారణం కాదని మన మనసులోకి చూసుకుంటే మనకందరికీ తెలుస్తుంది. అట్లాగని మితిమీరిన స్వప్రయోజనం... అది వ్యక్తిత్వానికి కేంద్రమయితే వచ్చే ద్వేషం, ఈర్ష్య, ఇవే మనల్ని అన్ని వేళలా నడిపించవని కూడా మనకు తెలుసును. మనిషికి సాధ్యమయ్యే చెడును అధిగమించి మనిషికి సాధ్యమయ్యే మంచిని నిలబెట్టడం ఎప్పుడయినా కష్టమే, కానీ ఎప్పుడూ అసాధ్యం కాదు. ఎంత సాధ్యమవుతుందనే దాని మీద పరిసర పరిస్థితుల ప్రభావం ఉండదని కాదు. ఉంటుంది. కానీ అదే సర్వం అనుకుంటే భవిష్యత్ గురించి మనం చూపించే ప్రత్యామ్నాయ చిత్రం వట్టి ఊహా చిత్రంగానే ఉండిపోయి ఎవ్వరినీ పెద్దగా ఆకర్షించదు.

శంకర్ గుహ నియోగి ఆలోచనల వెలుగులో ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో కార్మికులు, ఇతర ప్రజలు నిర్మించిన రకరకాల సహకార సంస్థలు ఆ భవిష్యత్తును, ఆ ప్రత్యామ్నాయాన్ని కొంచెం దగ్గరికి తీసుకొచ్చి చూపించాయి. ఆ ప్రయోగాలలో ఉండే సమస్యలను ఇప్పటినుండే దగ్గరగా చూడడం కూడ వాటిని ప్రజాస్వామికంగా పరిష్కరించుకునే కృషికి, ఆలోచనకు తోడ్పడుతుంది. ఇప్పుడంతా అసాధ్యమేననీ, 'ఆ తరువాత' సులభసాధ్యమనీ అనుకుంటూ ఉంటే 'ఆ తరువాత' సమస్యలు ఒక్కసారిగా ముందుకొస్తే వాటిని అర్థం చేసుకోలేక ప్రతీఘాతుక శక్తులకు అంటగట్టి బల ప్రయోగంతో అణచివేసే వైఖరే దానికి జవాబయ్యే ప్రమాదం ఉంది.

విభిన్న సమస్యలను జోడించి పోరాటం చేయటం శంకర్ గుహనియోగి చేపట్టిన రాజకీయ ప్రయోగ విశేషాలలో మరొకటి. కార్మికులు రైతులతో మమేకం కావాలనీ, రైతాంగం ఆదివాసీలతో మమేకం కావాలనీ అనడం, వినడం కొత్తకాదు. కాని నిజానికి ఈ మమేకం అనేది ఉంటే మానసిక స్పందన రూపంలో మాత్రమే ఉంటున్నది. పూర్తిగా ఒక పోరాటం మరొక పోరాటంతో ఏకం కావడం అసంభవమే కానీ ఇంతకంటే బలమైన సంఘీభావం సాధ్యమే. కానీ ఒకే పార్టీకి ఉన్న రైతు సంఘం, కార్మికసంఘాల రూపంలో పార్టీ ద్వారానే కార్మికులూ రైతాంగమూ 'మమేకం' కావడం తప్ప అంతకంటే లోతయిన అర్థం ఆ మాటకు ఉద్యమాలు ఇవ్వలేక పోతున్నాయి.

ఛత్తీస్‌ఘడ్ గని శ్రామిక సంఘం సారా వ్యతిరేక పోరాటం నుండి ఛత్తీస్‌ఘడ్ ప్రాంత వెనుకబాటుతనం, వివక్షల దాకా అనేక సమస్యల మీద పోరాటాలు చేపట్టింది. జార్ఖండ్ లాగా ఛత్తీస్‌ఘడ్ కూడ ఖనిజాల నిక్షేపాలు విస్తారంగా ఉన్న ప్రాంతం. వాటిని ఆధారం చేసుకున్న పెద్ద పరిశ్రమలు కూడా అనేకం ఉన్నాయి. భిలాయినగరం

వీటికి ప్రధాన కేంద్రం. అయినప్పటికీ ఛత్తీస్‌ఘడ్ మొత్తంగా అభివృద్ధి చెందింది తక్కువ. దేశంలోని ఇతర ప్రాంతాల అభివృద్ధికి ఖనిజాలు సరఫరా చేసే ప్రాంతంగానే ఉండిపోయింది. శంకర్ గుహ నియోగి నిర్వహించిన కార్మిక పోరాటాలలో ఇది కూడా ఒక ముఖ్య అంశం అయింది.

పెట్టుబడిదార్లు కార్మికులకు సారాయి తాగించి వారి వ్యక్తిత్వాన్ని బలహీనపరచి పోరాట చైతన్యాన్ని నీరుగారుస్తారని విమర్శించని కార్మిక ఉద్యమం లేదు గానీ, పెట్టుబడిదార్లనూ వ్యవస్థనూ నిందించి సరిపెట్టుకుంటే చాలదని గుర్తించి కార్మికుల చేత సారాయి తాగడం మాన్పించే ఉద్యమం చేపట్టిన నాయకుడు నియోగి. మనుషులలోని బలహీనతలను పెత్తందారీశక్తులు, వారి ప్రయోజనాలకు అనుకూలంగా రూపొందిన వ్యవస్థలు వాడుకునే వైనం సుపరిచితమయినదే. దాని మీద విమర్శ కూడా అందరూ ఎప్పుడూ చేసేదే. కానీ దానికి జవాబుగా తమ బలహీనతలను గుర్తించి వాటి నుండి బయటపడే ప్రయత్నం ప్రజలు చేయాలని నమ్మి దానికోసం ఉద్యమం నిర్మించడం వామపక్ష సంప్రదాయంలో మామూలుగా కనిపించదు. మానవ ప్రగతికి సంబంధించిన చర్చ మనిషితో మొదలయి మనిషితో ముగిసినట్లయితే ఇది సాధ్యమయ్యేది. వ్యవస్థతో మొదలయి వ్యవస్థతో ముగిసే (మధ్యలో మనిషిని వెతుక్కునే) చర్చకు ఈ అవగాహన సైద్ధాంతికంగా కష్టతరం. నియోగి తన ప్రయత్నాన్ని సిద్ధాంతీకరించాడో లేదో– ఏ విధంగా సిద్దాంతీకరిచాడో– తెలీదు. కానీ అతని ప్రయత్నం నుండి ఈ జ్ఞానం పొందగలిగితే అది సఫలమయినట్టే.

చివరిగా మాట్లాడుకోవలసింది, నియోగి మరణానంతరం అతను నిర్మించిన ఉద్యమంలో చోటు చేసుకున్న సంక్షోభం గురించి. చాలా మంచి ప్రయత్నాలు చేసిన ఉద్యమాలు సహితం వాటిని ఉద్యమ ఆలోచనలుగా నిలబెట్టలేక పోవడం, విశిష్ట వ్యక్తిత్వం గల ఒక నాయకుడు లేక సిద్ధాంతవేత్త ఆలోచనలుగానే అవి ఉండిపోవడం తరచు చూస్తున్నాం. టిటో మరణానంతరం అతి భయంకరమైన జాత్యహంకారానికి క్షేత్రంగా మారిన యుగొస్లావియా దీనికి ఒక ప్రముఖ నిదర్శనం. మావో నుండి శంకర్ గుహనియోగి దాకా ఇంకా అనేకం ఉన్నాయి. దీనిని 'వ్యక్తివాదం' అని సులభంగా కొట్టిపారేయొచ్చును గానీ మానవత ప్రాతిపదికన అర్థం చేసుకొని సవరించుకోవడం అంత సులభం కాకపోవచ్చు.

అక్టోబర్ 17, 1999

## రాజీవ్ గాంధీ హత్యకేసు ముద్దాయిల ప్రాణాలు కాపాడటానికి

# ఆఖరు ప్రయత్నం

నళిని, మురుగన్, శంతన్, అరివుల రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో ఆ నలుగురి తుది ఘడియలు మరింత దగ్గరికొచ్చాయి. వీరు 'రాజీవ్ గాంధీ హంతకులు' అని న్యాయస్థానాలు ప్రజలకు చెప్పాయి. అంతకంటే దగ్గరగా చూసి ఏ పాటి హంతకులు అన్న ప్రశ్న వేసుకునే ఓపిక ఎవరికీ లేదు. ఏపాటి హంతకులయినా వీరికి మరణం తప్ప వేరే శిక్ష సరిపోదా అన్న ప్రశ్న వేసుకునే ఓపిక అసలే లేదు. నిజానికి రాజీవ్‌గాంధీ హత్యకు ప్రత్యక్షంగా బాధ్యులయిన వాళ్లందరూ కేసు విచారణ ప్రారంభం కాకముందే చనిపోయారు. థాను రాజీవ్ గాంధీతో పాటు చనిపోయింది. శుభ, శివరాసన్‌లతో సహా మొత్తం 12 మంది అరెస్టు, చిత్రహింసలు తప్పించుకోవడానికి ఆత్మహత్య చేసుకొని చనిపోయారు.

వీరికంటే ముఖ్యులు మరి ముగ్గురున్నారని ఆ కేసు పరిశోధన నిర్వహించిన కార్తికేయన్ భావించారు. వారు అసలు కుట్రదారులు. వారి పేర్లు ప్రభాకరన్, పొట్టు అమ్మన్, అఖిల. అయితే ఈ కుట్రదారులు మన పోలీసులకు దొరకలేదు. ఎందుకంటే వారుండేది ఈ దేశంలో కాదు. ప్రభాకరన్‌ను, అతని సహచరులను పట్టి అప్పగించవలసిందిగా శ్రీలంక ప్రభుత్వాన్ని కోరనున్నామన్న హాస్యాస్పదమైన ప్రకటనలు మన ప్రభుత్వం చాలా సార్లు చేసింది. వాళ్లను పట్టుకోగలిగితే శ్రీలంక ప్రభుత్వానికే చాలా సమస్యలు తీరుతాయి. కానీ ఎట్లా పట్టుకోవాలి?

ఈ ముగ్గురు ముఖ్యులు పోగా, వారి కుట్రను అమలులో పెట్టిన ప్రధాన పాత్రధారులలో థాను ఆనాడే చనిపోగా మిగిలిన పన్నెండు మంది భారతీయ పోలీసుల చేతికి చిక్కడం శ్రేయస్కరం కాదనుకొని సైనైడ్ గుళికలు మింగి చనిపోయారు. చావుకు చావే జవాబు అనుకున్నా అక్కడితో న్యాయం జరిగిపోయిందని మన వాళ్లంతా సంతృప్తి చెంది ఉండాలి. కానీ మన ప్రభుత్వంగానీ న్యాయస్థానాలుగానీ

సంతృప్తి చెందలేదు. చావకుండా చేతికి చిక్కిన 26 మందిని కూడా కఠినంగా శిక్షించడానికి పూనుకున్నారు. వీళ్లలో ఏ ఒక్కరూ రాజీవ్ గాంధీ హత్యలో ప్రత్యక్ష భాగస్వాములు కారు. నిజానికి నళిని ఒక్కతే ఆ రోజు హత్యాకాండ జరిగినచోట ఉంది. ఆమెకు కూడా జరగబోయే విషయం ఆ రోజు మధ్యాహ్నం దాకా తెలీదు. అప్పటిదాకా ఆమె ఒక ఎల్‌టిటిఇ అభిమానిగా శివరాసన్, శుభ, మురుగన్‌లతో ఉంది. మురుగన్‌ను ప్రేమించింది. కానీ రాజీవ్ గాంధీని చంపడం వారి లక్ష్యమని ఆమెకు ఆనాటి దాకా తెలీదు. ఆ రోజు మధ్యాహ్నమే శివరాసన్ ఆమెకు ఆ సంగతి చెప్పి 'శ్రీపెరంబుదూర్ బయలుదేరమని' అన్నాడు. ఆమెకు అతను అప్పగించిన పాత్ర కూడా స్వల్పమైనదే. శుభ, థాను శ్రీలంక తమిళులు కాబట్టి వారి యాసను బట్టి ఎవరికీ అనుమానం రాకుండా ఉండాలంటే ఒక మద్రాసీ స్త్రీ పక్కన ఉండాలి. ఆమె నిర్వహించిన పాత్ర అంతే. దానికి ఇప్పుడు ఆమె ఉరికంబం ఎక్కబోతున్నది. నిర్వహించిన పాత్ర ఎంత చిన్నదైనా ఆమె కూడా కుట్రలో భాగమేనని న్యాయమూర్తులన్నారు. ఆఖరి నిముషంలో కుట్ర ఏమిటో తెలుసుకున్న నళిని తప్పించుకోవాలన్నా తప్పించుకోగలిగేదికాదనీ, శివరాసన్ చెప్పినట్టు వినకపోతే ఆమెకే అపాయం జరిగేదనీ ఆమె తరఫున వకీళ్ళు చేసిన వాదనను న్యాయస్థానాలు త్రోసిపుచ్చాయి. పోనీయండి, కుట్రలో ఆమె భాగస్వామే అయినా కుట్రదారులందరికీ ఒకే శిక్ష వేయాలని ఎక్కడా లేదు కదా? ముఖ్యమైన కుట్రదారులు ఆత్మహత్య చేసుకొని ఉరికంబాన్ని తప్పించుకున్నారని చెప్పి స్వల్ప పాత్ర నిర్వహించిన వారిని పట్టుకొని ఉరికంబం ఎక్కించవలసిందేనా? నళిని కనీసం ఆ రాత్రి శ్రీపెరంబుదూర్‌లో ఉంది. మిగిలిన ముగ్గురూ ఆ మేరకు కూడా ప్రత్యక్ష పాత్రధారులు కారు. వారు రాజీవ్ గాంధీని చంపే పథకంలో భాగమే కానీ ముఖ్యులు ఎంత మాత్రం కారు. మురుగన్ చేసిన పనులు– నళినిని శివరాసన్‌కు పరిచయం చేయడం, శుభ, థానులు రాసిన ఉత్తరాలు శ్రీలంకకు తీసుకుపోయి పొట్టు అమ్మన్‌కూ అఖిలకూ ఇచ్చిరావడం, ఫోటోగ్రాఫర్ హరిబాబును శివరాసన్ తదితరులతో పాటు ఆనాడు శ్రీపెరంబుదూర్‌కు పంపించడం, వగైరాలు.

దీనికి అతనిప్పుడు ఉరికంబం ఎక్కబోతున్నాడు.

శంతన్ మరొక కుట్రదారుడు. అతను నిర్వహించిన పాత్ర ఏమిటంటే ఎల్‌టిటిఇ వివిధ వ్యక్తుల ద్వారా శివరాసన్ కోసం పంపించిన డబ్బులు అందుకొని అతనికి అందజేయడం. తిరివు ఇంకొక కుట్రదారుడు. ఇతని పాత్ర ఏమిటంటే 'మానవబాంబు' థాను ఉపయోగించిన బ్యాటరీలు కొనివ్వడం, ఫోటోగ్రాఫర్ హరిబాబు కెమెరాకు రోల్ కొనివ్వడం, శివరాసన్ శ్రీలంకలోని తన నాయకులతో మాట్లాడడానికి వైర్‌లెస్ పరికరాలు అమర్చడం.

వీళ్ళిద్దరూ కూడా ఇప్పుడు ఉరికంబం ఎక్కబోతున్నారు.

అసలయిన పాత్రధారులు, సూత్రధారులు ఆత్మహత్య చేసుకోకుండా ప్రాణాలతో దొరికి ఉంటే ఈ నలుగురిలో ఏ ఒక్కరికీ ఉరిశిక్ష పడేదికాదు. వారికి ఉరిశిక్ష వేసి వీరికి ఎంతో కొంత పరిమాణంలో ఖైదు మాత్రం విధించేవారు. వాళ్లు ప్రాణాలతో దొరకలేదని వీళ్లనిప్పుడు ఉరి తీయబోతున్నారు. దీనిని కక్ష అనవచ్చునో ప్రతీకారం అనవచ్చునో ఏమనవచ్చునోగానీ న్యాయం అని మాత్రం అనలేము.

ప్రతీనేరానికీ ఒక సామాజిక నేపథ్యం ఉంటుందనీ, ఆ నేపథ్యంలో చూసినప్పుడే నేరానికి వ్యక్తి బాధ్యత ఎంత, పరిస్థితుల బాధ్యత ఎంత అనేది అర్థం అవుతుందనీ హక్కుల ఉద్యమకారులు ఎప్పటినుండో అంటున్నారు. నేరస్థునికి ఎంత శిక్ష వేయాలన్నది అప్పుడే తెలుస్తుంది. రాజీవ్ గాంధీ హత్యకు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. దానిని మొత్తం అర్థం చేసుకుంటే ఆ హత్యకు హంతకుల బాధ్యత ఎంత ఉందో హతుని బాధ్యత కూడా అంతే ఉందని అర్థం అవుతుంది.

ఈ రాజకీయ నేపథ్యాన్ని సుప్రీంకోర్టు బాగానే అర్థం చేసుకున్నది. నీళ్ళు నమలకుండా వివరించింది. అయితే శిక్ష ఎంత వేయాలో నిర్ణయించేటప్పుడు దానినసలే లెక్కలోకి తీసుకోలేదు. శ్రీలంకలో తమిళులు వివక్షకు గురయినమాట వాస్తవం. ఈ వివక్షపట్ల నిరసన వ్యక్తం చేస్తూ తమిళుల హక్కులకు అండగా ముందుకొచ్చిన ఉద్యమమే 'తమిళ వేర్పాటు ఉద్యమం'గా పరిణామం చెందింది. 1987 దాకా ఈ శ్రీలంక తమిళ వేర్పాటు వాద సంస్థలకు భారతదేశంలో ఆశ్రయం మాత్రమే కాదు, చాలా ప్రోత్సాహం సహితం లభించింది. ప్రజల నుండి మాత్రమే కాదు, ప్రభుత్వం నుండి కూడా లభించింది. ఎల్.టి.టి.ఇ. కి సైనిక శిక్షణ భారత సైన్యమే ఇచ్చిందనేది బహిరంగ రహస్యం.

1987 లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఈ విధానాన్ని మార్చేసాడు. 'తమిళ ఈలం'లో శాంతి నెలకొల్పడం ప్రధాన విషయంగా గల భారత–శ్రీలంక ఒడంబడిక జరిగింది. శాంతి ఒప్పందం పైన సంతకం చేయమని ఎల్‌టిటిఇ పైన రాజీవ్ గాంధీ ప్రభుత్వం చాలా ఒత్తిడి పెట్టింది. ఈ శాంతిని కాపాడడానికి భారతసైన్యం 'శాంతి పరిరక్షక బలగం' (ఐపికెఎఫ్) పేరిట శ్రీలంక ప్రభుత్వానికి అండగా ఆ దేశానికి పోయింది. భారత్ పనిగట్టుకొని పెంచిన ఆశలను ఈ విధంగా ఒక్కసారిగా కూల్చివేయడం ఎల్‌టిటిఇ వంటి తమిళ జాతీయవాద సంస్థలకు చాలా కోపం తెప్పించింది. పైగా భారత సైన్యం శాంతి నెలకొల్పే పేరిట శ్రీలంకలో తమిళులపైన అనేక అత్యాచారాలకు పాల్పడింది.

ఈ విషయాలన్నీ నిర్మొగమాటంగా చర్చించి ఈ కారణంగానే ఎల్‌టిటిఇ రాజీవ్‌గాంధీ పైన ద్వేషం పెంచుకుందని విశ్లేషించడం ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పులో ఒక విశేషం. అయితే శిక్ష ఎంత వేయాలని నిర్ణయించేటప్పుడు ఈ నేపథ్యాన్ని అసలే లెక్కలోకి తీసుకోకుండా 'చంపారు  కాబట్టి చావవలసిందే' నన్నట్టు వ్యాఖ్యానించడం ఇంకొక విశేషం.

ఈ వైరుధ్యాలను ఎత్తి చూపుతూ, పై నలుగురికీ ఉరి శిక్ష తప్పించి ఖైదు మాత్రమే వేయాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తూ, జస్టిస్ కృష్ణయ్యర్ వంటివారి నాయకత్వంలో ఒక ప్రయత్నం ప్రారంభమయింది. ఆ ప్రయత్నం ఫలిస్తుందని ఆశిద్దాం.

అక్టోబర్ 31, 1999

# పోప్‌ను ఏమడుగుతారు? ఏం చెప్తాడు?

ఏ మతం ద్వారానయినా దేవుడిని చేరవచ్చునని దాదాపు 35 ఏళ్ళ క్రితమే కేథలిక్ చర్చి అధికారికంగా ప్రకటించింది. ఆ మత ఉన్నతాధికారి అయిన పోప్ దాన్ని ప్రకటించారు. క్రైస్తవంలో మాత్రమే మోక్షం ఉందన్న అభిప్రాయాన్ని అక్కడితో వారు అధికారికంగా వదులుకున్నట్టే.

మత సహనం హైందవానికి ఉండే ప్రత్యేక లక్షణమని మన హిందుత్వవాదులు అంటుంటారు. అదేమోగానీ, ఏమాత్రం మత సహనం ప్రదర్శించని హిందుత్వవాదులు ఆ మాట అనడం కొంచెం ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. హైందవంలో సహనం ఎక్కువని, లౌకికత సహజ గుణమని, అది ప్రజాస్వామ్యానికి అనుకూలమైన మతమని ఈ విలువల పట్ల ఏ మాత్రం గౌరవం లేని వాళ్ళే ఎక్కువగా ప్రకటిస్తుంటారు. పోప్ భారతదేశానికి వచ్చినంత మాత్రాన క్రైస్తవం ఎక్కడ బలపడిపోతుందోనని ఆందోళన చెందేవారు పరమత సహనం తమ సొత్తని గొప్పలు చెప్పుకోవడం ఎందుకు? క్రీస్తు చనిపోయిన కొద్ది సంవత్సరాలకే క్రైస్తవం ఈ నేల మీద అడుగు పెట్టింది. పాశ్చాత్య దేశాల వర్తకులూ పాలనాధికారులూ ఈ దేశాన్ని లోబరచుకున్న క్రమంలో క్రైస్తవం వైపు మత మార్పిడులు కొంత వేగం పుంజుకున్నాయి.

అయినప్పటికీ ఈనాటికీ దేశంలో క్రైస్తవుల సంఖ్య 2.5 శాతం మించలేదు. రాబోయే రోజులలో ఇంతకంటే పెద్దగా ఎక్కువ కాబోదు. ఎప్పటికయినా భారతదేశంలో క్రైస్తవుల సంఖ్య 3 లేక 4 శాతం మించబోదని ఖచ్చితంగా చెప్పవచ్చు. మరి ఈ మహాభాగ్యానికి, సహనం మా సొత్తని చెప్పుకునే వారు ఇంత అసహనం ప్రదర్శించడం ఎందుకు? పోప్ ఇక్కడికొస్తే ఏవో ప్రశ్నలకు జవాబు చెప్పాలంట. చెప్పడానికి ఒప్పుకోకపోతే ఆయనను రానివ్వరంట. 'పోప్ వంటి ప్రముఖ అతిథిని రానివ్వమనడం సరయినది కాద'ంటూనే అదే సమయంలో అతనిని ప్రశ్నించడం, నిలదీయడం న్యాయమేనని దేశాన్ని ఏలుతున్న బిజెపివారు తమ మిలిటెంట్ సోదరులను వారించినట్టే వారించి వారి చర్యలను సమర్థిస్తున్నారు.

మన అయ్యగార్లూ ఆచార్యులూ ఊరికే అమెరికాకూ ఇంగ్లాండ్‌కూ పోయి వస్తుంటారు. షికాగో నుండి లండన్ దాకా అక్కడున్న ప్రవాస భారతీయులు కట్టించిన గుళ్లల్లోనూ మత సమాజాలలోనూ ఉపన్యసిస్తుంటారు. వాళ్లను అటకాయించిన వారూ హెచ్చరించిన వారూ ఎవరూ లేరు. దీనిని అక్కడి వాళ్ళ ఔదార్యమని మనం అనుకోవడం లేదు. మన గొప్పదనమనే అనుకుంటున్నాం. మనం ఎంత గొప్పవాళ్లము కాకపోతే వాళ్లు మన చేత మాట్లాడించుకొని మరీ వింటారనుకుంటున్నాము. వివేకానందుడిని అమెరికా వాళ్లు తామే పిలిపించుకొని హైందవం గురించి చెప్పించుకొని భేషుగా ఉందని మెచ్చుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి దాకా దానిని వివేకానందుడి గొప్పదనమనే అనుకున్నాముగానీ వారి సహనశీలమనుకోలేదు.

పోప్ మాత్రం వస్తే వచ్చాడుగానీ వీళ్లడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలంట. లేకపోతే మర్యాద దక్కదంట. విశ్వహిందూపరిషత్ ప్రదర్శిస్తున్న ఈ దాదాగిరీకి 'చర్చ' అని వారి బిజెపి మిత్రులు పేరు పెట్టి సమర్థిస్తున్నారు. గ్రహం స్టెయిన్స్‌ను చంపేసి 'మత మార్పిడులు ఆగాలి' అని హిందుత్వవాద హంతకులు అంటే, 'అవును మత మార్పిడులపైన చర్చ జరగాల్సిందే'నని హిందుత్వవాద పాలకులు నిన్నగాక మొన్న అనలేదా?

ఇంతకూ ఏమిటి వీళ్లడగదలుచుకున్న ప్రశ్నలు? దేశంలో క్రైస్తవ ప్రచారకులు మత మార్పిడులు ఎందుకు చేస్తున్నారో చెప్పాలంట, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటు ఉద్యమాలను చర్చి ఎందుకు సమర్థిస్తున్నదో చెప్పాలంట. మత మార్పిడులు పెద్దగా జరుగుతున్నది లేదు గానీ జరుగుతున్న మేరకు వాటికి ఆకర్షితులవుతున్నది దళితులు, ఆదివాసులు. ఈశాన్య రాష్ట్రాలలోని ప్రజలు కూడా ఆదివాసులే. కాబట్టి ఈ దేశంలోని దళితులు, ఆదివాసులు ఈ సమాజంలోనూ ఈ దేశంలోనూ ఎందుకు ఇమడలేక పోతున్నారో ఎక్కడ నుండో వచ్చిన పోప్ చెప్పాలంట.

దళితులకు హైందవంతో ఉండేది ఒక వికృతమైన సంబంధం. ఒక విషయం తాను నిరాకరించేదాని ద్వారా తనను తాను నిర్వచించుకోవడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది. (చీకటి అంటే వెలుతురు లేని చోటు, లేక స్థితి అని నిర్వచించినట్టు). హైందవం తాను వెలివేసిన దళితుల ద్వారా తనను తాను నిర్వచించుకుంటుంది. దాని ఉనికికి దళితులు అవసరం, వారి వెలివేత అవసరం. కానీ దళితులకు హైందవంతో ఏమవసరం ఉంది? అంటరానితనం ఏదో ఒక మేరకు పాటిస్తూనే ఉన్నా, పాటించడం తప్పని ఒప్పుకుంటున్నాం, మీరింక అన్నీ మరచిపోయి మిమ్మల్ని మీరు హిందువులుగా భావించి మాతో ఉండండి అని

హిందువులు అంటే దళితులు ఎందుకు ఒప్పుకోవాలి? ఒప్పుకుంటే అది వారి దయ అని హిందువులు సంతోషించాలి గానీ ఒప్పుకోకుండ తమకు సూత్రప్రాయంగా దేవుని ముందు సమాన హోదా కల్పించే మతంలోకి పోతామంటే దానికి ఎవరినో సమాధానం, సంజాయిషీ అడగడంలో అర్థమేమయినా ఉందా? ఒక్క రోజు కూడా అంటరానితనానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమంగానీ పోరాటంగానీ చేయని హిందుత్వవాదులకు, దళితులు క్రైస్తవంలోకి ఎందుకు పోతున్నారో చెప్పమంటూ కేథలిక్‌ల పోప్‌ను ప్రశ్నించే అర్హత ఎక్కడిది? ఆదివాసులు అసలు ఏ అర్థంలోనూ హిందువులు కారు. వారు క్రైస్తవంలోకి పోతే క్రైస్తవులు పెరుగుతారుగానీ హిందువులు తగ్గరు. హిందువులు కాని వాళ్ళు క్రైస్తవంలోకి పోవడానికి వీలులేదంటూ వారిని శాసించడానికి వీరెవరు? ఆదివాసీలు తమ ఆదివాసీ పూజలకే పరిమితమైనంత కాలం వారి దేవుళ్ళను బ్రాహ్మణీకరించి వారిని హైందవ సాంస్కృతిక ఆధిపత్యం క్రింద ఉంచుకోవచ్చును. వారు క్రైస్తవమో ఇస్లాంమతమో పుచ్చుకుంటే అది సాధ్యం కాదు. ఇదే హిందుత్వవాదుల ఘోష అయితే అది వారి సమస్య. దానికి పోప్ ఎందుకు జవాబు చెప్పాలి? ఇక ఈశాన్య రాష్ట్రాల పోరాటాలను క్రైస్తవంతో ముడిపెట్టడం కంటే తెలివితక్కువతనం వేరే ఏమీ ఉండదు. ఒక వేళ ఏమైనా సంబంధం ఉందనుకున్నా దానికి పోప్ జవాబు చెప్పలేడు. ఎందుకంటే వేర్పాటువాద పోరాటంలో అగ్రభాగాన ఉన్న నాగాలాండ్ ప్రజలు బాప్టిస్టులు; కేథలిక్‌లు కారు. విశ్వహిందూపరిషత్ చేష్టలకు పోప్ ఏ మాత్రం జవాబు చెప్పగలడో బాప్టిస్టుల చర్యలకు అంతకంటే ఎక్కువ చెప్పలేడు.

కాగా, ఈశాన్య రాష్ట్రాలలోని వేర్పాటువాద పోరాటాలకు మతంతో ఏమైనా సంబంధముంటే అది చాలా పరోక్షమయినదే. నాగా, మెయితీ, ఖాసీ, గారో తదితర జాతులు చారిత్రకంగా, సాంస్కృతికంగా ఏ రోజూ తక్కిన భారతదేశంలో భాగంకారు. బ్రిటిష్ వారు కృత్రిమంగా నిర్వచించిన ఇండియాకు మనం భారత్ అని పేరు పెట్టుకొని దాని చిత్రపటం మీద మమకారం పెంచుకొని దానిని దేశభక్తి అని ముద్దుగా పిలుచుకుంటున్నాం. దానిని కాదనే వాళ్లను దేశ ద్రోహులు, వేర్పాటువాదులు అంటున్నాం. ఇది మన సమస్యే తప్ప వేరెవ్వరిదీ కాదు. దానికి విశ్వహిందూపరిషత్ నాయకులు పోప్‌ను అడిగేదేముంది? ఆయన చెప్పేదేముంటుంది?

# ఉద్యోగాలకు ముప్పు

**మ**న రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగులను పెద్దఎత్తున త్వరలో తొలగించబోతారన్న ఆందోళన ఉద్యోగ వర్గాలలో వ్యక్తం అవుతున్నది.

పర్మనెంట్ ఉద్యోగులను కూడా తొలగిస్తారేమో గాని మొదట టెంపరరీ పోస్టుల మీద పడ్డారు. ఇది చిన్న విషయం కాదు. పర్మనెంట్ పని కూడా టెంపరరీ ఉద్యోగుల ద్వారా ఏళ్లతరబడి చేయించుకోవడం ప్రభుత్వాలకు బాగా అలవాటు అయిపోయింది. 15 లేక 20 సంవత్సరాలు ఒకే ఉద్యోగం చేస్తున్న టెంపరరీ ఉద్యోగులు చాలామంది ఉన్నారు. కొన్ని ప్రభుత్వ సంస్థలు, శాఖలు ఈ రకమైన 'శాశ్వత టెంపరరీ' సిబ్బందితోనే నడుస్తున్నాయి. కాబట్టి టెంపరరీ ఉద్యోగులను తీసేయబోతున్నారంటే ఆరు నెలలో తొమ్మిది నెలలో పనిచేసిన వారిని ఇంక పనిలేదని చెప్పి తీసేయబోతున్నారని అర్థం చేసుకుంటే పెద్ద పొరబాటవుతుంది.

ఈ టెంపరరీ సిబ్బంది జీతాలు కూడా కడుహీనంగా ఉన్న సందర్భాలు కద్దు. నెలకు 50 లేక 75 రూపాయలకు స్వీపర్లుగా వాచ్‌మెన్‌లుగా గార్డెనర్లుగా ప్రభుత్వ సంస్థలలో పని చేస్తున్న వారున్నారంటే బహుశా చాలామంది నమ్మకపోవచ్చు. పనిస్థలానికి పోయిరాను అయ్యే బస్సు కిరాయిలో సగానికి కూడా సరికాని ఈ జీతానికి ఎవరైనా ఎందుకు పనిచేస్తారని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఒకసారి ప్రభుత్వ సంస్థలలోకి చొరబడితే ఏదో ఒక రోజు పర్మనెంట్ ఉద్యోగం దొరకకపోదన్న ఆశతో చేస్తారు. ఆ ఆశ వారిలో ఉందని, అందువల్ల ఎన్నేళ్లు గడిచినా ఒక్క రూపాయికూడా పెరగని జీతాన్ని గురించి అడగకుండా ఏళ్లతరబడి టెంపరరీ ఉద్యోగం పేరిట శాశ్వత నిరీక్షణలో పని చేయడానికి సిద్ధపడతారనీ ప్రభుత్వానికి తెలుసు. వారి ఆశను ప్రభుత్వం నిస్సిగ్గుగా వాడుకుంటున్నది. ఈ నిరీక్షణకు ముగింపెప్పుడో చెప్పకుండా వారిచేత అతితక్కువ వేతనానికి ఏళ్లతరబడి పని చేయించుకుంటుంది.

అదే పని చేసే పర్మనెంట్ ఉద్యోగులు గనుక ఉన్నట్టయితే వారికిచ్చే జీతమే వీరికీ ఇవ్వాలన్నది ఈ రోజొక ప్రాథమిక హక్కు కింద లెక్క. అయినప్పటికీ అందులో నాలుగవ వంతు జీతం ఇచ్చినా, ఆ మాత్రం కూడా ఇయ్యకున్నా నోరు మూసుకొని

పనిచేస్తూనే ఉంటారు. అడిగినా, కోర్టుకు పోయినా ఈ ఉద్యోగం సహితం పోతుందని భయపడతారు. ఎవరైనా ధైర్యం చేసి కోర్టుకు పోయినట్లయితే వారిని ట్రిబ్యునల్ నుండి సుప్రీంకోర్టుదాకా లాగి ముప్పుతిప్పలు పెడుతుంది ప్రభుత్వం. ఇది నిన్నటిదాకా ఉన్న పరిస్థితి. ఎవరో ఒకరిద్దరు సిబ్బందితో ప్రభుత్వం ఈరకంగా వ్యవహరించినా అది అన్యాయమే కానీ కొన్నేళ్ళుగా ఈ కోవకు చెందిన ఉద్యోగుల సంఖ్య పెరుగు తున్నది. చాలా శాఖలలో సంస్థలలో వీరే మెజారిటీ కూడా.

ఈ విధంగా టెంపరరీ కార్మికులుగా వీరిచేత శాశ్వతంగా ఉండే పనులు చేయించుకొని చేయించుకొని, ఇప్పుడు 'అవసరం ఉందా లేదా అని చూడకుండా ఏళ్లతరబడి కొనసాగుతున్న టెంపరరీ పోస్టులను రద్దుచేయాలి' అని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతున్నది. ఇన్నాళ్ళూ అవసరమనుకునే వీరిచేత పని చేయించుకున్నారు. భవిష్యత్తులో ఎప్పటికయినా పర్మనెంట్ కాకపోతామా అన్నవారి ఆశను నిర్లజ్జగా వాడుకొని అతితక్కువ వేతనానికి వారి శ్రమను దోచుకున్నారు. ఇప్పుడు వారిని ఇళ్లకు పంపించేయాలనుకుంటున్నారంటే అర్థం వారి శ్రమ అక్కర లేకుండా పోయిందని కాకపోవచ్చు. ఆ పని నుండి ప్రభుత్వం పక్కకు తప్పుకొని ప్రైవేటు రంగానికి అప్పగించే ఉద్దేశ్యం అక్కడ ప్రధానం కావచ్చు. అప్పుడు ఆ ప్రైవేట్ కాంట్రాక్టరు అంతే తక్కువ వేతనం ఇచ్చి అదే పనిని బహుశా అప్పటిదాకా 'టెంపరరీ' ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేసిన వారి చేతనే చేయించుకోవచ్చు.

అందువల్లనే ప్రణాళికేతర తాత్కాలిక పోస్టులన్నిటిని రద్దుచేయాలని ప్రకటించిన జివో 69 పట్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అక్కర లేకుండా పోయిన పోస్టులను ప్రభుత్వం కొనసాగించవలసిందేనని ఎట్లా అంటామని అమాయకంగా అడగవద్దు. ఇక్కడ సమస్య అదికాదు. నిజంగా అక్కర లేకుండా పోయిన (అంటే అవసరం తీరిపోయిన) ఉద్యోగాలు, అనవసరంగానే ఒకటి సరిపోయే చోట రెండు కల్పించిన ఉద్యోగాలు కొన్ని ఉండవచ్చును. కానీ జివో 69 దృష్టి కేవలం వాటి మీద లేదు. ప్రభుత్వం తన భుజాలమీది బరువును ప్రైవేట్ రంగానికి బదలాయించే క్రమంలో పుట్టిన ఆలోచన ఇది. అప్పుడు పర్మనెంట్ అనే మాటే లేకుండా నిత్యం 'క్యాజువల్'గానే ఉండే ఉద్యోగాలతో ఏళ్ల తరబడి పని చేయించుకోవచ్చు. ప్రభుత్వం 'ఆదర్శవంతమైన యజమానిగా ఉండాలి' అని మన కోర్టులు అప్పుడప్పుడు అంటుంటాయి. పర్మనెంట్ కావలసిన పోస్టులను శాశ్వతంగా టెంపరరీగానే ఉంచేసి మన రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శవంతంగా లేదన్న అపప్రథ పొందింది. ఇప్పుడు ఆ అపప్రథ తొలగించుకోవడానికి ఆ పోస్టులను పూర్తిగా రద్దుచేసేసి అవి చేస్తున్న పనిని ప్రైవేట్ రంగానికి అప్పగించేయాలనే ఆలోచన చేస్తున్నది.

అయితే ఉద్యోగుల ఆందోళన విజయం సాధించేనా? జివో 69వంటి చర్యలను 'రేషనలైజేషన్' అంటారు. ప్రభుత్వరంగంలో అది పెద్దఎత్తున జరగాలన్నది ప్రపంచబ్యాంకు మనబోటి దేశాలకిస్తున్న ఆదేశాలలో ఒకటి. ఇది అనవసరమైన పోస్టుల తొలగింపు పేరిట జరుగుతున్నప్పటికీ దీని అసలు భావం ప్రభుత్వం మోయడం అనవసరం అని భావిస్తున్న బరువును చవకగా చేసి పెట్టగల ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం. ఈ పని 'నిర్భయంగా' చేయడానికి సిద్ధంగా ఉన్నాడనే యావత్ ప్రపంచం ఈ రోజు చంద్రబాబును మెచ్చుకుంటున్నది. ఈ నిర్భీతి వల్ల ఎన్నికలలో ఓడిపోతాడేమోనని భయపడిన అతని కార్పొరేట్ అభిమానుల మనస్సులను శాంతింపజేస్తూ మనం అతనినే తిరిగి ఎన్నుకున్నాం. ఇంక జివో 69 గురించి పునరాలోచించవలసిన అవసరం అతనికేముంది?

కాగా, ప్రభుత్వ ఉద్యోగులన్నా ఉద్యోగ సంఘాలన్నా ప్రజలలో ప్రేమలేకపోవడం కూడా చంద్రబాబు పాల్పడదలచుకున్న అన్యాయానికి బలం చేకూరుస్తున్నది. ప్రభుత్వరంగం పర్మనెంటనీ అందులో ఉద్యోగాలన్నీ పర్మనెంటనీ ప్రభుత్వం 'ఆదర్శ యాజమాని'గా ఉంటుంది కాబట్టి అతిహీనమైన జీతాలకు టెంపరరీగా ఏళ్లతరబడి పనిచేయించుకోదనీ ఒక కృత్రిమమైన భరోసా పెట్టుకున్న ఉద్యోగ సంస్థలు తమ మనుగడకు ప్రజల మద్దతు అవసరమవుతుందని చాలాకాలం అనుకోలేదు. టెంపరరీ ఉద్యోగుల సంఖ్య తమ కళ్ల ముందే పెరుగుతున్నా ఆ సంగతి పట్టించుకోలేదు. ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించే ఉద్యోగుల విషయంగానీ అవినీతిపరుల విషయంగానీ పట్టించుకోవాలని ఎన్నడూ అనుకోలేదు. ఈ రోజు ఉద్యోగులకు నష్టం జరుగుతున్నదని ప్రజల దగ్గరకు పోగల పరిస్థితిలో ఉద్యోగ సంఘాలు లేవు, ప్రజలు ఆదరించే స్థితిలోనూ లేరు. ఇన్నేళ్లు తాత్కాలిక ఉద్యోగిగా అతి తక్కువ వేతనానికి పని చేయించుకొని ఇప్పుడు ఖాళీ చేసి పొమ్మంటున్నారని వాపోతే, ఒక రేషన్ కార్డు మంజూరు చేయడానికీ పెన్షన్ చేతికియ్యడానికీ కరెంటు మోటర్ రిపేర్ చేయడానికీ రైతుకు పాస్‌బుక్ ఇవ్వడానికీ ఉద్యోగులు తమను ఎంత హింసిస్తుంటారో మరిచిపోలేని ప్రజలు స్పందించడం కష్టమే. వాళ్లనందుకు నిందించడం అంత కంటే కష్టమే.

ఇప్పటికయినా ఉద్యోగ సంఘాలు తమ సభ్యుల అవినీతి గురించీ ప్రజా వ్యతిరేక వైఖరి గురించీ పట్టించుకుంటామని బహిరంగంగా హామీ ఇవ్వడం అవసరం. ప్రజల మద్దతును ఈ రూపంలో వారు గెలుచుకోలేకపోతే చంద్రబాబుదే తుది విజయం అవుతుంది.

నవంబర్ 28, 1999

# మెదడువాపుకు పందులు కారణమా?

రాష్ట్రంలో మెదడువాపు ప్రబలింది కాబట్టి పందులను చంపండని ముఖ్యమంత్రి మూడురోజుల క్రితం ప్రకటించాడు.

చిన్న పిల్లల ప్రాణాలు తీసే ఆ వ్యాధి పట్ల సమాజంలో తీవ్రమైన ఆందోళన ఉండడం చాలా సహజం. పైగా మురికివాడలలో నివసించే పేద వర్గాల పిల్లలే ఈ వ్యాధికి బలి అవుతారు కాబట్టి వైద్యం కొనుక్కునే స్తోమత లేని ఆ పిల్లల గురించి ఆందోళన చెందడం మరీ సహజం.

నిగాహ్

కానీ ఒక సమస్య గురించి సమాజంలో ఆందోళన ఉందనిచెప్పి అనాలోచితమైన పరిష్కారాలను బాధ్యతగలవారు ప్రచారం చేస్తే అసలు సమస్యకు తోడు కొత్త సమస్యలు పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది.

పందులను చూసి భయపడే పరిస్థితి కల్పిస్తే, అది పందులు పెంచి బతికే ప్రజల మీద ద్వేషంగా మారే అవకాశం ఉంది. పందులు పెంచి బతికే ప్రజలు ఎరుకల, దొమ్మరి, యానాది మొదలైన కులాలవారు. ఈ ప్రజలను మామూలుగానే హైందవ సమాజం చాలా తక్కువ భావంతో చూస్తుంది. పిల్లలను చంపే పందులను పోషించి బతికేవాళ్లగా వాళ్లను చిత్రీకరిస్తే వారిపైన ద్వేషం సులభంగా పెరగగలదు. ఆ సంగతి తెలిసే అధికారులు ఈ ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఈ రకమైన అభిప్రాయం కలిగించేస్తే, ఇంక ఆ తరువాత నల్లులనో దోమలనో చంపినట్టు పందుల హననం కొనసాగించినా సమాజంలో ఎవ్వరూ అడగరు. తమ జీవనాధారం పోతున్నదని బాధపడే ఎరుకల, దొమ్మరి తదితర బడుగు ప్రజలకు ఎంత మాత్రం సానుభూతి దొరకదు.

కానీ నిజానికి పందులకూ మెదడువాపు వ్యాధికీ ప్రత్యక్ష సంబంధమేమీ లేదు. పందులు పిల్లలను కరవడం వల్లనో లేక తాకడం వల్లనో లేక పందులు సంచరించే చోట గాలి పీల్చడం వల్లనో ఆ రోగం రాదు.

మెదడువాపు వ్యాధి ఒక సూక్ష్మ క్రిమివల్ల వస్తుంది. మలేరియా క్రిమిలాగా ఈ క్రిమి కూడ దోమల ద్వారా ప్రసారమవుతుంది. దోమలు మనల్ని కరిచినప్పుడు ఆ క్రిమి మన రక్తంలోకి ఎక్కుతుంది. వేరే ఏరకంగానూ– పందులు పిల్లలను కొరికినా, పందులతోనే పిల్లలు రోజంతా ఆడుకున్నా–మెదడు వాపు క్రిమి మన ఒంట్లోకి ప్రవేశించదు.

అయితే మరి ఈ వ్యాధికీ పందులకూ సంబంధమేమిటంటే ఈ క్రిమిని వ్యాపింపజేసే దోమ జాతికి పందుల వంటి పెద్ద జంతువుల రక్తమంటే ఇష్టం. కాబట్టి ఈ జాతి దోమలు ఉన్న చోట పందులు ఉంటే అవి పందుల రక్తం కోసం వాటి చుట్టూ ముసురుతాయి. అక్కడ మనుషులుంటే వారిని కూడ కరుస్తాయి. ఒక్క పందులేకాదు ఏ పెద్ద జంతువులు మందలుగా ఉన్న చోటయినా ఈ జాతి దోమ గానీ ఉంటే అది ఆ మంద చుట్టూ ముసరడం వల్ల ఇదే ఫలితం ఉంటుంది. అంత మాత్రం చేత ఆవుల మందలనూ, బర్రెల మందలనూ చంపేద్దామని ఏ అధికారీ ఇప్పటి దాకా అనలేదు. పందుల పెంపకం కూడ ఎరుకల, యానాది, దొమ్మరి కులాలు కాక హైందవ సమాజంలో గౌరవంగల కులాలు చేపట్టినట్టయితే ఆ జంతువుల మీద కూడ ద్వేషం రెచ్చగొట్టేవారు కాదేమో.

దోమలసలు ఉంటేనే అవి పందుల చుట్టూనయినా మనుషుల చుట్టూనయినా ముసురుతాయి. అవి జంతువుల చర్మాల మీద గుడ్లుపెట్టవు, పొదగవు. దానికి మురుగునీటి మడుగులు కావాలి. మురుగునీటి మడుగులు, కాలవలు లేకుండా మన ఊళ్లను శుభ్రంగా ఉంచగలిగితే ఎన్ని పందుల మందలున్నా ఏం కాదు.

అందుకే పందుల పెంపకం సంవత్సరం పొడవునా జరిగినప్పటికీ మెదడువ్యాపు వ్యాధి వానాకాలంలో మాత్రమే వస్తుంది. పందులే దానికి కారణమైతే సంవత్సరమంతా ఆ వ్యాధి రావాలి. కానీ మురుగునీరు మడుగులలో నిలవ ఉండే సీజన్‌లో మాత్రమే మెదడువాపు వ్యాధి వస్తుంటుంది. కాబట్టి చేయవలసింది పందులను చంపడం కాదు, మన ఊళ్లను శుభ్రంగా ఉంచడం.

ఇవేవీ అర్థంకాకపోయినా హైకోర్టు ఆదేశాల పట్లనయినా మన పాలకులకు గౌరవం ఉండాలి. 1987లోనే ఈ విషయం మన రాష్ట్ర హైకోర్టు ముందుకు వచ్చింది. హైకోర్టు మెదడువాపు వ్యాధిని అరికట్టడానికి పందుల సంచారాన్ని తగ్గించడం అవసరమనే భావించినప్పటికీ ఇక్కడ రెండు వైపులా సమస్యలున్నాయని అర్థం చేసుకొనింది. ఒకపక్క ఈ వ్యాధికి బలయ్యే పేద బలహీన వర్గాల ప్రజల పిల్లలున్నారు. రెండవ పక్క పందులను పోషించి బతికే ఆదివాసీ లేక సంచార కులాల ప్రజలున్నారు.

ఇద్దరికీ న్యాయం జరిగేటట్టు చూడడం కోసం హైకోర్టు 9 సూత్రాల ప్రణాళికను ఆదేశించింది.

పందుల యజమాన్లను గుర్తించి వారి దగ్గరున్న పందులకు లైసెన్సులు ఇవ్వాలి. ఒక్కొక్కరి దగ్గర ఎన్ని పందులున్నాయన్న దానిని బట్టి వారికి ఊరి వెలుపల పునరావాసానికి రెవెన్యూ అధికార్లు భూమి కేటాయించాలి. ఎక్కడో ఒకచోట కేటాయించి బలవంతంగా అక్కడికి తరలించే బదులు, రెండు మూడు జాగాలు చూపించి వాటిలో ఏది వారికి సమ్మతమైతే అదే వారికి కేటాయించాలి. ఇందుకోసం అప్లికేషన్లు పెట్టుకొమ్మని అన్ని మునిసిపాలిటీలూ పంచాయితీలూ దండోరా వేసి ప్రచారం చేయాలి. తమ జీవాలకు లైసెన్స్‌లు, తమ వ్యాపారానికి పునరావాసం తీసుకొమ్మని ప్రోత్సహించాలి.

1987 (ఆం. ప్ర. ఆదిమజాతి సేవాసంఘం వర్సస్ గుంటూరు మునిసిపల్ కౌన్సిల్ కేసులో) మన రాష్ట్ర హైకోర్టు సూచించిన ఈ ప్రయత్నాన్ని ఏ మునిసిపాలిటీగానీ పంచాయితీగానీ ఇప్పటిదాకా అమలు చేయడం మొదలుపెట్టలేదు. పందుల పెంపకందార్ల పునరావాసానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఎక్కడా భూమి కేటాయించలేదు. కాని వర్షాకాలంలో మెదడువాపు వ్యాధి ప్రబలినప్పుడల్లా పందులను చంపే కార్యక్రమం మాత్రం పెద్దెత్తున చేపడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సహించడం మొదలుపెట్టిన తరువాత ఇంక వాళ్లను వెనక్కి లాగేదెవరు?

పన్నెండేళ్ల క్రితం ఆ తీర్పు ఇచ్చినప్పుడు హైకోర్టు ప్రదర్శించిన విశాల దృక్పథం ఇప్పుడు కోర్టులలో సహితం కొరవడింది. పందులను మునిసిపాలిటీ వారు చంపడం మొదలు పెట్టినప్పుడల్లా పందుల కాపరులు కోర్టుకొచ్చి 'మాకు పునరావాసం కల్పించకుండా మా పందులను చంపుతున్నారు' అంటూ మొరపెట్టుకుంటున్నారు. అయినా వాళ్లకే అసలు ఊరు విడిచిపెట్టి బయటకు పోవడం ఇష్టం లేదనీ వాళ్లెప్పుడూ పునరావాసం కోసం అర్జీలు పెట్టుకోలేదనీ ప్రభుత్వం దబాయిస్తుంది. గతంలో హైకోర్టు జారీ చేసిన 9 సూత్రాల ఆదేశంలో ప్రధానంగా బాధ్యత ప్రభుత్వం మీదనే పెట్టిందని ప్రభుత్వం గుర్తించదు. ఇప్పుడు కోర్టులు కూడా అట్లా అనుకోవడంలేదు. పందుల పెంపకం దార్లనే తప్పుపడుతున్నాయి. ఆ వృత్తి మీద బతికే కులాల పట్ల సమాజంలో సాధారణంగా ఉండే తక్కువ భావానికి న్యాయస్థానాలు సహితం అతీతం కాదు.

డిసెంబర్ 12, 1999

# సమాచార స్వేచ్ఛ

సమాచార స్వేచ్ఛకు శాసన రూపం ఇచ్చే బిల్లు ఒకటి త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్నామని మొన్న వాజ్‌పాయి ప్రకటించారు.

ఏదైనా హక్కు కల్పిస్తే సంతోషించడం సహజం. ప్రభుత్వం ఏం చేయబూనుకున్నా సందేహంగా చూడాలన్న సిద్ధాంత దృక్పథం గలవాళ్లు తప్ప వేరే ఎవరైనా సంతోషిస్తారు. అందులో తప్పేమీ లేదు.

కానీ సమాచార స్వేచ్ఛను చట్టబద్ధం చేసే శాసనాలు ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఉన్నాయి. వాటిని చూస్తే రేపు కేంద్రం ప్రవేశపెట్టబోయే బిల్లు ఏ రూపం తీసుకుంటుందా అన్న సందేహం రాకమానదు. ప్రజలకు సమాచారం వీలయినంత స్వేచ్ఛగా, చవకగా పొందే హక్కు కల్పించాలన్న ఆరాటం కన్నా, ఏయే సందర్భాలలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించవచ్చో స్పష్టంగా రాసేయాలన్న ఆరాటమే ఆ చట్టాలలో ఎక్కువ కనిపిస్తుంది.

ఏ హక్కుకయినా పరిమితులుంటాయి. మినహాయింపులుంటాయి. అపరిమితమైన హక్కులేవైనా ఉంటే అవి పూర్తిగా అనిర్దిష్టమైనవి అయి ఉంటాయి. నిర్దిష్ట రూపం గల హక్కులకు ఏవో కొన్ని మినహాయింపులు ఎప్పుడూ ఉంటాయి.

కానీ ఒక హక్కు గురించి మనం చేసే ఆలోచన మినహాయింపులతోనే మొదలుకావడం అనారోగ్య లక్షణం. శాసన రూపం తీసుకునే ఏ హక్కుకయినా ఈ గండం కొంత ఉంటుంది. ప్రజలకు హక్కులిచ్చేస్తే వారు అదేపనిగా దుర్వినియోగం చేసేస్తారన్న ఆందోళన బ్యూరోక్రాట్లలోనూ రాజకీయ నాయకులలోనూ ఉంటుంది. రాజకీయ నాయకులకంటే బ్యూరోక్రాట్లలో ఎక్కువ ఉంటుంది. శాసనాలను వాళ్లిద్దరూ కలిసి రూపొందిస్తారు కాబట్టి ఈ దుర్వినియోగభీతి శాసనాలలో కనిపిస్తుంది.

ఇది పూర్తిగా అవాస్తవికమైన భీతి కాదు. నిజానికి హక్కులకు పరిమితులూ మినహాయింపులూ ఉండడానికి గల ఒక కారణం, అవి దుర్వినియోగం కావచ్చునన్న

సహేతుకమైన భయమే. హక్కుకు పెద్దగా పరిమితులు పెట్టనప్పుడు కూడా వాటిని అమలు చేసే వ్యవస్థలకు దుర్వినియోగాన్ని నివారించడానికి కావలసిన విచక్షణాధికారం ఇవ్వడం జరుగుతుంది.

అయితే ఈ జాగ్రత్త ఏ హక్కుకైనా వర్తించేదే అయినప్పటికీ కొన్ని హక్కుల విషయంలో వ్యక్తమయినంత ఆందోళన వేరే హక్కుల విషయంలో వ్యక్తం కాదు. ఉదాహరణకు పన్నుల వసూలులో మినహాయింపులిచ్చే చట్టాలున్నాయి. అవి విపరీతంగా దుర్వినియోగం అవుతాయని అందరికీ తెలుసును. ఏ విధంగా దుర్వినియోగం చేసి ఎక్కువ ఆదాయం మిగిలించుకోవచ్చునో చెప్పడమే వృత్తిగా గల 'టాక్స్ కన్సల్టంట్స్' చాలామంది ఉన్నారు. మంచి వ్యాపారం చేసుకుంటున్నారు. కానీ ఈ దుర్వినియోగాన్ని గురించి సమాజం పెద్దగా ఆందోళన చెందదు. దుర్వినియోగం గురించి ఎక్కువగా మనం వినేది స్త్రీలపైన కుటుంబం లోపల జరిగే హింసను అరికట్టడానికి ఉద్దేశించిన ఐపిసి సెక్షన్ 498-ఎ, 304-బి ల విషయంలోనూ, దళితులపైన పెత్తందారీ కులాల దాడులను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఎస్సి., ఎస్టి. (అత్యాచారాల నిరోధక) చట్టం విషయంలోను, ఆదివాసీల భూమి హక్కుకు భద్రత కల్పించే '1 ఆఫ్ 70' విషయంలోను. ఈ చట్టాల గురించి 'సభ్య సమాజం'లో చర్చ ఎప్పుడు జరిగినా అది దుర్వినియోగం గురించి మాత్రమే ఉంటుంది. అది ఆ 'సభ్య సమాజం'లో స్త్రీలకు, దళితులకు, ఆదివాసీలకు ఉన్న చోటును సూచిస్తుంది తప్ప దుర్వినియోగాన్ని కాదు. వాటి దుర్వినియోగం అసలే జరగడం లేదని కాదు. కానీ దుర్వినియోగాన్ని గురించి మాత్రమే ఆందోళన చెందే మోతాదులో జరుగుతున్నదనడం వట్టి అబద్ధం.

మామూలుగా ఉండే ఈ వక్రమైన వైఖరి సమాచార హక్కు విషయంలో మరింత తీవ్ర రూపం తీసుకుంటుంది. ఎందుకంటే మనం కోరుకునే సమాచార స్వేచ్ఛను బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు తమ అధికారానికొక ఆటంకంగా చూస్తారు. ఏదైనా ప్రభుత్వ ఆఫీసుకు పోయి ఏదైనా సమాచారం తెలుసుకుందామని ప్రయత్నించిన వారందరికీ ఇది అనుభవం అయ్యే ఉంటుంది. అది మనకు సంబంధించిన సమాచారమే అయి ఉండవచ్చు. మనకు తప్ప వేరే ఎవ్వరికీ దానితో అక్కర లేకపోవచ్చును. అయినప్పటికీ ఆ సమాచారం మనకిస్తే తాము ఏదో కోల్పోయినట్టు ప్రభుత్వ అధికారులు-అధికారులంటే పెద్ద అధికారులే అనుకోనక్కరలేదు. గుమాస్తాలు సహితం-గింజుకుంటారు.

అటువంటప్పుడు ఒక చట్టం చేసేసి సమాచార హక్కు 'ఇచ్చేయడమంటే' వారికి గుండె దడ పుట్టడం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. అందువల్ల ఇప్పటిదాకా

తయారయిన 'సమాచార హక్కు' చట్టాలన్నీ ప్రధానంగా మినహాయింపుల చట్టాలే. ఏయే పరిస్థితులలో ఏయే కోవలకు చెందిన సమాచారం ఇవ్వడానికి నిరాకరించవచ్చునో ఏకరువు పెట్టడం ఈ చట్టాలలోని ప్రధాన విషయం.

ఇది రెండు వైపులా పదునున్న కత్తి. ఈ రోజు సమాచార హక్కంటూ (చట్ట రూపంలో) లేదు కాబట్టి మినహాయింపులూ లేవు. బలం, గుర్తింపు లేని వారికి ఏ సమాచారమూ దొరకదు గానీ వ్యక్తిగత పలుకుబడి ఉన్నా ఉద్యమబలం ఉన్నా దబాయించి చాలా సమాచారం పొందవచ్చు. రేపు చట్టం వస్తే బలంలేని వాళ్లకు చట్టాన్ని చూపించి సమాచారం పొందే అవకాశం కొంత లభిస్తుంది. కానీ కొంత బలం ఉన్నవారికి, సమకూర్చుకున్న వారికి చట్టంలోని మినహాయింపు సెక్షన్లు అడ్డం వస్తాయి.

బలం సమకూర్చుకోగలవాళ్ల సమస్యల కంటే అది సాధ్యం కానివారి సమస్యలే ప్రధానం కాబట్టి ఒక చట్టం ఉండడం మంచిదే. కానీ దాని 'మినహాయింపుల దృష్టి'ని తగ్గించడానికి కృషి చేయాలి. దుర్వినియోగం జరిగినప్పుడు దాని సంగతి చూసుకోవచ్చు. ముందు సద్వినియోగం వీలయినంత ఎక్కువ జరిగేటట్టు చూద్దామన్న వైఖరి పెంపొందించాలి. సమాచార స్వేచ్ఛకు మినహాయింపులు ముప్పై ఏకరవు పెడితే మనం వాటిని ఇరవైకి తగ్గించే ప్రయాసలో కూరుకుపోకుండా, ఒకే ఒక్క వాక్యంతో మినహాయింపును నిర్వచించాలి. అసెంబ్లీలోనూ పార్లమెంటులోనూ ప్రభుత్వం నుండి సమాచారం రాబట్టుకునే స్వేచ్ఛ శాసనసభ్యులకు ఎంత ఉంటుందో అంతటి సమాచార స్వేచ్ఛ ప్రజలకు కూడ అసెంబ్లీ బయట ఉండాలని ఒక వాక్యం రాసుకుంటే సరిపోతుంది. చట్ట సభలలో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చే విషయంలో ఉండే మినహాయింపుల కంటే ఎక్కువ ప్రజలకు బయట ఉండడానికి వీలు లేదు.

కార్గిల్ సరిహద్దు మీద ఎన్ని కంపెనీల సైన్యం ఏయే స్థలాలలో మోహరించి ఉందో చెప్పమని అడిగితే శాసనసభ్యులకు చెప్పరు. మనకు కూడ చెప్పనక్కరలేదని ఇప్పటికొప్పుకుందాం. అటువంటివి మినహాయించి మిగిలినవన్నీ తెలుసుకునే స్వేచ్ఛ మాత్రం ప్రజలకుండాలి.

డిసెంబర్ 26, 1999

# రిజర్వేషన్లు: సుప్రీంకోర్టు రాజకీయాలు

రిజర్వేషన్ల మీద సుప్రీంకోర్టు ఈ మధ్య కాలంలో ఇస్తున్న తీర్పులను వివరంగా పరిశీలించవలసిందేగానీ న్యాయశాస్త్ర సిద్ధాంత చర్చలోకి పోకుండా కూడా అందరికీ సులభంగా అర్థమయ్యే విషయాలు కొన్ని ఉన్నాయి.

సాంఘికంగా, విద్యపరంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4) అంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉందని 16(4) అంటుంది.

ఇది ప్రభుత్వానికి ఉండే అధికారం మాత్రమేనా? లేక ఆ ప్రజల హక్కా? అన్న ప్రశ్న మన న్యాయస్థానాలను చాలా కాలం పట్టి పీడించింది. మొదట్లో ఇది ప్రభుత్వానికి రాజ్యాంగమిచ్చిన అధికారమే తప్ప ఎవరి హక్కూ కాదని సుప్రీంకోర్టు అనింది. అంటే రిజర్వేషన్లు ప్రభుత్వం ఇస్తే వారు తీసుకోవలసిందే తప్ప ఇమ్మని డిమాండ్ చేసే అధికారం ఎవ్వరికీ లేదని అర్థం.

కాని కాలక్రమంలో సుప్రీంకోర్టు ఈ విషయంలో తన వైఖరిని మార్చుకునింది. 1970ల తరువాత, రిజర్వేషన్లు కల్పించడం 'అందరినీ సమానంగా చూడాలి' అన్న సమానతా సూత్రానికి మినహాయింపు కాదనీ, దానిలో భాగమేననీ సుప్రీంకోర్టు గుర్తించింది. 1992లో మండల్ కమిషన్ పైన ఇచ్చిన తీర్పులో 9 మంది జడ్జిల బెంచి ఈ విషయాన్ని బాగా విశదీకరించి చెప్పింది.

అయితే మండల్ కమిషన్ తీర్పు ఇచ్చేనాటికి రిజర్వేషన్లన్నీ బడుగు వర్గాలలోని ధనవంతులు లేక బలవంతులే తీసేసుకుంటున్నారన్న అభిప్రాయం సుప్రీంకోర్టులో బలపడింది. ఇది నిజానికి బయట తరచుగా వినిపించే మాటే. ఏ హక్కునయినా వ్యతిరేకించదలచుకుంటే దానిని నేరుగా వ్యతిరేకించడం ఒక పద్ధతయితే దాని 'దుర్వినియోగాన్ని' గుర్తించి చర్చ పెట్టడం రెండవ పద్ధతి. మొదటిది నైతికంగా

సాధ్యం కానప్పుడు రెండవ మార్గం ఎంచుకుంటుంటారు. దళితులు, ఆదివాసీలు, స్త్రీల హక్కుల విషయంలో వాటి వ్యతిరేకులు ఈ పనే తరచుగా చేస్తుంటారు.

రిజర్వేషన్లు దళితులలో (లేక బిసిలలో, లేక ఆదివాసీలలో, లేక స్త్రీలలో) అప్పటికే డబ్బులున్న వాళ్లకో లేక అప్పటికే అభివృద్ధి చెందిన వారికో అందుతున్నాయనీ కాబట్టి వారిని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలనీ వీరు వాదిస్తుంటారు. ఇక్కడ కనీసం నాలుగు విషయాలు గుర్తుపెట్టుకోవాలి. అభివృద్ధి చెందిన వారే మళ్లీ అభివృద్ధి చెందుతున్నారనేది నిజమేనని రుజువు చేసిన వారెవ్వరూ లేరు. రెండు, అది నిజమేననుకున్నా వారికి రిజర్వేషన్లు లేకుండా చేస్తే అసలు బడుగు ప్రజలలో ఎవ్వరూ రిజర్వేషన్లు అందుకోలేకపోవచ్చు. మూడు, ప్రయోజనం పొందిన వారే మళ్లీ పొందడం వల్ల ఆయా వర్గాలలోని ఇతర ప్రజలు పైకి రాలేకుండా పోయినట్టయితేనే అది నిజమైన సమస్య అవుతుందిగానీ పెత్తందారీ కులాలకు చెందిన వారి కడుపుమంటను వారి సమస్యగా చూపించడంలో అర్థం లేదు. నాలుగు, బలహీన వర్గాలలో కొందరు పైకి రావడం కేవలం వారి వ్యక్తిగత అభివృద్ధేననుకోనక్కర లేదు. అది ఒక మేరకు ఆ వర్గాలలో ఇతరులకు కూడా ప్రయోజనం కల్పిస్తుంది. మొదట పైకి వచ్చిన వారందరూ నిస్వార్థపరులు కాకపోవచ్చును. తమ స్వంతం మాత్రమే చూసుకుంటున్నారన్న అభియోగం వారిపైన తరచుగా వేయడం వింటున్నాం. అయినప్పటికీ ఏదో ఒక మేరకు వారు ఆ వర్గాలకు చెందిన ఇతర ప్రజల అభివృద్ధికి చేయూత నివ్వగలుగుతున్నారు.

ఇవేవీ లెక్కలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు మండల్ కమిషన్ తీర్పులో రిజర్వేషన్ పొందే వర్గాలలో 'క్రీమీలేయర్'ను గుర్తించి దానిని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలని ప్రకటించింది.

ఆ తరువాత రెండు విచిత్రమైన పరిణామాలు జరిగాయి. రిజర్వేషన్లు పొందడం ఒక హక్కు అన్న అభిప్రాయం నుండి సుప్రీంకోర్టు ఒక్కడుగు వెనక్కి వేసి, రిజర్వేషన్లు ఇవ్వడం ప్రభుత్వ అధికారం మాత్రమే తప్ప 'మాకు ఇయ్యవలసిందేనని' ఎవ్వరూ డిమాండ్ చేయడానికి వీలులేదని ఈ సంవత్సరం అయిదుగురు జడ్జీల ధర్మాసనం ప్రకటించింది. కానీ 'క్రీమీలేయర్'ను గుర్తించి తొలగించడం మాత్రం ప్రభుత్వ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని విషయమనీ ఆ పని ప్రభుత్వం తప్పనిసరిగా చేయవలసిందేననీ ఇంకొక కేసులో ఇద్దరు జడ్జీల బెంచి అనింది!

నిజానికి ఈ అభిప్రాయాల తప్పొప్పుల సంగతి అటుంచి ఇవి ప్రభుత్వ పాలనా విధానాలకు సంబంధించిన విషయాలు. న్యాయస్థానాలు విధాన రచన చేయజాలవు.

ప్రభుత్వ విధానరచన రాజ్యాంగం పరిధిలో ఉందా లేదా అని చెప్పడం వరకే న్యాయస్థానాల పని. వేరే సందర్భంలో ప్రజలేవయినా మౌలిక హక్కుల కల్పనకు ఆదేశాలిమ్మని ఆశ్రయిస్తే, అది 'విధాన సంబంధమైన విషయం' అని ఇవే న్యాయస్థానాలు కొట్టిపారేస్తుంటాయి. కానీ రిజర్వేషన్ల పట్ల పెత్తందారీ కులాలలో ఉన్న వ్యతిరేకతను దేశ పాలనా విధానంలో భాగం చేయడానికి మాత్రం తమకున్న అధికారాన్ని వినియోగించుకోవడానికి న్యాయస్థానాలు వెనకాడడం లేదు. ఈ మధ్య కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని దళిత, బిసి కులాలలో 'క్రీమీలేయర్' అనేది లేదని చెపితే అటువంటి ఉపవర్గాన్ని గుర్తించి తీరవలసిందేనని సుప్రీంకోర్టు తీర్పు జారీ చేయడం దీనికొక ఉదాహరణ. పైగా ఈ తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేకమైన వ్యాఖ్య కూడా చేసింది. 'ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు' రిజర్వేషన్లు కల్పించాలని ఆర్టికల్ 16(4) అంటుంది కదా, 'క్రీమీలేయర్' ను రిజర్వేషన్ పరిధి నుండి తొలగించి వేస్తే ఆ వర్గం తగిన ప్రాతినిధ్యం పొందలేక పోవచ్చునేమోనంటే 'అయినా ఫరవాలేదు, తీసేయాల్సిందే' ననింది!

రిజర్వేషన్లు ఒక హక్కుగా అడగడానికి వీలు లేదనీ ఇస్తే తీసుకోవలసిందేననీ అయిదుగురు జడ్జీల బెంచి అనడం కూడా ఈ కోణం నుండి అభిశంసనీయమే. 9 మంది న్యాయమూర్తులు తీర్పు ఇచ్చిన మండల్ కమిషన్ కేసులో రిజర్వేషన్లు ఒక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అభిప్రాయాన్ని అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తుల బెంచి మాత్రమే తిరగదోడగలదు. వేరే విషయంలో కోర్టే ఆ మాట అంటుంది. కానీ ఈ విషయానికొచ్చేసరికి 5 మంది న్యాయమూర్తుల బెంచి ఆ అధికారం తనకుందనుకునింది!

# విద్యార్థుల నిరసనకు ఆహ్వానం

చంద్రబాబు 'విజన్'కు ప్రతిఘటన ఆలస్యంగానయినా మొదలు కావడం హర్షించదగ్గ విషయం. ఉపాధి అవకాశం పెంపుదలకు నిర్దిష్టమైన హామీ లేవీ ఇవ్వకుండా 'జన్మభూమి' ద్వారా 'అభివృద్ధి'లో భాగం కమ్మంటూ విద్యార్థులకిచ్చిన పిలుపు వికటించడం సరయినదే.

చదువుకు దూరంగా ఉంచబడ్డ కొత్తతరం యువకులివాళ చదువుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఇవ్వగల ఉత్పాదన శక్తి గురించి తెలుసుకుంటున్నారు. తమ శక్తి కొంతమేరకయినా పెంచుకుంటున్నారు. శరీరంతో చేసే శ్రమేకాక బుద్ధితో చేసే శ్రమ నైపుణ్యాన్ని కూడా అభివృద్ధి చేసుకుంటున్నారు.

కానీ ఆ తరువాత?

ఆ తరువాత గురించి ఆలోచించకుండా ఉండమంటే ఉండలేరు. చంద్రబాబు చెప్పే 'అభివృద్ధి'లో తమకు తాము చదువుకొని పెంచుకున్న నైపుణ్యానికీ చోటు ఉండాలని కోరుకోకుండా ఉండలేరు. 'అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదు' అనే ఉపదేశాన్ని ఈ ఆరాటానికి జవాబుగా చలామణి చేయాలని చంద్రబాబు, ఆయన అభిమానులు ప్రయత్నం చేస్తున్నారు. ఇది విద్యార్థుల ఆకాంక్షనూ విమర్శనూ వక్రీకరించడం తప్ప వేరే ఏమీ కాదు.

అందరికీ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించాలని ఎవరూ అనరు. కానీ ప్రభుత్వం చేసే విధాన రూపకల్పనలో ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర స్థానం ఉండాలి. ఆ అవకాశాలు ప్రభుత్వ రంగంలో ఉండవచ్చు, ప్రైవేటు రంగంలో ఉండవచ్చు. కానీ విధాన రచన అనేది ఉపాధి అవకాశాల కొరతను ప్రధాన సమస్యగా స్వీకరించి వాటి పెంపుదలను గీటురాయిగా పెట్టుకొని సాగాలి.

చంద్రబాబు 'విజన్' అందుకు భిన్నంగా సాగుతుంది. ఉపాధి అవకాశాల పెంపుదలను కాక అభివృద్ధి పెరుగుదల రేటును గీటురాయిగా పెట్టుకుంటుంది.

10 శాతం పెరుగుదల రేటు కావాలన్నది ఆయిన ప్రధానమైన గీటురాయి. అదే ఎందుకు ప్రమాణం కావాలన్న ప్రశ్నకు 'విజన్'లో జవాబు లేదు. ఇంక ఆ తరువాత విధానరచన యావత్తు ఈ 10 శాతం పెరుగుదలరేటు సాధన చుట్టూ తిరుగుతుంది.

అభివృద్ధి వస్తే ఉపాధి దానంతటదే దక్కుతుందికదా అని అమాయకంగా అడిగేవాళ్లు ఇంకా ఉన్నారేమో తెలీదు . 'విజన్' ఆ మాటే అంటుందిగానీ ప్రపంచ అనుభవం అందుకు భిన్నంగా ఉంది. వేగంగా అభివృద్ధి రేటును పెంచడానికి కావలసింది భారీగా పెట్టుబడి. మానవశ్రమకాదు. అందువల్ల పెరుగుదల రేటే ప్రధాన లక్ష్యమైతే ఉపాధి ఎంత దొరుకుతుందో చెప్పడం కష్టం.

ప్రభుత్వ రంగ సంస్థలలో ఈ తేడా ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కువ లాభాలు చూపించాలి, ఎక్కువ మిగులు చూపించాలి, వేగంగా విస్తరించాలి అనే లక్ష్యాలు ఉద్యోగుల తొలగింపునకు, విదేశీపెట్టుబడి ప్రవేశానికి, ఆధునీకరణ పేరిట అతి తక్కువ కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి చేసే యంత్రాల కొనుగోలుకు దారి తీస్తున్నది. తెలంగాణకు ఒక ప్రధాన ఉపాధి కేంద్రమైన సింగరేణి దీనికొక ఉదాహరణ. ఉద్యోగులను తగ్గించి ఉన్న ఉద్యోగులతోనే ఎక్కువ పని చేయిస్తే లాభాలు పెరుగుతాయి, సంస్థ ఆదాయం పెరుగుదల రేటు మెరుగుపడుతుంది. కొత్తగనుల కోసం భారీ పెట్టుబడిని ఆహ్వానించి ఓపెన్‌కాస్ట్ ప్రారంభిస్తే ఉత్పాదకత ఎక్కువ ఉంటుంది, ఉత్పత్తి పెరుగుదల రేటు మెరుగవుతుంది (ఉద్యోగాలు మాత్రం చాలా కొన్నే వస్తాయి).

కాబట్టి కేవలం అభివృద్ధి రేటు పెరుగుదలనే కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న నమ్మకమేం లేదు. విద్యార్థుల ఆందోళన చాలా సహేతుకమైనదే. నిజానికి ఉపాధి అవకాశాల భవితవ్యం ఏ విధంగా ఉండబోతుందో 'విజన్'ను విశ్లేషించి చెప్పవచ్చు. ఈ రోజు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వంటి సామాన్య విద్యావంతులకు ఏరకమైన ఉపాధి అవకాశాలూ కల్పించే దాఖలాలు ఆ విధానపత్రంలో లేవు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో పెద్ద పెద్ద పట్టాలున్న ఘరానా విద్యావంతులకు విపరీతమైన జీతాలిచ్చే ఘరానా ఉద్యోగాలు లభిస్తాయి. వీరంతా బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ వంటి కులాలకు చెందిన వారయి ఉంటారు. వీరి సంఖ్యా తక్కువే, రేపు ఈ కోవలో రాబోయే ఉద్యోగాలూ తక్కువే.

ఈ కొన్ని ఉద్యోగాలు కాక 'విజన్' హామీ ఇచ్చే ప్రధాన ఉపాధి అవకాశాలు రోడ్లు, రైల్వేలైన్లు, ప్లై ఓవర్లు వంటి నిర్మాణాలలో తట్టపనికి, మట్టిపనికి సంబంధించినవి. అంటే 'పాలమూరు కూలీల' నమూనా రేపు రాబోయే కాలంలో సగటు కార్మికుల నమూనా అవుతుంది. ఇవికాక మరొక ఉపాధిరంగం రెడీమేడ్

దుస్తులు, తోలు  ఉత్పత్తుల రంగం. ఇది అతి తక్కువ సాంకేతిక స్థాయిలో అతి తక్కువ  ఉత్పాదక శక్తితో పనిచేసే రంగం. ఇక్కడ వేతనాలు అతి తక్కువ ఉండడమే కాక కాంట్రాక్ట్ పద్ధతే ప్రధానం.

అంటే ఒక పక్క అతికొద్ది మంది 'అదృష్ట వంతులకు' (వంశపారంపర్యంగా వచ్చే దానిని అదృష్టం అనగలిగితే) ఖరీదైన ఉద్యోగాలు ఇచ్చే అత్యాధునిక సాంకేతిక రంగం, మరొక పక్క మిగిలిన వారికోసం సాంకేతిక అభివృద్ధికి తావులేని అతి తక్కువ వేతనాలు, అభద్రతలు రాజ్యమేలే రంగాన్ని 'విజన్' చూపిస్తుంది. ఈరోజు ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మొదటిది అందదు, రెండవది ఆకర్షణీయంగా కనిపించదు. వాళ్లను చంద్రబాబు ప్రభుత్వం తప్పు పట్టడమెందుకు?

ప్రజలకు ఉపాధి కల్పించాలన్నది అభివృద్ధి విధాన రచనకు కేంద్ర బిందువు కావాలి. భూమి వంటి వనరులున్న వారికి వాటిని సమర్థంగా వాడుకొని ఖర్చులు పోను కొంతయినా మిగిలించుకొని అభివృద్ధి చెందే అవకాశం కల్పించాలి. వనరులు లేనివారికి భద్రతతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. వారి ఉత్పాదన శక్తిని పెంచుతూ ఉత్పత్తి రంగం సాంకేతిక స్థాయిని క్రమంగా పెంచే  ఆధునీకరణ సమాజానికి నష్టం చేయకుండా సాంకేతికంగా అభివృద్ధి చేస్తుంది. ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఉత్పాదన శక్తిని పెంచుతూ వారిని అభివృద్ధి చేస్తూ వారితో పాటు ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేది నిజమైన అభివృద్ధి. ప్రజలను నిరుద్యోగంలో వదిలేసి ఉపాధికి దిక్కులేకుండా చేసి కొద్దిమంది పెత్తందారీ వర్గాల వారి అభివృద్ధిని కేంద్రం చేసుకొని సాగేది అభివృద్ధికాదు. అది విధ్వంసం. దానిపట్ల నిరసన తెలిపే గొంతులు కొంత కాలంగా వినపడుతున్నాయిగానీ సంఘటితంగా వ్యతిరేకించడానికి ఇప్పుడు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ముందుకు రావడం మంచి పరిణామం. బహుశా విద్యార్థులలో ఒక మైనారిటీ మాత్రమే ఈ రోజు ఈ స్పందనలో భాగం అవుతుండవచ్చు. కానీ ఇది ఇక్కడితో ఆగిపోదని ఆశిద్దాం. విద్యార్థులే కాక రైతులు-ముఖ్యంగా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల రైతులు-కార్మికులు కూడా  ముందుకొస్తారని ఆశిద్దాం. ఆ అవసరం మాత్రం చాలా ఉంది.

జనవరి 23, 2000

# మళ్ళీ రైతుల ఆత్మహత్యలు

రైతుల ఆత్మహత్యలు మళ్లీ వార్తలలో తరచుగా కనిపిస్తున్నాయి.

ఇప్పటిదాకా మెదక్ జిల్లాలో ఎక్కువ జరిగినట్టున్నాయి. చనిపోయిన వారి కుటుంబాలతో మాట్లాడితే వర్షాభావం ప్రధాన హేతువుగా కనిపిస్తుంది. కానీ అదే నిజమయితే ఆత్మహత్యల సంఖ్య ఈ మధ్య కాలంలోనే పెరగవలసిన అవసరం లేదు. వర్షాభావం రైతులకు అందులోనూ తెలంగాణ రైతులకు–కొత్తకాదు.

సంప్రదాయక పంటలు వేసిన రోజులలో పోతే వేసిన గింజలు పోతాయి, వస్తే నాలుగు గింజలు మిగులుతాయి అనే పరిస్థితి ఉండేది. ఆ బతుకులో ఆశకు తావు లేదు. ఆత్మహత్యకు హేతువు లేదు.

అయితే అట్లాగే బతికితే ఒక తరానికీ రెండవ తరానికీ తేడా ఏమీ ఉండదు. పెద్దలు చేసిన గొడ్డు చాకిరీయే పిల్లలూ చేస్తారు, వాళ్ల పిల్లలూ చేస్తారు. వాళ్లు బతికినట్టే వీళ్లూ బతుకుతారు.. 'అభివృద్ధి' అనేది తెలియనప్పుడు ఎన్ని తరాలైనా ఇట్లాగే బతికారేమో గానీ ఆ భావనతో పరిచయం ఏర్పడిన తరువాత అదింక సాధ్యం కాదు.

దురదృష్టమేమిటంటే అభివృద్ధి అనేదానిమీద కోరిక పుట్టిన రైతాంగానికి అందుబాట్లో ఉండే అభివృద్ధికి ఒక నిర్దిష్టమైన రూపం ఉంది. దానిని కేవలం 'బూర్జువా అభివృద్ధి' అనలేం. బూర్జువా అభివృద్ధికి సాధారణంగా ఉండే అవలక్షణాలకు మరికొన్ని అవలక్షణాలు వచ్చి చేరగా రూపం తీసుకున్న అభివృద్ధి ఇది. స్థిరమైన సాగునీటి వనరుల లేమి, అదుపులేని ఎరువుల, మందుల ధరలు, భరోసాలేని వాటి నాణ్యత, 'పెద్ద కులాల' వారికి తప్ప ఇతరులకు సులభంగా అప్పుపుట్టని ఆర్థిక జీవితం, ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని కరెంటు, చిన్న రైతులకు పనికి రాకుండా పోతున్న గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ, గిట్టుబాటు ధరకు పంట కొనుక్కోవడానికి ముందుకు రాని ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు మొదలయినవన్నీ

కలిసి తెలంగాణలో చిన్న రైతుల చావుకొచ్చింది. ఆశపడడానికి సహితం ఈ మాత్రం అవకాశంలేని కారణంగా కాబోలు రాయలసీమలో రైతులకు అభివృద్ధీ లేదు, ఆత్మహత్యలూ లేవు.

జొన్నలు తిని జొన్నలు ఏరిగి బతకకుండ పత్తి మీదికి మనసెందుకు పోవాలని వాళ్లనే తిట్టొచ్చు. వాన కురవక పోతే చంద్రబాబు నాయుడేం చేస్తాడని దబాయించవచ్చు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునే పిరికితనానికి సానుభూతి కూడానా అని వెక్కిరించవచ్చు.

ఎన్ని వ్యాఖ్యలయినా చేయొచ్చు గానీ ఒక సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. కొంచెం బాగుపడదామని ఆశపడే రైతు అప్పుల సుడిగుండంలో ఇరుక్కునే 'రిస్క్' తీసుకోక తప్పని పరిస్థితి ఈ రోజు ఉంది. చెప్పుకోవలసిందేమిటంటే ఇది ఎంత మాత్రం 'అనివార్యం' కాదు, 'సహజం' కాదు. ఇదొక అభివృద్ధి నమూనా పర్యవసానం. ఏవో కాల్పనిక ప్రత్యామ్నాయాలను దృష్టిలో పెట్టుకొని ఈ మాటలు అనడం లేదు. ఏ కష్టాలూ ఏ సంక్షోభం లేకుండా ఒకరి అభివృద్ధి అందరి అభివృద్ధిగా సమాజం సమిష్టిగా పురోగమించే చిత్రం కల్పన అనే ప్రస్తుతానికి అనుకుందాం. ఎందుకంటే దానిని నిర్మించే మార్గం తమకు తెలుసుననుకున్న వారు ఈ శతాబ్దంలో ఘోరంగా భంగపడ్డారు. కానీ దాని అర్థం ఆ ఆదర్శం చచ్చిందనీ కాదు, పెట్టుబడిదారీ నమూనాకు అందరూ ఇంక దాసోహమనాలనీ కాదు, దానిని మరింత వికృతంగా తయారు చేసే నైసర్గిక, సాంఘిక, చారిత్రక పరిస్థితులకు దాసోహమనాలని అంతకంటే కాదు.

ఒక ప్రభుత్వమనేది లేకపోతే మనుషులు ఒకరి ప్రాణాలనూ ఆస్తినీ మరొకరు దోచుకుంటారని చెప్పి 'ప్రభుత్వం' ఏర్పడిందని ఒక సిద్ధాంతం ఉంది. అది నిజమోకాదో కానీ ప్రభుత్వం అనేది ఏర్పడిన తరువాత మనుషులు ఒకరి శ్రమనూ ఆత్మగౌరవాన్నీ స్వేచ్ఛనూ మరొకరు దోచుకోకుండా అదుపు చేసే బాధ్యత దానిపైన ఉందన్న అభిప్రాయం ఉనికిలోకి వచ్చింది. ప్రచారమయ్యింది. అనేక రకాల అసమానతలు రాజ్యం ఏలుతున్న మన సామాజిక పరిస్థితులలో ప్రభుత్వం ఈ బరువు స్వీకరించడం చాలా అవసరం.

అదేమీ తనకు లేదని ప్రభుత్వం అనుకోవడం తెలంగాణలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకొక ముఖ్య కారణం అని రెండేళ్లనాడు పెద్ద సంఖ్యలో జరిగిన ఆత్మహత్యలపైన పరిశోధన జరిపిన వారందరూ అన్నారు. పెట్టుబడిదారీ అభివృద్ధిలో రైతులు పాల్గొనాలనీ పాల్గొని తాము బాగుండడమే కాక రాష్ట్ర వ్యవసాయరంగం పెరుగుదల రేటును పెంచాలని కోరుకోవచ్చు. కానీ అందులో పాల్గొనాలంటే రైతులకు

పెట్టుబడి కావాలి. పరిస్థితులు ఎప్పుడూ ఒకలాగ ఉండవు కాబట్టి రైతు ఎక్కడికీ పారిపోడు లెమ్మన్న భరోసాతో అప్పులిచ్చే వాళ్లు కావాలి. ప్రైవేట్ ఫైనాన్షియర్లు ఆ పని చేయరు కాబట్టి ప్రభుత్వ బ్యాంకులు ఆ పాత్ర నిర్వహించాలని 30 ఏళ్లనాడు అనుకున్నాము. అందుకోసమే బ్యాంకులను జాతీయం చేస్తున్నామన్నారు.

పెట్టుబడి పెట్టి పత్తిలాంటి వ్యాపార పంటలు పండిస్తే గిట్టుబాటయ్యే ధర పలకాలి. మార్కెట్ పరిస్థితులు అందుకు అనుకూలంగా లేకపోతే పంట కొనుక్కుని అవసరమైతే నిలవ ఉంచుకొని రైతులను బతికించే కొనుగోలు వ్యవస్థ ఉండాలి. ప్రైవేట్ కొనుగోలుదార్లు ఈ పని చేయరు కాబట్టి ప్రభుత్వ కొనుగోలు సంస్థలు ఈ పాత్ర నిర్వహించాలి.

'అభివృద్ధి'కి తోడ్పడే విలువైన పంటలు వేయాలంటే ఎరువులు, మందులు కావాలి. వాటి ధరలపైన, నాణ్యతపైన నియంత్రణ ఉండాలి. ఈ పని ప్రభుత్వం మాత్రమే చేయగలదు.

ఈ 'విలువైన' పంటలకు సాగునీరు కావాలి. ప్రాజెక్టులయితే రైతులు కట్టుకోలేరు. ప్రభుత్వమే ఆ పని చేయాలి. బావులకయితే అప్పులు, కనీసం పేద రైతులకు చవగ్గా కరెంటు ఇవ్వాలి. కరెంటు తగిన మోతాదులోనూ రీతిలోనూ వచ్చేటట్టు చూడాలి. ఈ బాధ్యతలు ప్రభుత్వం నిర్వర్తిస్తేనే రైతులు 'అభివృద్ధి' బాటలోకి అడుగుపెట్టి చావకుండా బయటపడగలరు.

ఈ బాధ్యతల నుండి ప్రభుత్వం వెనక్కి తగ్గడం ఒక దశాబ్దకాలంగా చూస్తున్నాం. రైతుల ఆత్మహత్యల వెనక ఉన్న అనేక కారణాలలో అతి ముఖ్యమైనది ఇది.

చంద్రబాబు 'విజన్' ఈ వైఖరికి మరింత సంపూర్ణ రూపం ఇస్తుంది. రైతులనూ వ్యవసాయాన్నీ వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే కార్పొరేషన్లతో ముడిపెట్టి ప్రభుత్వం తప్పుకోవడం 'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానం. రైతులకు అప్పులిచ్చేదీ ఉత్పత్తులు కొనుక్కునేదీ ఆర్చేదీ తీర్చేదీ ఈ కార్పొరేషన్లే.

ఇంకా అంత దూరం పోకుండానే ఇన్ని ఆత్మహత్యలు చూస్తున్నాం. 'స్వర్ణాంధ్రప్రదేశ్'లో ఇంకెన్ని చూడనున్నామో!

# టిబెటన్లు ఏమయితే ఎవరికేం పట్టింది?

పదిహేడవ కర్మపా టిబెట్ నుండి పారిపోయి వచ్చాడనగానే మన పాలకులకు నోరు పడిపోయింది. ఇప్పటికీ మాటలు రావడం లేదు. పాకిస్తాన్ మీద రెచ్చిపోయి ప్రకటనలు చేయడానికి మనం సిద్ధమేగానీ చైనాను ఏమైనా అనాలంటే భయం.

కర్మపా అనేది ఒక పదవి. టిబెట్‌లోని బౌద్ధమత శాఖలలో ఒకటయిన కాగ్యుశాఖ అధినేతను కర్మపా అంటారు. ఇప్పుడా పదవికి పోటీ ఉంది. చైనా టిబెట్‌ను ఆక్రమించుకున్న తరువాత టిబెటన్ బౌద్ధులు అత్యధికంగా భారతదేశం వచ్చి ఇక్కడా అక్కడా స్థిరపడడంతో అక్కడి బౌద్ధశాఖల అంతర్గత రాజకీయాలు కూడ ఎగుమతి అయ్యాయి. మతం మత్తుమందు అని నమ్మే చైనా పాలకులు ఈ రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి మాత్రం వెనకాడడం లేదు. చైనా కమ్యూనిస్టు పార్టీ పాలననూ టిబెట్‌పైన చైనా పెత్తనాన్నీ అంగీకరించే వారినే వివిధ బౌద్ధశాఖల నాయకులుగా ఎంపిక కావిస్తున్నారు. 17వ కర్మపాగా చైనా పాలకుల చేత గుర్తింపు పొందిన ఈ పిల్లవాడిని ఆ రాజకీయాలలో భాగంగా చైనాయే ఇక్కడికి పంపిందా లేక అతనే చైనాకు గులాంగా ఉండడం ఇష్టంలేక పారిపోయి వచ్చాడా అనేది ప్రశ్నార్థకంగా ఉందని పత్రికలు రాస్తున్నాయి.

బాధాకరమైన టిబెట్ గాథను ఇటువంటి కుమ్ములాటలకు కుదించి వేసి మాట్లాడుకుంటే మనకు కొంచెం ఆత్మసంతృప్తి. కానీ టిబెటన్లది నిజంగా బాధాకరమైన చరిత్ర. అన్యాయమైన దురాక్రమణకు గురికావడం ఒక ఎత్తయితే దానిని గురించి అమెరికా వంటి ఇతర దురాక్రమణదారులు తప్ప వేరే ఎవ్వరూ మాట్లాడకపోవడం మరీ బాధాకరం.

మామూలుగా ఎవరికైనా అన్యాయం జరిగితే వామపక్ష వాదులు ఖండిస్తారు. చేయగలిగిన మేరకు ఆందోళన చేస్తారు. కానీ టిబెట్‌ను ఆక్రమించుకున్నది మావో నాయకత్వంలోని చైనా కాబట్టి వామపక్ష వాదులు మౌనంగా ఉన్నారు. అమెరికా

నిగాహ్

వంటి దేశాలు చేసే విమర్శకెట్లాగూ విలువలేదు. చైనా ప్రభుత్వం పరిభాషలో టిబెటన్ల స్వాతంత్ర్య కాంక్ష ఫ్యూడల్ సంస్కృతిని కాపాడాలనుకునే బౌద్ధమతాధిపతుల తిరోగామి కాంక్ష అయింది. పాపం టిబెటన్లు- వియత్నాం ప్రజలలాగ, దక్షిణ ఆఫ్రికా ప్రజలలాగ–హీరోలు సహితం కాలేకపోయారు.

ఇది చిన్న విషయం కాదు. ఏదైనా పోరాటం చేసే ప్రజలు ఇతరుల కళ్లలో గుర్తింపు కోరుకుంటారు. అందులోనూ అణచివేతను సిద్ధాంతీకరించడంలోనూ ప్రతిఘటనను రాజకీయ ఆచరణలో భాగం చేయడంలోనూ అగ్రగామిగా నిలబడ్డ వామపక్షవాదుల కళ్లలో గుర్తింపు కోరుకుంటారు. గుర్తింపు లభించిన మేరకు వారికి మనో బలం లభిస్తుంది. టిబెటన్లకు అది దక్కలేదు.

టిబెటన్ సమాజాన్ని అదుపులో పెట్టుకోవాలంటే అక్కడి బౌద్ధమత శాఖలపైన పెత్తనం నెలకొల్పాలని చైనా కమ్యూనిస్టు పార్టీ మొదట్లోనే గ్రహించింది. ఏ ఫ్యూడల్ వ్యవస్థ పునఃస్థాపనకు దలైలామా 'టిబెట్ స్వాతంత్ర్య పోరాటం' అని పేరు పెట్టాడని చైనా నిందించిందో ఆ వ్యవస్థకు గుండెకాయ వంటిదయిన బౌద్ధమత వ్యవస్థను తన అదుపులోకి తీసుకుంది. మతాధిపతుల ఎంపికకు ఆమోద అనామోదాలు తెలియజేయడం ద్వారా 'టిబెట్ చైనాలో విడదీయరాని భాగం' అని అంగీకరించేవారు మాత్రమే బౌద్ధమత వ్యవస్థ అధిపతులుగా ఉండేటట్లు చూసుకుంది. కొందరిని తానే మతాధిపతులుగా నిలబెడుతున్నది. ఇప్పుడు పారిపోయి వచ్చిన 17వ కర్మపా ఏడేళ్ల కింద–కేవలం ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు–కర్మపాగా చైనా ప్రభుత్వం చేత గుర్తింపు పొందినవాడే. బౌద్ధమత శాఖల అధిపతుల ప్రభావం టిబెటన్లపైన బలంగా ఉంటుంది కాబట్టి ఇది ప్రజలను అదుపులో పెట్టుకోవడానికి చైనాకు ఉపయోగపడింది. ఒక దశలో బౌద్ధ ఆరామాలను పెద్దఎత్తున ధ్వంసం చేసిన చైనా ఆ తరువాత 'అది పొరబాటు' అని ఒప్పుకునింది గానీ టిబెట్‌పై తన పట్టు సడలించదు, సడలించే ఉద్దేశ్యం కూడా దానికి ఏ కోశానా లేదు. టిబెటన్లు పెద్దగా పోరాటమూ చేయలేరు. దానికి చాలా కారణాలున్నాయిగానీ బహుశా అన్నిటికంటే ముఖ్యమైన దేమిటంటే వామపక్ష నియంతృత్వాలు దుర్భేద్యమైనవి. వాటి మీద పోరాటం చేయడం చాలా కష్టం.

ఒకప్పుడు చైనా 'కమ్యూనిస్టు చైనా' కాబట్టి టిబెట్‌కు జరిగిన అన్యాయాన్ని గురించి ప్రపంచంలోని అభ్యుదయ వాదులలో అధికభాగం మాట్లాడలేదు. ఇప్పుడు చైనా 'కమ్యూనిస్టు చైనా'గా గుర్తింపు పోగొట్టుకుందిగానీ ఒక కొత్త ప్రతిష్ట సంపాదించుకునింది. గ్లోబలైజేషన్ పంథాలో వేగంగా, విజయవంతంగా పురోగమిస్తున్న దేశాలలో అగ్రగామిగా చైనాకిప్పుడు గుర్తింపు వచ్చింది. ఇప్పుడు చైనాకు వ్యతిరేకంగా అసలే ఎవ్వరూ మాట్లాడరు. 1959లో టిబెటన్ల జాతీయ తిరుగుబాటును చైనా

క్రూరంగా అణచివేసినప్పుడు దలైలామాతో సహా దాదాపు ఒక లక్ష మంది టిబెటన్లు ఇండియాకు పారిపోయి రాగా, అప్పటికింకా పూర్తిగా ఆత్మగౌరవం కోల్పోని భారత ప్రభుత్వం బహిరంగంగానే వారిని ఆహ్వానించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ధరమ్‌శాల టిబెటన్ ప్రవాస ప్రభుత్వానికి కేంద్రం అయింది. అంతకు మించి–తూర్పు పాకిస్తాన్‌లో చేసినట్టు, జాఫ్నాలో కొంతకాలం చేసినట్టు–భారత ప్రభుత్వం ఏమీ చేయకపోయినా ఆనాడు ఆ మాత్రమైనా చేసింది.

ఇప్పుడు ఆపాటి ఆత్మగౌరవం కూడా భారత పాలకులలో లేదు. మేధావులు సహితం 'కర్మపా వ్యవహారం'లో చైనాకు కోపం తెప్పించకుండ వ్యవహరించడమే మంచిదని భారత ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. ఏ విషయంలోనయినా లాభనష్టాలు లెక్కించడం తప్ప వేరే నీతి ఏదీ లేదని నమ్మడం ఈనాటి విజ్ఞత కాబట్టి అందులో ఆశ్చర్యమేమీ లేదు.

17వ కర్మపా చైనా నుండి పారిపోవడం మరొక్కసారి టిబెటన్ల దాస్యం మీద ప్రపంచం దృష్టిని నిలబెట్టిందని అనుకున్నా (సందేహం ఎందుకంటే, అతని మతశాఖ అయిన కాగ్యుశాఖకు అతి పవిత్ర చిహ్నమైన నల్ల టోపీని సిక్కిం నుండి తీసుకొని వెనక్కిపోయి తన పెత్తనాన్ని టిబెట్‌లోని కాగ్యుశాఖపైన పదిలంగా నెలకొల్పుకోవడానికి చైనా ప్రభుత్వమే అతనిని పంపిందన్న వదంతి ఒకటి ఉంది కాబట్టి), దానివల్ల పెద్ద మార్పేమీ రాబోదు. ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ నీతిని నిర్వచించేదీ నిలబెట్టేదీ అమెరికాయే. అమెరికా చైనా పాలకుల 'మానవ హక్కుల అతిక్రమణ' గురించి ఆందోళన చెందుతున్న అభిప్రాయాన్ని ప్రపంచ ప్రజలకు అప్పుడప్పుడు కలిగిస్తుంటుందిగానీ అభిప్రాయం కలిగించడం వినా వేరే ఏమీ చేయకుండ, ఏమీ అనకుండ జాగ్రత్త పడుతుంటుంది. అమెరికా కళ్లకిప్పుడు చైనా ఒక కమ్యూనిస్టు పాలిత దేశమూ కాదు, ఏక పార్టీ నియంతృత్వమూ కాదు, ప్రజలకు కనీస రాజకీయ స్వేచ్ఛ లేని నిరంకుశ రాజ్యమూ కాదు, టిబెట్‌ను వలసగా మార్చుకున్న ప్రాంతీయ అగ్రరాజ్యమూ కాదు. అమెరికా కళ్లలో చైనా ఒక పెద్ద మార్కెట్, అటువంటి చైనాను–ఒక కర్మపా పారిపోయి వచ్చినంత మాత్రాన–అమెరికా ఇబ్బంది పెట్టదు. అమెరికా నీతే ఇప్పుడు అంతర్జాతీయ నీతి కాబట్టి వేరే ఎవ్వరూ కూడా చైనాను ఏమీ అనరు.

17వ కర్మపా ఉదంతం నాలుగు రోజులు వార్తలలో ఉండి ఆ తరువాత అదృశ్యమయిపోతుంది.

# అది నేరమే కాని దానికి శిక్ష లేదు

'గడచిన 10 సంవత్సరాలలో ఇంత సంపూర్ణమైన బంద్ ఎప్పుడూ చూడలేదు' అని చీరాల తాలూకాలో మొన్నటి 15వ తారీకున ఒకరు కాదు దాదాపు ప్రతీ ఒక్కరూ అన్నారు. ఎవరి బలవంతం లేకుండా కేవలం ఆందోళనకారుల పిలుపు విని అన్ని వర్గాల ప్రజలూ స్పందించి సంపూర్ణమైన బంద్ నిర్వహించారు.

బంద్‌కు కారణం 11వ తేదీన చినగంజాంలో జరిగిన కాల్పులు. ఎనిమిది మంది రైతులను తానే అరెస్టు చేసి, దానికి ప్రతిఘటన రాబోతుందని తానే 'ముందు జాగ్రత్త' చర్యగా సాయంకాలం వేళ రైతులు సహజంగా గుమిగూడే మార్కెట్ సెంటర్‌పైన దాడి చేసి, రైతులను లాఠీలతో కొట్టి, పొగబాంబులు వేసి తరిమి, తానే కాలుజారి కిందపడి, మరింత గాభరాకు గురయి రైతులపైన కాల్పులు జరిపి ఇద్దరు రైతులను కాల్చి చంపిన ఇంకొల్లు సిఐ పృథ్వీ నారాయణ ఘనకృత్యానికి నిరసనగా ప్రజా బాహుళ్యం వ్యక్తపరిచిన అపూర్వ స్పందన 15వ తేదీ నాటి బంద్.

దానితో ఏమీ అయిపోకపోవచ్చు. పృథ్వీ నారాయణ అన్న పేరు గల ఈ అధికారి గతంలో గుంటూరు జిల్లాలో ఉద్యోగం చేసినప్పుడు వినుకొండ సమీపంలోని పాత నాగిరెడ్డిపల్లిలో ఇంతే ఆకారణంగా కాల్పులు జరిపి ఇద్దరు రైతుల ప్రాణాలు తీసాడు. అప్పుడేమీ జరగనిది ఇప్పుడేం జరుగుతుంది పృథ్వీ నారాయణకు?

అప్పటి సంగతేమోగానీ ఇప్పటి కాల్పుల వెనుక 'ఆధునీకరణ' కథ కూడా ఉంది. చినగంజాం పరిసరాలలోని రైతులు 'స్నోవైట్ సాల్ట్స్' అనే ఉప్పు తయారు చేసే కంపెనీకి కేంద్ర ప్రభుత్వం తమ సాగుభూములకూ తమ మంచినీటి బోర్‌లకూ సమీపంలో 565 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ధర్నాలు, ఊరేగింపుల నుండి హైకోర్టు కేసుదాకా అన్ని రూపాలలోనూ ఒత్తిడిపెట్టారు. ఇప్పటి దాకా ప్రభుత్వానికి గానీ హైకోర్టుకు గానీ దయ కలగలేదు. అయినా ఆ భూమిని లీజుకు తీసుకున్న ఆనంద్ అని పిలవబడే

ప్రవాసాంధ్రుడు అక్కడికి ఉప్పు నీరు తీసుకురాకుండా అడ్డుపడడానికి రైతులు సంసిద్ధంగా ఉన్నారు. పట్టుదలగా ఉన్నారు.

ఆ భూమిలో అతను గాని ఉప్పునీరు నిలవ ఉంచి ఉప్పు తయారు చేసే ప్రయత్నం చేసినట్టయితే ఆ ఉప్పు భూగర్భ జలాలలోకి ఇంకి సాగునీరు, త్రాగునీరు ఉప్పు నీరుగా మారుతాయనేది రైతుల సహేతుకమైన భయం. నేలపైన నిలవున్న నీరు కలుషితమైతే దానిని మోటార్ల ద్వారా తొలగించి కొత్తనీరు నింపవచ్చు. కానీ భూగర్భ జలాలు కలుషితమైతే బాగు చేసే మార్గమేదీ లేదు. కాలక్రమంలో వర్షపు నీరు నేలలోకి ఇంకి అది నెమ్మదిగా బాగు కావలసిందే.

అందువల్ల కొంత కాలంగా స్నోవైట్ సాల్ట్స్ కంపెనీ చేపట్టే నిర్మాణానికి రైతులు అడ్డం పడుతున్నారు. ఆ కంపెనీ దగ్గర డబ్బులు తక్కువ లేవు కాబట్టి తమ 'హక్కు' కాపాడుకోవడానికి పోలీసుల అండ తెచ్చుకోవడం వారికి కష్టం కాదు. అందులోనూ పృథ్వీ నారాయణ వంటి పోలీస్ అధికారి ఇన్స్పెక్టర్‌గా ఉన్న చోట అది మరింత సులభం.

కొన్నాళ్ల కింద రైతులు అడ్డం పోగా పోలీసులతో ఘర్షణ జరిగింది. రైతులపైన దొమ్మి, అక్రమ చొరబాటు మొదలయిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసారు. అప్పటికప్పుడు అరెస్టు చేయలేదు కానీ ఏ రోజయినా చేయవచ్చుననే వాతావరణం అప్పటినుండి ఉంది.

ఫిబ్రవరి 11వ తేదీన పృథ్వీనారాయణ కేసు ముద్దాయిలలో ముఖ్యులందరినీ అరెస్టు చేసేయాలని నిర్ణయించి ఇంకొల్లు నుండి బయలుదేరాడు. చినగంజాం సమీపంలోని ఊర్ల నుండి 8 మందిని అరెస్టు చేసి, కేసు నమోదయి ఉన్న చినగంజాంలో పెట్టకుండా నేరుగా ఇంకొల్లుకు తీసుకుపోయాడు. వాళ్లనక్కడ పెట్టి పెద్ద పోలీసు బలగంతో చినగంజాంకు వచ్చాడు. తమ వారు అరెస్టయ్యారని తెలిసి చినగంజాం మార్కెట్‌కు వచ్చిన రైతులు ఏం చేయాలా అని చర్చించుకుంటున్న మాట వాస్తవం. అయితే 'పోలీస్ స్టేషన్‌పైన దాడి చేయబోయారు' అన్నది వట్టి కట్టు కథ. అసలు మార్కెట్ ఉన్న స్థలానికీ చినగంజాం పోలీస్ స్టేషన్‌కూ ఎంత లేదన్నా అర్ధకిలోమీటరు దూరం ఉంది. అయినా అరెస్టయిన వాళ్లు చినగంజాంలో లేరు. ఇంకొల్లులో ఉన్నారు.

అరెస్టు గురించి ఏం చేయాలా అని మాట్లాడుకుంటున్న రైతులు ఏమైనా చేసే లోపలే 'ముందు జాగ్రత్త' చర్యగా పృథ్వీ నారాయణ వారిపైన లాఠీచార్జీ జరిపి తరిమాడు. వారు ఇదెక్కడి దౌర్జన్యమంటే బాష్పవాయువు ప్రయోగించి ఆపైన స్వయంగా

కాల్పులు జరిపి, జరిపించి ఇద్దరిని చంపాడు. కాల్పులు జరపమని అతను ఆదేశం ఇవ్వగా, 'వద్దు అనవసరం' అని కొందరు కానిస్టేబుల్స్ వారించారనీ, అయినా వినకుండా కాల్పులు జరపాలని పట్టుబట్టాడనీ పోలీసులే చెప్పుకుంటున్నారు.

హత్య చేసానని అతను ఒప్పుకుంటున్నాడు కాబట్టి చట్టం కళ్లలో ఇంక తేలవలసింది అతను ఆత్మరక్షణలో జరిపాడా లేదా అనేది. అది తేలవలసింది నేరవిచారణ జరిపే న్యాయస్థానంలోనే. పృధ్వీనారాయణపైన హత్యకేసు నమోదు చేసినట్టయితే అది సాధ్యం అవుతుంది. దాని బదులు రాష్ట్ర ప్రభుత్వం చినగంజాం కాల్పులపైన న్యాయవిచారణకు ఆదేశం ఇచ్చింది. ఆ న్యాయవిచారణలో అతను ఆత్మరక్షణలో కాల్పులు జరపలేదనీ అనవసరంగా జరిపాడనీ తేలినట్టయితే అప్పుడతనిపైన హత్య కేసుపెట్టమని న్యాయవిచారణ కమీషన్ ఆదేశిస్తుంది కాబోలు. అయినప్పటికీ అటువంటిదేం జరగకపోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. కేవలం ప్రజల ఆవేశం చల్లారి పోవడం కోసం న్యాయవిచారణ ఆదేశించడం, ఆ తరువాత ఆ విచారణ కమీషన్ నివేదికను హోం శాఖవారి బీరువాలలో భద్రంగా దాచి ఉంచడం మన పాలకులకు బాగా తెలిసిన విద్యే.

అందువల్ల సిఐ పృధ్వీ నారాయణను అరెస్టు చేయించాలని చినగంజాం మండల గ్రామాల రైతులు పట్టుదలగా ఉన్నారు. వారి విజయానికి అందరి చేయూత అవసరం.

మార్చి 5, 2000

# సిపిసి సవరణలు అన్యాయమైనవే కానీ వకీళ్ల నిర్వాకం సంగతేమిటి?

సమాజంలో అనేక సానుభూతి లేని ఉద్యమాలకొక ఉదాహరణగా సిపిసి సవరణలకు వ్యతిరేకంగా లాయర్లు నడుపుతున్న ఆందోళనను చెప్పుకోవచ్చునేమో.

అందులో సానుభూతి చూపించడానికి ఏమీ లేదని కాదు. కానీ చట్టాన్నీ న్యాయస్థానాలనూ న్యాయ నిర్ణయానికి కాక తమ సంపాదనకు సాధనంగా భావించే లాయర్లు, సిపిసి చట్టం సవరణ వల్ల నష్టముందంటే అది వారి సంపాదనకు నష్టమే లెమ్మనుకొని ప్రజాసామాన్యం సానుభూతి చూపించకపోవడం సహజం.

అది సహజమైనా –సహజం కావడం మరీ నష్టకరం అయినప్పటికీ – ఎందుకు సహజమో అర్థం చేసుకోవడానికి సిద్ధపడని లాయర్లు తమ ఉద్యమానికి సానుభూతి ఎందుకు లేదో అర్థం చేసుకోలేరు.

లాయర్లలో చాలా మంది రెండు పూటలా తినడానికి కావలసిన సంపాదన సహితం లేని వారేనంటే అందులో పెద్దగా అతిశయోక్తి లేదు. వారు చట్టానికి గానీ న్యాయవ్యవస్థకు గానీ చేయగల ద్రోహమేమీ లేదు. కానీ చట్టాన్నీ న్యాయవ్యవస్థనూ వాడుకొని లక్షలార్జించిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ప్రజల దృష్టిలో లాయర్లంటే వాళ్లే.

న్యాయవ్యవస్థను నాశనం చేసిందెవరంటే లాయర్లను చెప్పుకోవాలి, జడ్జిలను చెప్పుకోవాలి, తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థను అదేపనిగా వాడుకునే వృత్తి లిటిగెంట్లను చెప్పుకోవాలి. అదే వరుసలో చెప్పుకోవాలి. జడ్జీలలోనూ వృత్తి పట్ల నిర్లక్ష్య వైఖరి ఉంది. న్యాయశాస్త్రాన్ని గురించి అజ్ఞానం ఉంది, ప్రజల జీవితం పట్ల అవగాహనా రాహిత్యం ఉంది. సానుభూతి రాహిత్యముంది. బద్ధకం

ఉంది. అవినీతి సహితం ఉంది. అయినప్పటికీ జడ్జిని న్యాయమూర్తి అని మరీ ఎక్కువగా సిగ్గుపడకుండ పిలవగలుగుతున్నాం. లాయర్‌ను న్యాయవాది అని పిలవడం మాత్రం కష్టమే. ఎవడు ఫీజిస్తే వాడికి వకాల్తా పుచ్చుకొని చట్టం కల్పించే అన్ని అవకాశాలూ వక్రీకరించి వాడుకొని అబద్ధాలూ అభూతకల్పనలూ చెప్పి వాడి ప్రయోజనాలు కాపాడి తమ బ్యాంకుల ఖాతా పెంచుకునే 'అడ్వకేట్' నామధేయమే తెలుగులో కూడా స్థిరపడిపోయింది.

సహజ న్యాయసూత్రాల దృష్ట్యా న్యాయనిర్ణయంలో ఇరు పక్షాలకూ తగిన అవకాశాలు ఇవ్వడం కోసం రూపొందించబడ్డ సివిల్ ప్రొసీజర్ ఈ 'అడ్వకసీ'కి బలి అయింది. సామాజిక జీవితం దీని వల్ల చాలా నష్టపోయిందిగానీ అడ్వకేట్లు చాలా బాగుపడ్డారు. సివిల్ దావా ముగింపుకొచ్చేసరికి గెలిచిన వాడూ ఓడినవాడూ ఇద్దరూ నెత్తిన గుడ్డవేసుకొని ఇంటికి పోతారనీ, ఇద్దరి అడ్వకేట్‌లు మాత్రమే బాగుపడతారనీ అనడం కేవలం జోక్ కాదు.

అందుకే ఇప్పుడు ప్రభుత్వం చాలా తెలివిగా అడ్వకేట్ల బారి నుండి న్యాయవ్యవస్థను కాపాడతానని ముందుకొచ్చి సిపిసికి సవరణలు ప్రతిపాదించి ప్రజామోదం సులభంగా పొందగలిగింది. క్రిమినల్ చట్టాన్ని సవరించే ముందు దొంగలను సంప్రదించడం ఎంత అనవసరమో, సివిల్ చట్టాన్ని సవరించే ముందు అడ్వకేట్లను సంప్రదించడం అంతే అనవసరమన్న పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరించడం సమాజంలో ఎవరికీ కోపం తెప్పించకపోవడం ఆ వృత్తిమీద మంచి కామెంట్‌గా భావించాలి.

అయితే దీనిని ఆసరా చేసుకొని ప్రభుత్వం పేద ప్రజలకు హానికరమైన సవరణలు చేసేసి తప్పించుకోజూడడం నష్టకరం. సివిల్ ప్రొసీజర్ కోడ్ అనేది ఆస్తి తగాదాలకు సంబంధించిన చట్టం కాబట్టి పేదలకు దానితో ఏం ప్రమేయం అనుకోవచ్చు. ఆస్తిపరులలో చిన్న ఆస్తిపరులు కూడా ఉంటారు. కాబట్టి ఇది పేదలకు అసలే సంబంధంలేని విషయం కాదు. అంతే కాక, ప్రజలు అర్థం చేసుకోవలసిన దేమిటంటే సిపిసి ఒక్క క్రిమినల్ కోర్టులలో తప్ప అన్ని కోర్టులలోనూ అనుసరించే విచారణా పద్ధతి. లేబర్ కోర్టులలోనూ, సహకార సంఘాల వ్యవహారాలకు వర్తించే కోఆపరేటివ్ చట్టానికి సంబంధించిన విచారణలలోనూ, ఆదివాసీల భూమి బదలాయింపు ఫిర్యాదులు విచారించే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులలోనూ అన్ని చోట్లా సిపిసియే వర్తిస్తుంది.

కేసులో ప్రతివాది అయిన వ్యక్తి, కేసువేసిన నెల రోజుల లోపల తనకున్న అన్ని ఆధారాలు చూపిస్తూ తన సమాధానం దాఖలు చేసేయాలంటున్నారు. ఆధారాలు

అనేవి ఎక్కువగా డాక్యుమెంట్ల రూపంలో ఉంటాయి. వాటిని సంబంధిత అధికారుల నుండి  ఒక నెల రోజుల లోపల రాబట్టుకోవడం లంచాలు మేపగల వాళ్లకు సాధ్యమవుతుంది గానీ పేదలకు కాదు. ఒకపేద రైతు ఊరి విఎఓ నుండి తనకు ఎంత భూమి ఉందన్న వివరాలు చెప్పే  సర్టిఫికెట్ సహితం నెల రోజుల లోపల తెచ్చుకోవడం కష్టసాధ్యం.

ఒకసారి వేసిన పిటిషన్ లేక సమాధానాన్ని మళ్ళీ సవరించడానికి వీలు లేదన్నది మరొక  ప్రతిపాదిత నియమం. అంటే అన్ని విషయాలూ మొదటిసారే చెప్పేయాలి. అన్ని డాక్యుమెంట్లూ మొదటే వేసేయాలి. అర్జెంట్‌గా కేసువేయవలసి ఉన్నప్పుడు, లేదా అర్జెంటుగా సమాధానం దాఖలు చేయవలసి ఉన్నప్పుడు అన్ని విషయాలూ గ్రహించి చెప్పేయలేకపోవచ్చు. అన్ని డాక్యుమెంట్లూ సేకరించి వేయలేకపోవచ్చు. సవరణలు, మార్పులు చేర్పులు చేసే అవకాశాన్ని లాయర్లు చాలా దుర్వినియోగం చేసిన మాట  వాస్తవమేగానీ దానికిది పరిష్కారం కాదు. పారిశ్రామిక వివాదాల చట్టం కింద లేబర్ కోర్టులో కేసు నడిపే  కార్మికులు, ఏజెన్సీ చట్టాల కింద భూమి వివాదం లేవదీసే ఆదివాసీలు తొలినాడే అన్ని విషయాలూ చెప్పేయాలి తప్ప సవరణలు అనుమతించబడవంటే చాలా నష్టపోతారు. అన్ని డాక్యుమెంట్లూ వెంటనే సంపాదించడం డబ్బున్న వాళ్లకు సాధ్యం కావచ్చుగానీ పేదలకు చాలా కష్టం.

కోర్టులో మెజిస్ట్రేటు  సాక్ష్యాలు నమోదు చేసే బదులు అడ్వకేట్ కమిషనర్లను నియమించి వారిచేత రికార్డు చేయించాలనే ప్రతిపాదన బహుశా అన్నిటికంటె అభ్యంతరకరమైనది. ఏ కేసులోనయినా ఈ వాంగ్మూలాలే ప్రాణం వంటివి. వాటి నమోదు సక్రమంగా జరగకపోతే ఎంత గట్టి కేసున్నా ప్రయోజనం ఉండదు. ఈ కమిషనర్ల పద్ధతి వాంగ్మూలాల నమోదులో అక్రమాలకు అవినీతికి అవకాశం పెరుగుతుంది. మెజిస్ట్రేట్‌లలో అవినీతి లేకపోలేదు గానీ ఇక్కడ లోపాయకారీగా మూడవ కంటికి కనిపించకుండా తప్పులు చేయడం మరింత సులభం అవుతుంది. అడ్వకేట్లు గుంపుకట్టి ఒకరికేసులలో మరొకరు కమిషనర్లుగా వ్యవహరిస్తూ న్యాయాన్ని భ్రష్టుపట్టించగలరు.

మరొకరి హక్కుల వినియోగంపైన 'స్టే' కోరినట్టయితే తగు మాత్రం ధరావతు కట్టాలనే నియమం ప్రత్యక్షంగా పేదలకు చాలా నష్టకరం. ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల తన పొలాలు నాశనం అవుతున్నాయని  కోర్టుకు పోయే రైతులకు, కేసు విచారణ అయిపోయే దాకా ఫ్యాక్టరీని నడపొద్దని 'స్టే' అడగడం తప్ప వేరే గత్యంతరం లేకపోవచ్చు. దానికి సెక్యూరిటీ చెల్లించాలని నియమం పెడితే  కాలుష్యానికి వ్యతిరేకంగా ఎంత మంది రైతులు కోర్టుకు పోతారు?

ఇప్పుడు సిపిసి సవరణల ద్వారా తీసేయాలని చూస్తున్న అవకాశాలన్నీ వకీళ్ల చేతిలో విపరీతంగా దుర్వినియోగానికి గురయినవే. కానీ వాటిని మొత్తంగా తొలగించడం విచారణా పద్ధతిని అన్యాయంగా మారుస్తుంది. ధనవంతులు, బలవంతులు మాత్రమే కోర్టులో నిలబడగలుగుతారు. హైకోర్టులో సహితం సింగిల్ జడ్జి తీర్పుపైన డివిజన్ బెంచ్‌కు  అప్పీల్  చేసుకునే అవకాశం తీసేస్తారంట. డబ్బున్న వాడు సుప్రీంకోర్టుకు పోతాడు. లేనివాడు తన హక్కులు వదులుకొని ఇంటికి పోవలసిందే.

అయితే ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఆందోళనచేస్తున్న అడ్వకేట్లు, పరిస్థితి ఇక్కడిదాకా రావడానికి తమ బాధ్యత చాలా ఉందని గుర్తించాలి. న్యాయవాద వృత్తిని ఏ కొంచెం బాధ్యతగా నిర్వర్తించి ఉన్నా ఇక్కడి దాకా వచ్చేది కాదు. ఇప్పుడు ఈ సవరణలకు వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో బాటు ఆత్మపరిశీలన కూడా చేసుకుని చట్టాన్ని సంకుచిత ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా తమ వృత్తి నిర్వహించాలన్న సంకల్పం  కూడా ప్రకటిస్తారా?

మార్చి 19, 2000

# ఈ ప్రాకులాట అవమానకరం

బిల్ క్లింటన్ రాక సందర్భంగా ఢిల్లీ నుండి వెలువడే ఒక ఆంగ్ల దినపత్రిక ఒక కార్టూన్ ప్రచురించింది. అమెరికా అధ్యక్షుడి భారత పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చూడడానికి ముందుగా అతని అధికార బృందం వచ్చి ఉన్నారు. అతను ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను దర్శించబోతున్నాడు కాబట్టి ఆ అధికార్లు ఆగ్రా నగర పాలక అధికార్లను వెంటబెట్టుకొని తాజ్‌మహల్ దగ్గరకు పోయారు. వివిధ కోణాల నుండి ఆ కట్టడాన్ని చూసినాక, 'తాజ్‌ను కొంచెం పక్కకు జరపడం సాధ్యమవుతుందా? బిల్‌కు ఇంకొంచెం బాగా కనపడుతుంది' అని వాళ్లు తమతో ఉన్న ఆగ్రా నగరపాలక అధికార్లను అడుగుతారు.

'ఇది మరీ అతిశయోక్తి' అనగల పరిస్థితి సహితం ఇప్పుడు లేదు. క్లింటన్‌ను ఎట్లాగయినా హైదరాబాద్ రప్పించి హైటెక్ సిటీ చూపించి భారతదేశంలో 'ఐటి'కి హైదరాబాదే కేంద్రమని రుజువు చేసుకోవడానికి చంద్రబాబు పడ్డ ప్రయాస తెలిసిందే. అది 'ఐటీ' పెట్టుబడులను రాష్ట్రంలోకి రప్పించుకోవడానికి మాత్రమే కాదు. తన పాలనా దక్షతను, ఆధునీకరణ కాముకతను అమెరికా అధ్యక్షుడి ముందు ప్రదర్శించుకోవడానికి కూడ. ఆ పాలనా దక్షతలో భాగంగానే క్లింటన్ నగరంలో ఉండబోయే ఒకటి రెండు గంటల మహాభాగ్యానికి నగరంలో బిక్షగాళ్లెవరూ ఆ రోజు కనిపించడానికి వీలులేదని కూడా రాష్ట్ర ప్రభుత్వం తాఖీదు జారీ చేసింది. ఆ ఒక్క పూట భిక్ష అడిగే హక్కు చంద్రబాబుకు మాత్రమే ఉండాలని జోక్ చేసుకున్నప్పటికీ, ఒక విదేశీ పాలకుడిని మురిపించడానికి ఈ స్థాయికి మన పాలకులు దిగజారడం నిజంగా చాలా బాధాకరం.

వ్యక్తిగా క్లింటన్ ఏ మాత్రం గౌరవించదగ్గవాడన్నది అప్రస్తుతమే కావచ్చు. అమెరికా దేశస్థులకు మన ముఖ్యమంత్రి పాట్లు చెప్తే నవ్వుతారేమో కూడ. అయితే అమెరికా ప్రభుత్వాన్ని మెప్పించడం ఇవ్వాళ అంతర్జాతీయ రాజకీయాల ఏకైక మూల సూత్రం అయింది. రెండవ ప్రపంచ యుద్ధమప్పటి నుండి అమెరికా ఒక ముఖ్య అగ్రరాజ్యంగా

ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు నిర్ణయించడంలో అమెరికాకు ఈ యాభై ఏళ్లగా ప్రముఖ పాత్ర ఉంది.

ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాక విభిన్న దేశాల మధ్య తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం కోసం ఏర్పాటు చేసుకున్న ఐక్యరాజ్య సమితి మీద కూడ అమెరికా ప్రభావం బలంగా ఉండింది. సామరస్య పరిష్కారం సాధ్యం కానప్పుడు ప్రపంచ దేశాల ప్రతినిధిగా బలప్రయోగానికి పాల్పడే అధికారం అంతర్జాతీయ చట్టంలో (దానినెవరూ గౌరవించారని కాదు గానీ) ఐక్యరాజ్యసమితికి మాత్రమే ఉంది కాబట్టి ఈ ప్రభావం వల్ల అధికారికంగా బలప్రయోగానికి పాల్పడడం అమెరికాకు సులభం అయింది.

అయినప్పటికీ 1990ల దాకా అమెరికాది ఏకచత్రాధిపత్యం కాదు. అంతర్జాతీయ రాజకీయాలలో సోవియట్ రష్యా పోటీ ఉండింది. బహుశా అంతకంటె ముఖ్యంగా, ప్రపంచంలో ఏ దేశానికైనా ఎప్పుడయినా వర్తించే ఏకైక ఆర్థిక అభివృద్ధి నమూనా ఒకటి ఉందన్న అభిప్రాయం ఆనాడు లేదు. స్థానిక ప్రత్యేకతలుంటాయనీ అభివృద్ధికి భిన్న నమూనాలుంటాయనీ నమ్మిన రోజులవి.

1990ల తరువాత ఈ రెండు విషయాలలోనూ మార్పు వచ్చింది. అమెరికా పాలకుల మెప్పు కోసం ప్రాకులాడడం మరింతగా పెరిగింది. సోవియట్ రష్యా కూలిపోవడంతో ఐక్యరాజ్యసమితిలోనే కాక బయటకూడ అమెరికాకు తిరుగులేకుండా పోయింది. క్రమంగా ఐక్యరాజ్యసమితి అమెరికా చేతిలోని పనిముట్టుగా మారింది. ప్రపంచ దేశాల మధ్య తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే వేదికగాను, అది సాధ్యం కాని పక్షంలో శాంతికి విఘాతం కలిగిస్తున్న దేశం మీద ప్రపంచ దేశాల తరఫున పరిమితంగా బలప్రయోగం చేసే ఉమ్మడి వ్యవస్థగానూ ఉద్దేశించిన ఐక్యరాజ్య సమితి అమెరికా పనిముట్టుగా మారి, ఆ దేశ పాలకులు తమ స్వంత నిర్ణయం ప్రకారం చేసే దాడులకు 'అంతర్జాతీయ చట్టం' అనే ముసుగు తగిలించుకునే అవకాశం లభించింది.

ఆర్థిక అభివృద్ధి విషయంలో 'అమెరికా నమూనా' తప్ప వేరే ఏదీ లేదనే అభిప్రాయం కూడ బలపడింది. సోషలిజం సంగతి దేవుడెరుగు సంక్షేమ పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా ఆచరణ సాధ్యంకాని తెలివితక్కువ ఆదర్శం అన్న అభిప్రాయం ఒక వైపు, పెట్టుబడిదారీ అభివృద్ధిలో సహితం స్థానిక అవసరాలు, ప్రయోజనాలు అనే వాటికి చోటేమీ ఉండదని మరొకవైపు అభిప్రాయాలు బలపడ్డాయి. అందుకే మన ముఖ్యమంత్రి ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన 'విజన్ 2020' పత్రాన్ని ఆస్ట్రేలియాకు చెందిన కన్సల్టెంట్‌తో రాయించగలిగాడు. ఈ రెండు కారణాల వల్ల ఇవాళ అమెరికా పాలకుల మెప్పుకోసం ప్రాకులాట పెరిగింది. దానివల్ల రాగల భౌతిక ప్రయోజనాల కోసమే

కాక, 'మేము కూడ ఈనాటి జ్ఞానం ఎరిగిన వారమే'నని ఆ జ్ఞానానికి ఆద్యులయిన అమెరికా వారికి చూపించుకోవాలనే చాపల్యం వల్ల కూడ మూడవ ప్రపంచ దేశాల ప్రముఖులు వారి వెంటపడుతున్నారు. ఈ పోటీలో మన ముఖ్యమంత్రి మిగిలిన వారికంటె ఒక్కడుగు ముందుండడం మనం సిగ్గుపడవలసిన విషయం అనడంలో సందేహమక్కరలేదు.

నిగాహ్

ఏప్రిల్ 2, 2000

# కుంటిసాకుల నీడన చట్టం

పేదవాళ్లెక్కడయినా తమకు హక్కులు లేని జాగాలో ఇళ్లు వేసుకుంటే అధికార యంత్రాంగం యావత్తు వాళ్లమీద ఎట్లా విరుచుకు పడుతుందో మనకు తెలుసును. మనమేమయినా అడిగితే 'పేదవాళ్లయితే కావచ్చునుగానీ దురాక్రమణ చేసినప్పుడు చట్టం చూస్తూ ఊరుకోజాలదు కదా' అని మన నోళ్లు మూసేస్తారు.

డబ్బు, అధికారం ఉన్నవాళ్ళు చేసే దురాక్రమణ విషయానికొచ్చేసరికి ఈ చట్టం కళ్లు చాలా సులభంగా మూసుకుపోగలవనడానికి చాలా ఉదాహరణలున్నాయి. అప్పుడు మనమేమయినా అడిగితే 'మా అంతట మేము ఏమీ చేయలేము. కోర్టు నుండి మీరేదయినా ఆర్డర్ తీసుకురండి' అంటారు అధికారులు. పేదల మీదికి సులభంగా బయలుదేరి వచ్చే బుల్‌డోజర్లకు వీళ్ల విషయంలో స్టార్టింగ్ ట్రబుల్ వచ్చేస్తుంది.

నిగాహ్

సికిందారాబాద్‌లోని లాలాగుడ ప్రాంతంలోని ఎర్రకుంట దురాక్రమణ దీనికొక ఉదాహరణ. పేరు సూచించినట్టు అదొక చెరువు. రజకులు కొన్ని తరాలుగా బట్టలుతుక్కుంటున్న చెరువు. కావడానికి ప్రైవేట్ భూమే కాని హుడా వారు దానిని 'వాటర్ బాడీ'గా గుర్తించారు. నగరంలో ఎవరూ తమ స్వంత భూములలో సహితం హుడా అనుమతించిన భూమి వినియోగానికి భిన్నంగా కట్టడాలుగానీ నిర్మాణాలుగానీ చేపట్టడానికి వీలులేదు. అందుకు భిన్నంగా ఆ భూమిని వినియోగించడానికి వీలులేదు.

అయినప్పటికీ ఎర్రకుంటలో కొంత కాలంగా ప్లాట్ల అమ్మకం, కొనుగోళ్లు సాగుతున్నాయి. ఈ పని చేస్తున్నది కనీసం ఆ భూమి స్వంతదారులు కారు. వారే చేసినా, వాటర్ బాడీగా గుర్తించిన భూమిలో ప్లాట్లు వేయడం, అమ్మడం చట్టవిరుద్ధం అయిఉండేదే. కానీ ఆ పని చేస్తున్నది స్వంతదారులు కారు. శేషుబాబు, అప్పారావు అనే ఇద్దరు పెద్దమనుషులు. పక్కనున్న సర్వే నెంబరు 160లో తనకున్న హక్కులు చూపించి ఎర్రకుంటలో శేషుబాబు ప్లాట్లు అమ్ముతున్నాడు. ఎంత లేదన్నా 10 లేక

15 ఏళ్లనుండి ఇది జరుగుతున్నది. మొదట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే కాలక్రమంలో అతని ఆశే అతనిని రజకులకు శత్రువును చేసింది. వాళ్లను ఖాళీచేయించేస్తే ఎర్రకుంట మొత్తం అమ్ముకోవచ్చుననుకున్నాడు.

వాళ్లు బట్టలుతుక్కోవడానికి నీళ్లు నిలవ ఉండే చోట చెరువు కట్టను అతను దౌర్జన్యంగా తెగగొట్టాడు. రజకులు గొడవ పెట్టుకొని మళ్లీ తాత్కాలికంగా కట్టపోసుకున్నారు. అయితే మళ్లీ మళ్లీ వాళ్లు అప్రమత్తంగా లేని టైం చూసి శేషుబాబు మనుషులు  చెరువు కట్ట తెగగొట్టేస్తున్నారు. ఈ ఘర్షణ నాలుగేళ్లుగా సాగుతున్నది.

ఇంతవరకు ఒకెత్తయితే హైదరాబాద్ నగర పాలకుల వైఖరి ఇంకొక ఎత్తు. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్,  హుడా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ అనే నలుగురు అధికారులు ఇక్కడ అధికారం చలాయిస్తారు. శేషుబాబు, అతని వెన్నంటి వచ్చిన అప్పారావుల అక్రమాలు వాళ్లకు తెలుసును. అతనిని దురాక్రమణదారునిగా స్పష్టంగా పేర్కొంటూ, అతనిని నిరోధించడానికి చర్య తీసుకోవలసిందిగా కోరుతూ 'హుడా' ఉపాధ్యక్షులు జిల్లా కలెక్టర్‌కు రాసి మూడేళ్లయింది. జిల్లా కలెక్టర్ ఒకసారి కాదు. మూడుసార్లు అదే విషయం చెప్తూ (అంతకంటే ఘాటయిన పదజాలం ఉపయోగిస్తూ) ఆ దురాక్రమణదారులపైన చర్య తీసుకొమ్మని నగర మునిసిపల్ కమిషనర్‌కు ఉత్తరాలు రాసారు. నగర మునిసిపల్ కమిషనర్ ఇప్పటి దాకా కాయితం మీద ఏమీ పెట్టలేదుగానీ, రజక సంఘాల వాళ్లు పోయి అడిగితే దురాక్రమణలు నిరోధించమని హుడా ఉపాధ్యక్షులు కలెక్టర్‌కు, పోలీసులకు రాస్తే పని జరిగిపోతుందని అంటాడు. ఆ సంగతి హుడా ఉపాధ్యక్షుల వారితో అంటే ఆమె 'ఈ పని ఎంత మాత్రం మాదికాదు. ఏ భూమి వినియోగం ఏమిటని నిర్ణయించడం వరకే మేము చేసేది. దానిని అమలు చేయించవలసింది నగర మునిసిపల్ కమిషనర్, పోలీసులు అంటారు. కావాలంటే ఈ సంగతి రాసి సంతకం చేస్తానంటారు. పోలీసులనడిగితే తక్కిన ముగ్గురు అధికార్లలో ఎవరయినా ఒకరు తమకు ఆదేశాలిస్తే తాము వెంటనే కదులుతామంటారు.

అధికారుల ఈ విన్యాసాన్ని అడ్డం పెట్టుకొని శేషుబాబు, అప్పారావు తమ అమ్మకం కొనసాగిస్తున్నారు. వారికి రజకులు తప్ప వేరే ఎవ్వరూ అడ్డం లేరు. కాబట్టి వారు రజకుల మీద పడ్డారు. రజకుల కోసం ప్రభుత్వం వేసిన బోర్‌ను పగలగొట్టారు. తట్టలు తట్టలు 'మట్టి తీసుకొచ్చి  చెరువు శికంలో పోసి అక్కడ నీళ్లు నిలవకుండ చేసారు. నిలిచిన కొద్ది నీళ్లలో నూనె కలిపి బట్టలు ఉతకడానికి పనికి రాకుండ చేసారు.  ఎప్పటికప్పుడు చెరువు కట్ట మళ్లీ మళ్లీ తెగగొడుతూ ఆ కొద్ది నీటిని బయటకు పంపించేస్తున్నారు.

'చట్టం' అనేది ఈ దౌర్జన్యాన్ని మౌనంగా చూస్తున్నది. అది పాపం దానంతటది ఏ దౌర్జన్యాన్నీ ఆపలేదు. దానిని అమలు చేసే అధికార్ల చొరవ ఎంత ఉంటే దాని ప్రభావం అంత ఉంటుంది. వారిలో నిజాయితీ ఎంత ఉంటే దాని పనితనం అంత ఉంటుంది. హైదరాబాద్‌లో గుడిసెవాసులను నిర్దాక్షిణ్యంగా తొలగించి రోడ్ల వెడల్పు కోసము, ఇతర రకాల 'అభివృద్ధి' కోసము జాగా కల్పించే చట్టం, తెలుగుదేశం పార్టీకి సన్నిహితులయిన ఈ భూమి దురాక్రమణదారుల కాడికొచ్చేసరికి కుంటిసాకులు వెతుకుతూ నీళ్లు నమిలే స్థితికి నెట్టబడిందంటే నగర అధికారుల చేవ అంతటిది.

కనీసం నాలుగేళ్లుగా ఈ విషయమై ఆందోళన చేస్తున్న రజకులు వారిని దారికి తేగలరా?

నిగాహ్

ఏప్రిల్ 16, 2000

# చర్చలు ఎవరికి అవసరం?

నక్సలైట్లకూ ప్రభుత్వానికీ మధ్య చర్చలు జరగడాన్ని గురించి ప్రకటనల పరంపర ఈ మధ్య పత్రికలలో చూస్తున్నాం.

ఈ ప్రకటనల భావాన్ని గ్రహించగల వాళ్లందరికీ ఒక విషయం స్పష్టంగా అర్థమయ్యే ఉంటుంది. అదేమిటంటే చర్చలు జరపాలన్న ఆసక్తి ఇద్దరిలోనూ లేదని.

ఉద్యమాలకూ ప్రభుత్వానికీ మధ్య చర్చలు ఒక రాజకీయ ప్రక్రియ. రాజకీయంగా అవసరం అనుకున్నప్పుడే ఉద్యమకారులయినా ప్రభుత్వమయినా చర్చలు జరపాలన్న ఆసక్తి చూపిస్తారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో నక్సలైట్ పార్టీలు గానీ ప్రభుత్వంగానీ అటువంటి అవసరం ఉందనుకోవడం లేదు. తమ వ్యూహం బాగానే పురోగమిస్తున్నట్లు ఇరు పక్షాలూ భావిస్తున్నాయి. ఎదుటి వారితో చర్చలు జరిపి ఏదో ఒకటి ఇవ్వడం ద్వారా మరొకటి పుచ్చుకోవడం తమ మనుగడకు గానీ తమ వ్యూహాత్మక పురోగమనానికి గానీ అవసరం అని ఇరుపక్షాలూ–లేక కనీసం ఒక పక్షం–అనుకున్నప్పుడే చర్చలనేవి జరుగుతాయి.

నిగాహ్

వాళ్లకు కోరిక లేకపోతే వేరే ఎవరికీ ఉండదా అంటే వేరే కారణాల వల్ల ఉంటుంది. వేరే కారణాలవల్ల అన్నలూ ప్రభుత్వమూ చర్చలు జరుపుకుంటే బాగుండునని కోరుకునే వాళ్లు తెలంగాణలో చాలామందే ఉన్నారు. వాళ్లందరూ నక్సలైట్లకు రాజకీయంగా వ్యతిరేకులు కాదు. కానీ వారి కళ్లతోనే ప్రపంచాన్ని చూడాలంటే వీరు ఒప్పుకోకపోవచ్చును. సాధారణ జీవితం వీలయిన మేరకు నిరాటంకంగా సాగితే బాగుండునని కోరుకోవచ్చును. దానినుండి పుట్టే ఆలోచనలు ఎం.ఎల్ పార్టీలు తమ రాజకీయ అవసరాలుగా భావించే వాటినే ప్రమాణంగా ఎంచుకోకపోవచ్చును.

మారుమూల గ్రామాలకు బస్సులు నిరాటంకంగా నడవాలనీ గ్రామాలలో అమర్చిన మార్ ఫోన్లు అక్కరకు రావాలనీ గ్రామీణ బ్యాంకులూ సహకార సంఘాలూ జిల్లా కేంద్రానికి తరలి పోకూడదనీ కోరుకోనివారెవ్వరూ ఉండరు. అట్లాగే, రాత్రయినా

పగలయినా నిర్భయంగా గ్రామాలకు రాకపోకలు సాగించే స్థితి ఉండాలనీ కేవలం అనుమానం మీద పోలీసులు ప్రజలను హింసించే దుస్థితి పోవాలనీ సమస్యల మీద ఏ ఆందోళన చేసినా రాడికల్ ముద్ర వేసి లోపలేస్తారన్న భయం తొలగిపోవాలనీ కోరుకోనివారూ ఉండరు. దానికి ఇది కారణమనీ దీనికి అది కారణమనీ ఇరు వర్గాలూ ప్రత్యర్థులమీద నెపం పెడుతుంటారు. కాబట్టి వీళ్ళూ వాళ్లూ మాట్లాడుకొని పరిస్థితి తీవ్రత కొంచెం తగ్గితే బాగుండుననుకునే జనం చాలామంది ఉన్నారు.

ప్రాణభయంతో పోలిస్తే పై సమస్యలు చిన్నవే. 'ఎన్‌కౌంటర్'లలో ఈ మధ్య కాలంలో సాయుధ దళ సభ్యులు చనిపోవడం కొంత పెరిగింది గానీ, మొత్తం మీద గ్రామాలలో ఉంటూ రైతు జీవితమో రైతు కూలీ జీవితమో జీవిస్తూ నక్సలైట్ రాజకీయాలలో (నిర్మాణంలో గానీ సానుభూతి పరులుగా గానీ) ఉన్నవాళ్లే 'ఎన్‌కౌంటర్'లలో ఎక్కువ చనిపోతుంటారు. పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే ఘటనలకు నక్సలైట్లు పాల్పడినప్పుడు వారు మరింత రెచ్చిపోయి (రెచ్చిపోవడం వారొక్కరికే ఉన్న హక్కు కాబట్టి) గ్రామస్థాయి కమిటీ సభ్యులను, షెల్టర్లు ఇచ్చే వారిని చంపుతుంటారు. ముఖ్యంగా నక్సలైట్లు పోలీసులనుగానీ పోలీసుల రక్షణలో ఉన్న రాజకీయ నాయకులను గానీ చంపినప్పుడు ఈ రకమైన ప్రతీకార చర్యలు భయానకమైన మోతాదులో జరుగుతుంటాయి. దీనికి పోలీసులను జవాబడిగితే 'విధి నిర్వహణలో సహచరుడు చనిపోతే కొంచెం రెచ్చిపోవడం సహజం' అనే పద్ధతిలో జవాబు వినవస్తుంది. పోనీ, మీరు పోలీసులనూ రాజకీయ నాయకులనూ చంపి నిర్బంధమెందుకు పెంచుకుంటారని వారి నడిగితే ఎన్‌కౌంటర్లను కారణంగా వారు చూపిస్తారు.

కాబట్టి వారూ వీరూ చర్చలు జరిపితే బతుకు భయం కొంత తగ్గుతుందేమో కదా అని తెలంగాణ గ్రామీణులు భావించడంలో తప్పులేదు. దీనికి వారు నక్సలైట్ ఉద్యమానికి శత్రువులు కానక్కరలేదు. 'ఇద్దరినీ ఒకే గాటన కట్టడం' అనే అవసరానికి పాల్పడిన వారు కానవసరమూ లేదు. నిజానికి నాకు తెలిసి తెలుగు దినపత్రికల సంపాదకులు తప్ప వేరే ఎవ్వరూ ప్రభుత్వాన్నీ నక్సలైట్లనూ ఒకే గాటన కట్టరు. ఒకే గాటన కట్టకుండా కూడా ఇరు పక్షాలూ తమ చర్యలకు చెప్పే కారణాలలోని సారూప్యత గుర్తించడం సాధ్యమే. వీరూ వారూ కూర్చొని మాట్లాడుకుంటే బతుకు కొంతయినా సాఫీగా నడుస్తుందికదా అనుకోవడం సహజమే.

బహుశా ఈ చర్చలంటూ జరిగితే అందరికంటే ఎక్కువ సంతోషించేది ఇద్దరి మధ్య నిజంగానే నలిగే 'మాజీలు'. మధ్యతరగతికి చెందిన మాజీ నక్సలైట్లు బాగానే ఉన్నారుగానీ, పేద, దళిత మాజీ నక్సలైట్లది మాత్రం కత్తి అంచుమీద బతుకే.

అన్నలతో వారు ఇంకా సంబంధాలు కొనసాగిస్తున్నారని పోలీసులు అనుమానించకమానరు. పోలీసులకు సహకరిస్తున్నారేమోనని అన్నలకు అనుమానం రాకమానదు. చర్చలద్వారా వీరూ వారూ కొన్ని ప్రమాణాలేవైనా ఏర్పరచుకుంటే కొంత మేరకైనా వీరు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలుగుతారు.

అందువల్ల నక్సలైట్లూ ప్రభుత్వమూ చర్చలు జరుపుకుంటే బాగుండునని సహేతుకంగానే కోరుకునే వారు తెలంగాణలో చాలా మందే ఉన్నారు. కానీ ఈ విషయం ప్రభుత్వం గానీ అన్నలు గానీ గుర్తిస్తున్నారా?

రాజకీయంగా మాత్రమే చూస్తే వాళ్లు చర్చించుకునేదేముంటుంది? అనే ప్రశ్న సహజంగా తోస్తుంది. నిజమే, ఏం మాట్లాడుకుంటారు? నాగా ఉద్యమకారులు చర్చలకు సిద్ధపడ్డారంటే, పూర్తి స్వాతంత్ర్యం కాకపోతే స్వయం ప్రతిపత్తి ఇస్తారా అని చర్చిస్తారనుకోవచ్చు. కాశ్మీరీ మిలిటెంట్లు రేపెప్పుడయినా చర్చలకు సిద్ధపడ్డారంటే ప్లెబిసైట్ పెట్టకపోయినా 1953 పరిస్థితి వెనక్కి తెస్తారా అని అడగడానికి సిద్ధపడ్డారనుకోవచ్చు. దీనిని దిగజారుడుగా అనుకునే వాళ్లు అనుకోవచ్చు. ఏమైనా ఆ ఆలోచన అసాధ్యం కాదు, అసంభవం కాదు. కానీ నక్సలైట్లు ఏం చర్చిస్తారు? సగం విప్లవం ఇమ్మని అడగలేరు కదా? ప్రభుత్వం విషయం కూడ అంతే. నాగా పోరాటకారులతోనూ బోడో పోరాట కారులతోనూ చర్చలు పెట్టుకుంటున్నారంటే దానికొక రాజకీయ సందర్భం ఉంది. వారి పోరాట ప్రాంతాలు దేశ సరిహద్దు ప్రాంతాలు. అక్కడ అలజడులు సాగడం సరిహద్దు భద్రతకు భంగకరం కాగలదు. పాకిస్తాన్ బూచి అంటే మన పాలకులకు నిజంగానే భయం. కాని దేశం నడిబొడ్డున ఏం జరిగితే ఏం?

అయినప్పటికీ కమ్యూనిస్టు విప్లవకారులూ ప్రభుత్వాలూ చర్చలు జరుపుకునే సందర్భాలు ఉండగలవు. ప్రభుత్వ నిర్బంధం, విప్లవకారుల ప్రతిఘటన విపరీత స్థాయికి పెరిగి ఒకరి జవసత్వాలనొకరు క్షీణింపజేసే స్థితి వచ్చినప్పుడు తమ రాజకీయ మనుగడ కోసం ఇద్దరూ చర్చలకు సిద్ధపడగలరు. కానీ మన రాష్ట్రంలో అంతటి పరిస్థితేమీ రాలేదు. కాబట్టి చర్చలు జరుపుకోవలసిన 'అవసరం' వారికి లేదు.

అయినప్పటికీ 'మేము చర్చలకు రాము' అనే మొండి వైఖరికి ప్రజామోదం లేదు కాబట్టి ఇద్దరూ అసాధ్యమైన షరతులు పెట్టి సవాళ్లు విసురుకుంటున్నారు. 'హింస విడనాడి చర్చలకు రమ్మనండి' అని ప్రభుత్వం అంటుంటే 'ఎన్‌కౌంటర్లు ఆపి మాపైన నిషేధం ఎత్తేయండి అప్పుడు వస్తాం' అని అన్నలంటున్నారు. నిజంగానే వాళ్లు హింస విడనాడినా, ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు నిలిపేసి నిషేధం ఎత్తేసినా ఇంక ఇద్దరూ ఏం మాట్లాడుకుంటారు? చంద్రబాబు ఆయురారోగ్యాల గురించా? నిజంగా (వీరయినా

నిగాహ్

వారయినా) తమకే అవసరం అనుకుంటే ఏ షరతులూ లేకుండా చర్చలకొచ్చి కూర్చుంటారని ఎవరికి తెలియదు? తమ అవసరం కాదు కాబట్టి, తెలంగాణ జన జీవితంలో కొంత ప్రశాంతి ఉంటే బాగుండుననుకునే వెర్రిబాగుల వారి కోరిక కాబట్టి, మాట్లాడే వాడికి వినేవాడు ఇంత చులకనయి పోతే ఎట్లా?

నిగాహ్

ఏప్రిల్ 30, 2000

# ఈ కరువు మళ్లీ వస్తుంది జాగ్రత్త

కరువు ఈ సంవత్సరం పెద్ద ఎత్తునే వచ్చింది. గుజరాత్, రాజస్థాన్ దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి.

కరువొచ్చినప్పుడు చర్చ తక్షణ ఉపశమన చర్యల మీదనే ఎక్కువ ఉంటున్నదనీ, దీర్ఘకాలిక నివారణోపాయాల మీద ప్రధానంగా దృష్టి పెట్టడం అవసరమనీ అంటుంటారు. ఈ మాటలు కూడా కరువొచ్చినప్పుడే అంటుంటారు.

అయినప్పటికీ అది కరెక్టే.

అయితే ఇంకొంచెం దూరం పోయి ఆలోచించవలసిన అవసరం కూడ ఉంది. కరువు నివారణకు దీర్ఘకాల నివారణోపాయాలు రూపొందించడానికి కావలసిన చోటు ప్రభుత్వ సామాజిక ఆర్థిక విధానాలలో ఉందా? ఒక సంవత్సరం కాకపోతే ఒక సంవత్సరం కరువొస్తుంటుంది కాబట్టి అటువంటి నివారణోపాయాలకు చోటు ఉండాలనేది సామాజిక ఆర్థిక విధానాల పునాది లక్షణాలలో ఒకటయి ఉండాలికదా?

ప్రకృతి వనరులను, మానవ పరిశ్రమ వాటిలో తీసుకురాగల అభివృద్ధిని ఏ విధంగా చూస్తామనేది ఇక్కడ కీలకమైన ప్రశ్న. మనుషుల జీవనానికి ఆధారంగా చూస్తామా, లేక సామాజిక సంపద పెరుగుదలకొక సాధనంగా చూస్తామా? సామాజిక సంపద పెరుగుదలకు సాధనంగా చూసినప్పుడే అవి ఏదో ఒక రోజు అందరికీ జీవనాధారం కూడ కల్పించగలుగుతాయనీ, కేవలం జీవనాధారంగా చూస్తే అభివృద్ధికి నోచుకోక పెరుగుతున్న జనాభాకు జీవనాధారంగా కూడ సరిపోవనీ వాదించడం ప్రస్తుత అధికార అభివృద్ధి సిద్ధాంతం.

ఇది నిజమేనా? ప్రకృతిని పెట్టుబడికి వనరుగా మాత్రమే చూస్తూ 'ఏదో ఒకరోజు అభివృద్ధే అందరికీ తిండి పెడుతుంది' అని హామీ ఇవ్వడంలో గల సౌలభ్యం ఏమిటంటే ఆ 'ఏదో ఒక రోజు' ఎప్పుడొస్తుందో చెప్పలేక పోవడం, చెప్పవలసిన అవసరం

లేకపోవడం. ఇప్పుడు మనవాళ్ల నమూనాలో ఆ అభివృద్ధికి పెట్టుబడి ప్రధానంగా బయటి నుండి రావాలి. దానికి మూల్యం సంపద తరలింపు రూపంలో చెల్లించుకోవాలి. ఆ బయటి పెట్టుబడిని ఆకర్షించడం కోసం ఇక్కడి పట్టణ ప్రాంత ఎగువ, మధ్య తరగతులలో విలాసవంతమైన జీవనశైలిని ప్రోత్సహించాలి. సంపద పెంచుకునే అవకాశాన్నీ దాచుకునే అవకాశాన్నీ భద్రంగా కాపాడాలి. దీనికి కూడ ప్రకృతి చాలా మూల్యం చెల్లించాలి. 'అనివార్య'మైన ఈ అవాంతరాలను దాటి అభివృద్ధి ఏ రోజు పేదలకందరికీ అందుతుంది? కొందరికి కొంచెం కొంచెం అందుతూ ఉంటుంది. అది ఈ 'అభివృద్ధి'కి రాజకీయ పునాది ఒక మేరకు కల్పించడానికి మాత్రం పనికొస్తుంది.

ప్రకృతి వనరులను మనుషుల జీవనాధారంగా చూసినట్టయితే అభివృద్ధి శూన్యమైన జీవితమే శరణ్యమా? పెరుగుతున్న జనాభా వల్ల జీవన ప్రమాణాలు పడిపోకుండా కాపాడుకోవడంతోనే సరిపోతుందా? మనుషుల జీవనాన్నీ జీవితాన్నీ ప్రమాణంగా పెట్టుకొని అందరినీ ఒకే తాటి మీద ('ఏదో ఒక రోజు' కాకుండా) ముందుకు నడిపించే విధానరచనకోసం 20వ శతాబ్దంలో కమ్యూనిస్టు పాలకులు చేసిన ప్రయత్నాలు విఫలమైన మాట సత్యమే. కాని దానికి ఏ ప్రత్యామ్నాయమూ లేదా? కమ్యూనిస్టులు ఊహించుకునే భూలోక స్వర్గం కాకపోయినా కనీసం మానవీయత లక్షణంగా గల జీవితం సాధ్యం కాదా?

21వ శతాబ్దం ఈ అన్వేషణలో ఉంటుందని నేను అనుకుంటున్నాను. కానీ దానికి 'స్టార్టింగ్ ట్రబుల్' చాలా ఉంది. కమ్యూనిస్టు ప్రయోగం విఫలమయిందని కమ్యూనిస్టులు ఒప్పుకోరు. ఒక ప్రత్యామ్నాయం సాధ్యం కాగలదేమో చూద్దామని ఇతరులనుకోరు.

కరువు మాటకొస్తే, ఇప్పుడున్న అధికార దృక్పథం దీనికి ఏం జవాబు చెప్పగలదు? చిన్న కమతాల సేద్యానికి సెలవు చెప్పి, పెద్ద పెద్ద క్షేత్రాలలో పెట్టుబడిదారీ సేద్యాన్ని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దిగుమతులనూ ప్రోత్సహించాలనేది చంద్రబాబు నుండి అటల్ బిహారీ దాకా ఇప్పుడు మన పాలకులందరి విధానం. ఈ విధానానికి కరువు నివారణతో ప్రత్యక్ష సంబంధమేమీ లేదు. కరువులు ఎప్పటిలాగే వస్తూనే ఉండవచ్చు. భూమిని పెట్టుబడికి వనరులుగా చూడడం పెరిగే కొద్దీ భూవనరుల విధ్వంసం, భూగర్భజలాల దుర్వినియోగం ఎక్కువ జరిగి కరువులు మరింత ఎక్కువగా కూడా రావచ్చు.

అప్పుడు గ్రామీణ పేదలకు ఇప్పుడున్న పాటి భద్రత  కూడ-రెండెకరాల రాళ్లకూ పుట్టలకూ తిండిలేని రెండెడ్లకూ యజమాని కావడం అనే భద్రత-ఉండదేమో. తిండికోసం, నీళ్లకోసం వలసలు ఇప్పటిలాగే జరుగుతుంటాయి. అయితే సంవత్సరానికో రెండేళ్లకో వర్షాలు పడి నేల పచ్చబడితే తిరిగి రావడానికి ఆ రెండెకరాల భూమి కూడ ఉండదు. కాబట్టి ఏ పట్టణంలోనో రిక్షా తొక్కుకుంటూనో మూటలు మోస్తూనో జేబులు కత్తిరిస్తూనో ఉండిపోవచ్చు.

ఒక్క తేడా ఉంటుంది.  ఇప్పుడింకా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనేదొకటి ఉంది. దాని గిడ్డంగులలో ధాన్యం ఉంది. కరువు కాలంలో ఆ ధాన్యం  కరువు ప్రాంతాలకు పోగలదు, గంజి కేంద్రాలనైనా నడిపించగలదు. ఈ గిడ్డంగులను ఒక్కసారిగా మూసేసే ఆలోచనేదీ ఇప్పట్లో లేకపోవచ్చును గానీ నేల పచ్చగా ఉన్న రోజులలో ఈ గిడ్డంగులూ వాటి కోసం మిల్లులపైన విధించే లెవీలూ స్వేచ్ఛా విపణికి ఆటంకం కలిగించే అసమర్థపు పాత విధానాల అవశేషాలుగా కనిపిస్తాయి కాబట్టి 'ప్రభుత్వం ఇచ్చేది కాదు, అవకాశాలు కల్పించేది మాత్రమే'ననే ప్రస్తుత పాలక సిద్ధాంతం రాబోయే రోజులలో ఈ వ్యవస్థను క్రమంగా నయినా క్షీణింపజేయదన్న నమ్మకమేమైనా ఉందా?

పదేళ్ల తరువాత మళ్లీ ఇటువంటి కరువొస్తే ఆ చిత్రం ఇంకా భయంకరంగా ఉంటుందేమో? ఈ ఊహ అయినా మన పాలకుల కళ్లు, మేధావుల కళ్లు కొంచెం తెరిపిస్తుందా? లేకపోతే డాలర్లు విరజిమ్మే వెలుగుల చీకట్లు ఈ చిత్రాన్ని కూడ కమ్మేస్తాయా?

# 114వ మేడే వచ్చింది, పోయింది

**మే** నెలకున్న ప్రత్యేకత కారణంగానే కావచ్చు, కేంద్ర కార్మిక సంఘాలన్నీ మే 11న భారత్ బంద్‌కు (లేకపోతే సార్వత్రిక సమ్మెకు మాత్రమేనా?) పిలుపునిచ్చాయి.

కార్మికులకు కొన్ని హక్కులు కల్పించే చట్టాలను సమూలంగా సవరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా ఈ పిలుపు ఇవ్వడం జరిగింది.

సంఘాలు పెట్టుకోవడం, నడుపుకోవడం, సమ్మెవంటి ఆందోళనలు చేయడం మరింత కష్టతరం చేసే సవరణలతో కూడిన ట్రేడ్ యూనియన్ (సవరణ) బిల్లు ఇప్పటికే పార్లమెంటు ముందు ఉంది. కార్మిక సంఘాన్ని రిజిస్టర్ చేయగానే స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి 'సంఘం పెట్టించినావంట ఏంది బే-రద్దు చేయ్' అని ఎస్ఐగారి చేతనే తిట్టించి (అవసరమయితే తన్నించి) ఆ ప్రయత్నానికి బంద్ పెట్టించే రోజులొచ్చి చాలాకాలం అయింది. ఎక్కడో బీహార్‌లోనో తూర్పు యుపిలోనో కాదు. హైదరాబాద్ పారిశ్రామిక వాడలలోనే ఉంది. కాబట్టి ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సవరిస్తేనేం సవరించకపోతేనేం అనుకునే వారుంటారు. అనుకోవడం సహజం. అయితే హక్కులను వెనక్కి తీసుకుపోయే చట్ట సవరణలన్నీ అప్పటికే వ్యవస్థితమయిపోయిన చట్టవిరుద్ధమైన దాదాగిరీని చట్టబద్ధం చేసే ప్రయత్నాలేననేది ఒక సాధారణ సూత్రం.

పారిశ్రామిక వివాదాల చట్టం స్థానంలో పారిశ్రామిక సంబంధాల చట్టం అనే దానినొకటి ప్రవేశపెట్టి యాజమాన్యంతో కార్మికులకొచ్చే వివాదాలను ఫ్యాక్టరీ గోడలు దాటి పోకుండ లోపలే పరిష్కారం చేసుకోవాలని శాసనం చేసే ప్రయత్నమొకటి ఒక దశాబ్దం కింద మొదలయింది. 'వివాదం' స్థానంలో 'సంబంధం' అనే మాటను ప్రవేశపెట్టడం కేవలం మాటలగారడీతో వివాదాలే లేవని చూపించే ప్రయత్నం మాత్రమే కాదు. వివాదాలు అని పేరు పెడితే న్యాయబద్ధమైన పరిష్కారం ఆశించడం సహజం. సంబంధాలు అని సున్నితంగా పిలుచుకుంటే మీరు మీరు కూర్చొని

మాట్లాడుకొని ఇచ్చి పుచ్చుకునే వైఖరితో పరిష్కారం చేసుకోరాదా అనేదే ఉచితమైన సలహాగా తోస్తుంది.

ఇప్పటికింకా స్పష్టంగా బయటికి రాని ప్రయత్నమొకటి జరుగుతున్నట్టు కూడ వింటున్నాం. కాంట్రాక్ట్ కార్మిక (రద్దు, నియంత్రణ) చట్టాన్ని కుదించి 'రద్దు' అనే అంశాన్ని తీసేసి 'నియంత్రణ'ను మాత్రం మిగిలించే శాసన సవరణకోసం ప్రయత్నాలు జరుగుతున్నాయంట. అంటే ప్రభుత్వానికిక కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని రద్దు చేసే అధికారం ఉండదు. నియంత్రించే అధికారం మాత్రమే ఉంటుంది. చంద్రబాబు 'విజన్' చదివిన వారికిది ఆశ్చర్యం కలిగించదు. ఆ 'దృక్కోణం' ప్రకారం కార్మికులు నూటికి తొంభై శాతం కాంట్రాక్ట్ కార్మికులుగానే స్వర్ణాంధ్ర ప్రదేశ్‌లోకి అడుగుపెట్టబోతారు. అటువంటప్పుడు వోట్ల కోసం కక్కుర్తి పడి జనాకర్షక చర్యలకు బాధ్యతారహితంగా పాల్పడే రాజకీయ పార్టీల చేతిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని రద్దు చేసే అధికారం కొనసాగించడం అభివృద్ధికి చాలా హానికరం కాగలదుకదా! నిజానికి నిరంతరం జరిగే పనిలో కాంట్రాక్టు కార్మికులను నియమించడాన్ని చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు 1960లలో తీర్పులివ్వడం మొదలు పెట్టిన తరువాతే ఆ అధికారాన్ని న్యాయస్థానాల చేతినుండి తీసేసి ప్రభుత్వాల చేతిలో పెడుతూ కాంట్రాక్ట్ కార్మికుల (రద్దు, నియంత్రణ) చట్టాన్ని 1970లో పార్లమెంటు చేసింది. అయితే ఆ అధికారాన్ని ప్రభుత్వాలు ఉపయోగించింది తక్కువే. ఇప్పుడయితే సుప్రీంకోర్టు ఆ రకమైన తీర్పులిచ్చే 'మూడ్'లో లేదు కాబట్టి ప్రభుత్వానికిచ్చిన అధికారాన్ని వెనక్కి తీసేసుకొని హాయిగా ఊపిరి పీల్చుకొనవచ్చునని దేశ పురోభివృద్ధిని కాపుగాసే సంరక్షకులు భావిస్తున్నట్టున్నారు.

ఇదంతా ఒకెత్తయితే, చట్ట సవరణల ద్వారా ఈ హక్కులను బలహీన పరుస్తున్నారని ఆందోళన చేయడం న్యాయమేగానీ అదే సమయంలో ఈ హక్కులు కార్మికులలో 10 శాతానికయినా ఏనాడయినా అందుబాట్లో ఉన్నాయా అన్న ప్రశ్న వేసుకోవాలి. కార్మిక చట్టాలలో నిర్వచనాలు ఎంత విశాలంగా ఉన్నా, యంత్రాలతో ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలలో తగు మాత్రం సంఖ్యలో పనిచేస్తున్న కార్మికులనే అవి నమూనాగా ఎంచుకుంటాయి. పెద్ద పట్టణాలలో ని కార్మికులలో ఈ కోవకు చెందిన వారు సుమారుగానే ఉంటారు.

కానీ ఒక సగటు ఊరిని తీసుకొని అక్కడొక మేడే సభ జరుగుతున్నట్టు ఊహించుకోండి. ఆ సభకు వచ్చేది కార్మికులే అనుకున్నా వాళ్లలో ఎంతమంది కార్మిక చట్టాల రక్షణ పొంది ఉంటారు? వారిలో రిక్షాకార్మికులు, ఆటోడ్రైవర్లు ఉంటారు.

నిగాహ్

దుకాణాలలో పనిచేసే సిబ్బంది, మోటార్ మెకానిక్‌లు, కిరాయి జీపుల డ్రైవర్లు, హెయిర్ కటింగ్ సెలూన్లు, టైలరింగ్ షాపుల సిబ్బంది ఉంటారు. స్త్రీలెవరయినా ఉంటే బీడీ కార్మికులయి ఉంటారు. ఒక ఆర్‌టిసి డ్రైవరో కండక్టరో (ఆ ఊరిలో డిపో ఉంటే) వస్తే ఒక సంఘటిత రంగ కార్మికుడు వచ్చినట్టు, లేకపోతే లేదు. ఈ కార్మికులనుద్దేశించి వక్తలు కార్మిక చట్టాల గురించి, వాటిని తొలగించడానికి జరుగుతున్న కుట్రల గురించి ఆవేశంగా ఉపన్యాసాలు ఇస్తుంటారు. ఇవ్వొద్దని కాదుగానీ అక్కడ గుమిగూడిన కార్మికులు చట్టాల రక్షణ ఏ మేరకు పొందగలిగారని ఆలోచించకపోతే ఎట్లా? 'అసంఘటిత' కార్మికులుగా పిలవబడే వారికి ఏ చట్టాలూ వర్తించవని కాదు. కొన్ని చట్టాలు కొంత మేరకు వర్తిస్తాయిగానీ వాటిని వారి అందుబాట్లోకి తీసుకురావడానికి అడ్డమున్న సాంఘిక ఆర్థిక అవాంతరాలను అధిగమించడానికి కార్మిక సంఘాలు చేసిన ప్రయత్నం స్వల్పం.

రాబోయే రోజులలో కార్మికులందరినీ అసంఘటిత రంగంలోకి నెట్టివేయడానికి మన విధాన రచయితలు చేస్తున్న ప్రయత్నం ఒకందుకు మంచిదేమో. అప్పుడయినా కార్మిక ఉద్యమం అసంఘటిత రంగాన్ని పట్టించుకోక తప్పదు!

మే 28, 2000

# ప్రాజెక్టుల ఎండమావులు

ఎండమావి ఎడారుల లక్షణం. ఎడారులుగా మారుతున్న ప్రాంతాలలో రైతులు ప్రాజెక్టుల ఎండమావులు చూస్తున్నారు. నీటి లేమి, పశుగ్రాసం కొరత, వలసలు, ఎండిపోయిన బావులు... అన్నీ మాట్లాడిన తరువాత మరి మీకు నీళ్లెక్కడినుండి రావాలనుకుంటున్నారని దేవరకొండ గ్రామాలలో రైతులనడిగితే క్లుప్తంగా 'జూరాల' అంటారు. ఒక్కక్షణం మనం నల్గొండలో ఉన్నామా మహబూబ్‌నగర్‌లో ఉన్నామా – దేవరకొండలో ఉన్నామా గద్వాలలో ఉన్నామా – అని మనకే సందేహమొస్తుంది. 'మీరెక్కడ? జూరాల ఎక్కడ?' ఆశ్చర్యంగా అడుగుతాము. అప్పుడు తాము దర్శిస్తున్న ఎండమావిని పూర్తిగా వివరిస్తారు. జూరాల నుండి ఎత్తిపోతల ద్వారా మలచింతల ప్రాజెక్టు తయారయితే ఆ నీళ్లతో డిండి ప్రాజెక్టు రిజర్వాయర్ నిండితే అప్పుడు డిండి ఆయకట్టులో తమ ఊరుంటే పొలాలకు నేరుగా నీళ్లొస్తాయి, లేకపోతే నిండా నీళ్లున్న డిండి వల్ల తమ బావులలో ఊట పెరిగి ఆ రకంగా పొలాలకు నీళ్లొస్తాయనేది వారి కల. అది విని మనం నవ్వుతాం. మనతో పాటు వాళ్లు కూడా నవ్వుతారు. కానీ స్వప్నాన్ని చూడడం మానుకోరు. 'ఇంక పోయి వస్తాం' అని మనం లేస్తుంటే ఎట్లయినా మలచింతల అయ్యేటట్లు చూడండి సార్ అంటారు.

దేవరకొండ నుండి నారాయణఖేడ్‌కు పోతాం. వాళ్ల ఎండమావి ఒకరకంగా ఎండమావి కాదు. సింగూరు 'బాక్‌వాటర్స్' నిజంగానే కళ్లకు కనిపిస్తుంటాయి. కళ్లను ఊరిస్తుంటాయి. నల్లటి రేగడినేలలకు ఆ నీళ్లు పారిస్తే హాయిగా బతకొచ్చుకదా అని నారాయణఖేడ్ రైతులు అనుకోవడం సహజం. కానీ సింగూరు హైదరాబాద్‌కు రిజర్వ్ చేయబడింది. అది ఉన్న ప్రాంతంలో రైతులకు నీళ్లివ్వడానికి దానికి స్వేచ్ఛలేదు. దాని 'బాక్‌వాటర్స్' ఒడ్డున ఉన్న గ్రామాలలో నివసించే రైతులు సాహసం చేసి ఎవ్వరి అనుమతి లేకుండా మోటార్లు పెట్టి నీళ్లు పారించుకుంటున్నారు గానీ మొత్తంగా ఆ తాలూకాకు సింగూరు నీళ్లు రావాలంటే ఎత్తిపోతల పథకం మంజూరు కావాలి. 'హైదరాబాద్‌కు కృష్ణ నుండి నీళ్లు తీసుకోరాదా? మంజీర నీళ్లే కావాల్నా?'

అని వారంటారు. కానీ వారి కోరిక తీరదు. ఇప్పుడు నలభై ఐదులక్షలున్న ఈ నగరం జనాభా ఎనభై లక్షలయినప్పుడు ఎంత నీళ్లు కావలసి ఉంటుందని నగర పాలకులు ఇప్పటినుండే అంచనాలు వేస్తున్నారు. చేజిక్కించుకున్న సింగూరు నీటిని విడిచి పెట్టరు. అందువల్ల నారాయణ్‌ఖేడ్ వాసులకు సింగూరు బాక్ వాటర్స్ అనునిత్యం కనిపించే ఎండమావే.

బాంబుల నిలయమైన పత్తికొండ ప్రజలు ఇంకా సుదూర స్వప్నం దర్శిస్తున్నారు. గ్రామాలలో ఆరు నెలలుగా పనులు లేవు కాబట్టి బళ్లారికీ తుంగభద్ర ఆయకట్టు గ్రామాలకూ వలస పోయినవారు పోయినారు. పోని వారు, తిరిగొచ్చిన వారు ఊరి రచ్చబండ దగ్గర కూర్చొని గప్పాలు కొడుతున్నారు. 'మీకు నీళ్లెక్కడి నుండి రావాలి' అంటే 'శ్రీశైలం' అని రాయలసీమ వాసులకు సహజమైన బింకంతో జవాబు చెప్తారు. అక్కడికి శ్రీశైలం రెండు వందల యాభైకిలోమీటర్ల దూరం ఉంటుందేమో. కానీ శ్రీశైలాన్ని పత్తికొండకు రప్పించే స్వప్నమొకటి ఉంది. దానిపేరు హంద్రీ–నీవా సుజల స్రవంతి. కర్నూలు జిల్లా పడమటి భాగాన ఉన్న హంద్రీ నదిని చిత్తూరు జిల్లాలో ఉన్న నీవా అనే నదితో కలపడానికి కర్నూలు జిల్లా తూర్పు చివరనున్న శ్రీశైలం ప్రాజెక్టు 'బాక్‌వాటర్స్' నీటిని ఎత్తిపోతల ద్వారా కోడుమూరు, పత్తికొండ తాలూకాలలోకి తీసుకుపోయి హంద్రీపైన కట్టిన రిజర్వాయర్లలో కలిపి అనంతపురం జిల్లాకు నీళ్లిచ్చుకుంటూ చిత్తూరుకు తీసుకుపోయే పథకం అది.

నవ్వుకుంటున్నారా?

'కేంద్ర ప్రణాళికా సంఘం ఆమోదంగానీ నీటికేటాయింపుగానీ నిధుల మంజూరుగానీ లేని ఈ ప్రాజెక్టుకు పునాది రాళ్లు మాత్రం మూడు సార్లు పడ్డాయి. ఆ రాళ్లను చూస్తూ ఎప్పటికయినా నీళ్లొస్తాయని కలలు కంటూ ప్రస్తుత కరువు కాలాన్ని వెళ్లదీస్తున్నారు పత్తికొండ రైతులు.

మన రాష్ట్రంలో 'గట్టు' అనే ఊరొకటి ఉందని తెలియని వారెవరూ లేరిప్పుడు. అది గద్వాల తాలూకాలోని మండలకేంద్రమనీ ఆ మండలం ఎడారిగా మారిపోతున్నదనీ ఇప్పుడందరికీ తెలుసును. అతిశయోక్తులు మన జర్నలిజంలో భాగమయి పోయినాయి కాబట్టి ఇది పూర్తిగా సత్యం కాకపోవచ్చునని చాలామంది అనుకోవచ్చును. కానీ ఈ వార్తలలో మాత్రం ఆవగింజంత కూడ అతిశయోక్తి లేదు.

అయితే ఆ ఎడారివాసులు కూడ ఒక ఎండమావిని దర్శిస్తున్నారు. సంవత్సరంలో ఎంత లేదన్న ఏడు నెలలు కర్నాటకలో ఎక్కడ పని దొరికితే అక్కడికి పోయి పని చేసుకొచ్చే ఈ ఊర్ల జనం మిగిలిన కాలంలో జూరాల 'బాక్ వాటర్స్' గురించి ఒక

కల తయారు చేసుకున్నారు. దాని పేరు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం. ఆ పథకం నిజమైతే మహబూబ్‌నగర్ జిల్లాలోని అతి నికృష్టమైన ప్రాంతంలోని 2 లక్షల 25 వేల ఎకరాలకు నీళ్లొస్తాయనీ అది సస్య శ్యామలమవుతుందని వారి స్వప్నం సారాంశం. ఇది నలభై ఏళ్లుగా కంటున్న కల. అది తీరుతుందని ఆశిస్తూ అంతవరకు కర్నాటకకు పోతూ వస్తూ బతుకు వెళ్లదీస్తుంటారు గట్టు మండల వాసులు.

పైన వివరించిన స్వప్నాలలో మూడు కృష్ణానది పరీవాహక ప్రాంతానికీ ఒకటి గోదావరి పరీవాహక ప్రాంతానికీ చెందినవి. చివరిగా, గోదావరి పరీవాహక ప్రాంతానికి చెందిన ఇంకొక ఎండమావి గురించి చెప్పుకొని ముగిద్దాం. ఈ ఎండమావిని గోదావరి పరీవాహక ప్రాంతవాసులే కాక కృష్ణా పరీవాహక ప్రాంతవాసులు కూడ దర్శించడం విశేషం. దీనిపేరు శ్రీరాంసాగర్ వరదనీటి కాలవ. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ ప్రాంతానికీ వరంగల్ జిల్లా చేర్యాల, జనగామ ప్రాంతాలకూ ఇది నీళ్లివ్వాలి. అయితే అక్కడితో ఆగిపోకుండ ఈ నీళ్లు నల్గొండ జిల్లాలోని చిట్యాల ప్రాంతానికి కూడ వస్తాయని ఆ ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. అప్పటిదాకా ఫ్లోరైడ్ కాలుష్యంతో పాడయిన నీళ్లు తాగుతూ కీళ్ల జబ్బులను ఓపికగా భరిస్తున్నారు.

ఇవన్నీ ఎండమావులంటున్నామంటే ఈ ప్రాజెక్టులు అసాధ్యమని కాదు. వీటి నిర్మాణం చేపట్టాలన్న శ్రద్ధ మన రాష్ట్ర పాలకులకు లేదన్న విషయాన్ని ప్రజలు గ్రహించలేకపోతున్నారని మాత్రమే. లేక గ్రహించి కూడ ప్రాణం నిలుపుకోవడానికి ఏదో ఒక ఆశ కావాలి కాబట్టి గ్రహించనట్టు నటిస్తున్నారా?

ఈ వాక్యాలు చదివే వాళ్లెవ్వరూ తిండి కోసం వలస పోయే స్థితిలో ఉండరు, మంచి నీటికోసం రోజులో సగభాగం బిందెలు మోసుకొని ఈ నల్లా దగ్గరికీ ఆ బావి దగ్గరికీ పరుగెత్తే స్థితిలోనూ ఉండరు. అందుకు కృతజ్ఞతగా ఈ ఎండమావులను నిజం చేయడానికి మనం చేయగలిగినది చేద్దామా?

జూన్ 11, 2000

# ధరలెందుకు పెరగవు?

సాంకేతిక విషయాలలో మన మాట నెగ్గించుకోవాలంటే గణాంకాల మీద కంట్రోల్ చాలా ముఖ్యం. అంకెలు ఎవరి గుప్పిట్లో ఉంటే వాళ్ల వాదనే–అది నిజమైనా అబద్ధమైనా–గెలుస్తుంది. చంద్రబాబు నాయుడు తన యోగ్యతతో నిమిత్తం లేకుండా సమర్థుడయిన పాలకునిగా పేరు తెచ్చుకోవడానికి గల ఒక ముఖ్య కారణం అతనికి ఈ జ్ఞానం ఉండడమే. గడగడా గణాంకాలు గుప్పించేసి చర్చ అయిపోయిందనిపిస్తాడు.

అంతకంటె గొప్పవారు– అంకెలను కేవలం అదుపులో పెట్టుకోవడం కాదు, సృష్టించగలవారు ఉన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదల గొడవలో ప్రపంచ బ్యాంకుకు ఈ రకమైన గొప్పతనం ఉందన్న విషయం బయటపడింది.

కరెంటు పంపిణీ, సరఫరాలలో జరిగే వృధా గురించి ఇప్పుడందరికీ తెలుసును. మన రాష్ట్రంలోని 38 శాతం కరెంటు ఈ విధంగా లెక్కలోకి రాకుండా పోతున్నదని చాలామంది మనకు గడచిన రెండువారాలలో చెప్పారు. దీనిని కాపాడుకోగలిగితే ఛార్జీలు పెంచవలసిన అవసరమేముందని అన్నారు.

అయితే ఈ సంఖ్య ఎక్కడి నుండి వచ్చింది? మన రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే కరెంటు ఎంతో, దిగుమతి చేసుకునేది ఎంతో మనకు తెలుసును. అధికారికంగా వాడుకునేది ఎంతో కూడ తెలిస్తే అనధికారికంగా (అంటే దొంగతనంగా) వాడుకునేది, 'గాలిలో' కలిసేది కలిపి ఎంత ఉంటుందో చెప్పగలము. కానీ వ్యవసాయ బావులకు మీటర్లు లేనప్పుడు అధికారికంగా వాడుకునేది ఎంతో కచ్చితంగా ఎవ్వరూ చెప్పలేరు. అటువంటప్పుడు 'వృధా' ఎంత అనేది కొంతమేరకు ఊహతో కూడుకున్నదే తప్ప కచ్చితమైన అంచనాకాదు.

అందులో అంతా దొంగకరెంటు కనెక్షన్ల ద్వారా వాడుకునేది కూడా కాదు. చెరువులో నీళ్లు ఆవిరి అయినట్టు తీగల గుండా ప్రవహించే కరెంటు కొంత గాలిలో కలిసిపోతుంటుంది. దీనినంతా ఆదా చేయాలంటే ప్రవాహం వోల్టేజి చాలా పెంచాలి.

అంటే హై టెన్షన్ సరఫరాను ఎక్కువగా వినియోగించాలి. అది చాలా ఖర్చుతో కూడుకున్న పని.

అదట్లాగుంచి '38 శాతం' వృధా అన్న కచ్చితమైన సంఖ్యకు ఆధారమేమిటి అని చెప్పగలవారెవరూ లేకపోగా, ఇది ప్రపంచ బ్యాంకు ఉత్పత్తి చేసిన సంఖ్య అని ఎ.పి. ట్రాన్స్‌కో ఇంజనీర్లు అంటున్నారు. ప్రపంచ బ్యాంకు మన ఇంటి వ్యవహారాలలో తలదూర్చి సత్యాసత్యాలు నిర్ణయించడం మొదలుపెట్టక ముందు మన వారు కరెంటు సరఫరా, పంపిణీలలో 'వృధా' 20 శాతం దాకా ఉంటుందని చెప్పేవారు. ప్రపంచ బ్యాంకు ఆసంఖ్యను పెంచాలని గొడవచేసి 38కి పెంచేటట్టు చేసింది. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలను ఆహ్వానించిన అన్ని రాష్ట్రాలలోనూ 'వృధా' అయ్యే కరెంటును తాను చెప్పినంత ఎక్కువ చేసి చూపించాలని ప్రపంచ బ్యాంకు పట్టు బట్టింది.

ప్రభుత్వరంగ విద్యుత్ బోర్డులు అసమర్ధమని చూపించడం కోసం ఆ సంఖ్యను తాను చెప్పినట్టు మార్చమని ప్రపంచ బ్యాంకు ఒత్తిడి పెట్టిందని అనుకుంటారేమో. కావచ్చు, కానీ అంతకంటే బలమైన కారణమూ ఉంది. రేపు కరెంటు ఉత్పత్తి, సరఫరా, పంపిణీలను ప్రైవేట్‌పరం చేసిన తరువాత ఆ రంగాలలోకి ప్రవేశించే కంపెనీలు కరెంటు వృధాను కొంత తగ్గించినట్టు చెప్పుకున్నా, 30 శాతం కంటే ఎక్కువే జరుగుతున్నదని చూపించి తమ ఖర్చులు రాబట్టుకోవడానికని చెప్పి యూనిట్ ధర చాలా ఎక్కువ పొందగలుగుతాయి. 1400 కోట్ల రూపాయల దాకా ప్రైవేట్ కంపెనీలు అప్రకటిత లాభంగా మిగుల్చుకోగలవని ట్రాన్స్‌కో ఇంజనీర్ల అంచనా. మామూలుగా, అంకెలు తమ గుప్పిట్లో పెట్టుకున్న వారు చేసే విధాన రచనను వ్యతిరేకించే సామాన్య ప్రజలకు ఆ అంకెల సాంకేతిక భావం అర్థం కాదు కాబట్టి ఇట్లాంటి సంగతులు బయటకు రావు. కానీ ట్రాన్స్‌కో, జెన్‌కో ఇంజనీర్లు తమ ఉద్యోగాలకే ఎసరొచ్చిందేమోనని భయపడుతున్నారు కాబట్టి ఇట్లాంటి విషయాలు బయటికొస్తున్నాయి. గణాంకాల గారడీ చేయదలచుకున్నవారు ఆ గణాంకాలు అర్థమయ్యే వారందరినీ తమ వైపు ఉంచుకోవాలి. కాని ఇంజనీర్ల విషయంలో చంద్రబాబు, ప్రపంచ బ్యాంకు ఆ జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల అనేక సత్యాలు బయటికొస్తున్నాయి. తీసుకొని ఉన్నా ప్రజల మీద ఉన్న ప్రేమ కొద్దీ ఇంజనీర్లలో ఒక మూడు శాతమో అయిదు శాతమో ఈ విషయాలను బయటపెట్టి ఉందురేమో. అప్పుడు వారు తీవ్రవాదులుగానో, రెటమతం స్వభావులుగానో, రెచ్చగొట్టి కీర్తి సంపాదించుకునే కుళ్ళుబోతులుగానో మిగిలిపోదురు.

ఈ కథకొక నీతి ఉంది. అసమర్థమైన ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టి ప్రైవేట్ రంగానికి అన్నీ అప్పగించేస్తే అంతా బాగుంటుందని మన వాళ్లు అంటున్నారు గానీ వారి ఆహ్వానం అందుకోవడానికి అన్ని వేళలా ప్రైవేట్ రంగమేం ఉవ్విళ్లూరడం లేదు. వారు ఇటువైపు రావడానికి అనేక ప్రోత్సాహకాలు ఇయ్యవలసి వస్తున్నది. కరెంట్ 'వృథా' ఎక్కువ చూపించి యూనిట్ ధర పెంచి లెక్కలేని లాభాలు దాచుకోవడమొక్కటే కాదు. ఇప్పటి దాకా ఇతర రాష్ట్రాల ప్రభుత్వ రంగ సంస్థల నుండి రూ. 2.50 లేక 3.00 మించి ఒక యూనిట్‌కు చెల్లించని విద్యుత్ బోర్డు ఇప్పుడు ప్రైవేట్ ఉత్పత్తి సంస్థలతో యూనిట్ రూ. 4.50 లేక 5.00కు కొంటానని ఒప్పందాలు చేసుకుంటున్నది. అంతే కాక తప్పనిసరిగా ఇంత మొత్తం కొంటామన్న హామీ కూడా లిఖితపూర్వమైన ఒప్పందంలో భాగంగా ఇస్తున్నది. తుఫానుల వంటి ఉపద్రవాలలో జరిగే నష్టాన్ని భర్తీ చేస్తామని కూడ ఒప్పందాలలో రాసుకుంటున్నారు. ఇంత గడ్డి కరిస్తే తప్ప ప్రైవేట్ రంగం విద్యుత్ వంటి పరిశ్రమల వైపు కన్నెత్తి చూడదు. టూత్‌పేస్టులు, పౌడర్లు, బ్రాందీ విస్కీలు వంటివి ఉత్పత్తి చేసుకుంటూ ఉంటుంది.

ప్రభుత్వరంగం పోయి ప్రైవేటు రంగం రావడమంటే అసమర్ధతపోయి సమర్ధత రావడమని అర్థం కాదు. పని మీద ఆసక్తి లేని సేవలు, ఉత్పత్తుల స్థానంలో విపరీతమైన లాభాల వేటలో మన అవసరాలకు వెలకట్టే సేవలు, ఉత్పత్తులు రావడం అని అర్థం.

ధరల పెరుగుదల అప్పుడే ఏం చూసాం? ఇంకా చాలా చూడబోతాం.

# న్యాయవాదులకు వేరే న్యాయమా?

సంగీత అనే న్యాయవాది ఈ మధ్య ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. ఆత్మహత్య చేసుకునే ముందు ఉత్తరాలు రాసిపెట్టి పోవడమే కాదు, తాను ఎవరిచేత ఏ రకమైన లైంగిక వేధింపులకు గురవుతున్నదీ అప్పటికి ఆరు నెలలుగా చాలా మందికి చెప్పుకుంటూనే ఉంది. హైకోర్టులోని మహిళా న్యాయవాదులు ఈ విషయమై సమావేశాలు నిర్వహించి ఏం చేయాలని చర్చించుకున్నారు కూడ.

తన సీనియర్ అయిన విజయకుమార్ అనే న్యాయవాది, అతని మిత్రగణం తనను వేధిస్తున్నారనేది ఆమె అభియోగం. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నవారు పోతూ పోతూ కక్ష కొద్దీ తమ కిష్టం లేని వాళ్లందరినీ ఇరికించే నిందలు వేసి చనిపోతారన్న అభిప్రాయం – దీనిని అభిప్రాయం అనేకంటే అనుమానం అనడం సబబు – ప్రచారంలో ఉంది కాబట్టి సంగీత ఈ ఫిర్యాదు ఆరునెలలుగా చేస్తున్నదని మరొక్కసారి చెప్పాలి. ఒక్కరితో కాదు, చాలా మందితో చేసిందని కూడా చెప్పాలి.

ఈ మాత్రం ఆధారం వేరే ఎవరి విషయంలోనయినా దొరికి ఉంటే అతన్ని ఈ పాటికి పత్రికలకెక్కించి భ్రష్టు పట్టించి ఉందురు. ఏ సంఘాలవారో చేద్దురు, లేకపోతే విలేఖరులే చేద్దురు.

కానీ విజయకుమార్ 'న్యాయవాది' (ఆ మాట అనడానికి సిగ్గనిపించినప్పటికీ). జడ్జి కూడా కాబోతున్నాడంట. (ఇప్పుడింక కాలేదేమో గానీ సంగీత కొంచెం ఆలస్యం చేసి ఉంటే ఈపాటికి అయిపోయి ఉండేవాడేమో. అప్పుడింక ఈ మాత్రం కూడా ఎవ్వరూ మాట్లాడకపోదురు). 'భార్యను కడతేర్చిన తాగుబోతు' అనే శీర్షికతో వార్తలు చూస్తుంటాము. మృతురాలి ఫోటో దయనీయంగా అచ్చువేసి ఇన్‌సెట్‌లో తాగుబోతు మొగుడి ఫోటో వేస్తారు. అతని నేరప్రవృత్తి గురించి ఎటువంటి మొహమాటం లేకుండా

రాసేస్తారు. 'మృతురాలు చనిపోకముందు చెప్పినదానిలో అతిశయోక్తి ఉందేమో – నేరం రుజువు కాకముందే ఎందుకు రాయాలి?' అన్న సందేహం ఎవరికీ రాదు. తప్పకుండా రావలసిందేనని అనలేము కూడ. అది సంఘటనను బట్టి ఉంటుంది. కానీ నోరున్న వృత్తి అయిన వకీళ్లజాతికి చెందిన విజయకుమార్ గురించి రాయడానికి రాయించడానికి పత్రికలకు గానీ, ఉద్యమ సంఘాలకు గానీ మనసొప్పినట్టు లేదు.

కాగా, కేవలం ఆమె రాసిపెట్టిన ఉత్తరాన్ని ఆధారం చేసుకొని అతనిపైన కేసు పెట్టడం అన్యాయమంటూ అతని స్వంత జిల్లాకు చెందిన సీనియర్ క్రిమినల్ న్యాయవాది హైకోర్టులో కేసు వేసినట్టు వినికిడి. అతని జిల్లాకు, అతని కులానికి చెందిన మరొక సీనియర్ పోలీస్ అధికారి అతను అరెస్టు కాకుండా కాపాడుతున్నట్టు కూడ వినికిడి. సీనియర్ పోలీస్ అధికారి కొన్ని రోజులు కాపాడితే సీనియర్ న్యాయవాది ఈ లోపల ఎఫ్ ఐ ఆర్ మీద 'స్టే' తీసుకుంటే విజయకుమార్ ఊచలు లెక్కపెట్టే దుర్గతిని తప్పించుకొని హుందాగా బయట తిరుగుతాడు. అతని హోదాకేం తక్కువ కాదని ముందే చెప్పొచ్చు. లైంగికంగా ఒక స్త్రీని చచ్చేదాకా వేధించే సత్తాగల మగతనాన్ని ఈ సమాజం గౌరవించకపోదు.

స్త్రీలు ఇంటినుండి బయటికొచ్చి పనిచేసే ఏ స్థలంలోనైనా లైంగిక వేధింపులు ఉంటాయి. అవి ఉండడం అనాగరికం కాదు గానీ చెప్పుకోవడం అనాగరికమనుకునే చోట బయటికి పొక్కక పోవచ్చును గాక. అయితే మహిళా న్యాయవాదులకు ప్రత్యేకమైన సమస్య ఉంది. మహిళా డాక్టర్లకు పేషెంట్లు దొరుకుతారు గానీ మహిళా న్యాయవాదులకు క్లయింట్లు దొరకడం చాలా కష్టం. లిటిగెంట్ల ప్రపంచం మగప్రపంచం. కాబట్టి లాయర్ వృత్తి చేపట్టిన స్త్రీ స్వతంత్రంగా ప్రాక్టీస్ పెట్టడం చాలా చాలా కష్టం. మగవాళ్లకైనా కొంతకాలం ఒకరికి 'జూనియర్'గా ఉండకతప్పదు గానీ స్త్రీలు చాలా ఏళ్ళు ఉండిపోతారు. అందరి అనుభవాలూ చేదుగానే ఉంటాయని చెప్పలేము గానీ చేదు అనుభవం ఎదురయితే వృత్తిని వదులుకోవాలా లేక ఆత్మగౌరవాన్ని వదులుకోవాలా అన్న ప్రశ్నను ఎదుర్కోవలసి ఉంటుంది. 'సీనియర్'ను కాదని నా ప్రాక్టీస్ నేను పెట్టుకుంటానని ఒక మగన్యాయవాది అన్నట్టు స్త్రీ అనలేదు. సంగీత గత ఆరునెలలలో ఎవరితో తన గోడు చెప్పుకున్నా వృత్తిని వదులుకోవడం అనే ప్రత్యామ్నాయం చర్చకు వస్తూనే ఉంది.

న్యాయస్థానంలో లేని సంస్కారమేదో ఉన్నట్టు నటించడం మానేసి ఆస్పత్రులలో డాక్టర్లు నర్సులను వేధించినట్టు కోర్టులలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయని గుర్తించి నివారించడానికి నిజాయితీగా కృషి చేయడం ఉత్తమం.

పని స్థలాలలో లైంగిక వేధింపులకు గురయ్యే స్త్రీలు ఫిర్యాదు చేసుకొని న్యాయం పొందడానికి ఒక సంస్థాగత వ్యవస్థ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు 'విశాఖ వర్సస్ స్టేట్' అనే కేసులో దాదాపు మూడేళ్ళక్రితం తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అన్ని కేంద్రప్రభుత్వ సంస్థలలోనూ అటువంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని సర్క్యులర్ జారీ చేసింది. కొన్ని చోట్ల ఏర్పడ్డాయి. మన రాష్ట్ర ప్రభుత్వం కూడ కొంతకాలం కింద అటువంటి సర్క్యులర్ జారీచేసింది.

రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల పైన పాలనా సంబంధమైన అజమాయిషీ హైకోర్టుదే కాబట్టి హైకోర్టు అన్ని న్యాయస్థానాలలోనూ అటువంటి ఫిర్యాదుల వ్యవస్థ ఏర్పాటు చేయమని ఆదేశం జారీచేయాలి. ముందు హైకోర్టులో ఏర్పాటు చేయాలి. సంగీత వంటి స్త్రీలు ఇక్కడా అక్కడా పోయి తమ గోడు చెప్పుకోవలసిన అవసరం లేకుండా కోర్టులోనే (సగం కంటె ఎక్కువమంది స్త్రీలు సభ్యులుగా గల) ఫిర్యాదుల వ్యవస్థ ఉంటే, ఆ వ్యవస్థ ఫిర్యాది వాంగ్మూలాన్ని ఆధారం చేసుకొని నిందితుడిని అప్పటికప్పుడు పిలిచి నిలదీయగలిగితే, ఆ వ్యవస్థకు ఫిర్యాదు చేసుకోగలుగుతారు. అప్పుడు లైంగిక వేధింపులు కొంతమేరకైనా అదుపులో ఉంటాయేమో.

వకీళ్ళు దీనిని సాగనిస్తారా అన్న సందేహం రాక మానదు. న్యాయం కోసం ఏర్పడిన ప్రతీ ఒక్క వ్యవస్థనూ శాయశక్తులా అడ్డుకున్నది 'న్యాయవాదు'లే. లాయర్ ఆఫీసు ఒక పనిస్థలం కాదనీ లాయర్ల గుమాస్తాలు, జూనియర్లు కార్మిక చట్టాల వల్ల ప్రయోజనం పొందలేరనీ లాయర్లు కేసులు వేసారు. జడ్జిలు అవునవునంటూ తీర్పులిచ్చారు. కాబట్టి 'పనిస్థలం' కాని లాయర్ ఆఫీసులో జరిగే లైంగిక వేధింపులకు 'పనిస్థలం'లో జరిగే వేధింపుల గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వర్తించదని వాళ్ళు అడ్డుకోరన్న గ్యారంటీ ఏమీలేదు! కోర్టులు అవుననవన్న గ్యారంటీ కూడా లేదు. అయినప్పటికీ నివారణ చర్యలు ఎక్కడో ఒక చోట మొదలుపెట్టాలి కాబట్టి ఇక్కడ మొదలుపెట్టి, కనీసం ఆ వ్యవస్థనయినా అడ్డుకోకుండా ఉండే సంస్కారాన్ని వకీళ్ల జాతి ప్రదర్శిస్తుందేమో చూడడమే సరయినది.

జూలై 9, 2000

# ముద్దాయిని మెజిస్ట్రేటు చూస్తే చాలా?

ఒక హక్కును అమలు చేసే మార్గం అడుగగా అడుగగా ఇప్పుడా హక్కు లేకుంటే ఏమని ప్రభుత్వం జవాబు చెప్తున్నది.

రిమాండులో ఉన్న ముద్దాయిలను రిమాండ్ గడువు అయిపోయిన వెంటనే కోర్టు ముందు హాజరు పెట్టాలని చట్టం అంటుంది. హాజరు పెట్టి రిమాండ్ పొడిగింపు కోసం పోలీసులు పిటిషన్ వేసుకోవాలి. పొడిగించనక్కరలేదనీ తనను బెయిల్‌పైన విడుదల చేయడమే న్యాయమనీ ముద్దాయి చెప్పుకోవచ్చు.

నేరాన్ని విచారించే క్రమంలో అనుమానితులపైన కొంచెం నిర్బంధం పెట్టక తప్పదనేది ఎంత సత్యమో, ఆ నిర్బంధం నేరవిచారణకు ఉండే సహేతుకమైన అవసరాలను మించి ఆవగింజంత కూడ ఎక్కువ ఉండడానికి వీలు లేదనేది కూడా అంతే అవసరం.

అందువల్ల ముద్దాయికి రిమాండు 15 రోజులు మించి ఇయ్యడానికి వీలు లేదు. ఆ తరువాత ఇంకొక 15 రోజులు రిమాండు పొడిగించమని పోలీసులు అడిగినట్టయితే నేరపరిశోధన ఎక్కడిదాకా వచ్చిందో చూసి దానిని బట్టి కోర్టు రిమాండు పొడిగించేదీ లేనిదీ నిర్ణయించాలి. ఆ సమయంలో ముద్దాయి ఏమైనా చెప్పుకోదలచుకుంటే చెప్పుకోవడానికి అనుకూలంగా ముద్దాయిని భౌతికంగా కోర్టు ముందు హాజరు పెట్టాలి.

ముద్దాయిని స్వయంగా హాజరు పరచకపోయినట్టయితే మెజిస్ట్రేటు రిమాండు పొడిగించవచ్చునా? పొడిగిస్తే చెల్లుతుందా? పొడిగించడానికి వీలులేదంటే బెయిలు ఇయ్యవలసిందేనని అర్థం కాదా? ఇత్యాది ప్రశ్నలు 1973కు పూర్వం కోర్టుల ముందుకు వచ్చాయి. రాజ్‌నారాయణ్ వర్సస్ స్టేట్ అనే కేసులో ఏడుగురు జడ్జీల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ విషయాన్ని వివరంగా చర్చించి, సాధారణ పరిస్థితులలో రిమాండు పొడిగింపుకోసం ముద్దాయిని కోర్టు ముందు హాజరు

పెట్టవలసిందేగానీ హాజరు పెట్టనంత మాత్రాన రిమాండు పొడిగింపు చెల్లకుండ పోదని అనింది.

ఆ తరువాత పార్లమెంటు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను సవరించి సెక్షన్ 167 (2) (6)లో, మెజిస్ట్రేట్ ముందు ముద్దాయిని హాజరు పెట్టకుండా రిమాండు పొడిగించడానికి వీలు లేదని రాసింది. ఏడుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయాన్ని అధిగమించడానికి పార్లమెంటు ఈ చట్ట సవరణ చేసిందంటే నేరం రుజువయ్యేదాకా నిందితునిపైన అనవసర నిర్బంధం ఉండకూడదనే సూత్రానికి శాసన కర్తలు ఎంత ప్రాముఖ్యం ఇచ్చారో తెలుస్తుంది.

ఈ చరిత్రతో ఏమీ సంబంధం లేని చంద్రబాబు ఇప్పుడు 167 (2) (6)ని సవరించి, వీడియోలో మెజిస్ట్రేటుకు ముద్దాయిని చూపిస్తే చాలునని రాస్తానంటున్నాడు. ముద్దాయిని మెజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టడం కేవలం అతను బతికున్నాడా లేదా అని మెజిస్ట్రేటు చూడడం కోసం కాదు. రిమాండ్ పొడిగించటం ద్వారా ముద్దాయి స్వేచ్ఛకు అవరోధం ఇంకా పొడిగించడం అవసరమా అని మెజిస్ట్రేటు సహేతుకంగా నిర్ణయం చేయాలి. అందులో భాగంగా ముద్దాయితోనూ మాట్లాడాలి. ముద్దాయికి మెజిస్ట్రేటుతో అభిప్రాయం చెప్పుకునే అవకాశం ఉండాలి.

లాయర్‌ను పెట్టుకోలేని ముద్దాయిలు అర్జీ రూపంలో బెయిలు పిటిషన్ తామే రాసి మెజిస్ట్రేట్‌కు ఇవ్వడానికి, లీగల్ ఎయిడ్ కావాలని అభ్యర్థించడానికి జైలులో పరిస్థితులు బాగా లేకపోతే ఫిర్యాదు చేసుకోవడానికి ఆ సందర్భాన్ని వాడుకుంటారు. అది చాలా విలువైన అవకాశం. నేరం రుజువయ్యేదాకా ముద్దాయి నిర్దోషేననీ నేరపరిశోధనాక్రమంలో అత్యవసరమైన కనీస నిర్బంధాన్ని మించి ముద్దాయిపైన పెట్టడానికి వీలులేదనీ అర్థం చేసుకున్నట్టయితే ఈ అవకాశానికి ఉండే విలువను అర్థం చేసుకోగలుగుతాం.

చట్టం, రాజ్యాంగం ఏమి చెప్పినా పోలీసు యంత్రాంగం అవసరాలూ పరిమితులూ ఆలోచనలూ (లేక ఆలోచనా రాహిత్యం) ముద్దాయిల హక్కులను పరిమితం చేస్తాయి. ముద్దాయిని కోర్టుకు తీసుకుపోవాలంటే సాయుధ పోలీసుల ఎస్కార్ట్ కావాలి. అయితే సాయుధ పోలీసు బలగాలకు వేరే చాలా పనులున్నాయి. రాజకీయ నాయకులను ప్రత్యర్థుల నుండి కాపాడాలి. ప్రభుత్వాన్ని ఆందోళనకారుల నుండి కాపాడాలి. ఒకరి పండగలను మరొకరి మతోన్మాదం నుండి కాపాడాలి–లేదా పండగ ప్రదర్శనే మతోన్మాద ప్రదర్శనలా మారకుండా అడ్డుకోవాలి. ఇన్ని అవసరాలలో ఖైదీల ఎస్కార్ట్ చాలా చిన్న విషయంగా కన్పిస్తుంది. అందువల్ల తరచుగా 'ఎస్కార్ట్ లేదని' చెప్పి

ముద్దాయిలను కోర్టుకు తీసుకుపోకపోవడం, మెజిస్ట్రేట్‌లు విసుక్కున్నా ముద్దాయిని చూడకుండానే రిమాండు పొడిగించడం జరుగుతుంటుంది.

దీనికి పరిష్కారం కావాలని ఖైదీలు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. కోర్టువారికి ఏదైనా విన్నవించుకునే అవకాశం కావాలన్న చట్టపరమైన హక్కు ఖైదీలకు ఎంత ముఖ్యమో, ఆ ఒక్క పూట జైలు బయటకు పోయి బయటి గాలి పీల్చుకోవాలన్న కోరిక కూడా అంతే ముఖ్యం. కోర్టుకు బంధువులూ స్నేహితులూ వస్తారు. తమ ఇంటి వ్యవహారాలు మాట్లాడుకోవచ్చు.

చాలా కాలంగా హక్కుల సంఘాలు పెడుతున్న ప్రతిపాదన ఏమిటంటే ఎస్కార్టు బలగాలను పోలీసుల అదుపునుండి తీసేయాలని, కేవలం ఖైదీలను కోర్టులకు తీసుకుపోవడం కోసమే ఒక ఎస్కార్టు ఫోర్స్ తయారు చేసి జైలు అధికార్ల నియంత్రణలో పెట్టాలని. ఆ బలగానికి ఈ పనితప్ప వేరే ఏ పనీ ఉండకూడదు. అన్ని జైళ్ళలో కాకున్నా సెంట్రల్ జైళ్లల్లో, జిల్లా జైళ్లల్లో ఈ ఎస్కార్ట్ ఫోర్స్ ఉండాలి. ప్రతీరోజూ వివిధ కోర్టులకు తీసుకుపోవలసిన ఖైదీలకు జైలు సూపరింటెండెంటే ఎస్కార్ట్ ఇచ్చి పంపించాలి.

ముద్దాయిల హక్కులకు ప్రాముఖ్యం ఇచ్చేట్లయితే ఈ ఏర్పాటు అసాధ్యమేమీ కాదు. అయితే హక్కులను గౌరవించడం కంటే ప్రొసీజర్ ప్రకారం జరగవలసింది ఏదో ఒక రకంగా జరిపించి చేతులు దులుపుకోవడం ముఖ్యం అని భావించే మన పాలకులిప్పుడు వీడియోలో ముద్దాయిని మెజిస్ట్రేటుకు చూపిస్తే చాలని సవరణ చేయజూస్తున్నారు. ముద్దాయిని మెజిస్ట్రేటు చూడటం కాదు, వినడం ముఖ్యం. సెక్షన్ 167 (2) (6) భావం అదే.

వీడియోలో 'వాయిస్' కూడా కల్పిస్తామంటారేమో. కానీ ముద్దాయికి కేవలం తన అభ్యర్థన తెలియజేసే అవకాశమే కాదు, మెజిస్ట్రేటు కాదంటే ఒకటికి రెండు సార్లు నచ్చజెప్పే అవకాశం కూడా కావాలి. అర్థం కాని విషయం వివరించే అవకాశమూ కావాలి. కోర్టులో ఉండే లాయర్లను సంప్రదించి ఎవరో ఒకరికి వకాలత్ ఇచ్చే అవకాశమూ కావాలి. తనవారు కోర్టుకొస్తే తన కేసు విషయం వారితో చర్చించుకునే అవకాశమూ కావాలి.

ఈ అవకాశాలన్నింటినీ తొలగించే వీడియో 'హాజరీ' ముద్దాయి హక్కులకు ప్రాథమికంగా భంగకరం. ఈ తెలివి తక్కువ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంటే మంచిది.

జూలై 23, 2000

# నిజమైన ఐఎస్ఐ ఏజెంట్లు

ఈ మధ్య మన రాష్ట్రంలోనూ పొరుగు రాష్ట్రాలలోనూ చర్చిలలో బాంబులు పెట్టిన వారు దీన్‌దార్ అంజుమన్ అనే సంస్థకు చెందిన ముస్లిం యువకులని పోలీసులు అంటున్నారు. వారిని పాకిస్తానీ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఈ పనికి పురమాయించిందని కూడా అంటున్నారు.

అవుననే ప్రస్తుతానికి ఒప్పుకుందాం. 'ప్రస్తుతానికి' అంటే కేవలం వాదన కోసం అని కాదు. నేరం రుజువయ్యేంతవరకు అది అనుమానమేననే జాగ్రత్త పాటించడం కోసం 'ప్రస్తుతానికి' అంటున్నాను. సంఘ్‌పరివార్ నేరస్థులను కాపాడడానికి ముస్లింలపైన, పాకిస్తాన్‌పైన నేరాన్ని మోపేంత దుస్థితికి ఇప్పటికింకా మన పోలీసు యంత్రాంగం దిగజారలేదు కాబట్టి ఈ జాగ్రత్తను మించిన అనుమానంతో పోలీసుల ప్రకటనను చూడనవసరంలేదు.

అంత మాత్రం చేత 'ఇంక మీరంతా మా నుండి క్షమాపణ కోరండి' అని దబాయిస్తున్న వెంకయ్య నాయుడుకు మనమంతా వంగి దండాలు పెట్టవలసిందేనా? పొరబాటయిపోయింది క్షమించుదొరా అని సుదర్శన్‌జీని అడుక్కోవలసిందేనా?

లేదనుకుంటాను.

క్రైస్తవులకూ హిందువులకూ మధ్య చిచ్చుపెట్టి భారత సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలన్న కుట్రపూరితమైన ఆలోచన ఐఎస్ఐకి నాలుగేళ్ల కింద వచ్చి ఉండేదా? వచ్చి ఉన్నా, నాలుగు చర్చిలలో బాంబులు పెడితే దేశంలో ఉద్రిక్తత ఏర్పడుతుందని ఆశించే అవకాశం ఉండేదా? క్రైస్తవులు హిందువులను అనుమానంగా చూసే స్థితి ఏర్పడి ఉండేదా?

అదెవరో పిచ్చివాళ్లపని అని అందరూ అనుకొని కొట్టి పారేద్దురు. ఆ సంగతి ఐఎస్ఐకి తెలిసే ఉండేది కాబట్టి అటువంటి ప్రయత్నం చేసి ఉండేది కాదు.

ఇప్పుడు పరిస్థితి మారిందంటే దానికి కారణం దీన్‌దార్ అంజుమన్ కాదు, ఐఎస్ఐ కాదు. వారు దానిని వాడుకున్నారనే ప్రస్తుతానికి ఒప్పుకున్నా, ఆ పరిస్థితికి కారణం వెంకయ్యనాయుడుగారు దెబ్బతిన్న అభిమానంతో వెనకేసుకొస్తున్న సంఘ్ పరివార్ మిత్రులే.

ఇక్కడ (అంటే దక్షిణ రాష్ట్రాలలో) వాళ్ల ఆగడాలు ఒకస్థాయి మించలేదు కాబట్టి మనకింకా తెలియడం లేదు గానీ గుజరాత్ నుండి బీహార్ దాకా వింధ్యకు ఉత్తరాన వారు చేస్తున్న విషప్రచారము, దాడులు అడ్డం లేకుండా సాగుతున్నాయి. గుజరాత్ అయితే హిందూరాష్ట్రం అయిపోయిందనే చెప్పుకోవచ్చు. పాపం గాంధీ –ఆయనలో వేరే లోపాలు ఉండవచ్చుగాక– తన జన్మభూమికి ఈ గతి పడుతుందని ఊహించి ఉండడు. కానీ క్రైస్తవుల మీద దాడుల విషయానికొచ్చేసరికి ఉత్తరప్రదేశ్, బీహార్‌లు గుజరాత్‌కు తీసిపోవడం లేదు. ఈ సంవత్సరం మొదటి 6 నెలలలో క్రైస్తవులపైన ఈ ఉత్తరాది రాష్ట్రాలలో 26 చోట్ల తీవ్రమైన దాడులు జరిగాయి. ఈ దాడుల వెనుక ఏ దీన్‌దార్ అంజుమన్ లేదు, ఐఎస్ఐ లేదు. ఉందని పోలీసులూ అనలేదు. కొన్ని దాడులకు వివిధ సంఘ్ పరివార్ సంస్థలు పేరు చెప్పుకొని పాల్పడ్డాయి. పెద్ద పెద్ద కరపత్రాలు వేసి ఆ దాడికి ఎందుకు పాల్పడ్డాయో వివరించాయి. కొన్ని దాడులు వారిచ్చిన గ్రీన్ సిగ్నల్ అందుకొని స్థానిక ఉన్మాదులో వృత్తి నేరస్థులో పాల్పడినవి.

పెరుగుతున్న ఈ క్రైస్తవ ద్వేషం కాకతాళీయమేమోనన్న సందేహానికి ఆస్కారం లేకుండా ధర్మేంద్ర శర్మ అనే బజరంగ్ దళ్ ముఖ్యుడు 'ఇప్పుడు మనకు ముస్లింల కంటే క్రైస్తవులే ప్రధాన శత్రువులు' అని జూన్ 22న ప్రకటించాడు. 'కొడుతున్నామని ఆందోళన చెందుతున్నారా? కొట్టడమేమిటి, మేము ఏం చేయడానికయినా సిద్ధంగా ఉన్నాం' (మార్‌పీట్‌తో క్యా, హం సబ్ కుచ్ కర్‌నేకే లియే తైయార్‌హై) అని స్పష్టం చేసాడు.

'అట్లాంటి ఉన్మాదులను జైలులో పెట్టాలి' అని దేశ అటార్నీ జనరల్ సోలీ సోరాబ్జీ ఈ వార్త చదివి అన్నాడంట. కానీ ధర్మేంద్ర శర్మవంటి దేశభక్తులను ఆపగల జైలు ఈ దేశంలో లేదని బాల్‌థాకరే రుజువు చేసాడు. 1992–93లో ముంబాయిలో ముస్లింలపైన శివసేన మూకలు దాడులకు పాల్పడిన నేరాలకు సంబంధించిన 11వేల కేసులను వారి పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపసంహరించుకుంది (11 వందలుకాదు, వేలే) మరి ధర్మేంద్ర శర్మను జైలులో ఎవరు పెట్టాలి?

ఇక్కడ అదికాదు ముఖ్యమైన విషయం. ఈ ద్వేష వాతావరణాన్ని వెంకయ్య నాయుడు గారి మిత్రులు కల్పించి ఉండకపోతే దీన్‌దార్ అంజుమన్‌ను వాడుకొని ఐఎస్ఐ ఏం చేయగలిగేది? రెచ్చగొడితే ఎవరు రెచ్చిపోయేవారు?

చాలా ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే తాము చేస్తున్న పనులు ఎటువంటి ఘోరాలకు దారి తీస్తున్నాయన్న ఆత్మవిమర్శగానీ ఆందోళనగానీ లేకుండా తమకే ఏదో అన్యాయం జరిగిపోయినట్టు వీళ్లు అందరి నుండి సంజాయిషీలు కోరడం. రెండు మూడేళ్లుగా వీళ్లు క్రైస్తవం మీద, క్రైస్తవుల మీద పిచ్చి ద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. ఒకటికాదు రెండు కాదు కొన్ని డజన్ల సంఘటనలు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ జాగరణ్ మంచ్ వంటి సంస్థల ఆధ్వర్యంలో జరిగాయి. సగర్వంగా ప్రకటించుకొని మరీ చేసారు.

చర్చిలను కూల్చడం, బైబిల్ ప్రతులు తగలబెట్టడం, మీటింగ్‌లపైన దాడి చేసి కొట్టడం, చంపడం, రేప్ చేయడం వారానికొక రోజైనా ఇటువంటి దౌర్జన్యాలు వార్తలలో కనిపిస్తున్నాయి. వార్తలలో కనిపించని దేమిటంటే కరపత్రాల రూపంలోనూ పెద్ద పెద్ద పోస్టర్ల రూపంలోనూ వీళ్లు చేస్తున్న విష ప్రచారం.

వీటి ఫలితం సమాజం మీద ఉండదా? సాధారణ ప్రజలు కూడ రెచ్చిపోయి క్రైస్తవులపైన దాడులకు పాల్పడే పరిస్థితి రాదా? రావాలనే కదా వీళ్లు ఈ ప్రచారం చేసేది? అటువంటప్పుడు 'ఎవరో చేసిన దానికి మమ్మల్ని నిందిస్తున్నారు, క్షమాపణ కోరండి' అని దబాయించే హక్కు వీరికి ఎవరిచ్చారు?

వీరి విష ప్రచారానికి రెచ్చిపోయే వారున్నట్టే దానిని ఉద్దేశ్య పూర్వకంగా వేరే ప్రయోజనాల కోసం వాడుకునే వారూ ఉంటారు. వట్టి దొంగలు, దారి దోపిడీగాళ్లు ఉంటారు. తమ నేరాలకు క్రైస్తవులను, క్రైస్తవుల సంస్థలను ఎంచుకున్నట్టయితే పోలీసుల దృష్టి తమ మీద పడకుండా ఉంటుందని వారు భావిస్తారు.

ఐఎస్ఐ వంటి విదేశీ సంస్థలు, వారి దేశీయ ఏజెంట్లూ వేరే ప్రయోజనాలకోసం ఇదే వాతావరణాన్ని వాడుకోవచ్చు. కానీ దానికి బాధ్యత వెంకయ్య నాయుడుగారి సంఘ్ పరివార్ మిత్రులు స్వీకరించనవసరం లేదా? స్వీకరించకపోగా, తాము చేస్తున్న విషప్రచారం ఎక్కడిదాకా పోతున్నదని ఆందోళన చెందకపోగా, ఎదురు దబాయింపు కూడానా?

ఆగస్టు 6, 2000

# కాశ్మీరీ విషాదం

**కా**శ్మీర్ పరిస్థితి చాలా బాధాకరంగా తయారయింది. తమతో సంబంధంలేని బలమైన బాహ్యశక్తుల ఘర్షణలో నలిగిపోవడం మొదటినుండీ కాశ్మీరీల దుర్గతి కాగా ఇప్పుడది మరీ వికృత రూపం తీసుకుంటున్నది.

ఒక దశాబ్దం కింద కాశ్మీరీల పోరాటంగా మొదలయిన కాశ్మీర్ పోరాటం కాలక్రమంలో పాకిస్తానీ, అఫ్ఘానీ మిలిటెంట్ల చేతిలోకి పోయింది. హిజ్బుల్ ముజాహిదీన్ మొదటినుండి పాకిస్తాన్ అనుకూల సంస్థే (అంటే కాశ్మీర్ ఇండియా నుండి బయటపడి పాకిస్తాన్‌లో కలవాలని నమ్మే సంస్థే) కానీ ఒకప్పుడు ఆ సంస్థ సభ్యులెక్కువగా కాశ్మీరీ యువకులు కాగా ఇప్పుడు అత్యధికంగా బయటివారు.



అయినప్పటికీ సగటు కాశ్మీరీలు హిజ్బుల్ ముజాహిదీన్‌ను ఆదరించారు. 'తమ కోసం' పోరాటం చేస్తున్న సోదరులుగా వారిని భావించి ఆదరించారు. ముక్కుముఖం తెలియని పాకిస్తానీ మిలిటెంట్లు ఏ కాశ్మీరీ గ్రామంలోనో ఎన్‌కౌంటర్‌లో చనిపోతే స్థానిక జనం అతని మృతదేహాన్ని ఆవేశపూరితంగా ఊరేగించి ఘనంగా అంత్యక్రియలు జరిపిన ఘటనలనేకం కాశ్మీర్‌లో నేటికీ జరుగుతున్నాయి.

'ఆజాదీ' కావాలని కోరుకునే సగటు కాశ్మీరీకి పాకిస్తాన్‌లో కలవాలన్న కోరిక లేకపోయినప్పటికీ ఇండియా మీద పోరాటం చేస్తూ తమ కోసం ప్రాణాలర్పిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్ కార్యకర్తలంటే వారికి అభిమానం ఉంది.

అయితే కాశ్మీరీ పోరాటం విదేశీ హస్తాలలోకి పోవడం వల్ల తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేని మార్పులకు కాశ్మీరీలు తల ఒగ్గవలసి వస్తున్నది. ఇది నిజానికి యాభై ఏళ్లుగా జరుగుతున్నదే. భారత పాకిస్తాన్‌ల వైరం, లౌకికవాదానికీ మతవాదానికీ మధ్యనున్న ఘర్షణ, అమెరికా, సోవియట్ రష్యా ప్రచ్ఛన్న యుద్ధం, భారతదేశంలోనూ పాకిస్తాన్‌లోనూ ఆంతరంగిక మతవాద రాజకీయాల ఒత్తిడి ఒకటేమిటి అరడజను అప్రస్తుతమైన శక్తులూ ఘర్షణలూ కాశ్మీరీల గతిని నిర్ణయించాయి.

ఇప్పుడు మళ్లీ అదే జరుగుతున్నది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పెత్తందారీ కేంద్రమైన అమెరికా ఏకారణంగానైతేనేం కాశ్మీర్‌లో శాంతి కావాలని కోరుకుంటున్నది. మధ్యఆసియా దేశాలలోని అపారమైన పెట్రోలియం వనరులపైన అమెరికా కన్నేసిందనీ, ఆ వనరులను కరాచీ రేవు నుండి తీసుకుపోవలసి ఉంటుందనీ, కాశ్మీర్‌లో శాంతి లేనంతకాలం మధ్యఆసియా నుండి కరాచీకి వచ్చే మార్గం సాయుధ ఇస్లామిక్ మిలిటెంట్లమయంగా ఉంటుంది కాబట్టి కాశ్మీర్‌లో శాంతి కావాలని అమెరికా కోరుకుంటున్నదనీ ఒక వ్యాఖ్యానం ఉంది. కావచ్చు.

కారణమేమయితేనేం, అమెరికా ఇప్పుడు కాశ్మీర్ సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నది. ఈ ఒత్తిడి భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపైన పడింది. దాని ఫలితంగానే మన హిందుత్వవాద పాలకులు తమ బద్ధశత్రువులైన హురియత్ కాన్ఫరెన్స్ నాయకులను జైలు నుండి విడిచిపెట్టి, వారితో చర్చలు పెట్టుకుంటామని ప్రకటించారు.

ఆ ఒత్తిడి ఫలితమే ఇప్పుడు హిజ్బుల్ ముజాహిదీన్ చేసిన కాల్పుల విరమణ ప్రకటన. కాశ్మీర్‌లోని అన్ని పోరాట సంస్థలలోకి పాకిస్తాన్ ప్రభుత్వానికి అత్యంత సన్నిహితమైనది హిజ్బుల్ ముజాహిదీన్. అమెరికా ఒత్తిడి ఏ మేరకయితే పాకిస్తాన్ ప్రభుత్వంపైన పని చేస్తుందో ఆమేరకు పాకిస్తాన్ ఒత్తిడి హిజ్బుల్ ముజాహిదీన్ పైన పని చేస్తుంది. దాని పర్యవసానమే కాల్పుల విరమణ ప్రకటన.

కానీ పాకిస్తాన్ దుర్గతి ఏమిటంటే ఆ గడ్డమీద స్థావరం ఏర్పరచుకున్న మతవాద మిలిటెంట్ సంస్థలలో అనేకమిప్పుడు ఆ దేశ ప్రభుత్వం అదుపులో లేవు. పాకిస్తాన్ ఇప్పుడు నిజానికి ఎవరి అదుపులోనూ లేని ఫ్రీలాన్స్ మిలిటెంట్లకు కేంద్రం. అఫ్ఘానిస్తాన్ నుండి సోవియట్ రష్యాను తరిమేయడానికి అమెరికా ఆవిష్కరించిన వ్యూహం ఇప్పుడు పాకిస్తాన్‌కు పీడగా పరిణమించింది. అమెరికా హాయిగానే ఉంది. మనవాళ్ల ఒత్తిడి వల్ల ఏదో ఒకరోజు అమెరికా పాకిస్తాన్‌ను టెర్రరిస్టులదేశంగా ప్రకటించినా ప్రకటించవచ్చును కూడ. కానీ అమెరికా ప్రయోజనాల కోసం మొదలయిన వ్యూహం ఫలితమే ఈ పరిస్థితి అని అమెరికా ఒప్పుకోదు. ఆ వ్యూహం పాకిస్తాన్‌ను నాశనం చేసింది. ఆ దేశంలో ప్రతీ ఇంట్లోనూ ఆయుధాలుండే దశ వచ్చింది. ఎవరికి వారు ప్రజలపై పెత్తనం చలాయించే మతవాద మిలిటెంట్ మూకల రాజ్యంగా మారింది పాకిస్తాన్.

వాటిలో ఒకటైన లష్కర్–ఇ–తొయిబా కాశ్మీరీ పోరాటంలోనూ భాగమే. సకల కాశ్మీరీ మిలిటెంట్ సంస్థల ఉమ్మడి వేదిక అయిన షూరా–ఇ–జెహాద్‌లో లష్కర్‌దే

బలమైన గొంతు. ఆ సంస్థకు అమెరికా ఆదేశాలు గానీ పాకిస్తాన్ ఒప్పుకోలు గానీ హిజ్బుల్ ముజాహిదీన్ దానిని శిరసావహించడం గానీ నచ్చలేదనేది స్పష్టమే. ఈ అసమ్మతి అతి క్రూరమైన హత్యాకాండకు దారి తీసింది. ఏ మానవీయమైన లక్ష్యమూ లేని ఉన్మాదులు–ఉన్మాదమే లక్ష్యమైన వారు–తప్ప వేరే ఎవ్వరూ ఈ రకమైన హత్యాకాండకు పాల్పడలేరు. క్లింటన్ రాకకు కొద్ది రోజులు ముందు కాశ్మీర్‌లో సిక్కులను ఊచకోత కోసిన ఘటనకు ప్రేరణ కూడా ఇదేనని ఇప్పుడు మరింత స్పష్టంగా అర్థమవుతున్నది. క్లింటన్ దక్షిణాసియాలోని రెండు ప్రభుత్వాలకూ ఏం చెప్పబోతాడో, వారు ఏం చేయబోతారో ఈ హంతకులకు ఆనాడే తెలుసును.

చాలా బాధాకరమైన విషయమేమిటంటే అత్యంత మానవీయమైన లక్ష్యంగల కాశ్మీరీల జాతీయ ఆకాంక్ష ఇటువంటి హంతకుల చేతిలో చిక్కుకోవడం. కాశ్మీరీ అంటేనే క్రూరమైన ఉన్మాది అనే తమ ప్రచారాన్ని సమర్థించుకోవడానికి, కాశ్మీర్ విషయంలో రాజకీయంగా వ్యవహరించి చేసేదేమీ లేదని తమ అణచివేత వైఖరిని కొనసాగించడానికి మన సంఘ్ పరివార్ పాలకులకు ఇంతకంటే ఏం కావాలి? పరస్పరం శత్రువులుగా కనిపించే ఉన్మాదాలెప్పుడూ ఒకదానినొకటి పెంచుతాయి. ఈ రెండు రకాల ఉన్మాదమే తప్ప దక్షిణాసియాలో వేరే ఏమీ లేదన్న అభిప్రాయాన్ని వీరిద్దరూ కలిసి పెంచుతారు. చర్చల మీద, సంవాదం మీద తమకు నమ్మకం లేదని బహిరంగంగా ప్రకటిస్తారు. అయినప్పటికీ అమెరికా ఒత్తిడి వల్ల వీరిలో కొందరు, వారిలో కొందరు తమకు కనీస అవగాహన లేని కాశ్మీర్ గురించి చర్చలు పెట్టుకుంటారు.

ఇంతకంటే వికృతమైన పరిస్థితిని ఊహించడం కష్టం.

# లైసెన్స్డ్ హంతకుల ప్రమాదం

'పీపుల్స్‌వార్'కు వ్యతిరేకంగా పోరాడదాం రమ్మని మొన్నటిదాకా ఆ పార్టీ కరీంనగర్ జిల్లా శాఖలో ముఖ్య నాయకుడిగా ఉండిన బయ్యపు సమ్మిరెడ్డి పిలుపు ఇవ్వడం ఆందోళన కలిగించే విషయం. ఒక కత్తుల సమ్మయ్యతో, ఒక జడల నాగరాజుతో మొదలయిన ఒరవడిలో సమ్మిరెడ్డి, నిజామాబాద్ జిల్లాలో ముఖ్య నాయకుడిగా ఉండిన హరిభూషణ్ వంటివారు చేరడం ప్రమాద సూచిక. ఇటువంటి దుష్ట ప్రయోగాలు మొదలుకావడం కష్టంగానీ మొదలైతే వేగంగా వ్యాపించగలవు.



పీపుల్స్‌వార్ మీద ఎవరూ పోరాటం చేయకూడదని కాదు. నిజానికి ఆ పార్టీ విధానాల పట్ల, పద్ధతుల పట్ల ఆమోదం ఉండవచ్చు, ఉండకపోవచ్చు గానీ ఆ పార్టీ మీద 'పోరాటం' చేయడం ఎవరికైనా ఎందుకు అవసరమవుతుందో ఊహించడం కష్టమే. పోరాటం మామూలుగా అన్యాయమైన, అవాంఛనీయమైన జీవిత పరిస్థితుల మీద చేస్తారు ఎవరైనా. ఒకరు చేసే పోరాటం ఒకరికి నచ్చకపోవచ్చు. పాక్షికంగా నచ్చవచ్చు. ఒకరినొకరు తిట్టుకోవచ్చు. అప్పుడప్పుడు కొట్టుకోవచ్చు కూడ. కానీ ఒకరి మీద ఒకరు 'పోరాటం' చేసుకోరు. ఒక ఉద్యమం పూర్తిగా అన్యాయాన్ని భుజానికెత్తుకున్నట్టయితే దానిపైన కూడ పోరాటం చేస్తారేమో గానీ పీపుల్స్‌వార్‌ను గానీ ఇతర నక్సలైట్ పార్టీలను గానీ ఆ రకమైన ఉద్యమాలతో పోల్చలేము.

ఇదంతా ఎట్లాగున్నా పీపుల్స్‌వార్‌పైన ఎవరైనా పోరాటం చేస్తామంటే చేసుకొమ్మనడానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. కానీ ఈ 'పోరాటకారులు' పోలీసుల కనుసన్నలలో నడిచే క్రిమినల్స్ అనేది అందరికీ తెలిసిన సత్యం. నిన్నటి దాకా పీపుల్స్‌వార్‌లో ముఖ్యస్థానాలలో ఉన్నవాళ్ళు ఇవాళ క్రిమినల్స్ ఎట్లా అయ్యారన్న ప్రశ్నను ప్రస్తుతానికి ఆ పార్టీ నాయకత్వానికి విడిచిపెట్టి (వాళ్లు మనకు వినిపించేటట్టు చర్చిస్తారనికాదు–ఎవరికీ వినిపించేటట్టు చర్చించరు, ఎవరైనా బిగ్గరగా చర్చిస్తే వారిని ద్రోహులంటారు) ఇది సమాజానికి ఎంత ప్రమాదకరమైన పోకడో కొంచెం ఆలోచిద్దాం.

ఈ ప్రమాదాన్ని గురించి హక్కుల సంఘాలు చాలా కాలంగా చెప్తున్నాయి గానీ ఎవరికీ పెద్దగా అది పట్టినట్టు లేదు. మాకైనా కాశ్మీర్‌లోనూ అస్సాం, నాగాలాండ్‌లలోనూ ఇది తీసుకున్న రూపం ఎరుక కాబట్టే ఈ ప్రమాదాన్ని గురించి ఆందోళన చెందుతున్నాం.

బయ్యపు సమ్మిరెడ్లూ, హరిభూషణ్‌లూ, కత్తుల సమ్మయ్యలూ తెలంగాణలో ఇంకొక వంద మంది తయారయ్యారనుకోండి. అది ఊహించలేని విషయమేమీ కాదు. ఇటువంటివి ఊపందుకోవడం కష్టంగానీ అందుకున్నాక వేగం పుంజుకోవడం కష్టం కాదు. ఆ వంద మంది తుపాకులు పట్టుకొని బహిరంగంగా సంచరిస్తుంటారు. పోలీసు జీపులలోనే సంచరిస్తుంటారు. వాళ్లు ఎక్కడున్నా అతి సమీపంలో సాయుధ పోలీసులుంటారు. వాళ్లు ఎవరినైనా కొట్టినా చంపినా ఆపడానికి కాదు–వారినెవరైనా ప్రతిఘటిస్తే ఆ ప్రతిఘటనను తుంచేయడానికి.

'చట్టం' గొడుగుకింద ఈ మాజీ మిలిటెంట్ల గుంపులు దోపిడీలకు, హత్యలకు, లూటీలకు పాల్పడుతుంటారు. ఎవరూ నోరెత్తి ఇదేమని అడగరు. నక్సలైట్ సానుభూతిపరులుగా పోలీసులు భావించే వారిని ప్రధానంగా ఈ దాడులకు గురిచేస్తారు గానీ ఆపైన ఇతరులను దోచుకున్నా వ్యక్తిగత కక్షలు తీర్చుకున్నా అవి బోనస్‌గా అనుమతించబడతాయి. అయినా ఎవరు నక్సలైట్ సానుభూతిపరులన్న విషయాన్ని వీళ్లే నిర్ణయించి (అనుభవజ్ఞులు కాబట్టి) పోలీసులకు చేరవేస్తారు కాబట్టి అసలుకూ బోనస్‌కూ పెద్ద తేడా ఏముండబోదు.

ఈ లైసెన్స్‌డ్ క్రిమినల్స్ చేసే స్వైరవిహారం కలిగించే భయాన్ని చూస్తే తప్ప అర్థం కాదు. బస్సులో మీ పక్కన కూర్చున్న వ్యక్తి మిమ్మల్ని కాల్చేసి దిగిపోవచ్చు. అర్థరాత్రి పోలీసులంతా స్టేషన్‌లో భద్రంగా విశ్రమిస్తుండగా మీ ఇంటిమీద పడి దోచుకొని మిమ్మల్ని చావగొట్టి దర్జాగా నడిచి వెళ్లిపోవచ్చు. కాశ్మీర్ నుండి నాగాలాండ్ దాకా ఎవరి ఇంట్లోనయినా కూర్చొని అక్కడి సంక్షోభాన్ని గురించి మాట్లాడుతుంటే ఇంటివాళ్లలో ఒకరు పదేపదే ప్రతి కిటికీ నుండి బయటకు చూస్తుంటారు. సైన్యం వింటుందని కాదు, పోలీసులు వింటారని కాదు. కాకతాళీయంగా అక్కడ నిలబడ్డట్టు కనిపించే వ్యక్తి ఏ లైసెన్స్డ్ క్రిమినల్ ముఠాకు చెందిన వాడోనని అనుమానం. ఇంటివైపు చూస్తూ పోతున్న బాటసారి చేతిసంచిలో తుపాకి ఉందో గ్రెనేడ్ ఉందోనని భయం.

కాశ్మీర్, నాగాలాండ్ వంటి ప్రాంతాలలో నడుస్తున్న మిలిటెన్సీ వెనుక న్యాయమైన ఆకాంక్షలున్నప్పటికీ దానికి ఒక సిద్ధాంతమంటూ లేదు కాబట్టి క్రిమినల్స్‌గా మారిన 'మాజీ'లను ప్రభుత్వం సులభంగానే పొందగలిగింది గానీ సిద్ధాంతయుతమైన నక్సలైట్

ఉద్యమం విషయంలో అది జరగదని వాదించినవారు లేకపోలేదు. కానీ చూడగా సిద్ధాంతమున్న మిలిటెన్సీకి అది లేని మిలిటెన్సీకి మధ్య అంత కచ్చితమైన విభజన రేఖ లేదని అర్ధమవుతున్నది. రాశిలో తేడా లేదని కాదుగానీ అక్కడ పారిన ప్రభుత్వ ఎత్తుగడలిక్కడ పారవని నమ్మడం అవాస్తవికమైన 'నిబద్ధతే' అవుతుంది.

సమ్మిరెడ్డి పీపుల్స్‌వార్ నాయకుడిగా ఉండగానే అతని మీద చాలా అభియోగాలు వచ్చాయి. తన కులం వాళ్ల మాటలు విని తన పార్టీ సానుభూతిపరులనే దూరం చేసుకున్నాడన్న అభియోగాలు వచ్చాయి. అప్పుడు ఆ పార్టీ నాయకత్వం పట్టించుకోకపోగా ఈ మాటలన్న వాళ్లపైన దుమ్మెత్తి పోసింది. ఇప్పుడు అతనే ఆ పార్టీపైన దుమ్మేమిటి బాంబులు ఎత్తివేయడానికి సిద్ధమయ్యాడు. నిజామాబాద్‌లో హరిభూషణ్ విషయమూ అంతే.

అప్పుడే వీళ్లు హామీ ఇచ్చిన 'పోరాటం' మొదలయింది. తెలంగాణ జనసభ కార్యకర్తలను కరీంనగర్‌లోనూ నిజామాబాద్‌లోనూ చంపుతామని బెదిరించారు. పోలీసులకూ ప్రభుత్వానికీ నచ్చని ఏ ఉద్యమంపైనయినా వీరి పంజా పడగలదు. వీళ్లు 'పోరాటం' పీపుల్స్‌వార్‌పైన మాత్రమే చేయరు. చేసినా ఆ పార్టీకి చెప్పుకోదగ్గ సామాజిక పునాది ఉంది కాబట్టి అది కేవలం 'ఆ పార్టీ సమస్య' కాదు గానీ, వీరి వల్ల ప్రమాదం అన్ని రకాల ప్రగతిశీల శక్తులకూ ఉంటుంది. తక్షణ ప్రమాదం సంగతి అటుంచి ఇటువంటి సృష్టే ప్రజాస్వామ్యాన్నీ నాగరికతనూ అపహాస్యం చేస్తుంది. అవి నాశనం కాకూడదని నమ్మే వాళ్లందరూ ఇప్పటి నుండే ఈ కిరాయి ముఠాల సృష్టికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడడం అవసరం.

సెప్టెంబర్ 3, 2000

# సమాధానాలు లేని ఉక్రోషం

నక్సలిజం బూచికాదుగానీ దానినొక బూచిగా వాడుకోవడం మన పాలకులకు అలవాటే. మామూలుగా నక్సలైట్ ఉద్యమం ప్రభావం ఉన్న ప్రాంతాలలో ప్రజలను బెదరగొట్టడానికి ఆ బూచిని ప్రయోగిస్తుంటారు. ఏ విషయాన్ని గురించి ప్రజలు కొంచెం ఆందోళన చేసినా 'దీని వెనక నక్సలైట్లు ఉన్నారు' అంటూ బెదిరించి ప్రజల నోళ్లు మూయిస్తుంటారు.

ఇది పాతసంగతే. కానీ ఆ బూచిని కాంగ్రెస్ పార్టీ మీద కూడ చంద్రబాబు ప్రయోగించడం కొత్త విషయం. అయితే దీనిని అతని తెలివితేటలకు సంకేతంగా కాక అతని విద్యుత్ 'సంస్కరణ'ల దివాలా కోరుతనానికి చిహ్నంగా గుర్తించడం ఉచితంగా ఉంటుంది. ఏ ప్రశ్నకూ జవాబు లేని చంద్రబాబుకు 'మీరు తీవ్రవాదులతో చేతులు కలుపుతున్నారు' అనేది అన్ని ప్రశ్నలకూ జవాబు అయింది.

కలిపితే కలుపుతారు. 'తీవ్రవాదం' అని పిలవబడేది ఒక రాజకీయ పంథా కాబట్టి ఆ పంథాను అనుసరించే వారితో రాజకీయంగా సఖ్యత కలిగి ఉండడం నేరమేమీ కాదు. దానిపట్ల రాజకీయంగా అభ్యంతరముంటే ఉండవచ్చు. నిజానికి ఈ అభ్యంతరం రెండు వైపులా ఉండవచ్చు. నక్సలైట్లతో రాజకీయ సఖ్యత ఎంత పరిమితమైన పరిధిలోనయినా మంచిది కాదని కాంగ్రెస్ వారిలో కొందరు అనుకోవచ్చు. కాంగ్రెస్‌తో సఖ్యత ఎంత పరిమితమైన పరిధిలోనయినా తమకు తగినది కాదని నక్సలైట్లలో కొందరు అనుకోవచ్చు. అదొక రాజకీయ అభిప్రాయం. అయితే చంద్రబాబు ఆ బూచిని ప్రయోగిస్తున్నది ఆ అర్థంలో కాదు. 'తీవ్రవాదుల'తో చేతులు కలపడం అసాంఘికమైన నేరమైనట్లు, అపచారమయినట్టు మాట్లాడుతున్నాడు. ఇది అతను నిజంగా నమ్ముతాడని కాదు. తనకే అవసరం ఏర్పడితే నక్సలైట్లతో ఏమొచ్చె, నిజంగానే అసాంఘిక శక్తులైన వారితోనూ చేతులు కలుపుతాడు. అయితే హింసను నమ్ముకున్నవారిగా గుర్తింపు పొందిన నక్సలైట్లతో సఖ్యత మర్యాదస్తులకు తగదన్న

నిగాహ్

రాజకీయ అభిప్రాయానికి చలామణి ఉంది కాబట్టి, దానిని ముఖాముఖి ఎదుర్కొని తిప్పికొట్టడం కాంగ్రెస్ వారికి అసాధ్యం కాబట్టి, ఆ బూచిని చంద్రబాబు ప్రయోగిస్తున్నాడు.

అయితే పైన చెప్పినట్టు, ఆ దెబ్బతో అతను కాంగ్రెస్ వారిని కొంచెం ఇరకాటంలో పెట్టి ఉండవచ్చును గానీ అది అతని చాతుర్యం కన్నా బలహీనతనే సూచిస్తుంది. ఇప్పటికి వంద రోజులుగా సాగుతున్న విద్యుత్ ఛార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమం లేవదీస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ చంద్రబాబు దగ్గర జవాబు లేదు. ఇది ఎంత స్పష్టంగా ఉందంటే అతని మద్దతుదార్లు సహితం - పేర్లు చెప్పుకోవడం అనవసరం - విమర్శకులుగా ముందుకొచ్చి తమ పరువు కాపాడుకుంటున్నారు.

ఏ జవాబూ లేని ముఖ్యమంత్రికి ఈ నింద అక్కరకొచ్చింది. మామూలుగానే అభ్యర్థన కూడ బెదిరింపులాగ ధ్వనించే అతని గొంతులో ఈ నింద చాలా అభ్యంతరకరంగా ధ్వనించడంలో ఆశ్చర్యం లేదు. ఆ ఊపులో ఎక్కడ ఆగాలో కూడ తెలియకుండ, మొన్నటి పోలీసు కాల్పులలో చనిపోయిన ఒక వ్యక్తి గురించి 'అతను రౌడీ షీటర్, గూండా' అంటూ అసెంబ్లీలోనే నిందలు వేసాడు. చట్టసభలలో రాజకీయ నాయకుల వ్యవహార శైలి దిగజారుతున్నదని కొంత కాలంగా అందరం అంటూనే ఉన్నాముగానీ, పోలీసు కాల్పులలో పౌరులు చనిపోవడం పట్ల కనీసం చింత అయినా వ్యక్తం చేయకుండ చనిపోయిన వాళ్లనే 'రౌడీ'లు, 'గుండా'లు, 'తీవ్రవాదు'లు అంటూ అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడడం వట్టి దిగజారుడు కాదు, దానికి ఇంకేదైనా పేరు పెట్టవలసి ఉంది.

మొత్తంగా విద్యుత్ రేట్ల విషయంలో ప్రదర్శిస్తున్న మూర్ఖమైన వైఖరిని చంద్రబాబు పోలీసు కాల్పుల విషయంలోనూ కొనసాగిస్తున్నాడు. కనీసం న్యాయ విచారణ జరిపించాలన్న ప్రతిపక్షాల, ప్రజాసంఘాల డిమాండును అంత మొండిగా ఎందుకు తిరస్కరించాలి? ఆందోళన కారులే పోలీసులపైన మొదట రాళ్లు వేసి రెచ్చగొట్టారని అంటున్నాడు. అదే నిజమైతే న్యాయవిచారణలో ఆ సంగతే రుజువవుతుంది కదా? కాల్పుల పైన న్యాయవిచారణ అంటే కాల్పులు జరిగిన వైనం, దాని పూర్వాపరాలపైన విచారణ అనే కదా ఎప్పుడయినా అర్థం?

అభ్యంతరం ఉండనవసరం లేని విషయాలలో కూడ మొండిగా ఉండడం బలాన్ని కాదు, బలహీనతను సూచిస్తుంది. 'ప్రపంచ బ్యాంకు నమూనా సంస్కరణలు అమలు చేస్తే ప్రజాదరణ కోల్పోవలసి వస్తుందేమోనని అన్ని పార్టీల నాయకులూ భయపడుతున్న తరుణంలో 'నేను అమలు చేసి చూపిస్తా'నంటూ చంద్రబాబు బయలుదేరాడు. మొదటి

నాలుగైదడుగులు ప్రజలలో వ్యతిరేకతను ఎదుర్కోకుండానే వేసాడు. ఎన్నికలలోనూ గట్టెక్కాడు. కరువుకు తట్టుకొని నీటి రక్షణ గురించి జనాన్ని ఊదరగొట్టి ఏదో చేస్తున్నాడన్న అభిప్రాయం చాలామందిలో కల్పించగలిగాడు. కానీ విద్యుత్తుతో మొట్టమొదటగా గట్టి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు. ఇది ఒకటిరెండు నెలలలో సమసిపోయే ఆందోళనకాదు. ఎందుకంటే ప్రపంచ బ్యాంకు ఆమోద ముద్ర వేసిన విద్యుత్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక ప్రకారం, రాబోయే ఏడు సంవత్సరాలు–అంటే 2007 దాకా ప్రతీ సంవత్సరం కరెంటు ఛార్జీలు 12 శాతం చొప్పున పెరుగుతాయి. 2007 తరువాత పెరగవా అంటే ఈ ప్రణాళిక ప్రకారం అప్పటికి కరెంటు ఉత్పత్తి, సరఫరా, పంపిణీలకయ్యే ఖర్చు మొత్తం వినియోగదారులు చెల్లించే స్థితి వచ్చేస్తుంది. కాబట్టి ఆ తరువాత పనిగట్టుకొని పెంచనవసరం లేకుండా ఖర్చు పెరిగినప్పుడల్లా ఛార్జీలు పెరుగుతూనే ఉంటాయి.

ఇవన్నీ ఎవరికి తెలియకపోయినా చంద్రబాబుకు తెలుసును. ఈ ఆందోళనను ప్రజలు కొన్నాళ్లకు అలసిపోయి విరమించుకొని ఆ తరువాత మరచిపోయి ఊరుకోవడం జరగదని కూడ అతనికి తెలుసును. దీనినెదుర్కోవడానికి అతని దగ్గర ఎత్తుగడలేవీ లేవు కాబట్టే ఇంత ఉక్రోషం ప్రదర్శిస్తున్నాడు.

# రాజ్‌కుమార్ కిడ్నాప్: సుప్రీంకోర్టు నష్టం చేయకుంటే ఉద్ధరించినట్టే

వీరప్పన్ వ్యవహారం అకస్మాత్తుగా వార్తలలో వెనక్కి వెళ్లిపోయింది. నేడో రేపో రాజ్‌కుమార్ కిడ్నాప్ కథ సుఖాంతం అవుతుందనుకుంటున్న దశలో సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. పైగా, 'తొందరగా ఏదో ఒకటి తేల్చండి' అని కర్నాటక ప్రభుత్వం కోరగా, 'ముందు నువ్వు చెప్పే జవాబేదో వివరంగా చెప్పు. తేల్చేసంగతి తరువాత చూసుకుందాం' అని సుప్రీంకోర్టు జడ్జిలు అన్నారు.

కొంపలు మునిగిపోయే తొందరేమీ లేదన్నట్టు సుప్రీంకోర్టు వ్యవహరించడంతో అందరి చేతులూ కట్టేసినట్టయింది. 'నా కోరికలు తీర్చకపోతే రాజ్‌కుమార్‌ను చంపేస్తాన'ని వీరప్పన్ బెదిరించలేదు. సుప్రీంకోర్టు విడుదల మీద 'స్టే' ఇచ్చింది కాబట్టి వీరప్పన్ ఎంత అల్లరిపెట్టినా కర్నాటక ప్రభుత్వం ఏమీ చేయలేదు. ప్రభుత్వం ఏమీ చేయలేదని అలిగి వీరప్పన్ రాజ్‌కుమార్‌ను ఏమీ చేయనూ లేదు. చేస్తే తన ఆటకట్టయిపోతుంది.

రాజ్‌కుమార్ అభిమానులు అని పిలవబడే వాళ్ళకు అతనంటే నిజంగా ఎంత అభిమానం ఉందో తెలీదు కాబట్టి ఈ సందిగ్ధస్థితి ఆ అభిమానులలో ఎంతమందిని నిజంగా బాధపెడుతుందో తెలీదు. తక్కిన జనానికది వాడిపోయిన వార్త. రాజ్‌కుమార్‌కు ఆదుర్దాగానే ఉండి ఉండాలిగానీ అతను జీవితంలో ఇప్పటికి చాలా సుఖమే అనుభవించాడు కాబట్టి ఇప్పుడొక జీవితకాలం కష్టం అనుభవించినా అందులో అన్యాయమేమంత లేదని అనుకోవడం అసహజం కాదు. వీరప్పన్ తనకూ ఒక రాజకీయ ముద్ర కావాలన్న కోరికతో కాబోలు తనవారిగా ఎంచి విడుదల కోరిన తమిళ మిలిటెంట్లకూ ఆదుర్దాగానే ఉండాలిగానీ వాళ్ళివాళ బయటికి పోయినా రేపు రాజ్‌కుమార్ భద్రంగా బెంగుళూరు చేరిన తరువాత–పోలీసులు వాళ్లను తిరిగి ఇంకా

పెద్ద కేసులలో ఇరికించగలరు. 'ఎన్‌కౌంటర్' జరిగిందంటూ కాల్చిపారేయగలరు. ఆ మిలిటెంట్ సంస్థలకు తమిళనాడులో ఉన్న మద్దతు స్వల్పమే కాబట్టి ఏం జరిగినా పెద్దగా బాధపడేవారు కొద్దిమందే ఉంటారు.

మరిక ఈ ఉదంతాన్ని అందరం మరిచిపోవచ్చునా అంటే ఈ గొడవలో నిజంగా సానుభూతి చూపించగలవాళ్లు 51 మంది ఉన్నారు. వీళ్లు వీరప్పన్ ముఠా ద్వారా జరిగిన నేరాలలో ముద్దాయిలు. చాలా ఏళ్లుగా విచారణకు నోచుకోకుండా టాడా ఖైదీలుగా ఉన్నారు. వీళ్ల విడుదల వీరప్పన్ కోరిన కోరికలలో ఒకటి. సుప్రీంకోర్టు 'స్టే' చేయకపోతే ఈ పాటికి వీళ్లు విడుదల అయి ఉందురు.

వీళ్లు మైసూర్ ప్రాంత అడవులకు చెందినవారు. 'అమాయకులు' కాకపోవచ్చు. అంటే కలప దొంగ రవాణాలోనూ ఏనుగుదంతాల విక్రయంలోనూ వీరికి ప్రమేయం ఉండి ఉండవచ్చు. కాకపోయినా వీరప్పన్ ముఠాకు ఆశ్రయం, ఆహారం ఇచ్చి ఉండవచ్చు. కానీ వీరు ఏ అర్థంలోనూ టెర్రరిస్టులు కారు. అయినప్పటికీ వీరిపైన టాడా కేసులు పెట్టారు కాబట్టి కొందరు ఏడేళ్లుగా, కొందరు ఎనిమిదేళ్లుగా విచారణ లేకుండా జైలులో ఉన్నారు.

వీరిపైన కేసులు ఎత్తి వేసి సాధారణ చట్టాల కింద విచారణ జరపాలని కోరుతూ గత సంవత్సరం పియుసిఎల్ కర్నాటక హైకోర్టులో కేసువేసింది. పియుసిఎల్ జాతీయ అధ్యక్షులు కన్నాబిరాన్ ఈ కేసు స్వయంగా వాదించారు. వీరప్పన్ చేసినవి తీవ్రమైన నేరాలే కావచ్చును గాని అవి 'ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లోబరుచుకోవడం' లేక 'సమాజంలో ఒక వర్గాన్ని భయోత్పాతానికి గురి చేయడం' అనే నిర్వచనం కిందికి రావు కాబట్టి వాటికి టాడా వర్తించదని ఆయన వాదించారు. రాజీవ్‌గాంధీ హత్య చాలా క్రూరమైన నేరమే అయినప్పటికీ అది 'టెర్రరిస్టు' నేరం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని-అందుకోసం సుప్రీంకోర్టు ప్రయోగించిన వాదననూ ఆయన ఆధారం చేసుకొని వాదించారు. కానీ కర్నాటక హైకోర్టు ఒప్పుకోలేదు.

రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసిన తరువాత వీరప్పన్ పెట్టిన మొదటి డిమాండ్లలో ఈ ఖైదీల విడుదల ఒకటి. వారిపైన టాడా కేసులు ఎత్తివేయాలని కాదు, మొత్తంగా విడుదల చేయాలనే వీరప్పన్ డిమాండ్ చేసాడు. ఇదే ఖైదీల గురించి కర్నాటక హైకోర్టులో పియుసిఎల్ వేసిన కేసు గురించి తెలిసిన వారికి, వీరప్పన్ డిమాండ్‌ను కర్నాటక ప్రభుత్వం ఆమోదించిందని తెలియగానే ఒక ఆసక్తికరమయిన సందేహం వచ్చింది. ఈ ఖైదీలపైన కేసు పెట్టినా, అరెస్టు చేసినా, బెయిలు నిరాకరించినా వారిని వీరప్పన్ వంటి నేరస్తుల నుండి దూరం చేయడానికీ, వారిలో చట్టం పట్ల

గౌరవం పెంచడానికీ చేస్తున్నామని ప్రభుత్వమయినా కోర్టులయినా అంటుంటాయి. కానీ చట్టాన్ని ప్రమాణం చేసుకొని వాదించిన కన్నాబిరాన్ విఫలమైన చోట వీరప్పన్ ఒక సినీ హీరోను కిడ్నాప్ చేసి సాధిస్తే ఆ ఖైదీలకు చట్టం పట్ల గౌరవం పెరుగుతుందా లేక వీరప్పన్ పట్ల గౌరవం పెరుగుతుందా?

దీని అర్థం ఇప్పుడు సుప్రీంకోర్టు అంటున్నట్టు–వీరప్పన్ డిమాండ్లకు లొంగి ఉండకూడదని కాదు. చట్టాన్ని ప్రజలు గౌరవించగలిగే పరిస్థితి ఉండాలని. వీరప్పన్ చర్యలు టెర్రరిజమనే వాదన కోసం ఒప్పుకున్నా అతని గుంపులో భాగమైన ప్రతీ వ్యక్తీ, అతని గుంపుకు అన్నం పెట్టిన ప్రతీ వ్యక్తీ టెర్రరిజానికి పాల్పడినట్టేనా? ఆ విచక్షణ చట్టం పాటించినప్పుడే కదా ప్రజలకు చట్టమంటే గౌరవముంటుంది? ఒకవేళ వారు చేసినది టెర్రరిజమయితే మాత్రం ఏడెనిమిది సంవత్సరాలు బెయిలు ఇవ్వకుండ, విచారణ జరపకుండ జైలులో ఉంచడం సబబా? పోలీసులు ఆ పని చేసినా కోర్టులు వారిని చక్కదిద్దినప్పుడే కదా చట్టమంటే గౌరవం పెరుగుతుంది? 'ఒక బందిపోటును పట్టుకోవడం చేతకాకపోతే దిగిపొమ్మ'ని సుప్రీంకోర్టు కర్నాటక ముఖ్యమంత్రిపైన కోపం చేసుకుంది. ఆ కోపం చట్టాన్ని దుర్వినియోగం చేసి జనాన్ని ఏళ్లతరబడి ఊరికే జైళ్ళలో పెట్టినప్పుడు కూడా న్యాయస్థానాలు ప్రదర్శిస్తేనే కదా చట్టమంటే ప్రజలలో గౌరవం పెరుగుతుంది.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఏం చేయబోతుంది అని కొంచెం ఆదుర్దాగా ఉన్నమాట సత్యం. 'ఎవరిని కిడ్నాప్ చేసినా, చంపుతామని బెదిరించినా, ఖైదీలను విడుదల చేయడానికి వీలులేదు' అని సూత్రీకరించబోతుందా? రాజ్‌కుమార్ పోతే పోయాడు లెమ్మనుకోవచ్చు గానీ రేపింకొకరు ఒక బస్సునిండా స్కూలు పిల్లలను కిడ్నాప్ చేస్తారనుకోండి–అప్పుడు కూడ సుప్రీంకోర్టు ఇట్లాగే మాట్లాడుతుందా?

దేశాన్ని ఎట్లా పరిపాలించాలో రాజకీయ నాయకులకు నేర్పించాలని జడ్జీలు ఆరాటపడుతుంటారు. రాజకీయ జీవుల పట్ల సమాజంలో ఏవగింపు పెరిగేకొద్దీ ఈ కోరిక పెరుగుతున్నది, దానిపట్ల సమాజంలో ఆమోదం పెరుగుతున్నది. ఒక్కొక్క సందర్భంలో దీనివల్ల మేలు జరగవచ్చును గానీ మొత్తం మీద ఈ ఆరాటం ప్రమాదకరమైనది. పరిపాలనకు కొంచెం వినయం, కొంచెం లోకజ్ఞానం అవసరం. ఇవి రెండూ అతితక్కువ ఉన్న జాతి న్యాయమూర్తులు. ఎంత చెడ్డా రాజకీయనాయకులకు వాస్తవాలెక్కువ తెలుసు, వోట్ల అవసరం తీసుకొచ్చే వినయమూ వారిలో కొంచెం ఎక్కువే. కొన్ని నిర్ణయాలు వారికి వదిలేయడమే మంచిది.

అక్టోబర్ 1, 2000

# బస్తీలను తొలగించాలా అభివృద్ధి చేయాలా?

'హుసేన్ సాగర్ నాలా' పరిసర బస్తీ వాసులు మొన్నటి మంగళవారం నగరంలో తీసిన ఊరేగింపు నగరంలో నివాస హక్కుల పోరాటంలో రెండవ మైలురాయిగా చెప్పుకోవచ్చు.

మొదటిది మూసీతీర వాసులు నందనవనానికి వ్యతిరేకంగా చేసిన, చేస్తున్న ఆందోళన.

హుస్సేన్‌సాగర్ అలుగు పారిన నీటిని మూసీనదికి చేరవేసే కాలవకు ఇప్పుడు హుసేన్‌సాగర్‌నాలా అన్న పేరువచ్చింది. మొన్నటి వర్షాలలో హుసేన్‌సాగర్ నుండి విపరీతవేగంతో పొర్లివచ్చిన నీటిని ఈ 'నాలా' తనలో ఇముడ్చుకోలేక పోవడం వల్ల హైదరాబాద్ నగర మధ్య భాగంలో అనేక వాడలు జలమయం అయ్యాయి.

దీనికి కారణం 'నాలా' గట్టు కుదించుకుపోయేంతగా రెండు వైపులా కట్టడాలు తయారు కావడమేనని ప్రభుత్వం ఆనాటి నుండి అంటున్నది. అసలు హుసేన్‌సాగర్‌లోకి అంత నీరు రావడానికి తుఫానే కారణమా అన్న ప్రశ్న ప్రభుత్వం వేసుకోదు. అన్ని చెరువులకూ ఉన్నట్టే హుసేన్‌సాగర్‌కు కూడ నీటిని చేరవేసే 'కాచ్‌మెంట్' ఒకటుంది. అందులో వేరే చెరువుల అలుగులు దాటి ప్రవహించే నీటిని తీసుకొచ్చే వాగులూ వంకలూ ఉన్నాయి. ఆ చెరువుల పరిస్థితి ఏమిటి, వాటి కట్టల పరిస్థితి ఏమిటి, మొత్తంగా హుసేన్‌సాగర్ కాచ్‌మెంట్ పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నలు వేసుకోకుండా 'నాలా' గట్టు కుదించుకు పోవడమే వరదలకు కారణమని ప్రభుత్వం నిర్ధారించేసింది.

అదట్లాగుంచి, నాలా గట్టును దురాక్రమణ చేసిన కట్టడాలలో పేదల బస్తీలే కాదు, మధ్య తరగతి అపార్ట్‌మెంట్లూ ఉన్నాయి. వైస్‌రాయ్ హోటల్ వంటి ధనిక వర్గాల ఆస్తులూ ఉన్నాయి.

కాని వైస్‌రాయ్ హోటల్‌ను ఏం చేయబోరు. అపార్ట్‌మెంట్స్‌ను ఏమైనా చేయబోతారేమో తెలీదు. పేదల బస్తీలను మాత్రం 'ఏది ఏమైనా తొలగించవలసిందే'నని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అశోక్‌గజపతి రాజు ప్రకటించారు. ఆ బస్తీల ప్రజలకు నగరంలోనే ప్రత్నామ్నాయ నివాస స్థలం చూపించాలని అంటే, 'అవును రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలోనూ సెక్రటేరియట్ ఆవరణలోనూ ఖాళీ స్థలం ఉంది. అక్కడ వారికి నివాసాలు కల్పిద్దామా" అని వ్యంగ్యంగా అంటున్నారు రాజుగారు. ఇంకెక్కడా చోటు దొరకకపోతే ఆ పని కూడ చేయవచ్చును గానీ, మన పాలకులకెంత అహంకారమో చూడండి.

పునరావాసం సంగతి అటుంచి, బాధితులే ఎంత సులభంగా దోషులయిపోయారో కూడ చూడండి. వరదల వల్ల నష్టపోయింది 'నగరం'. నష్టం చేసింది కాలవ గట్టు మీదికి దురాక్రమణ చేసి ఇళ్లు కట్టుకున్న బస్తీవాసులు. వాళ్లుకూడ నష్టపోలేదా అంటే అది వారు తెలివితక్కువతనం వల్ల చేసుకున్న చేటు అంటున్నారు.

కానీ వరదలకు కారణమేదైనా– బస్తీ వాసులు అనాలోచితంగా కాలవ గట్టును కుదించి వేసే పద్ధతిలో ఆవాసాలు నిర్మించుకోవడం కూడ ఒక కారణమేనని ఒప్పుకున్నా–వరదల వల్ల ప్రధానంగా నష్టపోయిందెవరన్న ప్రశ్నకు మాత్రం రెండు జవాబులు లేవు. కానీ బస్తీవాసులకు ఆ సానుభూతి రెండు రోజులు కూడ దక్కలేదు. మూడవ రోజునుండి వాళ్లు నగర వాసుల కళ్లకు దోషులే తప్ప బాధితులుగా కనిపించడం లేదు. విజయనగరం రాజు గారి మాటలలో, వారిని 'ఏది ఏమైనా అక్కడి నుండి తొలగించవలసిందే'!

ఎక్కడికి? మూసీ బస్తీలను 1998 నాటి వరదలప్పుడు తరలించిన కర్మన్‌ఘాట్‌లో ఇంకా చోటుందనీ వీరిని కూడ అక్కడికి తరలించవచ్చుననీ మొదట నగర పాలకులు ప్రకటించారు. నగరానికి 15–20 కిలోమీటర్ల దూరంలో కర్మన్‌ఘాట్ వంటి వివాదగ్రస్తమైన సీలింగ్ భూములు ఇంకా కూడ ఉంటాయి కాబట్టి వారిని ఈ కర్మన్ ఘాట్‌కు కాకపోతే ఇంకొక కర్మన్‌ఘాట్‌కు తరలించగలరు.

'మేము ఆటోడ్రైవర్లం. ఇళ్లలో అంట్లుతోమే పని మనుషులం. రోడ్లు ఊడ్చే కార్పొరేషన్ స్వీపర్లం. మెకానిక్కులం. ప్రభుత్వ కార్యాలయాలలో నాలుగవ తరగతి ఉద్యోగులం. మమ్మల్ని నగరం నుండి వెలివేయడం మాకే కాదు, నగరానికి కూడ మంచిది కాదు' అని హుసేన్‌సాగర్ నాలా బస్తీవాసులు మొన్న ఇచ్చిన నినాదం నగర పాలకుల చెవిన పడిందో లేదో గానీ ఆ ప్రజలను దోషులుగా (పోనీ, వట్టి దోషులుగా) కాక బాధితులుగా చూడగలిగితే ఈ విషయం వాళ్లు చెప్పకుండానే అర్థం కాగలదు.

బస్తీలకు ('స్లమ్స్') సంబంధించిన ఒక కొత్త జాతీయ విధానాన్ని ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే ఒక ముసాయిదా పత్రాన్ని రూపొందించింది. అందులో బస్తీ నిర్వచనాన్నే సాధారణ పాలనాయంత్రాంగం దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకంగా ప్రతిపాదించారు. ప్రజలు అక్రమంగా ఆవాసాలు నిర్మించుకున్న స్థలం అని కాక, ప్రభుత్వం రోడ్లు నీళ్లు స్కూళ్ళవంటి కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమైన స్థలం అని నిర్వచించారు. నిర్వచనం మారితే దానిని మనం చూసే పద్ధతే మారిపోతుంది. నగర పాలకులు బస్తీలను చూడగానే ఎప్పుడు తొలగించాలా అని ఆలోచించే బదులు వాటిని ఏ విధంగా మెరుగుపరచాలని ఆలోచించాలని అన్నారు.

భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూలులో మునిసిపాలిటీలకున్న అధికారాలను క్రోడీకరించిన చోట కూడా 'బస్తీల అభివృద్ధి' అనే కర్తవ్యం ఉందే తప్ప బస్తీల నిర్మూలనం అనేది లేదు.

బస్తీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ముసాయిదా విధాన పత్రం మీద చర్చ ఇంకా ఎక్కడా జరగలేదు. సాధారణ పాలనా యంత్రాంగం వైఖరికన్న అందులోని వైఖరి మెరుగే అయినప్పటికీ లోపాలు కూడ ఉన్నాయని నివాస హక్కుల ఉద్యమకారులంటున్నారు. ఏమైతేనేం, దానిపైన చర్చ జరగాలి, ఒక ప్రజాస్వామికమైన విధాన రూపకల్పన జరగాలి.

అంతవరకు ఎక్కడా బస్తీల తొలగింపు, నిర్మూలనం జరగకూడదనీ, బస్తీలను 'నగరం' సమస్యగా కాక, బస్తీ వాసుల సమస్యగా గుర్తించి వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇచ్చి ఆలోచించడం అలవరచుకోవాలనీ మనమెందుకు డిమాండ్ చేయకూడదు?

# మనుషులు లేని 'పర్యావరణం'

పర్యావరణాన్ని ప్రజల కోసం కాపాడాలనుకునేవారు, పర్యావరణాన్ని ప్రజలనుండి కాపాడాలనుకునే వారు అని పర్యావరణ ఉద్యమకారులలో రెండు రకాలు. ప్రజల కోసమే కాపాడాలనుకున్న పర్యావరణాన్ని తెలిసో తెలియకో ధ్వంసం చేసే చర్యల గురించి ప్రజలకు హితవు చెప్పవలసిన అవసరం రావచ్చు. అది వేరే సంగతి. కానీ పర్యావరణాన్ని ప్రజల కోసం కాక ప్రజలనుండి కాపాడాలనుకునే వారికి ప్రజలు వట్టి 'న్యూసెన్స్'గా మాత్రమే కనిపిస్తారు.

అటువంటి 'పర్యావరణ ఉద్యమకారులు' కోర్టుకెక్కడం, పార్కులనూ రోడ్లనూ గాలినీ వెల్తురునూ మురికివాడల ప్రజలనుండి కాపాడమని 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం' నడపడం, కోర్టులు అదే ధోరణితో స్పందించి తీర్పులివ్వడం ఈ మధ్య బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ జరిగింది. ఉద్యమాలూ న్యాయస్థానాలూ ప్రజాస్వామ్యంలో భాగం కాబట్టి ఈ పెడధోరణుల గురించి మాట్లాడుకోవడం అవసరం. మనుషుల బాగోగులకంటే వేరే ఏది ముఖ్యమన్నా అనుమానించవలసిందే. అందమయిన నగరాలు, విదేశీ పర్యాటకుల మెప్పుపొందే నగర అభివృద్ధి ఇందుకు మినహాయింపు కాదు. కానీ పర్యావరణ పరిరక్షణను ఈ కళ్లతో చూసే ఉద్యమకారులూ ఉన్నారు. న్యాయమూర్తులూ ఉన్నారు. సుప్రీంకోర్టయితే ఈ మధ్య ఒక తీర్పులో 'అక్రమ చొరబాటుదారులకు' (గుడిసె వాసులకిదొక అందహీనమైన పేరు) పునరావాసం కల్పించడమంటే జేబు దొంగలను సత్కరించడమేనని౦ది.

బొంబాయి మహానగరం వెలుపల సంజయ్‌గాంధీ జాతీయ ఉద్యానవనం అనే 117 చ.కి.మీల వైశాల్యం గల అడవిలాంటిది ఉంది. అందులో ఒకటి రెండు పులులూ, సింహాలూ కూడ ఉన్నాయంట. ఊపిరాడని బొంబాయినగర వాసులకు అక్కడ అప్పుడప్పుడు 'సఫారీలు' ఏర్పాటు చేస్తారు.

అంతవరకు అభ్యంతరం లేదు. కానీ ఆ నగరంలో నిలువనీడ లేని పేదలు ఆ అభయారణ్యం అంచులో గుడిసెలు వేసుకోసాగారు. వాళ్లు 'జేబు దొంగలు' కాదు.

(జేబు దొంగలకు మాత్రం ఒక గూడు అక్కర లేదా అన్నది వేరే ప్రశ్న) బొంబాయిని ఒక మహానగరంగా తయారు చేసిన శ్రామికులు, అదొక నగరంగా మనగలగడానికి శ్రమ చేస్తున్న శ్రామికులు, ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లు, ఆటోలు నడిపేవాళ్లు, అంట్లుతోమేవాళ్లు, ఇల్లు కట్టే వాళ్లు, ఇళ్లు ఊడ్చేవాళ్లు.

కాలక్రమంలో దాదాపు 4 లక్షల జనాభా అక్కడ చేరారు. గుడిసెలు వేసుకున్నారు. రోడ్లూ, నీళ్లూ, కరెంటూ, స్కూళ్లూ అడిగారు. కొంత పొందారు. 117 చ.కి.మీ.ల విస్తీర్ణంలో 1.7 చ.కి.మీ.లు (మాత్రమే) వారి పాలయ్యాయనేది ప్రభుత్వ అంచనాయే.

వీరి ఉనికి వల్ల సఫారీ సౌందర్యం దెబ్బ తినిందో ఏమో, బొంబాయిలోని ఒక పర్యావరణ సంస్థ వారందరినీ అక్కడి నుండి తొలగించాలంటూ హైకోర్టులో 'ప్రజాప్రయోజన వ్యాజ్యం' వేసింది. ఆ గుడిసెవాసులే తమకందరికీ శాశ్వతంగా పట్టాలివ్వాలని అదే కోర్టులో కేసువేసి ఉంటే, అది ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమనీ అందులో కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ విచక్షణాయుతమైన పాలనా నిర్వహణకూ చట్టాన్ని అమలు చేయించే న్యాయస్థానాల విధులకూ మధ్య కచ్చితమైన విభజనరేఖ ఉందనీ దానిని అతిక్రమించడం ప్రజాస్వామ్యానికి అపచారమనీ ఆ కోర్టు అని ఉండేదనడానికి సందేహించనక్కరలేదు.

కానీ వాళ్లను తొలగించడం మాత్రం ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమని బొంబాయి హైకోర్టు అనుకోలేదు. వారినందరినీ-దాదాపు 4 లక్షల మందిని- నిర్ణీత గడువులోపల తొలగించమని ప్రభుత్వానికి ఆదేశం ఇచ్చింది. వారికి పునరావాసం కల్పించడానికి చోటు కోసం వెతుకుతున్నామని ప్రభుత్వం కొంచెం మొహమాటపడుతూ విన్నవించుకోగా, 'వారి గెంటివేత అప్పటిదాకా ఆగనక్కరలేదు. ముందు ఆ చొరబాటుదారులను అక్కడి నుండి తొలగించి ఆ తరువాత వారికెక్కడ జాగా చూపిస్తారో ఆలోచించుకోండి' అనింది. వారిని తొలగించడానికి పోలీసు బలగాలు చాలకపోతే సైన్యాన్ని ప్రయోగించమనింది. ఏ విధంగా తొలగించాలో ఎంత కాలం లోపల తొలగించాలో వివరిస్తూ ఒక ప్రణాళిక తయారు చేసి తన తీర్పులో భాగంగా జారీ చేసింది.

కేసు వేసిన 'పర్యావరణ వాదులు' సహితం ఇంత గొప్ప తీర్పు వస్తుందని ఆశించి ఉండరు.

ఢిల్లీలోనయితే ఇటువంటి పని సుప్రీంకోర్టే చేసింది. ఆ నగరంలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నమాట వాస్తవమే. అది ప్రజలందరి ఆయురారోగ్యాలకు హానికరమన్నది కూడ వాస్తవమే. అయితే అందుకోసం సుప్రీంకోర్టు వెనకా ముందూ చూడకుండా

జారీ చేస్తున్న ఆర్డర్లే చాలా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రత్యామ్నాయం గురించి ఏమీ ఆలోచించకుండ, పాతబడిన సిటీ బస్సులన్నిటినీ రేపు పొద్దున్నే షెడ్లలోకి పంపించేయాలని ఒక రోజు ఆర్డర్ జారీ చేసింది. అసలే రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న దేశ రాజధాని ప్రజలు ఆ తరువాత అనుభవించిన యాతన వర్ణనాతీతం.

ఆపైన మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి స్పందిస్తూ, నగరం మధ్యలో ఉన్న ఫ్యాక్టరీలన్నీ తక్షణం నగరం నుండి బయటకు వెళ్లిపోవాలని సుప్రీంకోర్టు ఆర్డర్ జారీ చేసింది. అది ఆర్థికంగా సాధ్యం కాని యాజమాన్యాలు ఫ్యాక్టరీలను మూసేయాలని ఆదేశించింది. డజన్ల సంఖ్యలో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు నిరుద్యోగులయ్యారు. అంతకు ముందెన్నడూ జరుగని విధంగా ఢిల్లీ నగర వీధులలో సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ధర్నాలు, ఊరేగింపులు జరిగాయి.

నిజానికి ఈ రెండు ఆదేశాలూ తక్షణమే అమలు కావాలన్న పద్ధతిలో కాకుండ ప్రజల కష్టనష్టాలను లెక్కలోకి తీసుకొని ఒక టైం టేబుల్ ప్రకారం అమలు కావాలని సుప్రీంకోర్టు అని ఉండవచ్చు. కానీ మనుషుల బాగోగుల కంటే 'పర్యావరణం' ముఖ్యమయిపోయినప్పుడు అటువంటి ఆలోచనలు రావు. అసలు పర్యావరణాన్ని మనుషుల అవసరాల నుండి వేరు చేసి చూడడంలోనే తప్పుంది. ఆ అవసరాల వల్ల పర్యావరణానికి హాని ఉండనే ఉండదని కాదు. ఒక్కొకసారి ఉంటుంది. ఒక్కొకసారి తీవ్రంగానూ ఉంటుంది. అయినప్పటికీ ఆ అవసరాలనుండి వేరుచేసి 'పర్యావరణాన్ని' అమానవీయంగా నిర్వచించుకొని కాపాడాలనుకోవడం అమానుషమైన ఆదేశాలకు దారి తీస్తుంది.

అక్టోబర్ ౨౨, ౨౦౦౦

# అక్కరకు రాని పంట బీమా పథకం

వేరుశెనగ పంట మూడవవంతు ధ్వంసమయిన అనంతపురం జిల్లాలో ఇప్పటికి 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని పత్రికలు చెప్తున్నాయి.

వర్షాలు ఎన్నడూ లేనంత బాగా కురిసిన ఈ సంవత్సరం, ఎవరికీ అంతుచిక్కని పురుగు పంటను నాశనం చేయడం వేరుశెనగ రైతులకు ఒక షాక్ అయితే, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలు రెండవ షాక్.

అయితే మూడవది ముందుంది. ఇది పంటబీమా పేరు మీద జరుగనున్న ప్రహసనం. దేశంలో ఒక పంట బీమా పథకం ఉందని అందరికీ తెలుసునుగానీ దాని స్వరూపమేమిటో చాలా మందికి తెలీదు. దాని పేరు బీమా పథకం కాబట్టి రైతులకు దాని వలన ఎంతో కొంత ప్రయోజనం వస్తుండవచ్చుననే అందరూ అనుకుంటారు బహుశా. నిత్యక్షామపీడిత ప్రాంతాల రైతులు ఈ పథకం కింద ప్రీమియం చెల్లించుకుంటారే తప్ప ప్రతిఫలం పొందేదేమీ ఉండకపోవచ్చునని చెప్పినా, నిరుటి దాకా ఒకవేళ కొంచెం ప్రయోజనం పొంది ఉన్నా ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయం వల్ల ఆ మాత్రం కూడా దక్కదని చెప్పినా 'మరీ ఇంత అన్యాయం ఉంటుందా' అని ఆశ్చర్యపోవచ్చు. కానీ ఈ మాటలలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

మొదటి విషయమేమిటంటే 'రాష్ట్రీయ కృషి బీమాయోజన' అని పిలువబడే ఈ పథకం పంట బీమా పథకం కాదు, పంటరుణాల బీమా పథకం. అంటే ఈ పథకం 'ఇన్‌ష్యూర్' చేసేది రైతువేసే పంటను కాదు. పంట వేయడం కోసం రైతు ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుండి తీసుకునే రుణాన్ని.

తన ద్రవ్య సంస్థలను కాపాడుకోవడం ప్రభుత్వం లక్ష్యం కాబట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం రైతులకు వాళ్ల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా 'కంపల్సరీ' చేసింది.

పంట నష్టాలు తరచుగా జరిగే ప్రాంతాలుగా గుర్తించబడిన ప్రాంతాలలో (నోటిఫైడ్ 'ఏరియా'లలో, తరచుగా నష్టాలకు గురయ్యే పంటలుగా గుర్తించబడిన పంటలు (నోటిఫైడ్ క్రాప్స్) పండించే రైతులు ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుండి రుణం తీసుకున్నట్టయితే ఆ రుణానికి తప్పనిసరిగా బీమా చేయవలసిందే.

రైతులు బీమా తప్పనిసరిగా చేయవలసిందే గానీ ఆ బీమా పథకం రూపురేఖలు, నియమాలు ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయిస్తుంది. రైతులకు నిర్ణయాధికారమే కాదు, సమాచారం కూడ ఉండదు. వేరుశెనగ పంటకు ప్రీమియం 10 వేల రుణానికి నిరుడు 100 రూపాయలుండింది. ఈ సంవత్సరం ఎవ్వరికీ ఏమీ చెప్పకుండ అడగకుండ దానిని 350 రూపాయలకు పెంచారు. 'ఇష్టం లేకపోతే కట్టొద్దు' అనడానికిది స్వచ్ఛందంగా రైతులు చేరే బీమా పథకం కాదని పైన చెప్పాను.

రైతులు ఏకారణంగానయినా పంటనష్టపోతే బీమా పథకం కింద వారికి నష్టపరిహారం లభిస్తుందని మనం అనుకుంటాము. కానీ ఈ పథకం స్వభావం ఎట్లాంటిదంటే, అది ప్రతీ సంవత్సరం వచ్చే నష్టానికి ఏ నష్టపరిహారమూ ఇవ్వదు, అప్పుడప్పుడు వచ్చే నష్టానికి మాత్రమే ఇస్తుంది. అంటే ఇది అనంతపురం, మహబూబ్‌నగర్ వంటి నిరంతర కరువు ప్రాంతాలకు పనికొచ్చే పథకం కాదు. సాధారణంగా మంచి పంటలు పండుతూ, ఎప్పుడయినా సైక్లోన్ వల్లనో ఇంక దేని వల్లనో పంటనష్టపోయే ప్రాంతాలకు పనికొచ్చే పథకం. ప్రీమియం మాత్రం కరువు ప్రాంతాల రైతులు అందరూ కట్టవలసిందే. వారు కట్టే ప్రీమియం ఇన్‌ష్యూరెన్స్ రూపంలో వారికి తిరిగి రాదు. ఇతర కారణాలవల్ల కాకతాళీయంగా ఆ సంవత్సరం పంట నష్టపోయిన సుభిక్ష ప్రాంతాలకు తరలిపోతుంది. ఇంతకంటే వికృతమైన సాంఘిక న్యాయం ఉండజాలదు.

పంట నష్టానికిచ్చే నిర్వచనంలోనే సమస్యంతా ఉంది. ఆ ప్రాంతంలో కురిసే సగటు వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఉండే నేలలు ఇచ్చే సగటు ఉత్పత్తిని (విపరీతమైన వర్షాభావంగానీ అకాల వర్షాలుగానీ విత్తనాల వైఫల్యం గానీ అసాధారణమైన పురుగు దెబ్బగానీ లేని పరిస్థితిలో ఇచ్చే ఉత్పత్తిని) ప్రమాణంగా తీసుకొని, అంతకంటే తక్కువ పండినట్టయితే ఆ తగ్గుదల మేరకు నష్టపరిహారం ఇచ్చే బీమా పథకం అన్ని ప్రాంతాలకూ ఒకే రకంగా న్యాయం చేయగలగుతుంది. కానీ ప్రస్తుతమున్న రాష్ట్రీయ కృషి బీమా పథకం ఇచ్చే నిర్వచనం అది కాదు.

'శెనక్కాయ'నే ఉదాహరణగా తీసుకున్నట్టయితే, ఆ మండలంలో గడచిన అయిదు సంవత్సరాలలో పండిన సగటు పంటలో 80 శాతం కంటె తక్కువ పండినట్టయితే,

ఆ తక్కువకు నష్టపరిహారం ఇస్తుంది ఈ పథకం. రెండేళ్లకొకసారి కరువు వచ్చే ప్రాంతాలలో 'గడచిన అయిదు సంవత్సరాల సగటు' అనేదే చాలా తక్కువ ఉంటుంది కాబట్టి అందులో 80 శాతం కంటె తక్కువ పండితేనే బీమా పైసలు వస్తాయనడంలో బొత్తిగా అర్థం లేదు.

గత సంవత్సరం రాష్ట్రమంతటా కరవు తీవ్రంగా ఉండిందని అందరికీ జ్ఞాపకం ఉండే ఉంటుంది. అయినప్పటికీ అనంతపురం జిల్లాలో నాలుగు మండలాలలో రైతులకు ఈ బీమా పథకం కింద దాదాపు ఏమీ రాలేదు. ఎందుకంటే ఆ నాలుగు మండలాలలో అంతకుముందు అయిదేళ్ల పరిస్థితి కూడ ఆ సంవత్సరం కంటె మెరుగుగా లేదు కాబట్టి.

అనంతపురం రైతుల విషాదగాథ అక్కడితో అయిపోలేదు. కరువు కాలంలో బీమా పథకం వారిని ఆదుకోలేదు గానీ నిరుడు వచ్చిన కరువు నుండి ప్రభుత్వం ఒక 'గుణపాఠం' తీసుకుంది. పంటల దిగుబడి ఇంత హీనంగా పడిపోగల ప్రాంతాలలో 'గడచిన అయిదు సంవత్సరాల దిగుబడిలో 80 శాతం' అనే ప్రమాణం పెట్టుకున్నా తన బీమా పథకానికి నష్టమొచ్చే ప్రమాదం ఉందని భావించి, ఈ సంవత్సరం నుండి వేరుశనగకు సంబంధించిన ప్రమాణాన్ని 'గడచిన అయిదు సంవత్సరాల సగటు దిగుబడిలో 60 శాతం'కు తగ్గించింది. అంటే పురుగు తిని పోయిన అనంతపురం రైతు శెనక్కాయ పంట గడచిన అయిదు సంవత్సరాల సగటు పంటలో 60 శాతం కంటే తక్కువ ఉన్నట్లయితేనే ఆ 60 శాతం కంటే తక్కువ పండిన మేరకు నష్టపరిహారం బీమా పథకం కింద లభించబోతుంది.

అనాలోచితమైన ఈ మార్పు చేసే ముందు ప్రభుత్వం వైపు నుండి ఒక ప్రకటనగానీ సూచనగానీ లేదు. సంప్రదింపు అసలే లేదు. 'వృధాగా ప్రీమియం చెల్లించి మా కడుపులు మాడ్చుకొని వేరే ప్రాంతాల రైతులకు బీమా మేమెందుకు ఇవ్వాలి? మా ప్రీమియం మాకు వెనక్కిచ్చేయండి. మీకూ మీ బీమా పథకానికీ ఒక దండం' అని అనంతపురం రైతులు ఆందోళన చేయాలేమో!

# ఎవరు చూడొచ్చారులే!

**వా**ళ్లకు కనిపించదు కాబట్టి ఏమీ తెలియదనుకుంటున్నారో,

లేకపోతే సకలేంద్రియాలూ ఉన్నవాళ్లను మోసం చేసి సాగించుకోగా లేనిది గుడ్డివాళ్లొక లెక్కా అనుకుంటున్నారో తెలియదుగానీ-

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఒకటి, పార్లమెంటు చేసిన చట్టమొకటి ఉంటూండగా మన రాష్ట్రంలో కంటిచూపు లేని వారికి ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయం మాత్రం చాలా బాధాకరమైనది.

అంగవైకల్యంలో స్థూలంగా మూడు రకాలను చట్టాలు గుర్తిస్తున్నాయి. మామూలు పరిభాషలో చెప్పాలంటే గుడ్డి, చెవుడు, కుంటి - మూడు రకాల వైకల్యం గల వారికీ కలిపి 3 శాతం రిజర్వేషను ఉద్యోగ రంగంలో 1966 నుండి మన రాష్ట్రంలో ఉంది. కానీ స్థూలంగా చేసే ఏ వర్గీకరణ అయినా తన లోపల అసమానతలను దాచిపెడుతుంది. 'వికలాంగులు' అనే వర్గీకరణ కూడ మూడు వర్గాల పేరు మీద ఒక వర్గానికే-కాళ్లు చేతులు అనే అంగాలలో వైకల్యం ఉన్నవారికే-ఎక్కువ ప్రయోజనాలు కల్పించింది.

ఇది గమనించి కాబోలు 1988లో కేంద్ర ప్రభుత్వం ఆ 3 శాతాన్ని మూడు వర్గాలకు సమానంగా పంచాలని సూచించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ఆ సూచనను ఆమోదించి ఆ మేరకు 1991లో జివో జారీ చేసింది. ఒక్కొక్క రకమైన అంగవైకల్యం వల్ల కొన్ని పనులు చేయడం అసాధ్యం అవుతుంది కాబట్టి అటువంటి ఉద్యోగాలకు మాత్రం ఈ వర్గీకరణ వర్తించదని చెప్పారు. ఒక్కొక్క ప్రభుత్వ శాఖ ఏ రకమైన పనులు ఏ కోవకు చెందిన వికలాంగులకు ఇవ్వడం సాధ్యపడదో తెలియజేస్తే, రాష్ట్ర ప్రభుత్వం నియమించే ఒక 'ఇంటర్ డిపార్ట్‌మెంటల్' కమిటీ ఆ అభిప్రాయాన్ని పరిశీలించి సంపూర్ణంగా గానీ పాక్షికంగా గానీ మినహాయింపు ఇస్తుందని జివోలో పేర్కొన్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే అటువంటి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ ఒకటి ఈ తొమ్మిదేళ్లలో ఏర్పడిన దాఖలాలు లేవు. కంటిచూపులేనివారు, చెవులు వినిపించనివారు, చేతులు, కాళ్లు లేని అవిటివారు చేయలేని పనులు ఫలాన అని ఏ ప్రభుత్వ శాఖ జాబితా తయారుచేయలేదు. అటువంటిదాన్ని తయారు చేయడం, ప్రకటించడం అవసరం. ఎందుకంటే అన్ని అంగాలూ సరిగ్గా ఉన్నవారు వికలాంగులు చేయగల పనులేవి, చేయలేని పనులేవి అనేది వాస్తవికంగా నిర్ణయించగలరనుకోవడం భ్రమ. అన్నీ ఉండి తాము అన్ని పనులూ ఇంత అస్తవ్యస్తంగా చేస్తున్నప్పుడు లేనివారేం చేస్తారు లెమ్మనుకుంటారు. అందువల్ల వారి అభిప్రాయాన్ని ప్రకటించడం, వికలాంగులు దానికి జవాబు చెప్పడం, ఆ అభిప్రాయాలను సవరించడం అవసరం. ఆ విధంగానే వికలాంగులయినవారు నిజంగా చేయలేని పనులేవి–లేదా ఏ పని ఏమేరకు చేయలేరు–అనేది తేలుతుంది.

మన ప్రభుత్వ శాఖలు ఆ పనిచేయవు. తమ అభిప్రాయాన్ని మనసులలో దాచుకొని, ఉద్యోగాల కోసం ప్రకటనలిచ్చినప్పుడు మాత్రం ఆ అభిప్రాయాల ప్రకారం రిజర్వేషన్లు నిరాకరిస్తుంటారు. ఇది మౌనంగా జరిగిపోతుంది. ఉదాహరణకు ఈ సంవత్సరం అధ్యాపకుల ఎంపికలో కంటి చూపులేని వారు చదువు చెప్పలేరని కంటి చూపు ఉన్నవాళ్లు నిర్ణయించి, వాళ్లకు ఇయ్యవలసిన మూడవ వంతు ఇవ్వలేదు. ఇది అన్యాయమని కోర్టుకు పోతే జడ్జిల అభిప్రాయం కూడా అదే కాబట్టి 'చూద్దాం లెండి' అని పక్కన పెడుతున్నారు. 'గుడ్డివాళ్లు చదువు చెప్పగలరా!' అని రేపు వాళ్లు ప్రభుత్వాన్ని అడగబోతారు. సర్వజ్ఞులయిన ఐఏఎస్ అధికార్లు ఏయే చదువులు వాళ్లు చెప్పలేరో నిర్ణయిస్తారు. ఆ నిర్ణయం అసంబద్ధమని కళ్లులేని వాళ్ల తరఫున ఫీజు కోసం వాదించే కళ్లున్న లాయర్లు రుజువు చేయాలి. ఇదంతా గడిచి ఏ అయిదేళ్ల తరువాతో ఒక తీర్పు వచ్చేసరికి ఇంక ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలుండవు. ప్రైవేట్ రంగం ఏ వికలాంగులకూ ఉద్యోగాలివ్వదు.

సామాజిక న్యాయం కోసం చేసే ఏ చట్టాలూ ఎందుకు అమలు కావని చాలా మంది అడుగుతుంటారు. వాటికి ఎవరో స్వార్థపరులు అడ్డంపడనవసరం లేదు. వాటిని అమలు చేయవలసిన వారే వాటిని న్యాయమైనవిగా అనుకోరు. వోట్ల కోసమో, తప్పుడు ఔదార్యం వల్లనో, గురి తప్పిన కారుణ్యంవల్లనో ఉనికిలోకి వచ్చిన తెలివితక్కువ నియమాలుగా వాటిని భావిస్తారు.

చట్టాలను, పాలనా విధానాలను అమలు చేసేవారు కుంటివాళ్లు కారు, గుడ్డివాళ్లు కారు, మాలవాళ్లు కారు, మాదిగవాళ్లు కారు, ఆడవాళ్లు కారు, ఆదివాసీలు కారు, ఆకలెరిగిన వారు కాదు. ఒకవేళ ఎప్పుడైనా అయినా ఇప్పుడా విషయం జ్ఞాపకం

ఉన్న వారు కారు. కానీ వారే ఈ సమాజానికి సంబంధించిన 'ప్రధాన స్రవంతి'. దీనికి వెలుపల ఉండే వాళ్ల ఒత్తిడి వల్ల 'సామాజిక న్యాయం' అనే భావన, దానికి సంబంధించిన చట్టాలు ఉనికిలోకి వచ్చినా ఆ భావన పట్ల ఏమాత్రం సానుభూతి లేనివారు వాటిని అమలు చేయాలి కాబట్టి అవి అమలు కావడం సులభం కాదు. చట్టాలను అమలు చేయని అధికార్లను నియంత్రించవలసిన న్యాయస్థానాలలో ఆసీనులయిన న్యాయమూర్తులు కూడ అదే ప్రధాన స్రవంతికి చెందిన వారు కాబట్టి ఒక కాంట్రాక్టరుకు టెండర్ నోటిఫికేషన్‌లో అన్యాయం జరిగిందంటే గంటల తరబడి వాదనలు విని అర్జెంట్‌గా ఆర్డర్లు జారీ చేసే న్యాయమూర్తులు గుడ్డివాళ్లు కోర్టుకొచ్చి ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ తమకు అన్యాయం చేసిందంటే వంకరనవ్వు నవ్వి చూద్దాం లెమ్మంటారు.

ఈ వంకర నవ్వు నవ్వేవాళ్లు–జడ్జిలు, ఐఎఎస్ అధికారులు, ఇతర పెద్దమనుషులు–తాము అన్యాయం చేస్తున్నామనుకోరు సరికదా, పాక్షిక ప్రయోజనాల దాడి నుండి సార్వత్రిక ప్రయోజనాలను కాపాడుతున్నామనుకుంటారు. ఇవ్వాల్టి పరిభాషలో చెప్పాలంటే దారితప్పిన ఔదార్యం నుండి 'అభివృద్ధి'ని కాపాడుతున్నామనుకుంటారు. 'ఔదార్యం' అనేది హక్కులను ఇచ్చేవాళ్ల కోణం నుండి చూసే మాట అనిగానీ, అది చట్టం రూపం తీసుకునిందంటేనే దానిని 'అభివృద్ధి'లో అంతర్భాగంగా నిర్వచిస్తున్నట్టని గానీ వారు భావించరు.

అందువల్ల చట్టాలలోని హక్కులనేకం ఆచరణలో భాగం కావు. కాకుండ చేసిన వారికి ఏ శిక్షాలేనంత కాలం–ఏ కష్టమూ రానంతకాలం–ఈ పరిస్థితి మారదు. 'సంక్షేమ చట్టాలు' 'సామాజిక న్యాయ విధానాలు' అని పిలవబడే హక్కులను తెలిసీ అమలు చేయని అధికారులకు ఏ నష్టమూ జరగదు. దానిని కనీసం 'మిస్‌కాండక్ట్'గా గుర్తిస్తేనయినా కొంత ఒళ్లు దగ్గర పెట్టుకొని వ్యవహరించే వారేమో గానీ వందరూపాయలు లంచం తీసుకున్న అధికారికి వచ్చే ఇబ్బంది సహితం జీవితాంతం రిజర్వేషన్లు అమలుచేయని అధికారికి రాదు. తన డిపార్ట్‌మెంట్‌లో 'క్లాస్ ఫోర్' ఉద్యోగులను ఏళ్లతరబడి ఎన్ఎంఆర్‌లుగా ఉంచేసిన అధికారికీ రాదు. వంద రూపాయలు లంచం తీసుకోవడం వల్ల సమాజానికి జరిగే నష్టమెంతో గానీ, వీరి వైఖరి వల్ల వేలాది మంది హక్కులుండీ లేని వారవుతారు. అయినా వీరు మాత్రం తమ పదవుల నిచ్చెన మెట్లెక్కి పైకి పోతూనే ఉంటారు. దీనికి విరుగుడు కనిపెట్టనిదే సామాజిక న్యాయం చట్టాలలోకి ఎక్కినా సామాజిక ఆచరణలో భాగం కాదు.

నవంబర్ 26, 2000

# పాత ప్రశ్నలే మరొకసారి

అక్టోబర్ 31వ తేదీ పొద్దున్న కరీంనగర్ జిల్లా కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గాదంపల్లి సమీపంలో జరిగిన 'ఎన్‌కౌంటర్' గురించి కొంచెం మాట్లాడుకోవడం అవసరం.

అది మల్హార్ మండలంగా నామాంతరం చెందిన తాడిచెర్ల మండలంలోని అటవీ ప్రాంతం. ఆ ప్రాంతాన్ని పాలనా వ్యవస్థ విడిచిపెట్టి వెళ్ళిపోయి చాలా కాలం అయింది. కావడానికి తాడిచెర్లే ఇప్పటికీ ఆ మండలానికి కేంద్రం. అయితే మంథని నుండి మహదేవ్‌పూర్ పోయే రాష్ట్ర రహదారి నుండి పక్కకు తిరిగి 6 కిలోమీటర్ల డాంబర్ రోడ్డు, 6 కిలోమీటర్ల కచ్చారోడ్డు దాటి మీరు తాడిచెర్ల చేరుకుంటే అక్కడ మీకు మండల పాలనా వ్యవస్థ ఏదీ కనిపించదు. పోలీస్‌స్టేషన్ కొయ్యూరుకు పోయింది. ఎంఆర్‌వో, ఎంపిడివో, ఎంఇవో తదితర మండల అధికార్ల కార్యాలయాలు ఉండడానికింకా అక్కడే ఉన్నాయిగానీ ఆ అధికార్ల మకాం మంథనికి తరలిపోయింది. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (గిర్దావర్) కాటారంలో ఉంటాడు. స్పెషల్ పోలీసు వ్యవస్థే తప్ప సాధారణ పోలీసు వ్యవస్థ (అంటే కోళ్ల దొంగతనాలు, సైకిళ్ళ దొంగతనాలు పరిశోధించే పోలీసు వ్యవస్థ) సహితం ఆ గ్రామాలలో లేనట్టే.

నక్సలైట్ల కిడ్నాప్ భయంవల్ల అధికారులెవ్వరూ ఆ మండల కేంద్రంలో ఉండడం లేదని ప్రభుత్వం అంటుంది. ఈ వ్యాఖ్యను ఒప్పుకుంటే 'ఇద్దరికీ మధ్య ప్రజలు నలిగిపోతున్నార'ని ఒప్పుకున్నట్టవుతుందని చెప్పి దీనిని తిరస్కరించవలసిన అవసరం లేదు. నిజాన్ని గుర్తించడం వల్ల ఎవరికి నష్టమయినా దానిని గుర్తించడమే అందరికీ మంచిది. అయితే 'అన్నల' మీద తప్పుపెట్టే అవకాశం ఉందికదా అని ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకొని చేతులు దులిపేసుకోవడాన్ని సమర్థించవలసిన అవసరం కూడా లేదు. పైన చెప్పిన 6 కిలోమీటర్ల కచ్చా రోడ్డును డాంబర్ రోడ్డుగా మార్చి, ఆ

పక్క మానేరుపైన వంతెనకట్టి తాడిచెర్లను చిన్న ఓదెల మీదుగా మంథనికి కలిపినట్టయితే, ఇదే మంథని నుండి మహదేవ్‌పూర్‌కు దగ్గరితోవ అవుతుంది. అప్పుడు ఆ రోడ్లో కావలసినంత రాకపోకలుంటాయి, పాలనా వ్యవస్థ కనీసం పగటి పూట–ధైర్యంగా తాడిచెర్లలో ఉండవచ్చు. తన పాలనను ప్రజలకు అందియ్యడం అవసరమనీ అది తన కర్తవ్యమనీ ప్రభుత్వం భావించినట్టయితే ఆ పని చేసి ఉండవచ్చు.

పోతే, ఎన్‌కౌంటర్ జరిగిన పద్ధతి గురించి ఇప్పటికే కొన్ని విషయాలు బయటికొచ్చాయి. చనిపోయిన ఏడుగురూ స్త్రీలేకావడం తొలుతే అందరి దృష్టినీ ఆకర్షించిన విషయం. అందరూ స్త్రీలే కావడానికొక కారణం ఉంది. పోలీసులు చెప్పినట్టు ఎదురు బొదురు కాల్పులు జరిగి ఉంటే స్త్రీలు మాత్రమే చనిపోవలసిన అగత్యం ఉండేది కాదు. కాని జరిగింది వేరే.

ముందు రోజు రాత్రి నుండి పీపుల్స్ వార్ దళ సభ్యులు 22 మంది అక్కడ ఉన్నారు. అందులో 13 మంది పురుషులు, 9 మంది స్త్రీలు, 'ఎన్‌కౌంటర్' జరిగినప్పుడు వాళ్లంతా ఒక చోట సమావేశమయి లేరు. వారి సమావేశం అప్పటికే జరిగిందో లేక ఇంకా జరగనుందో గానీ ఆ సమయంలో ఎవరి పనులలో వారు నిమగ్నమయి ఉన్నారు. స్త్రీలలో నలుగురు ఒక పక్క వాగు దగ్గర స్నానాలు చేస్తున్నారు. బట్టలు ఉతుక్కుంటున్నారు. తక్కిన స్త్రీలు పక్కనే అన్నాలు తింటున్నారు. వీళ్లు స్నానం చేస్తున్నందువల్లనేమో, మగవాళ్లు కొంచెం దూరాన ఉన్నారు.

ఆ సమయంలో వరంగల్ జిల్లాకు చెందిన స్పెషల్ పోలీసులు వచ్చారు. నక్సలైట్లున్న స్థలాన్ని మూడువైపుల నుండి సమీపించారు. మగవాళ్లున్న వైపు మాత్రమే తప్పించుకునే అవకాశం ఉండడం వల్ల మగవాళ్లలందరూ (కొందరు కాల్పులు జరుపుకుంటూ) తప్పించుకోగలిగారు. స్త్రీలలో ఇద్దరు కూడా అదే దిశగా తప్పించుకున్నారు (వారిద్దరూ గాయపడ్డారని వదంతి). చనిపోయిన ఏడుగురిలో నలుగురు ఒకచోటపడి ఉన్నారు, ఇద్దరు మరొకచోట,  ఒక అమ్మాయి మాత్రం కొంచెం దూరం పడి ఉన్నారు.

స్నానం చేస్తున్నవారిని లేదా స్నానం ముగించుకొని వాగు నుండి పైకి వస్తున్నవారిని–అదే స్థితిలో కాల్చిచంపారని నమ్మడానికి ఆధారాలున్నాయి. తమ బిడ్డల మృతదేహాలు చూసిన తల్లిదండ్రులు అవి 'బరిబాత' ఉన్నాయనీ 'తల్లి కడుపు నుండి ఎల్లినట్టు' ఉన్నాయనీ అన్నారు. ఒకరిద్దరు శవాలు పోస్ట్‌మార్టం అయిన తరువాత చూసారు కాబట్టి, శవపరీక్ష జరిపే డాక్టర్లు బట్టలు తీసేసారేమో అనుకోవచ్చు. కాని తాడిచెర్ల నివాసి సమ్మక్క తల్లి తన బిడ్డ మృతదేహాన్ని శవపరీక్షకు ముందే మంథని

ప్రభుత్వ ఆస్పత్రిలో చూసాననీ 'లంగా తప్ప వేరే బట్టలేవీ ఒంటి మీద లేవ'నీ స్పష్టంగా అంటున్నది. ఒంటిమీద బట్టలు లేవనగానే వారిని 'రేప్ చేసి చంపార'ని అనుమానిస్తున్నవారు లేకపోలేదు గానీ దానికిప్పటి వరకు ఆధారాలు లేవు.

మన రాష్ట్ర పోలీసు యంత్రాంగం క్రూరత్వాన్ని గురించి ఇప్పటికెన్ని కథలు విన్నామంటే ఏ కొత్త ఉదంతమూ మనకు నమ్మలేనిదిగా కనిపించదు. ఆ క్రూరత్వం మెదడునే తప్ప మనసును తాకని దశ వస్తున్నదేమో కూడ. అదే జరిగిన నాడు దాని విజయం పరిపూర్ణమయినట్టే. ఆ మధ్య ఒక ఘటనలో ఎదురుకాల్పులు జరుగుతుండగా సరండర్ అవుతామని చేతులెత్తి ముందు కొచ్చిన ఇద్దరు దళ సభ్యురాళ్లను సజీవంగా జైలుకు పంపించినందుకు కరీంనగర్ పోలీసులు తమను తాము అభినందించుకొని 'ఈ హక్కుల సంఘాల ప్రచారమెంత అబద్ధమో చూడండి' అని నిరసన వ్యక్తం చేసినట్టు జ్ఞాపకం. ఆ 'ఔదార్యం' కాకతాళీయమయినదేనని గాదంపల్లి ఘటన రుజువు చేసినట్టే భావించవచ్చు. స్త్రీలు, పురుషులు అన్న సంగతి పక్కనబెట్టి, నిస్సహాయులను ఉద్దేశ్యపూర్వకంగా కాల్చి చంపగల క్రూరత్వాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి? అటువంటి క్రూరత్వం మూర్తీభవించిన పోలీసు యంత్రాంగాన్ని తయారు చేసి అదొక గొప్ప విషయమని భావించే చంద్రబాబు రాజ్యాన్ని గురించి ఏమనుకోవాలి? అప్పటికి నిస్సహాయులైనా వారు గతంలో క్రూరంగా ప్రవర్తించిన వారయితే, తమ వారిని హతమార్చిన వారైతే, వారిని చంపడాన్ని–ఆమోదించినా ఆమోదించకున్నా–అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ స్త్రీలు అటువంటివారు కాదు. ఒకరు మూడు నెలల కింద, ఒకరు ఆరు నెలల కింద, ఒకరు తొమ్మిది నెలల కింద పీపుల్స్‌వార్‌లో చేరిన వారు. 'అందరూ అత్తింటి వేధింపులు తట్టుకోలేక అండర్‌గ్రౌండ్ పోయిన వారే'నని కరీంనగర్‌జిల్లా ఎస్‌పి గారు వెక్కిరింతగా అన్నారు కూడా. అది నిజమయితే దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్న సంగతి అటుంచి, 'అత్తింటి వేధింపులు' తట్టుకోలేక దళంలో నిన్న మొన్న చేరిన అమ్మాయిలను పట్టుకొని కాల్చి చంపిన తన సిబ్బంది గురించి ఎస్‌పిగారు ఏమంటారు?

ఇక్కడే పీపుల్స్ వార్‌కు కూడా ఒక ప్రశ్నవేయక తప్పదు. కేవలం కొన్ని నెలల కింద ఆ పార్టీలో చేరిన ఈ స్త్రీలలో కనీసం నలుగురికి అంతకు ముందు రాజకీయ అనుభవంగానీ ఉద్యమాలలో పాల్గొన్న చరిత్రగానీ లేదని ఆయా గ్రామస్థులు అంటున్నారు. వయసులోనూ వాళ్లూ చిన్నవారే. ఇటువంటి వారిని నేరుగా సాయుధ దళాలలోకి తీసుకోవడం సబబేనా? వాళ్లు ఏ కష్టాల వల్లనైనా ఆ పార్టీలోకి వచ్చి ఉండవచ్చు. కానీ మృత్యువుతో తలపడే స్థాయికి ఎదగడం అనేది ఒకటి ఉండదా?

వారే ఆ నిర్ణయం తీసుకున్నారని అనడానికి వారికి అంతటి విజ్ఞత ఉందా? చిన్న ఓదెలకు చెందిన స్వప్న 13 సంవత్సరాల అమ్మాయి. బాధ్యతాయుతమైన నిర్ణయం తీసుకునే వయసు ఆమెకు ఉండగలదా?

వివాహ సమయంలో 'ఏజ్ ఆఫ్ కన్సెంట్' అంటారు. అంటే సమ్మతించే వయసు అని అర్థం. విప్లవానికి కూడ అటువంటి వయసొకటి ఉండదా? శ్రీలంక తమిళుల శ్రేయోభిలాషుల నుండి ఎల్‌టిటిఇ ఈ ప్రశ్న కొంత కాలంగా ఎదుర్కుంటున్నది. తెలంగాణలో కూడా ముక్కుపచ్చలారని పిల్లలు సాయుధ చర్యలలో పాల్గొనడం, ప్రాణాలు తీయడం, అర్పించడం చూస్తుంటే పీపుల్స్‌వార్‌ను కూడ ఈ ప్రశ్నలు అడగక తప్పదనిపిస్తుంది.

డిసెంబర్ 10, 2000

# ఇది మనందరి సమస్య కూడ

పౌరహక్కుల సంఘం నాయకుడు పురుషోత్తంను హత్య చేసిన మాజీ నక్సలైట్లతో తమకు సంబంధం అంటగట్టడం అన్యాయమంటూ రాష్ట్ర పోలీసు యంత్రాంగం వ్యక్తం చేసిన తీవ్రమైన నిరసన తన లక్ష్యాన్ని సాధించిందా?

వాళ్లెవరో చంపితే పోలీసులను అనవసరంగా అంటున్నారు అని ప్రజలను నమ్మించగలిగిందా?

కొంతమంది నమ్మే ఉంటారు. సమాజంలోని ప్రతి నేరస్తుడి గురించీ ఎప్పటికప్పుడు తెలుసుకోవడం పోలీసు యంత్రాంగానికి సాధ్యం కాదు కాబట్టి, 'వీళ్లిట్లా తయారయ్యారని మాకు తెలీదే? ఇంక వీళ్ల ఆటలు సాగనివ్వం' అన్న డిజిపి దొరగారి ప్రకటన అబద్ధమని కొట్టిపారేయడానికి వీలులేదనే వాళ్లు ఉంటారు.

ఇది నిజమైతే అందరమూ సంతోషించే వారమే. కానీ నిజం కాదని నమ్మడానికి కనీసం మూడు కారణాలున్నాయి.

ఒకటి, పురుషోత్తం హత్యకు ముందురోజు అతని హంతకులు నయీముద్దీన్ అండ్ కంపెనీ భువనగిరిలో రోడ్డు మీద కనిపించారు. వాళ్లతో బాటు సాయుధులయిన పోలీసులున్నారు. (సరసనే ఒక టాటా సుమో జీపు కూడా కనిపించిందంటారు) అంటే పోలీసుల కళ్లు గప్పికాదు, పోలీసులను వెంబడి పెట్టుకునే వారు సంచరిస్తున్నారని అర్థం.

రెండు, వాళ్లను అరెస్టు చేసి రంగారెడ్డి క్రిమినల్ కోర్టులో హాజరుపెట్టినప్పుడు పెద్ద సంఖ్యలో యువకులు వారిని చుట్టుముట్టి వారిపైన పూలుజల్లారు. నినాదాలు ఇచ్చారు. వారంతా నయీముద్దీన్, సమ్మిరెడ్డి వగైరాల కోవకు చెందిన దిగజారిన మాజీలేనని పోలీసులు అన్నప్పటికీ ఆ గుంపులో మఫ్టీ పోలీసులూ ఉన్నారని గుర్తుపట్టగల వారంటారు.

మూడు, పోలీసు కస్టడీలో ఉన్న పురుషోత్తం హంతకుల ముఖాలలో ఏ విచారమూ లేకపోగా, అతనిని తామే హత్య చేసామని టివి కెమెరాలకు చెప్పారు. ఇంకొంత మందిని

హత్య చేసేది ఉందని క్రిమినల్ కోర్టులో తమను చుట్టుముట్టిన 'అభిమానుల'తో అన్నారు. పోలీసుల కస్టడీలో ఉంటూ ఇంకా హత్యలు చేయబోతామని బిగ్గరగా చెప్పడం చిన్న విషయంకాదు. పోలీసుల మిత్రత్వమే లేకపోతే టివి చానెల్స్‌కు ఇచ్చిన 'ఒప్పుకోలు', క్రిమినల్ కోర్టులో చేసిన ప్రకటన' వారిని చాలా ఇబ్బంది పెట్టగలవు.

వీళ్లిద్దరి సంగతి అట్లా ఉండగా, వీరి తలదన్నే ఘనుడు కత్తుల సమ్మయ్య పోలీసుల కనుసన్నలలోనే మెలుగుతాడనేది వరంగల్, కరీంనగర్ జిల్లాలలో అందరికీ తెలిసిన సంగతే. అతను ఆయుధం పక్కన పెట్టుకొని పంచాయతులు చేస్తుంటాడు. ఆ పంచాయతులకు అతను పోలీసు జీపులో వచ్చి పోయిన ఉదంతాలున్నాయి.

సంగతి బయటికి పొక్కేసరికి తమ జేబులో ఉన్న హంతకులను పోలీసులు 'అరెస్టు' చేసి 'ఛీ! వీళ్ళింతగా దిగజారిపోయారా! మాకు తెలీదే' అంటూ అమాయకత్వం నటిస్తున్నారు గానీ, ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం గురించి తెలిసిన వారెవ్వరూ ఇందులో నిజమైన అమాయకత్వం ఉందని గానీ నిజమైన పశ్చాత్తాపం ఉందని గానీ నమ్మరు. అది కరడు గట్టిన జాతి. దానికి ఫలితాలే తప్ప వేరే ప్రమాణాలు తెలియవు.

తమ చేతికింద 'మాజీల'తో రూపొందిన కిరాయి హంతక మూక ఉండడం చాలా చాలా ప్రయోజనకరమనేది మిలిటెంట్ ఉద్యమాలున్న అన్ని ప్రాంతాలలోనూ ప్రభుత్వ సాయుధ బలగాలు గ్రహించిన సత్యం. అంత విలువయిన సత్యాన్ని వారు ఒక పట్టాన చేజారనివ్వరు. పురుషోత్తం హత్య తరువాత మన పాలకులు చేసిన ప్రకటనల లాంటివి కాశ్మీర్‌లోనూ అస్సాంలోనూ తరుచు వింటుంటాము. 'సర్కారీ మిలిటెంట్లు' అని జనం పిలుచుకునే మాజీ మిలిటెంట్ల ముఠాల ఆగడాలు మోతాదు మీరినప్పుడల్లా 'వీరి ఆగడాలనింక క్షమించేది లేదు. వారిని అదుపుచేస్తాం' అని ప్రభుత్వ అధినేతలూ పోలీసు అధికారులూ సైనిక అధికారులూ ప్రకటిస్తుంటారు. కానీ ఏం జరగదు. వాళ్లు ఆయుధాలు పట్టుకొని తిరుగుతూనే ఉన్నారు కదా అని ఆ తరువాత ప్రభుత్వాన్నీ పోలీసులనూ అడిగితే, 'వాళ్లకు మిలిటెంట్ల వల్ల ప్రాణభయం ఉంది మరి – వాళ్లను మీరు కాపాడుతారా?' అని మనల్నే ఎదురు ప్రశ్న అడుగుతారు.

ఆత్మరక్షణ పేరిట పట్టుకున్న తుపాకులతో వాళ్ళు వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని అంటే, 'కంప్లైంట్ ఇవ్వండి విచారిస్తాం' అంటారు. కానీ ఏం జరగదు. వాళ్ళు మళ్లీ రోడ్లో తిరుగుతూనే ఉంటారు. మీరు ఇంకొకసారో రెండుసార్లో ప్రభుత్వాన్నీ పోలీసులనూ అడుగుతారు. ఆ తరువాత ఇంక అడగడం మానేస్తారు. ఈ లైసెన్స్డ్ హంతకులను సమాజంలో భాగంగా మీరు కూడా అంగీకరించి అడ్జస్ట్ అయి బతకడం నేర్చుకుంటారు. కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ వంటి ప్రాంతాలు

ఈ దశను ఇప్పటికే చేరుకున్నాయి. మిలిటెన్సీని ఎదుర్కోవడంలో ప్రభుత్వాలకు వీరిప్పుడొక ప్రధాన సాధనం.

మనకింకా ఇది కొత్త కాబట్టి దొరగారూ వారి ముఖ్యమంత్రిగారూ సభ్య సమాజం ఆశించే ప్రకటనలు చేస్తున్నారు. కొన్నాళ్లకిది అలవాటయిపోయిన తరువాత ఆ బాధ ఉండదు. వాళ్లను బహిరంగంగానే వాడుకోవచ్చు. వాళ్లు పోలీసులకొక సాయుధ బలగం మాత్రమే కాదు ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడ. తాము పని చేసి బయటికొచ్చిన ఉద్యమాన్ని గురించి వాళ్లకు చాలా విషయాలు తెలుసు. ఆ జ్ఞానాన్ని ఆ ఉద్యమాన్ని నాశనం చేయడానికి వాడడానికి వాళ్లు సిద్ధంగా ఉన్నప్పుడు వారిని పోలీసులెందుకు పోగొట్టుకుంటారు? చట్టానికో పాలనా నీతికో భయపడి పోగొట్టుకుంటే వారు తెలుగు పోలీసులే కారు.

ఈ క్రిమినల్ మాజీ లెవ్వరికీ నక్సలైట్ల వల్ల ప్రాణభయం లేదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. ఆ భయం వాళ్లు పోలీస్ ఏజెంట్లుగా మారినతరువాతే వచ్చిందనడం కూడా అందరి విషయంలోనూ నిజం కాకపోవచ్చు. కానీ కారణమేదైనా, ఆ భయం నుండి తప్పించుకోవడానికి ఇప్పటి దాకా అనుక్షణం ద్వేషించిన రాజ్యానికి ఏజెంట్లుగా–సర్కారీ మిలిటెంట్లుగా మారడాన్ని వారికి వారైనా ఏవిధంగా సర్ది చెప్పుకుంటారో! నక్సలైట్ ఉద్యమ దృక్పథంలో ముఖ్యంగా పీపుల్స్‌వార్ దృక్పథంలో–రాజ్యంపట్ల ద్వేషం ఒక ప్రధాన లక్షణం. ఆపార్టీ కార్యకర్తలేకాదు, బయట ఉండే సానుభూతిపరులయిన బుద్ధిజీవులు సహితం ఏ విషయాన్ని విశ్లేషించినా 'రాజ్యాన్ని' కేంద్రం చేసి మాట్లాడుతుంటారు.

అటువంటి ఉద్యమం నుండి బయటకొచ్చిన వారిలోనే 'రాజ్యం ఏజెంట్లు'గా తయారయిన వారు ఇంత మంది ఉండడం కొంచెం ఆశ్చర్యం కలిగించవలసిన విషయమే. ఈ భస్మాసురులు ఎక్కడినుండి వస్తున్నారు? పదేళ్ల కింద ఇది ఊహకందని విషయం. నాలుగయిదేళ్లనాడు గ్రీన్ టైగర్స్, క్రాంతిసేన వంటి పేర్లు మొట్టమొదట వినబడినప్పుడు అవి మఫ్టీ పోలీసుల బినామీ పేర్లేననీ 'సర్కారీ మిలిటెంట్లు' పెద్ద సంఖ్యలో దొరికే పరిస్థితి ఇక్కడ లేదనీ అనుకున్నాం. ఆ నమ్మకమిప్పుడు పటాపంచలయింది. జిల్లాకొక ముఠా–నిజామాబాద్, కరీంగనర్, వరంగల్, నల్గొండ, ఈ మధ్య మహబూబ్‌నగర్‌లో కూడ తయారయింది. తమలో నుండే ఆవిర్భవించిన ఈ క్రిమినల్ మూకలపైన ప్రతీకారం తీర్చుకోవడానికి పీపుల్స్‌వార్ వంటి పార్టీలు సిద్ధంగానే ఉంటాయనడానికి సందేహమేమీ లేదుగానీ వారెట్లా ఆవిర్భవించారని ఆలోచించడానికి సిద్ధంగా ఉన్నాయా అంటే మాత్రం సందేహమే. తప్పు 'రాజ్యం' మీద పెట్టడంతోనే వారి విశ్లేషణ ముగుస్తుంది.

తప్పు ఎవరిదైనా కావచ్చునుగానీ నష్టం మాత్రం అందరిదీ. పాలనా యంత్రాంగం రక్షణలో ఉన్న హంతకులు సమాజంలో యధేచ్ఛగా సంచరిస్తుండడం మిలిటెంట్ ఉద్యమాలకు మాత్రమే కాదు, సమాజంలో అందరికీ హానికరం. ప్రజాస్వామ్యానికే హానికరం. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించేటట్టు చేయగలిగితే–అది కేవలం నక్సలైట్లు, వారి సానుభూతిపరుల సమస్య కాదని ప్రజలకు చెప్పగలిగితే పురుషోత్తం మరణం వృధా కాదు.

డిసెంబర్ 24, 2000

# హిందుత్వవాదుల లక్ష్యమేమిటి?

విసిగిస్తూ ఉంటే 'వాళ్ల ఇష్టమే కానీ లెమ్మ'ని ఒప్పేసుకుంటారని మన హిందుత్వవాద సోదరుల ఆశ.

అయోధ్య విషయంలో ఇప్పటికే దేశంలో చాలామంది ఈ 'మూడ్'లోకి వచ్చారు ముస్లింలతో సహా.

విచిత్రమేమిటంటే ఒకదాని తర్వాత మరొక స్థలాన్ని గురించి ఏదో ఒక వివాదం లేవదీస్తుంటే వాళ్లపట్ల మెతక వైఖరి ప్రదర్శించడం మంచిది కాదన్న అభిప్రాయానికి రావడానికి బదులు మొదటి డిమాండ్ ఒప్పేసుకుంటే మిగిలినవి లేవదీసేవారు కారని విజ్ఞులు సహితం అనుకుంటున్నారు.

పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్న ముస్లిం సాంప్రదాయానికి చెందిన పర్యాటక స్థలాలలో ముస్లింలను నమాజు చేసుకోనిస్తారు కదా! హైందవ సాంప్రదాయానికి చెందిన పర్యాటక స్థలాలలో హిందువులను పూజలు ఎందుకు చేసుకోనివ్వరు? అని ఈ మధ్య సంఘ్ పరివార్ నాయకులొక కొత్త ప్రశ్న లేవదీసారు.

ప్రశ్న అడిగే పద్ధతి ఎట్లాగుంటుందంటే అది నిజమేనని వినేవాళ్లు అనుకోవాలి. ఆ తరువాత అందులోని అభియోగం న్యాయమైనదేననుకోవాలి. కానీ తాజ్‌మహల్‌లో నమాజు చేయనిచ్చినట్లే అనేక 'హైందవ' పర్యాటక కేంద్రాలలో హిందూ పూజలు చేసుకోనిస్తారు. కొన్ని చోట్ల (ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురంలో) పురావస్తు పర్యాటక కేంద్రంలో గుడీ ఉంది దర్గా కూడా ఉంది. జరుపుకోనివ్వనిది వివాదం ఉన్నచోట్ల మాత్రమే. అది కూడా కేవలం శాంతి సామరస్యాల కోసమే తప్ప 'కుహనా లౌకిక వాదం' ఫలితంగా కాదు. ఇవి నిజానికి అందరికీ కొంచెం ఆలోచిస్తే గుర్తు కొచ్చే విషయాలే. రామప్ప నుండి హంపి దాకా హిందూ పూజలు జరిగే పర్యాటక స్థలాలు అందరూ చూసే ఉంటారు. కాని నిర్భీతిగా దబాయిస్తుంటే మన మెరిగిన విషయాలే మరిచిపోతాము.

అయోధ్య విషయంలో 'విసిగించి ఒప్పించే' మార్గాన్ని హిందుత్వవాదులు చాలా నేర్పుగా అమలు చేస్తున్నారు. వచ్చే జనవరి నుండి మళ్లీ 'కరసేవ మొదలు పెడతాం' అని అకస్మాత్తుగా ఒకడు ప్రకటిస్తాడు. 'విగ్రహాలూ రాళ్లూ చేరవేస్తున్నాం' అని ఇంకొకడు ప్రకటిస్తాడు. 'ఉత్తరప్రదేశ్‌లో రెడ్ అలర్ట్' అనీ 'జనం గుండెలలో ఉద్రిక్తత' అనీ పత్రికలు రాస్తాయి. 'ఈ ఒక్కటి ఒప్పేసుకుంటే పోలేదా' అనుకునేటట్టు చేస్తారు.

అంతలో ఢిల్లీలో కుతుబ్‌మినార్ గురించి కొత్త వివాదం వేరొక సంఘ్ పరివార్ సంస్థ లేవదీస్తుంది. అక్కడ పూజలో, యజ్ఞమో చేస్తామని బయలు దేరుతారు. పోలీసులు నిషేధాజ్ఞలు ప్రకటించారనీ కుతుబ్‌మినార్ పరిసరాలలో కర్ఫ్యూ వాతావరణం నెలకొనిందనీ పత్రికలు రాస్తాయి.

'రామాలయం కట్టుకోనిచ్చేస్తే ఇట్లా ఎక్కడ పడితే అక్కడ వివాదాలు లేవదీయటం మానేస్తారేమో కదా' అని సగటు ప్రజలు అనుకునేటట్టు చేస్తారు.

వాళ్లేదీ మానుకోరు. వాళ్లకు కావలసింది నిజానికి గుళ్లు కాదు, కూల్చివేసిన పవిత్ర స్థలాల పునరాక్రమణ కాదు. వాళ్లకు కావలసింది హిందూ సమాజంలో అసహనం పెరగడం. వాళ్లకు కావలసింది హిందూసమాజంలో విద్వేష సంస్కృతి పెరగడం.

అసహనం, ద్వేషం నిండిన మనుషులు ప్రజాస్వామ్యానికి శత్రువులుగా మారతారు. నియంతలను ఆరాధిస్తారు, ఆహ్వానిస్తారు. జర్మనీలోనూ ఇటలీలోనూ ఫాసిజం రాజ్యం చేసిన అన్ని దేశాలలోనూ ఫాసిస్టు రాజకీయాలు ప్రజలలో ఏదో ఒక మైనారిటీ జాతిపట్ల, మతస్థుల పట్ల ద్వేషాన్నీ అసహనాన్నీ రెచ్చగొట్టడం ద్వారానే ఉనికిలోకి వచ్చాయి, వ్యాపించాయి. మైనారిటీ జాతుల పట్ల, మతస్థుల పట్ల ఇతర ప్రజలలో వ్యతిరేకత రేకెత్తించడానికి వారు చరిత్ర నుండి ఎంపిక చేసుకున్న ఘటనలలో ఎంతో కొంత సత్యముంటే ఉండవచ్చును కూడా. యూదులలో చాలా మంది వ్యాపారస్తులు–అందులోనూ వడ్డీ వ్యాపారస్తులు–కావడం వల్ల వారికి వ్యతిరేకంగా ద్వేషం రేకెత్తించడానికి కావలసిన సామాజిక వాతావరణం నాజీలకు దొరకడం పెద్దగా కష్టం అయి ఉండదు. ఆ సంఘటనలకు సంబంధించిన తప్పొప్పుల వివేచనలో జనం కూరుకుపోయిన కొద్దీ ఫాసిస్టుల విద్వేష అజెండా కళ్ళకు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

పాకిస్తాన్ కాశ్మీర్‌లోకి మతవాద మిలిటెంట్లను పంపించడం లేదా? పంపిస్తున్నది. ఈ దేశాన్ని ఏలిన ముస్లిం నవాబులు, సుల్తానులలో హైందవ మత చిహ్నాల పట్ల అసహనం ప్రదర్శించిన వారు లేరా? ఉన్నారు. గుళ్లను కూల్చి, విగ్రహాల ముక్కులు,

చెవులు తెగనరికి తమ విశ్వాసాల గాఢతను ప్రదర్శించుకున్న వారు లేరా? ఉన్నారు.

అందువల్ల పాకిస్తాన్‌ను క్రికెట్ మ్యాచ్‌ల కోసం మన దేశానికి ఆహ్వానించవద్దని, విధ్వంసమైన హైందవ మత చిహ్నాలను బలప్రయోగంతో పునరుద్ధరిద్దామని హిందుత్వవాదులు అన్నప్పుడు స్పందన లభిస్తుంది. అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చేసిన స్థలంలో రామాలయాన్ని కట్టడం 'జాతి ఆకాంక్ష' అని వాజ్‌పేయి అన్నా, ముస్లింలకు ఓటుహక్కు ఉన్నంతకాలం వారిని మంచి చేసుకోవడం కోసం కుహనా లౌకికవాద రాజకీయాలు సజీవంగానే ఉంటాయి కాబట్టి వారికి ఓటు హక్కు తీసివేయాలని బాల్ థాకరే అన్నా కూడా స్పందించే వాళ్లు ఉంటారు.

వీటికి తర్క బద్ధంగా జవాబు చెప్పగలము. చెప్పడం అవసరం కానీ చెప్పేటప్పుడు తర్కాన్నీ తర్కశూన్యాన్నీ దాటిపోయే లక్ష్యమొకటి ఈ నిర్ణయాలు, ప్రకటనల వెనక ఉందని గుర్తించడం అవసరం. పాకిస్తాన్‌తో మన వాళ్ళు క్రికెట్ ఆడినా, ఆడకున్నా కాశ్మీర్ సమస్య పరిష్కారం ఒక్క అంగుళం కూడా ముందుకు పోదని భారతీయ జనతా పార్టీకి మాత్రం తెలియదా? అయినా ఆ నిర్ణయం తీసుకున్నారంటే కారణం ద్వేషాన్ని, అసహనాన్ని వారు జాతి లక్షణం చేయదల్చుకోవడం తప్ప వేరే ఏమీ కాదు. జైన, బౌద్ధ పవిత్ర స్థలాలను ఆక్రమించుకొని శివాలయాలు, వైష్ణవ ఆలయాలు కట్టిన హైందవ రాజులు, చక్రవర్తులు చాలా మంది ఉన్నారు. కాబట్టి అయోధ్య రామాలయ తర్కం హిందువులను కూడా ఇబ్బంది పెట్టగలదని వీరికి తెలియదా? నిజానికి ఈ తర్కం ఒక్క ఆదివాసీలను తప్ప అందరినీ ఇబ్బంది పెట్టగలదు. దేశంలోని ఏ పవిత్ర స్థలం తీసుకున్నా హిందూ, బౌద్ధ, జైన, ముస్లిం, క్రైస్తవ–నూటికి తొంభై కాకపోతే ఎనభై శాతం ఒక నాటి ఆదివాసి పూజా స్థలాల్లో కట్టినవే.

ఈ తర్కానికి సంఘ్ పరివార్ యోధుల దగ్గర జవాబు లేదు గాని, తర్కం ఏ గుడినీ కూల్చదని, బౌద్ధులు, జైనులు, ఆదివాసీలు ఆ పని చేసే స్థితిలో లేరని వారికి తెలుసును. నిజానికి ఆ ధైర్యం ఉండబట్టే ఒక్కొక్క మసీదు గురించి ఇంత గొడవ చేస్తున్నారు. ద్వేషాన్ని విపరీతంగా ఆరాధించే వారిలో మెజారిటీ వ్యక్తిగతంగా పిరికివాళ్లు.

అయితే ఎన్ని మసీదులు కూల్చగలరు, ఎన్ని గుళ్లు కట్టగలరు అన్న లెక్కలతో నిమిత్తంలేని ప్రయోజనం ఒకటి ఈ గొడవ నుండి వారు పుష్కలంగా పోగు చేసుకుంటున్నారు. అది తమ ఫాసిస్టు అజెండాకు తగిన సమాజంగా, ద్వేషం, అసహనం, అనుమానం నిండిన సమాజంగా ఇండియాను మార్చడం. మనం మసీదులు, గుళ్లు

లెక్క పెట్టుకుంటూ ఈ విషయం మరచిపోతే కష్టం. రాబోయే 20 ఏళ్లలో వీళ్లు బాబ్రీ మసీదు లాగా ఇంకొక మసీదును కూల్చలేకపోవచ్చు. కుతుబ్‌మినార్‌ను గుడిగా మార్చలేకపోవచ్చు. కానీ తమ దీర్ఘకాలిక అజెండాకు తగిన సమాజాన్ని మాత్రం వాళ్లు విజయవంతంగా తయారు చేసుకుంటున్నారు. ఏ రాజకీయమైనా తన నమూనాలో మనుషులను తయారు చేసుకోగలిగినప్పుడే నిలబడుతుంది గెలుస్తుంది. ఆ విషయంలో సంఘ్ పరివార్ ఫాసిస్టులు కొద్ది కొద్ది గానే కావచ్చును గానీ కచ్చితంగా పురోగమిస్తున్నారు.

ఆ సంగతి గమనిస్తున్నామా?

నిగాహ్

జనవరి 20, 2001

# హురియత్ కాన్ఫరెన్స్‌తో ఈ చెలగాటం ఎందుకు?

**కా**శ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుంటామని భారత పాకిస్తాన్ పాలకులు చేస్తున్న ప్రకటనల వెనక మనసులో మార్పేమీ లేదనడానికి హురియత్ కాన్ఫరెన్స్ నాయకుల పాకిస్తాన్ పయనం ఒక ప్రహసనంగా మారడమే నిదర్శనం.

ఇది అచ్చుయ్యేనాటికి వాళ్లు పాకిస్తాన్‌కు పోవలసి ఉంది. కానీ వాళ్లకు పాస్‌పోర్టులిచ్చే విషయంలో భారత ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి చూస్తే అనుకున్న ప్రకారం పోతారని ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉంది.

లష్కర్–ఇ–తొయిబా విషయంలో ఏకపక్షంగా కాల్పుల విరమణ పాటించడానికి సహితం సిద్ధపడిన భారత్, హురియత్ నాయకులు ఏడుగురికీ పాస్‌పోర్టులు ఇవ్వడానికెందుకు ఇంత వెనకాడుతున్నది? ఎవరినో మెప్పించడానికి మొదలుపెట్టిన శాంతి ప్రక్రియను నిజంగా కొనసాగించడం ఇష్టం లేకనా?

కావచ్చు. నిజానికి భారత–పాకిస్తాన్‌ల మధ్య ఇప్పుడున్నంత అనుకూల వాతావరణం ఎప్పుడూ లేదు. భారత్‌ను ఏలుతున్నది, హరిసింగ్ మహారాజు ఏలిన జమ్ము–కాశ్మీర్‌ను ఒక్క అంగుళం విడిచిపెట్టకుండా భారత్‌లో కలుపుకుంటామని యాభై ఏళ్లుగా పొద్దునా, సాయంత్రం కాషాయజెండాకు ప్రమాణం చేస్తూ చెపుతున్న ఖాకీ నిక్కరు యోధులు. పాకిస్తాన్‌ను ఏలుతున్న సైనిక పాలకులు ప్రాపంచిక దృక్పథంలో మన పాలకుల కంటె కొంచెం ఆధునికులే కావచ్చును గానీ జమ్ము–కాశ్మీర్‌ను ఒక్క అంగుళం విడిచిపెట్టకుండా పాకిస్తాన్‌లో కలుపుకోవాలన్నది యాభై ఏళ్లుగా మనిషికున్నట్టు సైన్యానికి కూడా జీవిత లక్ష్యం ఉందని చెప్పగలిగినట్టయితే అది పాకిస్తాన్ సైన్యం జీవిత లక్ష్యం. అంతేగాక చెట్టుకొకడూ పుట్టకొకడూ మతవాద మిలిటెంట్లున్న పాకిస్తాన్‌లో 'ముస్లిం' కాశ్మీర్ గురించి భారత్‌తో సామరస్యపూర్వక పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని చెప్పడం సులభం కాదు.

తమ మనసులలో లేని సామరస్యం కోసం ఈ రెండు ప్రభుత్వాలు తోలుబొమ్మలు ఆడినట్టు ఆడుతున్నాయి. ప్రపంచంలోని అపరిష్కృత వైరాలన్నిటినీ తన పదవీకాలం ముగిసే లోపల పరిష్కారం చేసి చరిత్రలో నిలిచిపోదామని బిల్ క్లింటన్‌కు పుట్టిన కోరిక కంటే గొప్ప కారణమేదీ ఈ తోలుబొమ్మలాట వెనక లేదన్న సందేహం చాలా బలంగా కలుగుతున్నది. అయితే ఇంతకంటే కొంచెం గౌరవించదగ్గ కారణం ఉందేమోనని అనుమానించడానికి ఆస్కారం లేకపోలేదు. కాశ్మీరీల జాతీయ ఆకాంక్ష ఎవరెవరి యుద్ధాలకో మందుగుండుగా మారడం ఇంక సహించలేమని భావించిన అమెరికాలో స్థిరపడిన కాశ్మీరీలు అమెరికా పాలనా యంత్రాంగంపైన వత్తిడి పెట్టి ఆ ప్రపంచ పోలీసు చేత ఇండియా పాకిస్తాన్‌లపైన ఒత్తిడి పెట్టడానికి ప్రయత్నం చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. అమెరికా ప్రభుత్వానికి సన్నిహితులయిన ప్రవాస కాశ్మీరీ కోటీశ్వరులు ఒకరిద్దరు తరచుగా ఇటు శ్రీనగర్‌కూ అటు ముజఫరాబాద్‌కూ– మధ్య మధ్యలో ఢిల్లీకి ఇస్లామాబాద్‌కు కూడ–మంతనాల నిమిత్తం వచ్చిపోతున్నట్టు కాశ్మీరీ పత్రికలు రాస్తున్నాయి.

వేరొక కారణాన్ని కూడ ఊహించడానికి అవకాశం ఉంది. సోవియెట్ రష్యా పతనం తరువాత పాశ్చాత్య రాజ్యాలు ఇస్లామిక్ మతవాదాన్ని తమ ప్రధాన శత్రువుగా భావిస్తున్నాయి. దానిని అంతమొందించే విషయంలో వారందరికీ ఏకాభిప్రాయం ఉంది. మన దగ్గర మరీ కరడు గట్టిన హిందుత్వవాదులకు ఇస్లాం గురించి ఎటువంటి మూర్ఖమైన అవగాహన ఉంటుందో పాశ్చాత్య దేశాలలో సగటు వ్యక్తులకు అటువంటి అవగాహనే ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్లకు ముస్లిం అన్నా తాలిబాన్ అన్నా ఒక్కటేనని చెప్పవచ్చు. కాశ్మీర్ సమస్య వంటివి రగులుతున్నంత కాలం ఇస్లామిక్ మతవాదానికి ఊపిరి అందుతూనే ఉంటుంది. కాబట్టి దానిని త్వరగా ఏదో ఒక రకంగా 'పరిష్కరించేయడం' వారి ప్రయోజనాలకు అవసరం.

ఈ మూడింటిలో ఏది కారణమైనా, ప్రపంచ రాజకీయాలలో చురుకైన పాత్ర నిర్వహించాలని అమెరికా కోరుకున్నంత కాలమే మొదట్లో చెప్పుకున్న తోలుబొమ్మలాట సాగుతుంది. క్లింటన్ గద్దె దిగి బుష్ ఎక్కడం ఈ విషయంలో దిశ మార్పుకు దారితీయగలదన్న ఆశతో మన వాళ్లు ఆటను ప్రహసనంగా మార్చి కాలక్షేపం చేస్తున్నారా?

లేదా ఆట తప్పదనుకుంటే దాని ముగింపును 'భారత్ ప్రయోజనాలు' అని పిలవబడే వాటికి అనుకూలంగా మలుచుకోవడానికి మొదటి మెట్టు నుండి ఎత్తుగడలు వేస్తున్నారేమో. హురియత్ కాన్ఫరెన్స్‌లో మొత్తం 32 సంస్థలున్నాయిగానీ అందులో నిర్ణాయకపాత్ర వహించేది పిడికెడు మంది నాయకులే. అయితే వారి మధ్య తీవ్ర

విభేదాలు వున్నాయి. 'అందరికీ పాస్‌పోర్టులివ్వం, కొందరికే ఇస్తాం, ఎవరికి కావాలో నిర్ణయించుకోండి' అంటే వాళ్లలో వాళ్లు కొట్టుకుని భారత పాలకులు మనసారా ద్వేషించే హురియత్ కాన్ఫరెన్స్ బలహీనపడుతుందని వారి ఆశ కావచ్చు.

హురియత్ కాన్ఫరెన్స్ నాయకులలో జమాతె ఇస్లామీ నాయకుడు సయ్యద్ ఆలీషా గిలానీ పాకిస్తాన్ అనుకూలుడయిన మతవాది. ముస్లిం లీగ్ నాయకుడు ప్రొఫెసర్ అబ్దుల్ గనీ భట్ కూడ పాకిస్తాన్ అనుకూలుడైన మతవాదే కానీ గిలానీ కంటె కొంత సంయమనం తెలిసిన వాడు. జెకెఎల్ఎఫ్ నాయకుడు యాసిన్ మాలిక్ స్వతంత్ర కాశ్మీర్‌ను కోరుకునే లౌకికవాది. ఈ మధ్యనే తన కుమార్తెకు పాకిస్తాన్‌లో పెళ్లి జరిపించిన అబ్దుల్‌గనీ లోన్ ఒకనాడు ప్రధాన స్రవంతి (మెయిన్ స్ట్రీం)కి చెందిన రాజకీయ నాయకుడు. ఆ తరువాత మిలిటెన్సీ మద్దతుదారుడయ్యాడు. పాకిస్తాన్‌కు అనుకూలంగానే మాట్లాడేవాడు కానీ ఈ మధ్యన పాకిస్తాన్‌ను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టాడు. మొన్నటిదాకా హురియత్ ఛైర్మన్‌గా ఉన్న ఉమర్ ఫరూఖ్ కాశ్మీరీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు. మీర్వాయిజ్ పదవికి వారసుడు. కాశ్మీర్ భవితవ్యం గురించి అతని అభిప్రాయం ఏమైనా, ఏ విషయంలోనూ మొండివైఖరి అవలంబించడు.

ఇంత వైవిధ్యం ఉన్న సంస్థలో 'కొందరికి మాత్రమే పాస్‌పోర్టులు ఇస్తాము, ఎవరు తీసుకుంటారో మీరే తేల్చండి' అనడం తాంబూలం ఇచ్చాను ఇక తన్నుకు చావండి అనే కుటిలనీతే. హురియత్ కాన్ఫరెన్స్ కాశ్మీర్‌లోని మిలిటెంట్ గ్రూపుల రాజకీయ ప్రతినిధి. ఇది ఒకరి వ్యాఖ్యానం కాదు. వాళ్లే ఆ విధంగా చెప్పుకుంటారు. మిలిటెంట్లలో కాశ్మీరీ జాతీయ వాదులున్నారు, పాకిస్తాన్ అనుకూల మతవాదులైన కాశ్మీరీలున్నారు, కాశ్మీరీలు కాని పాక్ ఇస్లామిక్ పోరాటకారులున్నారు. ఈ ఒక్కొక్క వర్గంలోనూ అంతర్గతంగా వేరే తేడాలున్నాయి. అయినప్పటికీ ఉమ్మడి రాజకీయ వేదిక ఒకటి అవసరమని చెప్పి అందరి నమ్మతితో హురియత్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్ని ఒడిదుడుకులున్నా దాదాపు ఒక దశాబ్దకాలం చీలికలు లేకుండా నెట్టుకొస్తున్నారు.

అటువంటి ఐక్యవేదిక ఉండడం సమస్య పరిష్కారానికి ఉపయోగపడుతుందన్న ఇంగితం భారత్‌కు ఉండాలి. ఎప్పటికైనా మిలిటెంట్లతో రాజకీయ చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యం నిజంగా ఉన్నట్టయితే, హురియత్ ద్వారానే ఆ చర్చలు జరగగలవు. అటువంటి సంస్థను గౌరవించవలసింది పోయి దాని పట్ల కౌటిల్యం ప్రదర్శించడం, దానిని సంక్షోభంలో పడేసి ఏదో లబ్ధి పొందుదామని చూడడం చాలా బాధాకరం. నిజంగానే చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలన్న కోరిక భారత్‌కు ఉందా అన్న సందేహానికిది బలం చేకూరుస్తున్నది.

జనవరి 28, 2001

# ఇది మన నోరు మూయించే సాకు మాత్రమే

క్రిమినల్ చట్టాలలో ఉన్న హక్కులను, సహజ న్యాయ సూత్రాలను పక్కన పెట్టాలన్న ప్రయత్నం మన పాలకులు పదే పదే చేస్తుంటారు. వాళ్లు ఎన్ని కోణాల నుండి, ఎన్ని రకాల సాకులు చూపించి ఈ పని చేస్తుంటారంటే ఇంతటి పట్టుదల ఒక మంచి లక్ష్యం కోసం ప్రదర్శిస్తే ఎంత బాగుండునో కదా అనిపించక తప్పదు.

నేర విచారణ బహిరంగంగా జరగాలి, నేరం బలవంతంగా ఒప్పించకూడదు, ముద్దాయి మీద ఉన్న నేరారోపణ సంపూర్ణంగా తెలియజేసి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే సహేతుకమైన అవకాశం కల్పించాలి–ఇత్యాది సహజ న్యాయ సూత్రాలు లేని నేరస్మృతి ఒక నాగరిక స్మృతే కాదు. దీనికి ఆయా నేరాల గురించి మనం ఏమనుకుంటామనే దానితో ఏమీ సంబంధం లేదు. ఎంత హేయమైన నేరానికయినా నిర్దోషిని శిక్షించడానికి వీలు లేదన్న ప్రాథమిక సూత్రాన్ని ఒప్పుకునేటట్టయితే ఈ హక్కులు ముద్దాయికి ఉండడం అవసరం. కోర్టులలో న్యాయానికి భరోసా ఇచ్చేది న్యాయమూర్తి దొడ్డ మనసు కాదు, విజ్ఞత కాదు. అవి కూడ అవసరమే, కానీ న్యాయ సమ్మతమైన నేర విచారణ పద్ధతి అన్నిటికంటే ముఖ్యమైన భరోసా.

దానికి తూట్లు పొడిచే ప్రయత్నం పదే పదే చేస్తున్నారంటే అర్థం, అన్యాయంగా నయినా సరే శిక్షలు పడేటట్టు చూస్తే తప్ప నేరాలు ఆగవని నమ్ముతున్నారని. అందులోనూ అన్నిటికంటే ఎక్కువగా పోలీసులూ పోలీసు మనసున్న పాలకులూ కాంక్షించేది చిత్రహింసలు పెట్టి రాయించుకునే ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించాలన్న నియమం. అదొక్కటుంటే ఏ నేరమూ అపరిష్కృతంగా ఉండిపోదని వారి విశ్వాసం. లాకప్పులలో పెట్టి ఒప్పించే అధికారం పోలీసులకిచ్చినట్టయితే వారు ఎవరిచేతనయినా ఏ నేరమైనా ఒప్పించగల సమర్థులు కాబట్టి నేర విచారణలో న్యాయం జరుగుతున్నదా అన్యాయం జరుగుతున్నదా అని ఎవరూ చెప్పలేరు. అందువల్ల ఆ అధికారం పోలీసులకియ్యకూడదని ఏనాడో నేరస్మృతి రాసిన బ్రిటిష్ వాళ్లు భావించారు.

వాళ్ల హయాంలో దానిని సవరించడానికి వాళ్లు ఒకటి రెండు సార్లు తప్ప ప్రయత్నం చేయలేదు కానీ రాజ్యాధికారం మనవాళ్ల చేతిలోకి వచ్చినంక ఆ ప్రయత్నం పదే పదే కొత్త కొత్త కోణాలనుండి చేస్తున్నారు. 1983 నుండి 1995 దాకా వేలమందిని జైలుపాలు చేసిన 'టాడా' గురించి అందరూ విన్నారు గానీ చిన్నాచితక 'టాడాలు' ఎన్నో!

ఇప్పుడొకటి చంద్రబాబు తయారు చేసి పెట్టాడు. దానికి పేరేం పెడతాడో తెలీదుగానీ టాడాలోని సగం అవలక్షణాలు అందులో ఉన్నాయి. 'సంఘటిత' నేరాలను అదుపు చేయడం ఈ చట్టం లక్ష్యం అని ప్రభుత్వం అంటున్నది. చావు భయం చూపించి ఆర్థిక లాభం కోసం సంఘటితంగా హింసకు పాల్పడే నేరాలన్నిటికీ ఈ చట్టం వర్తిస్తుంది. భూమి కబ్జాలు, బలవంతపు డబ్బుల వసూళ్లు, కిడ్నాప్‌లు, గంజాయి వ్యాపారం, మాఫియాల కార్యకలాపాలను అరికట్టడానికి ఈ చట్టం ఉద్దేశించబడిందని అంటున్నారు.

రాజకీయ ఉద్యమాలపైన ప్రయోగించే ప్రమాదం ఉన్నట్టయితేనే ఇటువంటి చట్టాలను వ్యతిరేకించాలనుకున్నా, బలవంతపు డబ్బు వసూలు అన్న నేరారోపణ వారిపైన సులభంగా చేయవచ్చునని గుర్తించాలి. నక్సలైట్ దళాలు చేసే డబ్బు వసూళ్లకే కాదు, ఆయుధాలు చేతిలో లేని సంస్థలు చేసే చందాల వసూళ్లకు కూడ దీనిని పోలీసులు వర్తింపజేయగలరు. ఇప్పటికే మామూలు చట్టాల కింద ఇటువంటి కేసులు పెడుతున్నారు. అట్లాగే, 'భూమి కబ్జా' నిర్వచనంలోకి పేదల భూమి పోరాటాన్ని గానీ నక్సలైట్ పార్టీలు చేపడుతున్న భూమి పోరాటాన్నిగానీ తీసుకురారన్న నమ్మకమేమీ లేదు.

రాజకీయ ఉద్యమాలపైన దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందా లేదా అన్న విషయంతో నిమిత్తం లేకుండ, అన్యాయమైన నేర విచారణ పద్ధతులను సూత్రప్రాయంగా వ్యతిరేకించడం అవసరం. ఇటువంటి అన్ని చట్టాలలోనూ అసలు విషయం నేర విచారణ పద్ధతులను కఠినతరం చేయడం కాగా మన దృష్టి మాత్రం నేర విచారణ పద్ధతుల మీద కాక నేరాలపైన నిలిచేటట్టు చేయడంలో ప్రభుత్వం కృతకృత్యమవుతున్నదనే చెప్పుకోవాలి.

బలవంతంగా నేరం ఒప్పించడం న్యాయమా అని అడిగితే, గంజాయి వ్యాపారం మంచిదంటారా అని ప్రభుత్వం ఎదురు ప్రశ్న వేస్తుంది. గంజాయి వ్యాపారాన్ని అరికట్టడానికీ, భూమి కబ్జాలు అరికట్టడానికీ, బలవంతపు వసూళ్లను అరికట్టడానికీ, మాఫియా చర్యలను అరికట్టడానికీ కావలసిన చట్టాలు ఇప్పటికే లేవా? చాలా ఉన్నాయి. మరి ఇప్పుడేమొచ్చిందని ఈ కొత్త చట్టం అవసరం అయింది?

నేరాలకు నిర్వచనాలూ శిక్షలూ చట్టంలో ఇప్పటికే ఉన్నాయి గానీ ప్రస్తుత నేర విచారణ పద్ధతి నేరస్తులను శిక్షించడానికి సరిపోవడం లేదని అనబోతారు. హేయమైన

నేరాలను మన కళ్లముందు ఉంచి బెదరగొట్టే బదులు ఈ మాటే చెప్తే అసలు విషయం చర్చించుకోవచ్చు. నేరాలు ఆగకపోవడానికి ప్రధాన కారణం నేర విచారణ పద్ధతి 'మరీ ఉదారంగా ఉండడం' కాదు. ఈ నేరాలకున్న రాజకీయ ఆలంబన అవి వర్ధిల్లడానికి గల ముఖ్యకారణం. ఈ నేరాలతో సంబంధం ఉన్న తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఎంత మంది లేరు? వాళ్లకే పదే పదే అసెంబ్లీకీ పార్లమెంటుకూ టిక్కెట్లు దక్కుతున్న మాట కూడ సత్యం కాదా? వాళ్లే ఈ రెండు పార్టీల పోషకులన్నది వాస్తవం కాదా?

పాలకుల రుగ్మతనే కారణంగా చూపించి నేరస్మృతిలోని ప్రజాతంత్ర సూత్రాలను ధ్వంసం చేయడాన్ని ప్రజలెందుకు ఆమోదించాలి? ఈ చట్టం కింద నేరవిచారణ రహస్యంగా జరుగుతుందంట. పత్రికల వాళ్లు కూడ రాయడానికి వీలు లేదంట. ఇది న్యాయనిర్ణయానికి ఏ విధంగా అవసరం? అవసరం కాకపోగా ఆటంకం కాదా? ఎవరూ చూడరు, ఎవరూ రాయరు అన్న భరోసా ఉన్నప్పుడు నేర విచారణ న్యాయంగా జరుగుతుందా?

ఈ చట్టం నిర్వచించే నేరం మరణానికి దారితీస్తే ఉరిశిక్షే దానికి శిక్ష అవుతుందంట. ప్రపంచంలోని చాలా దేశాలు ఉరిశిక్ష వేయగల నేరాల సంఖ్యను క్రమంగా తగ్గించుకుంటూ పోతుండగా మన వాళ్లు పెంచాలని చూడడం సబబా? అయినా ఏ నేరానికయినా ఉరిశిక్షే ఏకైక శిక్షగా ఉండడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పి ఉంది. ఐపిసిలోని సెక్షన్ 303ను ఈ కారణంగా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆ సంగతి మన రాష్ట్ర ప్రభుత్వానికి చట్టాలు రాసిపెట్టే ప్రబుద్ధులకు తెలీదా?

ఇక పోలీసులకిచ్చే ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించాలన్న నియమం ఉండనే ఉంది. నిజానికి ఇదే అసలు విషయం. 'బొక్కలు విరగ్గొట్టి చెప్పించే దానికి ఈ కోర్టులు, ఈ సాక్ష్యాలు ఎందుకు' అన్న పోలీసుల అభిప్రాయాన్ని చట్టబద్ధం చేయడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. దీనిని ఎందుకు ఆమోదించడానికి వీలు లేదో ఇప్పటికే చెప్పి ఉన్నాను.

అయితే టాడాలో కూడ లేనిది, ఈ చట్టంలో ఉన్నది ఏమిటంటే 'టెలిఫోన్ టాపింగ్'ను చట్టబద్ధం చేయడం. ఇది పోలీసులు నిత్యం చేస్తున్న పనే. పోలీసుల కోరిక మేరకు ప్రభుత్వం 'టాపింగ్'కు అనుమతి ఇయ్యవచ్చుననీ అప్పుడది చట్టబద్ధంగా జరుగుతుందనీ ఈ చట్టం అంటుంది. ఇది విపరీతంగా దుర్వినియోగం కాగల అంశం. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛ పైననే కాక రాజకీయ స్వేచ్ఛపైన కూడ ఇదొక దాడే. పోలీసుల చెవిన పడకుండ ఏ మాటలూ మాట్లాడుకునే హక్కు ప్రజలకు లేకుండ చేస్తుంది.

ఎంతటి హేయమయిన నేరాలను కారణంగా చూపించి ఈ రకమైన చట్టాలు తీసుకురావాలని ప్రయత్నించినా దానికి ఆమోదం తెలియజేయకూడదు. ఈ చట్టంలోని అభ్యంతరకరమైన అంశాలకూ అది నిర్వచించే నేరాల హేయమయిన స్వభావానికీ ఏమీ సంబంధం లేదు. అది మన నోరు మూయించే సాకు మాత్రమేనని గుర్తించడం అవసరం.

ఫిబ్రవరి 17, 2001

# ఫుట్‌బాల్ అయిపోయిన రాజ్యాంగం

విశాఖపట్నం ఏజెన్సీలోని బాక్సైట్ ఖనిజం నిక్షేపాలు మళ్లీ వార్తలకెక్కబోతున్నాయి.

వాటి తవ్వకాన్ని ప్రైవేట్ మైనింగ్ కంపెనీల చేతిలో పెట్టడానికి ఎల్‌టిఆర్ చట్టం అడ్డంగా ఉంది కాబట్టి ఆ చట్టాన్ని సవరించి ఏజెన్సీలో గిరిజనేతర వ్యక్తులకూ కంపెనీలకూ భూమిని లీజుకు ఇచ్చే అధికారం ప్రభుత్వం చేతిలో పెట్టడం అవసరం అనీ, ఆ చట్ట సవరణ చేపట్టబోతామనీ కొన్ని నెలల కింద చంద్రబాబు ప్రకటించాడు.

నిజానికి ఆ ఆటంకం ఎల్‌టిఆర్ చట్టంలో వాచ్యంగా లేదు. ఆ చట్టాన్ని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించి, గిరిజనేతర వ్యక్తికి ఇతర వ్యక్తులే కాదు, ప్రభుత్వం సహితం ఏజెన్సీలో భూమిని బదలాయించడానికి వీలులేదని చెప్పింది. 'సమత వర్సస్ స్టేట్' కేసులో జస్టిస్ రామస్వామి ఇచ్చిన ఈ తీర్పును అధిగమించడానికే ఎల్‌టిఆర్ చట్టాన్ని సవరించబోతున్నామని చంద్రబాబు అన్నాడు.

కోర్టు తీర్పులను వమ్ముచేయడానికి చట్టాన్ని సవరించవచ్చునా అంటే ఆ అధికారం చట్ట సభలకు ఉందనే సుప్రీంకోర్టు అనింది కాబట్టి ఈ పని 'చట్ట బద్ధమైనదే'నని ఎవరో అప్పట్లో చంద్రబాబుకు చెప్పినట్టున్నారు.

అయితే జస్టిస్ రామస్వామి ఇచ్చిన తీర్పు ప్రకారం 'ప్రైవేట్ వ్యక్తులకు గానీ కంపెనీలకు గానీ ఏజెన్సీలో భూములు కట్టబెట్టడానికి ప్రభుత్వానికి సహితం అధికారం లేదన్న నియమం ఎల్‌టిఆర్ చట్టంలోనే కాక రాజ్యాంగం అయిదవ షెడ్యూలులోనే ఉంది. చంద్రబాబుకు రాష్ట్ర అసెంబ్లీలో ఎంతటి మెజారిటీ అయినా ఉండనీ గాక, రాజ్యాంగాన్ని ఆయన సవరించలేడు కాబట్టి ఆ అడ్డంకిని అధిగమించడం ఆయనకు సాధ్యం కాదని అప్పట్లో అన్నాము.

అది గ్రహించే కాబోలు కొన్నాళ్లు విశాఖపట్నం బాక్సైట్ గురించి మాట్లాడడం మానేసాడు. అయితే దానిని గురించి ఆలోచించడం మానేయలేదని ఇప్పుడు

తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబుకు చాలా ప్రభావం ఉంది కాబట్టి రాజ్యాంగ సవరణకు కేంద్రాన్నే కదిలించగలిగాడు. రాజకీయ ప్రభావం ఉండడమే కాక, 'గ్లోబలైజర్'గా అతని పరపతి కూడా దేశంలో అనన్యమైనది. గ్లోబలైజేషన్ అంటే ఏమిటో దేశానికి చెప్పే అగ్రగామి నాయకుడిగా ఆయన సంపాదించుకున్న పరపతి కారణంగా కూడ అతని ప్రభుత్వం ఎదుర్కుంటున్న ఒక 'సమస్య' రాజ్యాంగ సవరణకు దారి తీయగలుగుతున్నది.

'రహస్యం' అని పెద్ద అక్షరాలలో రాసి ఉన్న పత్రమొకటి కేంద్ర గనుల శాఖ నుండి గత సంవత్సరం జూలై 10న వెలువడింది. అందులో 'సమత' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైన అనేక వ్యాఖ్యలున్నాయి. సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలునే తిరగరాసిందని వాపోయారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్పటికే ప్రభుత్వం నుండి లీజుపొంది రకరకాల ఖనిజాల తవ్వకం చేపడుతున్న వ్యాపారాలన్నీ చట్టవిరుద్ధమయిపోతాయన్నారు. అంటే 'సమత' కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరువాత ఈ నాలుగేళ్ల కాలంలో ఆ లీజులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయలేదన్న మాట! దీనిని కోర్టు ధిక్కారమనరు కాబోలు.

'అభివృద్ధి'కి అడ్డంకిగా అయిదవ షెడ్యూలును సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది కాబట్టి ఇప్పుడు ఆ అయిదవ షెడ్యూలును సవరించి, ప్రైవేట్ వ్యక్తులకూ కంపెనీలకూ షెడ్యూల్డు ప్రాంతంలో భూములను వ్యవసాయేతర అవసరాల కోసం లీజుకు ఇవ్వడానికి ఆటంకం లేకుండ చేసుకోవాలని కేంద్ర మైనింగ్ శాఖ ఈ 'రహస్య' పత్రంలో ప్రతిపాదించింది.

ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి. ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకూ కంపెనీలకూ ఏజెన్సీలో భూముల లీజు ఇవ్వడానికి వీలు లేదనలేదు. ప్రభుత్వం తన ఆధీనంలోని గనుల సంస్థలకు భూమిని లీజుకు ఇచ్చి ఖనిజాల తవ్వకం చేపట్టవచ్చునని ఆ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టంగానే చెప్పింది. ఏజెన్సీలో గనుల నిర్వహణ ప్రభుత్వమే చేపట్టినా అది ఆదివాసుల జీవితంపైన దుష్ప్రభావం వేస్తుంది కదా అన్న ప్రశ్న ఇక్కడ అప్రస్తుతం. అయిదవ షెడ్యూలులో ఈ మేరకు మాత్రమే సుప్రీంకోర్టు నిషేధాన్ని చూడగలిగింది.

కాబట్టి 'అభివృద్ధి'కి సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా ఆటంకమేం కాదు. అయినప్పటికీ దానిపైన అంత కోపం ఎందుకు? మనవాళ్లు ప్రభుత్వ రంగంలో ఏ అభివృద్ధి పనులూ చేపట్టదలచుకోలేదనేది వారి విధాన వైపరీత్యం.

దానికి సుప్రీం కోర్టు ఏం చేయగలదు?

రెండవ విషయం, ఇప్పుడు ప్రతిపాదిస్తున్న సవరణ ఎంత దూరం పోతుందనేది. వాళ్లు ప్రకటించుకున్న అవసరాలకోసం చిన్న సవరణ సరిపోయేది. 'ప్రైవేటు వ్యక్తులకుగానీ కంపెనీలకుగానీ వ్యవసాయేతర అవసరాల కోసం భూములు లీజుకు ఇవ్వడానికి ఈ షెడ్యూలు ఆటంకం కాదు' అంటే సరిపోయేది. కానీ ఇప్పుడు ప్రతిపాదిస్తున్న సవరణ దానిని దాటి చాలా దూరం పోతుంది. ఆదివాసుల శ్రేయస్సు కోసం సాధారణ చట్టాలను పక్కనపెట్టి ఏజెన్సీకి ప్రత్యేక రెగ్యులేషన్లు చేసే అధికారాన్ని ఆయిదవ షెడ్యూలు రాష్ట్ర గవర్నర్‌కు ఇస్తుందనేది తెలిసిన సంగతే. ఇప్పుడు చంద్రబాబు ఒత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం అయిదవ షెడ్యూలుకు ప్రతిపాదిస్తున్న సవరణ ఏమంటుందంటే, 'ఏజెన్సీలో వ్యవసాయేతర అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తులకు గానీ కంపెనీలకు గానీ భూమిని లీజుకు ఇవ్వడాన్ని నిషేధిస్తూ రాష్ట్ర గవర్నర్ అయిదవ షెడ్యూలు కింద రెగ్యులేషన్ జారీ చేయడానికి వీలులేదు' అంటుంది.

అంటే ఇంకెప్పుడయినా చంద్రబాబు కంటే భిన్నంగా ఆలోచించే వాళ్లు ఏజెన్సీ ఉన్న ఏ రాష్ట్రంలోనయినా అధికారానికి వచ్చినా, ఏజెన్సీలో గనుల లీజును నిషేధిస్తూ చట్టం చేయడానికి వీలుండదు. వాళ్లు కూడ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నట్టు రాజ్యాంగాన్ని మళ్లీ సవరించాల్సిందే! మన పాలకుల చేతిలో రాజ్యాంగమొక ఫుట్‌బాల్ అయిపోయిందంటే అతిశయోక్తి కాదు.

కేంద్ర గనుల శాఖ ప్రతిపాదించినంత మాత్రాన ఈ సవరణ జరిగిపోతుందా అని ఉదాసీనంగా ఉండకూడదు. అయిదవ షెడ్యూలును పార్లమెంటు సాధారణ మెజారిటీతో సవరించవచ్చుననీ, ఆ సవరణకు రాజ్యాంగ సవరణలకు వర్తించే నియమాలేవీ వర్తించవనీ రాజ్యాంగమే అంటుంది. కాబట్టి పార్లమెంటు ఉభయ సభలలో మెజారిటీ సంపాదించుకోగలిగితే చాలు, ఈ సవరణ చేసేయగలరు. ఇప్పుడు దేశంలోని రాజకీయ పార్టీలలో మెజారిటీ చంద్రబాబు అభిమాన బృందంలో చేరాయి కాబట్టి ఆదివాసుల శ్రేయస్సు కోరేవారు పెద్దెత్తున అల్లరి చేయకపోతే ఈ సవరణ తీసుకురావడం మన పాలకులకు పెద్ద కష్టం కాదు.

మార్చి 3, 2001

# కరెంటు చార్జీల సీజన్ మళ్ళీ వచ్చింది

రాబోయే సంవత్సరం (2001-2002)లో మన నుండి వసూలు చేయబోయే కరెంటు చార్జీలను నిర్ణయించడానికి విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్) తన విచారణ త్వరలోనే ప్రారంభించనుంది. ట్రాన్స్ కో నుండి, నాలుగు డిస్కాంల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం, వాటిపైన ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించడం కూడా జరిగిపోయింది. ఏప్రిల్ 1 లోపల ఈ ప్రతిపాదనలు, అభ్యంతరాలపైన కమిషన్ విచారణ జరిపి కొత్త సంవత్సరం చార్జీలు ప్రకటించవలసి ఉంది.

నిగాహ్

ఈ మొత్తం ప్రక్రియలో ఉత్కంఠతో ఎదురుచూసేదేమీ లేదు. ట్రాన్స్‌కో, డిస్కాంల ప్రతిపాదనతో మొదలయి రెగ్యులేటరీ కమిషన్ చేసే చార్జీల నిర్ణయంతో ముగిసే ప్రక్రియలో మొదటిదీ చివరిదీ ప్రపంచబ్యాంకు ఆమోదం ప్రకారం ఉండవలసిందేనని 1999 జనవరి 31న మన పాలకులు ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందం స్పష్టం చేస్తుంది. ఇంక మిగిలింది మధ్యలో వచ్చే ప్రజల అభ్యంతరాలు. దాని మీద ప్రపంచ బ్యాంకు అజమాయిషీ లేదు గానీ రెగ్యులేటరీ కమిషన్ అనుసరిస్తున్న విచారణ పద్ధతి వల్ల వచ్చే పరిమితులు చాలా ఉన్నాయి.

మొదటిది ట్రాన్స్‌కో, డిస్కాంలు పెట్టే ప్రతిపాదనలు చాలా సాంకేతిక పరిభాషలో ఉండడమేకాక ఇంగ్లీష్‌లో మాత్రమే ప్రజలకు లభ్యం కావడం. కొంత మేరకు ఈ విషయాలలో సాంకేతిక పరిభాషనూ, పదజాలాన్నీ ప్రయోగించక తప్పదంటే ఎవరైనా ఒప్పుకుంటారు. కానీ, కరెంటు చార్జీల నిర్ణయం రైతాంగం నుండి సాధారణ గృహస్తుల దాకా అందరి జీవితాల మీద ప్రభావం వేసే విషయం కాబట్టి ఆ నిర్ణయం చేసే ప్రక్రియను వీలయినంత సరళం చేయాలన్న ఆలోచన అందులోని కీలక పాత్రధారులెవ్వరికీ రాకపోవడం విచారకరం. కనీసం ట్రాన్స్‌కో ఈ కమిషన్ ముందు పెట్టే ప్రతిపాదనల సంక్షిప్త పాఠాన్ని తెలుగులో ప్రచురించి ప్రజలకు అందుబాట్లో ఉంచాలని కిందటిసారే కొన్ని రైతు సంఘాలు కోరాయి. వారి విజ్ఞప్తి ట్రాన్స్‌కో పెద్దలకు వినిపించిన దాఖలాలు లేవు.

రెండవది విచారణ కేవలం హైదరాబాద్‌లో జరగడం. శ్రీకాకుళం నుండి, చిత్తూరు నుండి హైదరాబాద్‌కు వచ్చి రెండు వారాలు మకాం వేసి కమిషన్ నిర్వహించే విచారణలో పాల్గొనడం ప్రజలలో ఎంతమందికి సాధ్యం అవుతుంది? రాష్ట్రంలో నాలుగయిదు కేంద్రాలు ఎంచుకొని ఒక్కొక్క చోట ఒక వారమయినా విచారణ నిర్వహిస్తే కొంత మేరకైనా ఈ ప్రక్రియ ప్రజల అందుబాట్లోకి వస్తుందన్న సూచన కూడా రెగ్యులేటరీ కమిషన్ పెద్దల చెవిన పడ్డట్టు లేదు.

మూడవది, రెగ్యులేటరీ కమిషన్ విచారణకు హాజరుకాగల ప్రజల సంఖ్యనుబట్టి విచారణ స్థలాన్ని ఎంపిక చేసే బదులు, తాను ఎంపిక చేసుకున్న హాలులో ఎంతమంది పడితే అంతమందినే హాలులోకి రానిస్తుంది. గత సంవత్సరం ప్రపంచబ్యాంకు అధికారులందరినీ హాలులో కూర్చోనిచ్చింది గానీ, ప్రజలలోనే కాదు పత్రికా ప్రతినిధులలో సహితం చాలామందిని చోటుచాలదని బయటికి పొమ్మనింది.

ఏమయితేనేం, ప్రజలకు అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉంది, కమిషన్‌కు ఆ అభ్యంతరాలు వినే బాధ్యత ఉంది కదా అనవచ్చు - ఉందికానీ నిర్ణయాలన్నీ ముందే-రెండేళ్ళ ముందే - జరిగిపోయినప్పుడు ఉండి ఏం ప్రయోజనం? ప్రతీ సంవత్సరం ట్రాన్స్‌కో, డిస్కాంలు కమిషన్ ముందు పెట్టే ప్రతిపాదనలు ప్రపంచబ్యాంకుకు ఆమోదయోగ్యంగా ఉండాలనేది 1999లో చేసుకున్న ఒప్పందంలోని ఒక ముఖ్య అంశం. వాళ్ళు ఇంకా సబ్సిడీల వంటివి అలవాటయిన పొరపాట్లుగా ఎక్కడ కొనసాగిస్తారో అని ప్రపంచబ్యాంకు ఈ షరతు పెట్టింది. కాబట్టి మనం చూడకముందే ట్రాన్స్‌కో, డిస్కాంల ప్రతిపాదనలను ప్రపంచబ్యాంకు చూసింది, తన ఆమోదానికి అవసరమైన సవరణలు చేయించింది. రెగ్యులేటరీ కమిషన్ చేయబోయే విద్యుత్ చార్జీల నిర్ణయం కూడా అదే ఒప్పందంలో ఆనాడే జరిగిపోయింది. 2001-2002 సంవత్సరాలలో చార్జీలు 15 శాతం చొప్పున పెరగాలనీ ఆ తరువాత 2007 దాకా ప్రతీ సంవత్సరం 12 శాతం చొప్పున పెరగాలనీ 1999 లోనే రాసుకున్నారు. చంద్రబాబు అడుక్కుంటే ఈ సంవత్సరం 15 శాతం కాక 10 శాతం మాత్రమే పెంచి మిగిలిన 5 శాతాన్ని రాబోయే అయిదేళ్ళలో అడ్జెస్ట్ చేస్తే చేయొచ్చు. మనం ఎదురు చూడవలసింది ఆ భాగ్యం కోసమే!

ఆ భాగ్యం దక్కితే దక్కవచ్చును గానీ రైతాంగం బావులకు వాడే కరెంటు పైన మాత్రం చార్జీలు పెరగబోతుందనడానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. అసలే ప్రపంచ వాణిజ్య సంస్థ షరతుల పుణ్యాన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు మొదలై దేశీయ ఉత్పత్తుల ధరలు పడిపోయి, గిట్టుబాటు ధరకు కొనుక్కోవడానికి ప్రభుత్వ కొనుగోలు సంస్థలు ముందుకు రాని పరిస్థితిలో రైతాంగం ఎన్నడూ లేని సంక్షోభాన్ని

ఎదుర్కుంటున్నది. ఎప్పుడూ ఉండే కరువు ఉండనే ఉంది. కరెంటు చార్జీలు కూడా పెరిగితే పరిస్థితి ఏ విధంగా ఉండబోతుందో ఊహించడానికే భయం అనిపిస్తుంది.

కరెంటు చౌర్యం గురించి గత సంవత్సరం చాలా విన్నాము. మర్యాదస్తుల భాషలో దానిని 'పంపిణీ నష్టం' అంటారు. ఈ నష్టాన్ని తగ్గించుకోవడం చేతకాని ట్రాన్స్‌కోకు ప్రజలు చెల్లించే చార్జీలలో పెంపుదల కోరే హక్కు లేదనీ రెగ్యులేటరీ కమిషన్ ఆ చార్జీలను పెంచడానికి వీలు లేదనీ ఆనాడే వాదించాము. అప్పుడు ట్రాన్స్‌కో రెగ్యులేటరీ కమిషన్‌కు ఒక్క హామీ ఇచ్చి తప్పించుకుంది. తన విధి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా రాబోయే సంవత్సరంలో 500 కోట్లు ఆదా చేస్తానని హామీ యిచ్చింది. ఆ మేరకు చార్జీలు పెంచవద్దనింది. తనను తాను సంస్కరించుకునే ప్రయత్నం ట్రాన్స్‌కో చేపట్టింది కాబట్టి ట్రాన్స్‌కో ప్రతిపాదనలో ఆ 500 కోట్లు మినహాయించి తక్కిన దానికి తగిన పెంపుదల జారీ చేయడంలో తప్పులేదని రెగ్యులేటరీ కమిషన్ భావించింది. వట్టి గాలి మాటలు నమ్మి ఈ నిర్ణయానికి రావడం సబబు కాదని హైకోర్టులో మాబోటి వాళ్ళము వాదించినప్పటికీ హైకోర్టు కూడా ట్రాన్స్‌కో పశ్చాత్తాపానికి సంతృప్తి చెంది అందులో తప్పేమీ లేదనింది.

ఈ సంవత్సరం ట్రాన్స్‌కో పెట్టిన ప్రతిపాదనలలో ఆ 500 కోట్ల ప్రస్తావనే లేదు. ఆదా చేస్తామని హామీ యిచ్చిన 500 కోట్లు ఆదా చేసిందా, లేదా? చేయనట్లయితే కిందటి సంవత్సరం ఉదారంగా తగ్గించిన భారం ఈ సంవత్సరం మన మీద వేయబోతారు కదా? ఈ సంవత్సరం అభ్యంతరాలు దాఖలు చేసిన ప్రజా సంఘాలు ఈ ప్రశ్నే వేసాయి. రెగ్యులేటరీ కమిషన్ ఏమంటుందో చూడాలి. అయితే కిందటి సంవత్సరం లేవదీసిన అన్ని అభ్యంతరాల కంటే బలమైంది ట్రాన్స్‌కో ప్రైవేట్ విద్యుదుత్పత్తిదారులతో చేసుకొన్న కొనుగోలు ఒప్పందాలకు సంబంధించినది. అవి చాలా నష్టకరమనీ రెగ్యులేటరీ కమిషన్ వాటిని తెప్పించుకొని పరిశీలించి అవసరమయితే రద్దు చేయాలనీ ప్రజా సంఘాలు కోరాయి. ఆ పని చేయకుండా కరెంటు చార్జీలు నిర్ణయించడం న్యాయం కాదన్నాయి.

రెగ్యులేటరీ కమిషన్ గత సంవత్సరం ఈ అభ్యంతరాన్ని లెక్క చేయలేదు. అది అన్యాయమంటే హైకోర్టు కూడా ఒప్పుకోలేదు. అందువల్ల ఆ అభ్యంతరం ఇంకా మిగిలిపోయింది. ఈ సారి కూడా ప్రజా సంఘాలు ఆ అభ్యంతరం లేవదీశాయి. ఎన్‌రాన్ కథను ఉదహరించాయి. కొనుగోలు ఒప్పందాలను తెప్పించి వాటిని తరచి చూసి నష్టకరమైన ఒప్పందాలను రద్దు చేయాలనీ, ఆ తరువాతే చార్జీల నిర్ణయం చేయడం సబబుగా ఉంటుందనీ అన్నాయి. ఈ సారైనా రెగ్యులేటరీ కమిషన్ వింటుందేమో చూడాలి.

# ముల్లా మహమ్మద్ ఉమర్‌కు సలాములు

మితిమీరిన మూర్ఖత్వం వల్ల ఒక్కొక్కసారి కొన్ని ప్రయోజనాలుంటాయి. దానిని అందరూ ఖండిస్తారు. కాబట్టి, అప్పటి వరకు ఒక సామాన్య ప్రాతిపదిక లేని కారణంగా పరస్పర దూషణగా సాగిన సంభాషణ సంవాదంగా మారే అవకాశం ఏర్పడుతుంది. 'మీ ప్రమాణాలు మేము ఒప్పుకోము కాబట్టి మీకు మేము జవాబు చెప్పనక్కర్లేదు' అనేవాళ్ళు తమకే తెలియకుండా ఒక సామాన్య ప్రమాణాన్ని ఒప్పేసుకుంటారు కాబట్టి రేపు ఆ మాట మళ్లీ అనలేరు.

బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు, క్రైస్తవ పూజా స్థలాలను తగలబెట్టినప్పుడు, బైబిల్ గ్రంథాలను కాల్చేసినప్పుడు 'ఇది అనాగరికం' అని అభిశంసిస్తే అది హిందువుల సెంటిమెంట్లకు సంబంధించిన విషయమనీ జాతి ఆకాంక్ష అనీ విదేశీయులూ లౌకికవాదులూ నిర్దేశించే ప్రమాణాలను తాము ఆమోదించమనీ మన హిందుత్వవాద పార్టీలన్నీ అన్నాయి. 'సార్వజనీన ప్రమాణాలను మేము అంగీకరించము' అని ప్రకటించడం సంవాదాన్ని తప్పించుకోవడానికీ, మన ప్రవర్తనకు ఎవరికీ జవాబు చెప్పకుండా ఉండటానికీ సులభమైన మార్గం. సార్వజనీనమని ప్రకటించుకునే ప్రమాణాలన్నీ నిజానికి సార్వజనీనం కాకపోవచ్చును. కాబట్టి అన్ని ప్రమాణాలను విమర్శనాత్మకంగా చూడాలన్న న్యాయమైన అభ్యంతరాన్ని ఈ తప్పుడు ప్రయోజనం కోసం అన్ని రకాల 'పునాది వాదులు' వక్రీకరించి వాడుకుంటూ ఉంటారు. మన సంఘ్ పరివార్ గుంపు అందులో ప్రథములు. ఈ వైఖరి అహేతుకం అని వారి చేతనే చెప్పించడానికి తాలిబన్ల అతిమూర్ఖత్వం పనికొచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌లో బౌద్ధ విగ్రహాల విధ్వంసాన్ని గురించి వార్తలు రావడం మొదలయినప్పటి నుండి మన దగ్గర అందరికంటే ఎక్కువగా హిందుత్వవాదులు దానిని ఖండిస్తున్నారు. ఖండించే క్రమంలో తమకే తెలియకుండా సార్వజనీన ప్రమాణాలను ఉటంకించే 'ట్రాప్'లో పడిపోతున్నారు. 'ఈ చర్య అఫ్ఘాన్ ప్రజలసెంటిమెంట్లకు వ్యతిరేకం' అనడం లేదు వాళ్లు. 'ఇది అనాగరికం' అంటున్నారు. 'ఇది అఫ్ఘాన్ జాతి ఆకాంక్షలకు విరుద్ధమైన

చర్య' అనడం లేదు, 'ఇది మానవ సాంస్కృతిక వారసత్వాన్ని విధ్వంసం చేసే చర్య' అంటున్నారు.

వాళ్ల భాషలోనే ముల్లా మహమ్మద్ ఉమర్ జవాబు చెప్తే ఏమంటారు? అతను అఫ్ఘాన్ సంస్కృతి ఇస్లామిక్ సంస్కృతేనంటాడు. ప్రవక్త మహమ్మద్ పుట్టకముందే అఫ్ఘానిస్తాన్‌లో ఒక అభివృద్ధి చెందిన నాగరికత ఉందని ఒప్పుకోడు. ఆ సంస్కృతి చిహ్నాలు అఫ్ఘానీ జాతీయతలో భాగమేనంటే ఒప్పుకోడు. ఆ సంస్కృతి, ఆ చిహ్నాలు ఇస్లామీకరణ చెందితేనే వాటిని అఫ్ఘానీ సంస్కృతిలో భాగంగా చూస్తానంటాడు. ఇస్లామీకరణ చెందలేని వాటిని దేశం నుండి తరిమేస్తానంటాడు. విగ్రహాలు ఎట్టి పరిస్థితిలోనూ ఇస్లామీకరణ చెందజాలవు కాబట్టి వాటిని ధ్వంసం చేస్తానంటాడు.

ఇదంతా ఎక్కడో విన్నట్టు లేదూ? ఏమంటారు సుదర్శన్‌జీ! ఎప్పుడో మీ నోట పలికినట్టు లేదూ?

తాలిబన్‌ల ఘాతుకాన్ని గంభీరంగా ఖండించిన దేశాలలో చైనా కూడా ఒకటి. చైనా టిబెట్‌లో యాభై ఏళ్లుగా బౌద్ధమత చిహ్నాలనూ సంస్థలనూ తొక్కి పెట్టడానికి చేస్తున్న ప్రయత్నం స్వల్పం కాదు. టిబెటన్ జాతీయవాదం తలెత్తకుండా ఉండాలంటే ఆ జాతీయతా భావనలో విడదీయరాని భాగమైన బౌద్ధమత చిహ్నాలనూ సంస్థలనూ తొక్కిపెట్టడం అవసరమని చైనా గుర్తించింది. కొంత బలప్రయోగంతో, కొంత నక్కజిత్తులతో ఆ పని చేస్తున్నది. 'మానవ జాతి వారసత్వం' అని అఫ్ఘానిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాలను అభివర్ణించడానికి ఏ మాటయితే అందరూ ప్రయోగిస్తున్నారో ఆ మాట వర్తించే కట్టడాలనేకం టిబెట్‌లో నిరాదరణకు గురయి నాశనం అయ్యాయి. 'సాంస్కృతిక విప్లవ' కాలంలోనయితే ప్రత్యక్ష దాడులతోనే నాశనం అయ్యాయి.

బౌద్ధానికి ప్రతినిధులుగా తాలిబన్‌ను గట్టిగా తిట్టిన వారిలో శ్రీలంక పాలకులూ ఉన్నారు. ఆ దేశంలో మాత్రం సింహళ భాష, బౌద్ధమతం తప్ప వేరే ఏ సంప్రదాయమూ తమ జాతీయతలో భాగం కాదని, వేరే ఏ సాంస్కృతిక వారసత్వాన్నీ తమ సంస్కృతిలో భాగంగా గుర్తించమనీ గొడవ పెడుతున్న సింహళీయ అతివాదులను కాదనడం వారికి సాధ్యం కావడం లేదు. తమిళ భాషకుగానీ హైందవ మతానికి గానీ సింహళంతో బౌద్ధంతో సమాన ప్రతిపత్తి కల్పించి బతకగల రాజకీయ పార్టీ శ్రీలంకలో లేదు.

వీటిని తాలిబన్‌ల దుశ్చర్యలతో సమానం చేసిచూడడం న్యాయం కాదంటారు. కాదని నేను కూడా ఒప్పుకుంటాను. అవమానవీయమైన, అనాగరికమైన చర్యలలోనూ హెచ్చు తగ్గులుంటాయనీ ఆ తేడాలను తృణీకరించకూడదనీ అంటేనూ ఒప్పుకుంటాను.

కానీ ఇక్కడుండేది కేవలం హెచ్చుతగ్గుల తేడా కాదు. ఇతరులు తమ అనాగరికతకొక ఆకర్షణీయమైన పేరు పెట్టుకుంటున్నారు. తాలిబన్లకు చేతకాకనో ఏమీ దొరకకనో అవసరమనుకోకనో గానీ తమ మూర్ఖత్వానికి వాళ్ళు రాజకీయంగా ఆమోదనీయమైన పేరేదీ పెట్టుకోవడం లేదు. చైనా టిబెట్‌లో ప్రజల విశ్వాసాలపైన చేసిన దౌర్జన్యానికి భూస్వామ్య వ్యతిరేకపోరాటం అని పేరు పెట్టుకుంది. శ్రీలంక తన సమాజంలోని తమిళులకు సమాన హక్కులను నిరాకరించడాన్ని భారత విస్తరణవాదంపైన పోరాటంగా అభివర్ణించుకునింది. ఆ పని చేయని తాలిబన్‌ల అతి మూర్ఖత్వం వీరందరూ చూపించే సుందరమైన కారణాల వెనుక దాగి ఉన్న అనాగరికమైన వైఖరుల గురించి మాట్లాడుకోవడానికి మనకు అవకాశం కల్పించింది. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలోకి యూరప్ నుండి వలసపోయి స్థిరపడిన తెల్లవాళ్ళు స్థానికులయిన ఆదివాసీలను తీవ్రమైన బలప్రయోగంతో అణచివేశారు. భౌతికంగా వారిని మట్టుబెట్టడమే కాక వారి నాగరికతా చిహ్నాలను నామరూపాలు లేకుండా ధ్వంసం చేశారు. అవి కూడా అఫ్ఘానిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాల లాగా మానవ సాంస్కృతిక వారసత్వానికి చెందినవే.

ఈ రోజు అమెరికాలోనూ ఆస్ట్రేలియాలోను ఉన్న తెల్లవాళ్ళు తమ తాత ముత్తాతలు చేసిన దౌర్జన్యాన్ని చర్చించుకుంటున్న మాట వాస్తవమే. అందరూ కాకున్నా కొందరు దానిని దౌర్జన్యంగా గుర్తిస్తున్న మాట కూడా వాస్తవమే. ఇప్పుడొప్పుకుంటే వారికి పోయిందేమీ లేదని సినికల్‌గా అనొచ్చునేమో గానీ ఒప్పుకునే సంస్కారం కొంతమందయినా ప్రదర్శిస్తున్నారని గుర్తించక తప్పదు. కానీ తమ తాత ముత్తాతలు తాలిబన్‌ల వంటి వారేనని ఆ దేశాల తెల్లజాతీయులు – ఇవాళ తాలిబన్‌లను పురుగుల లాగా చూస్తున్నవారు – ఒప్పుకునే రోజు వస్తుందా? తాలిబన్‌ల అనాగరిక చర్య ఈ ప్రశ్నను వారి ముందు నిక్కచ్చిగా నిలబెట్టింది కదా?

అందుకే ముల్లా మహమ్మద్ ఉమర్‌కు నా సలాములు. వారికి శాంతి అగుకాక.

మార్చి 31, 2001

# న్యాయానికివి రోజులు కావు

పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ మండలాలలో కొన్నేళ్ళుగా సాగుతున్న అలజడుల చరిత్ర రాసే రోజు వచ్చినప్పుడు మన రాష్ట్ర హైకోర్టుకు కొన్ని అక్షింతలు తప్పక పడతాయి.

ఏజెన్సీప్రాంతాలకు సంబంధించి మన హైకోర్టు ఇచ్చిన తీర్పులన్నీ ఒకే రకంగా లేవుగానీ, మొత్తం మీద అయిదవ షెడ్యూలులోని విస్తృతమైన సంక్షేమ లక్ష్యాల వెలుగులో కాక సంప్రదాయక ఆస్తి చట్టాల వెలుగులో ఏజెన్సీనీ ఏజెన్సీ చట్టాలనూ చూసిన సందర్భాలే ఎక్కువ అని చెప్పుకోవచ్చు. అయితే సంప్రదాయక బూర్జువా సివిల్ చట్టాలకు సంబంధించిన న్యాయ సిద్ధాంతాన్ని సహితం తృణీకరించి అందులో ఉన్న నియమాల పరిధిలో కూడా ఆమోదనీయం కాని ఆర్డర్లు మన హైకోర్టు జడ్జీలు జారీ చేసిన సందర్భాలున్నాయని గుర్తించినప్పుడు ఇక్కడున్నది కేవలం న్యాయ సిద్ధాంత సంబంధమైన సంప్రదాయకత కాదనీ అంతకంటే గర్హనీయమైన తక్షణ కారణాలు ఉన్నాయనీ అర్థమవుతుంది.

కోర్టులిచ్చే 'స్టే' ఆర్డర్ల గురించి అందరికీ అంతో యింతో తెలుసును. కేసులో తుది నిర్ణయం ఇచ్చే లోపల తక్షణ నష్టం జరగకుండా ఉండేందుకు కోర్టులు 'స్టే' ఆర్డర్లు ఇస్తుంటాయి. 'ఇప్పటి దాకా ఉన్న పరిస్థితిని మార్చవద్దు' అనేది స్టే ఆర్డర్లలో ఎక్కువ భాగం దర్శనమిచ్చే తాఖీదు. ఒక్కొక్కసారి కొద్దికాలం క్రితం అమలులోకి వచ్చిన మార్పును పక్కకు తొలగించి దానికి ముందు ఉన్న పరిస్థితిని 'స్టే' ద్వారా పునరుద్ధరించడం జరుగుతుంది. కానీ చాలా కాలంగా ఉనికిలో ఉన్న విషయాలను 'స్టే' ద్వారా పక్కన పెట్టకూడదనేది సంప్రదాయక సిద్ధాంతంలోని నియమాలలో ఒకటి. తుది నిర్ణయం చేసేటప్పుడు ఎంత పాత వాడుకయినా, ఆచారమయినా చెల్లదని తేలితే దానిని కొట్టేయవచ్చు. కానీ మధ్యంతర ఆర్డర్లలో అప్పటికి స్థిరపడి ఉన్న విషయాలను 'స్టే' చేయకూడదని సంప్రదాయక న్యాయ సిద్ధాంతం చెప్తుంది.

అయితే మన హైకోర్టు ఏం చేసిందో చూడండి. ఏజెన్సీ రూపురేఖల నిర్ణయం బ్రిటిష్ హయాంలోనే ఏనాడో జరిగింది. ఏజెన్సీ గ్రామాల జాబితా ఆనాడే నిర్ణయం అయింది. 1950లో స్వతంత్ర భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తరువాత దాదాపు అదే జాబితాను రాష్ట్రపతి ఏజెన్సీ గ్రామాల జాబితాగా జారీ చేశారు. ఆ గ్రామాలలో ఏజెన్సీ చట్టాలు ఆనాటి నుండి అమలవుతూనే ఉన్నాయి.

అటువంటిది, 1980ల చివరి సంవత్సరాలలో పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ఏజెన్సీ గ్రామాల రైతులు 'మా గ్రామాన్ని ఏజెన్సీలో చేర్చడమే తప్పు' అంటూ హైకోర్టులో రిట్ పిటిషన్‌లు వేయగా హైకోర్టు వాటిని అడ్మిట్ చేసుకోవడమే కాక దశాబ్దాలుగా అన్ని ఏజెన్సీ చట్టాలూ అమలయిన ఆ గ్రామాలకు ఎల్‌టిఆర్ చట్టం నుండి 'విముక్తి' కలిగించే స్టే ఇచ్చింది. జీలుగుమిల్లి ఏజెన్సీలో గిరిజన – గిరిజనేతర ఘర్షణలు మొదలయిన తరువాత ఈ ఘర్షణకు మూలమేమిటని వెతికితే హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్లని తేలింది. అయితే అక్రమమైన 'స్టే' ఆర్డర్లను ఎట్లా ఇచ్చామన్న ప్రశ్న వేసుకున్న పాపానికి హైకోర్టు పోలేదు కాని, అప్పటికి స్టే ఆర్డర్లను తొలగించింది.

దానితో ఆ గ్రామాలలో ఎల్‌టిఆర్ చట్టాన్ని అమలు చేసి ఆదివాసులకు భూమి ఇప్పించే అవకాశం ప్రభుత్వానికి కలిగింది. అయితే ఎప్పటి లాగా ఈ పని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తన కార్యాలయంలో కూర్చొని 'ఎవరి కాయితాలు వాళ్లు తీసుకొచ్చి వాదించుకోండి' అనే పద్ధతిలో చేస్తే ఆదివాసులకు న్యాయం జరగదని ఆదివాసీ ఉద్యమ సంస్థలూ హక్కుల సంఘాలూ అభ్యంతరం తెలిపేసరికి ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ శాఖ ఎల్‌టిఆర్ చట్టం అమలు గురించి వివరమైన నియమావళి ఒకటి జారీ చేసింది. రెవెన్యూ అధికారులు గ్రామాలలోనే కూర్చొని భూమి సంబంధమైన రికార్డు ప్రజల సమక్షంలో బిగ్గరగా చదివి దానిని పరిశీలించే అవకాశం ఇరు పక్షాలకూ ఇవ్వాలని ఆ నియమావళి అంటుంది. ఒక కేసు విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ నియమావళి జారీ చేసిన విషయం హైకోర్టు దృష్టికి తేగా, జస్టిస్ బి.ఎన్.ఎ.స్వామి ఆ నియమావళి అమలును తన తీర్పులో భాగం చేశారు. బుట్టాయగూడెం మండలంలోని ఒకే ఒక్క గ్రామంలో అది ఒక మోస్తరుగా అమలయింది. అంతకుముందు గిరిజనేతరులు ఒప్పుకున్న దానికంటే కొన్ని వందల ఎకరాలు ఎక్కువ వారి అక్రమ ఆక్రమణలో ఉన్నట్టు తేలింది. అందువల్ల ఇంక ఏ గ్రామంలోను దానిని అమలు కానియ్యకూడదని గిరిజనేతరులు నిర్ణయించుకున్నారు. అధికార యంత్రాంగాన్ని అదిలించి బెదిరించి కోటగిరి విద్యాధరరావు వంటి నాయకులను వాడుకొని దానిని అమలు కాకుండా చూశారు.

అప్పటికే ఆ నియమావళి జస్టిస్ స్వామి జారీ చేసిన ఒక తీర్పులో భాగమయింది కాబట్టి, దానిని అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారం అవుతుంది అని 'శక్తి' అనే

నిగాహ్

సంస్థ మళ్లీ కోర్టుకెక్కింది. ఈసారి జస్టిస్ స్వామి తన తీర్పును పునరుద్ఘాటించడమే కాక, ప్రభుత్వం జారీ చేసిన నియమావళి అమలును పర్యవేక్షించడానికి ఒక రిటైర్డు జిల్లా జడ్జిని నియమించారు.

ఈ నియమాకాన్ని ప్రశ్నిస్తూ గిరిజనేతరులు అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచి ముందు రిట్ అప్పీల్ వేసి దానిని 'స్టే' చేయించారు. కేవలం పర్యవేక్షక అధికారి నియామకాన్ని 'స్టే' చేసినప్పటికీ మొత్తంగా ప్రభుత్వం ప్రకటించిన నియమావళి అమలునే స్టే చేయడం జరిగిందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు, ఇతర అధికారులు అనసాగారు.

ఇది వాస్తవం కాదని ఆదివాసీ సంఘాలూ వారి శ్రేయోభిలాషులూ ఆందోళన చేయగా, రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి బిస్వాల్‌గారు విషయాన్ని పరిశీలించి ఇది సత్యమేనని గ్రహించి, ఎల్‌టిఆర్ చట్టం అమలుకోసం ప్రభుత్వం గతంలో ప్రకటించిన నియమావళి అమలుకు హైకోర్టు ఇచ్చిన స్టే ఆటంకం కాదనీ ఆ నియమావళి అమలు కొనసాగవచ్చునీ సర్క్యులర్ జారీ చేశారు.

బిస్వాల్ గారికి హైకోర్టు చేతనే మొట్టికాయ వేయించాలని గిరిజనేతరులు నిర్ణయించుకున్నారు. జస్టిస్ సుభాషణ రెడ్డి, భిక్షపతి గార్ల బెంచి ముందు విచారణ జరుగుతున్న ఒక కేసులో బిస్వాల్ గారికి కోర్టుకు రమ్మన్న తాఖీదు వచ్చింది. హైకోర్టు ఇచ్చిన 'స్టే' మొత్తం నియమావళికి వర్తిస్తుందనీ కేవలం జస్టిస్ స్వామి దాని అమలు పర్యవేక్షణ కోసం నియమించిన రిటైర్డ్ జడ్జి నియామకానికి కాదనీ జస్టిస్ సుభాషణ రెడ్డి ప్రకటించి, 'ఈ సాయంత్రంలోగా సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోకపోతే అతను కోర్టు ధిక్కారానికి పాల్పడినట్టు భావిస్తాం' అన్నారు. ముఖంలో నెత్తురుచుక్క లేకుండా కోర్టు నుండి బయటికి పోయిన బిస్వాల్ గారు ఆ సాయంత్రం 4 గంటల లోపల తన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుంటూ ఇంకొక సర్క్యులర్ జారీ చేశారు. ఎల్‌టిఆర్ చట్టం అమలు తిరిగి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల కార్యాలయాలలోకి వెళ్లిపోయింది.

జస్టిస్ సుభాషణ రెడ్డి కోర్టు నుండి బయటకు పోతున్న బిస్వాల్ గారి ముఖం చూసిన వారందరికీ ఇవి ఆదివాసులకే కాదు, హైకోర్టుకు కూడా మంచి రోజులు కావనిపించింది. ఈ విషయం హైకోర్టు గుర్తించే లోపల ఇంకెంత మంది ఆదివాసులు పోలీసు లాఠీ దెబ్బలూ గిరిజనేతర గుండా గుంపుల దాడులూ రుచి చూడవలసి వస్తుందో!

ఏప్రిల్ 14, 2001

# 'సంఘటిత నేరస్తుల' గురించి రాయడమూ నేరమే

మొన్ననే రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 'సంఘటిత నేరాల నియంత్రణ చట్టం' గురించి అసెంబ్లీలోనూ బయట కూడా కొంచెం గొడవ అయిందిగానీ చాలామంది గమనించని అంశాలు అందులో కొన్ని ఉన్నాయి.

సంఘటిత నేరాలకు పాల్పడే గుంపులకు సంబంధించిన వార్తలు రాసే స్వేచ్ఛను పత్రికలకు నిరాకరించడం ఇందులో ముఖ్యమైనది. గతంలో ఇటువంటి అంశాలు ఏ చట్టంలో ఉన్నా పత్రికా రంగం బాగా అల్లరి చేసి, ఎవరి సంగతి ఎట్లాగున్నా మా స్వేచ్ఛకు మాత్రం హాని జరగడానికి వీలు లేదని ఒత్తిడి పెట్టి ఆ మేరకు చట్టాన్ని సవరించేటట్టు చేయగలిగేది.

ఈసారి ఎందుకో పత్రికా రంగం నోరు మెదపకుండానే కొత్త చట్టంలోని పత్రికా స్వేచ్ఛకు హానికరమైన అంశాలను 'పాస్' కానిచ్చింది. అలసిపోవడం వల్లనా? ఎప్పుడో ఒకప్పుడు జరిగేదే, ఎన్నాళ్ళు ఆపుతాం అన్న నిస్పృహ వల్లనా? సంఘటిత నేరాలను అదుపు చేసే బృహత్కార్యంలో తమ స్వేచ్ఛ సహితం ఒక సమిధ కావడానికి సిద్ధపడిన త్యాగ బుద్ధి వల్లనా? లేక చంద్రబాబు సమ్మోహన శక్తి వల్లనా?

సంఘటిత నేరబృందాలకు తోడ్పడగల ఏ సమాచారాన్నయినా ప్రచురించడం సంఘటిత నేరాలకు తోడ్పడడంతో సమానమేనని కొత్త చట్టంలోని సెక్షన్ 2 (i) (a) (ii) అంటుంది. ఇంకా ఏమైనా అనుమానం మిగిలిపోతుందేమోనని దానికిందే మరింత స్పష్టంగా 'సంఘటిత నేర బృందాలు ఇచ్చిన ఏ పత్రాన్ని గానీ ఏ సమాచారాన్ని గానీ ప్రచురించడం' వారికి తోడ్పడడం అనే నేరంతో సమానమంటుంది.

సంఘటిత నేర బృందాలు అనేది మనకు కొత్తమాట కాబట్టి అటువంటివి ఇక్కడేం లేవనుకునేరు. మన చుట్టూ ఉన్నాయి. అవి ఉండడం మంచిది కావచ్చు, చెడ్డది

నిగాహ్

కావచ్చు – కానీ అది వార్త కాదంటే ఎట్లా? ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది గానీ బలప్రయోగంతో, బెదిరింపుతో నేరాలు మళ్లీ మళ్ళీ చేస్తున్నట్టయితే వారిపైన మూడవసారి చార్జిషీటు పెట్టినప్పటి నుండి ఆ 'ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది గానీ' ఒక సంఘటిత నేర బృందం అవుతారు. అటువంటివి మన చుట్టూ ఎన్ని లేవు?

బందిపోటు ముఠాలు, ఫ్యాక్షన్ ముఠాలు, ఏజెన్సీలో పదేపదే గిరిజనేతరుల భూములలోకి (కట్టెలతో, బరిసెలతో, బాణాలతో) దిగే ఆదివాసీ బృందాలు, నక్సలైట్లు, పట్టణ ప్రాంతాలలోని మాఫియా గ్యాంగులు, నంజుండ స్వామి నమూనాలో బహుళ జాతి కంపెనీల అద్దాలు పగులగొట్టి ఫర్నిచర్ ధ్వంసం చేసే కార్యక్రమం పెట్టుకున్న రైతు సంఘాలు – ఇవన్నీ సంఘటిత నేర బృందాలే.

వీటిలో కొన్నిటి పట్ల మనకు సానుభూతి ఉంటుంది. కొన్నిటిపట్ల ఉండదు. కొన్నిటిని అసహ్యించుకుంటాం. కానీ ఈ బృందాల కార్యకలాపాల గురించి పోలీసుల కథనాలు తప్ప వేరే ఏ వార్త రాసినా అది వారికి 'తోడ్పడినట్టు' అవుతుందేమోనని పత్రికలు భయపడే పరిస్థితి ఉంటే ఎట్లా? వారి గురించి వారు చెప్పుకుంటూ ప్రచురించే కరపత్రాలను, వారు ఇచ్చే ప్రెస్‌నోట్లను ప్రచురించడం కూడా వారికి తోడ్పడడమే అవుతుందని ముద్రణాలయాలనూ, పత్రికలనూ బెదిరిస్తే ఎట్లా?

నడుస్తున్న చరిత్రకు సంబంధించి దీన్‌దార్ అంజుమన్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆ సంస్థకు చెందిన వ్యక్తులు మన రాష్ట్రంలోనూ, కర్నాటకలోనూ అనేక చర్చిలను ధ్వంసం చేసారన్న పోలీసుల అభియోగాన్ని ఆ సంస్థ సహితం అబద్ధమనలేదు. అంతమాత్రం చేత తమ సంస్థనే ఐఎస్ఐ ఏజెంటనడం న్యాయం కాదన్నారు. దానికి వత్తాసుగా వారు తమ ప్రచురణలు, తమ వ్యవస్థాపకుని ప్రవచనాల పుస్తకాలు పత్రికల వారికిచ్చారు. అన్ని పత్రికలూ కాకపోయినా కొన్ని తమంతట తాము ఈ వింత సంస్థపైన కొంత పరిశోధన జరిపి పోలీసుల చేతికి చిక్కిన వారు నేరస్తులే కావచ్చును గానీ దీన్‌దార్ అంజుమన్ పోలీసులు చెప్తున్నంత దుర్మార్గమైన సంస్థగా కనిపించడం లేదని రాసాయి. హక్కుల సంఘాలు ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలను దాదాపు అన్ని పత్రికలూ ప్రచురించాయి.

ఇదంతా మనకు జ్ఞానదాయకం కాలేదా? దీనినంతా నిషేధించి పోలీసుల చార్జిషీట్ ఒక్కటే సత్యమని ప్రకటించే స్థితి రావడం మంచిదా? దీన్‌దార్ అంజుమన్ పైన కేసులు పెట్టిన నాటికి ఈ చట్టం లేదుగానీ ఉండి ఉంటే ఆ సంస్థ సభ్యులు మూడవ చర్చిని ధ్వంసం చేసిన క్షణం నుండి ఆ సంస్థ 'సంఘటిత నేర బృందం' అయి

వుండేది. అప్పుడు తనను తాను బసవడి అంశగా భావించిన ప్రవక్త మహమ్మదు అనుచరుడయిన దీన్‌దార్ వ్యవస్థాపకుని గురించి మనకు తెలిసేది కాదు. ఏకకాలంలో సంస్కృత శ్లోకాలూ అరబ్బీ వాక్యాలూ ప్రవచించే వింత సంస్కారం గల దీన్‌దార్ ప్రచారకుల గురించి తెలిసేది కాదు. హిందూ, ముస్లిం అనేవి అనుల్లంఘనీయమైన సరిహద్దుకు చెరొక పక్కన ఉన్న శిబిరాలని అందరూ అనుకుంటున్న ఈ రోజులలో ఆ సరిహద్దుకు ఈ పక్కన ఒక కాలు ఆ పక్కన ఒకకాలు పెట్టి నిలబడ్డ ఈ వింత మనుషుల గురించి తెలిసేది కాదు.

ఈ విషయాలు తెలియడంవల్ల నష్టపోయామా? తెలియకపోవడం వల్ల నష్టపోయి ఉందుమా?

నక్సలైట్ల వంటి రాజకీయ సంస్థల విషయంలో ఈ నిషేధం అన్యాయం చేస్తుందని ఇంత వివరంగా కూడా చెప్పనవసరం లేదు. వారి రాజకీయ స్వభావాన్ని నిరాకరించి కేవలం హింసాత్మక బృందాలుగా చూపించడానికే మన ప్రభుత్వాలు మొదటినుండి ప్రయత్నం చేస్తున్నాయి. పత్రికలు కూడా ఈ వైఖరిని కొంత మేరకు అవలంబించినప్పటికీ నక్సలైట్ల రాజకీయ స్వరాన్ని అవి పూర్తిగా నొక్కేయలేదు. వారి విధాన పత్రాలు ప్రచురిస్తున్నారు. వారి ప్రతినిధుల తో వివరమయిన ఇంటర్వ్యూలు అచ్చు వేస్తున్నారు. ఇక మీదట వేస్తే అది అయిదు సంవత్సరాల కనీస జైలు శిక్ష, అయిదు లక్షల రూపాయల కనీస జుర్మానా విధించగల నేరమవుతుంది.

చట్టంలో ఇవన్నీ రాసుకున్నా ప్రధాన పత్రికలపైన ప్రయోగించరు లెమ్మనుకునే వాళ్ళు ఉంటారు. ప్రయోగించకపోవచ్చు. కానీ అదీ ప్రమాదకరమే. చిన్న పత్రికలపైన, స్వతంత్ర ప్రచురణలపైన కరపత్రాలు అచ్చు వేసే ముద్రణాలయాలపైన ప్రయోగిస్తారు. లేదా ప్రయోగిస్తారన్న భయం వారి నోరు నొక్కేస్తుంది. సత్యాన్ని ప్రవచించే హక్కు పోలీసులకు మాత్రమే ఉండడం నష్టకరమయినట్టే, పోలీసులకూ ప్రధాన పత్రికారంగానికి మాత్రమే ఉండడం కూడా నష్టకరమే. ఒకే మోతాదులో నష్టకరమని అతిశయోక్తికి పోయి అననక్కరలేదు. కానీ నష్టకరమే.

ఏప్రిల్ 28, 2001

# గమ్యం లేని రాయబారం

**భా**రత్ పాకిస్తాన్‌ల వైరంలో సాధారణంగా వీరిని గానీ వారిని గానీ మెచ్చుకోవడానికేమీ ఉండదు. 'ఇద్దరూ ఇద్దరే' అనేది యాభై ఏళ్ల వైరాన్ని క్లుప్తంగా వివరించే వ్యాఖ్య.

కానీ ఈ మధ్య పాకిస్తాన్ ప్రభుత్వం మన పాలకులపైన చేసిన ఒక విమర్శలో మాత్రం చాలా న్యాయం ఉంది. నిజానికి ఆ విమర్శ మన దేశంలోనే ఎవరో ఒకరు చేయవలసి ఉండింది కానీ ఇతర విషయాలలో ప్రభుత్వాన్ని తూర్పారబట్టడానికి సంశయించని వారు సహితం భారత్ పాకిస్తాన్ సంబంధాల కాడికి వచ్చేసరికి మన ప్రభుత్వాన్ని ఏమైనా అంటే అది 'శత్రువుకు' (పాకిస్తాన్ మనందరికీ శత్రువయినట్టు) ఉపయోగపడుతుందని తటపటాయిస్తారు కాబట్టి ఈ విమర్శ ముషరాఫ్ ప్రభుత్వం నోటి నుండి వినవలసి వచ్చింది.

అనిశ్చితమైన అజెండాతో గమ్యం లేని రాయబారంపైన కెసి పంత్‌ను కేంద్ర ప్రభుత్వం 'కాశ్మీర్ విషయంలో మాట్లాడదలచుకున్న వాళ్లతో మాట్లాడి' రమ్మని నియమించిన నేపథ్యంలో, పాకిస్తాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్దుల్ సత్తార్ 'గత సంవత్సరం డిసెంబర్ 2నాడు చర్చల గురించి మీరు చేసిన ప్రకటన ఏమయింది?' అని అడిగాడు. మన దేశంలోని పత్రికలన్నీ పంత్‌రాయబారం ఒక గొప్ప నిర్ణయమని కీర్తిస్తున్న తరుణంలో ఆయన ఈ ప్రశ్న వేసాడు.

డిసెంబర్ 2నాడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది అర్థవంతమైన చర్చలు చేపడతామని. ఏ మిలిటెంట్లయితే 10 సంవత్సరాలుగా 'కాశ్మీర్ సమస్య'ను సాయుధ పోరాటం ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారో, వారితోనే చర్చలు జరపడానికి భారత ప్రభుత్వం సంసిద్ధత ప్రకటించింది. ఈ మిలిటెంట్ గ్రూపులు – విడిగానైనా ఉమ్మడి గానైనా – కాశ్మీరీలందరికీ ప్రాతినిధ్యం వహిస్తాయని ఎవ్వరూ అనరు గానీ వారితో చర్చలు చేపట్టడం ద్వారా సమస్య పరిష్కారానికి నాంది పలకాలన్న నిర్ణయం అర్థవంతమయినదే. అర్థవంతమే కాదు, అనివార్యం కూడా.

మరి ఆ నిర్ణయం సంగతి భారత్ మరిచిపోయిందా? అని అబ్దుల్ సత్తార్ అడుగుతున్నారు. అవును, మరిచిపోయిందా? అసలు ఈ అయిదు నెలల కాలంలో ఆ నిర్ణయం అమలు ఒక్క అంగుళమైనా ముందుకు కదిలిందా?

కదలలేదని అందరికీ తెలుసును. కదలకపోవడానికి భారత ప్రభుత్వానిదే తప్ప వేరే ఎవ్వరిదీ బాధ్యత కాదు. మిలిటెంట్లతో చర్చలు ఏ రూపంలో జరిపేదీ ఏ పరిధిలో జరిపేదీ ఒక అంగీకారానికి రావడం కోసం, మిలిటెంట్ సంస్థల మనోగతం తెలుసుకోవడం కోసం వారికి సన్నిహితులయిన హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందాన్ని పాకిస్తాన్‌కు పంపించడానికి భారత్ నిర్ణయించింది. కానీ ఈ అయిదు నెలల కాలంలో వారికి పాకిస్తాన్‌కు పోవడానికి పాస్‌పోర్టులు సహితం ఇవ్వలేదు. అంటే తానే ప్రతిపాదించిన చర్చల ప్రక్రియను తానే మొదటి మెట్టు దగ్గరే భారత్ తుంచేసింది.

అర్థవంతమైన చర్చల ప్రక్రియను గొంతునొక్కి చంపేసి ఇప్పుడు అర్థరహితమైన పంత్ రాయబారం చేపట్టింది భారత్ ప్రభుత్వం. చర్చలకు ఎవరు సిద్ధమయితే వారందరితోనూ మాట్లాడమని పంత్‌ను పురమాయించారంట. ఇంకా నయం, శ్రీనగర్ బస్‌స్టాండ్‌లో ఎవరు కనిపిస్తే వారందరితోనూ మాట్లాడి రమ్మనలేదు.

అర్థవంతమయిన చర్చలకెప్పుడూ ఒక నిర్దిష్టమైన అజెండా ఉంటుంది. అర్థవంతమైన రాయబారానికొక నిర్దిష్టమైన గమ్యం ఉంటుంది. నువ్వు ఎక్కడికయినా పోయి ఎవరు మాట్లాడితే వాళ్లతో మాట్లాడి రమ్మనేది ఒక చర్చల ప్రక్రియే కాదు. మిలిటెంట్ సంస్థలతో చర్చలు పెట్టుకోవడం ఒక అర్థవంతమైన ప్రక్రియ. అదే తుది పరిష్కారాన్ని ఇవ్వక పోవచ్చును గానీ దానితో మొదలుపెట్టడంలో తప్పు లేదు. అట్లాగే చర్చలు. మిలిటెంట్ సంస్థల రాజకీయ ప్రతినిధి అయిన హురియత్ కాన్ఫరెన్స్‌తో మొదలు పెట్టవచ్చు. హురియత్ కాన్ఫరెన్స్ కాశ్మీరీ ఆకాంక్షలో ఒక పాయకు మాత్రమే ప్రతినిధి అయినప్పటికీ వారి ప్రభావం స్వల్పం కాదు కాబట్టి చర్చలు వారితో ప్రారంభించడంలో తప్పులేదు. లేదా, కాశ్మీర్ అసెంబ్లీలోనే చర్చను ప్రవేశపెట్టడం ద్వారా సమస్యను పరిష్కరించే ప్రక్రియను మొదలుపెట్టి ఉండవచ్చును. ఈ అసెంబ్లీని ఎన్నుకున్న ఎన్నికలలో ఎన్ని అక్రమాలయినా జరిగి ఉండనీయండిగాక, ఎన్నుకోబడ్డ వాళ్లు ప్రజలలో అంతో ఇంతో పలుకుబడి, సపోర్టు ఉన్నవారే. అసెంబ్లీలో చర్చలు మొదలుపెట్టడం కూడా అర్థవంతమైన ప్రక్రియే.

వీటిలో ఒక మార్గాన్ని భారత్ ఎంచుకున్నట్టు ప్రకటించింది. తన అవగాహనలో మిలిటెంట్ల తుపాకులతోనే 'సమస్య' పుట్టింది కాబట్టి ఆ మిలిటెంట్ సంస్థలతోనే

నేరుగా మాట్లాడతానని ప్రకటించింది. కానీ అందుకు మొదటి మెట్టుగా వారితో సంప్రదింపులు జరపడానికి పాకిస్తాన్‌కు పంపాలని నిర్ణయించిన హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందానికి అయిదు నెలలు గడిచినా పాస్ పోర్టులు ఇవ్వదు. మిలిటెంట్లతో సంప్రదింపులు జరపడానికి వెళ్ళే హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధి బృందంలో ఎవరుండాలో తాను నిర్ణయిస్తాననంటుంది. హేతుబద్ధంగా ఆలోచించినట్టయితే, పాకిస్తాన్‌లో ఉన్న మిలిటెంట్ సంస్థలు హురియత్ కాన్ఫరెన్స్‌లో ఎవరిని ఎక్కువ విశ్వసిస్తాయో వారు ఆ ప్రతినిధి బృందంలో ఉండడం అవసరం. ఇండియా ఆ వ్యక్తులను ఇష్టపడనక్కరలేదు. అటువంటప్పుడు, పాకిస్తాన్‌లో స్థావరం ఏర్పరచుకున్న మతవాద మిలిటెంట్ సంస్థలకు అత్యంత సన్నిహితుడైన సయ్యద్ అలీషా గిలానీని పోవద్దనడం బొత్తిగా అర్థంలేని విషయం. లష్కర్–ఇ–తోయిబాను మతవాద మూర్ఖుల సంస్థ అని నిందించే యాసిన్ మాలిక్ ఆ బృందంలో ఉండి ప్రయోజనమేముంటుంది?

అయిదునెలలు పాస్‌పోర్టు ప్రహసనాన్ని నడిపి, ఇప్పుడు ఒక కొత్త మార్గం దొరికినట్టు కె.సి.పంత్‌గారిని 'చర్చించడానికి సిద్ధంగా ఉన్నవారందరితోనూ చర్చించి రమ్మ'ని పంపించారు. 'పాత నిర్ణయం ఏమయింది?' అని పాకిస్తాన్ ప్రభుత్వం అడిగిందంటే అడగదా మరి? ఆ ప్రశ్న మనమే అడగవలసింది.

హురియత్ కాన్ఫరెన్స్ నేతలిప్పటికే పంత్ రాయబారం తమ దృష్టిలో ఒక అక్కరకు రాని ప్రయోగం అని ప్రకటించారు. అతనితో మాట్లాడబోమన్నారు. వాళ్లు నిజానికి తమ రాజకీయ భావాలు చెప్పుకోవడానికి వెనకాడే బాపతు మనుషులు కారు. కాశ్మీర్‌కు ఎవరు పోయినా గంటల తరబడి తమ దృక్పథాన్ని వివరించి చెప్తుంటారు. వారిలో వారికి అభిప్రాయ భేదాలున్నాయి కాబట్టి ఎవరికి వారు విడిగా వివరంగా మాట్లాడతారు. అటువంటి వారు కె.సి.పంత్‌తో మాట్లాడడానికి నిరాకరిస్తున్నారంటే, అయిదు నెలలుగా తమ పాస్‌పోర్టులను అడ్డం పెట్టుకుని భారత్ ఆడుతున్న ప్రహసనం పట్ల తమ నిరసన తెలుపుతున్నారని అర్థం చేసుకోవడం సబబుగా ఉంటుంది.

మనం భారతపౌరులుగా అడగవలసిన ప్రశ్న ఏమిటంటే: భారత ప్రభుత్వానికసలు 'కాశ్మీర్ సమస్య'ను రాజకీయంగా పరిష్కరించే ఉద్దేశ్యం ఉందా? లేకపోతే 'అంతర్జాతీయ అభిప్రాయం' అని పిలువబడే అమెరికా ఒత్తిడికి లొంగి ఆచరించే ఉద్దేశ్యం లేని రాజకీయ ప్రక్రియలను ఇప్పుడొకటీ అప్పుడొకటీ ప్రకటిస్తూ సైనికంగానే సమస్యను పరిష్కరించాలన్నది భారత్ మనోగతమా?

మే 26, 2001

# అలుపెరుగని చొరబాటు

విశాఖపట్నం జిల్లాలోని తూర్పు కనుమల పై భాగాన విశాలమైన ఏజెన్సీ ఉంది. ఆ ఏజెన్సీ మధ్యభాగంలో వున్న చింతపల్లి గత సంవత్సరం వార్తలకు ఎక్కింది. అక్కడ బాక్సైట్ ఖనిజం తవ్వితీసి అల్యూమినియం తయారు చేయడానికొక గిరిజనేతర పారిశ్రామికవేత్తకు లైసెన్స్, లీజు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడం గొడవకు దారి తీసింది. ఇది మీ మేలు కోసమేనని ప్రభుత్వం ఎంత బుకాయించినా ఆదివాసులు ఎదురు తిరిగారు. ఊరూరా జన్మభూమిని బహిష్కరించారు. రాజ్యాంగం ప్రకారం కూడ ఆ ప్రయత్నం చెల్లదని హక్కుల సంఘాలూ వామపక్ష పార్టీలూ ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. చంద్రబాబు ప్రభుత్వం అప్పటికి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్టే కనిపించింది. కానీ కొన్నాళ్లకు రాజ్యాంగాన్నే సవరించి ఏజెన్సీ ప్రాంతాలలో 'అభివృద్ధి' నిమిత్తం గిరిజనేతరులకు భూములు అప్పగించవచ్చునని అయిదవ షెడ్యూలులోనే రాయించే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం గనుల శాఖచేతే మొదలుపెట్టించింది.

ఆ ప్రయత్నం ముగిసే వరకయినా మన పాలకులు ఏజెన్సీ జోలికి పోకుండా ఉంటారని ఆశించిన వారిని పిచ్చివాళ్లను చేస్తూ, ఈ మధ్యనే విశాఖపట్నం ఏజెన్సీలో 250 ఎకరాల భూమిని సినిమా షూటింగ్‌ల నిమిత్తం 'అభివృద్ధి' చేయడానికి ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డుంబ్రిగుడ మండల కేంద్రం సమీపంలోని ఈ స్థలంలో సహజంగానే సినిమా షూటింగ్‌కు అవసరమైన హంగులున్నాయి. పెద్ద పెద్ద బండరాళ్ల మధ్య ప్రవహించే సెలయేరు ఉంది. ఆ బండల మధ్య పగుళ్ళలో మొలిచిన ఎత్తయిన చెట్లున్నాయి. వెనక బాక్‌డ్రాప్‌గా సుమారయిన కొండ, దానినిండా పరచుకున్న పచ్చదనం ఉన్నాయి. ఇవతలివైపు అరకులోయ నుండి పాడేరుకు పోయే నల్లటి తారురోడ్డు ఉంది. దానికి ఈవలనున్న లోయలో ఇక్కడొకటీ అక్కడొకటీ ఎర్రటి పెంకులతో ఐటిడిఏ వారు కట్టిచ్చిన ఇళ్ల సముదాయాలయిన ఆదివాసీ గూడెంలు ఉన్నాయి.

ఈ మధ్యనే ఇక్కడొక సినిమా తీయగా అది 'సక్సెస్' అయిందంట. ఇంకొక పది సినిమాలు తీసుకొని 'సక్సెస్' చేసుకుంటే మాత్రం ఎవరొద్దంటారు? ఆదివాసులు కుళ్లుబోతులు కారు. సినిమా టాకీస్‌లో తప్ప వేరే ఎక్కడా పచ్చని ప్రకృతిని చూడలేని పట్టణవాసులు డుంబ్రిగుడ ఏజెన్సీని స్క్రీన్ మీద చూడడం కోసం పది రూపాయలో ఇరవై రూపాయలో ఇచ్చుకోవడానికి సిద్ధంగా ఉంటే, ఆ చిన్న సౌఖ్యాన్నీ దానిని ఆసరా చేసుకుని లాభాలు పొందే సినీ వ్యాపారాన్నీ నిషేధించే ఉద్దేశ్యం ఆదివాసులకేం లేదు. అయితే అందుకోసం ఒక 250 ఎకరాలను కేటాయించి దాని చుట్టూ దడికట్టి 'చొరబాటుదార్లు శిక్షించబడుదురు' అని బోర్డు పెట్టి తమనేలలో తమనే పరాయి వాళ్లను చేయడాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు.

ఒక అనుభవాన్ని వాళ్లు జ్ఞాపకం చేసుకుంటున్నారు. ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు డుంబ్రిగుడకు 20 కి.మీ. దూరాన ఉన్నాయి. అక్కడ సహజనీటి ప్రవాహమే అందమయిన గుహలను సృష్టించిందని మొదట గుర్తించింది ఆదివాసులే. వారు చెప్తేనే ప్రభుత్వ అధికార్లకు తెలిసింది. ఇప్పుడది బిజీ టూరిస్ట్ కేంద్రం అయింది. ఆదివాసులు ఆ గుహలను చూడాలంటే 8 రూపాయల టిక్కెట్ కొని చూడాలి.

అందుకే, డుంబ్రిగుడ ఎంఆర్‌ఓ ఒక పూట సర్వే జరిపి ఫెన్సింగ్ వేయడానికి స్తంభాలు పాతగానే ఆదివాసులు వాటిని పీకేసి గొడవ చేశారు. ఆ తరువాత ఒక రోజంతా ధర్నా జరిపి ఏ కాంట్రాక్టర్‌నూ ఇక్కడికి రానివ్వం అన్నారు.

చింతపల్లిలో బాక్సైట్ మైనింగ్‌కూ అల్యూమినియం ఫ్యాక్టరీకీ భూమి ఇస్తామన్నప్పుడు 'ఆదివాసులకు ఉద్యోగాలు వస్తాయి' అని ఎర చూపించారు. డుంబ్రిగుడలో అటువంటి హామీ కూడా ఏదీ ఇవ్వలేదు. సినిమా షూటింగ్‌ల కోసం రక్షిత స్థలంగా మార్చి ప్రకృతి కల్పించిన హంగులు కాక అదనంగా ఒక జలపాతమో మరొక ఆకర్షణో కల్పించే ఈ బృహత్కార్యం కొద్ది రోజులు కొద్ది మందికి కూలి చేసుకునే అవకాశం ఇస్తే ఎక్కువ. ఆ తరువాత ఒక వాచ్‌మాన్, ఒక మాలీ మినహా వేరే ఆదివాసీ ఉద్యోగులెవరూ అవసరం కారు.

అయినా అరకులోయ, బొర్రాగుహలు పర్యాటక కేంద్రాలుగా మారిన వైనాన్ని కళ్లారా చూసిన ఆ ప్రాంతపు ఆదివాసులు ఈ రకమైన 'అభివృద్ధి' వల్ల వేరే ఎవరికి ఏ ప్రయోజనాలున్నా తమకు మాత్రం ఏమీ దక్కదని గ్రహించారు. అరకులోయలో హోటళ్లు విజయవాడ వాళ్లవి. టూరిస్టుల పుణ్యాన అభివృద్ధి చెందిన చిన్నా చితక వ్యాపారాలన్నీ కొండ దిగువ గ్రామాలకూ పట్టణాలకూ చెందిన గిరిజనేతరులవి.

అప్పుడప్పుడు వచ్చిపోయే అందమైన విదేశీ కార్లను చూసే భాగ్యం మినహా ఆదివాసులకు వచ్చిందేమీ లేదు. తామేమీ కోల్పోకుండ ఇతరులకు వినోదమూ ఆదాయమూ కలిగితే ఆదివాసులు కుళ్లుకొనేవారు కారు గాని పర్యాటక అభివృద్ధి ఫలితంగా ప్రకటితమైనవీ అప్రకటితమైనవీ అనేక సరిహద్దులు ఏర్పడతాయి. అందువల్ల బొర్రా గుహలు, అరకులోయ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందడంపట్ల ఆదివాసులలో కొంత నిరసన ఉంది.

ఈ మధ్య మన రాష్ట్ర ప్రభుత్వం 'విజన్ 2020' నమూనా అభివృద్ధిలో భాగంగా పర్యాటక పరిశ్రమకు కేంద్రాలుగా ఎంచుకున్న మూడు ప్రాంతాలలో విశాఖపట్నం జిల్లా ఒకటి. అరకులోయ లాంటివి ఇంకా తయారవుతాయని దీని భావం. అయితే ప్రకృతిలో కేవలం – 'ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై' అన్నట్టు – బతకడం కాకుండ దానిపైన పెట్టుబడి పెట్టి లాభాలు సంపాదించగల పరిశ్రమ ఒక్క పర్యాటక పరిశ్రమే కాదు, వేరేవి కూడా ఉన్నాయి. సినీ పరిశ్రమ వాటిలో ఒకటి. అందువల్ల డుంబ్రిగుడలో మొదలయిన ప్రయత్నం విశాఖపట్నం ఏజెన్సీలోని ఇతర చోట్ల కూడ జరగొచ్చు.

ఇది ఎల్‌టిఆర్ చట్టానికీ రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలుకూ సుప్రీంకోర్టు 'సమత కేసు'లో ఇచ్చిన వ్యాఖ్యానానికి వ్యతిరేకం. అయితే 'బాల్కో' ప్రైవేటీకరణ సందర్భంగా ఆ వ్యాఖ్యానం తిరిగి సుప్రీంకోర్టు పరిశీలనలోకి పోయింది. అది సరయిన వ్యాఖ్యానమేనని సుప్రీంకోర్టు అంటుందా లేక దానిని కాదని కొత్త సూత్రీకరణ చేస్తుందా అనేది చూడాలి. ప్రస్తుతం న్యాయస్థానాలు ప్రదర్శిస్తున్న వైఖరిని బట్టి చూస్తే రెండవ దానికే అవకాశం ఎక్కువ ఉందనిపిస్తుంది. అయితే సుప్రీంకోర్టు ఒకవేళ తన పాత అభిప్రాయానికే కట్టుబడి ఉన్నా, మన పాలకులు రాజ్యాంగాన్ని సవరించడానికి సహితం సిద్ధంగా ఉన్నారు కాబట్టి చివరికి ఫలితం ఒకటే కాగలదు.

కాబట్టి డుంబ్రిగుడలో ఆదివాసులు మొదలుపెట్టిన చిన్న ఉద్యమానికి పెద్ద అర్థమే ఉంది. మారగల సుప్రీంకోర్టు వైఖరినీ రాగల రాజ్యాంగ సవరణనూ కాదని వారు ఏజెన్సీ పైన తమకున్న హక్కులను కాపాడుకోగలరా? తమంతట తాము కాపాడుకోలేక పోవచ్చు. మరి ప్రజాతంత్ర శక్తులన్నీ ఆ పోరాటాన్ని తమదిగా భావించి ముందుకు నడిపించడానికి సిద్ధంగా ఉన్నాయా?

జూన్ 17, 2001

# చేసేది చేస్తూ ఉపదేశాలెందుకు?

**తె**లంగాణకు జరిగిన అన్యాయాన్ని గురించి పెద్దఎత్తున చర్చ, ఆందోళన జరుగుతున్న ఈ దినాలలోనే పులిచింతల ప్రాజెక్టు పనులు చేపట్టే అనౌచిత్యానికి పాల్పడడంలో ఉన్న అహంభావాన్ని అర్థం చేసుకోవాలంటే కృష్ణా నదిపైన ఎన్ని ప్రతిపాదిత ప్రాజెక్టులు నీటి కేటాయింపు కోసం ఎంతకాలంగా కాచుకొని ఉన్నయో ఒకసారి జ్ఞాపకం చేసుకోవాలి.

ముంపు నల్లగొండకు, ప్రయోజనం కృష్ణా జిల్లాకు అన్న దొక్కటే పులిచింతల విషయంలో ఉన్న అభ్యంతరం కాదు. అదే ప్రధాన అభ్యంతరమూ కాదు. అంతకంటే ముఖ్యమైన అభ్యంతరం నీటికేటాయింపుకు సంబంధించినది. నల్లగొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలోని కరువు ప్రాంతాలకు నీళ్ళనివ్వగల ప్రాజెక్టులు కృష్ణా జలాల నుండి కేటాయింపు లభిస్తుందని ఎదురు చూస్తున్నాయి.

కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ వాటితో ఎంత మాత్రం పోల్చదగ్గ అవసరం కాదు. 'నల్లగొండలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన తరువాత కావాలంటే పులిచింతల కట్టుకోండి అని నల్లగొండకు చెందిన నాయకులు కొందరు అంటున్నారంట. వారికి అర్థం కాని విషయం ఏమిటంటే అవి కట్టుకుంటే ఇది సాధ్యం కాదు, ఇది కట్టుకుంటే అవి సాధ్యం కావు. కృష్ణా నదిలో ఇంకా మిగిలి ఉన్న నీరేమైనా ఉంటే అది ఎవరికి చెందాలన్నది ఇక్కడ ప్రశ్న. దీనికి అందరి కోరికలను ఇముడ్చుకునే సమాధానమేదీ లేదు. అందువల్ల పులిచింతలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించవలసిందే.

ఆల్మట్టి గురించి కృష్ణా, గుంటూరు జిల్లాల నాయకులు చేసిన గొడవ మనం మరచిపోలేదు. అప్పట్లో 'మన రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయి' అన్నారు. అది నిజమా? లేక అతిశయోక్తా అన్న సంగతి అటుంచి, దెబ్బ తింటాయనుకున్న

ప్రయోజనాలలో ఒక్క ప్రయోజనాన్ని కాపాడుకోవడానికి మాత్రం పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. అదే పులిచింతల ప్రాజెక్టుకు సాధించుకున్న అనుమతి. ఆల్మట్టి వల్ల కృష్ణా డెల్టా ఆయకట్టులో వరినాట్ల సమయానికి నీళ్ళు అందకుండా పోయే ప్రమాదముంది కాబట్టి ముందు సంవత్సరం నాగార్జునసాగర్ నుండి దిగువకు ప్రవహించిన నీటిలో దాదాపు 13 టిఎంసిల నీటిని పులిచింతలలో బంధించి, జూన్ జూలై నెలలో ప్రకాశం బ్యారేజీలోకి దానిని వదలాలన్నది ప్రణాళిక.

కర్నాటక దీనికి ఎప్పుడో అభ్యంతరం తెలిపింది. పులిచింతల ద్వారా పారించుకోబోయేది మిగులు జలాలనీ ఆ ప్రాజెక్టు బచావత్ అవార్డుకు వ్యతిరేకమనీ ఆరోపించింది. మన వాళ్ళు రెండు వేరు వేరు జవాబులు చెప్పారు. కృష్ణా డెల్టాలో కాలువ మరమ్మతుపనులు చేపట్టడం వల్ల మన రాష్ట్ర వాటాలోని నీటిని కొంత ఆదా చేయగలుగుతున్నామనీ దానినే పులిచింతల ప్రాజెక్టులో వాడుకుంటున్నామనీ ఒకసారి అన్నారు. అంతకంటే తెలివి మీరి సాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి వచ్చి చేరే నీరే పులిచింతలలో స్టోర్ చేసుకుంటున్నామన్నారు. నమ్మశక్యంకాని ఈ జవాబులు కేంద్రం నమ్మింది. (నమ్మించదలచుకుంటే మన వాళ్ళు ఏదైనా నమ్మించగలరనడానికి ఇది ఒక తార్కాణం మాత్రమే.)

అది నిజమే అయితే కృష్ణా డెల్టా వాడకం కోసం ప్రకాశం బ్యారేజీలో బంధిస్తున్న నీటిలో 13 టిఎంసిలు తగ్గించి దానిని శ్రీశైలంలోనే ఆపుకోవచ్చును కదా? ఆ 13 టిఎంసిల నీటికోసం దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలలోని ఎన్ని లక్షల ప్రజలు దాహంతో ఎదురు చూస్తున్నారో! 13 టిఎంసిల నీటిని ఆరుతడి (ఇరిగేటెడ్ డ్రై) పంటకు పారించుకున్నట్టయితే 1 లక్షా 30 వేల ఎకరాలకు నీరు అందియ్యవచ్చు. దేవరకొండకో, కల్వకుర్తికో, పత్తికొండకో, ఉరవకొండకో ఆ నీరు అందిస్తే ఎంత మేలు చేసిన వారవుతారు! ఆ కరువు తాలూకాల ప్రజలు ఎంత సంతోషిస్తారు! దాని కంటే కృష్ణా డెల్టాలో జూన్ నెలలోనే వరినాట్లు పడేటట్లు చూడడం ఎందుకు ముఖ్యమయింది? ఏ ప్రమాణాల ప్రకారం ముఖ్యమయింది?

శ్రీశైలం రిజర్వాయర్‌లో గాని ఆ పైనగానీ ఇంకొంచం నీరు ఉంటే బాగుండునని ఎంత మంది ప్రజలు ఎదురు చూస్తున్నారో ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం. హామీలు పొందిన ప్రాజెక్టుల గురించే మాట్లాడుకున్నా లక్షల మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో శ్రీశైలం ఎడమ కాల్వ అని పిలవబడే నాగార్జున సాగర్ మూడవకాలువ ప్రాజెక్టొకటి ఉంది. దానికి నీటికేటాయింపు లేదు. ఇప్పుడు పులిచింతలలో బంధిస్తున్న 13 టిఎంసిలను శ్రీశైలంలోనే ఆపేసి ఈ కాలువ తవ్వి ఉంటే తీవ్ర దుర్భిక్షానికి

నిగాహ్

నిలయమైన దేవరకొండ తాలూకాకు నీళ్ళొచ్చేవి. కానీ శ్రీశైలంలో నీళ్లు లేవనిచెప్పి ఆ ప్రాజెక్టు పేరు మార్చకుండా దానిని నాగార్జున సాగర్ రిజర్వాయర్ 'బాక్‌వాటర్స్' మీద ఆధార పడ్డ మూడవ కాలువగా నిర్మిస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పొంగి పొర్లితే తప్ప ఈ శ్రీశైలం ఎడమ కాలువ ముఖం దగ్గరికి నీళ్ళు రావు. వచ్చినా ఆ కాలువ దేవరకొండకు పోదు. అంత కంటే కొంచెం మెరుగయిన ప్రాంతాలకు మాత్రమే అది నీరందించ గలుగుతుంది.

శ్రీశైలం నుంచి ఇంకొంచెం పైకి పోతే కృష్ణా నదిపైన మహబూబ్‌నగర్ జిల్లా వాసులు పెట్టుకున్న ఆశలు చూస్తాం. పులిచింతలలో బంధించడానికి నిజంగానే నీళ్ళుంటే – అది కర్నాటక ఆరోపిస్తున్నట్టు మిగులు జలం కాకుంటే – ఆ నీటిని జూరాల దగ్గరే ఆపేస్తే చిక్కిపోయిన ఆ ప్రాజెక్టుకు తొలినాటి వైభవం తిరిగి వచ్చేదికదా? లేదా కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ఎత్తిపోతల పథకాలకు కేటాయించి ఉండవచ్చును కదా? కల్వకుర్తి గద్వాల తాలూకాలు పచ్చబడేవి కదా?

శ్రీశైలం రిజర్వాయర్ వైపు ఆశగా చూస్తున్న రాయలసీమ ప్రాజెక్టులూ ఉన్నాయి. గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలిగొండవంటి పెద్ద ప్రాజెక్టుల సంగతి పక్కన పెట్టినా, శ్రీశైలం నుండి ఒక 10 టిఎంసిల నీరు కెసికెనాల్‌లోకి పారించినట్టయితే హోస్పేట డ్యాం నుండి కెసికెనాల్లోకి పోయేదానిలో ఆమేరకు నీరు తగ్గించి దానిని అనంతపురం జిల్లాకు నీళ్ళిచ్చే తుంగభద్ర ఎగువ కాలువలోకి పారించుకోవచ్చునన్న ఆశ ఎడారి సదృశమైన అనంతపురం జిల్లా వాసుల చిరకాల వాంఛగా ఉంది. తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టును స్థిరీకరించడానికి ఇది అవసరం. దానికంటే కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించడం ఎందుకు ముఖ్యమయింది? ఏ ప్రమాణాల ప్రకారం ముఖ్యమయింది?

కృష్ణానది జలాల వినియోగం విషయంలో మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగిందనేది ప్రాంతీయ వివక్షకు సంబంధించిన చర్చలో ఒక ముఖ్యమైన ఫిర్యాదుగా ఉంది. ఆ చర్చ చాలా తీవ్రరూపం తీసుకుంటున్న దశలోనే క్షామపీడిత ప్రాంతాలకు మరింత అన్యాయం చేస్తూ పులిచింతల నిర్మాణాన్ని చేపట్టడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? మా ప్రయోజనాలు మేము కాపాడుకుంటాం. మీరేం చేస్తారో చేసుకోండి' అనే సవాలుగా అర్థం చేసుకోవాలా? మరి అటువంటప్పుడు సమైక్య రాష్ట్రంలోనే అందరి ప్రయోజనాలూ ఒనగూడుతాయని ఉపన్యాసాలూ ఉపదేశాలూ చేయడం ఎందుకు?

జులై 29, 2001

# తులసీదాసును చంపడానికి సిఐ ఎందుకు భయపడాలి?

మువ్వల తులసీదాసు హత్యలో చర్చకు రాని విషయాలు కొన్ని ఉన్నాయి.

ఆయనను పోలీసులు పట్టపగలు నడిబజారులో కాల్చి చంపడంలో చర్చించవలసిందేమీ లేదు. అది మన రాష్ట్రంలో ముప్పై ఏళ్లకు పైగా జరుగుతున్నదే. కాకపోతే ఒక షావుకారును గతంలో ఎప్పుడూ చంపి ఉండక పోవచ్చునంతే. ఏదయినా ఎప్పుడో ఒకప్పుడు మొదలు కావాలి కాబట్టి ఒక షావుకారును చంపిన మొదటి 'ఎన్‌కౌంటర్'గా కూడ అందులో చర్చించడానికేమీ లేదు.

పోలీసులు, ప్రజల మధ్య తగాదాలలో తలదూర్చి 'సెటిల్‌మెంట్లు' చేయడం తులసీదాస్ హత్యోదంతంలోని ప్రధాన ఘట్టం. దీనిని హక్కుల సంఘాలు మొదటినుండి వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అందరూ 'సెటిల్ మెంట్లు' చేయగా లేనిది పోలీసులు చేస్తే తప్పా అని గతంలో ప్రశ్నించిన వారు లేకపోలేదు. తప్పే. బలప్రయోగ సాధనాలు చేతికింద ఉన్నవారు, వాటిని ఉపయోగించే లైసెన్సు ఉన్నవారు పంచాయతులు చేస్తే న్యాయానికి భరోసా ఉండదు. ఇరు పక్షాలలో ఎవరో ఒకరు అన్యాయంగా నష్టపోగలరు, ఒక్కొక్కసారి ఇద్దరూ నష్టపోగలరు.

'సెటిల్‌మెంట్లు' కొందరు తమ పెద్దరికం వల్ల వచ్చిన బాధ్యతగా చేస్తారు, కొందరు ఇరు పక్షాలూ తనమీద ప్రకటించిన విశ్వాసం వల్ల చేస్తారు, కొందరు దానినుండి ఏదో ప్రయోజనం ఆశించి చేస్తారు. పోలీసులు ఈ మూడవ కోవకు చెందినవారు. వారికి రాగల ప్రయోజనం ప్రధానంగా డబ్బు. దాని రుచి మరిగిన తరువాత ఒక సమస్యను ఎవరో ఒకరు తమ దగ్గరకు తెచ్చేదాకా వాళ్లు ఆగరు. బెదిరించి భయపెట్టి రప్పించుకుంటారు.

పైగా, నిష్పాక్షికంగా నేర పరిశోధన చేయవలసిన వారు డబ్బుల కోసం పంచాయతులు చేయడం మొదలుపెడితే నేర పరిశోధనలో నిష్పాక్షికత దెబ్బతింటుంది. నేర పరిశోధనచేసే బదులు ఇరు పక్షాలనూ స్టేషన్‌కు రప్పించుకొని రాజీ పేరిట 'సెటిల్‌మెంట్' చేయడం మొదలు పెడతారు.

ఈ పెడధోరణి మన రాష్ట్రంలో ఇప్పటికే చాలా దూరం పోయింది. పోలీసు అధికార్లలో కొందరికిది చాలా లాభసాటి వ్యాపకం అయింది. ఖమ్మం జిల్లాలో ఈ వ్యాపకం లక్షల రూపాయల వ్యాపారంగా మారిందని మువ్వల తులసీదాసు హత్యోదంతం తెలుపుతుంది.

ఈ పంచాయతుల వ్యాపారానికి మధ్యవర్తులు అవసరం. కేసులు తీసుకురావాలి, సెటిల్‌మెంటుకు సహకరించాలి, డబ్బులు ఇప్పించాలి. సాధారణంగా వివిధ కులాల పెద్దలు, శిష్ట వర్గాల, సంఘాల పెద్దలు, రాజకీయ నాయకులు ఈ పాత్ర పోషిస్తుంటారు.

మువ్వల తులసీదాసు ఆ కోవకు చెందిన వ్యక్తి. అతను కేవలం వ్యాపారవర్గానికి చెందిన ప్రముఖునిగా ఈ పని చేసే వాడే తప్ప అతనికిందులో వాటా ఏమీ లేదని కొందరంటారు. అతని వాటా అతనికి ఉందని మరికొందరంటారు. అతని ఇల్లు చాలా మామూలుగా ఉంది గానీ కోమట్లు ఇతర కులాల లాగ కాక డబ్బు ఎంత సంపాదించినా పాత బజార్లో పాత యింట్లోనే ఉంటారు. కాబట్టి దానిని బట్టి ఏమీ చెప్పలేము. అయినా అది అప్రస్తుతం.

మధ్యవర్తిగా వ్యవహరించే క్రమంలో తులసీదాసు రెండు విషయాలు గమనించాడు. 1) పోలీసులు డబ్బులు తీసుకొని చేస్తామన్న పని చేయకపోవడం, 2) చేసిన సెటిల్‌మెంట్‌కు 'ఫీజు' విపరీతంగా అడగడం. గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు అన్నంలో కలిసాయని గొడవ ఎందుకు పెట్టుకోవాలని అనుకునే బాపతు మనిషయితే తులసీదాసు బతికిపోయే వాడేమో. అయితే అతను పోలీసులతో గొడవపడ్డాడు. గొడవపడి ఊరుకోలేదు. మాటలను రికార్డు చేసే పరికరం ఉన్న సెల్ ఫోన్ ద్వారా తాను సెటిల్‌మెంట్ లావాదేవీలు పెట్టుకున్న పోలీస్ అధికారుల మాటలను టేప్‌లో బంధించి వారి పై అధికారులకు వినిపించాడు. వారిని తిట్టించాడు.

బంగారు లక్ష్మణ్ అంతటివాడే భంగపడగా లేనిది ఖమ్మం సిఐ ఒక లెక్కా అని మువ్వల తులసీదాసు అనుకున్నాడు.

కరుణానిధినే తన్నగా లేనిది మువ్వల తులసీదాసొక లెక్కా అని ఖమ్మం సిఐ అనుకున్నాడు.

సివిల్ కేసులలో పోలీసుల జోక్యం ప్రమాదకరమని ఎందుకంటున్నామో ఇప్పటికైనా అర్థమయ్యే ఉండాలి.

కాగా, మువ్వల తులసీదాసు కేవలం ఒకానొక షావుకారు కాడు, షావుకార్ల ప్రముఖుడు మాత్రమే కూడా కాదు. అతను తెలుగుదేశం పార్టీకి చెందిన వాడు, ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావుకు చాలా కావలసిన వాడు. అతని ధీమాకు అది కూడ ఒక కారణం కావచ్చు.

అయినప్పటికీ పోలీసులతనిని ఎట్లా చంపగలిగారా అని ఆశ్చర్యపోవద్దు. అయినప్పటికీ ఏమీ కాదని గడచిన వారం దినాల సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ప్రజల, పత్రికల ఒత్తిడికి తలొగ్గి సిఐపైన సెక్షన్ 302 పెట్టారే గానీ ఇప్పటి దాకా అతనిని అరెస్టు చేయలేదు. చాలా సమర్థుడు, అసాధ్యుడు, అనితర సాధ్యుడు అనపించుకోవడానికి ఇష్టపడే ముఖ్యమంత్రి, తన పార్టీ వాడిని చంపిన సిఐని అరెస్టు చేయాలని సహితం పట్టుబట్టలేదు, పోలీసులను ఆదేశించలేదు. అతన్ని సస్పెండ్ చేసి ఇంట్లో కూర్చోబెట్టారు. అంటే సగం జీతం ఇచ్చి కేసు మాఫీ చేసుకోపొమ్మని విడిచిపెట్టారు.

పట్టపగలు, అంత రద్దీగా ఉన్న రోడ్లో ఎట్లా చంపగలిగాడని ఆశ్చర్యపోవడం సహజం. చంపదలుచుకుంటే ఊరి బయటకు తీసుకుపోయి చంపి ఉండవచ్చును కదా అనుకోవడమూ సహజమే. ముందే వేసుకున్న పథకమయితే సిఐ ఆ విధంగానే చేసే వాడేమో. కానీ ఆనాటి ఘటనను బట్టి చూస్తే సిఐ సర్వర్ పాషా అనుకోకుండ దొరికిన అవకాశాన్ని వినియోగించుకున్నాడే తప్ప అది ముందే వేసుకున్న పథకం కాదనిపిస్తుంది. ఎవరో నకిలీ నక్సలైట్లో మరొకరో తులసీదాసును డబ్బులడిగారు, ఫలాన చోట కలవమన్నారు. ఇచ్చేస్తే పోతుందికదా అనుకోకుండ తులసీదాసే వారిని పోలీసులకు పట్టియ్యాలని నిర్ణయించుకున్నాడు. పోలీసులకు చెప్పాడు. 'నువ్వు పద–మేము కూడ వస్తాము' అన చెప్పి పోలీసులతనిని వారు చెప్పిన చోటికి పంపించారు. ముగ్గురు ఎస్ఐలను వెంటబెట్టుకొని అక్కడికొచ్చిన సిఐకి అదే మంచి అదను అనిపించింది. తులసీదాస్‌ను నేరుగా కాల్చి చంపాడు. అతని ఉద్దేశ్యం ఆఖరి నిమిషంలో గ్రహించిన తులసీదాసు చేతులు జోడించి చంపొద్దని అడుక్కున్నాడని సాక్షులు ఆరోజు టివి చానెల్స్‌కు ఇచ్చిన వాంగ్మూలంలో అన్నారు.

తాను హత్యకేసులో ఇరుక్కుంటానని సిఐ ఎందుకు భయపడలేదు? అన్న సందేహం ఇంకా మిగిలి పోయిందా? భయపడక పోవడంలో అతను తప్పుగా అంచనా వేయలేదని వారం రోజులు తిరగక ముందే అర్థమవుతున్నది. ఆ రోజు టీవీ చానెల్స్‌కి ఇచ్చిన

వాంగ్మూలం కోర్టులో ఒకరయినా ఇస్తారా అన్న సందేహం కలుగుతున్నది. 'ఆనాడు నేను లేకుంటిని. హైదరాబాద్‌కు (లేకపోతే వరంగల్‌కు) పోయి ఉంటిని. వాపస్ వచ్చినాక ఎవరో చెప్తే విన్నాను గాని ఏమీ చూడలేదు' అనేదే ఇప్పుడందరి పాటా అయింది. 'ఈ కేసులో రుజువయ్యేది ఏమీ లేదు' అని సిఐ చేసిన హత్యపైన నేరపరిశోధన చేస్తున్న సిబిసిఐడి అధికారి ఇప్పటికే విలేఖర్లతో అన్నాడంట.

మామూలుగానే హత్య కేసులలో మృతుల బంధుమిత్రులు తప్ప వేరే వాళ్లు తెగించి సాక్ష్యం చెప్పడం కష్టం. ముద్దాయిలు బలవంతులయతే మరీ కష్టం. పోలీసుల కంటే బలవంతులెవరున్నారు? అందువల్ల పోలీసులపైన పెట్టిన హత్యకేసులు రుజువు కావడం దాదాపు అసాధ్యం.

కాని 'డిపార్ట్‌మెంట్' చర్య తీసుకోవడానికి ఆటంకమేమీ లేదు–ప్రభుత్వ సంకల్పం లోపించడం తప్ప. క్రిమినల్ కేసు రుజువు కాకపోయినా శాఖాపరమయిన చర్యలు (ఉద్యోగం నుండి బర్తరఫ్ చేయడంతో సహా) తీసుకోవచ్చునని చట్టం చెప్తుంది. ఆ భయమైనా పోలీసులలో ఉంటే వారి విచ్చలవిడి ప్రవర్తన కొంతైనా అదుపులో ఉండేదేమో. కానీ అటువంటి సంప్రదాయమేదీ మన రాష్ట్రంలో లేకపోగా హింసచేసి 'శాంతి భద్రతలు' కాపాడే హీరోపోలీసులను వెనకేసుకొచ్చే వాడుకే ఉందని తెలిసిన సిఐ సర్వర్ పాషా ఇంక దేనికి భయపడి తులసీదాసును చంపకుండ ఉండాలి?

ఖమ్మం షావుకార్లు, ఆర్యవైశ్య సంఘాలు ప్రతీకారం తీర్చుకుంటారనా?

# కాశ్మీర్ గురించి మనమైనా సత్యం మాట్లాడుదాం....

ఆగ్రా చర్చలు విఫలంకాగానే, వీళ్లిప్పుడు తప్పు ఎవరిమీద పెడతారా అని కొంచెం ఉత్కంఠతో ఎదురు చూసామనే చెప్పుకోవాలి.

ఏవేవో ఊహించాముగానీ ముషార్రఫ్ ఉపహార ప్రెస్ మీట్‌ను టీవీ తెరమీదికి అప్పటికప్పుడు ఎక్కించడమే అనర్థానికి దారి తీసిందని తేల్చబోతారని మాత్రం ఊహించలేదు.

దాని బదులు రాహుకాలంలో కూర్చున్నామని అని వుంటే మరీఅంత ఆశ్చర్యం కలిగి ఉండేది కాదు.

శిఖరాగ్ర చర్చలకు కూర్చునే ముందు ఆ చర్చలలో ప్రస్తావనకు రాగల విషయాల గురించి బయట మాట్లాడొద్దన్న నియమాన్ని మనమైనా, వారైనా ఒక్క రోజయినా పాటించడం జరిగిందా? మే 23న వాజ్‌పేయి ముషార్రఫ్‌కు ఆహ్వానం పంపిన నాటి నుండి ఇరుదేశాల ప్రముఖులూ ప్రతినిత్యం ప్రపంచానికంతా వినిపించేటట్టు నోరు పారేసుకుంటూనే ఉన్నారు.

'కాశ్మీర్ గురించి మాట్లాడడానికి పోతున్నాను తప్ప నాకు ఇండియాలో వేరే పనేముంది?' అని ముషార్రఫ్ ప్రకటించాడు. 'ఆజాద్ కాశ్మీర్ మాకెప్పుడిచ్చేస్తావని అడగడం తప్ప కాశ్మీర్ గురించి వేరే మాట్లాడేదేమీ లేదు' అని జస్వంత్‌సింగ్ అన్నాడు. 'ఆమెరికా ఒత్తిడి వల్ల ఇండియా నన్ను పిలిచింది' అని ముషార్రఫ్ అనగా అతని వ్యాఖ్య బాధ్యతారహితమని మనవాళ్లు అన్నారు. 'కాశ్మీర్‌ను ఒక వివాదంగా భారత్ ఒప్పుకున్నట్టే'నని ముషార్రఫ్ అనగా 'సీమాంతర ఉగ్రవాదాన్ని గురించి నీతో మాట్లాడాలని నిన్ను రమ్మన్నామే తప్ప మేము ఏ వివాదాన్నీ అంగీకరించనిదే!' అని

మనవాళ్ళన్నారు. హోంమంత్రి అద్వానీ మధ్యలో ఈ వూరు ఆ వూరు తిరుగుతూ 'ఆగ్రా చర్చల నుండి మరీ ఎక్కువ ఆశించవద్దు' అని ఎవరినో హెచ్చరిస్తూ ఉన్నాడు.

ఇదంతా చిన్న తెర మీదికి నిత్యం ఎక్కింది. ఈ ప్రవచనాలను చిన్న తెరపైన దర్శనమిచ్చే విశ్లేషకులూ వ్యాఖ్యాతలూ ఒకటికి నాలుగు సార్లు ముందుకూ వెనక్కీ తిప్పి చూసి వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యానాల వెనక లోతయిన అవగాహననూ 'హిడెన్ ఆజెండా'లనూ చూశారు.

ఇంత జరిగిన తరువాత ఆగ్రాలో ముషార్రఫ్ మాట్లాడిన నాలుగు మాటలే నష్టం చేశాయా? చర్చలకు ముందు మాట్లాడి మాట్లాడి చర్చలు సాధ్యం కాకుండా చేసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ మాట్లాడి మాట్లాడి ఈసారి చర్చలకు కూర్చోవడమే అసాధ్యం చేసుకుంటున్నారు. మధ్యలో ముషార్రఫ్ పత్రికా సంపాదకులతో చెప్పిన నాలుగు విషయాలు చర్చలకు ముందు ప్రసారం కావడమే నష్టం చేసిందా?

ముషార్రఫ్ మాట్లాడాడని కాదు, అతని మాటలకు మన వాళ్ల దగ్గర జవాబు లేదని ఉక్రోషం. యాభైఏళ్లగా భారత పాకిస్తాన్‌లది కాశ్మీర్ విషయాలలో తప్పుడు వైఖరే. అయితే తన తప్పుడు వైఖరిని సహేతుకమైన వ్యాఖ్యల ద్వారా వ్యక్తం చేయగల స్థితిలో పాకిస్తాన్ అధినేత ఉన్నాడు. మనవాళ్లు ఆ స్థితిలో లేరని కడుపుమంట.

ముషార్రఫ్ మూడేమూడు విషయాలు చెప్తున్నాడు. భారతదేశంలో జమ్ముకాశ్మీర్ విలీనం వివాదాంశం. ఆ వివాదం కాశ్మీరీల మనోభీష్టం ప్రకారం పరిష్కారం కావాలి. ఇది పరిష్కారమైతే ఇక భారత పాకిస్తాన్‌ల మధ్య వేరే పెద్ద సమస్యలేవీ లేవు కాబట్టి దీనిమీదనే చర్చలు ప్రధానంగా దృష్టిపెట్టాలి.

వీటికి మన వాళ్ళ దగ్గరున్న జవాబేమిటి? కాశ్మీర్ విషయంలో వివాదమేదీ లేదనేది మొదటిది. వివాదం ఉంది మొర్రో అంటూ కాశ్మీరీలే అంటున్నా ఊరికే అనడమేకాక 45 లక్షల కాశ్మీరీలలో 40 వేలమంది (అధికార లెక్కల ప్రకారమే) ఆ వివాదం పరిష్కారం కోసం గడచిన దశాబ్దం కాలంలో ప్రాణాలు అర్పించినా ఇంకా వివాదమేదీ లేదంటే ఎవరు నమ్మాలి?

వివాదమే లేదు కాబట్టి ఇంక కాశ్మీరీల మనోభీష్టమెక్కడిది? కాశ్మీరీలు 1956లోనే జమ్ముకాశ్మీర్ శాశ్వతంగా భారత్‌లో భాగమని తమ రాష్ట్ర రాజ్యాంగంలోనే రాసేసుకోలేదా? ఆ తరువాత ప్రతీ ఎన్నికలోనూ పాల్గొని తమ అభీష్టాన్ని భారత్‌వైపు వ్యక్తం చేయడం లేదా అనేది రెండవ విషయానికి మన పాలకుల జవాబు. జమ్ముకాశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగం భారత్‌కు అనుకూలంగా తయారుకావడం కోసమే షేక్ అబ్దుల్లాను

1953లో అరెస్ట్ చేసి ఏ నేర అభియోగమూ లేకుండా 15 సంవత్సరాలకు పైగా జైలులో పెట్టారని ఆ తరువాత ఏ ఒక్క ఎన్నికా కాశ్మీర్‌లో ప్రజాస్వామికంగా జరగలేదని జ్ఞాపకం చేసుకుంటే ఈ జవాబు విలువేమిటో అర్థమవుతుంది. అయినా వారి భూభాగం భవిష్యత్తు గురించి జరిగే చర్చకు ఆ ప్రజల మనోభీష్టమే ప్రమాణమనేది కనీస ప్రజాస్వామికస్పృహ ఉన్న వారెవరయినా ఒప్పుకోక తప్పని విషయం.

మూడవ అభిప్రాయానికి మన దగ్గర ఏ జవాబూ లేదు. వర్తక వ్యాపారాల విషయంలో గానీ నదీ జలాల విషయంలో గానీ ఈ రెండు దేశాల మధ్య తీవ్రమైన వివాదాలేవీ లేవు. కాశ్మీర్ ఒక్కటే తీవ్రమైనది. మిగిలిన చిన్న చిన్న విషయాలలో ఒప్పందం కుదరక పోవడానికి కాశ్మీర్ కారణంగా నెలకొన్న ద్వేషభావమే కారణం. కాబట్టి దాని గురించి మాట్లాడుకోవడమే సబబు.

భారత ప్రజలకు ఈ సంగతి తెలియకుండ భారత ప్రభుత్వమూ ప్రసార సాధనాలూ జాగ్రత్తపడి ఉండవచ్చుగానీ మన పాలకులకు ఈ విషయాలు బాగానే తెలుసు. ముషార్రఫ్ అడిగిన ప్రశ్నలకు తమ దగ్గర జవాబులు లేవని తెలుసు. ఆ సంగతి అతని సంభాషణను టీవీలో చూసిన వారందరూ గ్రహించి ఉంటారని కూడా తెలుసు. అందుకే అంత ఉక్రోషం. వాజ్‌పేయి కూడా ముషార్రఫ్‌లాగ భారత్ వైఖరిని ప్రపంచం ముందు ఉంచకపోవడం 'మీడియా మేనేజ్‌మెంట్'లో మన వాళ్ల వైఫల్యం అని అంటున్నారు. వైఫల్యం లేదు, వల్లకాడూ లేదు. మనవాళ్ల వైఖరి సహేతుకంగా వివరించగలిగినది కాదు కాబట్టి దానిని దాచిపెట్టుకున్నారు తప్ప వేరే కారణమేదీ లేదు.

దీని వల్ల జరుగుతున్న ఒక నష్టమేమిటంటే పైన చెప్పిన మేరకు పాకిస్తాన్ వైఖరి సహేతుకమే అయినప్పటికీ కొంచెం లోతుగా పోయి చూస్తే వారి వైఖరిలోనూ ప్రశ్నించవలసినవి చాలా ఉన్నాయని మనం అనలేకపోవడం. 'కాశ్మీర్ వివాదం' స్వభావం ఏమిటి? ఆ రాష్ట్రం భారత్‌లో విలీనం కావడాన్ని పాకిస్తాన్ అంగీకరించక పోవడం వల్ల వివాదం వచ్చిందా, లేక కాశ్మీరీ ప్రజల సమ్మతి పొందకపోవడం వల్ల వచ్చిందా? ఈ విషయాన్ని పాకిస్తాన్ స్పష్టం చేయదు.

కాశ్మీరీ ప్రజల మనోభీష్టం ప్రకారం సమస్య పరిష్కారం కావాలన్నది పూర్తిగా సబబే కానీ ఆ మనోభీష్టానికి పాకిస్తాన్ అనుమతించే స్వేచ్ఛ ఏమిటి? ఇండియాలో చేరాలా లేక పాకిస్తాన్‌లో చేరాలా అని నిర్ణయించుకునే స్వేచ్ఛలా లేక ఈ రెండు దేశాలనూ కాదని స్వతంత్రదేశంగా ఉండాలని కోరుకునే స్వేచ్ఛా? ఈ 'మూడవ ప్రత్యామ్నాయాన్ని' పాకిస్తాన్ ఎప్పుడూ ఒప్పుకోలేదు. మనం రెండవ ప్రత్యామ్నాయాన్ని

సహితం ఒప్పుకోము. కాబట్టి కాశ్మీరీలలో మెజారిటీ మూడవ ప్రత్యామ్నాయాన్నే కోరుకుంటున్నారని చెప్పడానికి మనకు నోరు లేదు. కాశ్మీరీల ప్రతినిధులెవ్వరినీ చర్చలలో పాల్గొననివ్వమని మనవాళ్లు మూర్ఖంగా పట్టుబట్టడం వల్ల, పాకిస్తాన్ రెండవ ప్రత్యామ్నాయాన్ని కోరుకునే హురియత్ నేతలనే కాశ్మీరీ ప్రజల ఏకైక ప్రతినిధులుగా చూస్తుంది తప్ప మూడవ ప్రత్యామ్నాయాన్ని కోరుకునే వారి ప్రాతినిధ్యాన్ని గురించి మాట్లాడదన్న విషయాన్ని ఎత్తిచూపడానికి కూడా మనవాళ్లకు నోరులేదు.

ఒకనాడు బంగ్లాదేశ్‌లో భారత్ ముక్తి బాహినికి సహాయం అందిచ్చినట్టే కాశ్మీర్ పోరాటకారులకు తాము అందిస్తున్నామని పాకిస్తాన్ అనడం సబబేనని మనవాళ్లు ఒప్పుకోరు కాబట్టి, ఆ పోరాటకారులు అదుపుతప్పి సాధారణ పౌరులనూ యాత్రికులనూ చంపినప్పుడు పాకిస్తాన్ ఏం చేస్తున్నదని నిలదీయలేరు. అంతా 'సీమాంతర ఉగ్రవాదమే' అయినప్పుడు సాధారణ పౌరులను చంపడానికీ భారత సైనికులను చంపడానికీ మధ్య తేడా ఏముంటుంది? భారత ప్రభుత్వం ఎటూ వాస్తవిక ధోరణి అవలంబించలేదు. కానీ పౌరులమయిన మనమైనా అవలింబించ లేమా? భారత్ పాకిస్తాన్‌ల గట్టు తగాదాగా కాక కాశ్మీరీల జాతీయ ఆకాంక్షగా 'కాశ్మీర్ వివాదాన్ని' చూడలేమా? దానిని భారత్ గుడ్డిగా చూడ నిరాకరిస్తున్న వైనాన్ని, పాకిస్తాన్ పాక్షికంగా వ్యాఖ్యానిస్తున్న వైనాన్ని విమర్శించలేమా?

# తెలంగాణ ఉద్యమానికి నిర్దిష్టమైన కార్యక్రమాలు అవసరం

నిర్దిష్టమయిన కార్యక్రమమేదీ లేకుండా తెలంగాణ రాష్ట్ర సమితి ప్రత్యేక తెలంగాణకు సంపాదించగల మద్దతంతా సంపాదించేసిందనే భావించవలసి ఉంటుంది. ఇక మీదట సంపాదించాలంటే మాత్రం నిర్దిష్టమైన కార్యక్రమాలు కావాలి.

దానికి చంద్రశేఖర్‌రావు ఎంత సిద్ధంగా ఉన్నారో తెలీదు. మనదేశంలో సగటు రాజకీయవేత్తలు సమస్యల మీద కార్యక్రమాలు చేపట్టడం మరచిపోయి కొన్ని దశాబ్దాలయింది. అయితే తెలంగాణ ఉద్యమమంటే తెలంగాణ రాష్ట్ర సమితే కాదు కాబట్టి సమస్యల మీద చేపట్టగల కార్యక్రమాల గురించి కొంచెం చర్చ అవసరం. ఈ చర్చ తెలంగాణ రాష్ట్ర సమితికి ఒక కార్యక్రమాన్ని అందియ్యగలిగితే మరీ మంచిది.



ఎందుకంటే తెలంగాణ గురించి కూలంకషంగా అధ్యయనం చేసి లోతుగా విశ్లేషించి చెప్పగల నాయకులు, ఉద్యమాలూ చేయలేని పని రాజకీయ 'ప్రధాన స్రవంతి'కి చెందిన చంద్రశేఖర్‌రావు చేశారు. ఒక ఊపు తీసుకొచ్చారు. అది ఎందుకో చెప్పగల విశ్లేషణ పరికరాలు మన దగ్గర లేవు. హేతుబద్ధమైన జ్ఞానం మీద ఆధారపడిన ఆచరణే ఫలితాన్ని ఇస్తుందని, అది ఎంత హేతుబద్ధమయితే అంత మంచి ఫలితాన్ని ఇస్తుందని నమ్మడమే మనకు తెలుసు. 'శాస్త్రీయత' మీద ఉన్న ఈ విశ్వాసం విషయంలో మార్క్సిస్టులకూ బూర్జువా హేతువాదులకూ తేడా లేదు. అది అన్ని వేళలా నిజం కానక్కర లేదని రుజువు చేసే సంఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతూనే ఉంటాయి. అయినప్పటికీ ఈ విశ్వాసం చెక్కు చెదరకపోవడానికి కారణం విశ్వాసాలకుండే బలమే తప్ప ఈ విశ్వాసంలోని సత్యం కాదు.

కాబట్టి టి.ఆర్.ఎస్.ను తక్కువ చేయకుండానే నిర్దిష్టమైన కార్యక్రమాల ఆవశ్యకత గురించి మాట్లాడుకుందాం. వనరులుండీ వాటి వల్ల ప్రయోజనం పొందలేకపోవడం

తెలంగాణ పరిస్థితిని వివరించే క్లుప్తమయిన వ్యాఖ్య అనుకున్నట్లయితే ఏ వనరులను ఏ విధంగా ఉపయోగించడం సాధ్యమయ్యేదో, అది ఉమ్మడి రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కాలేదో వివరించడం, దాని సాధన కోసం ఆందోళన చేపట్టడం ద్వారా ఈ రాష్ట్రం 'ఉమ్మడి' స్వభావాన్ని సవాలు చేయడం ఒక నిర్దిష్టమైన కార్యక్రమం అవుతుంది.

దీనికి చాలా అధ్యయనం కావాలి. నిరంతరాయంగా కరెంటు సరఫరా – అది కూడా పెద్ద మోతాదులో ఉంటే తప్ప నడవని ప్రాజెక్టుకు గోదావరి మీద శంకుస్థాపన చేయడం ద్వారా చంద్రబాబు నాయుడు ఒక పెద్ద ప్రశ్నను తెలంగాణ అభిమానుల ముందు నిలబెట్టారు. అటువంటివి తప్ప వేరే రకమైన ప్రాజెక్టులు గోదావరి మీద సాధ్యమా? అటువంటివి మాత్రమే సాధ్యమనుకుంటే కరెంటు సబ్సిడీని ఎట్టి పరిస్థితిలోనూ ఆమోదించని ప్రపంచ బ్యాంకు పాలనలో గోదావరి నీటిని తెలంగాణ కోసం వినియోగించడం సాధ్యమా? వేరే రకమైన ప్రాజెక్టులు – ఉదాహరణకు నది మీద కాక ఉపనదుల మీద, వాగుల మీద – కట్టుకునేటట్టయితే రాష్ట్రానికి బచావత్ అవార్డు కేటాయించిన 1480 టి.ఎం.సిల గోదావరి నీటిలో చాలా భాగం వాడుకోలేకనే పోవచ్చు. అందులోనూ తెలంగాణలో అసలే వాడుకోలేకపోవచ్చు. గోదావరికి దూరాన ఉన్న జనగాం డివిజన్ వంటి దుర్భిక్ష ప్రాంతాలకు నీరు ఇవ్వలేకపోవచ్చు. అప్పుడేం చేయాలి? దీనికి సులభమైన జవాబు ఉందని నేను అనుకోవడం లేదు. అయితే ఒకటి మాత్రం నిజం. తెలంగాణకు నీళ్లిచ్చే జవాబు– అది ఏదయినప్పటికీ– అమలు కావాలంటే ఆర్థిక వనరుల కేటాయింపులకు, సాగునీటికి ఉచిత ప్రాముఖ్యం ఇయ్యవలసి ఉంటుంది. ప్రస్తుత రాష్ట్ర పాలకులు అందుకు సిద్ధం కారు కాబట్టే వారి వ్యవసాయ విధాన పత్రంలోనూ 'విజన్'లోనూ ఈ ప్రశ్ననే తొలగించి వేశారు. నీళ్లెట్లా ఇవ్వాలి అన్న ప్రశ్నను తొలగించి నీళ్లు– వర్షం నీళ్లు తప్ప– అక్కర లేని వ్యవసాయాన్ని అంతర్జాతీయ మార్కెట్‌తో ముడిపెట్టడం ఎట్లా అన్న చర్చ చేపట్టారు.

ఆ 'పరిష్కారం' వ్యవసాయదారులను సంక్షోభంలో పడేసే పరిష్కారం కాబట్టి దానిని తిరస్కరించాలి. వీలయిన మేరకు వ్యవసాయానికి సాగునీరు అందించడం ద్వారా వ్యవసాయదారులకు కనీస భద్రత కల్పించడం అవసరం అని గుర్తించాలి. దానికి గల మార్గాలను గోదావరి బేసిన్‌కు సంబంధించి అన్వేషించి అందుకయ్యే ఖర్చును స్వీకరించడానికి సిద్ధం కమ్మనీ కాకపోతే ఎందుకు కారో చెప్పమనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని సవాలు చేయాలి. ఈ సవాలు ప్రజల చైతన్యంలో భాగం కావాలి.

కృష్ణా బేసిన్ విషయం కొంత స్పష్టమైనదే కానీ అది సహితం స్పష్టంగా వ్యక్తం కావడం లేదు. గోదావరిలో పుష్కలంగా ఉన్న నీటిని ఏ విధంగా వాడుకోవాలన్నది ఉత్తర తెలంగాణ సమస్య కాగా, కృష్ణ మీద ఉన్న ఆశలకు తగినంత నీళ్లు ఆ నదిలో లేవు కదా, మరి ఏం చేయాలన్నది దక్షిణ తెలంగాణ సమస్య.

దానికి ఒకటే జవాబు ఉంది. కోస్తా జిల్లాల వాడకాన్ని తగ్గించి దక్షిణ తెలంగాణకూ రాయలసీమకూ ఇవ్వాలి. ఉమ్మడి రాష్ట్రంలో దీనికి రాజకీయ మార్గమే తప్ప రాజ్యాంగ సంబంధమైన మార్గం లేదు. ఆ రాజకీయ మార్గం ఆచరణ సాధ్యం కాదని ఇన్నేళ్ల ఉమ్మడి రాష్ట్ర చరిత్ర చెప్తున్నది. నది దిగువన ఉన్న కోస్తా జిల్లాల వాసులు ఉమ్మడి రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసమయినా సరే ఒక్క చుక్క నీరు కూడా వదులుకోరని స్పష్టంగానే ఉంది. లేకపోతే పులిచింతల మాకొద్దని ఒక్క కోస్తా జిల్లా నాయకుడయినా అని ఉండేవాడు.

రాష్ట్రాలు వేరయితే రాజ్యాంగమే మార్గం చూపిస్తుంది. అంతర్ రాష్ట్ర నదుల గురించి పరీవాహక రాష్ట్రాలు వివాదం లేవదీయవచ్చునని రాజ్యాంగం గుర్తిస్తుంది. ఆ వివాదం పరిష్కారానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించే అవకాశం పార్లమెంటుకు కల్పించింది. వేరుపడితే రాజ్యాంగం కల్పించే ఈ పరిష్కారాన్ని ఉమ్మడి రాష్ట్రంలో స్నేహ పూరిత రాజకీయం ఇవ్వగలదా? అన్న ప్రశ్నకు జవాబు ఇప్పటికయితే స్పష్టంగానే ఉంది. వేరే రకంగా ఉండగలదని చెప్పదలచుకున్నవారు దానిని 'రుజువు చేసే బాధ్యత' తమ మీద వేసుకోక తప్పదు. ఈ సవాలు తెలంగాణ ఉద్యమ చైతన్యంలోనూ వ్యక్తీకరణలోనూ భాగం కావాలి.

అయితే రాష్ట్రం వేరయినప్పటికీ ఇక్కడొక ఆచరణాత్మకమైన సమస్య ఉంది. అంతర్ రాష్ట్ర నదీ వివాదాలలో, ఒక రాష్ట్రానికి హక్కు కల్పించడం కోసం మరొక రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న నీటి వాడకాన్ని తగ్గించి అక్కడ రైతులు పంట మార్పిడి చేసుకోవాలని శాసించిన నదీ జలాల ట్రిబ్యునల్ అవార్డు ఏదీ లేదు. కానీ ఆ ఒరవడి మారకపోతే రాష్ట్రం వేరయినా మిగులు జలాలే తప్ప తెలంగాణకు వేరే ఏమీ దక్కదు. అందువల్ల కృష్ణా నదీ జలాల పంపిణీ విషయంలో బచావత్ ట్రిబ్యునల్ అనుసరించిన పద్ధతినే ప్రశ్నించి అందుకు భిన్నమైన ప్రమాణాలను నెలకొల్పడం అవసరం. అందుకోసం ఇతర దేశాలలో నదీ జలాల పంపిణీ విషయంలో అనుసరించిన ప్రమాణాలను అధ్యయనం చేయడం అవసరం.

అదట్లాగుంచి, ఒకే రాష్ట్రంలో అందరూ ఉండాలని కోరుకునేటట్టయితే కోస్తా జిల్లాల వ్యవసాయదారులు పంట మార్పిడి చేసుకొని కృష్ణా నీటి వాడకాన్ని ఎంత లేదన్నా సగానికి తగ్గించుకోక తప్పదన్న వాదనను చర్చకు పెట్టినప్పుడే ఉమ్మడి రాష్ట్రం అన్న భావన ఎంత సమస్యాత్మకమైనదో అర్థమవుతుంది. తెలంగాణ వేరుపడాలన్న డిమాండు కేవలం 'ఎమోషనల్' ఆరాటం కాదనీ నిరుద్యోగ రాజకీయ నాయకుల వ్యాపకం అసలే కాదనీ పూర్తిగా హేతుబద్ధమైనదనీ అర్థం అవుతుంది.

నదీ జలాలు ఒక వనరు మాత్రమే. చెరువుల వ్యవస్థ, భూగర్భ జలాలు, వాటి వాడకానికి అవసరమయ్యే కరెంటు బావులు, కరెంటుకు ముడిసరుకుగా ఉపయోగపడగల సింగరేణి బొగ్గు, ఆ బొగ్గు గనుల నిర్వహణ, ఆ బొగ్గు వినియోగంలో ప్రాధాన్యతలు, బొగ్గు ధర, కరెంటు ధర ఇటువంటి అనేక విషయాల గురించి నిర్దిష్టమైన అధ్యయనం, చర్చ, కార్యక్రమాలు అవసరం. వాటిని ప్రజలలోకి తీసుకొని పోవడం అవసరం.

# భ్రమలే అయితే వాటి వెంట పరుగులు తీయడం దేనికి?

ఈ వారం కాలమ్‌కు 'శంకరన్ గారి భ్రమలకు జేజేలు' అన్న శీర్షిక పెడదామనుకున్నాను. కానీ కొంత మందికి వారి భాషలోనే జావాబు చెప్పడం వల్ల మేలు కంటే నష్టమే ఎక్కువ ఉంటుంది. ఈ ప్రపంచంలోని బడే నాగేశ్వర రావులు ఆకోవకు చెందినవారు. నేను పౌరస్పందన వేదిక సభ్యుడిని కాను. అందువల్ల ఆగస్ట్ 19 నాటి ప్రజాతంత్ర సంచికలో ఆ వేదికపైన బడే నాగేశ్వర్‌రావు చేసిన విమర్శకు (నేను అతని భాషలో జవాబు చెప్పడం లేదు కాబట్టి దానిని 'దాడి' అనడం లేదు, విమర్శ అంటున్నాను) నేను జవాబు చెప్పనవసరం లేదు. అయితే చంద్రబాబు ప్రభుత్వం పట్ల ఏ అనవసరమైన మర్యాద పాటిస్తున్నదని పౌరస్పందన వేదికపైన బడే నాగేశ్వరరావు విమర్శ పెడుతున్నారో అంతే అనవసరమైన మర్యాద వారు బడే నాగేశ్వరరావు పట్ల కూడా పాటిస్తారని నాకు తెలుసును కాబట్టి నా బరువు కానిది నా మీద వేసుకొని నేను అవసరమనుకునే మేరకు స్పందిస్తాను.

ఏ ప్రజా సంఘాలయితే తెలంగాణ జిల్లాలో తీవ్రమైన నిర్బంధానికి గురవుతున్నాయని బడే నాగేశ్వరరావు అంటున్నారో ఆ సంఘాలకు చెందిన వారు అరెస్టయితే రాష్ట్ర డిజిపితోనూ, హోంమంత్రితోనూ మాట్లాడి కోర్టులో హాజరు పెట్టించడానికీ, వారి మీద పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేయమని అదే అధికారులకు అర్జీలు పెట్టడానికీ ఆ సంఘాల వారికి ఆ జిల్లాలలో ఉంటూ ఉద్యోగాలు చేసుకోవడం కష్టమయితే బదిలీ చేయమనిగానీ డిప్యుటేషన్ ఇప్పించమని గానీ సంబంధిత కేబినెట్ మంత్రికి అర్జీ పెట్టడానికీ సదస్సులూ సభలూ పెట్టుకుంటే పర్మిషన్ ఇమ్మని డిజిపితో మాట్లాడడానికీ ఆ సంఘాల వారు హైదరాబాద్‌లో నలుగురయిదుగురు పెద్ద మనుషులకు ఫోన్లు చేస్తుంటారు. ఉత్తరాలు రాసి పంపుతుంటారు. ఆ

నలుగురయిదుగురు పెద్ద మనుషులంతా పౌరస్పందన వేదిక సభ్యులే. బడే నాగేశ్వరరావులు వారికి ఫోన్ చేయని రోజు ఉండదు. వారు చేతనయింది చేయని రోజూ కూడా ఉండదు.

వాళ్ల నుండి సహాయం పొందుతున్నారు కాబట్టి వాళ్లను విమర్శించొద్దని నేను అనడం లేదు.

నిర్బంధానికి గురవుతున్న ఈ సంఘాలు ఈరోజు తమ హక్కులను రక్షించుకోవడానికి ఉద్యమాల ద్వారా ప్రయత్నం చేయడం లేదు. ఈ నలుగురు పెద్ద మనుషుల చేత ప్రభుత్వానికి హితవు చెప్పించి (నేను బడే నాగేశ్వరరావు భాష వాడడం లేదు కాబట్టి 'పైరవీ చేయించుకొని' అనడం లేదు) తమ హక్కులు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఉద్యమించే పరిస్థితి లేనప్పుడు పెద్ద మనుషుల మధ్యవర్తిత్వం మీదనో హిత వచనాల మీదనో ఆధారపడవద్దని నేను అనడం లేదు.

కానీ వీళ్ళు వాళ్ళను ఈ సహాయం ఏ దృష్టితో అడుగుతున్నారు ? వాళ్లు ఏ దృష్టితో చేస్తున్నారు ? వాళ్లకు ఈ ప్రభుత్వం పైన ఇంకా ఏవో భ్రమలు ఉన్నాయనీ ఆ భ్రమలను వాడుకుందామనీ వీళ్లు అనుకుంటున్నారా? అటువంటి ప్రయత్నంలోని నైతికత సంగతి అటుంచి, భ్రమలు ఆపద్ధర్మంగానయినా హక్కుల రక్షణకు పనికొస్తాయా? పైగా పనికిరాని భ్రమలను వాడుకోవడం వలన అవి మరింత బలపడవా?

శంకరన్ గారి వంటి వారికి ఉన్నది చంద్రబాబు ప్రభుత్వంపైన 'భ్రమ' కాదు. 'ప్రభుత్వం' అనే వ్యవస్థ పాటించవలసిన నియమాల గురించి, విలువల గురించి వారికి కొన్ని విశ్వాసాలున్నాయి. అటువంటి విశ్వాసాలున్నాయి కాబట్టి ఆయన 'కలెక్టర్‌కు అర్జీ పెట్టారా?' అని తనకు ఫోన్ చేసిన బడే నాగేశ్వరరావును అడుగుతారు. ఆ విశ్వాసాలే లేకపోతే ఆ ప్రశ్నా అడగరు. బడే నాగేశ్వరరావు కోరిక మేరకు తనవంతుగా హోంమంత్రికి అర్జీ కూడా పెట్టడు. 'ప్రజలను సమీకరించి ఈ రాజ్యాన్ని కూలదోసి ప్రజారాజ్యం ఏర్పాటు చేద్దాం నడు– ఈ లోపల నీ మీద పెట్టిన మర్డర్ కేసు ఎత్తేయాలనీ నా ఉద్యోగం వరంగల్ నుండి హైదరాబాద్‌కు బదిలీ చేయాలనీ ఈ తాపత్రయం ఎందుకు?' అని జవాబిస్తాడు. తమకు శంకరన్ వంటి వారి నుండి ఏం కావాలో బడే నాగేశ్వరరావులు నిర్ణయించుకుంటే మంచిది. వారికి ఉండే విలువలనూ విశ్వాసాలనూ తమ హక్కుల రక్షణ కోసం ఉపయోగించుకోవాలనుకోవడం తప్పుకాదు. కానీ ఆ విధంగా ఉపయోగించుకుంటున్న వాటిని కనీసం

గౌరవించలేక 'భ్రమలు', 'గందరగోళం', చివరికి ప్రభుత్వం ప్రయోజనాలను కాపాడే ఆలోచనలు అంటూ నిందించడం క్షంతవ్యం కాదు.

బడే నాగేశ్వరరావు వివరంగా వర్ణించిన నిర్బంధాన్ని పౌరస్పందన వేదిక ఏ రోజూ ఖండించలేదనడం పట్టి అబద్ధం. తెలిసీ చెప్తున్న అబద్ధం. అయితే నిర్బంధమనే వాస్తవాన్ని గుర్తించినంత మాత్రాన దానిని గురించి బడే నాగేశ్వరరావు చేసిన విశ్లేషణతో అందరూ ఏకీభవించనవసరం లేదు. నక్సలైట్ ఉద్యమం తెలంగాణ జిల్లాల ప్రజలు అనుభవిస్తున్న జీవన పరిస్థితులకు ఒక రాజకీయ పరిష్కారంగా ముందుకొచ్చిందని ఏ కొంచెం ప్రజాస్వామిక దృక్పథం ఉన్న వారైనా ఒప్పుకుంటారు. అంత మాత్రం చేత తెలంగాణ సమాజానికీ నక్సలైట్ పార్టీలకూ ఉన్న సంబంధం కేవలం ప్రజలు–ప్రజాపోరాటం అనే సరళమైన సంబంధమని అందరూ ఒప్పుకోనవసరం లేదు. బడే అభిప్రాయాన్ని 'గందరగోళం' అనవసరం లేదుగానీ అది ఒకానొక అభిప్రాయం మాత్రమే.

ఎన్నికలొచ్చినప్పుడే పౌరస్పందన వేదిక చర్చల గురించి మాట్లాడుతుందన్న అభియోగం మరొక అబద్ధం. ఆ సంస్థ ఏర్పడిన నాటి నుండి ఇటు నక్సలైట్లకూ అటు ప్రభుత్వానికీ మధ్య వారధిగా వ్యవహరిస్తూ ఇద్దరి మధ్య చర్చలు జరగడానికి మార్గం సుగమం చేయాలనే ప్రయత్నిస్తున్నది. వాళ్లిద్దరికీ చర్చల పట్ల ఆసక్తి లేదన్న అనుమానం ఉన్న మా బోటి వాళ్లము, ఈ ప్రయత్నం వల్ల ఏమంత ప్రయోజనం ఉండబోదన్న సందేహాన్ని మొదటి నుండి వ్యక్తం చేస్తున్నాము కూడా.

ఆ ప్రయత్నం చేస్తున్నారంటేనే అర్థం ఇద్దరినీ 'ఒకే గాటన కడుతున్నార'ని కాదు, అన్ని సందర్భాలలోనూ 'సమదూరం' పాటిస్తున్నారని కూడా కాదు. 'నక్సలైట్లంటేనే ప్రజలు, ప్రభుత్వమంటేనే ప్రజా శత్రువు' అనే బడే నాగేశ్వరరావు అభిప్రాయంతో (అతని భాషే ప్రయోగించేటట్టయితే దీనికొక పరిహాస పూర్వకమైన పేరేదో వెతికి పెట్టవచ్చును గానీ, అభిప్రాయమనే అందాం) ఏకీభవించని వారందరూ ఇద్దరినీ 'ఒకే గాటనకట్టే వారు' కానక్కర లేదు. (పడికట్టు భాష నుండి బయట పడకపోతే పడికట్టు భావాల నుండి కూడా బయటపడలేమనడానికి ఈ ప్రయోగమొక మంచి ఉదాహరణ అనుకుంటాను).

సాయుధ పోరాటాలు నడిచే ప్రాంతాలలో ప్రజలు 'ఇద్దరి మధ్యా నలిగిపోతార'న్నది నిజమైనా కాకున్నా పోరాటం–ప్రతిస్పందన అనే పరిస్థితి నుండి ఉత్పన్నమయ్యే భారానికి కొంత కాలానికి అలసిపోతారనేది సత్యం. తప్పంతా ప్రభుత్వానిదేనన్న విశ్లేషణతో ఏకీభవించే వారు కూడా దానితో సంతృప్తి చెందలేరు. 'ఇద్దరూ

మాట్లాడుకుంటే బాగుండును' అనే అభిప్రాయం ఆ పరిస్థితులల్లో ప్రజల ఆలోచనల నుండి ఎంతో దూరం ఉండదు. కాశ్మీర్‌లోనూ నాగాలాండ్‌లోనూ ప్రభుత్వమూ పోరాటకారులూ చర్చలు జరుపుకోవాలని సామాన్య ప్రజలలో ఉన్న ఆసక్తి, పట్టుదల చూస్తే ఈ విషయం బాగా అర్థం అవుతుంది. తెలంగాణలో మెజారిటీ ప్రజలకు నక్సలైట్లంటే ఏదో ఒక మేరకు గౌరవం ఉందిగానీ వారి రాజకీయ లక్ష్యంతో (సాయుధ పోరాటం ద్వారా ఈ రాజ్యాన్ని కూలదోసి ప్రజారాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో) ఏకీభవించే వాళ్లు మైనారిటీయే. కాశ్మీర్‌లో, నాగాలాండ్‌లో అందుకు భిన్నంగా మెజారిటీ ప్రజలకు అక్కడి పోరాటకారుల 'వేర్పాటు' లక్ష్యంతో ఏకీభావం ఉంది. వాళ్లు పోరాటకారులనూ భారత కేంద్ర ప్రభుత్వాన్నీ 'ఒకే గాటన కట్టి' చూడరు. ఇద్దరి మధ్యా సమదూరం పాటించరు. వారికి భారత ప్రభుత్వం ప్రజాస్వామిక స్వభావం పట్ల ఏమాత్రం విశ్వాసం లేదు. చంద్రబాబు ప్రభుత్వం మన రాష్ట్రంలో వ్యవహరించిన దానికంటే వందరెట్లు అప్రజాస్వామికంగా కేంద్ర ప్రభుత్వం అక్కడ వ్యవహరించింది, వ్యవహరిస్తున్నది.

అయినప్పటికీ పోరాట కారులు పంతాలకూ పట్టింపులకూ పోకుండా చర్చలకు సిద్ధం కావాలని భారత ప్రభుత్వం ఒక ఎత్తుగడగా కాకుండా నిజాయితీగా చర్చలకు భూమికగా ఇరువురూ మనస్ఫూర్తిగా కాల్పులు విరమించాలనీ అక్కడి ప్రజలలో చాలా మంది (బహుశా మెజారిటీ) కోరుతున్నారు. తమ రాజకీయ విశ్వాసాలేవి వదులుకోకుండా కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని 'నిలదీయడం' ఒక్కటే తమ కర్తవ్యమనుకోవడం లేదు.

మన దగ్గర కాల్పుల విరమణ ప్రతిపాదన పౌరస్పందన వేదిక ఈ మధ్యనే పెట్టింది. బహుశా ఒకేసారి ఆ ప్రతిపాదన పెట్టకుండా ఇరుపక్షాల మీదా ఇంకొంచెం పరిమితమైన డిమాండ్లు పెట్టడం ఉచితంగా ఉండేదేమో. అయినప్పటికీ వాస్తవిక దృక్పథంతో ప్రజల క్షేమం కోరే వారెవరైనా ఈ ప్రయత్నం అవసరమనీ ఉపయోగకరమైనదనీ గుర్తిస్తారు. ప్రపంచాన్ని తమ కళ్లతో చూడలేని వారందరూ 'భ్రమ'లలో ఉన్నారనీ 'గందరగోళం'లో పడిపోయారనీ భావించే బడే నాగేశ్వరరావులకు ఇది సత్యమనిపించకపోతే ఆ నష్టం వారిదేననుకుంటాను.

# ఇప్పుడు జరగవలసింది ప్రతీకారం కాదు

ప్రభుత్వాన్ని లొంగదీసుకోవాలంటే ప్రజలను హింసించు అనే సూత్రాన్ని కనిపెట్టిందీ, మొదట ప్రయోగించిందీ ఒసామా బిన్ లాడెన్ కాదు.

పాత చరిత్రలోకి పోనక్కరలేదు. ఆధునిక చరిత్రలో కూడా బిన్ లాడెన్ ఈ అమానుషత్వానికి–అది అమానుషత్వం అనడంలో ఎటువంటి సందేహం లేదు–ఆద్యుడు కాడు.

అమెరికా వాళ్లే ఆద్యులా అంటే ఏమోగానీ ఈ సూత్రాన్ని పెద్దఎత్తున ప్రయోగించిందీ, మళ్లీ మళ్లీ ప్రయోగిస్తున్నదీ మాత్రం అమెరికాయే.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వైనం అందరూ మరచిపోలేదు. హిట్లర్ ఓటమి అంగీకరించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటలీ ప్రభుత్వం కూడ ఓడిపోయానని ఒప్పేసుకుంది. ఇంక మిగిలింది జపాన్ ఒక్కటే. ఒంటరిగా అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లను ఎదుర్కొనే స్థితిలో జపాన్ లేదు కాబట్టి ఒక రోజు కాకపోతే ఒక రోజు జపాన్ రాజు కూడ లొంగిపోయేవాడే. కానీ అమెరికా అప్పటిదాకా ఆగదలచుకోలేదు. 'ఇంకా ఎన్నాళ్లు మా యువకులను మృత్యువుకు అప్పగించమంటారు?' అని ప్రశ్నించిన వాళ్లకు జవాబు చెప్పారు. పైగా, కొత్తగా తయారు చేసుకున్న అణు బాంబును పరీక్షించడానికి 'ఇదే అదను' కాబట్టి జపాన్ ప్రజల మీద ఒకటో రెండో అణు బాంబులు వేసేస్తే అవి పనికొచ్చే బాంబులో కాదో తేలిపోతుంది. జపాన్ రాజూ లొంగివస్తాడని అమెరికా అనుకొనింది.

హిరోషిమా నాగసాకీల మీద రెండు అణుబాంబులు వేసి 3 లక్షల యాభై వేల మందిని చంపి అది పనికొచ్చే బాంబని రుజువు చేసుకోవడమే కాక జపాన్ రాజుచేత ఒక్క రోజులో యుద్ధ విరమణ ప్రకటన చేయించింది కూడా.

మొన్నటి 11వ తేదీన న్యూయార్క్‌లోనూ వాషింగ్టన్‌లోనూ చనిపోయింది ఎంత మంది. పదివేల మందా? ఇరవై వేల మందా? ముప్పైవేల మందా?

సంఖ్యనుబట్టి దుర్మార్గమెంత అని నిర్ణయించటం న్యాయం కాదంటారేమో, ఒప్పుకోవడానికి అభ్యంతరమేమీ లేదు. నిరాయుధులయిన సాధారణ ప్రజలను ఒకరిని చంపినా, మూడున్నర లక్షల మందిని చంపినా అది ఒకే రకమైన దుర్మార్గమని ఒప్పుకుందాం. కానీ తాము ఎన్నడూ ఇటువంటి పనులేవీ చేయనట్టు 'ఇది మంచికీ చెడుకూ మధ్య యుద్ధం' అని ప్రకటించడం ఎందుకు?

ఎప్పటిదో పాతకాలపు కథ ఇప్పుడు తవ్వితీయడమెందుకు అని అభ్యంతర పెట్టేవాళ్లు కూడా ఉంటారు. కానీ ఆమెరికా ఆనాటి తర్కాన్ని ఇప్పటికీ వదులుకోలేదు.

సద్దాం హుస్సేన్‌కు బుద్ధి చెప్పడానికి ఇరాక్ ప్రజలపైన దాడి చేసింది. ఇరాక్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. అత్యవసర వస్తువులు కూడా ఆ దేశపు ప్రజలకు అందకుండా ఆంక్షలు విధించి తన ఆధిపత్యాన్నంతా వినియోగించి అమలు పరిచింది. మందులు లేక ఇరాక్‌లో పసిపిల్లలు చచ్చిపోతున్నారనీ ఇది అన్యాయమనీ అందరూ విమర్శించినా పట్టించుకోలేదు. ప్రజలను హింసిస్తేనే ప్రభుత్వం దిగివస్తుందన్న సూత్రాన్ని అమెరికా ఇరాక్ విషయంలో తు.చ. తప్పకుండా అమలు చేసింది.



ఇరాక్ తరువాత యుగొస్లావియా వంతు వచ్చింది. మిలోసెవిచ్ దుర్మార్గాన్ని అణచడానికి యుగొస్లావియా భూభాగంపైన, పరిశ్రమలపైన బాంబులతో దాడులు చేసింది. సెర్బియన్ ప్రజలను హింసిస్తేనే మిలోసెవిచ్ లొంగుతాడని భావించి ఆ ప్రజలను విపరీతమైన హింసకు గురి చేసింది. రేపు ఒసామా బిన్ లాదెన్‌కు రక్షణ కల్పిస్తున్న తాలిబన్‌లకు 'బుద్ధి చెప్పడానికి' ఆఫ్గనిస్తాన్ పౌర జీవితాన్ని బాంబుదాడులతోనూ ఆంక్షలతోనూ అమెరికా ఛిన్నాభిన్నం చేసినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

మనకొక్కరికే సాధ్యమవుతుందనుకున్నంత కాలం దౌర్జన్యంలో తప్పు కనిపించదు. కానీ ఎదుటివారు కూడా ఆ సామర్థ్యాన్ని అలవరచుకున్న నాడు అది దౌర్జన్యంగా కనిపిస్తుంది. అది 'అనాగరికం', 'మానవతకు మచ్చ' 'మంచికీ చెడుకూ మధ్య ఘర్షణ' మొదలైన మాటలు వినిపిస్తాయి. ఇప్పుడు మూడు రోజులుగా అమెరికా నోట ఆ మాటలే వింటున్నాం.

అమెరికా చేసిన దుర్మార్గాల పేరు చెప్పి మొన్నటి 11వ తేదీన జరిగిన దాడిని సమర్థించడం నా ఉద్దేశ్యం కాదు. నిరాయుధులూ నిస్సహాయులూ అయిన వ్యక్తులను

చంపడం ఎట్టి పరిస్థితిలోనూ సమర్థనీయం కాదు. అయితే ప్రపంచమంతటికీ ఈ దారి చూపింది అమెరికాయేనని గుర్తిస్తే, ఆ భస్మాసుర హస్తం వాళ్ల నెత్తిమీదే వచ్చి నిలిచిందని గ్రహించగలుగుతాం. తప్పుదారి చూపినవారే సరయిన దారి చూపించడానికి చొరవ తీసుకోవడం ఉచితంగా ఉంటుంది కాబట్టి ఇకనైనా అమెరికా పాలకులు తమ ఆచరణను మార్చుకొని దేశాల మధ్య సమస్యలను నాగరికంగా పరిష్కరించుకునే ప్రయత్నానికి పునర్జీవనం కల్పించాలని డిమాండ్ చేయగలుగుతాం. అందుకు భిన్నంగా ఆ దేశ అధ్యక్షుడు 'దీన్ని అమెరికా మీద యుద్ధంగా పరిగణిస్తున్నాం' అనీ 'వాడు ఎక్కడున్నా సరే పట్టుకొని బుద్ధి చెపుతాం' అనీ ప్రకటించడాన్ని న్యాయమైన ఆగ్రహంగా కాక తప్పుడు ధోరణులను కొనసాగించే గుడ్డితనంగా గుర్తించగలుగుతాం.

'పునర్జీవనం' అనడానికొక కారణం ఉంది. 20వ శతాబ్దంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం, ప్రపంచదేశాల మధ్య సమస్యలను బలప్రయోగం ద్వారా కాకుండా శాంతియుతంగా పరిష్కరించే అంతర్జాతీయ యంత్రాంగాన్ని నెలకొల్పాలన్న ఆలోచన బలంగా ముందుకొచ్చింది. యుద్ధం ముగిసిన తరువాత శ్మశాన వైరాగ్యాన్ని పోలిన యుద్ధవైరాగ్య మొకటి అంకురించడం సహజమే కావచ్చునుగానీ ఈ ఆరాటానికి అంతకంటే బలమైన నైతిక భూమిక ఉంది. మానవ నాగరికత వయసు అయిదువేల సంవత్సరాలనుకున్నట్టయితే ఈ కాలంలో మనుషులు మరింత బలప్రయోగ సామర్థ్యాన్ని కల్పించే సాంకేతిక ఆవిష్కరణలే కాక, మానవ సహజీవనానికి తోడ్పడే నైతిక విలువల ఆవిష్కరణ కూడ చేశారు. బుద్ధుడి ఆలోచనలనొక మైలురాయిగా తీసుకుంటే ఆ తరువాత గడచిన రెండున్నర సహస్రాబ్దాల చరిత్రలో మానవతా విలువలు విస్తృతమైన– నైతిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ– పరిధిని సంతరించుకున్నాయి. అవి కేవలం ప్రవచనాల దగ్గరే ఎందుకు ఆగిపోవాలి? సమస్యల పరిష్కారం దగ్గర కొచ్చేసరికి బలప్రయోగమే ఎందుకు ఏకైక మార్గం కావాలి? మానవ మేధస్సు చేసిన అన్ని వైజ్ఞానిక ఆవిష్కరణలు వాడుకొని మరింత క్రూరమైన హింసా రూపాలను తయారుచేస్తున్న మనం అదే మేధస్సు (లేక మనస్సు అనాలో) చేసిన తాత్విక ఆలోచనలకు ఆచరణలో స్థానమెందుకు ఇయ్యలేక పోతున్నాం? సమస్యల హింసాత్మక పరిష్కారానికి చాలా 'నాగరికమైన' ఆయుధాలు వాడుతున్నాము గానీ నాగరికమైన పరిష్కార మార్గాలెందుకు వెతకలేక పోతున్నాం?

ఈ ఆలోచన నుండి అంతర్జాతీయ సమస్యల శాంతియుత పరిష్కారం కోసం మొదటి ప్రపంచ యుద్ధం తరువాత లీగ్ ఆఫ్ నేషన్స్, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డాయి. అవి బతికినన్నాళ్లు అగ్ర రాజ్యాల కొట్లాటలకు వేదికలుగా వాడుకోబడ్డాయన్నది ఒకెత్తుకాగా, సోవియట్ రష్యా పతనం తరువాత

రెండవ అగ్రరాజ్యం లేని పరిస్థితిని వాడుకొని అమెరికా ఐక్యరాజ్యసమితిని తన జేబులో వేసుకొని తానే ప్రపంచ పోలీసుగా క్రూరమైన భౌతిక బలప్రయోగంతోనూ అంతే క్రూరమైన ఆంక్షలతోనూ అన్ని ప్రపంచ సమస్యలనూ 'చక్కబెడు'తున్నది. దీనికి అంతే అనాగరికమైన జవాబు రాకుండ ఎన్నాళ్లో ఉండదు. ఆ జవాబు మొన్నటి 11వ తేదీన వచ్చింది.

అమెరికాకు ఈ కష్ట కాలంలో వత్తాసు పలుకుతున్న దేశాలన్నీ ఇప్పటికైనా మేల్కొంటాయా? ఇరాక్‌తోనూ యుగొస్లావియాతోనూ వ్యవహరించినట్టే ఇప్పుడు బిన్ లాదెన్ మనుషులు ఏయే దేశాలలో ఉంటే ఆ దేశాలన్నిటితోనూ వ్యవహరించబోతానన్న బుష్ ప్రకటనను బహిరంగంగా వ్యతిరేకించి, ఏ నాగరికమైన తాత్విక ఆలోచన ఒకనాడు ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం వెనక ఉండిందో దానిని సమగ్రంగా, నిజాయితీగా అమలు చేయడానికి కృషి చేస్తాయా? చేయకుంటే ఇటూ అటూ ఇంకొన్ని వేల మందో లక్షల మందో అమాయకులు చావడం తప్ప ఈ బుష్-బిన్ లాదెన్‌ల చంపుడు పందెం సాధించబోయేది ఏమీ లేదు.

# ఈ ఆధునిక అగ్రహారాలను చూడండి

సైన్సు, టెక్నాలజీలలో నైపుణ్యం ఉన్నవారి అహంకారం స్వల్పం కాదు. వాళ్లను సామాజిక ప్రాముఖ్యం గల నిర్ణయాలు చేయమని అడిగితే అందులో తమకు తెలియని విషయమేమైనా ఉందేమోనన్న అనుమానాన్ని సైతం దగ్గరకు రానివ్వరు. అందువల్లనే సామాజిక ప్రాముఖ్యం గల ఏ నిర్ణయాన్నీ సైంటిస్టులకు వదిలిపెట్టకూడదు.

వైజ్ఞానిక సంస్థలలో రిజర్వేషన్ల అమలుకు పట్టిన గతి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. రిజర్వేషన్ల గురించి రాజ్యాంగం ఏమంటుందో వాళ్లకు అనవసరం. రిజర్వేషన్లకు సంబంధించిన 'అన్ని కోణాలనూ పరిశీలించి చట్టాన్ని ప్రకటించడం కోసం' ఏర్పాటు చేసిన 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం 'మండల్ కమిషన్ కేసులో' ఏమన్నదో వారికి అనవసరం. వాళ్లకున్న సంకుచితమైన వైజ్ఞానిక పరిధిలో వారు ఏర్పరచుకున్న అభిప్రాయాలే సర్వం అని వారు భావిస్తారు. అవే సత్యమని భావిస్తారు. ఇది ఎక్కడైనా సైంటిస్టులతో ఉండే సమస్యే కావచ్చును. కానీ భారతదేశంలో సైంటిస్టులు అత్యధికంగా బ్రాహ్మణులు కావడం వల్ల ఆ వర్గానికి ఉండే దృష్టిలోపం చాలా ప్రగాఢమయినది.

అత్యధిక భాగం వైజ్ఞానిక, సాంకేతిక సంస్థలలో అసలు రిజర్వేషన్లే అమలు కావు. మండల్ కమిషన్ సిఫారసు పైన ఆధారపడ్డ కేంద్ర ప్రభుత్వ ఆదేశం రాజ్యాంగబద్ధమేనని 9 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ప్రకటించి ఎనిమిదేళ్లు గడిచినా ఏ ఒక్క కేంద్ర ప్రభుత్వ రంగ వైజ్ఞానిక సంస్థలోనూ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వటం లేదు. ఏమీ ఎందుకూ అని వారిని అడగడానికి కూడా వీలు లేదు. 'ప్రతిభకు' తప్ప వేరే దేనికీ వైజ్ఞానిక సంస్థలలో చోటు లేదని వారి గట్టి అభిప్రాయం.

ఈ రకమైన వాదనలో 'ప్రతిభ' అనే మాటకు ఉండే అర్థాల గురించి, అర్థచ్ఛాయల గురించి సామాజిక శాస్త్రవేత్తలే కాదు, సుప్రీంకోర్టు జడ్జీలు సహితం చేసిన నిశితమైన వ్యాఖ్యలు వారికి అక్కరలేదు. మన దేశంలో ఐఐటిలు సాంకేతిక విద్యా సంస్థలలో

నిగాహ్

మేటి. అవి ప్రస్తుతం ఆరు ఉన్నాయి. దళితులకూ ఆదివాసులకూ సీట్లలో రిజర్వేషన్ కల్పించాలని వారికెవరో చెప్పినట్టున్నారు. వారు ఇవ్వడానికి పూనుకున్నారు.

ఏ విధంగానంటే దళితులకు ఇచ్చే 15% రిజర్వేషన్‌లోనే దళితులందరూ సీట్లు పొందాలి. ఒక వేళ అభ్యర్థులందరిలోకి ఒక దళిత అభ్యర్థికే ఎక్కువ మార్కులు వచ్చినా సరే, ఆ దళిత అభ్యర్థి దళితులకు ఇచ్చే 15% సీట్లనుండే తన సీటు పొందాలి. ఆదివాసీ అభ్యర్థులయినా అంతే. అత్యంత 'ప్రతిభా వంతులయిన' ఆదివాసులు సహితం ఆదివాసులకిచ్చే 7.5% సీట్లలోనే సీటు పొందాలి.

రిజర్వేషన్లు ఇమ్మంటే అంటరానితనం పాటిస్తున్నారేమిటని వారిని అడగవద్దు. చాలా గొప్ప పని చేస్తున్నామనుకుంటున్నారు వారు. అహంకారంతో వాళ్ల కళ్లు ఎంత పూర్తిగా మూసుకుపోయాయంటే వాళ్లు దళిత విద్యార్థులనే కాదు, వారి అప్లికేషన్ ఫారంలను కూడా అంటరానివిగా భావిస్తున్నారు. ఒకే అప్లికేషన్ ఫారంలో దళితులూ సవర్ణులూ అప్లై చేయడానికి వీలు లేదు. ఎవరి ఫారంలు వారివి. ఆ ఫారంను దళితులు తెల్లరంగు కవర్‌లో పెట్టి పోస్టు చేయాలి. సవర్ణుల కవరు గోధుమ రంగులో ఉంటుంది. ఆ విధంగా వేరు వేరు అప్లికేషన్ ఫారంలు తెప్పించుకొని వేరు వేరు మెరిట్ లిస్టులు తయారు చేస్తారు. దళిత అభ్యర్థులు వారి లిస్టు నుండి, వారి కోటా మేరకు మాత్రమే సీట్లు పొందాలి. ఆదివాసులయినా అంతే.

ఎక్కడో మారుమూల గ్రామాలలో దళిత విద్యార్థులకు వేరే క్లాస్‌రూంలు పెట్టారనీ, వేరే బెంచీల మీద కూర్చోమంటున్నారనీ అప్పుడప్పుడు పత్రికలలో చదివి ఇంకా ఇంతటి అనాగరికత ఉందా అని ఆశ్చర్యపోతుంటాం, ఆగ్రహం చెందుతుంటాం. కానీ అత్యంత ప్రతిభావంతులయిన సైంటిస్టులు పరిపాలించే అత్యంత నాగరికమైన ఐఐటిలు దళిత అభ్యర్థుల అప్లికేషన్లు వేరే వాళ్ల అప్లికేషన్లతో కలవకుండా వేరుగా ఉంచుతున్నాయనీ, ఒకరి 'మెరిట్‌లిస్టు' వేరేవారి 'మెరిట్‌లిస్టు'తో కలవకుండా వేరుగా ఉంచుతున్నాయనీ ఎంతమందికి తెలుసు? రిజర్వేషన్లు కల్పించే పద్ధతి ఇది కాదని ఏ కొంచెం ఇంగితం ఉన్నవారికైనా తెలిసే ఉండాలి. కానీ ఐఐటి మేధావులకు మాత్రం తెలియదు.

నిజానికిది తెలియక పోవడం కూడ కాదు. రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా వైజ్ఞానిక సంస్థలలో ప్రవేశార్హత లేనివారికి ఆ అవకాశం అందిస్తున్నామని ఈ సంస్థల పాలక వర్గాలు భావిస్తాయి. ఈ అర్హత వారు నమ్మే 'మెరిట్' కూడా కాదు. కులమే ఆ అర్హత. అది లేని కులాలకు రిజర్వేషన్లు కల్పించి, ఆ మేరకు మాత్రమే వారిని

రానిస్తారు. ఆ విధంగా వారిని రానివ్వడం తమ గొప్పతనానికీ ఔదార్యానికీ నిదర్శనమని వారు భావిస్తారు కాబట్టి ఇది ఎంత దుర్మార్గమైన వైఖరో వారికి అర్థం కాదు.

మరి దళితులూ ఆదివాసులూ ఐఐటిలో సవర్ణ హిందువులతో పోటీపడి సీట్లు పొందడానికి వీలే లేదా? ఉంది–తాము దళితులమన్న సంగతి, ఆదివాసులమన్న సంగతి తొక్కిపెట్టి పోటీలో పాల్గొనాలి. ఆ పోటీలో తట్టుకోలేకపోయిన పక్షంలో రిజర్వేషన్ పొందే అవకాశాన్ని విడచిపెట్టుకొని పోటీకి సిద్ధం కావాలి. అప్పుడు కులంపేరు చెప్పడానికి ఖాళీలేని 'జనరల్' అప్లికేషన్ ఫారం నింపి గోధుమ రంగు కవర్‌లో పెట్టి పంపించాలి. అప్పుడు అందరితో పాటు పోటీ పడవచ్చు. కానీ ఓడిపోతే మాత్రం రిజర్వేషన్ అడగడానికి వీలులేదు.

'ఇది నిజంగానే జరుగుతున్నదా?' అని చాలామంది ఆశ్చర్యపోవచ్చును. కానీ ఈ ఐఐటిలు మండల్ కమిషన్ వచ్చి ఎనిమిదేళ్లు గడిచినా కూడ బిసిలకు రిజర్వేషన్‌లు ఇవ్వడం లేదని గుర్తు చేసుకుంటే ఇందులో అంతగా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. బిసి రిజర్వేషన్ల దాకా ఎందుకు–విద్యార్థుల ఎంపికలో పైన చెప్పినట్టు ఒక వక్రమైన పద్ధతిలోనైనా ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ కల్పిస్తుండవచ్చును గానీ అధ్యాపకులలో ఎస్‌సి, ఎస్‌టిలు దాదాపు మృగ్యమనే చెప్పుకోవాలి. దళితులు, బిసిల దాకా ఎందుకు, బ్రాహ్మణేతర అగ్రకులాలు సహితం ఐఐటిలలోనూ, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలలోనూ ఎక్కువ కనిపించరు.

మద్రాసులో ఐఐటిని 'అయ్యంగార్, అయ్యర్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్) టెక్నాలజీ' అని ద్రవిడ ఉద్యమకారులు పిలుస్తారంటే ఆ పేరు ఊరికే రాలేదు మరి! దేశంలో అగ్రహారాలు ఇంకా ఎక్కడైనా మిగిలి ఉన్నాయంటే అది ఉన్నత (సాంకేతిక) విద్యా రంగంలోనే అనేది ఆధునికతను అపహాస్యం చేసే విషయం కావచ్చును గానీ అది సత్యమే.

అక్టోబర్ 21, 2001

# బలవంతపు మౌనం

ఆత్మాభిమానం గల ముస్లింగా బతకడం ఈ రోజు చాలా కష్టమైపోయింది.

మరీముఖ్యంగా భారతదేశంలో..

ప్రపంచంలో ఇండోనేషియా తర్వాత అత్యధిక సంఖ్యలో ముస్లింలు నివసించే భారత్‌లో ఈ పరిస్థితి వుండడం చాలా దారుణం... బాధాకరం.

గత శుక్రవారం (అక్టోబర్ 12) హైదరాబాద్‌లోని మక్కా మసీదు సమీపంలో జరిగిన 'అల్లరి'ని పరిశీలిస్తే ఈ విషయం కొంత వరకు అర్థమవుతుంది. ఆఫ్ఘనిస్తాన్ పైన అమెరికా చేస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ కొందరు ముస్లిం యువకులు ఆ రోజు మసీదులో ప్రార్థనలు ముగిసిన తర్వాత బయటికి వస్తూ పోలీసుల పైన రాళ్ల వర్షం కురిపించారనీ, పోలీసులు వారి దాడి నుండి తమను తాము కాపాడుకోవడానికి బాష్పవాయువు, లాఠీలు ప్రయోగించాల్సి వచ్చిందనీ నగర పోలీసులు వివరించారు.

నిగాహ్

అందరిలాగ వీళ్లు కూడా శాంతియుతంగా ఊరేగింపు చేయవచ్చు కదా. నిరసన తెల్పడానికి రాళ్లు వేయడమే మార్గమా? అని చాలామంది ఆ వార్త చదవగానే అనుకున్నారు. ఎవరి గురించో ఎందుకు, నేనే అనుకున్నాను.

ఆ ప్రశ్నే పాతబస్తీ ముస్లింలను అడిగాను. 'మొన్ననే తొమ్మిది వామపక్ష పార్టీలు నగరంలో ఇదే విషయం మీద ఊరేగింపు చేశారు. మీరూ ఆ పనే చేసి వుండవచ్చును కదా' అన్నాను. ఈ ప్రశ్న అడిగింది శాంతియుత నిరసన మీద నమ్మకం లేని 'తీవ్రవాద ముస్లిం'లను కాదు. శాంతియుతంగా స్వచ్ఛంద సంస్థలు నడుపుకుంటున్న వారినే అడిగాను. దానికి వారి జవాబేమిటంటే, 'వామపక్షాలకు ఊరేగింపు తీయడానికి పోలీసులు అనుమతి ఇస్తారు కానీ ఏ ముస్లిం సంస్థకూ ఇవ్వరు' అని.

ఇది నిజమని చార్మినార్ పోలీసులు ఒప్పుకుంటున్నారు. 'వాళ్లకు అనుమతి ఇస్తే హింస జరుగుతుంది కాబట్టి ఇవ్వం' అంటున్నారు. ఇక్కడ వాళ్లు అంటే ముస్లింలు.

'ముస్లిం' అనేది ఆ మతాన్ని విశ్వసించే వారందరికీ టోకుగా వర్తించే మాట. అందులో శాంతిని కాంక్షించేవారు, అక్కరలేదనుకునే వారు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించేవారూ, తిరస్కరించే వారూ, తాలిబన్ బాపతు పార్టీలను అసహ్యించుకునే వారు, వాటిని ప్రేమించే వారు అనే వర్గీకరణ ఏదీ లేదు. అందరూ ఒకటే. 'ముస్లిం' అనేది ఒక అఖండమైన తిట్టుమాట.

'ఊరేగింపులో హింస జరగనివ్వమని వాళ్లు మమ్మల్ని నమ్మించగలిగితే మేము పర్మిషన్ ఎందుకు ఇవ్వం?' అని నగర పోలీసులు అనొచ్చు. అంటే ఆఫ్ఘనిస్తాన్ మీద అమెరికా చేస్తున్న అన్యాయమైన యుద్ధాన్ని నిరసించే హక్కు పొందడానికి ముస్లింలు ముందు తమ సచ్ఛీలతను రుజువు చేసుకోవాలి. తాము లాదెన్ అభిమానులు కాదనీ శాంతి కాముకులమనీ రుజువు చేసుకోవాలి. ఒకనాడు హింస చేసినందుకు కాదు, కేవలం ముస్లింలయినందుకు రుజువు చేసుకోవాలి. ఒకప్పుడు ఊరేగింపులో హింస చేసిన సంస్థ రెండవసారి పర్మిషన్ కోసం అర్జీపెట్టుకుంటే మీరు ఈసారి కూడ అదే పని చేయరన్న నమ్మకమేమిటి అని పోలీసులు శంకిస్తే అందులో కొంచెం అర్థం వుంది. కానీ కిందటిసారి ఒక ముస్లిం సంస్థ తీసిన ఊరేగింపులో హింస జరిగింది కాబట్టి ఈసారి ముస్లిం లెవరు ఊరేగింపు తీస్తామన్నా మేము శంకిస్తాం అనడం సహేతుకం కాదు.

నిజానికి మొన్నటి 12వ తేదీన నిరసన తెలుపుతూ మక్కా మసీదు నుండి బయటి కొచ్చిన వారు వెంటనే పోలీసులపైన రాళ్లు వేయలేదు. 'అల్లా హో అక్బర్' అంటూ నినాదాలిస్తూ చార్మినార్ వైపు పోబోయారు. అక్కడ అప్పటికే వందల సంఖ్యలో సాయుధ పోలీసులున్నారు. స్థానిక పోలీసులు నినాదాలిస్తున్న యువకులను క్రమబద్ధంగా ఊరేగింపు చేయమని ఆదేశించి, వారు ఉద్రేకంలో హింసకు పాల్పడకుండా చూసేందుకు బందోబస్తు ఏర్పాటు చేసి వుండవచ్చును. ఆ పని ఎందుకు చేయలేదని పోలీసులనడిగితే, 'వాళ్లకు శాంతియుతంగా ఊరేగింపు చేసే ఉద్దేశం లేదని మాకు అర్థం అయింది' అంటున్నారు.

కాబట్టి వాళ్ళను పోలీసులు ముందుకు పోనీయకుండా మసీదులోకి నెట్టారు. వాళ్లు పోలీసుల మీద మొదట చెప్పులు విసిరారు. మసీదు ఆవరణలోకి ప్రవేశించిన తర్వాత అక్కడ వున్న షాబాద్ బండలు పగులగొట్టి ఆ రాళ్ళతో పోలీసులను కొట్టారు. పోలీసులు ఆ రాళ్లు తిరిగి విసరడమేకాక లాఠీలతో కొట్టారు. బాష్పవాయువు ప్రయోగించారు.

ఊరేగింపును నియంత్రించే అధికారం వుండి, దండిగా అవకాశం వుండి కూడా దానిని అడ్డుకోవడమే సరైనదని నమ్మే పోలీసు వ్యవస్థ వున్న చోట పాతబస్తీకి చెందిన ఒక సగటు ముస్లిం ఏం చేయాలి?

హింసను నమ్మే వాళ్ళు కాదు, నమ్మని వాళ్ళు ఏం చేయాలి? ఏ 'అతివాదాన్న'యితే మొగ్గలోనే తుంచేయాలని పోలీసులు కంకణం కట్టుకున్నారో ఆ అతివాదం ఒక్కటే ఈ పోలీసుపాలనలో మనగలదు. వేరేదేదీ మనలేదు. వేరే విశ్వాసాలున్న వాళ్ళు ఏం చేయాలి?

ఈ వాతావరణంలో (ఇది ఒక్క హైద్రాబాద్ పాతబస్తీకి మాత్రమే పరిమితం కాలేదు) ముస్లింలందరూ తాము 'అతివాదులు' కాదనీ తమకు బిన్‌లాదెన్ అన్నా తాలిబన్ అన్నా సదభిప్రాయం లేదనీ పదేపదే రుజువు చేసుకుంటూ బతకాలి. నిజంగానే వారంటే సదభిప్రాయం లేని వారికి కూడా ఈ ఒత్తిడి దుర్భరంగా వుంటుంది. అంతేకాక, తాలిబన్‌లంటే సదభిప్రాయం లేకపోయినా వారిని ఏ విధంగా చూస్తాం, ఏ విధంగా అర్థం చేసుకుంటాం అనే ప్రశ్నలకు నిర్భయంగా జవాబులు వెతికే స్వేచ్ఛ కూడా ముస్లింలకు ఈ వాతావరణం నిరాకరిస్తుంది. పాశ్చాత్య ప్రజాతంత్ర వాదులు, హిందూ లౌకిక వాదులూ చేసిన వ్యాఖ్యలను స్వీకరించే ముస్లింలే 'మంచి ముస్లిం'లు... వేరే కోణం నుంచి చూసే ప్రయత్నం చేయడం అనుమానాన్ని శంకనూ ఆహ్వానించే పని.

ఇస్లాం అంటేనే తీవ్రవాదం అనే అభిప్రాయం కలిగించే పద్ధతిలో టివి చానెల్స్ దృశ్యాలు ప్రసారం చేయటం చూస్తున్నాం. సెప్టెంబర్ 11 తర్వాత పాకిస్తాన్, పాలస్తీనా, ఇండోనేషియా తదితర దేశాలు లేక ప్రాంతాలకు సంబంధించి ఒకే ఒక దృశ్యం టీవీలో చూస్తున్నాం. బిన్‌లాదెన్ చిత్రపటం చేతపట్టుకొని మతపరమైన నినాదాలిస్తూ అమెరికాను తిట్టిపోస్తున్న ప్రదర్శనకారుల దృశ్యం ఇది.

ఈ చిత్రం తప్ప ఆ దేశాలలో వేరే వాస్తవమేదీ లేదన్న అభిప్రాయం బలంగా కలిగించడం ఈ ప్రసార దాడి పర్యవసానాలలో ఒకటి కాగా, ఈ చిత్రానికి 'మతోన్మాదం' అన్న అర్థం తప్ప వేరే భావమేదీ లేదన్న అభిప్రాయం కలిగించటం రెండవది. వేరే భావం వుందని వివరించే ప్రయత్నం చేయటం ముస్లిమేతరులకు కష్టసాధ్యమైనా ఆ అవకాశం లేకపోలేదు. కానీ ముస్లింలకు ఆ అనుమతి లేదు. స్వతహాగా మతవాదులన్న అభాండాన్ని మోస్తూ బతికే వారు అటువంటి సాహసం చేయలేరు. వారు 'ముస్లిం తీవ్రవాదాన్ని' గొంతు చించుకొని ఖండిస్తూనే వుండాలి, లేదా 'ముస్లిం తీవ్రవాదుల'లో కలిసి పోయారనిపించుకోవాలి.

'ముస్లిం దేశాలు' 'ముస్లిం తీవ్రవాదం' అన్న మాటలు ఎంత విరివిగా వాడటం జరగుతున్నదంటే ఈ మాటలు ఎంతవరకు అర్థవంతమైనవి అని ఆలోచిస్తున్న వారెవరూ లేరు. మెజార్టీ ప్రజల నిర్ణయం మేరకు ఇస్లామిక్ మత రాజ్యాన్ని నెలకొల్పిన దేశాన్ని ముస్లిం దేశం లేక ముస్లిం రాజ్యం అనడంలో అర్థం వుండవచ్చును. కాని ముస్లింలు మెజార్టీగా నివసించే దేశాలన్నిటినీ ముస్లిం దేశాలు అనడంలో అర్థమేమీ

లేదు. మత రాజ్యాలు నెలకొల్పిన దేశాలు అందులో కొన్నే. అవి కూడా మెజార్టీ ప్రజల కోరిక మేరకు నెలకొల్పినవా అంటే అనుమానమే. పాకిస్తాన్, సౌదీ అరేబియా వంటి దేశాలలో నెలకొల్పిన మతరాజ్యాల పట్ల ప్రజలో చాలామందికి వ్యతిరేకత లేకపోవచ్చును కానీ వారిలో ప్రగాఢమైన కోరిక వుండిందనీ ఆ కోరికమేరకే నెలకొల్పారనీ నమ్మడానికి ఆధారాలేవీ లేవు. పాకిస్తాన్ రాజకీయాలలో మత రాజ్య స్థాపనను అజెండాలో పెట్టుకున్న ఏకైక పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్. ఆ పార్టీకి ఎన్నికలలో ఏ రోజూ పది శాతం మించి ఓట్లు రాలేదు. పాకిస్తాన్ రాజకీయాలలో ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా స్పందించిన నినాదం జిహాద్ కాదు, కాశ్మీర్ కూడా కాదు. జుల్ఫికార్ ఆలీ భుట్టో ఇచ్చిన 'రోటీ కపడా ఔర్ మకాన్' (కూడు, గుడ్డ, గూడు) అన్న నినాదం కదిలించినట్టు పాకిస్తాన్ ప్రజలను వేరే ఏ నినాదం కదిలించలేదని పాకిస్తాన్ రాజకీయాలను అధ్యయనం చేసిన వారు అంటారు.

ఇంక ఇండోనేషియా, బంగ్లాదేశ్, అల్జీరియా, టర్కీ, ఈజిప్ట్ వంటి దేశాలలోనైతే మత రాజ్య స్థాపన ప్రయత్నాన్ని ఆ దేశంలోనే చాలా మంది గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. వ్యతిరేకిస్తున్న వారు అత్యధికంగా ముస్లింలే, తమ మతాన్ని ఆచరించే వారే.

ఈ దేశాలన్నిటినీ కట్టగట్టి 'ముస్లిం దేశాలు' అనడంలో అర్థం ఏముంది? ఇండియాను 'హిందూ దేశం' అని పిలిస్తే మనకు (సంఘ్ పరివార్‌కు చెందినవారము కాకపోతే) అభ్యంతరమనిపిస్తుంది. దానికి అనేక కారణాలు చెప్పగలం. కానీ మొరాకో నుండి ఇండోనేషియా దాకా డజన్ల సంఖ్యలో దేశాలను 'ముస్లిం దేశాలు' అని నిస్సంకోచంగా అనగలుగుతున్నామంటే కారణం 'ముస్లిం' అనే మాట భిన్నత్వానికీ వైవిధ్యానికీ తావు ఇవ్వని అఖండ పదార్థమన్న దురభిప్రాయమే. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ గురించి మాట్లాడదల్చుకున్న ముస్లింలు ఈ మూసలో నుంచే మాట్లాడవలసి వుంటుంది. తమ గురించి ఇతరులకుండే మూస అభిప్రాయాల పరిధిలోనే మాట్లాడవలసి వుంటుంది. అందుకు భిన్నంగా మాట్లాడినా ఆ మూసలోనే వారి మాటలను ప్రపంచం అర్థం చేసుకుంటోంది. 'నువ్వు బిన్ లాడెన్ పక్షమా, లేకపోతే అమెరికా నిర్వచించే లౌకిక వాదం పక్షమా? అని ప్రపంచం వారిని నిలదీస్తుంది.

'ముస్లిం తీవ్రవాదం' అన్న ప్రయోగం కూడా ఇటువంటిదే. బల ప్రయోగంతో ప్రపంచంలో ఇస్లాంను వ్యాపింప చేయాలన్న సంకల్పంతో ఆయుధాలు పట్టుకున్న గుంపులకు ఈ పేరు పెట్టడంలో అర్థం వుంది. కానీ పాలస్తీనా నుండి కాశ్మీర్ దాకా, కాశ్మీర్ నుండి చెచెన్యా దాకా 'ముస్లిం తీవ్రవాదులు' అని పిలవబడుతున్న సాయుధ బృందాలలో కొన్ని మాత్రమే ఈ కోవకు చెందినవి. 50 ఏళ్ళ పాలస్తీనా పోరాటంలో మతవాదం కంటే అరబ్బు జాతీయ

నిగాహ్

వాదానిదే పైచేయి. కాశ్మీర్‌లోనూ అంతే. వాళ్లు మతం రీత్యా ముస్లింలు కాబట్టి ప్రపంచం వారి మిలిటెన్సీకి ముస్లిం తీవ్రవాదం అని పేరు పెట్టింది. ముస్లిం అన్న మాట కనపడితే చాలు ఇవేమీ ఆలోచించనక్కర లేదని ప్రపంచం భావిస్తోంది.

దీనితో తలపడే శక్తి లేక, ఓపిక లేక భిన్నమైన ఆలోచనలు గల ముస్లిం మేధావులూ, రాజకీయ వేత్తలూ, సాధారణ పౌరులూ మౌనంగా వుండిపోయే పరిస్థితి ఏర్పడింది. మొన్నటి 17వ తేదీ ఘటనల గురించి పాతబస్తీలో భిన్నమైన అభిప్రాయాలు లేకపోలేదు. కానీ బయటికి మాట్లాడింది. 'జిహాద్-ఒ-షహాదత్' అనే పేరు గల బిన్‌లాడెన్ అభిమానుల సంస్థ ఒక్కటే. ఈ బలవంతపు మౌనం నుండి బయట పడటానికి కావలసిన బలాన్ని సాధారణ ముస్లిం ప్రజానీకానికి కల్పించడానికి సహాయపడడం ప్రజాతంత్రవాదులు ఈ రోజు చేయగల ముఖ్యమైన పనులలో ఒకటేమో?

# హింసకూ ప్రతిహింసకూ తల ఒగ్గవద్దు

'టెర్రరిస్టు చట్టాలు అమెరికాలోను ఇంగ్లండ్‌లోను కూడా వున్నాయి. ఇక్కడ వుంటే అభ్యంతరం ఎందుకు?' అని హోంమంత్రి అద్వానీ, ఆయనతో ఏకీభవించే వారు అంటున్నారు. దీనికి చాలా జవాబులు చెప్పవచ్చు.

అమెరికాలోను, ఇంగ్లాండ్‌లోను ఉన్న ఆ చట్టాలను అక్కడ ఎవ్వరూ వ్యతిరేకించడం లేదని మన హోం మంత్రిగారు ఎందుకు అనుకుంటున్నారు? న్యాయబద్ధమైన నేర విచారణ పద్ధతికి భిన్నంగా నడిచే నేర నిర్ధారణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించకూడదని హక్కుల సంఘాలు అంతర్జాతీయంగా విశ్వసిస్తాయి. హక్కుల సంఘాలే కాక ప్రజాస్వామిక వాదులందరూ విశ్వసిస్తారు.

సెప్టెంబర్ 11 తర్వాత అమెరికా పాలకులు పౌరహక్కుల పైన పెద్దఎత్తున ఆంక్షలు పెట్టాలని చేస్తున్న ఆలోచనలను ఆ దేశంలోని ప్రజాతంత్రవాదులు నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆంక్షలు పైకి తటస్థంగా కన్పించినా ఆచరణలో విదేశీయులకు, అందులోను పశ్చిమ, దక్షిణ ఆసియావాసులకు సహజ న్యాయము, సమాన రక్షణ లేకుండా చేస్తాయని అభ్యంతరం తెలుపుతున్నారు.

రెండు, ఆ దేశాలలో టెర్రరిస్టు చట్టాలు బయటి నుండి వలస వచ్చిన వారికి వ్యతిరేకంగా పని చేస్తాయి. ముఖ్యంగా పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికాల నుండి వలస వెళ్లిన ముస్లింలను నిర్బంధానికి గురి చేస్తాయి.

అది అన్యాయమే, కానీ మన దేశంలో టెర్రరిస్టు చట్టాలు ఈ గడ్డకు చెందిన వారి స్వేచ్ఛనే కబళిస్తాయ. 'పోటో'కు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'టెర్రరిస్టు సంస్థల' జాబితాలో ఒకటి రెండు తప్ప వేరే ఏవీ విదేశీ సంస్థలు కావు. విదేశాల నుండి వలస వచ్చిన వారికి అభద్రత కల్పిస్తే కనీసం వారికి వెనక్కి వెళ్లిపోయే అవకాశమైనా వుంటుంది. ఇక్కడే తరతరాలుగా వుంటున్న వారిని అభద్రతకు గురిచేస్తే వాళ్లెక్కడికి పోగలరు?

మూడు, ఆ దేశాలలో (ముఖ్యంగా ఇంగ్లండ్‌లో) పోలీసు వ్యవస్థ కొంచెం క్రమశిక్షణ గల వ్యవస్థ. మన పోలీసులు ఒక సంఘటిత రౌడీమూక. చిత్రహింసలు పెట్టడం, సాక్ష్యాలు పుట్టించడం తప్ప వేరే నేరపరిశోధన మన వారికి తెలీదు. వారి అధికార్లు కొందరు అప్పుడప్పుడు తర్ఫీదు పేరు మీద స్కాట్లండ్ యార్డ్‌కు పోయి వస్తుంటారు గానీ దానివల్ల వారి నేర పరిశోధనా కుశలత మెరుగుపడ్డ దాఖలాలు లేవు. హింస, కల్పిత సాక్ష్యాలు ఇప్పటికీ మన పోలీసుల ప్రధానా పరిశోధన సాధనాలు.

హింసించి నేరం ఒప్పించి ఒప్పుకోలును సాక్ష్యంగా కోర్టులో పెట్టే అవకాశం, కల్పితమైన సాక్ష్యాలను ఆధారంగా చూపించి 'రుజువు చేసుకునే బాధ్యత' ముద్దాయి మీదికి నెట్టడం టెర్రరిస్టు చట్టాలు పోలీసులకు కల్పించే అధికారం కాబట్టే ఈ రకమైన నేర పరిశోధనా సంస్కృతి వున్న పోలీసుల చేతిలో అటువంటి చట్టాన్ని పెట్టొద్దంటున్నాం.

అయినా ప్రపంచ రాజ్యాలన్నీ ఏకగ్రీవంగా సహజ న్యాయసూత్రాలకు స్వస్తి చెప్పాలని నిర్ణయించుకున్నా ప్రపంచ ప్రజలు ఎందుకు ఒప్పుకోవాలి? ఆ సూత్రాలు ఒక్కరోజు పుట్టినవికావు. ఎవరో చాదస్తులు రాస్తే చట్టాలలో వచ్చి కూచున్నవి కావు. వాటి వెనుక ఒక్కొక్క అంగుళం పోరాడిన చరిత్ర వుంది. సహజ న్యాయసూత్రాలూ, నేర విచారణలో పౌరహక్కులూ మంచివే గానీ సంఘటితమైన ఆధునిక నేరాలను ఎదుర్కోవాలంటే ఆ చాదస్తపు ఆలోచనలను విడిచిపెట్టక తప్పదని కొందరు వాదిస్తున్నారు. ఎప్పుడో 19వ శతాబ్దంలో సాధారణ నేరాలను అరికట్టడం కోసం రాసుకున్న చట్టాలు అత్యంత ఆధునిక అయుధాలు, ప్రసార సాధనాలూ పట్టుకొని పనిచేసే ఈనాటి టెర్రరిస్టు గ్రూపుల నేరాలను అరికట్టడానికి పనికొస్తాయా అని చాలా గంభీరంగా మాట్లాడుతుంటారు.

తాము ఆ 'టెర్రరిస్టుల' లాగే మాట్లాడుతున్నామని వారికి తోచకపోవచ్చు.

అలాగే ప్రజలను శాంతియుతంగా సమీకరించి ధర్నాలు, సహాయ నిరాకరణ తదితర పోరాట రూపాల ద్వారా ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టిన రోజులు లేవా – ఇప్పుడీ ఎ.కె.47లు, లైట్‌మెషిన్ గన్‌లు, ఆర్‌డిఎక్స్‌లు ఎందుకని అడిగితే మనల్ని వాళ్లూ వెర్రివాళ్లుగానే చూస్తారు. ఎప్పుడో రాజ్యాలు చిన్నతరహా ఆయుధ సంపద మీద ఆధారపడ్డ రోజులలో అవి నడిచాయి గానీ ఆధునిక రాజ్యాల ఆయుధ సంపద, ప్రసార సాధనాల ముందు అవేం పని చేస్తాయని అడుగుతారు.

ఇద్దరూ ఎదుటివారి అపారమైన ఆయుధ బలాన్ని కారణంగా చూపించి తమ బలప్రయోగ సంపదను సమర్థించుకుంటారు గానీ నిజానికి ఇద్దరూ విశ్వసించేది

హింసనే అనుకోవాలి. హింస ద్వారా సాధిస్తామా లేక ప్రజాస్వామికంగా సాధిస్తామా అనే ప్రశ్నను కేవలం ఎదుటివారి బలప్రయోగ సామర్థ్యానికి సంబంధించిన విషయానికి కుదించి వేయాలని ఇరు పక్షాలూ చూస్తాయి. అందులో కొంత వాస్తవం వుంది కాని అంతకు మించి మనం ఆలోచించాలి.

బలప్రయోగానికి వేరే ఆకర్షణ కూడా వుంది. ఇది సార్వజనీనమైన ఆకర్షణ. బలప్రయోగం తనకు తానే జవాబుదారు. అది వేరే దేనికీ – మరొకరి బల ప్రయోగానికి తప్ప – జవాబుదారు కాదు. సహజ న్యాయ సూత్రాలను పాటించే న్యాయవ్యవస్థ విజ్ఞతకు జవాబుదారు. విజ్ఞత ముందు పాలకుల ఇష్టాయిష్టాలు ఓడిపోవచ్చు. సంవాదాన్నీ చర్చలనూ నమ్ముకునే పాలనా వ్యవస్థ తర్కానికీ, సత్యానికీ జవాబుదారు. సత్యం ముందు, తర్కం ముందు పాలకుల అహంభావం ఓడిపోవచ్చు. ప్రజా సమీకరణను నమ్ముకున్న తిరుగుబాటు ఆ ప్రజల అభిప్రాయాలకు జవాబుదారు. తిరుగుబాటుదార్ల ఆరాటం దాని ముందు ఓడిపోవచ్చు. అదే ఆయుధాలను నమ్ముకున్నట్టయితే వాటి వేగాన్ని అందుకుని ప్రజాభిప్రాయాన్ని వెనుకుబాటుతనం ఆనో బలహీనత అనో భ్రమ అనో కొట్టిపారేసి అది పురోగమిస్తూ వుండవచ్చు.

ఈ వాదనకు ఒక్కటే జవాబు ఉండగలదు.

పరిపాలనకు పారదర్శకమైన న్యాయబద్ధత ప్రమాణమని, పోరాటాలకు ప్రజాభిప్రాయం ప్రమాణమని మనం గట్టిగా నిలబడ్డరోజు జార్జిబుష్‌లు, ఒసామా బిన్‌లాడెన్‌లు– మధ్యలో మన అద్వానీలు– ఒకరి పేరు చెప్పి మరొకరు హింసను పెంచుకుంటూ పోలేరు. ఆ సంకల్పం మనలో లోపించింది కాబట్టే అమెరిక ఆధిపత్యానికి సెప్టెంబర్ పదకొండే జవాబని ఒకరి దగ్గర, సెప్టెంబర్ పదకొండుకు పోటోయే జవాబని ఇంకొకర దగ్గర ఒప్పేసుకుంటున్నాం.

డిసెంబర్ 9, 2001

# రాజకీయ స్వేచ్ఛ పత్రికలకు వుంటే చాలునా?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వంతో వున్న సాన్నిహిత్యం వల్ల ఉపయోగకరమయినవి ఎన్ని రాష్ట్రానికి సాధించి పెట్టాడో తెలీదు గానీ నిరర్ధకమైనవీ నష్టకరమైనవీ మాత్రం సాధించుకొస్తున్నాడు.

పీపుల్స్‌వార్‌ను 'పోటో'లోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో చేర్చడం వాటిలో ఒకటి. పోటోకు చట్టరూపం ఇవ్వడం త్వరలో సాధ్యమవుతుందో లేదో కేంద్ర ప్రభుత్వానికి తెలియక పోయినప్పటికీ చంద్రబాబు అలక తీర్చడానికి పీపుల్స్‌వార్‌ను ఆ చట్టం కింద టెర్రరిస్టు సంస్థగా ప్రకటించడానికి సిద్ధపడిందంటే ఢిల్లీపైన సైబరాబాద్ పట్టు ఎంతటిదో, ఎంత నిరర్ధకరమైనదో కూడా ఏక సమయంలో అందరికీ అర్థం అయి వుండాలి.

చంద్రబాబుకు పీపుల్స్‌వార్ కూడా శక్తి వంచన లేకుండా సహకరించిన మాట వాస్తవమేననుకోండి. ఈ మధ్య కాలంలో వారిద్దరూ కలిసి సాధించిన ఒకే ఒక ఘనకార్యం ఇదనుకుంటాను. పీపుల్స్‌వార్‌ను టెర్రరిస్టు సంస్థల జాబితాలో ఎందుకు చేర్చలేదని చంద్రబాబు అలక ప్రకటించగా, ఎట్లా చేర్చకుండా వుంటారో చూస్తామన్నట్టు పీపుల్స్‌వార్ దళాలు రాష్ట్రంలో వరసబెట్టి వీటినీ వాటినీ పేల్చి తమ పంతం నెగ్గించుకున్నారు.

ప్రజాస్వామ్య అవకాశాలను వీలైనంత వరకు కాపాడుకోవాలన్న స్పృహ ఆ పార్టీకి ఎన్నడూ లేదు. అవి ఎంత తొందరగా అదృశ్యమయితే అంత మంచిదనుకుంటారన్న అనుమానానికి కూడా వారి నడవడిక ఆస్కారం కలిగిస్తుంది.

ఇది వారి సమస్య మాత్రమే అయితే వారి ఇష్టమని వదిలేయొచ్చు. కానీ పీపుల్స్‌వార్ చాలా ప్రభావం వున్న రాజకీయ పార్టీ. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో అన్ని రాజకీయ

పక్షాలలోనికీ ప్రభావం రీత్యా అత్యంత బలమైనది. అయితే ఆ ప్రభావంలో వున్న వారందరూ సాయుధులయి రాజ్యాన్ని కూలదోయడానికి సిద్ధంగా వున్నారనుకుంటే పొరబాటు. ఎక్కువ మందిని ప్రభవితం చేసేది ఆ పార్టీ సామాజిక అజెండాయే తప్ప దాని రాజకీయ అజెండా కాదు.

ఆ ప్రజల మీద పీపుల్స్‌వార్‌ను పోటోలోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో చేర్చడం చాలా తీవ్ర దుష్ప్రభావాన్ని వేస్తుంది. టెర్రరిస్టు సంస్థలో సభ్యులుగా వున్నా, వున్నట్టు చెప్పుకున్నా, దానికి మద్దతు ఆహ్వానించినా, దానికి సంబంధించిన ఏదైనా సమావేశాన్ని ఏర్పాటు చేసినా, ఏర్పాటు చేయడానికి సహకరించినా (ఇక్కడ సమావేశం అంటే బహిరంగ సభే కాదు, ఇద్దరు కలిసి మాట్లాడుకునే సమావేశానికి కూడా ఇది వర్తిస్తుంది), వారికి సహకారం అందియ్యమని ప్రజలను ప్రోత్సహించే సభలో పాల్గొన్నా పది సంవత్సరాలు జైలుకు పోవచ్చు.

ఇది ఏ సందర్భంలోనైనా చాలా అస్పష్టమైన మాటలు. అయితే పీపుల్స్‌వార్ వంటి ఒక రాజకీయ సంస్థ విషయంలో ఈ అస్పష్టత మరింత తీవ్ర పరిణామాలకు దారి తీయగలదు. పీపుల్స్‌వార్ నిర్మాణంలో భాగం కానివారు, ఆ పార్టీ పద్ధతులనూ రాజకీయ అవగాహననూ ఆమోదించని వారు కూడా ఆ పార్టీ సామాజిక లక్ష్యాలతో ఏకీభవించవచ్చు. ఏకీభవించిన మేరకు వారిరువురి కార్యకలాపాలలో సాన్నిహిత్యం వుండవచ్చు. ఒకే ప్రాంతంలో ఒకే రకమైన లక్ష్యం కోసం పనిచేసే వారి మార్గాలు ఒకసారి కాకపోతే ఒకసారి ఒకదానినొకటి తాకకుండా వుండవు. స్వతంత్రంగా తమకంటూ కార్యరంగం లేని వారు పీపుల్స్‌వార్ తోడ్పాటు వున్న సంస్థల సహాయం, వ్యక్తుల సహకారం తీసుకోవచ్చు. హింస అంటే ఏ మాత్రం ఇష్టం లేని వారు కూడా ఈ రకంగా పీపుల్స్‌వార్ కార్యకలాపాలకు తోడ్పాటు ఇస్తున్నారనీ మద్దతు ఇస్తున్నారనీ సహకరిస్తున్నారనీ నింద వేయించుకునే పరిస్థితి రావచ్చు. రాకూడదంటే – పది సంవత్సరాలు జైలుకు పోకూడదంటే వారు మొత్తంగా తమ కార్యకలాపాలకు గుడ్‌బై చెప్పి చేతులు కట్టుకుని కూర్చోవాలి.

విచిత్రమైన విషయం ఏమిటంటే రాజకీయ ఉద్యమాలు హింసాత్మక రూపం తీసుకుంటున్నాయని చెప్పి ఈ రకమైన చట్టాలు చేస్తున్నారు. కానీ వీటి ప్రభావం ఫలితంగా హింస ఒక్కటే మిగులుతుంది. తక్కినదంతా పోతుంది.

బహుశా మన పాలకులకు అదే కావాలేమో. అధికారం తనను తాను తుపాకీగా భావించుకునే దశ వచ్చాక అది తుపాకీని మాత్రమే ప్రత్యర్థిగా ఇష్టపడుతుంది. అప్పుడు ఇబ్బందికరమైన ప్రశ్నలకు జవాబు చెప్పనక్కరలేదు. హేతుబద్ధమైన సంవాదంలో పాల్గొననక్కరలేదు. సంస్కరణాత్మక చర్యల ఊసే అక్కరలేదు.

హింస పట్లే అభ్యంతరం అంటారు. కానీ వాళ్లకు నిజానికి హింస పట్ల మాత్రమే అభ్యంతరం లేదు. ఒక స్వరం ముందు మరొక స్వరం నైతికంగా తలవంచుకోవాల్సి రావచ్చును గానీ తుపాకులకు ఆ చింత లేదు. సమస్యలనుండి, అణచివేతనుండి, అసంతృప్తి నుండి, వైమనస్యం నుండి సాయుధ రాజకీయాలు పుడుతున్నాయని గుర్తించమని అడిగితే, అవేవీ కనబడకుండ కేవలం తుపాకులు మాత్రం కన్పించేటట్టు కట్టుదిట్టం చేస్తాం, ఇంకా ఏం చేస్తారో చెప్పండి అన మన పాలకులు అంటున్నారు.

అందుకే 'పోటో' ప్రధానంగా భావస్వేచ్ఛపైన దాడి అంటున్నాం. మన దౌర్భాగ్యం ఏమిటంటే అది పత్రికా స్వేచ్ఛ పైన దాడి అని మాత్రమే గుర్తించడానికి మన తెల్లబట్టల జాతి సిద్ధంగా వుంది. పత్రికలకు మాత్రం భావ స్వేచ్ఛ ఉంటే సరిపోతుందని ఎవ్వరూ అనరు గానీ 'పోటో' పైన జరుగుతున్న చర్చ వింటుంటే ఆ అనుమానం కలుగుతుంది.

ఒక సంస్థను టెర్రరిస్టు సంస్థ అనీ ఒక కార్యకలాపాన్ని టెర్రరిజం అనీ ప్రభుత్వం ప్రకటించినట్టయితే ఇంక ఆపైన దాని మంచి చెడుల గురించి చర్చ, దాని మూలాల గురించి వ్యాఖ్య, దాని స్వభావాన్ని గురించి నిష్పాక్షికమైన విశ్లేషణ – ఇవేవీ ఇంక సమాజంలో జరగడానికి వీలు లేదని 'పోటో' అంటుంది. ఆ నిషేధం కేవలం పత్రికల పైన కాదు, అందరి మీదా పని చేస్తుంది. ప్రభుత్వం పేర్కొన్న టెర్రరిస్టులు చచ్చినప్పుడో చంపినప్పుడో వార్తలకెక్కుతారు. కాని వారి మాటలు, వారి అభిప్రాయాలు వార్తలు కావు. వారి గురించి ప్రభుత్వం వ్యక్తం చేసే అభిప్రాయాలు మాత్రం వార్తలే. అవి చాలా ప్రముఖ వార్తలు. వాటిని బట్టి ఆ టెర్రరిస్టుల ఆకృతిని ఊహించుకొని, వాళ్ళ శవాల ఫోటోలు పత్రికలలో చూసినప్పుడు ఒక లిప్తకాలం వాళ్లు కూడా మనుషులేనని గుర్తించి, ఆ గుర్తింపుకు వాక్యరూపం ఇస్తే జైలుకు పోతామేమోనని భయపడి నోరు నొక్కుకుని సమాజం బతకాలి.

అందుకే 'పోటో' పెట్టే నిషేధం నుండి పత్రికలకు మినహాయింపు ఇవ్వాలన్న డిమాండ్ సరిపోదు. దానికి ఒప్పుకుంటే ఆ పై పోటో వచ్చినా ఫర్వాలేదన్న వైఖరి గుడ్డిది. అయినా, పత్రికా యజమానుల అండదండలు లేకుండా రాజకీయాలు చేయజాలని చంద్రబాబుకు ఆ ఒక్క సవరణయినా అవసరమనిపించవచ్చును గానీ భజరంగదళ్ వీరుల అండదండలున్న సంఘ్ పరివార్ రాజకీయాలకు పత్రికలతో ఏం పని? సత్యాన్ని నిర్దేశించడానికి 'పాంచజన్యం' వుంది. శాసించడానికి త్రిశూలం మూకలున్నాయి. చంద్రబాబు పత్రికలకిచ్చే హామీని వారెందుకు ఖాతరు చేస్తారు? చేస్తే మాత్రం ప్రజలు ఆ మినహాయింపులోనే తమ రాజకీయస్వేచ్ఛను చూసుకుంటూ బతకడానికి ఎందుకు ఒప్పుకోవాలి?

డిసెంబర్ 23, 2001

# యుద్ధమంటే మనకెంత ఇష్టం

చచ్చేది మనం కాకుంటే యుద్ధమంటే మనకెంత ఇష్టమో!

వేరేవాళ్ల చావులు టీవీ స్క్రీన్‌పైన చూసి దేశభక్తితో ఊగిపోయే అవకాశం కూడ టెక్నాలజీ పుణ్యాన ఇప్పుడొచ్చింది కదా. కాబట్టి యుద్ధమంటే మనకు మరింత ఇష్టం.

పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించమని ఒకడంటే, పరోక్ష యుద్ధం చేయమని సలహా ఇచ్చేవాడు ఇంకొకడు. పరోక్ష యుద్దం చేయాలంటే మన పురమాయింపు మీద పాకిస్తాన్ రాజ్యంపైన యుద్ధం చేసే పాకిస్తానీలు మనకు దొరకాలి. అటువంటి వాళ్లెవరైనా వున్నారా అన్న సందేహం కూడా ఎవరికీ రావడం లేదు. పరోక్ష యుద్దం చేసేద్దాం అంటున్నారు.

షబానా అజ్మీ మాజీ ఇమాం బుఖారీతో అన్నట్టు, అంత ఇష్టంగా వుంటే నువ్వే పోయి యుద్ధం చేయరాదా అని ఈ యుద్ధోత్సాహులతో అనవలసి వుంటుంది.

ప్రజలు ఇట్లాగుంటే అద్వానీ ముఖం సంతోషంతో ఎందుకు వెలిగిపోదు? ఆ ఖాకీ యోధుని ముఖం గత మూడు నెలలుగా చిరునవ్వు చిందని క్షణం లేదు. సెప్టెంబర్ 11 నుండి ఆయన భలే ఆనందంగా వున్నాడు. 'ప్రతీకారం' అంతర్జాతీయ చట్టంలో ఆమోదనీయమేనని అమెరికా రుజువు చేసింది అని ఆనాడే ఆయన ప్రకటించాడు. ముస్లింలను ద్వేషించడం అనాగరికం కాదని కూడా అమెరికా, ఇంగ్లండ్‌లు రుజువు చేసాయి. దేశ విభజనకు ముస్లింల పైన ప్రతీకారం తీర్చుకోవాలని ఖాకీనిక్కర్ తొలుత తొడుక్కున్న నాటి నుండి ఉవ్విళ్లూరుతున్న ఆ యోధుడికి అంతకంటే ఆనందం కలిగించే విషయం ఏముంటుంది?

స్వతంత్ర భారతదేశపు మొదటి యుద్ధ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ ఆయనకు తోడయ్యాడు. ఫెర్నాండెజ్ ఒకప్పుడు వామపక్షవాది. ఇప్పుడీయనలో వామపక్ష భావాలేవీ

మిగిలినట్టు లేవు గానీ, వామపక్ష వాదులకు సహజమైన అధికార మోహం ఆయనలో మెండుగా వుంది. లెఫ్టిస్టులు ప్రతిపక్షంలో వుంటే ఎంత మంచివాళ్లో అధికారంలోకి వస్తే అంత ప్రమాదకారులు. వాళ్ళకు బల ప్రయోగంపైన వున్నంత నమ్మకం వేరే దేని మీదా వుండదు. అందుకే స్వతంత్ర భారత దేశపు మొదటి సోషలిస్టు రక్షణ మంత్రి మొదటి యుద్ధ మంత్రి అయ్యారు.

ఇద్దరూ కలిసి ఇప్పుడు యుద్ధం ఏ క్షణం మొదలు పెడదామా అని ఆత్రుతతో వున్నారు. మోకాళ్లే కాకుండా కళ్లు కూడా సరిగ్గా పనిచేస్తున్నట్టు లేని ప్రధాన మంత్రి ఏ క్షణం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆ క్షణం యుద్ధం మొదలుపెట్టడానికి సిద్ధంగా వున్నారు. తెల్లబట్టల ఇండియా వాళ్లకు వెన్నుదన్నుగా వుంది. వేరే వాళ్లు మూల్యం చెల్లించే దేశభక్తి కంటే పసందయినది ఏముంటుంది?

"అయితే ఎంత కాలం చూస్తూ ఊరుకోవాలి?" అని ఆవేశపడబోతారు. పాకిస్తాన్ పనిగట్టుకొని ఇండియాను బలహీనపర్చడం కోసం విధ్వంసానికి పాల్పడుతున్నదనీ ఇప్పటికే చాలా సహించామనీ ఇంక సహించకూడదనీ మన దేశంలో చాలామంది అభిప్రాయం.

పాకిస్తాన్‌కు అటువంటి దురుద్దేశ్యం లేనే లేదని సర్టిఫికేట్ ఇయ్యనవసరం లేదు గానీ ఇక్కడ కొన్ని విషయాలు చెప్పుకోవడం అవసరం. పాకిస్తాన్ దురుద్దేశ్యాన్ని గురించి మనకున్న అభిప్రాయానికి మూలం మన పోలీసులూ ఇంటెలిజెన్స్ యంత్రాంగమూ ఐఎస్ఐ గురించి తరచూ విడుదల చేస్తున్న ప్రకటనలు. అవి అన్నీ అబద్ధాలు కాక పోవచ్చు. అయితే మనం గానీ పాకిస్తాన్ దినపత్రికలు చదివినట్టయితే ఆ దేశ 'ఇంటెలిజెన్స్ వర్గాలు' అంతే తరచుగా మన రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ ('రా' అంటారు) మీద అభాండాలు వేస్తుంటాయని తెలుస్తుంది. కరాచీలో మొహాజిర్‌ల సాయుధ చర్యల వెనుక, పాకిస్తాన్‌లో భిన్న జాతులు, మతశాఖల మధ్య జరుగుతున్న హింసాత్మక పోరువెనక 'రా' హస్తం వుందనే అభిప్రాయం పాకిస్తానీ పత్రికలలో నిత్యం వ్యక్తం అవుతుంటుంది. మనం ఐఎస్ఐ దుర్మార్గాన్ని విశ్వసించినంత ప్రగాఢంగా పాకిస్తానీలు 'రా' దుర్మార్గాన్ని విశ్వసిస్తారు. పాకిస్తాన్‌ను ఒకసారి సగానికి తెగనరికిన భారత్, ఆ దేశాన్ని ఇప్పుడు పూర్తిగా విచ్ఛిన్నం చేసే లక్ష్యాన్ని పెట్టుకుందని నమ్ముతారు. ఐఎస్ఐ మీద మనకున్న అనుమానంలాగే 'రా' మీద వాళ్లకున్న అనుమానం కూడా పూర్తిగా అవాస్తవం కాకపోవచ్చు. అయితే అటువంటి అనుమానం ఆధారంగా వాళ్లు మన మీద యుద్ధానికొస్తామంటే మనం ఏమనుకుంటాం?

పాకిస్తాన్ ప్రభుత్వం స్వయంగా డిసెంబర్ 13 నాటి దాడికి పాల్పడి వుండకపోవచ్చును గానీ జైష్-ఇ-మహ్మద్ పాల్పడింది కదా, ఆ సంస్థకు కేంద్రం

పాకిస్తానే కదా, ఆ సంస్థను అదుపు చేయలేని పాకిస్తాన్‌ను మనమెందుకు క్షమించాలి? అనబోతారు.

ఇజ్రాయిల్ ఈ మధ్య అరాఫత్ విషయంలో అనుసరిస్తున్న వైఖరికీ దీనికీ చాలా పోలిక వుందని గమనించాలి. హమాస్‌ను అరాఫత్ అదుపు చేయలేక పోతున్నాడు కాబట్టి, హమాస్ పాలస్తీనా భూభాగాన్ని స్థావరం చేసుకొని ఇజ్రాయిల్‌పైన దాడులకు పాల్పడుతున్నది కాబట్టి, అరాఫత్‌కు 'బుద్ధి' చెప్పాలని ఇజ్రాయిల్ నిర్ణయించుకొని అతని నివాసం మీద దాడులు చేస్తున్నది.

ఇజ్రాయిల్ చేసిన ఈ దాడులు అందరికీ మితిమీరిన అహంభావ ప్రదర్శనగా కనిపించాయి. మనం జైష్-ఇ-మహ్మద్‌ను అదుపు చేయలేక పోయినందుకు పాకిస్తాన్ పైన యుద్ధానికి పోవడం అంత కంటే భిన్నమైన చర్య కాదు. ముషారాఫ్‌లో వేరే ఎన్ని లోపాలయినా వుండవచ్చునుగాక, అతను లష్కర్-ఇ-తోయిబా, జైష్-ఇ-మహ్మద్ వంటి సాయుధ మతవాద సంస్థలను అదుపు చేయడానికి కొంత ప్రయత్నం చేస్తున్నమాట వాస్తవం. ఇండియా కోసం కాదు, పాకిస్తాన్ కోసం చేస్తున్నాడు (ఇండియా కోసమే అయితే చేసేవాడు కాదేమో). అయితే పాకిస్తాన్‌లోని సాయుధ గుంపులపైన పాకిస్తాన్ ప్రభుత్వం అదుపు కోల్పోయి చాలా కాలం అయింది. అందులో కాశ్మీర్ పోరాటంలో పాల్గొనే లష్కర్, జైష్ వంటి సంస్థలేకాక పాకిస్తాన్ సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్న సున్నీ, షియా మత శాఖల సాయుధ బృందాలున్నాయి. సింధీ, మొహజిర్, బలూచీ, పఖ్తూన్ జాతులను ప్రాతిపదిక చేసుకున్న సాయుధ సంస్థలున్నాయి. ఏ రాజకీయాలూ లేని వట్టి మాఫియా మూకలు వున్నాయి. ఇవన్నీ ఎక్కడికక్కడ సమాంతర రాజ్యాలు ఏర్పాటు చేసుకొని పాకిస్తాన్‌ను ఏలుతున్నాయ నడంలో అతిశయోక్తి లేదు. తాను ఆ దేశానికి అధ్యక్షుడయిన తర్వాత వీరిని అదుపు చేయడానికి ముషారఫ్ కొన్ని ప్రయత్నాలు చేసాడు గానీ అవేవీ సాగలేదు. పైకి నియంతృత్వ రాజ్యంగా కనబడే పాకిస్తాన్ పాలనా వ్యవస్థకు నిజానికి ఆ దేశంలోని సాయుధ 'పౌరసమాజాల'ను పూర్తిగా అదుపుచేసే సత్తాలేదు. డిసెంబర్ 13 నాటి ఘటన మనల్ని ఎంతగా నిశ్చేష్టులను చేసిందో అంతగా ముషార్రఫ్‌ను కూడా గాభరా పెట్టి వుంటుంది.

పాకిస్తాన్‌లో పౌర సమాజం ఈ స్థితికి దిగజారడానికి ప్రధాన కారణం అమెరికా 1980లలో ఆఫ్ఘనిస్తాన్‌లో అనుసరించిన వ్యూహం అని వేరే చెప్పనవసరం లేదు. రష్యాను ఎదుర్కొనడానికి అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో 'జిహాదీ' గుంపులచేత మత యుద్ధం నడిపించింది. వారి తర్ఫీదుకు క్షేత్రంగా పాకిస్తాన్‌ను వాడుకునింది. తాత్కాలిక ప్రయోజనాల కోసం పాకిస్తాన్ పాలకులు ఆనాడు అమెరికాకు సహకరించారు.

ఇప్పుడు తమకూ తమ పొరుగు దేశాలకూ హానికరంగా తయారయిన ఈ భస్మాసురులను వాళ్లు భరించక తప్పడం లేదు. దానికి వాళ్లను యుద్ధంతోనో పరోక్ష యుద్ధంతోనో శిక్షించడం న్యాయమూ కాదు. దానివల్ల ఒరిగేదేమీ లేదు. నిజానికి 'ప్రాక్టికల్'గా ఆలోచించినట్టయితే, ఇప్పుడు ఇండియా పాకిస్తాన్ మీద యుద్ధానికి పోతే అక్కడి సాయుధ మతోన్మాద శక్తులే బలపడతాయి. పాకిస్తాన్ ఉనికిని వారు మాత్రమే కాపాడగలరని సగటు పాకిస్తానీలు సహితం భావించే ప్రమాదం వుంది. అప్పుడు ప్రస్తుతం ఇరుదేశాల సమాజాలకూ ఒక బెడదగా వున్న జైష్, లష్కర్ వంటి సంస్థలు ముషార్రఫ్ స్థానంలో అందలం ఎక్కవచ్చు. అది మనకూ మంచిది కాదు, పాకిస్తాన్‌కూ మంచిది కాదు.

నిజానికి జైష్-ఇ-మహ్మద్ గానీ లష్కర్-ఇ-తోయిబా గానీ పార్లమెంట్ మీద దాడి చేయగల సంస్థలే గానీ నిజంగా చేసింది వారేననడానికి మన ప్రభుత్వం దగ్గర ఏపాటి ఆధారం వుందో తెలీదు. డిసెంబర్ 13 సందర్భంగా అరెస్టయిన వారిలో ఒక్కరూ పాకిస్తానీ కాదు. అందరూ భారత్‌లోని కాశ్మీర్‌కు చెందిన వారే. వాళ్లొక వేళ జైష్-ఇ-మహ్మద్ సభ్యులయినా దానికి పాకిస్తాన్‌ను తప్పుపట్టలేము. చనిపోయిన వాళ్లు ఎవరైనదీ ఇది రాసేనాటికి స్పష్టంగా తెలీదు. అన్ని వివరాలూ తెలిసిన తర్వాత వారి చర్యకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాకిస్తాన్ సహాయం వుందని తెలిసినట్టయితే ఆ సమాచారం ఆధారంగా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేయడమొక్కటే అంతర్జాతీయ చట్టంలో ఇండియా చేయదగ్గ పని. ఉడుకు రక్తపు మనుషులకు అది సంతృప్తినివ్వకపోవచ్చు. కానీ మన దేశం లోపలున్న ఏదో ఒక గుంపు ఈ పని చేసి వుంటే ఏం చేద్దుము? ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలని ఎవరూ అని వుందరు కదా? చట్టం ప్రకారం విచారించి శిక్షించాలనే అందురు కదా? అది ఫలితాన్ని ఇచ్చినా ఇయ్యకున్నా అదే సరైన మార్గమని అందరూ ఒప్పుకుందురు కదా? మరి పాకిస్తాన్ దగ్గరి కొచ్చేసరికి అంతర్జాతీయ చట్టం పనికి రానిదిగానో ప్రతీకారమే సరయిన జవాబుగానో ఎందుకనిపిస్తుంది?

# ఇంకొక్కసారి అదే గోడు

రాజ్యం పూనుకోకపోతే ఏ నేరస్తుడినీ చట్టబద్ధంగా శిక్షించడం సాధ్యం కాదు. కాబట్టి రాజ్యం అనుమతితో హత్యలు చేసేవారు బహిరంగంగా ఖూనీలు చేసి చేతులు దులుపుకుని పోగలరు.

హన్మకొండ పోలీస్‌స్టేషన్ పైన పీపుల్స్‌వార్ దాడి చేసిన తర్వాత పోలీసులు నలుగురు యువకులను చంపిన వైనం అందరికీ స్పష్టమైంది. ఎక్కడ, ఎప్పుడు, ఏ విధంగా వారిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నదీ వారి కుటుంబ సభ్యులేకాక ఇతరులు కూడా చెప్పారు. రహస్యంగా ఏ విలేకరి చెవిలోనో చెప్పలేదు. బహిరంగంగా టివి కెమెరాల ముందు చెప్పారు.

అయితేనేం? హంతకులు పోలీస్ డ్యూటీలో కొనసాగుతున్నారు. కొంచెం సద్దుమణిగిన తర్వాత ప్రమోషన్లు కూడా పొందవచ్చు. సమాజం నిస్సహాయంగా చూస్తూ వుండడం తప్ప ఏమీ చేయలేదు. ఇది ఎంత కాలం సాగుతుంది? అందరికీ హంతకులని తెలిసిన వారిని చట్టాన్ని కాపాడే పోలీసులుగా ఎన్ని రోజులు ఆదరిస్తారు? ఆదరిస్తూ మన సమాజాన్ని ఒక నాగరిక సమాజంగా ఎన్ని రోజులు భావించగలరు?

పైగా హన్మకొండ సిఐ గులాం సందానీ ఈ హత్య చెప్పి చేసాడు. అతని పోలీస్‌స్టేషన్‌కు ప్రతి ఆదివారం 50 మందికి పైగా యువకులను కొన్ని నెలలుగా సంతకానికి రప్పించుకుంటున్నాడు. వారిని వారం వారం హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో 'హాజరు' కమ్మని ఏ కోర్టూ ఆదేశించలేదు. కోర్టుకు తప్ప వేరే ఎవ్వరికీ అటువంటి అధికారం లేదు.

తన స్టేషన్‌కు రప్పించుకుంటున్న యువకులతో ఈ ఇన్‌స్పెక్టర్ ఒక మాట తరచుగా అంటున్నాడు. "పీపుల్స్‌వార్ నన్ను వదిలిపెట్టరని నాకు తెలుసును–కానీ నాకేమైనా అయితే మీలో నలుగురు చస్తారు" అంటున్నాడు. ఇప్పుడతనికేమీ కాలేదు గానీ ఆ యువకులలో ముగ్గురు, మరొక హృద్రోగి చనిపోయారు. ముందే ప్రకటించినట్టు



నిగాహ్

నలుగురిని చంపి, నవ్వుతూ ప్రభుత్వ అధికారిగా అతను చలామణి అవుతున్నాడు. అతను చట్టాన్ని కాపాడే అధికారేనన్న ప్రహసనంలో సమాజం యావత్తు భాగమైంది.

నలుగురు పోగా ఇంకా చాలామంది మిగిలి వున్నారు. వారిని ఇక పోలీస్‌స్టేషన్‌కు రావద్దని హన్మకొండ సిఐ చెప్పినట్టు ఎవరూ వినలేదు. ఆ యువకులు మెడచుట్టూ ఉరితాడు తగిలించుకొని ఎన్నాళ్లు బతుకుతారు? బతికినన్నాళ్లు అట్లాగే బతకక తప్పదని వాళ్లకు తెలుసు. వాళ్ల మెడలకు ఉరితాడు బిగుస్తుందన్న తటపటాయింపు పీపుల్స్‌వార్‌ను ఆపదు. పాత గాయాలకూ మొన్న తగిలిన కొత్త గాయానికీ ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నాన్ని ఆ పార్టీ విరమించుకోదు. చరిత్ర గమనంలో నాలుగైదు ప్రాణాలు పెద్ద లెక్కకాదు.

నలుగురిని చంపినాకైనా హన్మకొండ సిఐ మిగిలిన వారిని కనికరించి విడిచిపెడతాడా అంటే అది కూడా జరిగే పని కాదు. అతను కూడా ఒక చరిత్రాత్మక కర్తవ్యాన్ని భుజాన మోస్తున్నాననే అనుకుంటాడు. దాని ముందు కూడా నాలుగైదు ప్రాణాలొక లెక్కకాదు. కాకపోగా అటువంటి ప్రాణాలు ఎన్ని పోతే అంతగా ఆ చరిత్రాత్మక కర్తవ్యం నెరవేరుతుంది.

కాబట్టి వాళ్లంతా ఉరితాడు మెడకు తగిలించుకొని తిరుగుతూ వుండవలసిందే. అదృష్టవంతులు–ఆ అవకాశం ఉన్నవారు–హైదరాబాద్‌కు తరలిపోవచ్చు. అది కూడా తెల్లబట్టల వర్గానికిచ్చిన రక్షణ ఆ హోదా లేని వారికియ్యక పోవచ్చు. 'నువ్వు హైదరాబాద్‌లో వుంటున్నావని నాకేం నమ్మకం!? నువ్వు దళంలో చేరలేదని నేనెందుకు నమ్మాలి?' అని హన్మకొండ సిఐ మళ్లీ కలిసినప్పుడనగలడు. ఆపైన ఆ ప్రశ్న అడిగినంతసేపు ఆ దౌర్భాగ్యుడు బతికి వుండడు.

'పీపుల్స్‌వార్‌కూ ప్రభుత్వానికీ మధ్య చర్చలు' అనేది దాదాపు వెక్కిరింతగా, వేళాకోళంగా మాట్లాడుకునే విషయమయింది. ఒక రకంగా ఈ 'మూడ్'ను అర్థం చేసుకోవచ్చు. విలేకరులో, పౌర స్పందన వేదిక పెద్దలో నిలదీసినప్పుడు తప్ప వేరే ఎప్పుడూ వారిద్దరూ చర్చల గురించి మాట్లాడడం లేదు. స్వంత చొరవతో ప్రభుత్వం గానీ, 'అన్నలు' గానీ చర్చల దిశగా ఎటువంటి ప్రయత్నమూ కనీసం ఒక ప్రతిపాదన–చేసిన దాఖలాలు లేవు. ఇష్టంలేని వాళ్లను 'మాట్లాడుకోండి! మాట్లాడుకోండి!' అని వెంట పడడం అపహాస్యంగా అనిపించడం సహజం.

అయినప్పటికీ పైన పేర్కొన్న దౌర్భాగ్యుల కళ్లతో ప్రపంచాన్ని చూడగలిగితే ఈ ఘోష అంతగా వెక్కిరించవలసిందిగా కన్పించదు. వారి కళ్లతో ప్రపంచాన్ని చూసే అవకాశం ఎక్కువ మందికి లేకపోగా ఆ అవకాశం వున్న వాళ్ళలో చాలామందికి

అంత కంటె గొప్ప చారిత్రక కర్తవ్యాలున్న కారణంగా 'చర్చల' చర్చ అర్థరహితమైన ప్రేలాపనగానే మిగిలిపోయే ప్రమాదం వుంది.

చర్చించుకోవడానికి ఒప్పుకున్నా ఏం చర్చించుకుంటారు? అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తున్నారు. కాశ్మీర్, నాగా ఉద్యమకారులు స్వాతంత్ర్యం కాకపోతే, స్వయం ప్రతిపత్తి ఇస్తారా అనిగానీ, ఒకేసారి స్వాతంత్ర్యం కాకపోతే అంచెలంచెలుగా ఇస్తారా అనిగానీ మాట్లాడగలరు. కానీ విప్లవకారులు రాజ్యంతో ఏం మాట్లాడగలరు? కొంచెం విప్లవం ఇస్తారా అని బేరం పెట్టలేరు కదా! ప్రభుత్వం కూడా ఒక ప్రాంతానికి పాక్షికంగానైనా స్వయం ప్రతిపత్తి ఇస్తానని ఒప్పుకోగలదేమో గానీ సమాజంపైన తన సార్వభౌమత్వాన్ని వదులుకుంటానని గానీ సడలించుకుంటానని గానీ అనలేదు కదా!

కావచ్చు. అయినప్పటికీ ఇరుపక్షాలు తమ పునాదిని వదులుకోకుండా కూడ మాట్లాడుకోగలిగిన విషయాలున్నాయి. ఇద్దరూ కూడా విచ్చలవిడి ప్రతీకార చర్యలు మానుకోవాలని ఒప్పందానికి రాగలిగితే ప్రజలు చాలా తేలికగా ఊపిరి పీల్చుకోగలుగుతారు. కేవలం అధికార యంత్రాంగానికి దగ్గరగా వున్నందుకు నక్సలైట్లు, నక్సలైట్ రాజకీయాలను అభిమానించినందుకు ప్రభుత్వము ఎవ్వరినీ హింసకు గురి చేయకూడదన్న ఒప్పందానికి ఇద్దరూ రాగలిగితే మరీ మంచిది. తమతో మౌలికంగా విభేదించే రాజకీయ స్వేచ్ఛను-కేవలం అభిప్రాయ స్వేచ్ఛను కాదు, ఆచరణ స్వేచ్ఛను కూడా గౌరవించాలని ఇద్దరూ ఒప్పుకోగలిగితే ఇంకా మంచిది.

"ఇద్దరినీ ఒకే గాటన కడుతున్నావు" అంటూ-ఇద్దరూ ఆవేశపడగలరు. ఎవరిని కట్టవలసిన గాటకే వారిని కట్టినప్పటికీ ఈ ప్రశ్నలు అడగక తప్పదు, ఈ విషయాలు చెప్పక తప్పదు. ఎంతగా బాధ్యత తెలియకుండ ప్రవర్తించే అలవాటున్నా సరే, సమసమాజం కోసం కృషి చేసే వారు పెట్టుబడిని ఆరాధించే చంద్రబాబు కంటె గౌరవనీయులే. అయినప్పటికీ 'ఇద్దరి మధ్యా ప్రజలు నలిగిపోయే' పరిస్థితి వచ్చినప్పుడు ఇద్దరి మీదా డిమాండ్లు పెట్టక తప్పదు. అవసరమైతే ఒకే రకమైన డిమాండ్లు పెట్టక తప్పదు.

జనవరి 20, 2002

# మనకేం కావాలి?

ఇంతకూ మనకు పాకిస్తాన్ నుంచి ఏం కావాలి? ఇంకా సరిగ్గా ప్రశ్నించు కోవాలంటే, మనం డిసెంబర్ 13 నుండి ఏం పొందాలని కోరుకుంటున్నాం?

భారత భూభాగం మీద టెర్రరిజం శాశ్వతంగా అంతం కావాలని కోరుకుం టున్నామా? అద్వానీ, ఫెర్నాండెజ్, వాజ్‌పేయిలు ఆ మాటే అంటున్నారు.

బుష్ కూడా సెప్టెంబర్ 11 తర్వాత అదే అన్నాడు. టెర్రరిజాన్ని అంతర్జాతీయంగా మట్టుబెట్టడానికే ఆఫ్ఘనిస్తాన్ పైన యుద్ధం చేస్తున్నానన్నాడు. మూడువేల మంది సాధారణ ఆఫ్ఘాన్ పౌరులను చంపాడు. (ఇది నిజాయితీ గల పాశ్చాత్య జర్నలిస్టుల అంచనా) కానీ చివరికి అంతర్జాతీయ టెర్రరిజాన్ని అంతిమంగా అంతం చేయడం సంగతి అటుంచి, దాని ప్రధాన ప్రతినిధి అని పిలువబడ్డ ఒసామా బిన్ లాడెన్‌ను, అతని సంరక్షకుడైన ముల్లా ఒమర్‌ను పట్టుకోకుండానే ఆఫ్ఘానిస్తాన్ నుండి వెళ్ళిపోవడానికి సిద్ధమవుతున్నాడు. వాళ్లను పట్టుకోకపోయినా ఒకటి మాత్రం సాధించాడు. కాబూల్‌లో తనకు వ్యతిరేకమైన ప్రభుత్వాన్ని తొలగించి తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని కూర్చోబెట్టి పోతున్నాడు. రెండు ప్రభుత్వాలూ ప్రజలకు భయంకరమైనవే. కానీ అమెరికాకు వ్యతిరేకమైన టెర్రరిస్టులు పోయి అమెరికాకు అనుకూలమైన టెర్రరిస్టులు వచ్చారు.

మన వాళ్ళ కోరికలలోనూ అటువంటి 'హిడెన్ అజెండా' వుందా?

ఉందని స్పష్టమవుతూనే వుంది. అదేమిటంటే కాశ్మీర్ సమస్యను పరిష్కరించేసు కోవటం! ఒక సమస్యను పరిష్కరించుకోవడానికీ పరిష్కరించేసుకోవడానికీ తేడా వుందని విజ్ఞులు గమనించగలరు. కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవడం మనకెప్పుడూ ఇష్టం లేదు. పరిష్కరించేసుకునే అవకాశం మాత్రం ఎప్పుడు లభిస్తుందా అని చాలాకాలంగా ఎదురు చూస్తున్నాం. డిసెంబర్ 13 ఆ అవకాశం ఇచ్చింది.

పార్లమెంటు పైన దాడిని నేను తక్కువ చేయడం లేదు. మన పార్లమెంట్ ప్రజలకు ఏపాటి ప్రతినిధి అనేది ఇక్కడ ముఖ్యం కాదు. అది దేశ రాజకీయ వ్యవస్థకు చిహ్నం. దానిపైన దాడి మన దేశ రాజకీయ ఆత్మ గౌరవంపైన దాడి. అది దేశ పాలకులకే కాదు, ప్రజలకు కూడ–భారత ప్రజాస్వామ్యం పనితీరు పట్ల చాలా విమర్శ వున్న వారికి కూడ–ఆగ్రహం తెప్పించడం సహజం.

అది సహజమనీ దానిని ప్రపంచం గౌరవిస్తుందనీ మన పాలకులు గుర్తించి దాని నుంచి వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలని లెక్కలు వేయడమే అసహ్యం కలిగించే విషయం.

పాకిస్తాన్ పదేళ్లుగా కాశ్మీర్ పోరాటకారులకు తుపాకులు సరఫరా చేయడం చాలా ప్రాణాలు తీసింది కావచ్చుగానీ అది కాశ్మీర్ సమస్యను రాజకీయంగా సజీవంగా వుంచింది. 'కాశ్మీర్ సమస్య' అనేదొకటి వుందని ఒప్పుకొనడానికే ఇష్టపడని సంఘ్ పరివార్ పాలకులు సహితం దానికి గుర్తింపు ఇవ్వక తప్పలేదు. ముషార్రఫ్‌ను ఆగ్రాకు పిలవక తప్పలేదు. తాము బస్సెక్కి లాహోర్‌కు పోక తప్పలేదు.

పాకిస్తాన్ తమకు ఎప్పటికీ తుపాకులు ఇస్తుండాలనీ పాకిస్తాన్‌లో తర్ఫీదు పొందిన సకల దేశాల జిహాదీలు వచ్చి తమ గడ్డ మీద చస్తుండాలనీ కాశ్మీరీలు కోరుకోవడం లేదు. కోరుకోరు. వారి బలగాలలో తమ యువకులు చేరి చస్తూ వుండాలని అసలే కోరుకోరు. కాశ్మీరీలు స్వతహాగా హింసాభిలాషులు కారు. వారి చేతులలో కలష్నికోవ్ (ఎకె 47) కంటే కవితా సంపుటి సహజమైన వస్తువు. తుపాకుల మోత మధ్య జీలం నది ఒడ్డున చెట్టపట్టాలేసుకుని తిరిగే ప్రేమికుల జంటలను చూస్తే కాశ్మీరీల నైజం బాగా అర్థం అవుతుంది.

అయినప్పటికీ తమ రాజకీయ అస్తిత్వం సజీవంగా వుండడానికి నలభై ఏళ్లుగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన చేదు జ్ఞాపకాలు వాళ్ళను వదలవు, వదలలేవు. ఆ తర్వాత పాకిస్తాన్ ఇచ్చిన ఆయుధాల వల్ల, పాకిస్తాన్ నుండి వచ్చిన జిహాదీల వల్లనే ఆ అస్తిత్వానికి గుర్తింపు వచ్చిందని వారికి తెలుసు. పాకిస్తాన్ అంటే వారికి పెద్దగా ప్రేమ లేకపోయినా ఇందువల్ల గౌరవం వుంది. అయితే తమ స్వయం నిర్ణయకాంక్షను భారత్ గౌరవించదల్చుకుంటుదన్న స్థిరమైన సూచన లభించిన క్షణం తుపాకులకూ తూటాలకూ గుడ్‌బై చెప్పి సగౌరవమైన రాజకీయ పరిష్కారం వెతుక్కోవడానికి వారు సిద్ధంగా వున్నారు.

కాగా, వాళ్లకు బయటినుండి అందుతున్న సహాయం ఏ క్షణం ఆగిపోతే ఆ క్షణం తాను వారి రాజకీయ ఆకాంక్షలకు బలవంతంగా ఇస్తున్న గుర్తింపునకు గుడ్‌బై చెప్పి

1989కి ముందు కాశ్మీర్ రాజకీయాలతో ఆటలాడుకున్నట్టు ఆడుకుంటూ కాలక్షేపం చేయాలని భారత ప్రభుత్వం ఎదురు చూస్తున్నది.

సెప్టెంబర్ 11, ఆ తర్వాత డిసెంబర్ 13తో ఈ మహదవకాశం లభించిందని భారత పాలకులు గుర్తించారు. ఈ సంగతి తొలినాడే గుర్తించినవాడు అద్వానీ. సెప్టెంబర్ 11 తర్వాత చరిత్ర ఏ మలుపులు తిరిగినా అది తన వ్యూహానికి అనుకూలంగానే వుంటుందని ఆ ఖాకీనిక్కరు యోధుడు ఆనాడే గ్రహించాడు. ఇంత గొప్ప అవకాశం చేతికందిన క్షణంలో తానే భారత హోంమంత్రిగా ఉండడం తన చిన్ననాటి ఖాకీ కలల పంటగా ఆ పెరటి యోధుడు భావించే వుంటాడు.

డిసెంబర్ 13 అటువంటి ఒక మలుపు. దానిని పూర్తి అవకాశంగా తీసుకుని అమెరికాను కొంచెం బెదిరించి, కొంచెం కాకా పట్టి, అంతర్జాతీయం చేయొద్దు చేయొద్దూ అంటున్న విషయాన్ని పనిగట్టుకొని అమెరికా కాళ్ల దగ్గర పడేసి ఆ ప్రపంచ భాగ్య విధాత చేత పాకిస్తాన్ పైన ఒత్తిడి పెట్టించి, అది చాలనప్పుడు సైడ్ హీరో బ్లెయిర్ సహాయం అర్థించి మొత్తానికి పాకిస్తాన్‌ను కాశ్మీర్ వ్యవహారాల నుండి దూరం చేస్తే ఇంక చర్చలెందుకు, సంభాషణలెందుకు, ఒప్పందాలెందుకు?

ఇదీ ఇప్పుడు నడుస్తున్న రాజకీయం. ఏ దేవుడూ సృష్టించని ఈ ప్రపంచంలో న్యాయమే గెలిచి తీరుతుందన్న భరోసా ఏమీ లేదు కాబట్టి ఈ సిగ్గూ లజ్జా లేని రాజకీయ నీతి ఫలించగలదు. కాశ్మీరీలు మరొక్కసారి ఓడిపోగలరు. కాని వారి మనసులలో ఇండియా అంటే ద్వేషం మాత్రం పెరుగుతుంది. ఇంకొక రోజు ఇంకొక రూపంలో ఈ పుండు బద్దలు కాదన్న గ్యారంటీ ఎవ్వరూ ఇవ్వలేరు. చరిత్రను బలవంతంగా తిరగరాయగలరు గానీ భవిష్యత్తునట్లా రాయలేరు కదా!

# కొందరికి పారదర్శకం కొందరికి ప్రాణాంతకం

ప్రభుత్వ జీతగాళ్లయిన పోలీసు అధికారులను అదుపు చేయడంలో ప్రభుత్వ అధినేతల నిస్సహాయత ఆశ్చర్యమూ ఆందోళనా కలిగిస్తాయి. అది నిస్సహాయత కాదు, నటన అంటారేమో.

ఒక్కొక్కసారి ఆ నిస్సహాయత నటన కావచ్చును గానీ అన్ని వేళలా కాదు. అది నటన అని గుర్తించినప్పుడు పాలకులంటే వెగటు అన్పించవచ్చును గాని పెద్దగా ఆందోళన కలగదు. అది నిజమైన నిస్సహాయతేనని గుర్తించినప్పుడే ఆందోళన కలుగుతుంది. ఎవ్వరూ అదుపుచేయలేని దుండగులు అధికారం ముద్ర వేసుకొని జనం మధ్య సంచరిస్తున్నారంటే ఆందోళన కలగడం సహజం మరి.

'నిన్ను కొట్టవద్దని నేను చెప్పానే అయినా కొట్టాడా' అని ఒక సిఐ గురించి స్వయానా రాష్ట్ర హోం శాఖ మంత్రి అనే రోజులొచ్చాయి. మెదక్ నుండి నిజామాబాద్ పోలీసులు అపహరించి తీసుకొని పోయిన 'వార్త' విలేకరి బాలేశ్‌తో దేవేంద్రగౌడ్ అన్న మాటలివి. అతను విలేకరి కాబట్టి అతన్ని పోలీసులు కొట్టకుండా ఉండాలని యజమాని, సంపాదకుడు, రాష్ట్ర జర్నలిస్టుల సంఘం ప్రముఖులు వెంటనే స్పందించారు. పోలీసు యంత్రాంగం మీద పై నుండి కింది దాకా ఒత్తిడి పెట్టారు. వాళ్ళ ఒత్తిడి ఫలితంగా "అతనిని కొట్టొద్దు" అని హోం మంత్రి తన హోదా మరచిపోయి ఒక సిఐని అడుక్కున్నాడు. అయినప్పటికీ బాలేశ్‌ను ఒళ్ళు విరగ్గొట్టిగానీ పోలీసులు కోర్టులో హాజరు పెట్టలేదు.

ఇందులో ప్రముఖ పాత్ర వహించిన అధికారి నిజామాబాద్ ఒఎస్‌డి సంజయ్‌కుమార్ జైన్. మెదక్ ఒఎస్‌డి చారుసిన్హాకు కూడా పాత్ర ఉందని స్థానిక పత్రికా ప్రపంచం అనుమానం. వీళ్ళు మూడు పదులు నిండని యువ ఐపిఎస్

అధికారులు. అంత చిన్న వయసులో ఒక జిల్లాలో ఈ మూల నుండి ఆ మూలదాకా ఎవరినైనా చంపేసి చేతులు దులుపుకొని పోవచ్చునన్న లైసెన్స్ ఉండడం చాలా ప్రమాదకరమైన విషయం. వాళ్ళకు ఆ లైసెన్స్ ఉంది. దానిని అదుపు చేయాలని ప్రభుత్వం భావించదు. నిజానికది ప్రభుత్వం ఇచ్చిన లైసెన్సే. కానీ భావించినప్పుడు కూడా అదుపు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని అర్థం అవుతున్నది.

ఖాకీ ప్రపంచంలో ఒకరి మీద మరొకరికి కడుపు మండినప్పుడు ఒకటి రెండు నిజాలు బయటికొస్తుంటాయి. 1993లో పుట్టపర్తిలో జరిగినది పోలీసులు చేసిన కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అని రిటైర్డ్ హోంశాఖ కార్యదర్శి నాయర్ ప్రకటించడం సగటు పత్రికా పాఠకులకు 'షాక్' కలిగించి ఉండవచ్చునేమో గానీ ఆనాటి ఘటన గురించి ఏ కొంచెం తెలిసిన వారికైనా ఆశ్చర్యం కలిగించదు. ఎటొచ్చీ రాజకీయ నాయకులే కాదు, న్యాయమూర్తులు సహితం మోకరిల్లే సాయిబాబా శ్రేయస్సు కోసం జరిగిన హత్యలపైన విచారణ ఎవరు జరపాలి? నాయర్ గారికి సహితం సకాలంలో రావాల్సిన పదవులు దక్కి ఉంటే ఈ అభిప్రాయం వారితో బాటే రిటైరై ఉండేది కాదా?

కొత్తూరులో ఉద్దరకు స్టీల్‌రాడ్లు ఇమ్మంటే ఇవ్వని పాపానికి ఫ్యాక్టరీ అధికారిని చావగొట్టి పోలీసులపైననే దాడి జరిగిందని తొలుత పత్రికల కెక్కించిన పోలీసులకు ఏమీ కాదని అందరికీ తెలుసు. 'వెంటనే జిల్లా ఎస్.పి. నుండి నివేదిక కోరిన' హైకోర్టు కూడా ఆ గడువు తీరేటప్పటికి ఆ విషయం మరచిపోతుంది. 'ఇవన్నీ చూస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్ ఏం చేస్తున్నది?' అని నాయర్‌గారు ఆవేశపడ్డారు. వారు సీనియర్ పోలీసు అధికారిగా ఉంటూ ఏం చేసారో అదే చేస్తున్నది. అధికార ముద్ర వేసుకొని హత్యలు చేస్తూ తిరిగే దుండగుల ముఠాలు నాగరిక సమాజం నడుమ ఉండడానికి వీలులేదన్న సంకల్పం ఎవరిలోనూ లేదు. లేకపోగా దానినొక సహజమైన విషయంగానూ బహుశా సామాజిక అవసరంగానూ భావించేవారు మీది నుండి కింది దాకా ఉన్నారు. ఒళ్లు వాయగొట్టి తమ ఎదుట పోలీసులు ప్రవేశపెట్టిన తోటి విలేకరి బాలేశ్‌ను నిజామాబాద్ విలేకరులు పోలీసుల కంటే అవమానకరంగా ఇంటరాగేట్ చేసారంట. అసలు పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తితో 'ప్రెస్ కాన్ఫరెన్స్' పెట్టడాన్ని విలేకరులు ఏనాడో వ్యతిరేకించవలసింది. కోర్టులకు పనికి రాని సాక్ష్యం పత్రికలకు పనికొస్తుందా? ఆ మనిషి పోలీసులు నేర్పించిన మాటలు తప్ప వేరే ఏదీ చెప్పజాలడని అందరికీ తెలుసును. అయినప్పటికీ ఈ 'ప్రెస్ కాన్ఫరెన్స్'లు జరుగుతూనే ఉన్నాయి. విలేకరులు హాజరవుతూనే ఉన్నారు. తనదాకా రాకముందు బాలేశ్ కూడా హాజరయ్యే ఉంటాడు.

నాయర్ ఇంటర్వ్యూనే మరొకసారి ప్రస్తావిద్దాం. కరీంనగర్ నుండి పట్టుకొచ్చి మేడ్చల్ దగ్గర -1999లో అనుకుంటాను-కాల్చి చంపిన 'బందిపోటు' దొంగల హత్యను ప్రస్తావిస్తూ ఈ రకమైన హత్యలు పోలీసులకు ఇప్పుడు పరిపాటి అన్నాడు. మళ్లీ అతనేం చేస్తున్నాడిన్ని రోజులూ అన్న ఇబ్బందికరమైన ప్రశ్న వేయకుండా ఉండగలిగితే ఒక సత్యం చెప్పినందుకు అతనిని అభినందించవచ్చును. అయినా ఎవరు ఎంతగా మొత్తుకున్నా ఈ హత్యాకాండ అప్రతిహతంగా సాగుతూనే ఉంది. అది సాగించిన అధికారుల కెరీర్‌లు వర్ధిల్లుతూనే ఉన్నాయి. కర్నూలులో ఒక డజను దాకా హత్యలు చేయించి హైకోర్టులో కనీసం అరడజను కేసులకు జవాబు చెప్పుకొని చెక్కు చెదరకుండా కెరీర్‌లో పురోగమిస్తున్న సీతారామాంజనేయులును ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎప్పుడో అతనికే వేరెవరి మీదనో కడుపు మండి డిపార్ట్‌మెంట్‌ను తిట్టిపోస్తూ ఆత్మక్షాళన చేసుకుంటే చేసుకుంటాడేమో గానీ అంతకంటే అతనికేమీ కాదు.

ప్రాణం తీయడాన్ని ఒక విశేషంగా భావించని రాజకీయ జాతి ఏలుతున్న ఈ రాష్ట్రంలో వేరే ఏదైనా మారుతుందేమో గానీ ఈ హంతక పోలీసు వ్యవస్థ మాత్రం మారదు. "పారదర్శక పాలన" గురించి ఇప్పుడందరూ మాట్లాడుతున్న మాటలకూ ఈ వ్యవస్థకూ చుక్కెదురని కూడా చాలామంది గుర్తిస్తున్నట్టు లేదు. బహుశా పారదర్శక పాలన అందే వర్గం వేరు, ప్రాణాంతక పాలన పొందే వర్గం వేరు కావడం వల్లనేమో.

ఫిబ్రవరి 24, 2002

# చావు ఖర్చులు వద్దంటున్న మడ్డువలస నిర్వాసితులు

తెలంగాణ వాసులకు శ్రీకాకుళం ఎక్కడో ఉన్నట్టు అనిపిస్తుంది. నక్సలైట్ ఉద్యమం పుణ్యాన ఆ పేరు సుపరిచితమే గానీ అంతకంటే ఆ జిల్లా గురించి ఏమీ తెలీదు. అది మన రాష్ట్రంలోనిదేనన్న అనుభూతి కూడా కలగదు.

శ్రీకాకుళం జిల్లాలోనూ హైవేకి (అంటే మద్రాస్ కలకత్తా జాతీయ రహదారికి) సమీపంలో జరిగే విషయాలకొచ్చే ప్రచారం లోతట్టు ప్రాంతాలకు రాదు. అటువంటి ఒక లోతట్టు ప్రాంతమైన వంగర మండలంలో కొంత కాలంగా ఒక ఆందోళన జరుగుతున్నది. అది మడ్డువలస ప్రాజెక్టు నిర్వాసితుల ఆందోళన.

మడ్డువలస ప్రాజెక్టు కొత్తది కాదు. కొత్తది అయి ఉంటే పునరావాసానికి సంబంధించి ఈ మధ్య అరకొరగానయినా ఉనికిలోకి వచ్చిన పునరావాస సూత్రాలు వర్తించి ఉండేవి. పునరావాస సూత్రాలే కాదు, ప్రాజెక్టుల ఆమోదానికి సంబంధించి కూడా ఇప్పుడు కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. ఆ రోజులలో-అంటే 1970లలో-ఏ ప్రాజెక్టునయినా ఆయకట్టుదార్ల అవసరాల కోణం నుండి, నిర్మాణ వ్యయం కోణం నుండి మాత్రమే చూసారు తప్ప ఆయకట్టుదార్ల కొచ్చే ప్రయోజనాన్ని ముంపు ప్రాంతాల ప్రజలు పొందే నష్టంతో బేరీజు వేసే ప్రయత్నం చేయలేదు.

ఇప్పుడు పరిస్థితి కొంచెం మారిందంటే అర్థం నిర్వాసితుల సమస్యలకు సూత్రబద్ధమైన గుర్తింపు లభించిందని కాదు. ప్రాజెక్టు భూమి సేకరణకు సంబంధించి ఇప్పటికీ 1894లో అప్పటి బ్రిటీష్ పాలకులు చేసిన భూసేకరణ చట్టం తప్ప వేరే చట్టమేదీ లేదు. కనీసం, ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం తక్కువని భావించిన రైతు కోర్టుకు అప్పీల్ చేసుకోవడంలో కొంత జాప్యం జరిగినట్టయితే ఆ జాప్యాన్ని ఉపేక్షించి అప్పీల్ స్వీకరించవచ్చునన్న ఒక్క సవరణ కూడా స్వతంత్ర భారత సంక్షేమ రాజ్యం ఆ చట్టానికి చేయలేదు. ఇక నిర్వాసితుల పునరావాసాన్ని గురించి ఆనాడు ఈనాడూ కూడా చట్టం లేదు.

అయినప్పటికీ కొన్ని విధానపరమైన జాగ్రత్తలూ, నియమాలూ ఈ మధ్య ఉనికిలోకి వచ్చాయి. ప్రాజెక్టు వల్ల రాబోయే ఆయకట్టుతో పోల్చినప్పుడు ముంపు చెప్పుకోదగ్గ మోతాదులో వున్నట్టయితే అటువంటి ప్రాజెక్టు చేపట్టనే వద్దని ఇప్పుడు భావిస్తున్నారు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఎక్కువ మందిని నిర్వాసితులను చేసే ప్రాజెక్టు కట్టినట్టయితే వారందరికీ ఏ కొంచెం పునరావాసం కల్పించాలన్నా చాలా ఖర్చవుతుంది. కాబట్టి ప్రాజెక్టు డిజైన్‌లోనే ముంపు తక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి. అది సాధ్యం కాకపోతే ఆ ప్రాజెక్టును చేపట్టనే కూడదు అని ఇప్పుడు భావిస్తున్నారు. ఆయకట్టులో 15 శాతం మించిన ముంపు ఉన్నట్టయితే అటువంటి ప్రాజెక్టు చేపట్టనే వద్దనేది ఇప్పుడు చాలావరకు ఆమోదం పొందిన విధాన నియమం.

అటువంటివేమీ లేని రోజులలో చేపట్టిన మడ్డువలస ప్రాజెక్టులో ముంపు (మనం లెక్కపెట్టేపద్ధతిని బట్టి) 30 శాతం నుండి 80 శాతం దాకా ఉంది. అధికార లెక్కల ప్రకారం మడ్డువలస ఆయకట్టు 24,700 ఎకరాలు. ముంపు 8 వేల ఎకరాలని ప్రభుత్వం, 13,500 ఎకరాలని స్థానిక రైతులు అంటున్నారు. ప్రభుత్వం లెక్కలే తీసుకున్నా, ఆయకట్టులో ముంపు 30 శాతంపైననే ఉంది. అయితే సాగు కాబోయే 24,700 ఎకరాలలో ఇప్పటికే 8 వేల ఎకరాలు బోర్లు, చెరువుల కింద సాగవుతున్న మాగాణి. అంటే కొత్తగా తయారు కాబోయే మాగాణి కేవలం 16,700 ఎకరాలు. ముంపును గురించి రైతులు చెబుతున్న లెక్క సరైనదనుకుంటే 16,700 ఎకరాలకు కొత్తగా నీళ్ళివ్వడానికి 13,500 ఎకరాలను ముంచుతున్నారు. అంటే ఆయకట్టు పరిమాణంలో ముంపు పరిమాణం 80 శాతం.

1970లలో పునాదిరాయి వేసి భూమి సేకరణ మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టును అప్పుడే కట్టేసి ఉంటే అయిందేదో అయిపోయిందనుకోక తప్పేది కాదేమో కానీ మడ్డువలస ఇప్పుడే – మొదలు పెట్టిన 25 ఏండ్ల తర్వాత ముగింపుకొచ్చింది. ఈ మధ్య కాలంలో నర్మదా బచావో ఆందోళన నడిచింది. నిర్వాసితుల హక్కుల గురించి అవగాహన పెరిగింది. ప్రపంచ బ్యాంక్ అప్పు ఇచ్చే ప్రాజెక్టుల విషయంలో పునరావాసాన్ని గురించి కొన్ని ఖచ్చితమైన ప్రమాణాలు పెట్టడం జరుగుతున్నది. ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా అటువంటి ప్రమాణాలను ప్రభుత్వం తనకు ఉండే వెసులుబాటును బట్టి అమలు చేయడానికి సిద్ధపడుతున్నది.

ఇవన్నీ చూస్తూ కూడా మడ్డువలస నిర్వాసితులు ఎందుకు ఊరుకుంటారు? మీ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి అవుతూ ఉండవచ్చును గానీ ఇది 1970ల నాటి ప్రాజెక్టు కాబట్టి అప్పటి పద్ధతిలోనే మీతో వ్యవహరిస్తామంటే ఎందుకు ఒప్పుకుంటారు?

నిర్వాసితులు కాబోయే వారు 25వేల మంది అని స్థానికుల అంచనా. ముంపు భూమి ఎన్ని ఎకరాలో ఖచ్చితంగా తెలియనట్టే ఈ సంఖ్య కూడా ఖచ్చితంగా తెలియదు. ప్రాజెక్టు డిజైన్ సమగ్రంగా తెలిసింది ప్రభుత్వానికి మాత్రమే కాబట్టి ప్రభుత్వమే చెప్పాలి, కానీ చెప్పదు. ప్రజలు తప్పనిసరయి తమ అంచనాలు రూపొందించుకుని ప్రకటిస్తున్నారుగానీ అవి సరయినవో కాదో ప్రభుత్వం చెప్పదు. అసలు నోరు విప్పదు.

మనది 'పారదర్శకత' గురించి నిత్యం మాట్లాడే ప్రభుత్వం కదూ? అది వట్టి అసత్యమని అనలేము కానీ చాలా 'సెలెక్టివ్' సత్యం. ఎప్పుడు ఎక్కడ పారదర్శకంగా ఉండాలో ఎరిగిన ప్రభుత్వం మనది. ప్రాజెక్టుల గురించి నిర్వాసితుల దగ్గర పారదర్శకంగా ఉండడం తగదని వారికి తెలుసు.

నిర్వాసితులు 25,000 కాకపోతే 20,000 అనుకోండి. ఎంతైనా అతిపెద్ద సంఖ్యే. వారందరూ భూములు, లేక స్థిరాస్తులు కలిగినవారు కారు. అంటే వారికి నష్టపరిహారం ఒక్క పైసా కూడా రాదు. స్థిరాస్తులు కలవాళ్ళలో కూడా 1970లలోనే నష్టపరిహారం తీసేసుకున్న వారు మెట్ట భూమికి ఎకరానికి 2 వేలు, మాగాణికి 6 వేలు తీసుకొని ఊరుకున్నారు. దాని మీద అప్పీల్‌కు పోవచ్చునని కూడా వారికెవరూ ఆ రోజులలో చెప్పలేదు. ప్రభుత్వం చెప్పాలనుకోలేదు. అప్పట్లో ప్రభుత్వాలు పారదర్శకత గురించి మాట్లాడలేదు కాబట్టి తప్పు పట్టలేము కాబోలు! అయితే ఆ రెండు వేలో ఆరువేలో ఇచ్చి కాగితం మీద భూమి సేకరణ 1970లలోనే చేసేసారు కానీ ప్రాజెక్టు రాలేదు కాబట్టి రైతులు అక్కడే కొనసాగారు. సేద్యమూ చేసుకున్నారు. ఇప్పుడు వెళ్ళిపోయే కాలం వచ్చేసరికి ఆనాడు తీసుకున్న రెండు లేక ఆరువేలలో ఒక్కపైసా కూడా వారి దగ్గర లేదు. "డబ్బు తీసేసుకొని, భూమి కూడా ఇరవై ఏళ్ళు ఉచితంగా అనుభవించి, ఇప్పుడు పొమ్మంటే పునరావాసం కావాలంటావా?" అని వాళ్ళను అధికారులేకాక ప్రాజెక్టు ఎప్పుడెప్పుడు పూర్తి అవుతుందా అని ఆతురతతో ఎదురు చూస్తున్న ఆయకట్టుదార్లు కూడా నిందిస్తున్నారు గానీ, వారితో కలసి లెక్కబెట్టుకుంటే ఇప్పుడు ఖాళీ చేసి పోవాల్సిన వారిలో మెజార్టీ, చేతిలో చిల్లిగవ్వ లేకుండా తరలిపోవాల్సిన వారే. కొద్దిమంది మాత్రమే ఈ మధ్యకాలంలో నష్టపరిహారం పొందిన కారణంగా 'ఒప్పందాల అవార్డు' కింద సుమారుగా డబ్బులు పొందగలిగారు. అయితే వారు కూడా తమకున్న ఆస్తిని తిరిగి ఆ పైసలతో కొనజాలరు.

అందుకే నష్టపరిహారం చాలదు, పునరావాసం కావాలి అనేది అన్ని వర్గాల నుండి వస్తున్న డిమాండ్. ఒక్క మద్దువలసలోనే కాదు, అన్ని ప్రాజెక్టులలోనూ వస్తున్న డిమాండ్. నిర్వాసితులకు ప్రాజెక్టు ఆయకట్టులోనే భూమి ఇవ్వాలనీ (ప్రాజెక్టు రావడం వల్ల సాగుయోగ్యమైన భూమి పెరిగే అవకాశం ఉంది కాబట్టి ఇది అసాధ్యం కాదు), లేదా

(వారి వారి వృత్తులను బట్టి) రిజర్వాయర్‌లో చేపల వేటపైన వారికే మొదటి హక్కు ఇవ్వాలనీ, రిజర్వాయర్ ఒడ్డున (ఫోర్‌షోర్‌లో) చెట్లు లేక వనాల పెంపకంపైన హక్కు వారికే ఇవ్వాలనీ, ఒక గ్రామానికి చెందిన నిర్వాసితులందరికీ ఒకే చోట ఇళ్ళ స్థలాలు ఇచ్చి రోడ్లు, లైట్లు, స్కూలు, గ్రామ పంచాయితీ ఆఫీసు మొదలైన అన్ని వసతులతోనూ పునరావాస గ్రామాలు నిర్మించాలనీ నిర్వాసితుల ఉద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నాయి. మద్దువలస నిర్వాసితులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

వారు రెండు ప్రత్యక్షమైన ఉదాహరణలు చూపిస్తున్నారు. అవి రెండూ కూడా మద్దువలస లాగే మధ్యతరహా ప్రాజెక్టులు. ప్రపంచ బ్యాంక్ నిధులతో కాక దేశీయ నిధులతో కడుతున్న ప్రాజెక్టులు. ఒకటి పొరుగున వున్న విశాఖపట్నం జిల్లా మాడుగుల మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు కాగా రెండవది దూరాన ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు. పెద్దేరులో నిర్వాసితుల సంఖ్య 188 మాత్రమే. వారి పునరావాసానికి ప్రభుత్వం తలసరి ఒక లక్షా 72 వేలు మంజూరు చేసింది. వట్టివాగు నిర్వాసితులు 645 మంది. వారి పునరావాసానికి ప్రభుత్వం తలసరి ఒక లక్షా 30 వేలు మంజూరు చేసింది. ప్రతి కుటుంబానికీ సాగు భూమి ఇస్తూ పూర్తిస్థాయి పునరావాస గ్రామాలను నిర్మించారు. నిర్వాసితుల హక్కుల గురించి మరీ ఎక్కువగా పట్టించుకుంటే ప్రాజెక్టులే కట్టుకోలేమనుకునే వారికి ఇవి రెండూ మంచి ఉదాహరణలు. ముంపు తక్కువ ఉండేటట్టు ప్రాజెక్టు స్థలాన్నీ డిజైన్‌నూ ఎంపిక చేసినట్టయితే ముంపుకు గురయ్యే కొద్దిమందికి పూర్తిస్థాయి పునరావాసం కల్పిస్తూ కూడా ప్రాజెక్టులు కట్టుకోవచ్చునని ఇవి నిరూపిస్తున్నాయి.

మరి ఈ స్పృహ ఏ కోశానా లేని రోజులలో చేపట్టిన మద్దువలస కూడా ఇదే స్థాయి పునరావాస కార్యక్రమం చేపట్టేటట్టయితే 25 వేల మంది నిర్వాసితులకు తలసరి ఒక లక్ష రూపాయలు మంజూరు చేసినా 250 కోట్లు అవుతుంది. ప్రాజెక్టు ఖర్చే 112 కోట్లయినప్పుడు పునరావాసానికి 250 కోట్లు ఎక్కడ నుండి తేగలమని మన పాలకులు అంటున్నారు. ఇంత తెలివి తక్కువ ప్రాజెక్టు చేపట్టడం మీ తప్పే కాబట్టి ఈ ప్రశ్నకు మీరే జవాబు చెప్పండని ప్రభుత్వాన్నే అడగవచ్చు. అయితే నిర్వాసితుల ఉద్యమాలు అంత మొండిగా ఉండగల పరిస్థితి లేదు కాబట్టి, అంత మొత్తం కాకపోతే అందులో సగం మంజూరు చేయగలవా? మూడవ వంతు, లేక నాల్గవ వంతు మంజూరు చేయగలవా? అని అడగడానికి సిద్ధపడక తప్పదు.

ప్రభుత్వం అందులో నూరవ వంతు మాత్రమే– అంటే తలసరి 1200 రూపాయల చొప్పున 2.9 కోట్లు మాత్రమే మంజూరు చేస్తానంటున్నది. అది చావు ఖర్చులకు కూడా రాదని నిర్వాసితులు అంటే అందులో తప్పేముంది?

మార్చి 10, 2002

# మృత సంస్కృతి

లోక్‌సభ స్పీకర్ బాలయోగి అంత్యక్రియల ప్రహసనం చూసిన వారందరికీ మనం రానురాను మనుషులం కాకుండా పోతున్నామనిపించింది. మృతదేహాన్ని నాలుగు రోజులు ఊరూరా తిప్పడం, ప్రతి ఒక్కరూ ఆ మృతదేహాన్ని దర్శించుకోవటం, తాము ఎంత గంభీరంగా మాట్లాడగలరో ప్రదర్శించుకోవటం, ఆ తర్వాత మృతదేహం మరొక ఊరికి తరలిపోవడం ఇదేం నాగరికత, ఇదేం సంస్కృతి అనుకోకుండా ఉండలేం. ప్రతి దానినీ అధికార ప్రదర్శనకొక సాధనంగా మలచుకోగల భ్రష్టుపట్టిన భారత రాజకీయ సంస్కృతి మాత్రమే ఇటువంటి వికృత ప్రదర్శనలు నిర్వహించగలదు.



బాలయోగి సగటు భారత రాజకీయవేత్త కంటె మెరుగైన మనిషేనని చాలామంది అభిప్రాయం. ఆయన అననుకూలమైన సామాజిక వాతావరణంలో పుట్టిపెరిగి ఒక ముఖ్య స్థానాన్ని అందుకోగలగడం సంతోషం కలిగించే విషయమే. ఆ క్రమంలో ఆయన స్నేహశీలిగానూ అడిగిన వారికి చేయగల సహాయం చేసే వ్యక్తిగానూ మిగిలిపోవడం కూడా సంతోషం కలిగించే విషయమే. చిన్న ఊరిలో మెజిస్ట్రేట్‌గా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన వ్యక్తి పెద్ద సభకు స్పీకరైనా తబ్బిబ్బయి పోకుండా హుందాగానూ క్రియాశీలకంగానూ వ్యవహరించడం ఇంకా సంతోషం కలిగించే విషయమే కాక మానవ సామర్థ్యం పట్ల విశ్వాసాన్ని నిలబెట్టే విషయం కూడా.

ఇవన్నీ చెప్పడానికి ఆయన మృతదేహాన్ని ముందేసుకుని కూర్చోవాలా? చనిపోయిన రెండవ రోజు అంత్యక్రియలు ముగించి ఆపైన ఎన్ని మీటింగ్‌లు ఎన్ని ఊర్లలో పెట్టి ఆయనను ఎంతగా ప్రశంసిస్తే ఎవరు వద్దంటారు? తమ రాజకీయ అభిమానాన్ని బిగ్గరగా ప్రదర్శించుకోవటం ఇంత ముఖ్యమైపోయిన ఈ రాజకీయ జీవులకు ఆయనను వ్యక్తిగా అభిమానించిన వారికి ఊరూరా ఆయన మృతదేహాన్ని తిప్పే ఈ ప్రహసనం ఎంత బాధ కలిగించగలదో ఊహకు అందదా? లేకపోతే మనుషులను రాజకీయంగా

చేరదీయడమూ, దరిచేరడమే తప్ప వ్యక్తిగతంగా ప్రేమించడమనేది మనకు తెలియదని ఈ రాజకీయ జీవుల భావమా?

ఆ హెలికాప్టర్ ఎందుకు కూలిపోయిందనేది కూడా ఏమంత ఊహకు అందని విషయం కాదు. ప్రతీ విషయాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థతోనో సంస్కృతితోనో ముడిపెట్టే విశ్లేషణా పద్ధతి పట్ల నాకు గౌరవం లేకపోయినప్పటికీ బాలయోగిని చేపల చెరువుల వికృత వ్యవస్థ చంపిందనడానికి సందేహమక్కరలేదనుకుంటాను. ఆయన ఎక్కిన హెలికాప్టర్‌కు సాంకేతిక సమస్య లేవో వచ్చాయి. హెలికాప్టర్‌లు విమానాలంత ఎత్తున పోవు కాబట్టి, కిందికి దిగడానికి అంతటి రన్–వే వీటికి అవసరం కాదు కాబట్టి, సాంకేతిక సమస్యలొస్తే నేల మీద చోటున్న కాడ దించడం పెద్ద సమస్య కాదు.

'నేల మీద చోటున్న కాడ' అనేది ఇక్కడ ముఖ్యం. కైకలూరు ప్రాంత గ్రామాలతో పరిచయం ఉన్న వారికెవ్వరికైనా తెలిసిన ఒక వాస్తవమేమిటంటే అక్కడ హెలికాప్టర్ దిగడానికి కాదు సరికదా ఒక మనిషి దొడ్డికి కూర్చోవడానికి కూడా ఖాళీ జాగా లేనంత దట్టంగా చేపల చెరువులున్నాయి. ఆ వ్యాపార సముద్రంలో ఖాళీ నేల కోసం వెతుకుతున్న పైలట్ పొగమంచు కారణంగా ఒక కొబ్బరిచెట్టును ఢీకొట్టినట్టున్నాడు.

అలుపెరుగని ధన దాహ 'వ్యవసాయ వ్యవస్థ' ఆ హెలికాప్టర్‌లోని ప్రయాణీకుల ప్రాణం తీసింది. దానికి అనుబంధమైన రాజకీయ వ్యవస్థ చనిపోయిన వారిలో ప్రముఖుని మృతదేహాన్ని ఊరూరూ తిప్పి తన ఘనతను ప్రదర్శించుకునింది. చేపలయితేనేం, మనిషి శవమైతేనేం అన్నీ మన ప్రయోజనం కోసమే కదా ఉండేది.

అయితే ఇది ఒక ప్రాంతం వైపరీత్యమో ఒక వర్గం వైపరీత్యమో కాదు. ప్రైవేట్ జీవితంలో ఎవరెట్లా ఉన్నారో గాని మన దేశంలో పబ్లిక్ జీవితం అనేది అనంతంగా భ్రష్టుపట్టింది. ఒక్క రాజకీయాలలోనే కాదు, అన్ని సామాజిక రంగాలలోనూ.

ఈ మధ్య నేను ప్రయాణం చేస్తున్న ఒక బస్సులో జరిగిన ఘటనను వివరించడం ఇక్కడ ఉచితంగా ఉంటుంది. ఇది కూడా విజయవాడలోనే జరగడం పూర్తిగా కాకతాళీయం కాదుగానీ అక్కడ మాత్రమే మనుషులు ఇట్లాగున్నారని పరాయి ప్రాంతాల వాళ్ళు అనుకుంటే అది ఆత్మవంచన కాగలదు.

విజయవాడలో బయలుదేరిన ఏలూరు నాన్‌స్టాప్ బస్సు విజయవాడ నగరం నుండి బయటికి ఇంకా పోలేదు. ఒకచోట రోడ్డు నడుమనున్న రోడ్ డివైడర్ దాటి ఒక అమ్మాయి వేగంగా దూసుకు వస్తున్న మా బస్సు ముందుకు వచ్చింది. ఆమె ఆగడం

లేదని గమనించిన బస్సు డ్రైవర్ గట్టిగా బ్రేక్‌కొట్టి బస్సును ఆపాడు. ఆ అమ్మాయికి ఇంకా రెండడుగులు ఇవతల ఉండగానే బస్సు ఆగింది. అయినప్పటికీ ఆ అమ్మాయి గాభరా వల్ల, నీరసం వల్ల ( నీరసానికి కారణం చెప్తాను) ఉన్నచోటే కుప్పకూలి పడిపోయింది. వేరే డ్రైవరెవరైనా, బస్సు ఆపితే ఏం గొడవ అవుతుందోనని పక్కకు తిప్పి దూసుకుపోయేవాడే. పైగా ఇతని తప్పేమీ లేదు కూడా. అయినప్పటికీ మా డ్రైవర్ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా బస్సు నుండి కిందికి దూకి ఆ అమ్మాయిని ఎత్తుకొని రోడ్డు పక్కకు తీసుకుని పోయి కొబ్బరి నీళ్ళు తాగించి పరిచర్యలు చేయసాగాడు.

ఆ అమ్మాయి ఆ రోజు పొద్దున్న తల్లిదండ్రులతో సహా వాళ్ళ ఊరి నుండి కనకదుర్గ గుడికి వచ్చి అక్కడ తప్పిపోయిందట. పెద్దమ్మాయే గానీ కొంచెం అయోమయంగా ఉంది. పొద్దున్నుంచి తిండి నీళ్లు లేక తిరుగుతుండడం వల్ల చాలా నీరసంగానూ ఉంది. అంతలో ఆ అమ్మాయి కోసం వెతుక్కుంటూ ఆమె తండ్రి ఆటోలో వచ్చాడు. బస్సు కింద పడబోయిన అమ్మాయి తన కూతురేనని గుర్తించాడు. డ్రైవర్‌తో సహా అందరూ సహాయం చేసి ఆమెను ఆటో ఎక్కించారు.

ఆ పిల్ల తండ్రి ఆమెను ఆస్పత్రికి తీసుకుపోయే ప్రయత్నమేమీ చేయకుండా బస్సు డ్రైవర్ వెంటపడ్డాడు. డ్రైవింగ్ లైసెన్స్ ఇమ్మన్నాడు. బస్సు తాళాలు ఇమ్మన్నాడు. బస్సును పక్కనపెట్టి తనతో రమ్మన్నాడు. డ్రైవర్ వైఖరి మొదటినుండి గమనిస్తున్న ప్రయాణీకులు డ్రైవర్ పక్షం తీసుకొని తండ్రితో వాదనకు దిగారు. హైవే పక్కన కృష్ణానది ఒడ్డున ఉన్న ఇళ్ళలోని యువకులు రంగంలోకి దిగారు. హైవేల మీద ప్రమాదాలు ఎక్కడ జరిగినా ఈ రకమైన యువకులు రంగంలోకి దిగుతారు. తప్పొప్పులతో నిమిత్తం లేకుండా పెద్ద మొత్తంలో డబ్బులిప్పించి అందులో వాటా తీసుకుంటారు.

వాగ్వివాదం దాదాపు 45 నిమిషాలు గడిచింది. అంతసేపూ ఆ తండ్రి ఆటోలో కూర్చోబెట్టిన బిడ్డ గతి ఏమైందో చూడలేదు. ఆటోవైపు ఒక్కసారి కూడ పోలేదు. నిజానికి తప్పిపోయిన కూతురు ఈ ఘటన పుణ్యాన అతనికి దొరికింది. ఆమె భయానికి పడిపోయిందే తప్ప గాయాలేవీ కాలేదు. డ్రైవర్ ఆమెను వెంటనే పక్కకు తీసుకుపోయి పరిచర్యలు చేసాడు. కానీ ఆమె కన్నతండ్రి దృష్టంతా ఈ ఘటన నుండి పొందగల రాబడి మీదనే ఉంది. పోలీసు కంప్లెయింట్ ఇస్తాననీ జైలులో పెట్టిస్తాననీ బెదిరిస్తే డ్రైవర్ ఎంతో కొంత ఇవ్వకపోతాడా అన్నది అతని ఆశ. ఆ సంగతి తెలిసే స్థానిక యువకులు గుంపుగా వచ్చి బస్సుకు అడ్డం నిలబడి అతనికి 'సహాయం' చేసి తమ వాటా తాము తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ లోపల ఆ అమ్మాయి పరిస్థితి ఏమిటనేది వీరెవ్వరికీ–తండ్రితో సహా–అక్కరలేదు.

మనమిట్లా ఎందుకయిపోయామనే ప్రశ్నకు–నేను ‘మనం’ అని అందరినీ కలుపుకొని అంటున్నాను – జవాబు వెతికేటప్పుడు సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థనూ నిందించడం పరిపాటి. ఈ రకమైన విశ్లేషణ బాహ్య పరిస్థితులను వివరించడానికి బాగానే పనికొస్తుంది గానీ మనుషులు బాహ్య పరిస్థితుల ప్రభావాన్ని అచేతనంగా స్వీకరించరు. మన వ్యక్తిత్వం, మన సంకల్పం మనకుంటాయి. పరిస్థితులు ఎంతగా దిగజార్చితే అంతగా దిగజారడానికి మనుషులు మరబొమ్మలు కారు. అయినా ఎందుకింత వికృతంగా తయారవుతున్నాము? వద్దని ఎందుకు అనుకోలేక పోతున్నాము?

మార్చి 31, 2002

# కొల్లేటివాసుల కొంప కొల్లేరయింది

ఇల్లు నీటిలో మునిగిపోతే 'కొంప కొల్లేరయింది' అంటారు.

ఇప్పుడు కొల్లేరువాసుల కొంపే కొల్లేరయింది. 2 లక్షల 25 వేల మంది నివసించే 78 గ్రామాలను ప్రభుత్వం పక్షుల అభయారణ్యంగా ప్రకటించి, అక్కడ నివసించే వారు వ్యవసాయానికి రసాయన ఎరువులు, మందులు, కరెంట్ మోటార్లు వాడకూడదనీ చేపల వేటకు మోటారు బోట్లు వాడకూడదనీ, సహజంగా చెరువులలో, కాలవలలో చేపలు పట్టుకోవచ్చును గానీ చేపల చెరువులు నిర్మించకూడదనీ ఆదేశించింది.

జి.వో. 120 అని పిలవబడే ఈ ఆదేశాన్ని హైకోర్టు కూడా ఆమోదించింది కాబట్టి ఇంక మీరంతా ఖాళీ చేసి పొండని అధికారగణం కొల్లేరు గ్రామాలపైన దిగుతున్నారు. జనం ప్రస్తుతానికి ప్రతిఘటిస్తున్నారు.

కొల్లేరు అనేది భారతదేశంలోనే అతి పెద్ద మంచి నీటి సరస్సులలో ఒకటని ప్రభుత్వ గెజిటీర్లు అంటాయి. ఇది ఉత్తరాన గోదావరి డెల్టాకు, దక్షిణాదిన కృష్ణానది డెల్టాకు మధ్యన ఉంది. సైబీరియా వంటి దూర ప్రాంతాల నుండి అనేక పక్షిజాతులు అక్కడికి వలస వస్తుంటాయి. కాలక్రమంలో అక్కడ సరస్సు ఇగిరిపోయి ఇక్కడొక చెరువు అక్కడొక ఏరు మధ్యలో పొలాలు, ఊర్లు ఏర్పడ్డాయి. కృష్ణా జిల్లాలో 7 మండలాలలో, పశ్చిమ గోదావరి జిల్లాలో 2 మండలాలలో మొత్తం 122 గ్రామాలు ఇప్పుడు 'కొల్లేరు'లో ఉన్నాయి. ఈ గ్రామాల జనాభా 3 లక్షలు.

కొల్లేరు చుట్టుకొని పరిశ్రమలు వెలిసాయి. కెమికల్ ఫ్యాక్టరీ ఒకటి, చక్కెర మిల్లులు, డిస్టిలరీలు వచ్చాయి. వీటి కాలుష్యం కాలవల ద్వారా 'కొల్లేరు'లోకి పోతున్నది. కొల్లేరులోని నీటి వనరులన్నీ కాలక్రమంలో కలుషితం అయ్యాయి. ఈ కాలుష్యం వల్ల కొల్లేటి ప్రజల జీవితమూ దెబ్బతినే ఉండాలి గానీ, పక్షుల రాక తగ్గిపోయిందనేది ప్రధాన విషయం అయింది.

పక్షులు రావద్దనీ, పక్షుల గుంపులు గుమిగూడే ప్రాంతం మనుషులకు ఆహ్లాదకరంగా ఉండదనీ అనడం లేదుగానీ, 'పర్యావరణ' ఆందోళనలో పక్షులు, జంతువుల కంటే ఎక్కువగా కాకున్నా వాటితో సమానంగానయినా మనుషుల కష్టాలకు చోటు ఇవ్వడం అవసరం. పర్యావరణ ఉద్యమాన్ని మనిషిని కేంద్రం చేసుకొని అర్థం చేసుకునేవారూ ఉన్నారు, మనిషిని పర్యావరణానికి శత్రువును చేసి చూసేవారూ ఉన్నారు.

రెండవ కోవకు చెందిన పర్యావరణ ఉద్యమకారులు 'కొల్లేరు'కు ప్రతినిధులు కావడం కొన్ని సంవత్సరాల క్రితం కొల్లేటి ప్రజల దురదృష్టం. వాళ్లు హైకోర్టులో కేసు వేసి, కొల్లేటిని 'అభయారణ్యం' (సాంక్చువరీ)గా ప్రకటించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరారు.

మా ఊరికి రోడ్డు వేయమని ఆదేశించండి, మా కులానికి రిజర్వేషన్ ఇమ్మని ఆదేశించండి, మా ఊరిలో ఆస్పత్రి పెట్టమని ఆదేశించండి అని కోర్టులో కేసువేస్తే 'ఇది పాలసీకి  సంబంధించిన విషయం, కోర్టులేం చేయగలవు' అని సంశయించే కోర్టు ఈ విషయంలో ఏ సంశయం లేకుండా, కొల్లేరును అభయారణ్యంగా ప్రకటించడానికి వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం క్రింద చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

హైకోర్టు చెప్పింది కాబట్టి ఇంక ఆలస్యం ఎందుకని 1999 అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం జీవో 120 జారీ చేసింది. కొల్లేరు అని పిలువబడే ప్రాంతంలో 30,885 హెక్టార్ల ప్రాంతాన్ని పక్షుల అభయారణ్యంగా ప్రకటించింది. అక్కడ 78 గ్రామాలున్నాయి. 2,25,000 జనాభా నివసిస్తుంది. వీరంతా అక్కడే నివసించదలచుకుంటే నివసించవచ్చును గానీ పక్షుల రాకపోకలకు నష్టకరమైన జీవన విధానాన్ని అనుసరించకూడదు. వ్యవసాయానికి రసాయక ఎరువులు వాడకూడదు, ఇంటికే తప్ప పొలంలోగానీ పిండిగిర్నీలో గానీ కరెంట్ వాడకూడదు.

ఈ 78 గ్రామాలలో 20 వేల ఎకరాల పట్టా భూమి ఉంది. 9 వేల ఎకరాల డి-ఫారం భూమి వుంది. ఏ పట్టా లేకుండా పేదలు ఆక్రమించుకున్న భూమి ఉంది. పట్టా భూమిలో వ్యవసాయం, చేపల  చెరువులూ ఉన్నాయి. వీటి మీద ఆధారపడి బతుకుతున్న 2,25,000 మంది ప్రజలు ఇకనుంచి ప్రకృతిసిద్ధమైన  వ్యవసాయ పద్ధతులలోనే బతకాలని జివో 120 అంటుంది. దేశమంతా రసాయన  ఎరువులను కరెంట్ మిషన్లను విడిచిపెట్టి ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ బతకాలని నమ్మే వారున్నారనుకోండి. అయితే బలవంతంగా కొల్లేటి గ్రామాల ప్రజలపైన మాత్రమే

నిగాహ్

ఆ నిర్ణయం రుద్దడం న్యాయమా? దీనివల్ల వాళ్ళ జీవన ప్రమాణం ఖచ్చితంగా పడిపోతుంది.

పారిశ్రామిక కాలుష్యాన్ని గట్టిగా నివారించి మా పాటికి మమ్మల్ని బతకనిస్తే పక్షుల రాకకు పెద్దగా ఆటంకమేమీ ఉండదనీ, కావాలంటే రసాయనపదార్థాల వాడకంపైన హేతుబద్ధమైన పరిమితులు పెడితే ఫర్వాలేదు గానీ మొత్తంగానే నిషేధించి మా జీవన విధానాన్ని ముప్పై ఏళ్ళు వెనక్కి నెట్టడం భావ్యం కాదనీ ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

ప్రభుత్వానికి మరొక ప్రత్యామ్నాయం ఉంది. మొత్తంగా ఈ అభయారణ్యంలోని ప్రైవేట్ భూమినంతా సేకరించి అక్కడ బతుకుతున్న ప్రజలకు బయట పునరావాసం కల్పించవచ్చును. పునరావాసం గురించి ప్రభుత్వమేమీ మాట్లాడడం లేదు గానీ, భూమి సేకరణ కావాలంటే చేస్తానంటున్నది. అయితే పట్టా భూములకు మాత్రమే నష్టపరిహారం (మార్కెట్ ధరగా ప్రభుత్వం భావించిన దాని ప్రకారం) ఇస్తామనీ డి-ఫారం భూములకు తోచినంత ఎక్స్‌గ్రేషియా మాత్రం ఇస్తామనీ అంటున్నది. ఎక్స్‌గ్రేషియా అనేది ఎకరానికి 300 మించి ఉండదని ప్రభుత్వ అధికారులే అంటున్నారు.

డి-ఫారం భూములలోని చేపల చెరువుల రైతులు ఎక్కువ ఆందోళన చేస్తున్నారు. వీరంతా ఎస్‌సి, బిసి కులాలకు చెందిన వారు. వేరే బతుకుతెరువు లేక వీరు 1970లలో ప్రభుత్వ భూములు సాగుచేసుకోవటం మొదలుపెట్టగా, 1976లో ప్రభుత్వమే జిఓ 118 జారీ చేసి వీరందరికీ తలా 50 సెంట్ల చొప్పున భూమి అసైన్‌మెంట్ కింద ఇచ్చి, చేపల చెరువులు చేసుకోవడానికి అనుమతి ఇచ్చి, సొసైటీలు పెట్టుకొమ్మని ప్రోత్సహించి, అప్పులిచ్చి చేపల పెంపకం జరిపించాలని నిర్ణయించింది.

ఆ తర్వాత 136 సొసైటీలు ఏర్పడ్డాయి. వాటి సభ్యుల సంఖ్య 10,400. వీరు దాదాపు 6 వేల ఎకరాలలో ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపల చెరువులు చేసుకుంటున్నారు. వీళ్లను చూసి, అంతకు ముందెన్నడో డి-ఫారం భూములు పొందిన వారు కూడ 2000 లేక 3000 ఎకరాలను చేపల చెరువులు చేసుకున్నారు.

ఈ సొసైటీల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం వివరమైన ప్రణాళిక జారీ చేసింది. వారికి అప్పులిచ్చింది. బ్యాంకుల నుండి అప్పులిప్పించింది. ప్రభుత్వాన్ని నమ్మి వారు అప్పులు తీసుకున్నారు, పెట్టుబడిపెట్టారు. చేపల చెరువు నిర్మాణానికి 25 వేల రూపాయల దాకా ఖర్చు పెట్టారు. చేపల పెంపకానికి సంవత్సరానికి 40,000 రూపాయలు పెట్టుబడి పెట్టారు. చాలామంది ఇంకా ఆ అప్పులలో ఉన్నారు.

ఇప్పుడు అకస్మాత్తుగా ఏ నష్టపరిహారం లేకుండా వెళ్ళిపొమ్మనీ చేపల చెరువులన్నీ కూల్చేస్తామనీ అంటే వాళ్ళెక్కడికి పోతారు?

కోర్టుకు పోయారు. జివో 120 చెల్లదన్నారు. పక్షుల అభయారణ్యం కోసం 2,25,000 మంది ప్రజలు నివసించే ప్రాంతాన్ని నోటిఫై చేయడం, తమ జీవన ప్రమాణాలను తీవ్రంగా దిగజార్చే ఆంక్షలు పెట్టడం అన్యాయం అన్నారు. నిజానికి కొల్లేరు చుట్టూ ఉన్న ఫ్యాక్టరీల కాలుష్యాన్ని ఆపితే కొల్లేటిలో జీవిస్తున్న ప్రజల జీవన విధానం పక్షుల రాకకేమీ ఆటంకం కాదన్నారు. ఆహ్లాదకరమైన కొల్లేటి ప్రకృతిలో భాగమై ఎప్పటి నుండో జీవిస్తున్న తమకు జీవనాధారం లేకుండా చేసి కొల్లేరు ఇచ్చే ఆహ్లాదాన్ని పర్యాటకులకు రిజర్వ్ చేయడం అన్యాయం అన్నారు. పోనీ అక్కడ నుండి వెళ్ళిపోదామంటే పట్టాభూములకే తప్ప డి-ఫారం భూములకు నష్టపరిహారం ఇవ్వబోమనీ, పునరావాసం ఎవ్వరికీ ఇవ్వబోమనీ ఆ జివో ప్రకటించడం వల్ల ఆ ప్రత్యామ్నాయం కూడా లేకుండా పోయిందన్నారు. దాదాపు 25 ఏళ్ళుగా ప్రభుత్వం అనుమతితో ప్రభుత్వం ప్రోత్సాహంతో ప్రభుత్వసంస్థలిచ్చే అప్పులకు తమ శ్రమనూ తమ దగ్గరున్న కొద్దిపాటి పెట్టుబడినీ జతచేసి చేపల సాగు చేస్తున్న ఎస్‌సి, బిసి రైతుల పొట్ట ఇట్లా కొట్టడం జీవించే హక్కుపైన దాడి అన్నారు. భారత రాజ్యాంగం కింద ప్రభుత్వం ప్రజలతో ఈ రకంగా వ్యవహరించడం చెల్లదన్నారు. నిజానికి భూమి సేకరణ చేసేటప్పుడు డి-ఫారం భూములకు పట్టాభూముల లాగే మార్కెట్‌ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలనీ, సివిల్ కోర్టుకు అపీలు చేసుకునే హక్కు మాత్రమే డి-ఫారం భూముల రైతులకు ఉండదనీ రాష్ట్ర ప్రభుత్వమే కోర్టు తీర్పులననుసరించి 23-12-93న జివో 1307 జారీ చేసింది. జివో 120 ఆ మేరకయితే ఖచ్చితంగా చెల్లదు. వారి వాదనతో హైకోర్టు ఒప్పుకోలేదు. వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం కింద అనుసరించవలసిన పద్ధతిని సక్రమంగానే అనుసరించి జివో జారీ చేసారు కాబట్టి ఆ జివో చెల్లుతుందన్నారు. అసలు విషయం పట్ల సానుభూతి లేనప్పుడు ప్రొసీజర్ పేరుమీద కేసులను కొట్టేయటం మన కోర్టులకు పరిపాటే.

ఇప్పుడింక ఉద్యమాన్ని తీవ్రతరం చేసి చంద్రబాబును ఒప్పించే ప్రయత్నం చేయాలా లేక ఢిల్లీకి పోయి సుప్రీంకోర్టును ఆశ్రయించాలా అన్న ప్రశ్న కొల్లేటి ప్రజల ముందు ఉంది. వారు రెండవ దాన్నే ఎంచుకోవటం చంద్రబాబు పాలన గురించి సరైన అంచనాయే కావచ్చును గానీ సుప్రీంకోర్టు ఇంతకంటే భిన్నంగా స్పందిస్తుందని నమ్మడం కూడా కొంచెం కష్టమే.

ఏప్రిల్ 14, 2002

# ప్రజాస్వామ్యానికి ప్రథమ శత్రువులు

కంబోడియాలో గతంలో పోల్‌పాట్ ప్రభుత్వం పాల్పడిన హత్యాకాండపైన ప్రస్తుత కంబోడియా ప్రభుత్వం ఏర్పాటు చేయదల్చిన అంతర్జాతీయ ట్రిబ్యునల్‌కు ఇండియా సహితం ఒక జడ్జిని పంపగలదని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆ దేశ ప్రధానమంత్రికి హామీ ఇచ్చారు. ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయాన్ని ఎదుర్కొనడంలో మనం అగ్రభాగాన ఉంటాం కదా? ఇండియాలో తప్ప.

ఇక్కడ అదే అటల్‌బిహారీ నరేంద్రమోడిని కనీసం పక్కకు తప్పుకోమనడు. మోడి ప్రభుత్వం అండదండలతో సంఘ్ పరివార్ హంతకమూకలు గుజరాత్‌లో నెరపిన ఊచకోతపైన అంతర్జాతీయ ట్రిబ్యునల్ కాదు సరికదా దేశీయ న్యాయ విచారణ కూడా జరపడు.

నిన్న ఇక్కడ ఒక ముఖం తొడుక్కొని ఈ రోజు కంబోడియాకు పోయి వేరే ముఖం తొడుక్కోవడం వాజ్‌పేయిని కనీసం ఇబ్బంది పెడుతున్నట్టు కూడా లేదు. అతనిని సంఘ్ పరివార్ ముఖానికి తొడిగిన 'ముసుగు' అన్నారు గానీ, అతనికున్న ముసుగులే అనేకం. ముస్లిం శరణార్థుల దగ్గర కన్నీళ్లు పెట్టగలడు. పత్రికల వాళ్ళు వినేటట్టు నరేంద్రమోడికి పాలనానీతి బోధించగలడు. అక్కడినుంచి బయటపడిన తర్వాత మోడిని తొలగించనక్కరలేదని విశ్వహిందూ పరిషత్‌తో గొంతు కలపగలడు. కంబోడియాకు పోయి మానవతకే మచ్చతెచ్చిన పోల్‌పాట్ నేరాలపైన అంతర్జాతీయ విచారణ జరిపించవలసిందేననగలడు. రాబోయే రోజులలో ముస్లింలు అధికంగా నివసించే దేశాలకు పోయి భారతీయ సంస్కృతిలోని సహన శీలం ఎంత గొప్పదో లెక్చరిచ్చి రాగలడు.

ఇంతటి కపటత్వం అరుదుగా మాత్రమే చూస్తాం.

పోల్‌పాట్ పరమహంతకుడే (అతనిని ఈనాటికీ సమర్థించే కమ్యూనిస్టులు మన దగ్గర మాత్రమే ఇంకా కొందరు మిగిలి ఉన్నారు). కానీ అతను కనీసం నిష్పక్షపాతంగా

అందరినీ చంపాడు. విప్లవం అని తాను నమ్మిన దానిని ఒల్లని వారిని ఒక్కొక్కరినే చంపుకుంటూ పోతే చివరికి మిగిలిన వారంతా విప్లవాన్ని ఆమోదించే వారే ఉంటారు కాబట్టి ఆ రకంగా విప్లవం వచ్చేస్తుందని నమ్మాడు. 20 లక్షల నుంచి 30 లక్షల మంది చావుకు పోల్‌పాట్ ప్రభుత్వం కారణమయ్యిందని అంచనా. ఈ ఊచకోతలోని ఒకే ఒక సద్గుణం ఏమిటంటే అది విచక్షణ ఎరుగదు. అది ఏమైనా కావచ్చునుగానీ 'జెనోసైడ్' కాదు.

జాతి, మతం, భాష మొదలైన గుర్తింపుల ప్రాతిపదికన ఒక ప్రజా వర్గాన్ని భౌతికంగా, ఆర్థికంగా మట్టుబెట్టడాన్ని 'జెనోసైడ్' అంటారు. నిన్న మొన్న గుజరాత్‌లో జరిగింది అదే. ముస్లింలను మొత్తంగానే నిలువ నీడ లేకుండ చేయడం ఆ 'అల్లర్ల' సూత్రధారుల ఉద్దేశ్యం. ముస్లింలలో మంచివాళ్లు, చెడ్డవాళ్లు, ఛాందసవాదులు, లౌకికవాదులు, హిందువులతో కలిసి మెలిసి బతికేవాళ్ళు, హిందువులను ద్వేషించే వాళ్లు అన్న తేడాను వారు చూడలేదు. 'ముస్లిం'లు అయితే చాలు చంపారు. గర్భిణి అయిన స్త్రీని ఊరికే చంపితే ఆమె శవం బిడ్డను (ముస్లిం బిడ్డను) ప్రసవిస్తుందను కున్నారేమో తెలీదు. కడుపు కోసి బిడ్డను బయటకు లాగి నరికి తల్లి ప్రాణం తీసారు.

ఇది నిజమైన అర్థంలో జెనోసైడ్. హిందుత్వవాద ఉన్మాదాన్ని ద్వేషించేవారు మాత్రమే గుజరాత్ హత్యాకాండకు ఈ పేరు పెడితే దానిని 'అతి' అని కొట్టిపారేయవచ్చును గానీ వారు మాత్రమే ఆ మాట ప్రయోగించడం లేదు. పాత్రికేయులు సహితం రొటీన్‌గా ప్రయోగిస్తున్నారు.

దీనికి నరేంద్రమోడి బర్తరఫ్ సంపూర్ణమైన జవాబని ఎవ్వరూ అనరు. ఆ డిమాండ్ రావడం సహజం. ప్రజలలో ఒక వర్గం కళ్ళకు హంతకునిగా కనిపించే వ్యక్తి పరిపాలన చేయడం, పరిపాలన కొనసాగించడం, ప్రజాస్వామ్యం అనే భావననే అపహాస్యం చేయడం అవుతుంది. అందువల్ల అతను తక్షణం తొలగిపోవాలని ఇంతమంది కోరడం సమంజసమైన డిమాండే. అయితే సంఘ్ పరివార్ గుంపుకు చెందిన వారు, జార్జి ఫెర్నాండెజ్ వంటి పరివార్ పరివారమూ మోడిని బర్తరఫ్ చేయనక్కరలేదంటూ ఒకరి తర్వాత ఒకరు ప్రకటనలు కురిపించడంతో ఎదుటివారి అజెండా నరేంద్రమోడి బర్తరఫ్‌కు కుదించుకుపోయింది.

అది సంఘ్ పరివార్ విజయమేనని చెప్పుకోక తప్పదు. కార్లలో పోయి సెల్‌ఫోన్ల ద్వారా కిరోసిన్ డబ్బాలు తెప్పించుకుని ముస్లింలను వారి ఆస్తులనూ దహనం చేసినవారు వందల సంఖ్యలో ఉన్నచోట, చర్చ యావత్తు నరేంద్ర మోడి గద్దె చుట్టూ

తిరగడం వారి విజయం కాకపోతే మరేమిటి? గుజరాత్‌లో సంఘ్ పరివార్ సంస్థలు ఒక దశాబ్దంపైగా విద్వేష ప్రచారం విస్తృతంగా చేసారు. పారిశ్రామికంగా వేగంగా పురోగమిస్తున్న గుజరాత్‌లోని కొత్త ధనిక వర్గం 'ఐడెంటిటీ'లో ముస్లిం ద్వేషాన్ని విడదీయరాని భాగం చేసారు. పేద వర్గాలలోని అభద్రతా భావాన్ని అదే నమూనాలో మలిచారు. సాధారణ పరిస్థితులలో ముస్లింల పట్ల ద్వేషం పెంచుకోవలసిన అవసరం లేని ఆదివాసీ తెగలలో సహితం ఈ విషాన్ని విజయవంతంగా నింపగలిగారంటే వారు ఎంత పట్టుదలగా 'కృషి' చేసారో అర్థం అవుతుంది.

భిన్నత్వం ఉన్న చోట ద్వేషాన్ని రెచ్చగొట్టడం పెద్ద కష్టం కాదు. కానీ విచిత్రం ఏమిటంటే గుజరాత్‌లోని ముస్లింలకూ హిందువులకూ కొట్టొచ్చినట్టు కనిపించే తేడా ఏమీ ఉండదు. ముస్లింలూ గుజరాతీయే మాట్లాడతారు. ఉర్దూ కాదు. ముస్లింలలోని ధనిక వర్గమైన బోహ్రాలను సంప్రదాయ ముస్లింలు ముస్లింలుగానే అంగీకరించరు. హిందువులూ ముస్లింలూ ఉమ్మడిగా హాజరయ్యే దర్గాలు కాశ్మీర్ తర్వాత గుజరాత్‌లోనే అధికంగా కనిపిస్తాయి. బయటి నుండి ఆ రాష్ట్రానికి పోయిన వారికి ఎవరు హిందువులు ఎవరు ముస్లింలు అని వెంటనే తెలియడం కష్టమైనంతగా ఇరువురి జీవనశైలి కలిసిపోయింది. అటువంటి సమాజంలో విద్వేషాన్ని చుక్కచుక్క ఎక్కిస్తూ ఇక్కడికి తీసుకొచ్చారు హిందూత్వవాదులు. ఈ విషాన్ని కడిగేయడానికి నరేంద్ర మోడి రాజీనామా చేస్తే సరిపోదు. ప్రేమను చంపివేయడం ఒక నిమిషంలో జరిగే పనేగానీ ద్వేషాన్ని కడిగేయడం అంత సులభం కాదు. సంఘ్‌పరివార్ విషం సమాజం నరనరాలలోకీ పాకుతుంటే అందరమూ చూస్తూ ఊరుకున్నాం. మదరసాలలో ఏం బోధిస్తున్నారో చర్చించాముగానీ సరస్వతీ శిశు మందిరాలలోనూ ఇతర పరివార్ విద్యాలయాలలోనూ ఏం చెప్తున్నారో చూడలేదు. విద్వేషాన్ని పనిగట్టుకొని పెంచి, దానిని సోపానం చేసుకొని బిజెపి అధికారానికి ఎగబాకుతుంటే అది సహితం కాంగ్రెస్‌కు ఒక ప్రత్యామ్నాయం కాగలదని భావించాం. వాజ్‌పేయికీ, అద్వానీకి తేడాలు లెక్కపెడుతూ వ్యాఖ్యలు చేసాం. రాజకీయాల నుండి విద్యాలయాల దాకా అన్ని రంగాలలోనూ మన చిన్న చిన్న ప్రయోజనాల కోసం వీరి హంతక అజెండాకు ('తాత్కాలికంగానే' అని మనకు మనం సర్దిచెప్పుకుంటూ) సహకరించాం. ఈ హంతకులు వికటంగా నవ్వుకుంటూ మనం అనాలోచితంగా ఇచ్చిన అన్ని అవకాశాలనూ వాడుకొని ఈ రోజు పెట్రేగిపోతున్నారు. వీళ్లను ప్రజాస్వామ్యానికి ప్రథమ శత్రువులుగా ప్రకటించి ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారంతా ఇప్పటికైనా ఈ విషయంలో ఒకటి కాకపోతే దేశమంతా రేపు గుజరాత్ కాగలదు.

ఏప్రిల్ 28, 2002

# వేయి నాల్కల హిందూత్వం

అటల్ బిహారీ వాజ్‌పేయికి ఎన్ని నాలుకలున్నాయో లెక్కపెట్టడం సహితం కష్టం.

నిన్న మొన్నటి దాకా పాశ్చాత్య దేశాలు మన స్వంత వ్యవహారాలలో ఎంత జోక్యం చేసుకుంటే అంత సంతోషించేవాడు. 'పాకిస్తాన్ ఏం చేస్తున్నదో చూడండి. పాకిస్తాన్‌ను తిట్టండి' అని దారిన పోయే ప్రతి విదేశీ ప్రముఖుడినీ అభ్యర్థించేవాడు. ప్రపంచంలో ఏ సభకు హాజరైనా ఏ సంస్థ సమావేశాలలో పాల్గొన్నా 'సీమాంతర ఉగ్రవాదం' ఇండియాను ఎంతగా నీరసింప చేస్తున్నదో విపులీకరించి చెప్పి పాకిస్తాన్‌కు మొట్టికాయలు వేయించాలని చూసేవాడు. ఇతర దేశాల ప్రభుత్వాలూ, అంతర్జాతీయ వేదికలూ ఇండియా పడుతున్న యాతనను అర్థం చేసుకోకపోతే అలిగేవాడు..

ఇప్పుడు అకస్మాత్తుగా ప్లేటు ఫిరాయించి గుజరాత్‌లో ఏం జరిగితే మీకెందుకు అని బ్రిటన్‌నూ ఇతర యూరోపియన్ దేశాలనూ దబాయిస్తున్నాడు. మాకు లౌకికవాదం నేర్పొద్దు, సహజీవనం నేర్పొద్దు, మాకవి వెన్నతో పెట్టిన విద్యలు అంటున్నాడు.

ఈ 'ఆత్మ గౌరవం' మొన్నటి దాకా ఏమయిందో, అమెరికా అధ్యక్షుడి సర్టిఫికెట్ కోసం దేబిరించినప్పుడు ఎక్కడికి పోయిందో.

ఇండియా అంటే ప్రపంచ దేశాలకు గౌరవం ఏమయినా ఉంటే దానికి రెండే కారణాలున్నాయి. సిలికాన్ వ్యాలీ నిండా మన వాళ్ళు ఉన్నారని కాదు, ఆధ్యాత్మిక చింతనకిది నిలయమనీ కాదు. ఇక్కడ రాజకీయ ప్రజాస్వామ్యం ఇతర మూడవ ప్రపంచ దేశాలతో పోలిస్తే మెరుగుగా ఉందనీ, ఇక్కడ భిన్న మతాలు, భాషలు, జాతుల ప్రజలు సహజీవనం చేసే ప్రయోగం ఒక మేరకు విజయవంతమయిందనీ ఇండియాను గౌరవిస్తారు.

ఈ రెండు లక్షణాలనూ పని గట్టుకొని ధ్వంసం చేస్తున్నది అటల్ బిహారీ వీధి రౌడీల మూకలు. వాళ్ళ బరిసెలు, కట్టెలు, త్రిశూలాలు అనుమతించే పరిధిలోనే

ప్రజాస్వామ్యం మసలుకోవాలని, వారిని మెప్పించి నడుచుకోవడమే మైనార్టీలకిచ్చే స్వేచ్ఛ అనీ వారు ప్రకటిస్తున్నారు. అమలు చేస్తున్నారు.

దీని గురించి ఎవరూ ఎందుకు మాట్లాడకూడదు? వేద విజ్ఞానం నుండి టెర్రరిజాన్ని వ్యతిరేకించే సకల రాజ్యాల పోరాటం దాకా అన్ని విషయాలలోనూ ఇండియాను పొగడాలి కానీ ఇక్కడ ముస్లింలను నరుకుతున్నారని మాత్రం అనకూడదా? ఇకనైనా ఆపకపోతే బాగుండదని విమర్శించకూడదా?

విమర్శించడంలో ఒక పెద్ద దేశం ఇట్లా పాడయిపోతున్నదే అన్న బాధేకాక వారి వారి స్వప్రయోజనాలు కూడా ఉండే ఉండవచ్చు. అయినా ఆర్థిక విధాన రచనలో పాశ్చాత్య దేశాలు మన మీద రుద్దుతున్న సూత్రాలలో 'శాస్త్రీయ జ్ఞానమే' కాక వారి స్వప్రయోజనాలు కూడా ఉండి ఉండవచ్చునేమో అని ఎంత మెత్తగా సూచించినా వినడానికి సిద్ధంగా లేని వారు, పాశ్చాత్య దేశాల సలహాలే కాదు, వారు పెడుతున్న ఆంక్షలలో సహితం విజ్ఞతే తప్ప స్వార్థం లేశమంతయు లేదని నమ్మేవారు గుజరాత్ గురించి అవే దేశాలు చేసే విమర్శలోని ఈ విజ్ఞతనెందుకు చూడరు?

రెండు నాల్కలు, రెండు మొదళ్లు, రెండు జతల కళ్లు ఉంటే చూడరు, చూడలేరు.

ఎవరెంత విమర్శించినా, ప్రపంచమంతా తిట్టిపోసినా వీరికి రవ్వంత కూడా జ్ఞానం రాదనడానికి ఉదాహరణ వీరు గుజరాత్‌కూ బీహార్‌కూ పోలిక తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నం. పార్లమెంటులో ఏ నియమం కింద ఏది చర్చించవచ్చును, ఏది చర్చించకూడదు అన్న చర్చలోకి మనం పోనక్కరలేదు. మన చట్టాలయినా మన దేశ అవసరాలనుసరించి మారాయేమో గానీ పార్లమెంటరీ సంప్రదాయాలు బ్రిటన్ నమూనా నుండి ఒక్క అంగుళం కూడ పక్కకు పోలేదు. ఆ సంప్రదాయాల ప్రకారం ఏ చర్చ ఏ నియమం కింద జరగవచ్చునన్న సంవాదం మనమిప్పుడు పెట్టుకోనక్కర లేదు. గుజరాత్‌నే కాక బీహార్‌ను కూడా చర్చించుకోనివ్వండి. అభిశంసన తీర్మానం పెట్టి వోటు వేసుకోనివ్వండి. దానివల్ల వచ్చిన నష్టమేమీ లేదు.

కాని గుజరాత్‌లో జరిగిన దానికీ బీహార్‌లో జరుగుతున్న దానికీ తేడా చూడలేకపోవడాన్ని గురించి మాట్లాడుకోవాలి. గుజరాత్‌లో అధికార యంత్రాంగం మెజార్టీ మతోన్మాదులతో ప్రత్యక్షంగా చేతులు కలిపి మైనార్టీలను చంపించింది. ముఖ్యమంత్రి, హోంమంత్రి స్వయంగా దీనికి నాయకత్వం వహించారు. బీహారులో ప్రభుత్వం ఎవరినీ చంపదు. పౌరవర్గాలు ఒకరినొకరు చంపుకుంటుంటే నిస్సహాయంగా

చూస్తూ ఉంటుంది. ఈ హత్యాకాండలో చనిపోయేది ఎక్కువగా దళితులు, పేదలే అయినప్పటికీ నక్సలైట్లకు బలం ఉన్న ప్రాంతాలలో అవతలి వైపు కూడా ప్రాణనష్టం భారీగానే ఉంటుంది. ప్రభుత్వానిది సర్వత్రా ప్రేక్షక పాత్రే.

అది మంచిదని కాదుగానీ దానికీ గుజరాత్‌లో జరిగిన దానికీ పోలికేలేదు. గుజరాత్ మారణకాండకున్న అసాధారణ స్వభావాన్ని స్పష్టంగా వివరించిన తర్వాతనే డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్షాల ప్రతిపాదనను ఆమోదించాడు. వెంటనే బీహార్ ప్రస్తావన తీసుకురావడం సంఘ్ పరివార్ మూకల లేకితనాన్ని సూచిస్తుంది. వారి హంతక లీల సమాజంలో రేపిన అలజడి వారికసలే అర్థం కాలేదని సూచిస్తుంది.

గడచినది అర్థంకాకపోయినా భవిష్యత్తు వారికి అర్థం కాగలిగే ఉండాలి. దాని రూపురేఖలు ఇప్పటికే చూచాయగా కనిపిస్తున్నాయి. ఇప్పుడొక రెండు వారాలుగా గుజరాత్‌లో చెలరేగుతున్న హింసాకాండ ఏకపక్షంగా జరగడం లేదు. హిందూ ముస్లిం మూకలు పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. బస్తీలలో మోహరించి యుద్ధం చేస్తున్నారు. ముస్లింలు మేకల లాగ బలి కావడం కంటే యుద్ధం చేసి చావడం మేలనుకోవటం ఇందుకు కారణం కావచ్చు. తమ వారు దారుణంగా చనిపోవడం కళ్ళారా చూసినవారి ప్రతీకారకాంక్ష కారణం కావచ్చు. లేదా ఇస్లాం పేరు మీద ఆయుధాలు ధరించిన గుంపుల ప్రవేశం కారణం కావచ్చు. మూడు కారణాలూ ఏక కాలంలో పని చేస్తుండవచ్చు.

నిగాహ్

మారణకాండ ఇప్పుడు దొమ్మీ రూపం తీసుకునింది. ఇది ఇప్పట్లో చల్లారక పోవచ్చు. తాత్కాలికంగా చల్లారినా మళ్లీ మళ్లీ రాజుకోగలదు. దీర్ఘకాలం ఈ పుండు గుజరాతీ సమాజాన్ని లోపలి నుండి తొలిచేస్తుంది. ఇది కేవలం హత్యాకాండ దగ్గర, దహన కాండ దగ్గర ఆగిపోదు. ద్వేషపూరితమైన ప్రచారం, ద్వేష ప్రబోధం అన్ని రంగాలలోనూ బలం పుంజుకుంటాయి. ఇరువైపులా జరగడం మొదలుపెట్టిన తర్వాత తప్పు మైనార్టీల మీదికి నెట్టడం సులభం అయిపోతుంది. 'వాళ్లు అట్లా ఉన్నారు. కాబట్టి మేము ఇట్లా ఉండక తప్పడం లేదు–స్వతహాగా మేము ఈ రోజేమిటి ఎప్పటి నుండో చాలా గొప్పవాళ్ళం' అనడం సాధ్యం అవుతుంది.

అటల్ బిహారీ బ్రాండ్ సంఘ్ పరివార్ మేధావులు ఈ తర్కం ప్రయోగించడంలో చేయి–లేకపోతే నోరు– తిరిగిన వాళ్లు. క్రైస్తవ ప్రచారకులను నలుమూలలా పరివార్ హంతకులు నరుకుతుండగా, 'మత మార్పిడుల గురించి చర్చ చేయడం అవసరం అని వారు అనలేదా? గుజరాత్‌లో ముస్లింలను ఊచకోత కోసి గోవాకు పోయి 'ముస్లింలు ఇతర మతస్తులతో సహజీవనం చేయడం నేర్చుకోవాలి' అనలేదా? నువ్వు

ఎంత దుర్మార్గుడివి కాకపోతే నన్నింత దుర్మార్గుడ్ని చేసావు అని గొంతు తెగగోసిన శవాన్ని దబాయించే బాపతు మేధావిత్వం వారిది. హిందువులది గొప్ప సహన శీలం అని మాట్లాడడం ఏ మాత్రం సహనశీలం లేని ఈ కాషాయ మేధావుల వంతయింది.

ఇంత జరిగినా, జరుగుతున్నా ఒక పదవి కోసం, ఒక కుర్చీ కోసం, పక్కవాడి కన్నొకటి పొడవడం కోసం వారితో చేతులు కలిపే అవకాశవాదానికి సమాజంలో కొదవ లేకుండా పోయింది. మన రాష్ట్రంలో ముస్లింల జనాభా తక్కువేమీ లేదని తెలిసిన చంద్రబాబు గుజరాత్ తర్వాత బిజెపికి కొంచెం దూరం ఉండడం శ్రేయస్కరమని భావించడం అటల్ బీహారికి ఆందోళన కలిగించక పోవడం ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. అనుకున్నట్టుగానే ఆయనకు బిఎస్‌పి అండ దొరికింది. అప్పుడప్పుడు మాయావతి లక్నో గద్దెనెక్కి దిగుతుంటే అంబేద్కర్ ఆశయాల సాధన పురోగమిస్తున్నట్టే భావించే బహుజన సమాజ్ పార్టీ దృక్పథాన్ని గురించి అంబేద్కర్ ఏమని ఉండేవాడో ఊహించడం కష్టం కాదు. అయినా, సంఘ్ పరివార్‌కు అండగా నిలబడడం అంబేద్కర్ ఆశయాలను పూడ్చిపెట్టడమేనని గుర్తించడానికి మనం అంబేద్కర్ అంతటి మేధో సంపత్తి  కలవారం కానవసరం లేదు.  ఆ సంగతి మాయావతికీ కాన్షీరాంకూ తెలియదా అంటే, అంబేద్కర్ ఆశయాలంటే మాయావతి అడపాదడపా గద్దెనెక్కడమేనని వారి అభిప్రాయం కాబట్టి తమ సంకుచిత రాజకీయ వ్యూహాలకూ అంబేద్కర్ ఆశయాలకూ మధ్య వైరుధ్యం ఉందని వారెట్లా అనుకుంటారు?

మే 26, 2002

# ఏది పాకిస్తాన్ కుట్ర?

మీరు గుజరాత్‌కు ఏ నిజ నిర్ధారణ కమిటీలో భాగంగా పోకపోయినా, యధాలాపంగా ఆ రాష్ట్రంలో పర్యటించినా ఎక్కడబడితే అక్కడ తగలబడి పోయిన నిర్మాణాలు కనిపిస్తాయి. అందులో నివాసాలు, హోటళ్లు, దుకాణాలు ఉంటాయి.

తగలబడిన హోటళ్ళు, దుకాణాల మసిబారిన బోర్డులు చూసినప్పుడు, ఇవి ముస్లింలకు చెందినవని వాటిని తగలబెట్టిన వారికి ఎట్లా తెలిసిందని మీకు అనుమానం వస్తుంది. ఎందుకంటే వాటికి 'ముస్లిం' పేర్లు ఉండవు. సర్వోదయ, ఆశీశ్, ఆశీర్వాద్, పంకజ్, తులసి మొదలయిన పేర్లు ఉంటాయి.

హిందూత్వవాద మూకల భయానికి ముస్లింలు తమ వ్యాపార సంస్థలకు 'హిందూ' పేర్లు పెట్టుకున్నారని మీరు అనుకోవచ్చు. కొన్ని సందర్భాలలో అది నిజమే కావచ్చును గానీ అసలు కారణం అది కాదు.

గుజరాతీ ముస్లింల మాతృభాష గుజరాతీయే. వాళ్లెవ్వరికీ ఉర్దూ రాదు. చదువుకున్న వారయితే హిందీ వస్తుంది. మనం వాళ్లు ముస్లింలు కదా అని కొంచెం ఉర్దూ కలిసిన హిందీలో మాట్లాడినా, వాళ్లు స్వచ్ఛమైన హిందీలోనే జవాబు ఇస్తారు.

కాబట్టి ఆశీశ్, అశీర్వాద్ మొదలయినవి 'హిందూ' పేర్లు కావు. గుజరాతీ భాషాపదాలు. అయితే 'సర్వోదయ' అన్న పేరు ముస్లింల వ్యాపార సంస్థలకే ఎక్కువ ఉండడం వెనుక ఒక రాజకీయ కారణం ఉండవచ్చు. గాంధీ అన్నా గాంధీ భావాలన్నా గుజరాత్‌లో ముస్లింలకే తప్ప హిందువులకు పెద్దగా సదభిప్రాయం లేదు. ఈ రోజే కాదు–అంటే హిందూత్వవాదులు గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చుకున్న తర్వాతే కాదు. తొలినాటి నుండి కూడా, దేశమంతటిలోకీ గాంధీ పట్ల అతి తక్కువ గౌరవం ఉండేది గుజరాత్‌లోనే 'గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ కూడా పటేల్ కాంగ్రెస్ తప్ప గాంధీజీ కాంగ్రెస్ కాదు' అని ఆ రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న ఒకరిద్దరు మానవ హక్కుల కార్యకర్తలు అంటారు.

ఈ కారణంగా ఆ రాష్ట్రంలో సర్వోదయ అన్న పేరు గల తగలబడిపోయిన హోటళ్ళు, దుకాణాలు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి. ఆ దృశ్యాన్ని జీర్ణించుకోవడానికి కొంత సమయం పడుతుంది గానీ గుజరాత్ సమాజానికి పట్టిన దుర్గతికి ఆ దృశ్యం సరైన సంకేతమే.

సంఘ్ పరివార్ కార్యకర్తలలోనే కాక, సాధారణ హిందువులలో సహితం కళ్లకు పొరలు కప్పిన గుడ్డి ద్వేషం ఆ దుర్గతిలోని ప్రధాన అంశం. ద్వేషం వల్ల నశించిన వివేచన వికృత హింసాకాండ రూపంలోనే కాక మనల్ని అవాక్కులను చేయగల కుతర్కం రూపంలోనూ సాక్షాత్కరిస్తుంది. మీ ఊరి ముస్లింలు ఏం తప్పు చేసారని ప్రశ్నిస్తే అప్పుడెప్పుడో సోమనాథ్ దేవాలయం మీద దాడి జరిపిన గజనీ మహ్మద్ గురించి, ఒసామాబిన్ లాడెన్ గురించి, జిహాద్ గురించి, హిజ్బుల్ ముజాహిదీన్ గురించి, పాకిస్తాన్ గురించి ఇంకా అనేక అసందర్భమైన విషయాల గురించి మాట్లాడతారు. వాటికీ మీ ఊరి ముస్లింలకూ ఏమిటి సంబంధం అని మనం రెట్టించే ప్రయత్నం ఏ కొంచెం చేసినా విపరీతంగా అవేశపడి పోతారు. కోపంతో ఊగిపోతారు. ఆ ఆగ్రహాన్ని చూడాలే తప్ప చెప్తే నమ్మరు.

'ముస్లిం' అనేది ఇప్పుడొక అఖండ పదార్థం అయిపోయింది. అందువల్ల ఎవరో ఎక్కడో ఎప్పుడో చేసిన పాపాలకు, లేదా చేసారని సంఘ్ పరివార్ భావించే పాపాలకు మన ఊరి దర్జీ, మన స్కూటర్ మెకానిక్కు జవాబు చెప్పాలి. ప్రశ్నలకు కాదు, తల్వార్లకు, త్రిశూలాలకు జవాబు చెప్పాలి.

దీనిని గ్రహించే రాజకీయ జ్ఞానం ఉన్న వారూ, లేని వారు కూడా గుజరాతీ ముస్లింలలో ఉన్నారు. ఆ జ్ఞానం లేని వారి విస్మయం వర్ణనాతీతం. అదంతా నిజమే కావచ్చు. కానీ నేనేం చేసాను? అన్న ప్రశ్న వారి చూపులలో ఇప్పుడు స్థిరపడిపోయింది. అది పోదు. ఎందుకంటే వారు తమ ఇల్లు వాకిలీ పోగొట్టుకున్నారు, వ్యాపారాలూ ఆస్తులూ పోగొట్టుకున్నారు. తమ కళ్ళ ముందే నరికిచంపిన తమ ఆప్తులను పోగొట్టుకున్నారు. తన పిల్లలు, తన కంటె చిన్నవాళ్ళయిన ఇరుగు పొరుగు యువకులూ చూస్తున్నారని తెలిసి ఏడుపు బిగపట్టుకొని జరిగిన విషయాలు చెప్తూ వస్తున్న మధ్యవయస్కుడయిన రైతు మన కళ్లలోని సానుభూతి చూసి కాబోలు ఇంకా బిగపట్టలేక ఒక్కసారిగా గొల్లుమని ఏడుస్తూ, 'ఇది నా జన్మభూమి–నన్ను పొమ్మంటే ఎక్కడికి పోవాలి? నేను జాతీయ గీతం పాడలేదా? జెండా ఎగరేయలేదా' అని చేతులలో ముఖం దాచుకొని విలపించినప్పుడు బాధకంటే విస్మయం అతనిని ఎక్కువగా దహించి వేస్తున్నదని అర్థమవుతుంది.

ఈ మూర్ఖమైన ద్వేషం తనకు కావలసిన సాకులను తానే కల్పించుకుంటుంది. ఇప్పుడు గుజరాత్‌లో మీరు ఏ హిందువునైనా ఆడగండి ఈ అల్లర్లు ఇంకెంత కాలం సాగుతాయని. 'పాకిస్తాన్ అల్లర్లను ఆగనివ్వదు' అని జవాబు చెప్తారు. మొదటిసారి ఆ జవాబు విన్నప్పుడు మన శ్రవణేంద్రియాన్ని శంకిస్తాం. చచ్చింది, చంపుతున్నది ముస్లింలనయితే అల్లర్లను పాకిస్తాన్ ఆగనివ్వక పోవడమేమిటని ఆశ్చర్యపోతాము. ఆ జవాబు అర్థం కావడానికి కొంచెం సమయం పడుతుంది. గోద్రాలో రైలు మీద దాడి పాకిస్తాన్ చేయించిందనీ, ఆ దాడికి హిందువులు ఆగ్రహించి రెచ్చిపోతారని తెలిసే చేయించిందనీ, ఆ ఆగ్రహానికి ఆపైన ప్రతీకారం తీర్చుకుంటుందనీ, అందుకోసం మందినీ పైసలనూ గుజరాత్‌కు పంపించడం మొదలుపెట్టిందనీ దాని భావం. అత్యంత కిరాతకంగా ముస్లింలను మూకుమ్మడిగా వధించిన వారు సహితం తాము చేసిన హింసతో సహా ఇదంతా పాకిస్తాన్ చేస్తున్న కుట్ర అనీ ఈ అగ్గి ఆరిపోకుండా పాకిస్తాన్ రగిలిస్తూనే ఉంటుందనీ నమ్ముతూ మరింత హింసకు పాల్పడుతూ అదంతా కూడా పాకిస్తాన్ కుట్రేనని సమర్థించుకుంటూ...

ఢిల్లీలో అద్వానీ దీనికి తగినట్టే మాట్లాడుతుంటాడు. గుజరాత్‌లోని శరణార్థుల శిబిరాలలో పాకిస్తాన్ ఏజెంట్లూ టెర్రరిస్టులూ ప్రవేశిస్తున్నారని హెచ్చరికలు రెండు రోజుల కొకసారి చేస్తుంటాడు. హోం శాఖ ఎటువంటి అరెస్టులు కోరుకుంటే అటువంటి అరెస్టులు చేసిపెట్టడంలో నేర్పరులయిన ఢిల్లీ పోలీసులు, గుజరాత్‌కు పోవడానికి తయారయి ఉన్న లష్కర్-ఇ-తయ్యిబా మిలిటెంట్లను వెనువెంటనే చాంద్‌నీ చౌక్‌లో అరెస్టు చేసి వారి 'కుట్రలను భగ్నం చేస్తారు'. ఇంక గుజరాత్‌లోని హిందూత్వవాదుల 'మూడ్' గురించి చెప్పేదేముంది? ఇదంతా పాకిస్తాన్ కుట్ర అని మేము ముందే చెప్పలేదా అని వారు రెట్టించిన ఉత్సాహంతో ముస్లింలపైన ద్వేషం పెంచుకుని 'పాకిస్తాన్ కుట్ర'లో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నారు. ముస్లింలు శరణార్థుల శిబిరాల నుండి తిరిగి ఇళ్లకు (కాలిపోయిన ఇళ్ళకే అయినా) పోవడం అసాధ్యం చేస్తున్నారు. ఇంకా మిగిలిపోయిన ఇళ్లేమయినా ఉంటే తగలబెడుతున్నారు. ఒంటరిగా ముస్లిమెవరైనా దొరికితే నరికి చంపుతున్నారు....

జూన్ 9, 2002

# 'విశ్వ' హిందువులకు ఒక హెచ్చరిక

ఈ మధ్య ఒక వార్త చదివాను. అమెరికాలో ఉంటున్న హిందువులు మెక్‌డోనాల్డ్స్ ఫాస్ట్‌ఫుడ్స్ కంపెనీ మీద కోర్టులో దావా వేశారని. ఏమని వేసారంటే ఆ ఫాస్ట్‌ఫుడ్స్ కంపెనీ బ్రెడ్డుముక్కలకు గొడ్డు మాంసం (లేకపోతే దాని కొవ్వేమో) రాస్తున్నదనీ ఆ విషయం చెప్పకుండా చేయడం వల్ల హిందువులయిన వినియోగదారులకు మానసిక క్షోభ వగైరాలు కలిగిస్తున్నదనీ.

అప్పుడు మెక్‌డొనాల్డ్స్ కంపెనీ ఏం చేసింది? 'మాది గొడ్డు మాంసం తినే సంస్కృతి. మీరు పరాయి వాళ్లు. ఉద్యోగాల కోసం ఇక్కడికొచ్చి మా జీవన శైలినే తప్పుబడతారా?' అని ఎదురు ప్రశ్న వేసి ఉండవచ్చును కానీ ఆ కంపెనీ ఆ పని చేయలేదు. 'కోర్టులో వ్యాజ్యం ఎందుకు లెండి, బయట రాజీపడతాం' అని చెప్పి కేసు వేసిన ఆసామీలతో రాజీపడి శాఖాహారం గుణగణాల గురించి ప్రచారం చేయడానికి ఏటా కొన్ని మిలియన్ల డాలర్లు ఖర్చు పెడతానని ఒప్పుకొని కేసు నుండి తప్పించుకుంది.

వేరే దేశాలకు పోయినప్పుడు 'మన సంస్కృతి'ని మనం ఎంత సమర్థంగా చాటుకుంటామో, ఎంత గట్టిగా నిలబెట్టుకుంటామో చూడండి. అక్కడి సంస్కృతిలో కలిసి పోయి ఆ దేశాల జాతీయతనే మనదిగా భావించి అందులో మమేకయిపోయి, మన ప్రత్యేకతను మరచిపోము. గుళ్ళు కడతాం. వెంకటేశ్వరుడి నుండి స్వామినారాయణుడి దాకా ప్రతి దేవుడికీ ప్రపంచమంతటా పెద్ద పెద్ద గుళ్ళు కట్టాము. ఇక్కడి బ్రాహ్మణ సంస్కృతీ సంప్రదాయాలను ఆ గుళ్లలోనూ, వాటిని ఆవరించిన సమాజంలోనూ తూచ తప్పకుండ పాటిస్తాం.

ఇండియాకు ఆ దేశానికి మధ్య క్రికెట్ మ్యాచ్ గానీ హాకీ మ్యాచ్ గానీ జరిగితే ఈ దేశ జాతీయ పతాకాన్ని చేతబూని ఈ దేశపు టీంకు చిహ్నంగా ప్రోత్సహిస్తాం. మనం ఏ దేశ పౌరసత్వం తీసుకున్నాం, ఎవరి 'ఉప్పు తింటున్నాం' అని సంశయించం. భాషల వారీగా కులాల వారీగా అక్కడ సంఘాలు పెట్టి మనం ఎక్కడ ఉంటే అక్కడొక మినీ ఇండియాను నిర్మొహమాటంగా తయారు చేస్తాం.

మనము ప్రపంచంలో ఎక్కడికి పోయినా మన ప్రత్యేకతలు నిలబెట్టుకునే స్వేచ్ఛను డిమాండ్ చేస్తాం, దానినొక హక్కుగా భావిస్తాం.

ఈ పనులు చేసే హిందువులు ఇక్కడ మాత్రం ఎవరూ ప్రత్యేకతలు కోరుకోకూడదనీ ఒకే 'భారత జాతి'కి చెందిన వారిగా ఉండాలనీ, అనుభూతి చెందాలనీ డిమాండ్ చేస్తారు. 'నీ దేవుడికి అల్లా అని పేరు పెట్టుకుంటే పెట్టుకో, కానీ ఇక్కడ బతకదల్చుకుంటే రాముడినీ, కృష్ణుడునీ కూడా దేవుళ్ళుగా గుర్తించు' అని ముస్లింలను దబాయిస్తారు. అమెరికా పౌరులుగా మీరిక్కడ బతకదల్చుకుంటే ఏసు ప్రభువు పుట్టినరోజును కూడా జన్మాష్టమితో సమానమైన పండుగగా జరుపుకొమ్మని అమెరికా వాళ్ళు సిలికాన్ వ్యాలీలోనూ, బయటా ఉన్న హిందువులకు ఆంక్షలు విధిస్తే ఏం చేస్తారో! అది అనాగరికమనీ ఫాసిజాన్ని తలపింపజేస్తున్నదనీ అల్లరి చేసి అమెరికాను భ్రష్టుపట్టిస్తారు తప్ప దానిని 'అమెరికా జాతీయతను బలంగా నిలబెట్టుకునే దేశభక్తియుతమైన ప్రయత్నం'గా మాత్రం భావించరు.

ఇక్కడ మాత్రం అవే వర్గాల మనుషులు వేరే తర్కాన్ని ప్రయోగిస్తారు.

ఫిజీలోని భారతీయుల మీద మొన్న దాడులు జరిగినప్పుడు ఇక్కడ అందరూ ఎంత ఆందోళన చెందారో జ్ఞాపకం ఉండవచ్చు. ఫిజీలోని అతి పెద్ద మైనార్టీ అయిన ఇండియన్లకు అక్కడ రెండవశ్రేణి పౌరుల స్థాయి కల్పించడం ఎంత అనాగరికం అని అందరూ మండిపడ్డారు. 'మీరు అక్కడికి పోయి అయిదారు తరాలు గడిచిపోయాయి. ఇంకా భారతీయులం అని మీ గురించి మీరు అనుకోవడం భావ్యం కాదు. మీరు ఎక్కడి నుండి వచ్చారో మరచిపోయి ఫిజీ సమాజంలో కలిసిపోండి అని వారికి అక్కడెవ్వరూ జానా కృష్ణమూర్తితో సహా సలహా ఇవ్వలేదు. దాని బదులు ఫిజీ ఇండియన్ల హక్కుల రక్షణ కోసం ఇండియా చొరవ తీసుకోవాలి అని భారత ప్రభుత్వాన్ని అందరూ తొందరపెట్టారు.

ఒక రెండు దశాబ్దాల క్రితం అనుకుంటాను. ఆఫ్రికాలోని ఉగాండా దేశంలోని భారతీయ వ్యాపారస్తులపైన ఆ దేశవాసులైన జనం దాడి చేశారు. అప్పుడు ఆ వ్యాపారస్తులకు ప్రపంచం చాలా సానుభూతి చూపింది. 'ఎప్పుడో వ్యాపారరీత్యా అక్కడ స్థిరపడి పోయినవారు ఇంకా మిమ్మల్ని మీరు ఇండియన్స్‌గానే పిలుచుకోవడం ఎందుకు? మీ ప్రవర్తన అట్లాగుంటే స్థానిక ఆఫ్రికన్లు మీ దేశభక్తిని ఎందుకు శంకించరు?' అని వాళ్ళకెవ్వరూ హితబోధ ఆరోజు చేయలేదు. ఒక మైనార్టీ ఉనికినీ హక్కులనూ కాపాడలేకపోయిన అనాగరిక రాజ్యంగా ఉగాండాను ఆరోజు అందరూ చూసారు.

ఆనాడు ఉగాండాలో 'మెజార్టీ జాతి దురహంకారాని'కి గురయి పారిపోయివచ్చిన ఇండియన్లలో అత్యధికులు గుజరాతీలు! అదే గుజరాతీలు ఇప్పుడు మైనార్టీ, మైనార్టీ హక్కులు అన్న మాటల అర్థమే మరచిపోయారు.

నిజానికి ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోనూ ఎప్పటినుండో పెద్ద సంఖ్యలో ఉంటున్న వారిలో ఇండియన్లను ప్రముఖంగానే చెప్పుకోవాలి. మలేషియాలో, ఫిజీలో, శ్రీలంకలో, వివిధ ఆఫ్రికా దేశాలలో, ఈ మధ్య కాలంలోనైతే అన్ని పాశ్చాత్య దేశాలలోనూ భారతీయ సంతతికి చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎక్కడా మన వాళ్ళు స్థానిక జాతీయతలో కలిసిపోలేదు, మన వాళ్ల సంస్కృతి స్థానిక సంస్కృతిలో కరిగిపోలేదు. అందువల్ల సాంస్కృతిక వైవిధ్యం గురించి మైనార్టీ సంస్కృతుల హక్కుల గురించి మనకు పట్టింపు ఎక్కువే ఉండి ఉండాలి.

ఇతర దేశాలలో మైనార్టీలుగా హక్కులు కోరుకోవడం, సాంస్కృతిక ప్రత్యేకతను నిలుపుకునే స్వేచ్ఛను కోరుకోవడం, ఇక్కడ మాత్రం ఒకే అఖండమైన 'భారతీయత'ను నిర్వచించి అందరూ అందులో భాగమై పోవాలని ఒత్తిడి పెట్టడం హైందవ నైజం అయిపోయింది.

ఈ రకమైన రెండు నాల్కల ధోరణులు సాగే రోజులు పోయాయి. 'గ్లోబలైజేషన్ అని పిలవబడుతున్న దాని ఆర్థిక పార్శ్వం ఎంత అభ్యంతరకరమైనదో దాని సమాచార పార్శ్వం హిపోక్రసీకి సంకుచితత్వానికి అంతటి శత్రువు. ఇప్పుడు ప్రపంచమంతా గుజరాత్‌ను తెరమీద చూసింది. మైనార్టీలకు హిందుత్వవాదులు నిర్దేశిస్తున్న ప్రవర్తనా నియమావళిని గమనించింది. ఇతర దేశాలలో ఉంటూ విశ్వహిందూ పరిషత్‌కు భారీగా డొనేషన్లు ఇచ్చే ప్రవాస హైందవ పెత్తందారీ కులాల వారిని అక్కడి ప్రజలు నిలదీసే రోజు వస్తుంది. 'మీ దేశంలో మైనార్టీలకు మీరు బోధిస్తున్న ఫాసిస్టు నీతినే మీ విషయంలో మేము ఇక్కడ ఆచరిస్తే మీరేమవుతారు' అని ప్రశ్నించే రోజు రాకమానదు. ఆ ప్రశ్న మామూలు జనం అడిగినప్పుడే మేలుకుంటే బతికిపోతారు. లేకపోతే అక్కడి అశోక్ సింఘాల్‌లనూ గిరిరాజ్ కిషోర్‌లనూ ఎదుర్కోవాల్సి వస్తుంది. అదేమంత ఆహ్వానించదగ్గ పరిణామం కాదు.

జూన్ 23, 2002

# వామపక్షాలకు అభినందనలు

**వా**మపక్ష పార్టీలు అప్పుడప్పుడు మంచి పనులు చేస్తుంటాయి.

అబ్దుల్ కలాం ముస్లిం కాబట్టి అతని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తే ఏమనుకుంటారో అని జంకకుండా, అతనిని ముస్లింగా కాకుండా అణుయుద్ధ ఆపేక్షకు సంకేతంగా భావించి వ్యతిరేకించే సాహసం చేసినందుకు వారిని అభినందించాలి.

పైగా అతనిపై పోటీకి మరొక కాలంలో, మరొక యుద్ధంలో పాల్గొన్న లక్ష్మీ సెహగల్‌ను నిలబెట్టడం ద్వారా చేయదగ్గ యుద్ధాలు, చేయకూడని యుద్ధాలు ఉంటాయన్న సంకేతాన్ని కూడా ప్రపంచానికి ఇచ్చారు. ఇప్పుడు భారత్ పాకిస్తాన్ మీద 'చేస్తాను, చేస్తాను' అంటూ కాలుదువ్వుతున్న యుద్ధం చేయరాని యుద్ధమనీ, ఒకనాడు వలస పాలకులపైన చేయదగ్గ యుద్ధం తలపెట్టిన లక్ష్మీ సెహగల్‌ను తమ అభ్యర్థిగా నిలబెట్టి దేశంలో కొంత మందయినా ఆ మాట అనడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పదల్చుకున్నామనీ ప్రకటించారు.

చేయరాని యుద్ధాలూ చేయదగ్గ యుద్ధాలూ అన్న వర్గీకరణ ఇబ్బందికరమైనదేనని ఒప్పుకోవాలి. సులభంగా వర్గీకరణ చేసేసే వారిని సందేహించాలని కూడా ఒప్పుకోవాలి. యుద్ధమే చేయరానిది అనేది మౌలికంగా సత్యమే. అయినప్పటికీ అది మినహాయింపులు అసలే లేని సత్యం కాదు. తాత్కాలిక అవకాశవాదానికి గతి తర్కం అని పేరు పెట్టి ఈ మినహాయింపును కమ్యూనిస్టులు చాలా భ్రష్టుపట్టించినప్పటికీ దానిని పూర్తిగా విసర్జించడం సహేతుకం కాదు.

అదెట్లాగున్నా, యుద్ధమే తప్పు అనే వారి కంటే కొన్ని యుద్ధాలు ఒప్పు అనే వారు కూడా ప్రస్తుత భారత పాలకుల కాషాయ యుద్ధ నీతిని వ్యతిరేకించినప్పుడే ఆ వ్యతిరేకతకు బలం ఎక్కువ ఉంటుంది. ఆ వ్యతిరేకతకు ప్రతినిధి అయిన లక్ష్మీ సెహగల్‌ను ఆ యుద్ధనీతికి చిహ్నంగా ఉన్న కలాంకు పోటీగా నిలబెట్టడం ఆ వ్యతిరేకతకు స్పష్టతనిచ్చింది.

వేరే ఏ విషయంలో ఎన్ని తేడాలున్నా 'దేశ భద్రత' విషయంలో ఒకటయి మాట్లాడాలి అనే వికృతమైన నీతి ఒకటి మన దేశంలో బాగా ప్రచారంలో ఉంది. మన దేశంలోనేమిటి, ప్రపంచ మంతటా బాగా ప్రచారంలో ఉంది. అమెరికాలోని రాజకీయ ప్రతిపక్షాలు సెప్టెంబర్ 11 తర్వాత ఆ నీతిని బహు చక్కగా పాటించాయనీ మన వాళ్ళు మాత్రమే దేశ ప్రయోజనాలకన్నా సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారనీ ఆర్ఎస్ఎస్ బ్రాండ్ మేధావులు డిసెంబర్ 13 తర్వాత పదేపదే వాపోతున్నారు.

నిజానికి ఆ తప్పుడు 'నీతి' మనవాళ్ళకు సహితం తెలియనిది కాదు. తరచుగా పాటించనిదీ కాదు. భారత పాకిస్తాన్ సంబంధాల విషయంలో ఇది తొలినాటి నుండీ జరుగుతున్నది. భారతపాకిస్తాన్ సంబంధాలతో ముడిపడిన లేక ముడిపెట్టిన విషయాలలో కూడా జరుగుతూనే ఉన్నది. కాశ్మీర్ దీనికొక ఉదాహరణ. సిపిఐ, సిపిఐ(ఎం)లు సహితం ఈ విషయంలో భిన్నంగా వ్యవహరించలేదు. అందరికీ తెలిసిన వాస్తవాలు కాశ్మీర్ కాడికి వచ్చేసరికి తెలియనట్టు నటించడం ఈ దేశంలో అయిదు దశాబ్దాలుగా సాగుతున్నది. జయప్రకాశ్ నారాయణ్ కూడా అందుకు భిన్నంగా వ్యవహరించలేదని జమ్మూకు చెందిన ప్రముఖ ప్రజాస్వామ్యవాది బలరాజ్ పూరి అంటారు.

టెర్రరిస్టులు, వేర్పాటువాదులు 'దేశ భద్రతకు' 'దేశ సమగ్రతకు' హానికరమైన శక్తులన్న కారణంగానే ఇతరత్రా ప్రజాస్వామికవాదులైన వారు చాలామంది టెర్రరిజాన్ని వ్యతిరేకించే పేరు మీద భారత రాజ్యం చేపట్టిన అన్ని నిర్బంధ చర్యలనూ సమర్థించారు. లేదా మౌనంగా ఉపేక్షించారు. పౌరహక్కుల ఆందోళనకు దుర్బుద్ధి ఆపాదించి దానికి దూరంగా ఉన్నారు.

ఇందులో సిపిఐ, సిపిఐ(ఎం) కూడా చాలా కాలం భాగంగా ఉండేవి. ఈ కారణంగా పౌర హక్కుల గొంతు దేశంలో చాలా కాలం ఒంటరిగొంతుగా ఉండేది. ఇప్పుడూ పరిస్థితి పూర్తిగా మారలేదు. కానీ కొంచెమైతే మారింది.

టాడానూ, పోటానూ పోలిస్తే ఈ విషయం అర్థం అవుతుంది. టాడా వచ్చినప్పుడు కేవలం దేశంలోని పిడికెడు హక్కుల సంఘాలు తప్ప వేరే ఎవ్వరూ వ్యతిరేకించలేదు. హక్కుల సంఘాల అభ్యంతరాలు ఆచరణలో రుజువయ్యే దాకా మా ఆందోళన ఒంటరి ఆందోళనగానే ఉండింది. వ్యక్తిగతంగా ఆమోదించిన వారు సహితం 'ఇది దేశ భద్రతకూ సమగ్రతకూ సంబంధించిన విషయం' అని తమ నోరు నొక్కుకొని మన నోరు నొక్కే ప్రయత్నం చేశారు.

పోటా వచ్చేసరికి పరిస్థితి కొంత మారింది. చాలా రాజకీయ పక్షాలు దానిని హక్కుల సమస్యగా గుర్తించి దేశ భద్రతతోనూ సమగ్రతతోనూ ముడిపెట్టకుండా దానిని వ్యతిరేకించాయి. అణ్వాయుధాలనూ పాకిస్తాన్ మీద వూరికే రంకెలు వేసే అద్వానీ కాషాయ ఆవేశాన్ని కూడా వ్యతిరేకించడానికి ఇదే క్రమంలో చాలా మంది సిద్ధపడుతున్నారు. 'ఇది దేశ భద్రతకూ సమగ్రతకూ సంబంధించిన విషయం కాబట్టి తేడాలు పక్కనపెట్టి అందరూ ఒక గొంతుతో మాట్లాడాలి' అన్న ఒత్తిడికి లొంగకుండా స్వతంత్రించి ఆలోచించడానికి సిద్ధపడుతున్నారు.

ఈ పరిణామం ఇంకా పూర్తి కాలేదు కానీ ఎంత మేరకు ఈ మార్పు వస్తే అంత మంచిది. మనుషుల హక్కులకు 'దేశం' 'జాతి' 'అభివృద్ధి' లాంటి పెద్ద పెద్ద మానవాతీత విషయాలను వ్యవస్థలనూ అడ్డం వేయడం పాలకులకూ విధాన నిర్దేశకులకూ సాధ్యమైనంత కాలం హక్కులకు భరోసా ఉండదు.

ఇప్పుడు మనల్ని పరిపాలిస్తున్న సంఘ్ పరివార్ ఉన్మాదులు ఈ కుతర్కంలో దిట్టలు. 'జాతి' ముందు మనిషి ఒక దోమ అంత అల్పమైన విషయం అన్న గోల్వాల్కర్ ఆలోచనా రీతి నుండి వారు బయటపడలేదు, పడరు. ఎన్నికల రాజకీయాల అవసరాల రీత్యా మౌనం పాటించడం ఉచితం అనుకున్న దగ్గర పాటించవచ్చును గాక.

అందుకే వాళ్ళకు అణు యుద్ధానికీ క్రికెట్ మ్యాచ్‌కూ తేడా తెలీదు. యుద్ధం చేసేస్తాం, పాకిస్తాన్‌ను అణచివేస్తాం, కాశ్మీర్‌ను మొత్తం జేబులో వేసుకుంటాం అని ప్రగల్భాలు పలుకుతుంటారు. అమెరికాకు నచ్చుదన్న భయం లేకుంటే ఏదో ఒకటి చేసేసి కోట్లాది ప్రజల ప్రాణాల మీదికి ఈ పాటికి తెచ్చే వారే. వీళ్ళ కాషాయ ఉన్మాదం ఎంతటి అమానుషత్వానికైనా దిగజారగలదని గుజరాత్ రుజువు చేసింది.

దేశభక్తి అన్న బెదిరింపుకు లొంగకుండా ఈ యుద్ధోన్మాదాన్ని బహిరంగంగా వ్యతిరేకించడానికి, దానిని తమ రాజకీయ అజెండాలో ఒక ముఖ్య విషయం చేయడానికీ పార్లమెంటరీ వామపక్షాలు సిద్ధపడడం అభినందించదగ్గ విషయం.

అబ్దుల్ కలాం 2020 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలో అయిదవ అభివృద్ధి చెందిన దేశం చేయాలన్న లక్ష్యమేదో ప్రకటించాడంట. 'అభివృద్ధి' అన్న మాట అమాయకమైనది కాదని మనికిప్పుడు బాగానే తెలుసును కాబట్టి ఈ లక్ష్యం ఎంత మాత్రం అమాయకమైనది కాదని అర్థం చేసుకోవటం కష్టం కాదు.

అభివృద్ధి అన్న మాట ప్రపంచ బ్యాంకు నోట వింటున్నాం, చంద్రబాబు నోట వింటున్నాం, ప్రమోద్ మహాజన్ నోట వింటున్నాం. ఈ మాటను వారు ప్రయోగించే

అర్థంలో స్థిరాస్తుల విలువలో అభివృద్ధే తప్ప వేరే ఏమీ కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు మొదలైన విషయాలలోని అభివృద్ధికి అందులో ఎంత మాత్రం చోటులేదని తెలుసు. ఆయుధ సైంటిస్టు అబ్దుల్ కలాం నమ్మే 'అభివృద్ధి' ఇంతకంటే భిన్నమైనది కాదనడానికి రెండు నిదర్శనాలున్నాయి. ఒకటి, అతనిని సంఘ్ పరివార్ పాలకులు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం. రెండు గుజరాత్‌లో ముస్లింల ఆక్రందనల ప్రతిధ్వని మనల్ని వీడక ముందే కలాం తన ఎంపిక పట్ల విపరీతంగా సంబరపడిపోవడం.

సమాజంలో ఎన్నో రకాల అవకాశవాదం, తెలివి తక్కువతనం, సంకుచితత్వం, పిరికితనం ఉంటేనే ఫాసిజం బలపడగలుగుతుందనేది నాజీవాదం నేర్పిన సత్యం. ఆ సత్యాన్ని భారతదేశం మరొకసారి రుజువు చేస్తున్నది. దానికి కనీసం సింబాలిక్‌గా ఎదురొడ్డే ప్రయత్నం చేస్తున్నందుకు వామపక్షాలకు అభినందనలు.

నిగాహ్

జులై 7, 2002

# ఇది చేతకాని ప్రభుత్వమా? లేకపోతే నీతిలేని ప్రభుత్వమా?

పీపుల్స్‌వార్‌కూ ప్రభుత్వానికీ మధ్య చర్చలు జరగాలన్న ప్రయత్నం మొదలైన నాటి నుండి పోలీసులు అడుగడుగునా తమ నిరసనను బుల్లెట్ల రూపంలో ప్రకటించడం చూస్తుంటే ఈ ప్రశ్న వేసుకోక తప్పడం లేదు. పోలీసు యంత్రాంగం ప్రభుత్వంలో భాగమేనని పాలనా శాస్త్రం అంటుంది గానీ ఈ చర్చలలో పోలీసులు స్వతంత్రమైన 'థర్డ్‌పార్టీ' అయిపోయారు. వేరే ఎవరైనా రాజ్యాంగం నుండి స్వతంత్రిస్తే ప్రభుత్వం పోలీసుల సాయంతో వారిని అణచి వేస్తుంది గానీ పోలీసులే 'థర్డ్‌పార్టీ' అయిపోతే ఆ పరిస్థితిని ఎదుర్కొనడానికి మీ దగ్గరా నా దగ్గరా లేనిది ప్రభుత్వం దగ్గర ఏముంది? సిగ్గుమాలినతనం తప్ప?

ఇది ప్రభుత్వం కావాలని పోలీసుల చేత చేయిస్తున్న హత్యలేనని చంద్రబాబే ఈ హత్యలకు కర్త అనీ వరవరరావు, గద్దర్ అంటున్నారు. ఇది నిజమైతే కావచ్చును గానీ అది నిజం కావడం వల్ల వాళ్ళు అనడం లేదు. ఎంత తీవ్రమైన నిందలు వేస్తే అంత ఎక్కువ సత్యం అనేది రాడికల్ భావాలు గల వాళ్ళు సాధారణంగా నమ్మే విషయం. ఒకరిని చేతకాని వాడు అనడం కన్నా కుట్రదారుడు అనడం ఎక్కువ తీవ్రమైన నింద (అని వాళ్లు అనుకుంటారు) కాబట్టి ఈ హత్యలో చంద్రబాబు తెలిసే చేయిస్తున్నాడు అంటున్నారు. అంతేకాకుండా 'రాజ్యం' అనే దానిని అఖండమైన ఏకశిలా పదార్థంగా చూడడం వాళ్ళకు తెలిసిన మార్క్సిజం. సిద్ధాంత చర్చ చేసేటప్పుడు అట్లా చూడకూడదని అప్పుడప్పుడు అంటుంటారు గానీ వాస్తవాలను వ్యాఖ్యానించేటప్పుడు ఎప్పుడూ అట్లాగే చూస్తారు.

అయితే ఇప్పుడు వాళ్లేకాక చాలామంది ఈ విధంగానే వ్యాఖ్యానిస్తున్నారు. చర్చలకు ఒప్పుకోకుండ ఉండే వాతావరణం లేదు కాబట్టి ఒక్క పక్క ఒప్పుకున్నట్టు చేస్తూనే,

చర్చలకు గండి కొట్టడానికి ప్రభుత్వం తానే 'ఎన్‌కౌంటర్'లు చేయిస్తున్నదని అంటున్నారు. 'నిన్నటిదాకా పోలీసులు కావాలని అడ్డం పడుతున్నారని అనుకున్నాము గానీ, పద్మక్క ఎన్‌కౌంటర్ తర్వాత ప్రభుత్వమే చేయిస్తున్నదని నమ్ముతున్నాను' అని సిపిఐ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి నిన్నటి దినం అన్నారు.

ఒక వ్యక్తిని పనికిమాలినవాడన్నా కుట్రదారుడన్నా అప్రతిష్టే కాబట్టి ఏమంటే ఏమిటిలే అనుకోవచ్చు. అంతవరకే అయితే తేడా ఏమీ లేదు గానీ, ప్రభుత్వము పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఏ విధంగా అర్థం చేసుకుంటామనేది 'చర్చల' భవితవ్యం దృష్ట్యా ముఖ్యమైన విషయం కాబట్టి ఈ విశ్లేషణ అవసరం.

అధికారంలో ఉండేవాళ్ళు, అధికారానికి దగ్గర ఉండేవాళ్ళు 'నక్సలైట్ సమస్య' అని పిలువబడే రాజకీయ సందర్భాన్ని ఏ విధంగా చూస్తున్నారో మనం తెలుసుకోవడం అవసరం. ఈ విషయంలో వారందరికీ ఒకే అభిప్రాయం ఉందనీ తేడాలున్నట్టు మాట్లాడడం కుట్ర అనీ భావిస్తే పొరబాటు అవుతుంది. పోలీసులందరిలోనూ ఏకాభిప్రాయం లేదు గానీ, తమ చర్యల ద్వారా విషయాన్ని ప్రభావితం చేయగల యువ ఐపిఎస్ ఆఫీసర్లలో ఉంది. వారికి సమాజమంటే తెలీదు, సంఘర్షణ అంటే తెలీదు, రాజ్యాంగం అంటే తెలీదు, తమ చేతిలో ఉన్న బలప్రయోగంతో తాము పీపుల్స్‌వార్‌ను ఒక మూలకు నెట్టేసామనీ, ఇంకొంతకాలం ఇప్పుడున్న హంతక లైసెన్స్ కొనసాగిస్తే ఆ ఉద్యమాన్ని తుదముట్టించే పని పూర్తి చేస్తామనీ వారు నమ్ముతున్నారు. ఈ లోపల చర్చలు అంటూ ఈ ఉదార వాతావరణాన్ని ప్రవేశపెడితే అది పీపుల్స్‌వార్ బలపడడానికి ఉపయోగపడుతుందనీ తాము కష్టపడి (చంపి, కొట్టి, హింసించి) సాధించిన విజయం నీరుగారిపోతుందనీ వారి అభ్యంతరం.

వారి కళ్ళతో (అంటే నక్సలైట్ ఉద్యమాన్ని ఒక రాజకీయ ఉద్యమంగా కాక హింసోన్మాదంగా) చూసినప్పుడు ఈ వైఖరి సులభంగానే అర్థం అవుతుంది. చర్చలు కల్పించే వెసులుబాటును నిర్మాణాన్ని పటిష్టం చేసుకుని అపజయాలను అధిగమించడానికి వాడుకోవాలని పీపుల్స్‌వార్ భావించడం కూడా సత్యమే కదా? ఆ పార్టీని ఒక రాజకీయ ఉద్యమంగా చూసినప్పుడు అదే సత్యం ఇంకొక రకంగా కన్పిస్తుంది. చర్చల వల్ల, చర్చలు ఫలవంతంగా జరపాలన్న ఒత్తిడి వల్ల, ఆ పార్టీ 'అతి'ని విసర్జించి, రాజకీయ నిర్మాణాన్ని బలపర్చుకుంటే చర్చలు అందుకు ఉపయోగపడితే ప్రజలకు మేలే కదా? అవుననడానికి మనం ఆ పార్టీ లక్ష్యమైన సాయుధ రాజ్యాధికార సాధనతో ఏకీభవించనవసరం లేదు. సోషలిజం సాయుధ

పోరాటం ద్వారా సాధ్యమవుతుందని నమ్మనక్కరలేదు. అదెట్లాగున్నా నక్సలైట్ రాజకీయాలు 'అతి'ని విసర్జించగలిగితే ప్రజలకు ఇంకా మేలు చేయగలవనేది సత్యం.

'జనశక్తి రణధీర్' ఆయుధ సమర్పణ ఉత్సవం హైదరాబాద్‌లో జరుగుతున్న రోజు రాష్ట్రమంతా ఆ ఉదంతాన్ని ఒక తీరుగా చూస్తే సిరిసిల్ల గ్రామాలు వేరే తీరుగా చూసినాయి. 'ఏమయినా గానీ, వాళ్ళు పోతే మాకు కష్టమే'ననేది సగటు అభిప్రాయం. ఇది నిజానికి ఆ ఉద్యమాల లోపమే కావచ్చు. ప్రజలకు బలం ఇచ్చే బదులు 'అన్నల' మీద ఆధారపడేటట్టు చేయడం వల్లనే, ఎన్ని లోపాలున్నా 'అన్నలు' ఉంటేనే బతకగలమన్న బలహీనత ఉండడం వల్లనే ప్రజలు అట్లా అంటూ ఉండవచ్చు. అయినప్పటికీ ఆ పార్టీల ఉనికి తెలంగాణలో పేద ప్రజలకు ఇంకా మేలు చేయగలదనేది వాస్తవం. అయినదానికీ కానిదానికీ తుపాకులు బయటకు తీయడం తగ్గించుకుంటే వారు చేయగలది ఇంకా ఉందనేది వాస్తవం. సాధారణ ప్రజలవైపు నుండి చూసినప్పుడు ఈ వాస్తవమే 'చర్చల' సందర్భం. విప్లవకారులు బలప్రయోగ ఉత్సాహాన్ని తగ్గించుకోవాలి, ప్రభుత్వం వారి ఉనికినే పెకిలించి వేయాలని చూడడం మానుకోవాలి అనేది సగటు తెలంగాణ పేదల అభిప్రాయం.

పోలీసులు ఈ విషయం చూడజాలరు  కానీ పాలక ప్రతిపక్షనాయకులకూ కేడర్‌కూ ఈ సంగతి తెలుసును. దీనిని గుర్తించడంలో వారి స్వార్థం కూడా కొంత లేకపోలేదు. 'అన్నలు' బలప్రయోగ ఉత్సాహాన్ని తగ్గించుకున్నట్టయితే తాము కూడా గ్రామాలలో స్వేచ్ఛగా తిరగొచ్చు. రాజకీయాలు చేసుకోవచ్చు. చిన్నవో పెద్దవో కాంట్రాక్టులు చేసుకొని నాలుగు రాళ్లు పోగేసుకోవచ్చు. ఇది ఆయా పార్టీల ఉనికికి సంబంధించిన విషయం కూడా కాబట్టి ఈ సంగతి రాష్ట్ర పాలకులకు తెలియకుండా పోదు, ఈ ఒత్తిడి వారిపైన పని చేయకుండా పోదు. రాజకీయ పార్టీల  నాయకులే కాక తెలంగాణకు చెందిన ధనిక వర్గం ఆలోచనలు కూడా మెజార్టీగా ఇవే.

అయితే తెలంగాణలోని తెలుగుదేశం, కాంగ్రెస్ నాయకులంతా ఈ విధంగానే ఆలోచిస్తున్నారనుకుంటే పొరబాటవుతుంది. ఎప్పటికైనా నక్సలైట్లతో బెడదే కాబట్టి కొన్నాళ్ళు మనం గన్‌మెన్‌లను పెట్టుకొని తిరిగినా ఫర్వాలేదు, వాళ్ళను మొత్తంగా తుడిచిపెట్టివేయడమే మేలు అనుకునే వాళ్ళు కూడా ఉన్నారు. నక్సలైట్ ఉద్యమం ప్రభావం ఇంకా ఎక్కువగా లేని తాలుకాలకు చెందినవారు, స్థానికసమాజంతో నిమిత్తం లేకుండా హైదరాబాద్‌లో పైరవీలు, కాంట్రాక్టులు చేసుకొని బతికే వారు ఈ బాపతులో ప్రథములు. నక్సలైట్లు మొత్తంగా తొలగిపోతేనే తెలంగాణ 'అభివృద్ధి' చెందగలదు కాబట్టి కొన్నాళ్ళు ఇబ్బందులెదుర్కొన్నా పోలీసు చర్యలనే నమ్ముకోవడం మంచిదని భావించే రాజకీయేతర ధనిక వర్గాల వారు కూడా ఉన్నారు.

అయితే అధికార యంత్రాంగంలో కూడా అందరి అభిప్రాయం పోలీసుల అభిప్రాయం కాదు. నక్సలెట్లు జోక్యం చేసుకుంటారన్న బెదిరింపువల్ల ప్రజా సంక్షేమ పథకాల కోసం నిధులు, కొత్త పథకాలు మంజూరు కావడం సులభమైందనీ, కాబట్టి వారు ఉన్నారన్న ఒత్తిడి కొనసాగడమే మంచిదనీ నమ్మేవారూ ఉన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులలో ఈ అభిప్రాయం తరచు కనబడుతుంది.

తెలంగాణేతర మధ్యతరగతి అభిప్రాయం కూడా పోలీసులకు సంపూర్ణంగా అనుకూలంగా లేదు. తుపాకులు, బాంబులు పట్టుకొని తిరిగే వారితో చర్చలేమిటి అని ఆవేశపడిన రోజులు క్రమంగా పోతున్నాయి. తుపాకులు, బాంబులతో సంబంధం ఉండడం ప్రజా జీవితంలో సాధారణ విషయమయ్యే కొద్దీ ఆ ఆవేశం తగ్గి, 'వాళ్ళతో చర్చించి ఏదో ఒక అంగీకారానికి రావడమే మంచిది కదా' అన్న అభిప్రాయం బయటి జిల్లాల శిష్టవర్గాలలో సహితం పెరిగింది.

ఇన్ని రకాల అభిప్రాయాల ఒత్తిడి ప్రభుత్వం మీద ఉంది. వీటిని లెక్కలోకి తీసుకొని ప్రభుత్వం తనదంటూ ఒక నిర్ణయం తీసుకోగలిగి ఉండాలి. తీసుకున్న నిర్ణయానికి ఖచ్చితంగా ఒక రాజకీయ కోణం ఉంటుంది కాబట్టి అది వివిధ రకాల విమర్శలకు గురికాక తప్పదు. అయితే మనకిప్పుడు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నదేమిటంటే ఈ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేక పోతున్నది. పీపుల్స్‌వార్‌తో చర్చలు తప్పకుండా జరుపుతుందా? ఏ అజెండాతో జరుపుతుంది? ఏ షరతులతో జరుపుతుంది? ఆయుధాలు దించకపోతే చర్చలు జరపడం సాధ్యం కాదు అన్నదే ప్రభుత్వం అభిప్రాయమైతే ఆ మాట మొదటే అని ఉండవచ్చు. కానీ అనలేదు. అయితే పోలీసులు ఎవరినైనా చంపినప్పుడల్లా, ఆయుధాలు పట్టుకొని తిరుగుతూ చర్చలంటే ఎట్లా? అని ముఖ్యమంత్రి సమర్థిస్తున్నారు. అదే వారి అభిప్రాయమైతే ఆ మాట ముందే చెప్పేయవచ్చును కదా? అప్పుడు పీపుల్స్‌వార్ చర్చలకు రానని చెప్పేసి ఉండేది కదా? అటువంటి షరతులేవీ లేకుండా చర్చల ప్రక్రియ మొదలుపెట్టి, ఎన్‌కౌంటర్‌లు జరిగినప్పుడల్లా ఈ మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని ఏమనాలి? రాజకీయ విజ్ఞతకు తలొగ్గి చర్చలు పెట్టుకోవడానికి ఒప్పుకుంటూ కూడా పోలీసులను అదుపు చేయలేక వారి ప్రస్తావన వచ్చినప్పుడు వారి పాట పాడే చేతకాని నాయకుడనుకోవాలి. ఇంతటి అసమర్థ పాలకులు మన రాష్ట్రాన్ని ఏలుతుండడం నిజంగా మన దురదృష్టం.

# ఎన్నికలలో పోటీ చేయడానికి నేరస్తులందరూ అనర్హులేనా?

సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను వమ్ము చేయడానికి సకల రాజకీయ పార్టీలూ ఒకటయి శరవేగంగా ఒక చట్టం రూపొందించడం వెక్కిరింతకూ అపహాస్యానికీ గురి కావడం సహజం.

సుప్రీంకోర్టు గొప్ప బుద్ధితో సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రయత్నించగా, క్షుద్రమైన రాజకీయ శక్తులు దానిని వమ్ము చేస్తున్నాయని అభిశంసించడం జరుగుతున్నది. కానీ ఒక విషయంలో మాత్రమే ఇది సత్యం. ఎన్నికలలో నిలబడేవారు ముందుగానే తమ ఆస్తిపాస్తుల లెక్కలు ప్రమాణ పత్రం మీద రాసి ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలన్న ఆదేశాన్ని రాజకీయ పార్టీలు తిరస్కరించడం వారి ప్రయోజనాలకు అవసరమే కావచ్చును గానీ ప్రజలకూ ప్రజాస్వామ్యానికీ కాదు. రాసి ఇచ్చినంత మాత్రాన వాళ్లకొచ్చే నష్టమేమీ లేనప్పుడు ఇంత గట్టిగా ఎందుకు వ్యతిరేకిస్తున్నారా అని మనం ఆశ్చర్యపోవచ్చు. కానీ ఆఫిడవిట్ మీద రాసి ఇవ్వాలన్న నియమాన్ని ఆమోదిస్తే 'ఎటుపోయి ఎటు వస్తుందో'నని ఆందోళన చెందడం ముందుచూపు గల వారికి సహజమే కాబట్టి' ఆశ్చర్యపోయేవాళ్లే అమాయకులు.

అయినప్పటికీ వామపక్ష పార్టీలు సహితం ఇతర పార్టీలతో ఈ విషయంలో గొంతు కలపడం విచిత్రమే. వామపక్ష పార్టీలు తాము చెప్పుకునేంత పరిశుద్ధంగా లేవని అందరికీ తెలుసును గానీ అభ్యర్థులు తమ ఆస్తిపాస్తుల వివరాలు ముందుగా ప్రకటించాలన్న నియమానికి భయపడే స్థితిలో ఉన్నాయనుకోలేదు. లేక ఈ అభ్యంతరానికి ఏదో నిగూఢమైన గతి తార్కిక కారణం ఉందా?

అయితే అభ్యర్థులు తమ విద్యార్హతలను కూడ ఎన్నికకు ముందు ప్రమాణ పత్రంలో ప్రకటించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని రాజకీయ పార్టీలు తిరస్కరించడం సబబే

అది సబబేనని చాలా మందే గుర్తించారు కానీ, ఆస్తులకు సంబంధించిన ఆదేశాన్ని తిరస్కరించినందుకు రాజకీయ పార్టీలను విమర్శించినంత ఘాటుగా కాదు సరికదా, అందులో నూరవ వంతు తీవ్రత కూడా సుప్రీంకోర్టు చేసిన ఈ ప్రతిపాదనపైన వచ్చిన విమర్శలో ధ్వనించడం లేదు. కానీ నిజానికి ఈ ప్రతిపాదన కేవలం తప్పు కాదు. అవమానకరమైనది. తక్కువ చదువుకున్న వారి కంటే ఎక్కువ చదువుకున్న వారు మెరుగైన ప్రజా ప్రతినిధులవుతారని ఎవరైనా అనగలరా? చదువుకునే అవకాశాలు కుదించివేస్తూ, నువ్వెంత చదువుకున్నావో చెప్పు అని అడగడం పేదలను అవమానపర్చడం కాదా? సుప్రీంకోర్టు ఈ రకమైన అభిప్రాయం వ్యక్తం చేయడం యాదృచ్ఛికం కాదు. ఈ మధ్య కాలంలో దేశంలోని శిష్టవర్గాలు 'ఎన్నికల సంస్కరణల' గురించి ఎప్పుడు మాట్లాడినా ప్రజల నుండి రాజకీయ వ్యవస్థను ఎట్లా కాపాడాలన్నది వారి ప్రధాన లక్ష్యంగా ఉంటున్నది. జాతీయ లా కమిషన్ జస్టిస్ జీవన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల సంస్కరణల రిపోర్టు స్వభావం కూడా అదే. ప్రభుత్వాలు స్థిరంగా ఉండాలి. 'ప్రజాకర్షక' పథకాలు అమలు చేయాలన్న ఒత్తిడికి ప్రభుత్వాలు లొంగకూడదు. సంక్షేమం స్థానంలో 'అభివృద్ధి'కి పెద్దపీట వేసే రాజకీయార్థిక 'సంస్కరణల'లో చట్టసభలు భాగం కావాలి ఇత్యాది ఆలోచనల ప్రేరణ ఇక్కడ ప్రధానంగా పనిచేస్తున్నది. సుప్రీంకోర్టు చేసిన ఈ సూచన ఈ కోవకు చెందినదే.

చదువుకున్న వాళ్ళకు మాత్రమే ఓటు హక్కు ఉండాలనీ లేదా పోటీ చేసే అర్హత వారికే పరిమితం కావాలనీ  కొందరు వాదించారు. రాజ్యాంగకర్తలు దానిని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. సమర్థమైన ప్రాతినిధ్యానికి అది తప్పనిసరి కాదని గుర్తించి తిరస్కరించారు. ఇప్పుడు ప్రజలలో చదువులు పెరిగాయే తప్ప తగ్గలేదు. అయినప్పటికీ పాత వాదన ముందుకు తీసుకురావడం ఇప్పుడు వీస్తున్న ప్రజావ్యతిరేకమైన కొత్తగాలుల వల్లనే తప్ప వేరే ఏమీ కాదు. ఇక నేరాలు, నేర చరిత్రలు గురించి ఇద్దరి ప్రతిపాదనలూ అసంతృప్తికరమైనవే. అభ్యర్థులు తమ నేర చరిత్రను కూడా ఎన్నికలకు పూర్వం ప్రమాణ పత్రంలో ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలని సుప్రీంకోర్టు అనింది. రాజకీయ పార్టీలు దానికి అంగీకరించలేదు గానీ, రెండు కేసులలో కోర్టు ఒక అభ్యర్థిపైన అభియోగాలను ప్రకటించినట్టయితే, అవి 'తీవ్రమైన' నేర అభియోగాలైతే, ఆ అభ్యర్థిని అనర్హునిగా ప్రకటించాలని చట్టమే చేయబోతున్నారు.

'తీవ్ర అభియోగం' అంటే ఏమిటి? పత్రికలో వచ్చిన వార్తలను బట్టి, శిక్ష తీవ్రతను బట్టి నేరాన్ని తీవ్రమైనదిగా భావించాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నట్టున్నాయి.

ఇది చాలా అసంతృప్తికర అభిప్రాయం. సుప్రీంకోర్టు తీర్పును మొదట చర్చించినప్పుడు, 'రాజకీయ నేరాలను' మినహాయించాలని వామపక్ష పార్టీలు అన్నాయి. రాజకీయ నేరాలను నిర్వచించడంలో ఇబ్బందులున్నప్పటికీ, ఇది సరైన దిశలో సాగిన ఆలోచనే.

కాని నిజానికి వేటిని మినహాయించాలి అని చర్చించడం కంటే ఏ నేరాలకు ఎన్నికల చట్టంలోని నిషేధాన్ని పరిమితం చేయాలి అని చర్చించడం సబబుగాను ఫలప్రదంగాను ఉంటుంది. ఒక వ్యక్తి ప్రజా ప్రతినిధిగా ఉండడానికి తగడు అనే అభిప్రాయానికి రాగల నేరాలకు ఆ జాబితాను పరిమితం చేయాలి. రేప్ చేసిన వ్యక్తి, అంటరానితనం పాటించిన వ్యక్తి, వ్యాపార లావాదేవీలలో మోసం చేసి వేరొకరి ఆస్తిని కాజేసిన వ్యక్తి, ప్రజాధనాన్ని స్వంతం చేసుకున్న వ్యక్తి ఇత్యాది నేరాలకు పాల్పడిన వ్యక్తులు ప్రజాప్రతినిధులు కావడానికి అనర్హులంటే అర్థం ఉంది. ఇవన్నీ శిక్ష పరిమాణం రీత్యా 'తీవ్రమైన' నేరాలు కాకపోవచ్చు. కాని నైతికంగా తీవ్రమైన నేరాలు.

విచిత్రంగా అనిపించవచ్చును గానీ హత్యా నేరాన్ని మొత్తంగా ఈ కోవలో వేయలేము. కారణాన్ని బట్టి, ఉద్దేశ్యాన్ని బట్టి, పరిస్థితులను బట్టి ఒక హత్య ఈ కోవలోకి రావచ్చు, రాకపోవచ్చు. చట్టం తీవ్రమైనదిగా భావించే బందిపోటు చర్య అయినా అంతే. రాజద్రోహం, ప్రభుత్వంపైన యుద్ధం చేయడం మొదలైన నేరాలు కూడా అంతే. ఇవి శిక్షరీత్యా తీవ్రమైన నేరాలే. కానీ ఈ కోవకు చెందిన నేరాలు రెండింటిలో అభియోగ పత్రాన్ని కోర్టు స్వీకరించినట్టయితే ఇంక ఆ వ్యక్తి ఎన్నికలకు అర్హత కోల్పోవాలనడం ప్రజా ప్రాతినిధ్య ప్రమాణం దృష్ట్యా అవసరం కాదు. న్యాయమూ కాదు. బందిపోటుగా ఉండిన పూలన్‌దేవి బలహీన వర్గాల ప్రతినిధిగా రాజకీయలలోకి ప్రవేశించడం హర్షించదగ్గ పరిణామంగా చాలామంది భావించారు. ఈ కొత్త చట్టం అప్పుడు ఉన్నట్టయితే అది సాధ్యం అయ్యేదా?

కాశ్మీరులో మిలిటెంట్లందరినీ సాయుధ పోరాటం విడిచిపెట్టి ఎన్నికలలో పాల్గొనవలసిందిగా పెద్దలంతా ఆహ్వానిస్తున్నారు. అది కాశ్మీరీల ప్రయోజనాల రీత్యా సరైన నిర్ణయమవుతుందా కాదా అన్నది మన దృష్టిని బట్టి ఉంటుంది. అయితే రేపు పార్లమెంటులో ఈ ప్రతిపాదిత చట్టాన్ని చేసినట్టయితే కాశ్మీరీ మిలిటెంట్లెవ్వరూ ఎన్నికలలో పాల్గొన లేకపోవచ్చు. ఎందుకంటే వారెవ్వరిపైనా రెండు కంటే తక్కువ అభియోగ పత్రాలు ఉండవు. మరి అది ప్రజాస్వామ్యానికి మంచిదా?

ఆగస్టు 4, 2002

# తోలాపిలో కులనిర్మూలన

**మొ**న్న ఒక మూడు రోజులు హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రతినిధులకూ పీపుల్స్‌వార్ ప్రతినిధులకూ మధ్య జరిగిన 'విధి విధానాల' చర్చలలో ప్రభుత్వం తరఫున పాల్గొన్న ఇద్దరిలో ఒకరైన తమ్మినేని సీతారాం గురించి శ్రీకాకుళం బయట పెద్దగా తెలీదు.

శ్రీకాకుళంకు పదికిలోమీటర్ల దూరాన ఆముదాలవలస అనే ఊరుంది. ఆ ఊరినుండి పార్వతీపురం పోయే రహదారి మీద తమ్మినేని సీతారాం కొత్తగా కట్టుకున్న భవంతిని చూస్తే అతని గురించి కొంచెం తెలుస్తుంది.

నిగాహ్

అటువంటి భవంతులు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సైతం రెండు మూడు కంటే ఎక్కువ ఉండవు. ఇక్కడ ఎబ్బెట్టుగా కనిపించనిది ఆముదాలవలసలో ఎబ్బెట్టుగా కనిపించగలదని కొత్తగా కోట్లు గడించిన బాపతు మనుషులకు తోచదు. కానీ పీపుల్స్‌వార్‌తో చర్చలకు తెరపడిందని తెలియగానే 'ఆముదాలవలసలో తమ్మినేని బంగళాను నక్సలైట్లు పేల్చేసారంట' అన్న వదంతి శ్రీకాకుళంలో శరవేగంగా వ్యాపించడాన్ని బట్టి చూస్తే ప్రజలకది చాలా ఎబ్బెట్టుగా కనిపించిందని అర్థం అవుతుంది.

తమ్మినేని సీతారాంది పొందూరు మండలం. అదే మండలంలో అతని స్వగ్రామానికి సమీపంలోని తోలాపి అనే ఊరిలో అతని బంధువర్గం జూలై 15న దళితులపైన జరిపిన అమానుషమైన దాడిని చూస్తే మరికొన్ని విషయాలు అర్థం అవుతాయి.

తోలాపిలో కాళింగులు దాదాపు 2000 మంది ఉన్నారని అంచనా. కాళింగులు 'సామాజికంగా, విద్యాపరంగా' వెనుకబడి ఉన్న కారణంగా బిసి కులాల జాబితాలో ఉన్నారు. అయితే ఆ జిల్లాలోని బ్రాహ్మణేతర కులాలలో ప్రధాన పెత్తందారీ కులం కాళింగులే. భూమి యాజమాన్యంలోనూ వర్తక వ్యాపారాలలోనూ రాజకీయాలలోనూ వారిదే పైచేయి. గుంపును పోగుచేసి గూండాయిజం కూడ బాగా చేయగలరు.

కులవివక్ష, అంటరానితనం పోగొడతామంటూ చంద్రబాబు, ఆయన కేబినెట్ మంత్రులూ ఆ మధ్య కొంత అల్లరి చేసిన సంగతి జ్ఞాపకం ఉంది కదూ? చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని తన స్వంత ఊరి పరిసర గ్రామాలలో చేపట్టకుండ జాగ్రత్త పడినట్టే అతని మంత్రులు కూడ వారి వారి స్వంత ప్రాంతాలలో జాగ్రత్త పడినట్టున్నారు.

కాబట్టి తమ్మినేని సీతారాంగారు తన పక్క ఊరయిన తోలాపిలో అంటరానితనం పోగొట్టే ప్రయత్నమేమీ చేపట్టలేదు. ఆ ఊరి టీషాపులలో రెండు గ్లాసుల 'వ్యవస్థ' ఉంది. చాకలి, మంగలి కులస్తులు దళితులకు తమ సేవలు విక్రయించని అవ్యవస్థా ఉంది. ఆ మధ్య జన్మభూమి కార్యక్రమం ఆ ఊరిలో జరిగినప్పుడు సిపిఐ(ఎం) వారి కులవివక్ష వ్యతిరేక సంఘం సహాయంతో తోలాపి దళితులు తాము అనుభవిస్తున్న అవమానకరమైన స్థితి గురించి అధికారులను నిలదీసారు. విడిగా అర్జీలు సమర్పిస్తే ఏమయ్యేదో గానీ, జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నిలదీసేసరికి అధికార్లు కొంచెం చలించారు.

ఆ విధంగా మొదలయిన ఆందోళన చర్చలకు దారి తీసింది. చాకలి, మంగలి కులస్థులు వారంలో ఒకరోజు దళితుల పనులు చేసేటట్టు ఒప్పందం జరిగింది. ఆ ఒక్క రోజును మంగళవారంగా ఎంచుకోవడం వెనుక వెక్కిరింత ఉండి ఉండవచ్చును. ఎందుకంటే మంగలి కులస్తుల కులాచారం ప్రకారం మంగళవారంనాడు క్షవరం చేయరు.

నిజానికి తోలాపిలో చాకలి, మంగలి కులాల ఇళ్లు దళితుల ఇళ్లను ఆనుకునే ఉన్నాయి. కాళింగులు కోపం చేసుకుంటారన్న భయం వల్ల తప్ప దళితుల పనులు చేయకూడదని తమకేమీ లేదని వారంటున్నారు. కేవలం 200 మంది ఉన్న దళితులు 2000 మంది ఉన్న బలమైన సవర్ణ కులంతో తలపడడం సాహసమే. అయినా సాహసం చేసి సాధించారని అందరూ అనుకున్నారు.

జూలై 16 (మంగళవారం) నుండి ఒప్పందం అమలు కావలసి ఉండింది. 15వ తేదీ పొద్దున్న కొన్ని వందల మంది కాళింగులు తోలాపి దళితవాడ మీద దాడి చేసారు. కులవివక్షతో సంబంధం లేని ఒక భూవివాదాన్ని ఆసరా చేసుకొని దాడి చేసారు. దళితులలో కీళ్లు భద్రంగా ఉన్నవారు పారిపోగా మిగిలిన వాళ్లు బాగా దెబ్బలు తిన్నారు. ఆ ఊరిలో ఉన్న 40 దళిత కుటుంబాల ఇళ్ళూ ధ్వంసం అయ్యాయి. ఇంటి కప్పులు పీకి పెంకులు ధ్వంసం చేశారు. ఇళ్లలోని వంట సామగ్రిని పగలగొట్టి ఎందుకూ పనికిరాకుండా చేశారు. ఒకరిద్దరి దగ్గరున్న టీవిలను విరగ్గొట్టారు. ఒక ఆవును కూడా చంపారు. బహుశా దళితునిగోవు పవిత్ర జంతువు కాదేమో. తిండి

గింజలు ఇతర వస్తువులు లూటీ చేసారు. దహనం చేసారు. జూలై 15 పొద్దున్న 8 గంటలనుండి మధ్యాహ్నం 12 దాకా కాళింగుల స్వైర విహారం జరిగింది.

తన కులం వారు, తన ప్రాంతం వారు, తన బంధువులైన వారు చేసిన ఈ దారుణాన్ని తమ్మినేని సీతారాం ఖండించలేదని నేను మీకు చెప్పనవసరం లేదు. ఆ ఊరికి పోయి వారిని కోప్పడి బుద్ధిచెప్పలేదని అసలే చెప్పనవసరం లేదు. అయితే దుండగులను వెనక నుండి ప్రోత్సహించిన పెద్దమనుషులు తమ్మినేని సీతారాం పేరు చెప్పి పోలీసులను ఆమడ దూరం ఉంచగలిగారని చెప్పాలి.

నెలాఖరు దాకా కూడా తోలాపి దళితులలోని యువకులెవ్వరూ గ్రామానికి తిరిగి రాలేదు. మామూలుగా ఒక నేరం జరిగినప్పుడు నేరస్తుడు పరారీలో ఉంటాడు. బాధితులు ధైర్యంగా ఇంట్లో ఉండి అందరి సానుభూతి పొందుతారు. కానీ కారంచేడు నుండి ఇప్పటిదాకా దళితులపైన దాడి జరిగిన ప్రతీ సంఘటనలోనూ బాధితులు పరారీలో ఉండడం, నేరస్తులు కాలర్ ఎగరేసుకొని ఊరిలో తిరగడం చూస్తున్నాం. తోలాపి అందుకు మినహాయింపు కాదు.

పొందూరు తమ్మినేని సీతారాం స్వంత మండలమే కాదు. స్పీకర్ ప్రతిభా భారతి స్వంత మండలం కూడ. ఆమె స్వస్థలం తోలాపికి దగ్గరే. అయితే 'మీ మీద జరిగిన దాడి గురించి ప్రతిభా భారతి గారికి చెప్పలేదా' అని తోలాపి దళితులను అడిగితే, 'చెప్తే ఇంక ఆరునెలలు ఆమె జిల్లాకే రాదు, చెప్పకపోతే వేరే పనులమీదయినా వచ్చి పోతుందేమోనని చెప్పలేదు' అని వారి జవాబు!

ఆగస్టు 18, 2002

# గుజరాత్‌ను కాశ్మీర్‌తో పోల్చడం సబబేనా?

**కా**శ్మీర్‌కు చెందిన కొన్ని లక్షల మంది హిందువులు శరణార్థుల శిబిరాలలో ఉండగా ఎన్నికలు జరపడానికి సిద్ధపడిన ఎన్నికల కమిషన్, అది సబబేనంటున్న సెక్యులర్ పార్టీలు, గుజరాత్ విషయానికొచ్చే సరికి అక్కడ ముస్లింలు చాలామంది ఇంకా శరణార్థులుగా ఉండగానే ఎన్నికలు జరపడమేమిటని ప్రశ్నించడం ద్వంద్వ ప్రమాణాలకు పరాకాష్ట అంటూ వెంకయ్య నాయుడు, అరుణ్ జైట్లీ వంటివారు దబాయించడం కొన్ని రోజులుగా చూస్తున్నాం.

పైకి చూడడానికి అది న్యాయమైన అభ్యంతరంగానే కనిపిస్తుంది. లౌకికవాదుల ఈ ద్వంద్వ ప్రమాణం కుహనా లౌకిక వాదానికి తాజా ఉదాహరణగా కనిపిస్తుంది.

కానీ కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ రెండు సందర్భాలకూ పోలికే లేదని అర్థం అవుతుంది.

కాశ్మీర్‌లో హిందువులు శరణార్థులు కావడానికి ప్రభుత్వం కారణం కాదు. గుజరాత్‌లో ప్రభుత్వమే హంతకులతో చేతులు కలిపి ముస్లింలను క్యాంపులపాలు చేసింది.

కాశ్మీర్‌లో ఎన్నికలు జరపాలన్న నిర్ణయం మత విద్వేషాన్ని వాడుకొని ప్రయోజనం పొందాలనే ఉద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం కాదు. కాశ్మీర్ అసెంబ్లీ గడువు తీరిపోయింది కాబట్టి అక్కడ ఎన్నికలు జరుపుతున్నారు. గుజరాత్‌లో ఎన్నికలు సహజంగా వచ్చినవి కావు. ముస్లింల ఊచకోత వల్ల గుజరాతీ సమాజంలో హిందూత్వ వాదానికి పెరిగిన గిరాకీ కరువు కారణంగానో, వేరే ఏ కారణంగానో చల్లారిపోయే లోపల దానిని వోట్లుగా మారకం చేసుకోవాలన్న దుర్మార్గమైన ఆరాటం అక్కడ ఎన్నికలు గడువుకంటే ముందే రావడానికి కారణం.

కాశ్మీర్‌లోని హిందూ శరణార్థులను తిరిగి తమ గ్రామాలకు పంపించడం ఆ రాష్ట్ర ప్రభుత్వం తలచుకున్నంత మాత్రాన జరిగిపోయేది కాదు. బహుశా 'కాశ్మీర్ సమస్య' పూర్తిగా పరిష్కారం అయ్యేంతవరకు వాళ్లు వెనక్కి పోలేరు. అప్పటిదాకా ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరపొద్దనడంలో అర్థం లేదు.

గుజరాత్ పరిస్థితి అది కాదు. హిందూత్వవాద గుండాయిజాన్ని రాష్ట్ర ప్రభుత్వం తలచుకుంటే అదుపు చేయగలదు, ముస్లింలకు భద్రత కలిగించగలదు, వారు తిరిగి గ్రామాలకు పోగలరు. ఆ పని చేయడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటే రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనే చేసేది కాదనుకోండి! కానీ దీనికి కారణం దుర్మార్గమైన రాజకీయ దురాలోచనే తప్ప కాశ్మీర్ లాగా రాష్ట్ర ప్రభుత్వం అదుపులో లేని భౌతిక పరిస్థితి కాదు.

పైగా, శరణార్థులుగా కాశ్మీర్ పండిట్‌లకూ గుజరాత్ ముస్లింలకూ పోలికే లేదు. మన దేశంలో కాశ్మీర్ పండిట్‌లతో సమానంగా ప్రభుత్వం ఆదరించిన శరణార్థులు వేరే ఎవరూ ఈ యాభై అయిదేళ్లలోనూ కనిపించరు. అయినప్పటికీ వాళ్లు అసంతృప్తిగానే ఉన్నారంటే అది 'శరణార్థి' కావడంలో ఉన్న అసంతృప్తే తప్ప గుజరాత్‌లోని ముస్లింల శిబిరాలకు జమ్మూలోని కాశ్మీర్ పండిట్‌ల శిబిరాలకు పోలికే లేదు.

కాశ్మీర్‌లోని హిందువులందరూ పండిట్‌లే–అంటే బ్రాహ్మణులే. వారికి కాశ్మీర్‌లో భూములున్నాయి. తోటలున్నాయి. చదువు ఉంది. ఉద్యోగాలున్నాయి. కాశ్మీర్‌లోయ జనాభాలో 3 శాతం మాత్రమే ఉన్న పండిట్‌లు అక్కడి రాజకీయ ఆర్థిక జీవితంలో దానికి కనీసం అయిదు రెట్లు ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నారు. ఆ చల్లటి జీవితాన్ని విడిచిపెట్టి జమ్మూనగరం శివార్లలో వెలివేసిన వారిలాగ ప్రభుత్వం కట్టిచ్చిన రెండు గదుల ఇళ్లలో బతకడం, వేసవిలో ఢిల్లీని తలపించే జమ్మూ ఎండలు భరించడం, ఉద్యోగాల వేటలో స్థానికులతో పోటీ పడలేక వెనుక పడడం ఇవన్నీ పండిట్‌లకు కష్టం కలిగిస్తుండవచ్చు. చారిత్రక స్పృహతో ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి వారు సిద్ధంగా ఉన్నట్టయితే వారి కష్టాలను అర్థం చేసుకోవడానికి మనమూ సిద్ధం కావచ్చును.

అయితే వేరే ఏ శరణార్థులకు లేని విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం వారికి కాలనీలు, ఎల్ఐజి స్థాయివే కానివ్వండి–కట్టిచ్చింది. కాశ్మీర్‌లో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న వారికి జమ్మూలో ఊరికే కూర్చోబెట్టి జీతాలు–ఇంక్రిమెంట్లతో సహా–ఇస్తున్నది. ఉద్యోగులు కానివారికి కూడా నిత్య జీవిత అవసరాలు–బియ్యం, పప్పు, చక్కెర

వగైరాలు ఉచితంగా ఇవ్వడమే కాక నెలకు కుటుంబానికి వెయ్యి లేక పదిహేనువందలకు తక్కువ కాకుండా భత్యం ఇస్తున్నది. వాళ్లు జమ్మూలో భయపడుతూ బతకడం లేదు. స్వేచ్ఛగా, సగౌరవంగా బతుకుతున్నారు. ప్రభుత్వాన్నీ పాకిస్తాన్‌నూ ఆడిపోసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఏమయినా, స్వంత గడ్డనుండి బలవంతంగా పారిపోయి రావడం బాధాకరమైన పరిస్థితి అంటే ఒప్పుకోవలసిందేగానీ వారికీ గుజరాత్‌లోని ముస్లిం శరణార్థులకూ పోలికే లేదు.

గుజరాత్‌లో శరణార్థులకు ప్రభుత్వం ఒక్క శిబిరం కూడ నెలకొల్పలేదు. రేషన్ తప్ప వేరే ఏ సహాయమూ చేయలేదు. శిబిరాలలో కనీస సదుపాయాలు లేవు. దేశంలోని ప్రతీ నాయకుడూ నాయకురాలూ సందర్శించిన షా ఆలం క్యాంపు వంటి శిబిరాలలో సహితం వెయ్యి మందికి ఒక మరుగుదొడ్డి ఉందంటే ఆ శిబిరాల పరిస్థితి ఊహించుకోవచ్చు.

సరే, ఇప్పుడు శిబిరాలు చాలావరకు మూతపడ్డాయి. అక్కడ బతుకుతున్న జనాభా తగ్గింది. అయితే శిబిరాలు ఖాళీ చేసిపోయిన వారు తమ స్వగ్రామాలలో సగౌరవంగా బతకడం లేదు. చాలామంది స్వస్థలాలకు తిరిగి పోనేలేదు. ఎక్కడో తమ బంధువుల ఊర్లలోనో ముస్లింలు మెజారిటీగా ఉన్న జనావాసాలలోనో తలదాచుకున్నారు. తిరిగి స్వస్థలాలకు పోయినవారు కూడా అనేక విషయాలలో రాజీపడి భయపడుతూ బతుకుతున్నారు.

అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే ఈ అభద్రతనూ దానికి దారితీసిన పరిస్థితులనూ పావులుగా వాడుకొని మరొక అయిదేళ్లు అధికారంలో ఉందామన్న బిజెపి దుర్బుద్ధే గుజరాత్‌లో ఎన్నికల ప్రతిపాదనకు దారితీసింది. అందుకే ప్రధాన ఎన్నికల కమిషనర్ నుండి జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ దాకా అందరికీ ఈ ఎన్నికల ప్రతిపాదన అంత కోపం తెప్పించింది. కాశ్మీర్ పరిస్థితి దీనితో ఏ రకంగానూ పోల్చదగ్గది కాదు. ఫరూఖ్ అబ్దుల్లాలో పొగడదగ్గ గుణాలేవీ లేకపోవచ్చును గానీ ఆ రాష్ట్రంలోని మిలిటెన్సీ అతని సృష్టి కాదు, అతను ఎదుర్కొనగలిగి ఉండీ ఎదుర్కొనకపోవడం వల్ల సాగుతున్నదీ కాదు.

ఈ విషయం గుర్తించడంలో ద్వంద్వ ప్రమాణాలేమున్నాయి?

సెప్టెంబర్ 1, 2002

# మన్నెవార్‌లకు మద్దతు ఇద్దాం

**మే**లు చేయడానికి తొందర ఉండదు గానీ నష్టం చేయడానికి అధికారాన్ని ఉత్సాహంగా వినియోగిస్తారు.

ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం దేశంలో షెడ్యూల్డు తెగల జాబితాలో ఎన్నో మార్పులు చేయాలని నిర్ణయించింది. వాటిలో కొన్ని కేవలం సాంకేతికమైన మార్పులు కాగా, మన రాష్ట్రానికి చెందిన రెండు ముఖ్యమైన నిర్ణయాలు మాత్రం చాలా ఆందోళన కలిగిస్తున్నాయి.

నిగాహ్

అవేమిటంటే మన్నెవార్, చెంచువార్ అనే రెండు తెగలను షెడ్యూల్డు తెగల జాబితా నుండి తొలగించాలన్న నిర్ణయాలు. వారిని ఎస్‌టి జాబితా నుండి తొలగించమని ఎవ్వరూ కేంద్ర ప్రభుత్వాన్ని అడగలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ సిఫారస్ చేయలేదు. ఎవరూ అడగకుండానే జాతీయ ఎస్.సి, ఎస్.టి కమీషన్ ఆ రెండు తెగలను తొలగించాలని సిఫారస్ చేసిందంట. కేంద్ర కేబినెట్ ఆమోదించి బిల్లు తయారు చేసేసింది. పెట్రోల్ పెంపుల గొడవ కారణంగా పార్లమెంటులో వేరే పని ఏమీ జరగకపోవడం వల్ల మన్నెవార్‌లూ, చెంచువార్‌లూ ప్రస్తుతానికి బతికిపోయారు గానీ లేకపోతే ఈ పాటికి 'ఎస్‌టి'లు కాకుండా పోయేవారే.

చెంచువార్‌లు ఆందోళన చేసే స్థితిలో కూడా లేనట్టున్నారు గానీ ఆదిలాబాద్ జిల్లా వాసులైన మన్నెవార్‌లు కొంత ఆందోళన చేస్తున్నారు. అటవీ ప్రాంతవాసులైన కొలాం తెగకు మన్నెవార్‌లు సన్నిహితులు. మన్నెవార్‌లు తమను తాము తెలుగు మాట్లాడే కొలాంలుగా భావించుకుంటారు. (కొలాంలు మాట్లాడే భాష కొలామీ) అటవీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతంలోకి ప్రవేశించి, అక్కడి తెలుగు ప్రజల భాషా సంస్కృతులు కొంతమేరకు అలవర్చుకున్న కొలాంలు మన్నెవార్లు.

నిజానికి మన రాష్ట్ర ప్రభుత్వం మన్నెవార్‌లను కొలాంలతో పాటు అత్యంత వెనుకబడిన తెగ (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్)గా గుర్తించింది. పిటిజిలు ఆదివాసులలో

కూడా వెనుకబడిన తెగలుగా గుర్తింపు పొందిన తెగలు. నల్లమల అడవులలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని కొలాంలు పిటిజిలే. వారితో పాటు వారికి చాలా సన్నిహితులైన చెంచువార్‌లనూ మన్నెవార్‌లనూ కూడ మన రాష్ట్ర ప్రభుత్వం పిటిజిలుగా గుర్తించి చెంచులు, కొలాంలతో సమానంగా ప్రత్యేక పథకాలూ నిధులూ కేటాయించింది.

రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ఈ విధంగా ఉండగా, కేంద్ర ప్రభుత్వం వారిని ఏకంగా షెడ్యూల్డు తెగల జాబితా నుండే తొలగించాలని నిర్ణయించింది. మన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈ సంగతి విని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మన్నెవార్ల పేరు మీద గిరిజనేతరులు సర్టిఫికేట్లు పెట్టి అక్రమంగా రిజర్వేషన్లు పొందుతున్నారని, అటువంటి దొంగ సర్టిఫికేట్లు చాలా దొరికాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ రెండేళ్ళ క్రింద జాతీయ ఎస్‌సి, ఎస్.టి. కమిషన్‌కు రిపోర్టు పంపినట్టు మాత్రం చెబుతున్నారు. బహుశా ఈ రిపోర్టు ప్రాతిపదికగానే జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ మన్నెవార్లను ఎస్.టి. జాబితా నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేసిందేమోనని అంటున్నారు. అంతే తప్ప మన రాష్ట్ర ప్రభుత్వం నుండి అటువంటి సూచనేదీ పోలేదంటున్నారు.

దొంగసర్టిఫికేట్ల మాట నిజమే కావచ్చు. మన్నెవార్ల గూడెంలు మైదాన ప్రాంతాలలో కూడా ఉన్నాయి కాబట్టి ఆ పరిసరాలలో నివసించే గిరిజనేతరులు వారి పేరు మీద సర్టిఫికేట్లు పొందుతుండవచ్చు. కానీ దానికి మన్నెవార్‌లు ఎట్లా బాధ్యులవుతారు? తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కొండ రెడ్ల పేరు మీద రెడ్లు, కొండ కాపుల పేరు మీద కాపులు, కొండ కమ్మర్ల పేరు మీద కమ్మరులు దొంగ సర్టిఫికేట్లతో కాలేజీలలో సీట్లు, ఉద్యోగాలు పొందిన ఉదంతాలు చాలా ఉన్నాయి. అంతమాత్రం చేత కొండ రెడ్లను షెడ్యూల్డు తెగల జాబితా నుండి తొలగించాలని ఎవరూ ఎన్నడూ అనలేదు. అంటే అది చాలా అన్యాయం అవుతుంది.

మరి మన్నెవార్ల విషయంలో ఈ నిర్ణయానికి ఎందుకు వచ్చినట్టు? పైగా ఈ ప్రతిపాదన ఉన్నట్టు మన్నెవార్‌లకు జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్‌గానీ కేంద్ర ప్రభుత్వం గానీ తెలపలేదు. వారి వివరణ, లేక ప్రతిస్పందన కోరలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపి వారి అభిప్రాయం కోరలేదు. కనీసం జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రిపోర్టును రాష్ట్ర అసెంబ్లీ ముందు పెట్టలేదు. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రాష్ట్రపతికి సమర్పించే ఏ రిపోర్టునైనా పార్లమెంటులోనే కాక, సంబంధిత రాష్ట్ర అసెంబ్లీలో కూడా చర్చకు పెట్టాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 338(7) అంటుంది. ఆ పనేమీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నేరుగా మన్నెవార్‌లను,

చెంచువార్‌లను ఎస్టీ జాబితా నుండి తొలగిస్తూ బిల్లు రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది.

ఈ కారణంగా కోర్టులు ఆ చట్టాన్ని రేపు కొట్టేయవచ్చు. కానీ ఆ 'రేపు' ఎప్పుడు? షెడ్యూల్డు తెగగా గుర్తింపు కోల్పోయిన మన్నెవార్లు కోర్టులో కేసు వేయాలి, అయిదేళ్ళు ఆరేళ్ళు గడచిన తర్వాత న్యాయం పొందాలి. పెట్రోల్ పంపుల లైసెన్స్‌లు అక్రమంగా పంపిణీ చేసారని కేంద్ర ప్రభుత్వం వాటిని ఒక్క దెబ్బతో రద్దు చేయగా, మంత్రి చేసిన తప్పుకు పంపుల వాళ్ళనెందుకు శిక్షించాలంటూ కోర్టులు లైసెన్స్‌ల రద్దుపైననే స్టే ఇచ్చాయి. మరి మన్నెవార్‌లకూ స్టే ఇస్తారా? ఇవ్వకపోతే కోర్టులో తేలేవరకు వారేమవుతారు?

ఎస్‌టిలుగా ఉండడానికి మీరు తగరు, కొంచెం బాగుపడిపోయారని ఎస్‌టి జాబితా నుండి బయట పెట్టినట్టయితే వాళ్లు బిసి జాబితాలోకి పోతారను కుంటున్నారేమో మీరు. అటువంటిదేమీ జరగదు. మన్నెవార్లు బ్రాహ్మణ, బనియా, రెడ్డి, కమ్మ కులస్తుల సరసన చేరుతారు. అంటే 'ఒబిసి'లు అవుతారు. మన రిజర్వేషన్ వ్యవస్థలోని ఒక లోపం ఏమిటంటే ఎస్‌సి. ఎస్‌టి, బిసి జాబితాలకు పరస్పర సంబంధం లేదు. ఒకవేళ ఎస్సీ లేక ఎస్టీ జాబితాలో ఉన్న ఒక కులం లేక తెగ కాలక్రమంలో నిజంగానే కొంచెం బాగుపడిందనుకోండి అప్పుడు పార్లమెంటు ఒక చట్టం చేసి ఆ కులాన్ని లేక తెగను ఆ జాబితా నుండి తొలగించగలదు. కానీ ఆ విధంగా తొలగించిన కులాన్ని లేక తెగను బిసి జాబితాలో అప్పటికప్పుడు చేర్చే అధికారం పార్లమెంట్‌కు లేదు. దానికి వేరే ప్రక్రియ నడవాలి. మళ్ళీ ఎప్పుడో ప్రభుత్వం ఒక బిసి కమిషన్‌ను నియమించాలి, తొలగించబడ్డ కులం లేక తెగ ఆ కమిషన్‌కు అర్జీ పెట్టుకోవాలి, ఆ కమిషన్ ఆపైన రెండేళ్లకో మూడేళ్ళకో నాలుగేళ్ళకో తన రిపోర్టు ఇవ్వాలి. ఆపైన ఈ ప్రజలు బిసిలుగా గుర్తింపు పొందాలి. అంతవరకు వారు బ్రాహ్మణుల సరసన 'స్వేచ్ఛగా' పోటీపడుతూ బతకాలి.

మన్నెవార్లు తమ ఆందోళనలో భాగంగా వారం రోజుల క్రింద హైదరాబాద్‌లో ప్రదర్శన నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల వారూ వచ్చి మన్నెవార్లకు అన్యాయం జరగనివ్వం అని హామీ ఇచ్చిపోయారు. వారు చేయవలసింది వేరే ఏమీ లేదు. తమ పార్టీల జాతీయ నాయకులకు చెప్పి పార్లమెంటులో ఆ బిల్లు చర్చకు వచ్చినప్పుడు మన్నెవార్‌లు, చెంచువార్‌లను ఎస్‌టి జాబితా నుండి తొలగించే ఆ బిల్లును ఆమోదించకుండా విధాన నిర్ణయం తీసుకునేలాగ చేయాలి. దానికి సిద్ధంగా లేనట్టయితే ఇందిరా పార్కుకు వచ్చి ఉచితంగా హామీలు ఇవ్వడం అనవసరం.

చంద్రబాబు నాయుడు సహితం, మన్నెవార్‌ల ప్రతినిధి బృందం ఆయనను కలిసినప్పుడు ఈ ప్రతిపాదన అన్యాయమైనదనీ, తన ప్రభుత్వం ఒప్పుకోదనీ, వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాననీ అన్నాడంట! ఆయన ఇచ్చిన హామీలలో ఎన్ని నిలబెట్టుకున్నాడన్న లెక్కలు తీయడం ఈ మధ్య మన రాష్ట్రంలో ఒక రాజకీయ హాబీ అయింది. కాబట్టి ఆ కేళిలో ఆసక్తి ఉన్నవారు దీనిని కూడ తమ కంప్యూటర్‌లో ఎక్కించుకోవచ్చు.

సెప్టెంబర్ 15, 2002

# బందిపోటు దొంగలు-హక్కులు

**బం**దిపోటు దొంగలకు కూడ హక్కులు ఉంటాయా? వాళ్ళ హక్కుల గురించి మాట్లాడేహక్కు ఇతరులకు ఉంటుందా? ప్రశ్నను ఈ రకంగా వేసుకుంటే జవాబును ఒక కోణం నుండి అన్వేషిస్తాము. బందిపోటు అంటే భారత శిక్షాస్మృతి డెకాయిటీ అనే నేరంగా నిర్వచించిన దానికి పాల్పడిన వ్యక్తి. ఆ నిర్వచనంలో సామాజిక అంశం లేదు. ఆ వ్యక్తికి కూడా హక్కులుంటాయా అనే ప్రశ్నకు జవాబు సార్వజనీనమైన హక్కుల పరిభాషలో చెప్పుకోవచ్చు.

కానీ నిజానికి బందిపోటు అనేది సామాజిక అంశం లేని విషయం కాదు. బహుశా ఎక్కడా కాదేమో. మన రాష్ట్రంలో మాత్రం అసలు కాదు. ఒక్కొక్క జిల్లాలో, ఒక్కొక్క ప్రాంతంలో బందిపోటు అనగానే కళ్లముందు మెదిలే రూపానికి ఒక కులం ఉంటుంది. కొన్ని చోట్ల ఆ రూపానిది వడ్డెర కులం, కొన్ని చోట్ల బోయకులం, కొన్నిచోట్ల తెలగపాముల కులం, కొన్ని చోట్ల మరాఠీ మాట్లాడే పార్థీ కులం...

అప్పుడు బందిపోటు దొంగలకు కూడ హక్కులుంటాయా? అనే ప్రశ్నకు అర్థం వేరే ఉంటుంది. మొదటి అర్థం పూర్తిగా పక్కకు పోదు, దాని సరసన ఇంకొక అర్థం కూడ వచ్చి చేరుతుంది.

ఇంకొక అర్థం కాదు, ఇంక రెండు అర్థాలు. ఒకటి, ఏ వనరుల మీదా హక్కులు లేకుండ చేసి కూలి చేసుకునో బస్సులు దోచుకునో బతకండి అని సమాజం ఒక మూలకు నెట్టేసిన వారిలో కొందరు రెండవ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటే, వారు 'బందిపోట్లు' కాబట్టి వాళ్లకు హక్కులుండవనడం ఏరకమైన న్యాయం అనే జవాబుకు దారి తీస్తుంది.

బ్రిటిష్ హయాంలో కొన్ని కులాలను, తెగలను మొత్తంగానే నేర స్వభావం గల జాతులుగా ప్రకటించే చట్టం ఉండింది. నేర స్వభావం జన్యు లక్షణమని ఎంతటి మూర్ఖులూ అనరు కాబట్టి మొత్తంగానే ఒక కులాన్ని లేక తెగను నేరస్తులుగా

ప్రకటించాలని పాలకులకు–ఎంతటి పరాయి పాలకులయినా కానియ్యండి–తోచిందంటే ఆ ప్రజలను ఆ స్థితికి నెట్టిన చారిత్రక క్రమం ఒకటి ఉండి ఉండాలి. యానాదులు, ఎరుకల గురించి వెన్నెలకంటి రాఘవయ్య వంటివారు ఒకనాడు చేసిన పరిశోధన తరువాత, దానికి కొనసాగింపుగా నయినా ఎవరైనా ఏమైనా చేసారో లేదో తెలీదు. ఇప్పటికి చేయకపోతే ఇక మీదట చేసే అవకాశమూ ఎక్కువ లేదు. ఎందుకంటే దొంగతనాలు–అందులోనూ చాలా క్రూరమైన డెకాయిటీలు–చేసేవారి పట్ల 'సెంటిమెంటల్'గా ఆలోచించే ఓపిక ఇప్పుడెవరికీ లేదు. కానీ ఎక్కువ పరిశోధన అవసరం లేకుండానే ఈ ప్రజల గురించి కొన్ని విషయాలు చెప్పవచ్చు. వీరికి భూమితో సహా ఏ సహజవనరుపైనా యాజమాన్య హక్కు ఎంత మాత్రం ఉండదు. చాతుర్వర్ణంలో అంటరాని వారు కాకపోయినప్పటికీ దళితులకంటే వీరినే దూరంగా ఉంచుతారు. వీరి ఆచారాలూ అలవాట్లూ చుట్టుపక్కల ఉన్న సమాజం కంటే భిన్నంగా ఉంటాయి. ఒక్కోసారి వేరే భాష కూడ మాట్లాడతారు. ఎవ్వరూ తినని లేక ఎన్నడో తినడం మానేసిన జంతువులను వేటాడి తింటారు.

ఈ ప్రజలలో మెజారిటీ ఎన్నడూ దొంగలయి ఉండే అవకాశం లేదు గానీ, మనం దొంగతనాలు చేస్తే పోలీసులూ లాయర్లు బాగుపడతారు తప్ప దొంగతనాలు చేసి బాగుపడ్డ వాడెవడూ లేడని గ్రహించే కొద్దీ దొంగతనాలు చేసేవారి సంఖ్య తగ్గిపోతున్నది.

కానీ ఈ కులాలు లేక తెగలలో అందరినీ దొంగలుగా భావించి వేధించే 'నేరపరిశోధన' పద్ధతి పోలీసులు వదులుకోకపోవడం వల్ల సాధారణ జీవితం వీరికి సులభం కాదు. కూలీ చేసుకుంటే చేసుకోవచ్చును గానీ చిన్న చితక వ్యాపారాలు చేసుకుంటామంటే నమ్మి సరుకులు అప్పు పెట్టేవాడెవడు? ఆరు నెలలకొకసారి రెండో నాలుగో వారాలు పోలీస్‌స్టేషన్‌లో గడిపి వచ్చే వాళ్లకు అడ్డామీద కూలీల బతుకు తప్ప ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి?

ఈ కులాలు, తెగలకోసం ప్రభుత్వం సంక్షేమ చట్టాలు, వ్యవస్థలు రూపొందించక పోలేదు. ఎటొచ్చీ అవి ఈ ప్రజల దగ్గరకు రాలేదు. ప్రకాశం, నెల్లూరు, (కొంత వరకు చిత్తూరు) జిల్లాలలోని మెట్ట ప్రాంతాలలో బతికే యానాదులనే ఉదాహరణగా తీసుకోవచ్చును. చట్టం వీరిని షెడ్యూల్డు తెగగా గుర్తించింది. వీరికి ఉద్యోగాలలోనూ విద్యాలయాలలోనూ రిజర్వేషన్లు కల్పించింది. ప్రత్యేక విద్యాలయాలు, హాస్టళ్లు, శిక్షణా కేంద్రాలు నెలకొల్పింది. సాంఘిక సంక్షేమ శాఖను అడిగితే ఇవన్నీ ఏకరవు పెడతారు.

కానీ వాళ్ల గ్రామాలకు పోయి చూస్తే వీటి ఛాయలు సహితం కనిపించవు. యానాదుల దగ్గరికి సాంఘిక సంక్షేమ శాఖ ఎన్నడూ పోదు. పోలీసులు మాత్రమే పోతారు. వాళ్లకు ఇళ్ళ స్థలాలున్నాయో లేదో కనుక్కోవడానికి రెవెన్యూ సిబ్బంది ఎన్నడూ పోరు. వాళ్ల ఇళ్లను సోదా చేయడానికి పోలీసులు పోతారు.

డ్యూటీ చేయడంలో ఏ ప్రభుత్వ శాఖకూ లేని ఉత్సాహం పోలీసు శాఖకు మాత్రం ఎక్కడినుండి వచ్చిందా అని సందేహించవద్దు. పోలీసులు చేస్తున్నది డ్యూటీ కాదు. ఒక ఊరి దగ్గర నివసించే యానాదులను పట్టుకొని ఫలాన బస్సు దోపిడీలో నువ్వు దోచుకొని తెచ్చిన సొమ్ము మీ ఊరిలో ఏ రైతుకు అమ్మావో చెప్పు లేదా ఏ రైతు దగ్గర పెట్టావో చెప్పు–అని రోజుల తరబడి నిర్బంధించి వేధిస్తే ఏదో ఒకపేరు చెప్తారు. ఏ పేరు చెప్పాలో కూడ పోలీసులే చెప్తారు. ఆ తరువాత ఆ రైతు దగ్గర పోలీసులు ఆ మొత్తం వసూలు చేసుకొని పేరు చెప్పిన యానాది కులస్తుడి మీద కేసు పెట్టి రిమాండ్ చేయించి స్వామికార్యం, స్వకార్యం సంతృప్తిగా పూర్తి చేసుకుంటుంటారు.

వసూలు చేసుకోవడానికి ఏ రైతూ దొరకకపోయినా, యానాదులే రెండు మూడు వారాల నిర్బంధం గడచిన తరువాత రెండు వేలో మూడు వేలో తీసుకొచ్చి తమ స్వేచ్ఛను కొనుక్కోరా? కొనుక్కుంటారు. ఇటువంటి అవకాశాలున్నచోట ఒక్క పోలీసులేమి, ఏ ప్రభుత్వ శాఖ అయినా ఉత్సాహంగా డ్యూటీ చేస్తుంది.

కానీ ఈ ప్రజలను మొత్తంగానే నేరస్తులుగా చూసే సంస్కృతి పోలీసు వ్యవస్థలో మాత్రమే లేదు. అది సమాజంలో ఏదో ఒక మేరకు ఉండబట్టే పోలీసు వ్యవస్థలో అంతగా స్థిరపడగలిగింది.

దీనిని వాళ్ళు చాలా రకాలుగా అవకాశంగా తీసుకోవచ్చును. 'బందిపోటు' కులానికి చెందిన వ్యక్తి గ్రామ రాజకీయాలలోనో ఆర్థిక జీవితంలోనో మీకు ఎదురు తిరగాడనుకోండి. అవకాశం చూసి అతని మీద ఒక బస్సు దోపిడీ కేసు పెట్టి నోరు మూయించవచ్చు.

నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలో కానిచెరువు అనే ఊరుంది. ఈ మండలంలోని 13 గ్రామాలలోని దాదాపు 300 యానాది కుటుంబాలు గడచిన అయిదారేళ్లుగా పోలీసులనుండి ఈ రకమైన వేధింపులు తీవ్రస్థాయిలో ఎదుర్కుం టున్నారు. అరెస్టు చేస్తే 30 నుండి 50 రోజులకు తక్కువ ఉంచకోరు. ఊరూరా తిప్పి చావగొట్టి "బస్సుకేసులు" ఒప్పిస్తారు. మగవాళ్లను పట్టియ్యమని వారి కుటుంబాల స్త్రీలను పట్టుకుపోయినట్టయితే వారి అగచాట్లు చెప్పతరం కాదు.

రెండు మూడేళ్ల కింద వరమ్మ అనే స్త్రీని నాలుగయిదు పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించి మూకుమ్మడిగా అత్యాచారం చేసిన ఘటన అప్పట్లో చాలా సంచలనం సృష్టించింది. విషయం బయటికొచ్చిన తరువాత జిల్లా కలెక్టరు ఆదరబాదరాగా ఏదో విచారణ ప్రకటించాడుగానీ ఏమీ జరగలేదు.

ఈ గ్రామాలు ఉదయగిరి తాలూకాలోని సీతారాంపురం అడవుల అంచున ఉన్నాయి. ఇవి నల్లమల అడవుల కొనసాగింపు. అయితే వర్షాభావ ప్రాంతం కావడం వల్ల అడవి దట్టంగా ఉండదు. చిన్న చిన్న కొండల చరియల మీద చిట్టడవుల రూపంలో విస్తరించి ఉంది.

ఆ అడవులలో కుందేళ్లతో మొదలుపెట్టి అన్ని రకాల చిన్న జంతువులనూ వేటాడడం, కట్టెకొట్టి తీసుకొని ఊర్లలో అమ్ముకోవడం, బొగ్గు చేయడం, భూములున్న వాళ్ల పొలాలలో కూలీ చేయడం, ఇండ్లల్లో పాచి పని చేయడం, 'అదృష్టం' బాగున్నవాళ్లు హైదరాబాద్ దాకా పోయి బేల్దారిపని చేయడం ఇదీ వారి జీవనాధారం.

ఆ ఊర్లలో స్కూళ్లు ఎక్కువ కనిపించవు. స్కూలు పిల్లల కోసం గిరిజన సంక్షేమ హాస్టళ్లు కనిపించవు. ప్రత్యేక వృత్తులలో శిక్షణ ఇచ్చే సంస్థలు లేవు. రిజర్వేషన్లు పొంది పెద్ద చదువులు చదువుకున్నవారు లేరు.

ప్రభుత్వం నుండి ఈ ఊర్ల యానాదులకు వచ్చింది ఒక్కటే ఇళ్ల కాలనీలు. అయితే కానిచెరువు గ్రామంలో అందులోనూ మోసం జరిగింది. ప్రభుత్వం 11 ఇళ్లు మంజూరు చేయగా ఏడు మాత్రం యానాదులు కట్టుకున్నారు. మిగిలిన నాలుగిళ్లు గిరిజనేతర బిసి కులాల వాళ్లు ఇళ్లు కట్టుకోకుండ కట్టినట్టు రాయించి డబ్బులు తిన్నారు.

ఆ ఊరికి చెందిన యానాది కులస్తుడు సవరం తిరుపాల్ ఈ 'స్కాం'ను బయటికి తీసాడు. గొడవ చేసాడు. కలెక్టర్‌కు అర్జీ పెట్టి, వివిధ సంఘాల వాళ్లకు చెప్పి పత్రికలలో రాయించి అల్లరి చేసాడు. దీని ఫలితంగా ప్రభుత్వం ఆ ఊరి గిరిజనేతరులు ఆరుగురిపైన క్రిమినల్ కేసుపెట్టి అరెస్టు చేసింది. ఒకరిద్దరు ఉద్యోగులపై చర్య తీసుకుంటున్నట్టు కూడ వినికిడి.

ఈ దుస్సాహసం ఫలితాన్ని తిరుపాల్ ఇప్పుడు అనుభవిస్తున్నారు. ఆరు నెలల కిందనే వరికుంటపాడు ఎస్ఐ, తిరుపాల్ ఇంటికొచ్చి అతని భార్య వెంకటమ్మతో 'నీ మొగుడి దగ్గర రెండు కేజీల బంగారం, నాలుగు లక్షల రొక్కం వసూలు చేస్తాను' అని బెదిరించాడు. మొన్నటి అయిదవ తేదీ రాత్రి ఉదయగిరి సిఐ గారి 'ఐడీ పార్టీ'

పోలీసులు తిరుపాల్‌ను ఇంటి నుండి బలవంతంగా తీసుకుపోయారు. వరికుంటపాడు, ఉదయగిరి స్టేషన్ల మధ్య తిప్పుతూ 'బస్సు కేసులు' ఒప్పించడానికీ వసూళ్లకోసం ఎవరైనా రైతుల పేర్లు చెప్పించడానికీ చావగొడుతున్నట్టు వినికిడి.

'బందిపోట్ల'కు హక్కులు లేవందామా?

సెప్టెంబర్ 29, 2002

# ఇంకా ఎంత మానవరక్తం ప్రవహించాలి

ఏదయినా ఘోరం జరిగితే 'అయ్యో పాపం' అనే తీరిక కూడ మన పాలకులకు లేదు. పాకిస్తాన్‌నూ ముషార్రఫ్‌నూ నిందించడం అంతకంటె ముఖ్యం. నేర పరిశోధన జరపవలసిన పోలీసులు ఇంకా ఏమీ అనకముందే కుట్ర చేసింది ఎవరో, ఎందుకు చేసారో, ఎప్పటి నుండి చేస్తున్నారో దేశ హోంమంత్రి, రక్షణ మంత్రి, ఆ మాటకొస్తే ప్రధాన మంత్రి కూడా ప్రకటిస్తున్నారు.

గోధ్రా మారణకాండ జరిగినప్పుడూ అదే అయింది. ఇప్పుడు గాంధీనగర్ మారణకాండ విషయంలోనూ అదే అవుతున్నది. 'ఇది డిసెంబర్ 13 నాటి పార్లమెంట్‌పైన దాడికి కొనసాగింపే'నని అద్వానీ, జార్జి ఫెర్నాండెజ్ అప్పుడే ప్రకటించేసారు. వారు అంతలోనే అంతటి పరిశోధన ఎప్పుడు జరిపారు? పాకిస్తాన్ చేయించిందనీ జమ్మూ-కాశ్మీర్ ఎన్నికలను అడ్డుకోవడంలో విఫలమైనందుకు కక్షగట్టి ఈ పని చేసిందనీ మరికొందరు పాలకపక్ష ప్రముఖులు అన్నారు.

గాంధీనగర్ మారణకాండకు గల కారణం కోసం అంత దూరం అన్వేషించనక్కర లేదు. దాదాపు రెండు వేల మంది ముస్లింలను పనిగట్టుకుని ఊచకోత కోస్తే, నీకు నీ మందే తినిపించాలన్న నిర్ణయానికి వారి రక్త బంధువులలో ఒకరికి కాకపోతే ఒకరికి అనిపించడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. దానికి పాకిస్తాన్ కుట్ర అవసరం లేదు. డిసెంబర్ 13తో 'లింక్' అవసరం లేదు. ముషార్రఫ్ కుతంత్రాలు అవసరం లేదు.

బహుశా అది ఒప్పుకోవడం ఇష్టం లేకనే ఈ నిందలు వేస్తున్నారేమో. ముషార్రఫ్ వైపు వేలు చూపించకపోతే ఆ వేలు తమ వైపే చూపిస్తుందని తెలుసును కాబట్టే అంతగా తొందరపడి పాకిస్తాన్‌ను నిందిస్తున్నారేమో.

కాకతాళీయంగా ఆ రోజు గుడికి వచ్చిన వారు చనిపోయినందుకు గుండెల నిండా బాధపడే వ్యవధి కూడా వాళ్ళకు లేదు. ఆ చావులను ఎంత తొందరగా

'రాజకీయం'  చేస్తే అంత ప్రయోజనం ఉంటుందని హుటాహుటిన గాంధీనగర్ పోయి ఒకరి తరువాత ఒకరు పాకిస్తాన్ అధ్యక్షుడిని తిట్టి పోస్తున్నారు.

అయినా అమాయకులను చంపడం అన్యాయం అనే అర్హత వీళ్ళకేం ఉందని? ఎవరి మీద ఏ కోపమున్నా వీధినపోయే వాళ్ళకు హాని కలిగించే ప్రతీకారం సబబు కాదన్న నీతి వారికీ రుచించదు. వీరికీ రుచించదు. సాధారణ మానవ మాత్రుల సాధారణ జీవితాలకు అతీతమైన 'లక్ష్యాలు' పెట్టుకున్న వారెవరికీ ఆ నీతి రుచించదు.

గోధ్రా తర్వాత వందల సంఖ్యలో అతి క్రూరంగా హతమైన ముస్లింలు చేసిన తప్పేమిటి అని ప్రశ్నించినట్టే ఇప్పుడు గాంధీనగర్ స్వామి నారాయణుడి గుడిలో తూటాలకు బలయిన భక్తులు చేసిన తప్పేమిటి అని ప్రశ్నించవచ్చు. ఏమీ లేదనే రెండింటికీ జవాబు. అయితే ఆ జవాబు ఆనాటి హంతకులను గానీ నిన్నటి హంతకులను గానీ కదిలించదు.

దౌర్జన్యాలు చేసి బతికే వాళ్లందరూ సెక్యూరిటీ భారీగా పెట్టుకొని బతుకుతున్నారు, లేదా రహస్య నిర్మాణాలు పెట్టుకొని బతుకుతున్నారు. వారు ప్రతీకారానికి దొరకరు కాబట్టి ఏ సెక్యూరిటీ లేకుండా 'ఖుల్లాగా' తిరిగే వాళ్ళను హతమార్చడమే వారి దౌర్జన్యాలకు జవాబు చెప్పాలని కోరుకునే వాళ్లకు సులభం అయింది.

ఇది అన్యాయమైన ఆలోచన అని ఇప్పుడెవ్వరూ అనుకోవడం లేదు. బహుశా ఇప్పుడెవ్వరూ నిజమైన అర్థంలో న్యాయం కోరుకోవడం లేదు. ఒక సాధారణ భయోత్పాతం కలిగించి తమ సత్తా చూపించుకోవాలనే కోరుకుంటున్నారు. ఇప్పుడు జరుగుతున్న కొట్లాటలన్నీ 'సత్తాల' మధ్య కొట్లాటలే తప్ప న్యాయన్యాయాల మధ్య కొట్లాటలు కావు.

కాబట్టి అమాయక ముస్లింలను చంపారు అన్న సానుభూతిని ఆసరా చేసుకుని అమాయక హిందువులను చంపుతారు. ఈ హత్యాకాండకు మళ్లీ జవాబు ఏదో ఒక రూపంలో గుజరాత్‌లోని సాధారణ ముస్లింలే చెప్పుకోవాల్సి ఉంటుంది. వారిలో అత్యధికులు ఇప్పటికే తమ నీడను చూసి తామే భయపడుతున్నారు. ఈ రెండు రోజులలో ఆ భయం ఎన్ని రెట్లు పెరిగి ఉంటుందో ఊహించుకోవటం కష్టం కాదు.

దౌర్జన్యాలు చేసి బతకడం ఒక జీవన విధానంగా మలచుకున్న వాళ్లు గుర్తించడానికి ఇష్టపడని సత్యమేమిటంటే దౌర్జన్యం ఒక్కరు మాత్రమే చేయగలరనుకోవటం పొరబాటని. అధికారం అండ ఉన్న వాళ్లు బాహాటంగా చేస్తే అది లేని వారు రహస్య జీవితంలోకి పోయి చేయగలరు. వాళ్లు కాలరెగరేసుకొని తిరిగితే వీళ్లు ముఖానికి

నిగాహ్

ముసుగులేసుకొని తిరగగలరు. 1992 డిసెంబర్‌లో అర్థంకాని ఈ విషయం బాల్ థాకరేకి 1993 మార్చి నెలలో అర్థమయింది. 2002 మార్చి నెలలో అర్థం కానిది నరేంద్ర మోడికి 2002 సెప్టెంబర్‌లోనయినా అర్థం అయిందని భావించవచ్చునా?

కానీ ఈ మూర్ఖులకు ఇటువంటి చిన్నచిన్న జీవిత సత్యాలు నేర్పించడానికి ఎంత మానవరక్తం స్రవించాలి? ఎందరు పసిపిల్లలు అనాథలు కావాలి? కానీ ఎంత జరిగినా ఈ మూర్ఖులు నిజమైన అర్థంలో ఈ సత్యాన్ని గ్రహించరు. గ్రహిస్తే వాళ్ళ జీవిత వ్యాపారానికి తాళం పడుతుంది. దావూద్ ఇబ్రహీం చేసాడో ఎవడు చేసాడో గానీ మార్చి 1993 బొంబాయి స్టాక్ ఎక్స్‌ఛేంజి పేలుడు బాల్ థాకరే దూకుడుకు కొంచెం కళ్లెం వేసిందే గానీ పూర్తిగా ఆపలేదు. ఆపితే ఇంక బాల్‌థాకరే ఉనికి ఎక్కడ? నరేంద్రమోడి అయినా అంతే. దౌర్జన్యం తామే కాదు ఇతరులు కూడా చేయగలరని మొన్న అర్థం అయ్యే ఉండాలి. నిజానికి ఇంకొంచెం ఎక్కువే అర్థం అయి ఉండాలి. తాను, తన మిత్రుడు ప్రవీణ్ తొగాడియా చంపి హాయిగా బతకడానికి మాత్రమే సిద్ధంగా ఉన్నారు. ఆవతలి వాళ్లు చంపి చావడానికి కూడా సిద్ధంగా ఉన్నారు.

కానీ ఈ సత్యాన్ని ఒప్పుకుంటే ఇంక నరేంద్ర మోడీ ఎక్కడ? ప్రవీణ్ తొగాడియా ఎక్కడ? కాబట్టి వాళ్లు నేర్చుకోరు. నిజమైన అర్థంలో మారరు. కానీ రేపు ఇంకొంచెం జాగ్రత్తగా ఉంటారేమో. అంతే.

పాపం దీని కోసం ఎంతమంది ప్రాణాలు ఇయ్యవలసి వచ్చింది?

అక్టోబర్ 14, 2002

# అటవీవాసులకు పెద్దముప్పు

దేశంలోని రిజర్వ్ అడవులలో 30 లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయివున్నాయనీ, ఆ చొరబాటు దార్లందరినీ సెప్టెంబర్ 30 లోపల తొలగించి వేయాలనీ కేంద్ర ప్రభుత్వ ప్రధాన అటవీ అధికారి (ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) మే నెల 8వ తేదీన ఒక సర్క్యులర్ జారీ చేసాడు. అడవులను ప్రభుత్వం తన ఆస్తిగా ప్రకటించుకున్ననాడే అవి 'అన్యాక్రాంతం' అయ్యాయని ఆదివాసీలు అనుకొని ఉంటారు. ఎటొచ్చీ ఒక డేట్ పెట్టి అడవుల నుండి ఈ అతిపెద్ద చొరబాటు దారును తొలగించి వేసే అధికారం, అవకాశం ఆదివాసీలకు లేదు. సెప్టెంబర్ 30 దాటిపోయి రెండు వారాలు గడిచాయి. దేశంలోని ఏ రాష్ట్రమూ ఈ సర్క్యులర్‌ను అమలు చేయలేదు. ఇది లక్షలాది మంది ఆదివాసీలకు సంబంధించిన సమస్య అనీ అకస్మాత్తుగా వాళ్లందరినీ తొలగించాలంటే కష్టమనీ మన చంద్రబాబు ప్రభుత్వమే అభ్యంతరం తెలిపిందంటే కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ అధికారి ఆదేశం ఎంత తెలివి తక్కువ వ్యవహారమో అర్థం అవుతుంది. అయితే ఈ తెలివి తక్కువతనం అటవీ శాఖలో మొదలు లేదు. దాని మూలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కిర్పాల్ గారి వైఖరిలో ఉంది. ఆయనకు అటవీ సంరక్షణ చాలా ఇష్టం. అడవులను నరకొద్దని ఎవరు కేసు వేసినా వెనకా ముందూ చూడకుండ 'స్టే' ఇస్తుంటాడు. అడవులను కాపాడొద్దని ఎవరూ అనరు. అవి బాగుంటే పర్యాటకులకూ పర్యావరణానికీ కూడా మంచిదని అందరికీ తెలుసు. అయితే అడవులంటే పర్యావరణం మాత్రమే కాదు. అడవులలో బతికే మనుషులు కూడా ఉన్నారు. వాళ్లలో అధికభాగం ఆదివాసీలు. ప్రపంచంలో పర్యావరణం ధ్వంసం కావడానికి వాళ్ళు ఏ రకంగానూ బాధ్యులు కారు. వేరేవాళ్ళు యదేచ్ఛగా పర్యావరణాన్ని ధ్వంసం చేసేసి, ఇప్పుడు పర్యావరణం బాగుపడాలంటే అడవులు బాగుండాలి కాబట్టి అటవీ వాసుల బతుకుల మీద ఆంక్షలు పెడతామనడం ప్రాథమికంగా అనైతికం, అభ్యంతరకరం.

అంత ప్రాథమిక స్థాయిలో విషయాన్ని చూసి ఇప్పుడు చేయగలిగిందేమీ లేదని – కాలచక్రాన్ని వెనక్కి తిప్పలేమని – అనుకున్నా అటవీ సంరక్షణనూ అటవీ వాసుల జీవనాన్నీ రెండు పార్శ్వాలుగా భావించి రెండింటినీ కాపాడే పద్ధతిలో విధాన రచన చేయాలని అడగడంలో అవాస్తవికత ఏమీలేదు. అందులోనూ ఆ అటవీ వాసులు అత్యధికంగా ఆదివాసీలయినప్పుడు ఈ హెచ్చరికను అవాస్తవికం అనడంలో అసలే అర్థం లేదు. ఎస్‌సి, ఎస్‌టి కమిషనర్‌గా ఉండిన బి.డి. శర్మగారు ఈ కోణం నుండి అడవులు–ఆదివాసీలు అన్న అంశాన్ని చూడటానికి పూనుకొని చాలా వివరమైన నివేదికను 1990లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. అప్పట్లో అటవీ శాఖ దానిని ఆధారం చేసుకుని సర్క్యులర్ నెం. 13–1/90–ఎఫ్ పి (1) నుండి ఎఫ్ పి (6) దాకా నంబర్లు గల 6 ఆదేశాలు జారీ చేసింది. 1980 సెప్టెంబర్ 25కు ముందునుండి అడవులలో భూములు అనుభవిస్తున్న వారికి అప్పటి ప్రభుత్వ క్రమబద్ధీకరణ విధానానికి లోబడి రిజర్వ్ ఫారెస్టులో పట్టాపొందే హక్కు కల్పిస్తూ, ఆ పరిధిలోకి రానివారికి హక్కులు లేదా తగు రూపంలో పునరావాసం కల్పించే లక్ష్యంతో ఆ 6 ఆదేశాలు రూపొందించబడ్డాయి. ఈ 12 సంవత్సరాలలో ప్రభుత్వాలు ఈ ఆదేశాలను అమలు చేసిన పాపాన పోలేదు. ఇప్పుడు ఆ ఆరు ఆదేశాలలో మొదటి దానిని మాత్రం ప్రస్తావిస్తూ (అంటే 1980 అక్టోబర్ 25 కంటే ముందు నుండి అడవి భూములను అనుభవిస్తున్న వారికి హక్కులు కల్పించే అవకాశాన్ని మాత్రం మిగిలించి) దాని పరిధిలోకి రాని వారందరినీ బల ప్రయోగంతో తొలగించాలని కేంద్ర ప్రభుత్వ ప్రధాన అటవీ అధికారి ఆదేశాలు జారీ చేసాడు. సుప్రీంకోర్టు దానిని ఆమోదించే ప్రమాదం ఉంది. నిజానికి 25 అక్టోబర్ 1980 కంటే ముందు నుండి అటవీ భూములలో ఉన్న వారికి కూడ హక్కులొస్తాయన్న భరోసా ఏమీ లేదు. వారు అప్పటి నుండి అక్కడ ఉన్నారనడానికి ఆధారమేమిటి? 1980కి ముందు అటవీ సిబ్బంది వారిపైన చొరబాటు దార్లు అంటూ కేసు నమోదు చేసి ఉన్నట్టయితే అదే రుజువంట! ఏ కారణంగానయినా – దయవల్లనో అంత ఉన్నతం కాని ఇతర కారణాల వల్లనో అటవీ సిబ్బంది కేసు నమోదు చేసి ఉండకపోతే అంతే సంగతులు. అంతే కాకుండ 1980 కంటే ముందునుండి ఉన్న కుటుంబం ఆ తరువాత పిల్లలు వేరు పడడం వల్ల రెండు మూడు కుటుంబాలయి ఉంటుంది. వాళ్లకు కూడ భూమి కావాలి కాబట్టి వాళ్లు పక్కనే ఇంకొంచెం అడవి కొట్టుకొని ఉంటారు. ఇప్పుడు దాని నుండి వాళ్లను తొలగించి మీ పూర్వీకులు కొట్టుకున్న భూమి మీదనే ఎన్ని తరాలయినా

మీరు బతకాలి అంటే వారేం కావాలి. వేరే పునరావాసాన్ని గురించి ఆలోచించే బాధ్యత ప్రభుత్వానికి లేదంటే వారెక్కడ చావాలి?

1990లో జారీ చేసిన సర్క్యులర్‌కు ముందు 1988 జాతీయ అటవీ విధానం ప్రకటించారు. అంతకు ముందు 1980లో ఆటవీ సంరక్షణ చట్టానికి ఒక వివరణ చేర్చారు. ఈ విధానాలలోనూ వివరణలలోనూ లోపాలు చాలా ఉన్నప్పటికీ, అడవుల సంరక్షణ ఆదివాసీల జీవనంతో సన్నిహితంగా ముడిపడి ఉన్న విషయమన్న స్పృహ ఉండింది. 'ఆదివాసీ' అన్న పదం ప్రయోగించకుండ అటవీ సంరక్షణ గురించి మాట్లాడడం ఇప్పుడు మొదటిసారి జరుగుతున్నది. అటవీ శాఖే కాదు సుప్రీం కోర్టు కూడ ఇప్పుడు అదే భాష మాట్లాడుతున్నది. అటవీ శాఖ సర్క్యులర్‌లో ఎక్కడా ఆదివాసీ అన్న మాట లేదు. 'చొరబాటుదార్లు' అని మాత్రమే అన్నారు. బయటినుండి వచ్చి అడవి భూములను దురాక్రమణ చేసినవారూ 'చొరబాటుదార్లే', శతాబ్దాలుగా అడవులలో ఉంటున్న ఆదివాసీలూ 'చొరబాటుదార్లే'. మా అడవులలో నువ్వే పెద్ద చొరబాటుదారు అని ప్రభుత్వాన్ని ఆదివాసీలు అనలేక పోతున్నారు గానీ, అంటే ప్రభుత్వం దగ్గర ఏం జవాబు ఉంది? సుప్రీంకోర్టు సహితం ఆ భాషే ప్రయోగించడం విశేషం. గతంలో అడవులు, ఆదివాసీలు అన్న ప్రస్తావన ఎప్పుడు వచ్చినా ఆదివాసీల బతుకుల గురించి, 'నాగరికత' వారి బతుకులపైన చేస్తున్న దాడి గురించి, ఆదివాసీల హక్కుల రక్షణ విషయంలో ప్రభుత్వానికి ఉన్న రాజ్యాంగపరమైన బాధ్యత గురించి సుప్రీంకోర్టు మాట్లాడేది. ఇప్పుడు ఆ స్పృహ లేశమంత కూడ లేకుండ అడవులలోని చొరబాటుదార్ల గురించి ఏం చేస్తున్నారని ప్రభుత్వాలను గద్దించడం మొదలు పెట్టింది. దానిని ఆసరా చేసుకొని అటవీ శాఖ ఈ సర్క్యులర్ జారీ చేసింది.

ఆరేడేళ్ల కింద తమిళనాడుకు చెందిన గోదవర్మన్ తిరుమల్‌పాడ్ అనే అతను కోయంబత్తూరు ప్రాంత అడవులలో బడా స్మగ్లర్లూ భూమి కబ్జాదార్లూ అక్రమంగా ప్రవేశిస్తున్నారనీ, ప్రభుత్వం వారిని ఆపే ప్రయత్నం చేయడం లేదనీ ఆరోపిస్తూ మద్రాసు హైకోర్టులో కేసు వేసాడు. మద్రాసు హైకోర్టు ఆ కేసును కొట్టేయగా అతను దానిని సుప్రీంకోర్టుకు తీసుకుపోయాడు. ఆ ఫిర్యాదును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగారి బెంచి దేశవ్యాప్తమైన కేసుగా మార్చి అన్ని రకాల 'కబ్జాదారులనూ' తొలగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి పెట్టసాగింది. 'కబ్జాదారులు' అని పిలవబడే వారిలో చాలా రకాలు ఉంటారనీ, అందులో ఒకరైన ఆదివాసీ ప్రజానీకానికి ఆ పేరు పెట్టడమే అన్యాయమనీ జస్టిస్ కిర్పాల్ గారికి తోచక కాదు, ఆ సంగతి వారికి చెప్పే న్యాయవాదులు సుప్రీంకోర్టులో లేక కాదు. అటువంటి ఆలోచనలు చేయడం అనవసరం అని ఇప్పుడు

అందరూ అనుకుంటున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం లాగ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడ సెప్టెంబర్ 30 లోపల 'చొరబాటుదార్ల'ందరినీ తొలగించడం సాధ్యం కాదన్నాయి. కాబట్టి ప్రస్తుతానికి ఈ సర్క్యులర్ అమలు ఆగింది. అయితే ఈ నెలాఖరులోగా గోదవర్మన్ తిరుమల్పాడ్ కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చే ప్రమాదం ఉంది. ఆ తీర్పు కాఠిన్యం తగ్గించడానికి ఆదివాసీల తరఫున వాదిస్తున్న లాయర్లు చేస్తున్న ప్రయత్నం ఫలించకపోతే దేశవ్యాప్తంగా ఆదివాసీలకు పెద్ద ముప్పే రానుంది.

అక్టోబర్ 28, 2002

# ఉట్టికెక్కి ఆపైన స్వర్గానికెక్కుదాం

గంగా కావేరి 'లింకు' ప్రతీ అయిదేళ్ళకొకసారి సకల సమస్యలకు మందుగా ముందుకొస్తుంటుంది. గంగలో ఎంత నీరు అదనంగా ఉందో లెక్కగట్టి, దక్షిణాది నదులలో ఎంత తక్కువుందో లెక్క గట్టి, దాని నుండి దీనిని తీసేస్తే ఇంకా మిగులే కాబట్టి మనందరి కరువు సమస్యలూ దీనితో శాశ్వతంగా తీరిపోతాయని ఎవరో ఒకరు ప్రకటిస్తుంటారు.

వారికి కూడికలూ తీసివేతలూ వచ్చునన్న ఒక్క విషయం తప్ప దీనివల్ల వేరే ఏమీ రుజువు కావు. ఈ ప్రకటన ఎప్పుడు విన్నా వీళ్లు గంగ దగ్గర ఎందుకు ఆగిపోతున్నారు. బ్రహ్మపుత్రను కూడ కావేరికి కలిపేస్తే ఇంకా చాలా నీళ్లు లభిస్తాయి కదా అన్న అనుమానం వస్తుంటుంది. దానికి ఈ మధ్య ఎవరో జవాబు చెప్తూ, బ్రహ్మపుత్ర, సింధు అంతర్జాతీయ నదులు (అంటే మనకే కాక ఇతర దేశాలకు కూడ హక్కున్న నదులు) కాబట్టి వాటిలోని అదనపు జలాల మీద మనం ఏ ప్రాజెక్టులూ కట్టుకోలేమనీ అందువల్లనే గంగా–కావేరి లింకు గురించి మాత్రమే మాట్లాడుతున్నామనీ అన్నారు.

గంగా నది మీద సహితం బంగ్లాదేశ్‌కు హక్కుంది కాబట్టి ఈ తర్కం ప్రకారం గంగనూ దాని ఉప నదులనూ కూడ వదిలేయాలి. అప్పుడు మిగిలేది మహానది–కావేరి లింకే తప్ప గంగా–కావేరి లింకు కాదు. అయినా అసలు సమస్య అది కాదు. 'అంతర్జాతీయ' నదుల విషయంలో మనం అటువంటి ప్రాజెక్టు చేపడితే ఇతర దేశాలు ఒప్పుకోవంటున్నారు. కానీ 'జాతీయ నదుల' మాటేమిటి? 'తన నీటిని' పొరుగు వారికి అప్పగించే ప్రాజెక్టును ఏ రాష్ట్రమైనా ఒప్పుకుంటుందా? ఒకే రాష్ట్రంలో ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతానికి కనీస నీటి వసతి కల్పించడానికి తమ నీటి దుబారాను తగ్గించుకోవడానికి సిద్ధంగా లేరు. ఎక్కడో బీహార్‌లో ఉండే వారు గంగా జలాన్ని దక్షిణాదికి తీసుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటారా?

బీహార్ రాష్ట్ర ప్రజలూ ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర ప్రజలూ గంగ నీటిని దక్షిణాది రాష్ట్రాలతో పంచుకోవాలన్న అభిప్రాయాన్ని దేశమంత వినేటట్టు ప్రకటించిన మన ముఖ్యమంత్రి, కృష్ణా జిల్లా వాళ్ళు పులిచింతల ప్రాజెక్టును వదులుకొని ఆ నీటిని శ్రీశైలం నుండి గానీ దాని కంటే ఎగువ ప్రాంతం నుండి గానీ తెలంగాణ రాయలసీమ ప్రజలు తీసుకునే అవకాశం కల్పించాలని ప్రకటించగలడా? ప్రకటించలేడు. ఎక్కడో దూరాన ఉన్న వారికి ఎన్ని నీతులయినా చెప్పవచ్చు. దగ్గరున్న వాళ్ళకు చెప్పడం కష్టం. దూరం నుండి – లేక బల్ల మీద మ్యాప్ పెట్టుకొని– చూస్తే నదీ జలాలలో నీళ్ళు మాత్రమే కనిపిస్తాయి. దగ్గర నుండి చూస్తే అందులో నీళ్ళతో పాటు రాజకీయాలు, కలవారి ఆధిపత్యాలు కనిపిస్తాయి. వాటిని వదులుకొని నీటిని నీటిగా–అంటే కడుపు కింత తిండి పెట్టే వనరుగా చూడడం పొరుగు వారికి నేర్పించిన నాడు గంగా కావేరి లింకు గురించి మాట్లాడుకుందాం.

చంద్రబాబునాయుడు నోట్లో ఈ మాటలు రావడం మరీ విడ్డూరం. ఆయన రాష్ట్రం లోపల నదీ జలాల ప్రాజెక్టుల గురించి మాట్లాడటం మానేసి చాలా కాలం అయింది. ఎవరైనా మాట్లాడినా విననట్టు నటిస్తాడు. నీరు–మీరు అంటూ, వాననీటిని పొదుపుగా వాడుకోవడం నీటి సమస్యకు ఏకైక పరిష్కారం అని చెప్తాడు. ప్రాజెక్టులు కట్టడం డబ్బు దండగ వ్యవహారం అనీ ఇంకుడు గుంతలే మోక్ష మార్గమనీ అంటాడు. అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా గంగా కావేరి లింకు గురించి ఎందుకు మాట్లాడుతున్నట్టు? ఎందుకయినప్పటికీ తెలంగాణ వాదులు కృష్ణా జలాల కొత్త ట్రిబ్యునల్‌పైన జరిగిన అఖిలపక్షంలో, రాష్ట్రం లోపల కృష్ణా జలాల అక్రమ పంపిణీ గురించి ప్రశ్న లేవదీసి అతనిని బాగా ఇరకాటంలో పెట్టారు. గంగ నుండి దక్షిణాదికి నీళ్ళు తీసుకు రావాలని మాట్లాడుతున్న పెద్ద మనిషి తెలంగాణ వాదులకు ఏం జవాబు చెప్పగలడు? ఒకరి కోసం మరొకరు తమ నీటి హక్కును వదులుకోనక్కరలేదని అనగలడా? భారీ నీటి పారుదల ప్రాజెక్టుల ఊసు విడిచిపెట్టి ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం చేసుకుందాం రండి అనగలడా? ప్రస్తుతానికి ఏమీ అనకుండానే అఖిలపక్షం ముగించాడు.

రేపు మళ్లీ ఈ చర్చ వస్తే కర్నాటక బూచి చూపించి తెలంగాణ వాదుల నోరు నొక్కేయగలడు. మనలోపలి కొట్లాటలు మరచిపోయి కర్నాటక ఎత్తుగడలను ఐక్యంగా ఎదుర్కోవాలి అనేది రాబోయే రోజులలో మనం బలంగా వినబోయే వాదన. అల్మట్టి గొడవ జరిగినప్పుడూ అదే విన్నాం. ఎగువ తుంగ విషయంలోనూ అదే వింటున్నాం. కానీ కర్నాటక ఏదో ఒక అల్లరి చేసినప్పుడే కృష్ణా జలాల విషయం మన రాష్ట్రంలో

నిగాహ్

పెద్ద ఎత్తున చర్చకు వస్తుంది. తెలంగాణ వాసులైనా రాయలసీమ వాసులైనా అప్పుడే తమ హక్కుల గురించి మాట్లాడాలి. ఆ తరువాత మాట్లాడినా వినేవారుండరు. ఇది కేవలం అదనుకూ అవకాశానికీ సంబంధించిన విషయం కాదు. కృష్ణాజలాల విషయంలో 'మన' (అంటే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన) ప్రయోజనాలు అంటూ ఏమీ లేవు. తెలంగాణ, రాయలసీమ వాసులకు కర్నాటకతోనే పోలిక ఎక్కువ. ఎగువ ప్రాంతాల వారి హక్కుల గురించి అడగవలసిన అగత్యం లేని రోజులలో దిగువ ప్రాంతం వారు నీటిపైన హక్కులు నెలకొల్పి, వెనక వచ్చిన ఎగువ ప్రాంతం వారిని దొంగలు అంటే అంగీకరించవలసిన అవసరం లేదు. కర్నాటకకూ అదే జరుగుతున్నది. రేపు తెలంగాణ వేరయితే తెలంగాణకూ అదే జరుగుతుంది.

అందుకే మొన్నటి అఖిలపక్షంలో టిఆర్ఎస్ ప్రతినిధులూ తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులూ కర్నాటకతో రేపు ట్రిబ్యునల్ ముందు నడవబోయే వ్యాజ్యాన్ని గురించే కాదు, 'మన' మధ్య నడవని వ్యాజ్యాన్ని గురించి కూడ చర్చించుకుందాం అనడం విశేషం. నిజానికి కర్నాటక కోరినట్టూ చంద్రబాబు అంగీకరించినట్టూ రేపు కొత్త ట్రిబ్యునల్ వచ్చినా అది 'మిగులు' జలాలు ఏ విధంగా పంచుకోవాలన్న విషయం మీదనే కదా తీర్పు చెప్పబోయేది? ఆ జలాల పేరే 'మిగులు' జలాలు. అసలు జలాల వాడకం మీద ఇప్పటికే స్థిరపడి పోయిన హక్కులను కదిలించకుండ, ఆపైన మిగిలిన జలాలను పంచుకోవడం వల్ల కరువు ప్రాంతాలకు ఏ మాత్రం ప్రయోజనం రాగలదు? 'నికరం' 'మిగులు' అన్న వర్గీకరణ తీసేయకుండ నికర జలాలు పోను అదనంగా ఉన్నదానిని పంచుకోవడం అంటే ఆ నికర జలాలు మీద హక్కున్న అయకట్టుదార్ల అవసరాలన్నీ తీరిన తరువాతే రేపు కొత్తగా రాబోయే హక్కుదార్లకు నీళ్ళొస్తాయని అర్థం కాదా? ఆ రకమైన 'హక్కు'తో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మించుకున్నా హంద్రి-నివా పథకం కట్టుకున్నా అవి నీళ్ళిచ్చే కరువు ప్రాంతాలకు ఏం వొరుగుతుంది? ఈ ప్రశ్న లేవనెత్తడానికీ దీనిని కోస్తా జిల్లాల రాజకీయ నాయకుల ముందు పెట్టడానికీ సిద్ధంగా లేని ముఖ్యమంత్రి గంగా-కావేరి లింకు గురించి మాట్లాడడం ఎందుకు?

నవంబర్ 11, 2002

# విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కాపాడుకుందాం

సంక్షేమ బాధ్యతలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు ఒక్కమాట అంటేచాలు, దానికి కార్యరూపం ఇవ్వడానికి మన ప్రభుత్వాలు తొందర పడతాయనడానికి ఒక ఉదాహరణను కిందటిసారి ప్రస్తావించాను. అడవులలోని 'చొరబాటుదార్ల' గెంటివేత గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేంద్ర అటవీ శాఖను ప్రశ్నించినదే తడవుగా, ఆదివాసులతో సహా అందరినీ ఫలాన తేదీ లోపల రిజర్వ్ ఫారెస్టు నుండి గెంటివేయాలని దేశ ప్రధాన ఫారెస్టు కన్సర్వేటర్ సర్క్యులర్ జారీ చేసాడు.

అటువంటి మరొక ఉదాహరణ మన రాష్ట్ర ప్రభుత్వం చల్లగా జారీ చేసిన జీవో నెం. 75 (విద్యా శాఖ), తేదీ 18 అక్టోబర్ 2002. ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందే వాటితో సహా ఏ ప్రైవేట్ విద్యా సంస్థా అధ్యాపకుల నియామకంలో రిజర్వేషన్లు పాటించనవసరం లేదని ఈ జీవో సారాంశం.

అంతకు ముందు ఆం.ప్ర విద్యా సంస్థల (ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల వ్యవస్థాపన, గుర్తింపు, నిర్వహణ, నియంత్రణ), రూల్స్ 1993లోని రూల్ 12(6) ప్రకారం ప్రభుత్వ పాఠశాలల లాగ ప్రైవేట్ పాఠశాలలు కూడా అధ్యాపకుల నియామకంలో రోస్టర్ ప్రకారం రిజర్వేషన్లు పాటించాలని ఉండింది. దీని వల్ల తమ వారికి ఉద్యోగాలిచ్చుకునే మహదవకాశం తగ్గి పోయిందనీ, విద్యా సంస్థలు నెలకొల్పేది అందుకోసమేగా అని బాధపడిన ప్రైవేట్ విద్యాసంస్థవారెవరో ఈ రూల్ 12(6) చెల్లదంటూ హైకోర్టు కెక్కారు.

వారి అదృష్టం కొద్దీ మన దురదృష్టం కొద్దీ అప్పట్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో సత్యవ్రత సిన్హా అనే పెద్దమనిషి ఉండేవాడు. ఈయన పదవీ కాలంలో మన రాష్ట్రంలో సంక్షేమ చట్టాలకూ, ప్రభుత్వ సంక్షేమ బాధ్యతకూ ఎంత నష్టం

చేయాలో అంతా చేసి పోయాడు. వాటిలో ఒకటి రూల్ 12(6)లోని రోస్టర్ నియామకం.

జడ్జిలు చట్టాన్ని అనుసరించి తీర్పులు చెప్తారు కదా, ఒక జడ్జి ప్రభుత్వ సంక్షేమ బాధ్యతలకు అన్యాయం చేయడం ఏమిటి అంటారేమో, చట్టాలను వ్యాఖ్యానించేటప్పుడు న్యాయమూర్తులకు చాలా విస్తృతమైన విచక్షణాధికారం ఉంటుంది. దాని చాటున వారి వ్యక్తిగత అభిప్రాయాలను తీర్పులలోకి తరచుగా చొప్పిస్తుంటారు. ఇది ప్రతీ రోజూ జరుగుతూనే ఉంటుంది. అయితే బయట దీని గురించి చర్చ జరగదు. దానికి మూడు కారణాలున్నాయి. కోర్టు తీర్పులు సాంకేతికమైన చట్ట పరిభాషలో ఉంటాయి కాబట్టి అందులో తమకు అంతుబట్టని గొప్ప జ్ఞానం ఏదో ఉందని పామర జనం జంకుతారు. న్యాయమూర్తులను విమర్శిస్తే కోర్టు ధిక్కారం అవుతుందే మోనన్న భయం రెండవ కారణం. అన్నీ తెలిసి సత్యం బహిర్గతం చేసే స్థితిలో ఉన్న లాయర్లు జడ్జిలను ఏమైనా అంటే తమ వ్యాపారం దెబ్బతింటుందని (లాయర్లు చేసేది వ్యాపారమే కాబట్టి) భయపడడం మూడవ కారణం.

సత్యవ్రత సిన్హాగారికి సంక్షేమం, సమానత్వం మొదలయిన రాజ్యాంగ విలువలంటే గౌరవం లేదు. ఆ అగౌరవం ఆయన మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇచ్చిన అన్ని తీర్పులలోనూ కన్పిస్తుంది. ఎవ్వరికీ రిజర్వేషన్లు ఇవ్వడానికి వీలు లేదని ప్రకటించే అవకాశం ఉంటే ప్రకటించేవాడే గాని అది సాధ్యం కాదు కాబట్టి రిజర్వేషన్లు ప్రభుత్వ రంగానికి మాత్రమే వర్తిస్తాయని ప్రకటించి రూల్ 12(6) చెల్లదని ఆయన అన్నాడు.

ఆ తీర్పు న్యాయ సిద్ధాంత పరంగా తప్పని రుజువు చేయవచ్చును గానీ చేయడానికిది సందర్భం కాదు. అయితే దానిని అధిగమించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వానికి మార్గం లేకపోతే ఆం.ప్ర. విద్యా చట్టానికి తగు సవరణలు చేసినట్టయితే సరిపోయేది. దాని బదులు సిన్హా గారి తీర్పును మన రాష్ట్ర ప్రభుత్వం సవినయంగా శిరసావహించి జివో నెం. 75 జారీ చేసింది. ప్రజా వ్యతిరేకమైన ఏదయినా చట్టాన్ని లేక జీవోను హైకోర్టు కొట్టేసి ఉంటే దానికి ప్రాణం పోయడానికి ఏం చేయాలో అన్నీ చేద్దురు. ఈ వినయమంతా ప్రజా వ్యతిరేక స్వభావం గల తీర్పుల అమలు విషయంలోనే.

మన రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నది ఒక్క విద్యా సంస్థలలోనే అన్నది అందరూ ఎరిగిన విషయమే. విద్యా రంగం నుండి ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకునే కొద్దీ ఈ అవకాశాలు ప్రైవేట్ విద్యా రంగంలోనే మిగిలి ఉంటాయి.

అక్కడ రిజర్వేషన్లు లేనట్టయితే విద్యావంతులయిన దళిత, బిసి, ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు బాగా తగ్గిపోతాయి. కనీసం ఎయిడెడ్ విద్యా సంస్థలలోనయినా రిజర్వేషన్ కల్పించే అధికారాన్ని చట్ట సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకోవటం ఉచితంగా ఉండేది.

ఇప్పుడు దళిత సంఘాలు కొంచెం గొడవ చేసేసరికి జీవో 75ను పక్కన పెట్టాలని కేబినెట్ నిర్ణయించిందని వార్తలొస్తున్నాయి. అయితే పక్కన పెట్టి ఏం చేస్తారు? హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా రిజర్వేషన్లు అమలు చేయలేరు కదా? చేయమని ప్రైవేట్ విద్యా సంస్థలను ఆదేశించినా వారు సమ్మతించరు కదా?

హైకోర్టు తీర్పును అధిగమించడానికి ఆం.ప్ర. విద్యా చట్టాన్ని (ఎడ్యుకేషన్ ఆక్ట్) సవరించి ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయించే అధికారం ప్రభుత్వానికి కల్పించడం అవసరం. లేదా హైకోర్టు తీర్పుపైన సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసినట్టు చెప్తున్న అప్పీలును త్వరగా తెమల్చవచ్చు. విద్యా చట్టం ప్రైవేట్ విద్యా సంస్థలపైన రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే విస్తృతమైన నియంత్రణాధికారాలు ఇచ్చింది. అవి చెల్లుతాయని కోర్టులు తీర్పులిచ్చి ఉన్నాయి. రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులున్న మైనారిటీ విద్యా సంస్థలు సహితం, ప్రభుత్వం నుండి ఎయిడ్ పొందేటట్టయితే సమాజహితం కోరి ప్రభుత్వం జారీ చేసే నియమాలకు లోబడి నడుచుకోవాలని సుప్రీంకోర్టు చెప్పి ఉంది. కాబట్టి రిజర్వేషన్లు కల్పించాలనీ రోస్టర్ ప్రకారం అధ్యాపకుల నియామకాలు జరపాలనీ వారిని ఆదేశించే అధికారాన్ని ఆ చట్టంలో చేర్చినట్టయితే ఆ సవరణ చెల్లుబాటు కాకుండాపోదు.

సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క హక్కునూ మనం మౌనంగా కోల్పోతున్నాం. ఉద్యమాలు స్తబ్దంగా, బలహీనంగా ఉండడం ప్రభుత్వానికి గొప్ప అవకాశాన్ని ఇచ్చింది. ఇప్పుడే ఏ కారణంగానయితేనేం జివో 75ను పక్కనపెట్టాలని ప్రభుత్వమే నిర్ణయించింది కాబట్టి, అది చాలదనీ విద్యా చట్టాన్ని సవరించి రూల్ 12(6)కు చట్టంలోనే చోటు కల్పించాలనీ డిమాండ్ చేస్తూ బలమైన ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఉంది. ఇదేదో దళిత సంఘాల బాధ్యత అనుకొని వారికే వదిలేయకుండ ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలన్నీ దీని కోసం నడుం కడతాయని ఆశిద్దాం.

నవంబర్ 25, 2002

# ప్రజలు మాత్రమే త్యాగాలెందుకు చేయాలి?

'పోలీసులూ నక్సలైట్లూ బాగానే ఉంటారు, మధ్యలో మేము చావాల్నా' అని ఆ స్త్రీ అనడం టీవీ కెమెరా కోసం చెప్పించిన కృత్రిమమయిన మాటలాగ తోచడం సహజం. ఎందుకంటే 'ఇద్దరి మధ్య ప్రజలు నలిగి పోతున్నారు' అనేది పత్రికలు, మీడియా నక్సలైట్ ఉద్యమం విషయంలో ఎంచుకున్న 'సేఫ్' మధ్యేమార్గం.

నిగాహ్

కానీ ఏటూరునాగారం అడవులలో నివసించే ఆ స్త్రీ అన్న మాటలు కృత్రిమ మయినవికావు. వాటిని రికార్డు చేసిన విలేఖరి అడిగి చెప్పించి ఉండచ్చునుగాక. అయినప్పటికీ అవి కృత్రిమమయినవి కావు.

కేవలం హింస గురించే అయితే అటువంటి మాటలు జనం బహుశా అనరు, అనుకోరు. ఎందుకంటే చంద్రబాబు, దేవేందర్ గౌడ్ ఏమన్నా ఏమనుకున్నా ఏటూరునాగారంలో నయినా ఉట్నూరులో నయినా జనం నక్సలైట్లనూ ప్రభుత్వాన్నీ ఒకటి చేసి చూడరు. మొన్న తుపాకులగూడెం దగ్గర బస్సు పేలగా చనిపోయినవారిలో ప్రభుత్వాన్నీ పోలీసులనూ అభిమానించేవారు ఎవరూ ఉంటారనుకోను. కానీ వారిలో మెజారిటీ పీపుల్స్‌వార్‌తో ఎంతో కొంత సంబంధం ఉన్నవారే అయివుంటారు, అభిమానులయి ఉంటారు, మెజారిటీ కాకున్నా కొందరయినా అన్నం పెట్టినవారు అయివుంటారు. నక్సలైట్ల హింస, పోలీసుల హింస ఒకటేనని వారెవరూ బహుశా అనుకోరు.

అయినప్పటికీ 'వాళ్లూ వాళ్లూ బాగానే ఉన్నారు' అన్న అభిప్రాయం కాలక్రమంలో వేళ్ళూనడానికి కారణం 'సరండర్లు'. ఎంతకాలం పనిచేసిన నక్సలైట్లయినా సరే సరండర్ కాదలచుకుంటే హాయిగా పైసలు తీసుకొని కేసులు మాఫీ చేయించుకొని ఇంటికి పోవచ్చునన్న అభిప్రాయం ప్రజలలో నిరసనకు మూలం అయింది. ఆ పనిచేసిన

వాళ్లు నక్సలైట్ కేడర్‌లో కొందరే కావచ్చు. అయినప్పటికీ వాళ్లు నిర్విమర్శగా ఆ పని చేసి చేతులు దులుపుకొని పోగలగడం ప్రజలలో చాలా నిరసనకు దారి తీసింది. మొన్న ఏటూరునాగారం దగ్గర బస్సును పేల్చేసి అంతమందిని చంపినవాళ్లలో ఒకరు కాకపోతే ఒకరు రేపెప్పుడయినా సరండర్ అయి రివార్డు తీసుకొని కేసు కూడ లేకుండా ఇంటికి పోవచ్చును. 'వాళ్లూ వాళ్లూ బాగానే ఉంటారు– మధ్యలో మేము చావాల్నా' అన్న ప్రశ్న వెనుక ఈ నిరసన కూడా ఉంది.

ఒకనాడు, విప్లవకారులు దోపిడీ వర్గాల రాజ్యానికి 'సరండర్' కావచ్చునా అన్న మీమాంస విప్లవవర్గాలలో ఉండింది. పోలీస్‌స్టేషన్‌లో సరండరయి జైలుకు పోవడం కూడ తప్పనీ, చావనయినా చావాలి గానీ ఆ పనిచేయకూడదనీ వాదించిన రోజులు ఉన్నాయి. ఆ తరువాత పోలీస్‌స్టేషన్‌లోనైనా కోర్టులోనైనా సరండర్ కావచ్చునని భావించారు. కానీ రాజకీయంగా ప్రభుత్వానికి 'సరండర్' కావడం ఊహకు అందని విషయంగా ఉండింది. పోను పోను, ప్రాణం దక్కించుకొనడానికి అదొక్కటే మార్గమయితే ఆపని కూడ చేయవచ్చునుగానీ ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడం గానీ ఉద్యమాన్ని నిందిస్తూ ప్రకటనలు చేయడంగానీ జరగకూడదని అనుకున్నారు. కానీ అవేవీ చేయని 'సరండర్' ప్రభుత్వానికి అక్కరలేదు కాబట్టి ప్రాణం దక్కించుకోవడానికి ఆ పనులు కూడ చేయవచ్చుననీ అయితే మరీ హాని కలిగించే సమాచారం ఇవ్వకూడదని అనుకున్నారు. ఏది ఏమైనా రివార్డులు మాత్రం తీసుకోకూడదనుకున్నారు గానీ ఇప్పుడు ఆ నిషేధమూ పోయింది.

ఈ పరిణామాలు జరిగిన క్రమంలో నక్సలైట్ల హింస విషయంలో ప్రజల అభిప్రాయమూ మారింది. నేను చంపుతాను, అవసరమయితే చస్తాను అన్నప్పుడున్న గౌరవం వేరు. నేను చంపుతాను గానీ నా చావుకాడికొచ్చే సరికి పోలీసుల పక్కన కూర్చొని నా రాజకీయాలను నిందించి, నా వారిని పోలీసులకు పట్టించి నా ప్రాణాలు దక్కించుకుంటాననే కాలం వచ్చాక అదే గౌరవం ఎందుకుంటుంది?

కాలక్రమంలో వచ్చిన ఈ మార్పుకు విప్లవవర్గాల నుండి ఏ జవాబు, వివరణా లేదు. గట్టిగా అడిగితే 'సరండర్' అయినవాడు మావాడు కాదు కాబట్టి అతని ప్రవర్తన గురించి మమ్మల్ని అడగవద్దు, నిందించవద్దు అంటారు. కానీ నిన్నటిదాకా మీ వాడే కదా? విప్లవం అనేది ఉద్యోగమయినట్టు రిటైరయిన తరువాత వాడు చేసే పనులకు మా డిపార్ట్‌మెంట్ బాధ్యత లేదనడం సబబా? తన చావు తప్పించుకోవడానికీ, తాను 'జన జీవన స్రవంతి'లో కలవడానికీ నిన్నటి తన కామ్రేడ్లకూ రాజకీయాలకూ ఎంతటి హాని అయినా చేయగల వ్యక్తి నిన్నటి దాకా నయినా ఏపాటి విప్లవకారుడు? నిన్నటి దాకా నయినా అతనిది ఏపాటి చైతన్యం?

కామ్రేడ్లను పట్టియ్యడమే కాదు. నిన్నటి దాకా అన్నం పెట్టిన సాధారణ ప్రజల అడ్రస్‌లు, ఇళ్లలో దాచిపెట్టిన బాంబుల ఆచూకీ పోలీసులకు చెప్పి పోలీసు జీపులో వచ్చి ఆ జనాన్ని పట్టించిన 'అన్నలూ' ఉన్నారు. వాళ్లప్పటికి 'మాజీ అన్నలు' అయిపోయారనేది తప్పించుకోవడానికి చేసే వాదనగానే ప్రజలకు తోస్తుంది.

వ్యక్తులను చూడొద్దనీ, ఉద్యమాన్ని చూడాలనీ, ఒక్కొక్క ఘటన చూడొద్దనీ, మొత్తంగా పోరాట క్రమాన్ని చూడాలనీ అంటుంటారు. కానీ ప్రజలు తమకు కనిపించే వాస్తవాలను బట్టి పోరాట క్రమాన్ని గురించి అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. వ్యక్తులను చూసి ఉద్యమాన్ని అర్థం చేసుకుంటారు. ఇది 'తప్పుడు చైతన్యం' కాదు, 'భావవాదమూ' కాదు. మానవ సహజమైన ఆలోచనా సరళి. వ్యక్తులలో లేని నీతిని ఉద్యమ రాజకీయాలలో చూసుకొమ్మంటే సాధారణ మానవులు చూసుకోరు. వ్యక్తులలో నీతి ఉంటేనే వారు పనిచేసే ఉద్యమంలో ప్రజా రాజకీయాలుంటాయని నమ్ముతారు. చేసినంత కాలం వీరోచితమైన పోరాటం చేస్తారు. మానుకోదలచుకున్నప్పుడు నా ప్రాణాలు కాపాడుకొనడానికి ఏమైనా చేస్తాను అనే వైఖరి ఉద్యమకారులలో ప్రబలినప్పుడు వారి వీరోచిత పోరాటంలో దొర్లే అపశృతులనూ పొరబాట్లనూ తొందరపాటు చర్యలనూ ప్రజలు సానుభూతితో చూడజాలరు. చూడనక్కర లేదేమో కూడ. చాలామందికి ఒక సంగతి తెలీదు గానీ, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను తగలబెట్టి నలభై ప్రాణాలు తీసిన దళం క్షేమంగా సరండరయి కొందరు పునరావాసం కూడ పొంది బతుకు వెళ్లదీస్తున్నారు. వారిలో ఒకడు ప్రభుత్వానికి కృతజ్ఞతగా గులాం రసూల్ నక్సలైటేనంటూ జస్టిస్ టి.ఎల్.ఎన్.రెడ్డి కమిషన్ ముందు ఇచ్చిన వాంగ్మూలమే రసూల్ ఎన్‌కౌంటర్ బూటకం కాదన్న నిర్ధారణకు దారితీసింది.

విప్లవ పార్టీలు మొత్తంగా ఇట్లా అయిపోయాయని గానీ వాటి కేడర్ మొత్తంగా దిగజారారని గానీ నేను అనడం లేదు. 'సరండర్' ప్రయత్నం చేస్తే ఉద్యమాన్ని నిందిస్తూ పోలీసులు ప్రకటనలు ఇమ్మంటారన్న భయానికి ఆ ప్రయత్నం చేయకుండ ఉన్నవారూ, ఎంత చిత్రహింసలు పెట్టినా చంపుతామని బెదిరించినా ఏమీ చెప్పకుండ ప్రాణాలు కోల్పోయిన వారూ ఇప్పటికీ ఉన్నారనే అనుకుంటున్నాను. అయినప్పటికీ అందుకు విరుద్ధమైన ఉదాహరణలు కూడా చాలా ఉన్నాయి. అవి ఉద్యమాల విశ్వసనీయత మీద ప్రశ్నార్థకాలుగా నిలిచాయి. తాము త్యాగం చేయడానికి వెనకాడే ఉద్యమకారులు ఇతరుల త్యాగాన్ని కోరితే ఎందుకు గౌరవించాలి? అటువంటి వ్యక్తులను ఉద్యమకారులుగా స్వీకరించే ఉద్యమాలు ప్రజలకు హాని కలిగించే చర్యలకు పాల్పడితే సానుభూతి ఎందుకు చూపించాలి అన్న ప్రశ్నలు సహజంగా వస్తాయి.

ఒక ఉదాహరణ చెప్పి ముగించడం ఉచితంగా ఉంటుంది. అక్టోబర్ 21 సాయంత్రం నల్గొండ జిల్లాలోని ఒక మారుమూల గ్రామమయిన కేశరాజుపల్లి దగ్గర గుట్ట మీద ఒక ఎన్‌కౌంటర్ జరిగి ఇద్దరు పీపుల్స్‌వార్ దళసభ్యురాళ్లు చనిపోయారు. అంతకుముందే పట్టుబడిన ఇద్దరు దళ సభ్యులు పోలీసులను అక్కడికి తీసుకొచ్చారు. పట్టుబడినవారికి దళంతో సరిగ్గా ఏచోట, ఏటైంకు అపాయింట్‌మెంట్ ఉండిందో ఆచోటికే ఆ టైంకే తీసుకొచ్చారు. మనం చచ్చినా ఫరవాలేదు, ఇతర కామ్రేడ్లను కాపాడుదాం అనుకొని ఉంటే పోలీసులను మభ్య పెట్టి వేరేచోటికి తీసుకుపోవడమో లేక ఆలస్యంగా తీసుకుపోయి తమ కామ్రేడ్లకు తప్పించుకునే అవకాశం కల్పించడమో చేద్దురు. ఆ పని చేయకపోవడం వల్ల వారి ప్రాణాలు దక్కాయి, వేరే ఇద్దరు కామ్రేడ్లు చనిపోయారు.

ఈ సంగతి బయటి ప్రపంచానికి అర్థం కాకపోవచ్చును గానీ స్థానిక ప్రజలకు స్పష్టంగానే అర్థం అయింది. ఇటువంటి 'త్యాగధనులు' ఉండే ఉద్యమం (అందరూ అటువంటి వారేనని నేను అనడం లేదు) ప్రజల నుండి త్యాగాలు కోరుకుంటే ప్రజలెందుకు గౌరవించాలి?

డిసెంబర్ 9, 2002

# సకాలంలో నోరు విప్పుదాం

ఎన్‌కౌంటర్‌లో చచ్చిపోయే ముస్లిం 'తీవ్రవాదు' లెప్పుడూ స్కూటర్ డిక్కీలో దేశ, రాష్ట్ర బిజెపి నాయకుల పేర్ల లిస్టొకటి ఉంచి పోతారు–ఎందుకు? రాసుకోకపోతే మరిచిపోతారనా? ఆ మాత్రం నాలుగైదు పేర్లు కూడ రాసుకోనిదే జ్ఞాపకం ఉంచుకోలేని వాళ్లను నమ్ముకొని ఐఎస్ఐ ఇండియాను ఏం చేయగలదబ్బా!

అయిదేళ్ల క్రిందననుకుంటాను. సికింద్రాబాద్‌లోని కార్ఖానా ప్రాంతంలో ఫసీఉద్దీన్, మరొక ఇద్దరు ముస్లిం యువకుల స్కూటర్ డిక్కీలో అద్వానీ నుండి నరేంద్ర దాకా పలువురు కాషాయ నాయకుల పేర్ల లిస్టొకటి దొరికిందట. అది హిట్‌లిస్ట్ అని పోలీసులు అసమాన ప్రతిభతో ఇట్టే కనిపెట్టేసారు. ఫసీఉద్దీన్‌ను నిజానికి నల్గొండలో పట్టుకొని హైదరాబాద్ తీసుకొచ్చి కాల్చి చంపారన్నది వేరే సంగతి.

మొన్న నవంబర్ 21వ తేదీన హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్‌లో సాయిబాబా గుడిదగ్గర స్కూటర్ బాంబు పేలి గుడికి వచ్చిన ఒక అభాగ్యురాలు చనిపోగా మరి కొందరు గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా 22 రాత్రి ఒకరిని, 23 రాత్రి ఇంకొకరిని పోలీసులు కాల్చి చంపారు. 22 రాత్రి హైదరాబాద్ నగర శివార్లలోని ప్రతాప్‌పూర్ గ్రామం దగ్గర మహమ్మద్ ఆజంను, 23 రాత్రి కరీంనగర్ పట్టణం శివారులో సయ్యద్ అజీజ్‌ను కాల్చి చంపారు. ఆజం హైదరాబాద్ నగరంలోని రైస్ బజార్ నివాసి కాగా, అజీజ్ మలక్‌పేట నివాసి.

ఆజంను కాల్చి చంపిన వైనాన్ని వివరిస్తూ, అతను నంబర్ ప్లేటు లేని స్కూటర్‌లో పోతుండగా పట్టుకున్నామనీ స్కూటర్ డిక్కీలో బిజెపి నాయకుల పేర్ల లిస్టొకటి దొరికిందనీ పోలీసులు చెప్పారు. ఆ తరువాత ఆజం తాను బాంబులు వగైరా దాచిపెట్టిన స్థలాన్ని చూపిస్తానని పోలీసులను వరంగల్ రహదారి పక్కన ప్రతాప్‌పూర్ శివారులోని చిట్టడవికి తీసుకు పోయాడనీ, దాచిన వస్తువులు తీసి ఇమ్మని పోలీసులు అతనిని ఆదేశించగా ఏ మాత్రం మర్యాద లేకుండ ఆ వస్తువులను చేజిక్కించుకొని

పోలీసులపైన దాడి చేసాడని, అప్పుడు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో అతను మరణించాడనీ అన్నారు.

అయిదేళ్ల కింద ఫసీఉద్దీన్‌ను చంపిన ఇన్స్‌పెక్టర్‌గారే ఇతనిని కూడ చంపాడని 'వార్త' దిన పత్రిక రాసింది. రాసి ఊరుకోక ఆ ఇన్స్‌పెక్టర్ నేర్పునూ సాహసాన్నీ పట్టుదలనూ కొనియాడింది. అదేమోగానీ అయిదేళ్లుగా అతనికొక కొత్త ఆలోచన కూడ రాలేదని ఫసీఉద్దీన్ హత్యోదంతాన్నీ మహమ్మద్ ఆజం హత్యోదంతాన్నీ పోలిస్తే అర్థం అవుతుంది. ఎటొచ్చీ ఆ రోజు అరెస్టు చేయక ముందే కాల్చి చంపాడు, ఈ రోజు అరెస్టు చూపించి మరీ చంపాడు. (అరెస్టు చూపించిన తరువాత చంపకూడదన్న చాదస్తం అయిదేళ్ల కింద మన రాష్ట్ర పోలీసులలో ఉండింది. అటువంటి నియమమేదీ లేదని సురేంద్ర బాబు, సీతారామాంజనేయులు అనే ఇద్దరు ఐపిఎస్ అధికార్లు ఈ అయిదేళ్ల కాలంలో రుజువు చేసారు. ఉప్పల్ సిఐ వంటి సన్నకారు చిన్నకారు పోలీసులు వారిని క్రమశిక్షణాయుతంగా అనుసరిస్తే వారిని తప్పు బట్టడానికి మనమెవరము?)

మహమ్మద్ ఆజం, సయ్యద్ అజీజ్ 'అమాయకులు' అని చార్మినార్ ఎం.ఎల్.ఏ. అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడుతో వారికి సంబంధం లేదు అనేదే ఒవైసీగారి భావమయితే అది నిజం కావచ్చును. ఒక నేరానికి ప్రతీకారంగా ఒక హత్య చేయాలని పోలీసులు నిర్ణయించుకున్నప్పుడు ఆ నేరానికి పాల్పడిన వ్యక్తినే చంపాలన్న నియమం లేదు. నక్సలైట్ల విషయంలో ఆ విషయం చాలా సార్లు రుజువయింది. అయితే వారిద్దరికీ హింసాత్మక మత రాజకీయాలతో సంబంధం లేదన్నది ఒవైసీగారి భావమయితే అది నిజం కావచ్చు. కాకపోవచ్చు. సయ్యద్ అజీజ్ గురించి అతని కుటుంబ సభ్యులే అతను సౌదీ అరేబియా నుండి ఇండియాకు వచ్చినట్టే తమకు తెలీదని అంటున్నారు. కరీంనగర్ శివారులో పోలీసులతనిని కాల్చి చంపారని విన్నప్పుడే తెలిసిందని ఒకరిద్దరితో వారే అన్నారు. ఆజం సంగతి అంత స్పష్టంగా లేదు. బహుశా అతను తెలిసీ తెలియక అజీజ్‌కు సహకరించిన వ్యక్తి అయి ఉండవచ్చును. 22 పొద్దున్న ప్రార్థనకని చెప్పి స్కూటర్ ఎక్కి ఇంటినుండి బయలు దేరాడు. (అది నంబర్ లేని స్కూటర్ కాదు. దాని నంబరు ఎబిఎం 3602. బహుశా దారిలో ఎక్కడయినా అజీజ్‌ను కలిసాడో, లేక అతనిని స్కూటర్‌పైన ఎక్కించుకుని ఎక్కడయినా దింపి రావడానికి పోయాడో తెలీదు. మొత్తానికి పోలీసులు ఇద్దరినీ స్కూటర్‌తో సహా పట్టుకొని ఆజంను అదే రోజు రాత్రి, అజీజ్‌ను మరుసటి రోజు రాత్రి చంపేసారు. నిజానికి వాళ్లు 'అమాయకులా' కాదా అన్నది అసదుద్దీన్

నిగాహ్

ఒవైసీ అనవసరంగా ప్రవేశ పెట్టిన చర్చ. కాక పోతేనేం? నక్సలైట్లు ఒకరిని చంపితే ఆ తర్వాత రెండు రోజులకో మూడు రోజులకో నక్సలైట్ ఉద్యమంతో ఎంతో కొంత సంబంధం ఉన్న వారిని ఒకరినో ఇద్దరినో పట్టుకొని చంపడం నిత్యం చూడడం లేదా? చనిపోతున్న వాళ్లు నక్సలైట్లా లేక 'అమాయకులా' అన్నది కాదు, ఇటువంటి పోలీసు యంత్రాంగాన్ని ఎన్ని రోజులు భరిస్తామన్నది సమస్య.

హైదరాబాద్‌లో పోలీసుల దగ్గర 'ముస్లిం తీవ్రవాదుల' జాబితా ఒకటి ఉంది. అందులోని వారంతా ఏదో ఒక అర్థంలో అందులో ఉండదగ్గవారేనని ఒప్పుకోవడానికి 'ముస్లిం తీవ్రవాదం' అన్న మాటకు పోలీసులిచ్చే అర్థమే మనమూ ఇచ్చుకోనవసరం లేదు. అయితే, దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు వంటి ఘటన జరిగినప్పుడు ఈ జాబితాలో పేర్లున్న ఒకరినో ఇద్దరినో పట్టుకొని చంపే అధికారం పోలీసులకెవరిచ్చారని ప్రశ్నించాలి.

పోలీసులు ఈ పని చేస్తున్నారన్న దానికంటే సమాజం దీనినెంత సామాన్య విషయంగా భావిస్తున్నదనేది ఎక్కువ ఆందోళన కలిగించే విషయం. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు వార్త వినగానే ఇంక ఒకటి రెండు రోజులలో పాత బస్తీలో ఎన్‌కౌంటర్ జరగబోతుందని హైదరాబాద్‌లో అందరూ అనుకున్నారు. ఒక ఘోరం జరగబోతుందన్న అర్థంలో అనుకోలేదు. ఒక సహజ పర్యవసానం అన్న అర్థంలో అనుకున్నారు. ఆ మధ్య విజయవాడలో ఒక తెలుగుదేశం నాయకుడిని చంపిన వ్యక్తి పోలీసులకు దొరికాడని తెలియగానే అతనిని ఒకటి రెండు రోజులలో చంపుతారని విజయవాడలో అందరూ అనుకున్నట్లు, కడపలో ఒక బందిపోటు పోలీసులకు దొరికాడన్న వార్త రాసిన విలేఖరి 'ఈ రోజు రాత్రి ఎన్‌కౌంటర్ జరగనుందా?' అన్న వార్త రాసినట్టు.

'నక్సలైట్లు', 'బందిపోట్లు', 'ముస్లిం తీవ్రవాదులు' – ఈ ముగ్గురూ చట్టం నుండి వెలివేయబడ్డారు. వీరితో పాటు పాలక పార్టీకి చెందని 'కిరాయి హంతకులు' కూడ. సూత్ర ప్రాయంగా ఇందులో తప్పులేదని సమాజం నగటున అనుకుంటున్నది. అటువంటప్పుడు ఈ జాబితా రేపు పెరగదని నమ్మకం ఏముంది? అప్పుడు ఏడ్చినా ప్రయోజనం ఏముంటుంది?

# డిసెంబర్ 13: దానికి ప్రతీకారం

పార్లమెంటుపై దాడి భారత ప్రజాస్వామ్యంపైన దాడి అని ఒక సంవత్సరం కింద అన్నారు. ఆ దాడి చేసిన వారు అనాడే చనిపోగా, దానికి సహకరించిన వారిలో ముగ్గురికి ఉరిశిక్ష వేసిన పాటియాలా కోర్టు సెషన్స్ జడ్జి ఢింగ్రా ప్రజాస్వామ్యాన్ని కాపాడారని ఇప్పుడు అంటున్నారు.

ప్రజాస్వామ్యం అనేది పార్లమెంటు గోడలలో, గదులలో ఉందా? అన్న అనుమానం ఎవరికైనా రాగలదు. ప్రజాస్వామ్యంతో సమానంగా భావించబడే పార్లమెంటు బిల్డింగుపైన దాడి చేసిన వారికి సహకరించిన వారిని నిర్దాక్షిణ్యంగా ఉరికంబం ఎక్కించడం కంటే, ఎట్టి పరిస్థితులలోనయినా భారత న్యాయవ్యవస్థ ఆవేశానికి లోను కాకుండ ఒకేరకంగా న్యాయం చేస్తుందని రుజువు చేయడం ద్వారా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు భారత ప్రజాస్వామ్యానికి ఎక్కువ మేలు చేసి ఉందురు. ప్రజాస్వామ్యం అటే చట్టసభల బిల్డింగులు కాదు. ప్రజాస్వామ్యం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థలు. ఎంతగా రెచ్చగొట్టినా అవి చెక్కు చెదరకుండ తమ విలువలకు కట్టుబడి ఉంటాయని రుజువు చేయడం ఆ వ్యవస్థలలో బాధ్యతలు నిర్వర్తించేవారు ప్రజాస్వామ్యానికి చేయగల అత్యుత్తమ సేవ.

'అదిగో, దాడి చేసిన వాళ్లు ముస్లింలు కాబట్టి, టెర్రరిస్టులు కాబట్టి, ఈయన వెనకేసుకొస్తున్నాడు' అనబోతారు. నేను ఆ దాడి చేసిన వారిని వెనకేసుకురావడం లేదు. వెనకేసుకురావడానికి వారింకా ప్రాణంతో లేరు. ప్రత్యక్షంగా దాడిలో పాల్గొన్న వారందరూ ఆనాడే చనిపోయారు. 'ప్రతీకారం' అవసరం అనుకున్నట్టయితే అది ఆనాడే జరిగిపోయింది.

భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ఈ ప్రతీకారం అవసరం అని, చాలా మంది లాగా సెషన్స్ జడ్జి ఢింగ్రా గారు కూడా భావించారు. నేర విచారణ నడుస్తుండగా జరిగిన ఒక ఘటన దీనికి తార్కాణం. సాక్ష్యం చెప్తున్న ఒక పోలీస్ అధికారిని

ముద్దాయిల తరఫున క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్న న్యాయవాది అతనిని హెచ్చరిస్తూ, 'బాగా ఆలోచించి జవాబు చెప్పండి, నాలుగు ప్రాణాలు మీ జవాబు మీద ఆధారపడి ఉన్నాయి'. అనగా, జడ్జి ఢింగ్రా గారు జోక్యం చేసుకొని 'అవును బాగా ఆలోచించుకుని జవాబు చెప్పండి–భారత ప్రజాస్వామ్యం భవిష్యత్తు మీ జవాబు మీద ఆధారపడి ఉంది' అన్నారంట.

ఒక నేరాన్ని విచారించే జడ్జి తాను దేశాన్ని కాపాడే పోరాటంలో పాల్గొంటున్నానని అనుభూతి చెందుతూ ఆ పని చేస్తే, బోనులో నిలబడ్డ వ్యక్తికి న్యాయం చేస్తాడన్న భరోసా లేదు. ఆ నేరం జరిగిన సందర్భం భయానకమైనదే కావచ్చు. నేరం ఘోరమైనదే కావచ్చు. అయినప్పటికీ న్యాయమూర్తి చేయవలసింది ఆ ఘోరానికి జవాబు చెప్పడం కాదు, తన ఎదుట నిలబడ్డ వ్యక్తి పాత్ర ఏమిటో నిర్ధారించి ఉచితంగా శిక్షించడం. ఇదేదో టెక్నికల్ విషయం అనుకోవడం చాలా పొరబాటవుతుంది. న్యాయస్థానాలు ఈ దృష్టితో పనిచేయకుంటే వ్యక్తి స్వేచ్ఛకూ ప్రాణానికీ భరోసా ఉండదు.

నలుగురు ముద్దాయిలలో ఒకరయిన అఫ్జల్ గురుకు అయిదు సంవత్సరాల జైలు శిక్ష వేయడం సెషన్స్ జడ్జి ఢింగ్రా గారి వైఖరికి అద్దం పడుతుంది. తన భర్తతో సహా ఇతర కుట్రదారులు కుట్ర చేస్తున్న సంగతి అఫ్జల్ గురు భార్యకు తెలిసి కూడ పోలీసులకు చెప్పనందుకు ఆమెకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. టెర్రరిస్టుకు ఆశ్రయం ఇవ్వడం లేదా దాచి ఉంచడం నేరం అని 'పోటా'లోని సెక్షన్ 3(4) అంటుంది గానీ భార్యాభర్తలకు మినహాయింపు ఇస్తుంది. అంటే తన భర్త టెర్రరిస్టు అని తెలిసీ ఒక స్త్రీ అతనిని పోలీసుల నుండి కాపాడినా అది పోటా కింద నేరం కాదు. అటువంటప్పుడు తన భర్త కూడ భాగస్వామి అయిన కుట్రను పోలీసులకు తెలియచేయక పోవడం టెర్రరిజానికి సహకరించడంగా భావించి ఆమెకు శిక్ష విధించడం ఎట్లా న్యాయం అవుతుంది?

శిక్ష పడిన ఈ నలుగురూ 'అమాయకులా' అని చాలామంది మా బోటివాళ్లను ఆవేశంగా అడుగుతున్నారు. అమాయకులు అనే మాటకు ఈ సందర్భంలో రెండు అర్థాలు ఉండగలవు. వాళ్లు డిసెంబర్ 13 నాటి దాడికి పాల్పడిన వారితోగానీ, ఆ దాడితో గానీ ఏ సంబంధం లేని దారినపోయేవారు అనేది అర్థమయితే ఈ నలుగురూ (నాకు అర్థం అయినంతవరకు) అమాయకులు కారు. వాళ్లు ఆ దాడికి పాల్పడిన వారికి చిన్నా, చితకా సహాయాలు చేసి ఉండవచ్చును. కానీ ఆ దాడి జరుగుతుందని తెలిసి, దానికి సంబంధించిన పథకంలో భాగంగా సహాయం చేసారా అంటే ఒక్క మహమ్మద్ అఫ్జల్ తప్ప తక్కిన వారి విషయంలో అవునని అనడానికి ఆధారాలు లేవు. ఆ అర్థంలో తక్కిన ముగ్గురూ అమాయకులేననుకుంటాను.

మనకు పరిచయమున్న సందర్భాన్ని ఉదాహరణగా తీసుకుంటే విషయం సులభంగా అర్థం అవుతుంది. తెలంగాణలో ఒక ఊరిలో ఒకరినో ఇద్దరినో చంపే ఉద్దేశ్యంతోనో, పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసే ఉద్దేశ్యంతోనో 'అన్నలు' ప్రవేశిస్తారు. వారి కార్యక్రమం వివరాలు ఒకరిద్దరు మిలిటెంట్లకు తప్ప వేరే ఎవరికీ తెలియకపోవచ్చును. అయితే వారు ఆ ఊరిలో చాలామంది సహాయం తీసుకుంటారు. ఆ వ్యక్తులు భయానికే కాదు భక్తితో కూడ సహాయం చేస్తారు. ఒకరి దగ్గర నాలుగు రోజులు ఉండి పోవడానికి గదో గొడ్ల చావడో తాత్కాలికంగా తీసుకుంటారు. ఒకరి ఇంట్లో అటక మీద బాంబులు వగైరా సామాగ్రి నాలుగు రోజులు ఉంచమని కోరుతారు. ఒకరి స్కూటర్ నాలుగు రోజులు వాడుకుంటామంటారు. ఒకరిని రెండు పూటలు అన్నం వండి పెట్టమంటారు. వీరంతా 'అన్నల' మీద అభిమానంతోనే ఈ సహాయాలు చేసారనుకోండి. అయినప్పటికీ నాలుగో రోజు 'అన్నలు' ఒక హత్య చేసి వెళ్లిపోతే ఆ కేసులో వీరందరినీ కుట్ర దారుల కింద చేర్చి ఉరిశిక్ష, జీవిత ఖైదు విధిస్తే 'అమాయకులను శిక్షించారు' అనమా? ఆ అర్థంలో గిలానీ, షౌకత్‌హుసేన్ గురు, అఫ్జల్ గురు అమాయకులే.

వాళ్లు కాశ్మీరీలు. కాశ్మీరీలకు మొదటినుండి భారత ప్రభుత్వం పట్ల ఉన్న అసంతృప్తికి తోడు ఈ పదేళ్లలో ఎంత లేదన్నా ఒక 30 వేల మంది కాశ్మీరీలు భారత సైన్యం చేతిలో చనిపోయారు. కాబట్టి భారత ప్రభుత్వం మీద పోరాటం చేసే వారెవరికైనా తమకు చేతనైన సహాయం చేయడానికి వారు సిద్ధపడడం సహజం. ఒక గది అద్దెకు ఇప్పించడం, ఒక కారు కొనుక్కోవడానికి సహకరించడం వారు చేసిన సహాయం. ఈ సహాయం పొందుతున్న వారు ఏం చేయబోతున్నారో వారికి నిర్దిష్టంగా తెలీదు. వారి పథకమేమిటో తెలీదు. అయితే వారిని తమ శత్రువుపైన పోరాటం చేసే పోరాట కారులుగా గుర్తించి వారు అడిగిన చిన్నా చితకా సహాయాలు చేసారు.

దానికి వారిని ఉరికంబం ఎక్కించడం న్యాయమా?

జనవరి 6, 2003

# ప్రజాస్వామ్యానికి నిజమైన సవాలు

ఢిల్లీలో ఒక సెషన్స్ కోర్టు, కోయంబత్తూర్‌లో ఇంకొక సెషన్స్ కోర్టు ముస్లిం తీవ్రవాదులకు ఏకంగా ఉరిశిక్ష విధించడం, ఢిల్లీలో మరొక సెషన్స్ కోర్టు కాంగ్రెస్ నాయకుడు సజ్జన్‌కుమార్‌ను నిర్దోషి అని ప్రకటించడం దాదాపు ఒకేసారి జరిగాయి.

అందరూ తీవ్రవాదులే గానీ కొందరు తీవ్రవాదులకు మాత్రమే శిక్షపడుతుంది అని దీని నుండి గ్రహించవచ్చునని ఎవరైనా వ్యాఖ్యానిస్తే కాదనడం కష్టం.

1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని సిక్కు మతస్తులయిన ఆమె సెక్యూరిటీ సిబ్బంది కాల్చి చంపినప్పుడు, 'సెక్యులర్' కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో గుంపులను పోగు చేసి సిక్కులను ఘోరాతిఘోరంగా నరికి, కాల్చి, తగలబెట్టి చంపారు. బతికి బయటపడ్డ బాధితులు గుర్తు పట్టిన నాయకులలో సజ్జన్‌కుమార్ ఒకడు.

ఆ మారణకాండలో ఎంత లేదన్నా 2000 మంది చనిపోయారని అంచనా. దాదాపు 20 సంవత్సరాల తరువాత, ఏడెనిమిది కేసులు మించి ముగింపుకు రాలేదనీ, వేళ్లమీద లెక్కపెట్టగలిగినంత మందికి మాత్రమే శిక్ష పడిందనీ ఢిల్లీ పోలీసులే ఒప్పుకుంటున్నారు.

ఆ కొద్ది మందిలో బాధితులు పేరుపెట్టి నిందించిన కాంగ్రెస్ నాయకులు హెచ్‌కెఎల్ భగత్ గానీ సజ్జన్‌కుమార్ గానీ లేరని వేరే చెప్పనవసరం లేదు.

పార్లమెంటుపైన జరిగిన దాడిలో చనిపోయింది అయిదుగురో? ఆరుగురో? కోయంబత్తూర్‌లో చనిపోయింది ఒకరు. ఈ నేరాలకు మాత్రం పూర్తిస్థాయి ప్రతీకారం జరిగిపోయింది.

తనను కోర్టు నిర్దోషి అని ప్రకటించగానే, 'న్యాయం' గెలిచిందనీ 'ప్రజాస్వామ్యానికిది విజయం' అనీ సజ్జన్‌కుమార్ అన్నాడు. పార్లమెంటు పైన దాడికేసులో పాటియాలా

హౌస్ సెషన్స్ కోర్టు నలుగురు ముద్దాయిలలో ముగ్గురికి ఉరిశిక్ష విధించిందని వినగానే 'ప్రజాస్వామ్యానికిది విజయం' అని చాలామంది అన్నారు. ముద్దాయిలను కఠినంగా శిక్షించిన జడ్జి ఢింగ్రా గారు ప్రజాస్వామ్యం బలాన్ని చాటారని అన్నారు.

సజ్జన్‌కుమార్‌ను కోర్టు విడుదల చేసిందని తెలిసి ఢిల్లీలోని సిక్కు ప్రజానీకం నిరసన ప్రదర్శనలు నిర్వహించి 'ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింద'న్నారు. ఇది మన దినపత్రికలు, టీవి ఛానెల్స్ చూపించాయి. పార్లమెంటు దాడికేసు తీర్పు వెలువడిన తరువాత, ఉరిశిక్ష పడ్డ ముద్దాయిల స్వంత జిల్లా అయిన బారాముల్లాలో ప్రజలు 'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన' భారత న్యాయవ్యవస్థను నిరసిస్తూ పెద్దఎత్తున ఊరేగింపులు తీసారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మన మీడియా మనకు ఈ విషయం చెప్పలేదు. ఆ విధంగా మీడియా ప్రజాస్వామ్యాన్ని కాపాడింది.

ప్రజాస్వామ్యం అన్న మాటకు ఇప్పుడు చాలా అర్థాలు ఉన్నాయని దీనిని బట్టి అర్థం అవుతుంది. ప్రజాస్వామ్యానికి ఇన్ని అర్థాలు ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వేరే చెప్పనవసరం లేదు.

'పోటా' ఉండడం వల్లనే పార్లమెంటుపైన దాడికేసులో దోషులకు శిక్ష పడిందనీ 'పోటా' ఎంత అవసరమో దీనిని బట్టి అర్థం అవుతుందనీ బిజెపి నాయకులు వ్యాఖ్యానించారు. అది పచ్చినిజం. పార్లమెంటు పైన దాడి కేసులో ముద్దాయిలు పోలీసులకు ఇచ్చిన 'ఒప్పుకోలు' తప్ప వేరే సాక్ష్యమేదీ లేదు. తీసుకునే పద్ధతిలో 'ఒప్పుకోలు' తీసుకుంటే సజ్జన్‌కుమార్ మాత్రం నేరం ఒప్పుకోకపోయేవాడా! అయినా అతని వంటి కాంగ్రెస్ నాయకుని దగ్గర ఒప్పుకోలు తీసుకునే పోలీస్ అధికారి ఈ దేశంలో లేడు. తీసుకున్నా, మామూలు నేరస్మృతి దానిని సాక్ష్యంగా అంగీకరించదు. 'ముస్లిం తీవ్రవాదుల' చేత పోలీసులు వీరోచితంగా నేరం ఒప్పించనూ గలరు, దానిని సాక్ష్యంగా అంగీకరించే టాడా, పోటా వంటి చట్టాలు వారిపైన ప్రయోగించనూ గలరు.

ప్రజాస్వామ్యంలాగే న్యాయానికి కూడా ఇప్పుడు భిన్న అర్థాలు వచ్చాయని దీనిని బట్టి అర్థం అవుతుంది. అది కూడా మంచిది కాదని వేరే చెప్పనవసరం లేదు.

భారతదేశ అధికార వర్గాలపైన, అధికార సంకేతాలపైన దాడి చేసిన వారందరికీ ఉరిశిక్షలు పడ్డాయి. ఇందిరాగాంధీని చంపిన వారికి, రాజీవ్‌గాంధీని చంపినవారికి, సేనాధిపతి జనరల్ వైద్యను చంపిన వారికి, పార్లమెంటుపైన దాడి చేసి కాపలా ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని చంపిన వారికి, కోయంబత్తూర్‌లో ఒక కానిస్టేబుల్‌ను చంపిన వారికి – వీరందరికీ ఉరి శిక్ష వేసారు.

ప్రజలను చంపినవారికి ఉరిశిక్ష కాదు, ఏ శిక్షా వేయలేదు. బజార్లో నిలబడి సిక్కుల మీదికి జనాన్ని రెచ్చగొట్టి మూకుమ్మడి హత్యలు చేయించిన హెచ్.కె.ఎల్. భగత్‌కు, సజ్జన్‌కుమార్‌కు ఏ శిక్షా పడలేదు. ఇంకొక సందర్భంలో, ఇంకొక చోట ముస్లింలను మూకుమ్మడిగా చంపిన ప్రవీణ్ తోగాడియాకు, నరేంద్ర మోడీకి, అశోక్‌భట్‌కు, హీరేన్ పాండ్యాకు ఏ శిక్ష వేయించారు?

ఇది ఈ దేశంలో మెజారిటీ మతస్థులయిన వారికి, ప్రధాన స్రవంతి జాతులకూ, రాజకీయాలకూ చెందిన వారికి మామూలు విషయంగా కనిపించవచ్చు కానీ అందరికీ అంతే సాదా విషయంగా కనిపిస్తుందనుకుంటే పొరబాటు. నేరాన్ని నేరంగా గుర్తించడంలోనూ శిక్షించడంలోనూ నిష్పాక్షికతను కోల్పోయిన న్యాయవ్యవస్థ తన మీదనే కాదు, మొత్తంగా సమాజం మీదనే విశ్వాసాన్ని చంపేస్తుంది. ఎందుకంటే విశ్వాసానికి న్యాయం కీలకమయినది. ఒక సమాజంలో న్యాయబద్ధమైన న్యాయవ్యవస్థ ఉందన్న నమ్మకం ఆ సమాజంపట్ల విశ్వాసాన్ని పెంచినంతగా వేరే ఏదీ పెంచదు. న్యాయవ్యవస్థలో తమకు న్యాయం జరగదన్న అపనమ్మకం ఏర్పడినట్టయితే ఆ సమాజంపైన విశ్వాసం అంతగానూ పతనం అవుతుంది. ముస్లిం 'తీవ్రవాది' అనిపించుకున్నవాడు పోలీసుల చేతికి చిక్కితే కాటికే తప్ప జైలుకు పోడన్న ఆపనమ్మకం ఏర్పడినట్టే, కోర్టు చేతికి చిక్కితే ఉరికంబం తప్పించుకోలేడన్న అపనమ్మకమూ ఏర్పడింది.

ఈ అపనమ్మకం నుండి మన సమాజాన్ని బయట వేయగలమా అన్నది భారత ప్రజాస్వామ్యానికి ఈ రోజు అతిపెద్ద సవాలు. దీని మీద ఎవ్వరికీ ఆసక్తి ఉన్నట్టు కనిపించకపోవడం నిజంగా దురదృష్టకరం.

జనవరి 27, 2003

# స్పష్టమవుతున్న అమెరికా ఎజెండా

అమెరికా ఇరాన్ మీద యుద్ధం మొదలుపెడుతుందా? అని ఎవ్వరూ అడగడం లేదు. ఎప్పుడు మొదలు పెడుతుందని మాత్రమే అడుగుతున్నారు. ఫిబ్రవరి ఆఖరు వారంలోనని మొన్నటిదాకా అనుకున్నారు గానీ మొదటివారంలోనే జరగవచ్చునని ఇప్పుడందరూ అనుకుంటున్నారు.

సద్దాం హుస్సేన్ దగ్గర ఏవో భయంకరమైన ఆయుధాలున్నాయనీ, వాటినతను ధ్వంసం చేయమంటే చేయడం లేదనీ, కనీసం ఎన్ని ఉన్నాయో చూస్తామంటే చూపించడం లేదనీ, అందుకే అమెరికాకు అతని మీద అంత కోపమనీ ఎంతమంది నమ్ముతున్నారో తెలీదు.

సద్దాం హుస్సేన్ నిస్సందేహంగా శాంతి కాముకుడు కాదు. కానీ శాంతి కాముకుడు కానిది అతనొక్కడేనా? భయంకరమైన ఆయుధాలు అతనొక్కడి దగ్గరే ఉన్నాయా? ఇక చూపించడం మాటకొస్తే, అమెరికా దగ్గరున్న ఆయుధాలు మాకు చూపించమని వేరే దేశాలేవయినా ఇన్స్పెక్టర్ల బృందాలను తయారు చేసి పంపిస్తే అమెరికా చూపిస్తుందా?

సద్దాం హుస్సేన్ దగ్గర రసాయనిక ఆయుధాలు, బయోలాజికల్ ఆయుధాలు ఉన్నాయని అమెరికా అంటున్నది. రసాయనిక యుద్ధాన్ని మొట్టమొదట పెద్దఎత్తున నడిపింది అమెరికాయేనని, వియత్నాం ఆ ఘోరం నుండి ఇంకా కోలుకోలేదని ఇప్పుడు చాలామందికి తెలుసు కానీ బయోలాజికల్ యుద్ధం– అంటురోగాలను వ్యాపింప చేసే పరికరాలను పనిగట్టుకొని శత్రు దేశ ప్రజలపైన ప్రయోగించడం కూడా అమెరికాయే మొదట చేసిందని చాలామందికి తెలీదు. వియత్నాంలో కాదు, నికరాగ్వాలో కాదు, ఆఫ్ఘనిస్తాన్‌లో కాదు, అమెరికా గడ్డమీదనే.

ఇప్పుడు కాదు, ఈ మధ్యకాదు. రెండు వందల యాభై ఏళ్ళ క్రితం అమెరికాకు యూరప్ నుండి వలస వెళ్లిన తెల్లజాతీయులు స్థానిక రెడ్ ఇండియన్లను అత్యంత

క్రూరంగా అణచివేసి వారి భూములను ఆక్రమించుకున్నారన్నది తెలిసిన సంగతే. రెడ్ ఇండియన్లు యుద్ధం చేతకాని వారు కాదు. కొన్ని సందర్భాలలో గట్టిగానే ప్రతిఘటించారు. అటువంటి ఒక ప్రతిఘటనను ఎదుర్కొనడానికి అమెరికాలోని తెల్లజాతీయులు అతిక్రూరమైన ఎత్తుగడ వేసారు. సంధి కోసమని రెడ్ ఇండియన్లను రమ్మన్నారు. వారు వచ్చారు. సంధి చర్చలకు కూర్చునేటప్పుడు ఏవైనా బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం పాతకాలంలో పరిపాటే కదా! మశూచిరోగులు ఆస్పత్రిలో వాడిన దుప్పట్లను తెల్లవాళ్లు రెడ్ ఇండియన్లకు ఇచ్చి 'చలిని బాగా ఆపుతాయి, మీ కోసం తెచ్చాం' అని అన్నారు. వారం రోజులలో రెడ్ ఇండియన్‌లలో మశూచి రోగం వ్యాపించింది. మందేమిటో తెలియని ఆ రోగానికి తట్టుకోలేక వందల మంది రెడ్ ఇండియన్లు చనిపోయారు.

సద్దాం హుస్సేన్‌కు ఏం తెలుసు బయోలాజికల్ యుద్ధమంటే...

అయినా అల్‌ఖైదాను అంతం చేసేదాకా ఆగేది లేదనీ, ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకునే దాకా నిద్రపోయేది లేదనీ అమెరికా పాలకులు ప్రకటించి ఎన్నో రోజులు కాలేదు. అవేవీ జరగకుండానే సద్దాంహుస్సేన్ మీదికి దృష్టి మరల్చారేమిటో అని ఎవరైనా అశ్చర్యపోగలరు. అవేవీ జరగలేదు కానీ ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికన్ల అసలు లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకమైన ప్రభుత్వం పతనమయి, అనుకూలమైన ప్రభుత్వం గద్దెనెక్కింది. ఇక ఆ తరువాత ఒసామాబిన్ లాడెన్‌లు, అల్‌ఖైదాలు ఎందరుంటేనేమి, ఎన్ని ఉంటేనేమి?

సద్దాం హుస్సేన్‌లోని దోషం అదే. అతను శాంతికాముకుడు కాదని పైన ఒప్పేసుకున్నాము కదా. అంతేకాదు, అతను చాలా దుర్మార్గుడైనవాడు కూడా. జోక్‌గా అనడంలేదు. అతను నిజంగా దుర్మార్గుడే. కానీ సమస్య అది కాదు. అతను అమెరికాకు అనుకూలుడయిన దుర్మార్గుడు కాదు, అమెరికాకు వ్యతిరేకి. కాబట్టి ఇప్పుడతను దిగి పోవాలి. అమెరికాకు అనుకూలమైన ప్రభుత్వం నెలకొల్పాలి. ఆపైన ఇరాక్‌లో ఎన్నిరకాల ఆయుధాలు ఎన్ని ఉన్నా పర్వాలేదు.

తాలిబన్‌లు మతవాదులు కాబట్టి వారివల్ల నాగరికతకు ప్రమాదం అన్నారు. ఇస్లామిక్ మతవాదం మీద యుద్ధం ప్రకటించడం అందరి ధర్మం అన్నారు. సరేనని ప్రపంచం అనుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా సద్దాం హుస్సేన్ మీద పడ్డారు. అతను ఎంత దుర్మార్గుడయినా కావచ్చుగాని ఎంతమాత్రం మతవాది కాదు. పశ్చిమ ఆసియాలోని అత్యంత సెక్యులర్ నియంత సద్దాంహుస్సేన్. రవ్వంత సోషలిస్టు కూడా. ఇతని మీద ప్రపంచమంతా ఎందుకు పోరాటం చేయాలి?

తెలీదు.

'నెక్స్ట్ నేను' అని పాకిస్తాన్ అధ్యక్షుడు అంటున్నాడు గానీ నెక్స్ట్ అతను కాదు. ఇరాన్ కావచ్చు. అప్పుడు బుష్ ఏం కారణం చెప్తాడో చూడాలని నాకైతే చాలా ఆసక్తిగా ఉంది. ఎందుకంటే ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వ అధినేత ముల్లా మహమ్మద్ ఉమర్ మతోన్మాది. ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్ సెక్యులర్ నియంత, అధికారోన్మాది. కానీ ఖతామీ రెండూ కాదు. మెజారిటీ వోట్లతో ఎన్నికయి, ఇరాన్‌ను ఖోమైనీ అనుచరులయిన మతవాదుల చేతి నుండి నెమ్మదిగా ప్రజాస్వామ్యం దిశగా నడిపించే ప్రయత్నం చేస్తున్న అత్యంత సంస్కార వంతుడయిన మూడవ ప్రపంచ సంస్కర్త. అయినప్పటికీ అమెరికాకు అనుకూలుడు కాడు కాబట్టి అతని దేశాన్ని దయ్యాల పుట్టింటిగా బుష్ అభివర్ణించాడు. సద్దాం హుస్సేన్ సంగతి చూసిన తరువాత బుష్ దృష్టి ఇరాన్ మీదికి మళ్ళవచ్చు.

ప్రపంచమంతటా – ముఖ్యంగా పెట్రోలియం తదితర వనరులున్న చోట – తమకు అనుకూలమైన ప్రభుత్వాలను నెలకొల్పడం ఈ అమెరికా ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా అనుసరిస్తున్న అజెండా. దీనికి అప్పటికప్పుడు ఏదో ఒక పేరు పెట్టుకోవచ్చును గాక –కానీ అమెరికా విదేశాంగ నీతి ఇదే. ఒకప్పుడు అగ్రరాజ్యాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బడుగు దేశాలను ఐక్యంచేసే కర్తవ్యాన్ని గుర్తించిన భారత్ (ఆచరణలో దానిని ఎంత అసమగ్రంగా అమలు చేసినప్పటికీ) ఇప్పుడు తెలిసీ ఈ అజెండాలో భాగమవుతుండడం, పైగా అదేదో చాలా తెలివయిన రాజనీతి అని మురిసి పోవడం చాలా బాధాకరం.

ఫిబ్రవరి 10, 2003

# బుష్ గడ్డ మీదనే నిరసనలు

ఇరాక్ మీద అమెరికా చేయించుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా పాశ్చాత్య దేశాలలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో ఆందోళనలు చెలరేగుతున్నాయి. యూరప్‌లోనే కాక బుష్‌గారి స్వంత గడ్డ మీద కూడా.

చాలా స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతికినట్టు కనిపించే అమెరికావాసులు ప్రపంచ రాజకీయాలలో తమ దేశం పాత్ర గురించి వారి పాలకులు ఏం చెబితే అది గుడ్డిగా విశ్వసించడం చాలామందికి ఆశ్చర్యం కలిగించే విషయం. మళ్లీ దేశీయ వ్యవహారాలలో ఆ దేశ ప్రభుత్వానికి అంతటి ప్రజామోదం లభించదు.

దీనికి కారణం ఏమిటనే విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. బహుశా అన్నిటికంటే ప్రసిద్ధమైనది నోమ్ చోమ్‌స్కీ విశ్లేషణ. అమెరికాలోని ప్రధాన ప్రసార సాధనాలు పాలనా విధానాలకు ప్రజల సమ్మతిని సాధించిపెట్టే ప్రచార యంత్రాంగాలే తప్ప స్వతంత్రమైన ప్రసార మాధ్యమాలు కావని ఆయన వాదిస్తారు. దేశీయం – అంతర్జాతీయం అన్న తేడా లేకుండా మొత్తంగానే పాలక వ్యవస్థ ప్రచార యంత్రాంగంగా ఆ దేశంలోని మీడియా పని చేస్తుందని చోమ్‌స్కీ అంటారు గానీ ఆయన ఇచ్చే ఉదాహరణలన్నీ విదేశాంగ వ్యవహారాలకు, ముఖ్యంగా అమెరికా ఇతర దేశాలను అదుపు చేయడంలో నిర్వహిస్తున్న దుష్టపాత్రకు సంబంధించినవే. అదంతా 'ప్రజాస్వామ్యాన్నీ' 'ప్రజాస్వామ్య నాగరికతనూ' 'మానవ హక్కులనూ' కాపాడడానికి చేస్తున్న నిస్వార్థ కృషేనని ప్రజల చేత నమ్మింప చేయడానికి అమెరికాలోని పత్రికలు, టీవీ చానెల్స్ ప్రభుత్వానికీ, పాలక వర్గానికీ అనుకూలంగా కృషి చేస్తాయని ఆయన వాదన. ప్రజలు ఆ విధానాలకు సమ్మతి తెలపడానికి అది బలమైన కారణం కాగలదు.

అమెరికన్లందరిలోనూ సామాన్య లక్షణమైన జాత్యహంకారం దీనికి కారణం అన్న వాదన చేసే వారూ ఉన్నారు. అమెరికన్ ప్రభుత్వం 'ప్రజాస్వామ్యం' పేరుమీద

ప్రజల హక్కులనూ, సంక్షేమాన్నీ, రాజకీయ స్వేచ్ఛనూ ఖూనీ చేసిన దేశాలలో ఒక్కటీ తెల్లవాళ్ల దేశాలు కావు. మధ్యఅమెరికా, దక్షిణ అమెరికా దేశాలు, 'మంగోలాయడ్' అని పిలవబడే జాతులు నివసించే తూర్పు ఆసియాదేశాలు, ఇప్పుడు సాంస్కృతికంగానూ మతపరంగానూ తెల్లవారికి పరాయివారయిన పశ్చిమాసియా ముస్లిం దేశాలు– అమెరికా దౌర్జన్యానికి గురయిన, అవుతున్న దేశాలు.

ఇందులో కూడా కొంచెం నిజం ఉండవచ్చు. 'పెట్రోలియం వనరులు చాలా ప్రాముఖ్యత గలిగినవి. వాటిని అరబ్బులకు వదిలిపెట్టడానికి వీలులేదు' అని కిస్సింజర్ అప్పుడెప్పుడో అన్నాడట. 'అరబ్బులు' బాధ్యత తెలియని అనాగరికులు అన్న తృణీకారం ఇక్కడ స్పష్టంగా ఉంది. అమెరికన్లలో ఈ అభిప్రాయం ఒక సామాన్య భావన అయిన మేరకు అది అమెరికా విదేశాంగ నీతికి సాధారణ ప్రజల సమ్మతిని సులభంగా సంపాదించి పెట్టగలదు.

అయితే ఒక జాతిలోనయినా, ఒక దేశ సంస్కృతిలోనయినా దుర్మార్గం ఇంత సంపూర్ణంగా ఉంటుందని నమ్మడం కష్టం. నమ్మగలిగినట్టయితే మానవ జాతి భవితవ్యాన్ని గురించి మనకు నమ్మకం సన్నగిల్లక తప్పదు. ఇక మనుషుల ఆలోచనలను ఒకరు కుట్రపూరితంగా ఒక మూసలో రూపొందించగలరనే చోమ్‌స్కీ నమూనా వాదన కూడా ఎంత ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ ఒక మోతాదు దాటిన తరువాత దానిని స్వీకరించడం కష్టం. మానవ సమాజాల సంస్కృతులలో దుర్మార్గమూ ఉంటుంది, మనుషుల చైతన్యాన్నీ, ఆలోచనలనూ తమకు అనుకూలంగా మలచుకోవాలని చూసే కుట్రలూ ఉంటాయి. కానీ దీనితోపాటు మరొక రెండు విషయాలు కూడా గుర్తు పెట్టుకోవాలి. మనుషులు (ఎప్పుడో తప్ప) దుర్మార్గాన్ని దుర్మార్గంగానే ప్రేమించరు. తరచుగా, తమకు న్యాయమని తోచే కారణం ఏదో ఉంటుంది. రెండు – మనుషుల ఆలోచనలు ఒకరు 'కీ' తిప్పితే తిరిగే యంత్ర ఉత్పత్తులు కావు. చైతన్యం, సంకల్పం కలిగినవి.

మంచికీ, చెడుకూ కూడా పాశ్చాత్య దేశాల ప్రజా చైతన్యంలో – ముఖ్యంగా అమెరికాలో – కొన్ని ప్రగాఢమైన అభిప్రాయాలు ఉన్నాయి. తమది అత్యంత పురోగామి నాగరికత అనీ, దానిని స్వీకరించడానికి వెనుకబడినవారు మొరాయించడం తెలివి తక్కువతనమనీ వారు నమ్ముతారు. ఇందులో అహంకారమూ ఉంది, ఆధునికతా విలువల నుండి పుట్టిన విశ్వాసమూ ఉంది. ఆ విశ్వాసం అహంకారానికి ముసుగు మాత్రమేననే అతివాదపు వ్యాఖ్యను నమ్మగల వాళ్లకు తప్ప, ఇతరులకు ఈ రెండు అంశాలనూ విడివిడిగా చూడడంలో ఇబ్బంది ఉండవలసిన అవసరం లేదు.

తమ దగ్గర ఎవరి దగ్గరా లేని మంచి ఉందని నమ్మేవారు, దానిని ఇతరులకు బలప్రయోగంతో పంచడం తప్పు కాదని నమ్మడం అభ్యంతరకరం కావచ్చునుగానీ, అరుదయిన విషయమేం కాదు. పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలకు ఇది చాలా ఉపయోగపడుతున్నది. వారి అంతర్జాతీయ రౌడీయిజాన్ని తమ ఉన్నత నాగరికత వ్యాప్తిగా చూపించ గలిగినంత కాలం దానికి ప్రజామోదం పొందడం వారికి కష్టం కాదు. అదంతా పత్రికలు, ప్రసార సాధనాలు తెచ్చి పెడుతున్న సమ్మతి కాదు. వాటికొక పాత్ర లేకపోలేదు కానీ, ఆ దేశాల ప్రజా చైతన్యంలోనే దానికి పునాది ఉంది. వారి రౌడీయిజం 'మంచిని బలప్రయోగంతో వ్యాపింపజేయడం' అనే మూసలో కనిపించినంత కాలం ఆ రకమైన బలప్రయోగం తప్పుకాదన్న అభిప్రాయం అవాంఛనీయమయినదే – అయితే దానిని జాత్యహంకారంతో సమానం చేయలేం. కానీ అదే సాంస్కృతిక సంప్రదాయానికి వేరే పార్శ్వం కూడా ఉంది. వ్యక్తి హక్కులు, వ్యక్తి అభిమతానికి స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారం మొదలయిన విలువలు ఆ దేశాల వారు ఉన్నతంగా భావించే నాగరికతలో భాగమే. ఏదో ఒకరోజు అదే నాగరికత పాలక రౌడీయిజానికి కల్పించే సమ్మతి ఈ విలువలతో తలపడక తప్పదు. వియత్నాం యుద్ధం కాలం నుండి ఇది కొద్ది కొద్దిగా జరుగుతున్నది. ఇప్పుడు అపూర్వ స్థాయిలో ఈ నిరసన వినపడుతుందని నోమ్ చోమ్‌స్కీ వంటి వారు సహితం మెచ్చుకుంటున్నారు.

మనం పాశ్చాత్య దేశాల వారి సంస్కృతిని అనేక కారణాలుగా తిట్టుకుంటాం. అది న్యాయమే. అయితే మనం న్యాయంగా ఆలోచించేటట్టయితే ఈ నిరసన ప్రదర్శనలు వారి సంస్కృతిలోని మెచ్చుకోదగ్గ లక్షణం. భారత పాకిస్తాన్ ప్రభుత్వాల కాశ్మీర్ విధానానికి నిరసనగా ఈ దేశంలోనయినా, ఆ దేశంలోనయినా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేయడం ఊహించగలమా?

'అయితేనేం, ఇవేవీ జార్జిబుష్‌ను ఆపవు కదా' అని సినికల్‌గా అనేవారు ఉంటారు. ఆపకపోవచ్చు. అయితే అదేం విశేషం? చరిత్రలో మంచి చెడును ఎన్నిసార్లు ఆపగలిగింది? ఎన్ని సందర్భాలలో ఆపగలిగింది? అంతమాత్రం చేత దానిని మంచి అనడం మానేస్తామా?

ఫిబ్రవరి 24, 2003

# ఊహాత్మక ఆందోళన కాదు

**టా**డాను అత్యుత్సాహంగా అమలు చేసిన మన రాష్ట్ర పోలీసులు పోటాను అమలు చేసే విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు నిన్నటిదాకా అనిపించింది.

ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో పోటాను చాలా ఎక్కువగా వినియోగిస్తున్నట్టు వార్తలు వస్తుండగా, తెలుగు పోలీసులు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారని అనుకున్నాము. ఒకసారి చెయ్యి కాల్చుకున్నవాడు రెండవసారి కొంచెం మెలకువగా వ్యవహరించడం సహజమే. ఆ మాత్రమైనా అనుభవం నుండి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండడం ఆ మేరకు గౌరవించదగ్గ విషయమేనని భావించాము.

నిగాహ్

అది నిజం కాకపోవచ్చునేమోనని ప్రకాశం జిల్లా విప్లవ రచయితల సంఘం కన్వీనర్ అరవిందకుమార్ అరెస్టు సూచిస్తున్నది. అతని మీద రాసిన అంత పొడుగు ఎఫ్ ఐ ఆర్‌లో ఉన్నదంతా ఏమిటంటే అతని దగ్గర విప్లవ సాహిత్యం ఆడియోవీడియో కేసెట్లు దొరికాయని!

దొరికాయనే అనుకుందాం. అయితేనేం? వాటిని ఉపయోగించుకొని ఆయన పీపుల్స్‌వార్ వైపు యువతను ఆకర్షించడానికి కృషి చేస్తున్నాడనీ అందుకోసమే తన ఊరు విడిచిపెట్టి ఒంగోలుకు వచ్చి ఉంటున్నాడనీ పోలీసులు అంటున్నారు. ఈ సంగతులన్నీ మీకెట్లా తెలుసునంటే అరెస్టు చేయగానే అతనే ఒప్పేసుకున్నాడని అంటున్నారు (అటువంటి ఒప్పుకోళ్లను సాక్ష్యంగా కోర్టులో ప్రవేశపెట్టగలగడమే కదా పోటాలోని గొప్ప సదుపాయం. ఇంక అరవింద్ ఒప్పుకోక తప్పేదెట్లా)

అది కూడా నిజమనే ఒప్పుకుందాం. అయితే ఏం?

హింసవైపు యువతను ఆకర్షించడం తప్పు కాదా అంటూ దయచేసి ఆవేశపడొద్దు. ఇక్కడే పోటావంటి చట్టాలలోని ఒక ముఖ్యమైన లోపాన్ని గుర్తించాలి. అవి హింసను అరికట్టే పేరుమీద రాజకీయ భావాలను అణచివేస్తాయి.

అరవింద్ అనే ఆ వ్యక్తి హింసవైపు యువతను ఆకర్షిస్తున్నాడని పోలీసులు అనలేదు. ఆ పని చేస్తే అతనిని అరెస్టు చేయడానికి పోటా అక్కరలేదు. మామూలు చట్టాలు చాలు. అతను సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ రాజకీయాలు యువతలో వ్యాపింప జేస్తున్నాడని పోలీసులు అన్నారు. అది నేరమెందుకు కావాలి?

అవి సాయుధ పోరాట రాజకీయాలు కావా? అంటారేమో. అవును. సాయుధవర్గ పోరాటం వల్ల తప్ప ఇంకొక రకంగా ఈ సమాజం బాగుపడదు అని ఆ రాజకీయాలు అంటాయి. అది సత్యమనుకోండి. తెలివితక్కువతనం అనుకోండి. మీ ఇష్టం. కానీ ఒక అభిప్రాయం వల్ల ఎవరికీ ప్రత్యక్షంగా ప్రాణహాని లేనప్పుడు దానిని నేరంగా భావించడం సబబు కాదు. తక్షణమే తుపాకి తీసుకొని ఫలానా సుబ్బారావును చంపండి అని కరపత్రం అచ్చువేసి పంచడానికీ, ప్రజలు తుపాకులు తీసుకొని రాజ్యాధికారం సంపాదించుకోనిదే ఈ ప్రపంచం మారదూ అంటూ ప్రచారం చేయడానికీ తేడా ఉందని గుర్తించలేని నేరస్మృతి నేరస్మృతే కాదు.

అంతేకాక, పీపుల్స్‌వార్ రాజకీయాలు కేవలం సాయుధ పోరాట రాజకీయాలు కావు. భూమి పంపిణీ రాజకీయాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయాలు, వగైరా వగైరా. మొదటిదాని పేరు చెప్పి మిగిలిన వాటిన్నిటినీ నిషేధించడం భావ్యమేనా? పోటా వంటి చట్టాలలో ఉన్న ముఖ్యమైన లోపం ఇదే. అవి దేనినయితే టెర్రరిజం అని నిర్వచిస్తాయో అందులో రాజకీయాలు, హింస, సామాజిక ఆలోచనారీతులు సన్నిహితంగా కలగలిసి ఉంటాయి. ఆ రాజకీయాలు, ఆలోచనారీతులు అధికభాగం పీడిత ప్రజలకు, మైనారిటీలకు సంబంధించినవి అయుంటాయి. హింస పేరుతో వాటన్నిటి గొంతునొక్కేయడం పోటావంటి చట్టం లక్షణం.

ఒక మంచి లక్ష్యం కోసం ఆయుధాలు పట్టుకోవడంలో సమస్యలేమీ లేవని నా ఉద్దేశ్యం కాదు. సాయుధపోరాటం అనే మాటను అలవోకగా ప్రయోగించేవాళ్ల విజ్ఞత పట్ల నాకు సందేహం లేకపోలేదు. ఆయుధాలైనా, పోలీసుల ప్రయోగమైనా నైతికంగా తటస్థమైన సాధనం మాత్రమేననీ, దానిని ప్రయోగించే లక్ష్యాన్ని బట్టి దాని మంచి చెడులు ఉంటాయనీ నమ్మే అమాయకత్వానికి ప్రపంచంలో ఇంకా చోటు ఉందని నేను అనుకోవడం లేదు.

అయినప్పటికీ హింస పేరు మీద రాజకీయ అభిప్రాయాల గొంతునొక్కేయడం సమాజానికి చాలా నష్టం చేస్తుంది. ఆ రాజకీయాలు పీడిత ప్రజా వర్గాలకు, మైనారిటీలకు న్యాయం చేయడానికి పూనుకున్నవయితే మరీ నష్టం చేస్తుంది. ఇది ఆ రాజకీయాల సత్యాసత్యాలతోనూ విజ్ఞతతోనూ నిమిత్తం లేని విషయం.

హక్కుల ఉద్యమం పోటాను వ్యతిరేకించడానికి గల ప్రధాన కారణం ఇదే. నేర విచారణలో సహజ న్యాయ సూత్రాలు కొరవడతాయన్న అభ్యంతరం కంటే ఇదే ప్రధానమైన అభ్యంతరం. అది ఊహాత్మకమైన ఆందోళన కాదన్న సంగతి విరసం సభ్యుడు అరవింద్ అరెస్టుతో మరొక్కసారి రుజువయింది.

మార్చి 17, 2003

# గర్వించడానికి ఏమీ మిగలదు

సంఘపరివార్ గుండాయిజాన్ని ఏ భాషలో తిట్టాలో ఆ భాషలో తిట్టడానికి ఏ మేరకైనా ఇన్నాళ్లూ వెనకాడి ఉంటే ఆ మొహమాటాన్ని విడిచి పెట్టవలసిన రోజులొచ్చాయి.

ప్రవీణ్ తొగాడియా ఉన్మాదిలాగా మాట్లాడితే అతనిది 'మరీ అతి' అనుకొని అతనిని సంఘ్‌పరివార్ నుండి వేరు చేసి చూసిన వారున్నారు. అతనికి ముందు బాల్‌థాకరేకీ అదే గౌరవం లభించింది. 'పరమహంస' రామచంద్ర దాసు, ఆచార్య గిరిరాజ్ కిషోరు కూడ అదే గొంతుతో మాట్లాడుతున్నారని గుర్తించినప్పటికీ అదంతా కూడ 'అతి వాదం' కింద జమ చేయబడింది. సంఘ్‌పరివార్ స్వభావమే అది అన్న అభిప్రాయానికి రావడానికి సమాజం ఈ నాటికీ వెనకాడుతూనే ఉంది.

వాళ్లు దానికి తగినట్టు అతివాదులు–మితవాదులు అన్న డ్రామా చాలా నేర్పుగా ప్రదర్శిస్తుంటారు. ఇండియా హిందూ రాష్ట్రం కావలసిందేనని ఒకడంటాడు. ఈ దేశంలో మత రాజ్యం ఎప్పటికీ నెలకొనజాలదని ఇంకొకడు సర్ది చెప్తాడు. కోర్టులేం చెప్పినా చట్టమేమన్నా బాబ్రీ మసీదును కూల్చిన జాగాలో రామాలయం కట్టి తీరుతామని ఒకడంటాడు. ఒక డెడ్‌లైన్ పెట్టి ఆ లోపల నువ్వు కడతావా లేక నన్నే కట్టుకొమ్మంటావా అని ప్రభుత్వాన్ని సవాలు చేస్తాడు. తప్పు, తప్పు కోర్టు తీర్పుకు కట్టుబడి ఉండవలసిందేనని ఇంకొకడంటాడు. 'అయితే కోర్టు తీర్పు మీకు వ్యతిరేకంగా వస్తే దానికి కట్టుబడి ఉంటారా?' అన్న ప్రశ్నకు మాత్రం ఈ రెండవ వాడు ఏ జవాబూ చెప్పడు. గ్రహంస్టెయిన్స్‌ను, అతని కుమారులను చంపిన దుర్మార్గులను సన్మానించాలని ఒకడంటాడు. నేను దానిని ఖండిస్తున్నానని ఇంకొకడంటాడు. కానీ క్రైస్తవ మిషనరీల పైన అంతటి విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి కారణమైన విశ్వహిందూ పరిషత్ విషప్రచార కార్యక్రమాల సంగతేమిటంటే ఈ 'మితవాది' దగ్గర జవాబుండదు.

వీళ్లు అతివాదులూ కాదు. మితవాదులూ కాదు. అంతా గోల్వాల్కర్ వాదులు. గోల్వాల్కర్ అభిప్రాయాలు ఒక్కటయినా వదులుకున్నామని వీరిలో ఒక్కడిని అనమనండి? వాజ్‌పేయి నుండి తొగాడియా దాకా ఏ ఒక్కడూ అనడు. వీరిలో అతివాదులనూ, మితవాదులనూ వెతికే వారికి ఇంతకంటే జవాబు అక్కరలేదు.

ఈ మధ్య ఢిల్లీలో ధర్మ సంసద్ పేరు మీద బొట్లూ కాషాయ వస్త్రాలూ ధరించిన 'సాధువులూ', 'సంత్‌లూ' 'సన్యాసులూ' సమావేశమయి కక్కిన విషం అందరి భ్రమలనూ పటాపంచలు చేసి ఉండాలి. గుజరాత్ 'ప్రయోగాన్ని' ప్రశంసించారు. అదే భవిష్యత్ బాట అన్నారు. దానిని దేశమంతటా చూడాలని ఉవ్విళ్లూరుతున్నా మన్నారు. దేవుడి పేరు జపం చేసే వారు ఇటువంటి ప్రేలాపనలకు పాల్పడడం నాబోటి నాస్తికుడికే ఆశ్చర్యం కలిగించిందంటే దైవం, పాపం, పుణ్యం అంటూ బతికే వాళ్లకు ఏమనిపించి ఉంటుందో?

రెండు వేల మందిని మృగాలను వేటాడినట్టు వేటాడి తరిమి తరిమి చంపారు. వందలాదిగా స్త్రీలను అతి క్రూరంగా రేప్ చేసారు. ఇళ్లూ దుకాణాలూ వేలాదిగా తగలబెట్టారు. ఈ దృశ్యం దేశమంతటా చూడాలని కోరుకునేవారు సన్యాసులూ, సంత్‌లూ, సాధువులా? దేవుని మనుషులా లేకపోతే విషపు పురుగులా? నన్ను నేను హిందువుగా భావించుకోనుగానీ భావించుకునే వారు ఏ విధంగా మౌనంగా ఉండగలగుతున్నారు?

ముస్లిం లెవరయినా అతిగా మాట్లాడితే దుమ్మెత్తి పోస్తూ పత్రికలలో ఉత్తరాలూ వ్యాసాలూ రాస్తారే, హిందువులందరి పేరు మీద ఈ కాషాయాంబరధారులు ప్రదర్శించిన రక్త దాహాన్ని గురించి ఒక్క హిందువూ నోరు మెదపడేం? ప్రతీ హిందువులోనూ ఒక చిన్న తొగాడియా దాగి ఉన్నాడని అనుకోవాలా, లేకపోతే ఈ తొగాడియాల వల్ల, గిరి రాజ్ కిషోర్‌ల వల్ల, పరమహంస రామచంద్ర దాస్‌ల వల్ల ముస్లింలకూ క్రైస్తవులకే నష్టం తప్ప "మనకు" ఏమీ నష్టం లేదని ఊరుకుంటున్నారా?

హత్యలూ రేప్‌లూ గృహదహనాలూ లూటీలూ పక్కన పెడితే గుజరాత్‌లో జరిగిందేమిటి, హిందుత్వవాదులు "సాధించింది" ఏమిటి? పాకిస్తాన్ పేరు చెప్పి, పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిజం పేరు చెప్పి భారత ముస్లింలను బలప్రయోగంతో కంట్రోల్ చేయగలరనీ, నోరు మూసుకొని పడి ఉండేటట్టు చేయగలరనీ రుజువు చేయగలిగారు. సమాన హక్కులు, మత స్వేచ్ఛ, ఆత్మ గౌరవం అని మాట్లాడడం మానేసేటట్టు చేయగలరని రుజువు చేసారు.

హత్యలనూ, రేప్‌లనూ మెచ్చుకున్నట్లు కనిపించడానికి ఇష్టపడకపోయినా, ఈ "విజయాన్ని" సాధించినందుకు హిందుత్వవాదులను మనసులో అభినందిస్తున్న వారు హిందువులలో చాలామంది ఉన్నారనుకుంటాను. భారత రాజ్యాంగం అనవసరంగా ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, మైనారిటీల హక్కులు అంటూ హిందూ సమాజం ఆధిపత్యాన్ని బలహీన పరిచిందని చాలా కాలంగా లోలోపల బాధపడుతున్న వారికి, రాజ్యాంగాన్ని మార్చకుండానే మైనారిటీలను "ఎక్కడ ఉంచాలో అక్కడ" ఉంచడంలో కృతకృత్యమైన సంఘ్‌పరివార్ విజయం అభినందనీయమయింది. ఆ అర్థంలో "గుజరాత్ ప్రయోగాన్ని" దేశమంతటా జరపబోతామన్న సంఘ్‌పరివార్ హామీ వారికి ఆమోదనీయమయింది.

భారతీయ నాగరికతను 'భిన్నత్వంలో ఏకత్వం' అంటూ వీరు ప్రశంసిస్తుంటారు గానీ నిజానికి వీరికి ఆ భిన్నత్వమంటే గౌరవం లేదు. దానిని 'ఏకత్వం'లో ముంచాలన్నది వీరి తాపత్రయం. మొదట ముస్లింలు, క్రైస్తవుల వంతయిందిగానీ ఆ తరువాత హైందవ సమాజంలోని భిన్న సంప్రదాయాల వంతు వస్తుంది. ఎందుకంటే హిందుత్వవాదులు సహించలేనిది మైనారిటీల ప్రజాస్వామిక హక్కులను మాత్రమే కాదు. అసలు ప్రజాస్వామిక హక్కులనే వారు సహించరు. వారిలో లోపించినది పరమత సహనం మాత్రమే కాదు, వారి ఆలోచనలలో సహనమే శూన్యం. వారు గౌరవించలేనిది మత స్వేచ్ఛను మాత్రమే కాదు. అసలు స్వేచ్ఛనే గౌరవించలేరు.

'హిందూ జాతి'ని హిందూ రాష్ట్రంగా మలచి ఒక శక్తివంతమైన అగ్ర రాజ్యంగా తయారు చేయాలని, దాని కోసం భారతీయ సమాజాన్ని ఒకే మూసలో పోసినట్టు తయారు చేయాలని ఆ గోల్వాల్కర్‌వాదుల దీర్ఘకాలిక అజెండా. ఆ మూస వైదిక బ్రాహ్మణీయ సంస్కృతిని పెట్టుబడిదారీ సామాజిక నీతితో కలబోసిన వికృత సృష్టి. దానిలోకి దేశాన్ని బలవంతంగా ఇరికించే ప్రయత్నంలో వీరు ఎంతటి బలప్రయోగానికీ వెనుకాడరు.

అమానవీయమైన ఈ లక్ష్యాన్ని వారి ప్రతీ చర్యలోనూ చదవగలిగిన వారే సంఘ్‌పరివార్ రాజకీయాలను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. అది చేతకాని వారు, చేయడానికి మనసొప్పని వారు 'కొంచెం ఇచ్చేస్తే ఊరుకుంటారేమోలే' అంటూ ఒక్కొక్క అంగుళమే ఈ గుండాల గుంపుతో రాజీపడుతున్నారు. ఆ రాజీ భారతదేశానికి ఈ రోజు ప్రధాన శత్రువు.

ఈ రోజు వీళ్లు పార్లమెంటులో సావర్కర్ బొమ్మ పెట్టారు. దేశం జరగనిస్తుంది. రేపు గోల్వాల్కర్ బొమ్మే పెడతారు. దేశం దానినీ జరగనిస్తుంది. ఆ తరువాత గాంధీ బొమ్మ అంబేద్కర్ బొమ్మ తీసేస్తారు. ఆపైన రాజ్యాంగాన్ని తీసేసి 'బంచ్ ఆఫ్ థాట్స్' దాని స్థానంలో పెడతారు. అక్కడితో వారి అజెండా పూర్తి అవుతుంది. ఒక్కొక్క మెట్టు దగ్గర వారితో రాజీపడిన వారందరూ అప్పటి దాకా చూస్తూ ఉంటారు. ఆ తరువాత వారిని చూసే స్వేచ్ఛ కూడ మిగలదు. మనం గర్వించడానికి ఈ దేశంలో ఏమీ మిగలదు.

నిగాహ్

మార్చి 31, 2003

# ఆధిపత్య సంక్షేమ సంఘం!

కడప జిల్లాలో ఒక 'ఒ.సి. సంక్షేమ సంఘం' ఏర్పడి మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకొని దళితులను దబాయించి వర్ధిల్లుతున్న విషయం ఆ జిల్లా వెలుపల చాలా మందికి తెలీదు.

నిజానికి ఆ 'సంఘం' రాష్ట్ర స్థాయిలోనే ఉందట. దాని అధ్యక్షుడు మహబూబ్‌నగర్‌లో ఉంటాడంట. అయితే కడపలో 'అభివృద్ధి' చెందినంతగా అది వేరే ఎక్కడా చెందలేదు. అగ్రకులాలు తమపైన దాడి చేసారనీ అన్యాయం చేసారనీ దళితులు ఎప్పుడు ఫిర్యాదు చేసినా, ఈ 'ఒసి సంక్షేమ సంఘం' రంగంలోకి దిగి అదంతా అబద్ధమని దబాయించి పోలీసులు కేసు పెట్టకుండ చూసుకుంటుంది. ఆ మేలు చేసిపెడుతున్నందుకు జిల్లాలోని అగ్ర కులాలు వేల రూపాయల చందాలు సేకరించి ఇస్తున్నారంట.

ఏ తప్పుడు పనికైనా ఒక 'మిష' కావాలి. వీరి మిష ఏమిటి? ఎస్‌సి ఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని దళితులు దుర్వినియోగం చేస్తున్నారనీ దానికి అమాయకులైన చాలా మంది బలి అవుతున్నారనీ ఆ దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కోసం అగ్రకులంతో ఐక్యం కాక తప్పదనీ ఈ సంఘం వాదిస్తున్నది. అది అబద్ధమని గ్రహించడానికి ఆ సంఘం అధ్యక్షుడైన శశిధర్ అనే పూజారితో పావుగంట మాట్లాడితే చాలు. కులం ప్రాతిపదికన ఇస్తున్న రిజర్వేషన్లు తీసేసి, పేదరికం ప్రాతిపదికన అన్ని కులాల వారికీ ఇవ్వాలి; ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ప్రభుత్వం తన ఖర్చుతో బోర్లు వేయించడం, భూమి లేని వారికి భూములు పంచడం, ఇతర సహాయ సహకారాలు అందించడం మానుకోవాలి; ఎస్‌సి,ఎస్‌టి (అత్యాచారాల నిరోధ) చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలి; ఇత్యాది వారి డిమాండులు. ఈ డిమాండ్ల వెనుక ఉన్న ప్రచారమేమిటంటే దళితులకు రిజర్వేషన్లు ఇయ్యడం వల్ల ప్రతిభావంతులయిన అగ్రకులాల వారు అన్యాయంగా నష్టపోతున్నారు; ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల

నిరోధక) చట్టం ప్రతిరోజు దుర్వినియోగానికి గురవుతున్న ది; సబ్సిడీలు, ఇళ్ళ కాలనీలు, చవక బియ్యం ఇవ్వడం వల్ల ఎస్‌సిలు చొరవ కోల్పోయి తాము బాగుపడక పోగా మొత్తంగా రాజకీయ వ్యవస్థను దిగజారుస్తున్నారు.

ఈ అభిప్రాయాలను అగ్రకులాలకు చెందిన నిరుద్యోగ యువకులలోనూ కరువు పీడిత రైతాంగంలోనూ ప్రచారం చేసి దళితుల పైన వారిలో ద్వేషం రెచ్చగొట్టే కార్యక్రమం ఈ 'సంఘం' పెట్టుకుంది.

అసలే అది కడప జిల్లా, మామూలు పరిస్థితులలోనే దళితులు నోరెత్తడానికి భయపడే జిల్లా. అటువంటి చోట అగ్రకులాల సంఘాలు పెట్టి 'దళితులకే అంతా ఇచ్చేస్తున్నారు' అంటూ రెచ్చగొట్టే కార్యక్రమం పెట్టుకుంటే దళితులు ఇంక పూర్తిగా నోరు నొక్కుకుని బతికే పరిస్థితి వస్తుంది.

పోలీసులపైన ఒత్తిడి పెట్టడానికి కూడా ఈ 'సంఘం' అగ్రకులాలకు బాగా అక్కరకు వస్తున్నది. దళితులపైన దాడి జరిగిందన్న ఫిర్యాదు మీద పోలీసులు కేసులు పెట్టేదే తక్కువ, అరెస్టు చేసేది ఇంకా తక్కువ. ఇప్పుడు కడప జిల్లాలో పరిస్థితి ఏమిటంటే ఫిర్యాదు కంటె ముందే ఒసి 'హక్కుల సంఘం' పోలీస్ స్టేషన్‌కు పోయి 'అంతా అబద్ధం' అంటూ ధర్నాలు, ప్రదర్శనలు మొదలుపెడుతుంది. పనిచేయదలచుకోని పోలీసు యంత్రాంగానికి అంతకన్న ఏమి కావాలి?

చాలా నష్టకరమైన ఈ పరిణామాన్ని ఎదుర్కొనడానికి ఆ జిల్లాలో దళిత ఉద్యమం గానీ, ప్రజాతంత్ర ఉద్యమం గానీ సిద్ధంగా లేదు. కనీసం వారు చేస్తున్న విష ప్రచారానికి ఎదురు ప్రచారం చేసే ఒక గొంతు కూడ లేదు.

మామూలుగా కరువు గురించి, ప్రాజెక్టుల గురించి, ఇతర సమస్యల గురించి ఆందోళన చేసే ప్రజాతంత్ర వర్గాలు కూడా 'తప్పుడు కేసులు పెడుతున్న మాట నిజమే కదా' అని తమ నోళ్లకు తామే తాళాలు వేసుకుంటున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారన్న అభియోగం, కేసులే పెట్టకుండ అడ్డంపడే దాదాగిరీకి సాకుగా మారిన తరువాత కూడ అందులో ఉన్న సత్యాన్ని చర్చించుకునే స్థితిలో ప్రజాతంత్ర శక్తులు ఉండడం బాధాకరం.

తప్పుడు కేసులు పెట్టకూడదు. దళితుల మంచి కోసమే పెట్టకూడదు. ఎందుకంటే బడుగు వర్గాలు సాధించుకున్న ఏ హక్కు భూమిక అయినా నైతికం. ఆ నైతికత దెబ్బతింటే ఈ భూమికే పోతుంది. అయితే ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచార నిరోధక) చట్టానికి సంబంధించినంత వరకు వాస్తవం ఏమిటంటే ఆ చట్టం సరిగ్గా అమలు

కాక పోవడమే ప్రధాన సమస్య. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోరు. కేసు పెట్టరు. కేసు పెట్టినా దోషులను అరెస్టు చేసే బదులు వారి నుండి కూడా ఒక ఫిర్యాదు స్వీకరించి 'కౌంటర్ కేసు' తయారు చేస్తారు. రాజీకమ్మని ఒత్తిడి పెడతారు. అడుగడుగునా బాధితులు ఆందోళన చేయనిదే ఆ చట్టం ఒక్క అంగుళం కూడా అమలు కాదు. దుర్వినియోగం జరిగినప్పుడు కూడ, దళితులే తప్పుడు కేసులు పెట్టిన ఘటనలకంటే రాజకీయ నాయకులు తమ కక్షలు తీర్చుకోవడానికి తమకు అనుకూలంగా ఉండే దళితులను పావులుగా వాడుకుని అవతల వర్గం పైన తప్పుడు కేసులు పెట్టించిన ఘటనలే ఎక్కువ.

అయినా సంక్షేమ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టాలని మాత్రమే 'ఒసి సంక్షేమ సంఘం' డిమాండు చేయడం లేదు. వాటిని మొత్తంగానే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నది. వాటి వల్ల దేశానికి ఎంతో నష్టం జరిగిపోయిందని ప్రచారం చేస్తూ బడుగు వర్గాలపైన ద్వేషం రెచ్చగొడుతున్నది. ఈ సంఘం ఇప్పటికే కడప జిల్లాలో మండల స్థాయి నిర్మాణాన్ని సాధించింది. దేశ పాలనా విధానాలలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణంలో ఈ 'సంఘం' ఆ జిల్లాను దాటి బయటకు వ్యాపించడం అసాధ్యమేమీ కాదు.

# ఇది కూడ గో హత్యే

గోవధ నిషిద్ధమంట గానీ గోవులు మేత లేక ఛస్తే ఫరవాలేదంట.

అసలు మేత ఉంటే గోవులను 'కోత'కు ఏ రైతు పంపుతాడు?

ఈ సంవత్సరం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఎన్ని వేల ఆవులూ, ఎద్లూ, బర్రెలూ, దున్నపోతులూ కోతకు పోయాయో తెలుసుకున్న పార్లమెంటు సభ్యుడొకడయినా ఉన్నాడా? అయిష్టంగా పశువులను అమ్ముకున్న రైతుల కన్నీళ్లు ఏ సంఘ్ పరివార్ నాయకుడయినా చూసాడా? మేత లేని పశువులకు తప్పనిసరిగా మేత పెట్టాలని ఒక బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టరాదూ? దేశమంతటా వర్షాభావం ఉన్నప్పుడు అటువంటి చట్టం చేసినా ప్రభుత్వం మేత ఎక్కడినుండి తీసుకొస్తుందని అంటారేమో. ఆ దబాయింపుతోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ సంవత్సరం కాలం నిష్క్రియగా వెళ్లదీస్తున్నది. నిజంగానే ఎక్కడా నీళ్లు లేవని అందరూ అనుకుంటున్నారు కాబట్టి ఆ దబాయింపు సాగుతున్నది.

నిజానికి గోదావరి డెల్టాలో ఈ సారి నీళ్లున్నాయి, కోన సీమ, భీమవరం, నరసాపురం ప్రాంత రైతులు రెండవ పంట చేసారు. మన రాష్ట్రంలో వర్షం ఎక్కువ పడకున్నా గోదావరి నది ఎగువ భాగాన కురిసిన వాన వల్ల కాబోలు, గోదావరిలో సుమారుగా నీళ్లున్నాయి. వారికి అలవాటయిన పంటలు వేసే బదులు పశుగ్రాసంగా పనికొచ్చే పంటలు వేయమని ప్రభుత్వం గోదావరి డెల్టా రైతులను కోరి ఉండవచ్చును. ఆ పంటను తాను కొనుక్కొని కరువు ప్రాంతాల రైతులకు సబ్సిడీతో అమ్మి ఉండవచ్చును. కొనుగోలుకు గ్యారంటీ ఉన్నట్టయితే ఏ పంట అయినా వేయడానికి రైతులలో చాలామంది సిద్ధంగా ఉంటారు. కాబట్టి ఇది ఫలించగల విధానమే. పైగా ఇది కొత్త ఆలోచన కూడ కాదు. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వం ఈ పనే చేసింది. డెల్టా రైతులను పశుగ్రాసం పండించమని పురమాయించి వారి దగ్గర కొనుక్కొని కరువు ప్రాంతాలకు గూడ్సు బండ్లలో తరలించింది. అన్ని పశవుల

ప్రాణాలనూ ఆనాడు కూడ ప్రభుత్వం కాపాడలేదు గానీ కొన్నిటిని కాపాడింది. ఈ సారి ఆ ఆలోచన సహితం చేయలేదు.

కరువు గ్రామాల రైతులకే విత్తనాలు ఇచ్చి 'ఎవరయినా సరే పశుగ్రాసం పండిస్తే ప్రభుత్వం కొనుక్కుంటుంది' అని ప్రకటించారు. కొన్ని చోట్ల పెద్ద రైతులు ఎంఆర్‌వోల పోరు పడలేక విత్తనాలు కొని ఇంట్లో దాచుకున్నారు. వేయడానికి నీళ్లుంటే కదా? నీళ్లు లేని గ్రామాలకే పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేసే తెలివి తేటలను ఏమనాలి? కలెక్టర్‌లతో మాట్లాడితే, ఒక రైతు బోరయినా పని చేయకుండ ఉంటుందా అని ఈ ఎత్తుగడ వేసాం అంటున్నారు. పశువులకు నోరుంటే ఈ తెలివికి జోహార్లు చెప్పి ఉండేవి. ఈ సంవత్సరం 1000 అడుగుల లోతు బోరు వేసినా ఒక్క చుక్క నీరు దొరకని గ్రామాలు-ఉదాహరణకు కడప జిల్లాలో- ఉన్నాయి. 'ఇంకొక్క 200 అడుగులు తవ్వితే పెట్రోలే దొరికేదేమో కదా' అని రైతులు తమ గురించి తామే జోకులు వేసుకుంటున్నారు. అటువంటి చోట ఏ ఒక్క రైతు పొలంలోనయినా నీళ్లు ఉండక పోతాయా అని భావించడాన్ని తెలివితక్కువ తనమని కూడ అనకూడదు. నిర్లక్ష్యమే దానికి సరయిన పేరు.

ఈ నిర్లక్ష్యం ఫలితమేమిటంటే రైతులు పశువులను పెద్దసంఖ్యలో అమ్ముకున్నారు. అమ్ముకుంటున్నారు. మన దేశ పాలకులు గోసంరక్షకులు కాబట్టి వారికి తెలియవలసిందేమిటంటే రైతులు పశువులను అమ్మోకోక తప్పనప్పుడు మొదట ఆవులనే అమ్ముకుంటారు. ఎడ్లనూ కాదు బర్రెలనూ కాదు. ఎడ్లను అమ్మోకోవడమే లేదని కాదు, ఒక జత మిగుల్చుకొని మిగిలినవి అమ్ముకున్న రైతులు రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్నారు. రేపు మళ్లీ కొనాలంటే పదివేలు ఖర్చయ్యే పశువును ఇప్పుడు నాలుగు వేలకు, అయిదు వేలకు అమ్ముకున్నారు. సహనం మనిషిలో గొప్ప గుణమనడంలో అభిప్రాయ భేదం ఉండదు గానీ ఇటువంటి సమయంలోనే సహనాన్ని చూస్తే కోపం వస్తుంది. ఎవరినో కొట్టమనో తన్నమనో కాదు, ఇంతటి నిర్లక్ష్యాన్నీ బాధ్యతా రాహిత్యాన్నీ ఊరికే సాగనియ్యవద్దని. 'రైతులలో ఐకమత్యం లేదు' అనీ 'ఒకరు ఏదయినా మొదలుపెడితే ఇంకొకరు కలిసిరారు' అనీ గ్రామాలలో తరచుగా అంటుంటారు. ఐక్యమై గొడవ ఎందుకు చేయరు అన్న ప్రశ్నకు జవాబుగా ఈ వివరణ ఇస్తారు. ఈ ప్రాంతం ఆ ప్రాంతం అన్న తేడా లేకుండ అన్ని ఊర్లలోనూ ఈ మాటే అంటారు కాబట్టి ఇది నిజమైన ప్రతిబంధకమేననుకోవాలి. దీనిని ప్రభుత్వం నిస్సిగ్గుగా వాడుకొని కరువు నివారణ కోసం ఏమీ చేయకుండ కాలక్షేపం చేస్తున్నది.

రైతుల ఈ బలహీనత కారణంగానే కరువు సమయంలో ప్రభుత్వం ఏం చేయాలన్నది ఒక చట్టం రూపంలో ఉండడం అవసరం అని ఈ రోజు అందరూ భావిస్తున్నారు. ఒక కచ్చితమైన కరువు నియమావళి ఉండాలి, అందులో కనీస రక్షణకు హామీ ఉండాలి, అది చట్టం రూపంలో ఉండాలి. అందులో పశుగ్రాసం, తాగు నీరు, మనుషులకు పని అనే మూడు విషయాలకు కచ్చితమైన భరోసా ఉండాలి. ప్రజలలో ప్రజాస్వామ్య చైతన్యం పెరిగే కొద్దీ, చట్టాల అవసరం లేకుండానే కరువు సహాయం ప్రభుత్వం నుండి అందుతుందని ఆశించిన రోజులు లేకపోలేదు గానీ, మన ప్రభుత్వాలు ప్రజా చైతన్యానికి అంత గౌరవం ఇవ్వవని ఇప్పుడు అందరికీ స్పష్టం అయింది. ప్రజా చైతన్యం బలమైన ఉద్యమం రూపమయినా తీసుకోవాలి. అది సాధ్యం కానప్పుడు చట్టం రక్షణ అయినా ఉండాలి. కరువు కాలంలో పశువులను నిందించడం భావ్యం కాదనుకోకపోతే ఈ ప్రభుత్వాన్ని నిస్సంకోచంగా దున్నపోతు అనవచ్చు.

ఏప్రిల్ 28, 2003

# అశోక్ గెహలాట్‌కు అభినందనలు

ఇన్నాళ్లకు దేశంలో ఒక ప్రభుత్వానికి ధైర్యమొచ్చింది. చేయరాని పని చేయడానికి కాదు, చేయవలసిన పని చేయడానికి. విశ్వహిందూ పరిషత్ వారి త్రిశూల సమారాధనను దేశ వ్యాప్తంగా ఎప్పుడో నిషేధించవలసింది. ఇప్పుడు కనీసం ఒక రాష్ట్ర ప్రభుత్వం ఆ చొరవ తీసుకుంది. అందుకు రాజస్థాన్ ప్రభుత్వాన్ని అభినందించక తప్పదు.

దీనిని సహితం సంఘ్ పరివార్ తన ప్రచారం కోసం వాడుకుంటుంది. సందేహమేమీ లేదు. జైలు నుండి బయటికొచ్చిన తొగాడియా ఇప్పటికే ఆ పని మొదలుపెట్టాడు. హిందువులకు అన్యాయం జరిగిపోయిందనీ (హిందువులంతా హత్యలు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నట్టు), ఎవరేమన్నా హిందువులు పవిత్ర చిహ్నంగా భావించే త్రిశూలాల పంపకం మానేది లేదని ఇప్పటికే ప్రకటించాడు. రాజస్థాన్ సరిహద్దులు దాటే వరకు కొంచెం జాగ్రత్తగా మాట్లాడతాడు (ఎందుకంటే అసహాయుల మీద దాదాగిరీ చేయడంలో ఆనందం పొందే ఈ బాపతు మనుషులంతా స్వతహాగా పిరికి వాళ్లు). తనను తీస్‌మార్ ఖాన్‌గా గుర్తించి గౌరవించే గుజరాత్‌లోకి ప్రవేశించినదే తడవు అతని ఆవేశమంతా కట్టలు తెంచుకుంటుంది. అతను ఇవ్వబోయే ఉపన్యాసాన్ని ఊహించుకోవచ్చు.

'హిందుస్తాన్‌లో హిందువులు – త్రిశూలాలు పట్టుకొని తిరగకూడదంట ఛీఛీ – ఇది జాతికే సిగ్గు చేటు... అదే ముస్లింలయితే? వాళ్లు మదరసాలలో జిహాద్ పాఠాలు నేర్చుకోవచ్చు. ఇళ్లల్లో ఒసామాబిన్ లాడెన్ ఫోటోలూ సద్దాంహుస్సేన్ ఫోటోలూ పెట్టుకోవచ్చు. నలుగురిని పెళ్లి చేసుకోవచ్చు. గంపెడు పిల్లల్ని కనొచ్చు... ఇంకా ఇంకా... కుడి నించి ఎడమకు రాయొచ్చు. మీసం తీసేసి గడ్డం పెట్టుకోవచ్చు... ఏమైనా చేయవచ్చు...' అంటూ ఊగిపోతాడు రేపు ఈ పాటికి.

నేను మరీ వెక్కిరిస్తున్నాననుకోవద్దు. తొగాడియా ఆ మధ్య అనంతపురంలో, కడపలో, కర్నూలులో ఇచ్చిన ఉపన్యాసాలు విన్న భాగ్యం మీకు కలిగి ఉండకపోవచ్చు.

నేను వినలేదు గానీ ఆ ఉపన్యాసాల పూర్తి పాఠం టేప్ చేసి ట్రాన్స్‌క్రైబ్ చేయగా చదివాను. అందులో ఇంతకంటె గొప్ప తర్కమేమీ లేదు.

సాధారణ మానవులు ఈ విధంగా మాట్లాడడానికి సిగ్గుపడతారు. సిగ్గుపడకపోయినా చట్టానికి భయపడతారు. ఈ సంఘ్ పరివార్ బాపతుకు సిగ్గు స్వతహాగా లేదు. భయం మాటకొస్తే, వాళ్లు పెద్దగా సాహసవంతులేమీ కాదుగానీ వాళ్లను అంటుకోవడానికి చట్టమే భయపడుతున్నది. చట్టం కలవాడి చుట్టం అని కమ్యూనిస్టులు అంటుంటారు. అది కొంతవరకు నిజమేగానీ అంతకంటే ఎక్కువ నిజమేమిటంటే అది అధికారానికి చుట్టం. ప్రస్తుతం దేశాన్ని సంఘ్ పరివార్ సంస్థలు, వారితో లాలూచీ పడిన వారు ఏలుతున్నారు. వారిని వ్యతిరేకిస్తున్నానని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ 'హిందువుల వోట్లు' పోకుండ ఆ పని చేయాలన్న ఆరాటంతో తన కాళ్లకు తానే బంధం వేసుకుంది.

అందువల్ల, అందులో పావు వంతు రెచ్చగొట్టే మాటలు మాట్లాడే వారెవరినైనా లిస్టు తయారు చేసి కాల్చి పారేయడానికి క్షణం తటపటాయించని పోలీసు యంత్రాంగం, ఈ తొగాడియాలపైన, బాల్ థాకరేలపైన, గిరిరాజ్ కిశోర్‌లపైన, గడ్డాలకు రక్తం పూసుకొని తిరుగుతున్న రామచంద్ర పరమహంస వంటి స్వాములపైన సాధారణ నేర చట్టం కింద కేసులు నమోదు చేయడానికి సహితం సిద్ధంగా లేదు.

వీరికి కావలసింది అదే. వీళ్లను వర్ణించడానికి ఇంగ్లీష్‌లో సరయిన మాట ఒకటి ఉంది. Bully అంటారు. దానికి తెలుగులో అనువాదం లేదు. నిస్సహాయులపైన దాదాగిరీ చేస్తూ బతికే బాపతు అని దాని అర్థం. ఏడవ తరగతి నాలుగు సార్లు ఫెయిలై తనకంటె నాలుగేళ్ల చిన్న పిల్లల పక్కన కూర్చొని వాళ్లకు చాకులూ బ్లేడ్లూ చూపించి బెదిరించి వారి చేత సేవలు చేయించుకుంటూ మహదానందం పొందే కుర్రవాడ్ని చూసే ఉంటారు కదా? అందరి జీవితంలోనూ అటువంటివారు ఒకసారయినా తారసపడతారు. మన సంఘ్ పరివార్ దేశభక్తులు సరిగ్గా ఆ బాపతు. వాళ్లను నిజంగా ఎదిరించే వాళ్లు కనిపిస్తే తోకలు ముడుచుకుని కాదు స్వచ్ఛందంగా కత్తిరించుకొని పారిపోతారు. ప్రస్తుతం పోలీసులు తమ చుట్టాలు కాబట్టి ద్వేషాన్ని యదేచ్ఛగా ప్రచారం చేస్తూ అది రగిలించిన హింసాజ్వాలల చుట్టూ కేరింతలు కొడుతూ ఉన్మత్త ఆనందం పొందుతున్నారు.

లేదు, హిందుస్థాన్‌లో హిందువుల పవిత్ర చిహ్నంగా భావించే త్రిశూలంపైన నిషేధం లేదు. ఉండకూడదు. పిడి బాకుకు త్రిశూలం అని పేరు పెట్టి సెంటిమెంట్ పేరిట మారణాయుధాలు పంపిణీ చేసే యుక్తి మీద మాత్రం నిషేధం ఉంటుంది.

ఉండి తీరాలి. దేశంలోని శైవ క్షేత్రాలలో సన్యాసులనేకమంది త్రిశూలాలు పట్టుకొని తిరుగుతుంటారు. కొంతమంది పల్చటి త్రిశూలాలను బుగ్గలలోనూ ముక్కు పుటాలలోనూ గుచ్చి నిద్రాహారాలు మాని సంచరిస్తుంటారు. వారిని భక్తి భావంతో స్వాములలాగా కొలిచే వారూ ఉన్నారు. వెర్రి బాగుల వారిగా భావించే వారూ ఉన్నారు. కానీ వారిని ఎవరూ హంతకులని భావించరు. వారి వద్దనున్న త్రిశూలాన్ని మారణాయుధమనీ భావించరు.

విశ్వ హిందూ పరిషత్ పంచుతున్న త్రిశూలాలు ఇవి కావు. మూడు మొనలున్న ఉక్కు పిడి బాకులు. వాటిని పట్టుకొని తిరగడం నేరం కాదంటే చాకులూ కత్తులూ పట్టుకొని తిరగడం కూడ నేరం కాదు. ఈ 'త్రిశూలాలను' గత సంవత్సరం గుజరాత్‌లో జరిగిన మారణకాండలో విరివిగా వాడారు కాబట్టి అవి పవిత్ర చిహ్నాలు కావనీ మారణాయుధాలనీ ఇప్పుడందరికీ తెలుసును. వాటిని పంచడాన్నీ పట్టుకు తిరగడాన్నీ నిషేధించడానికి ఏదో ఒక రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవలసి ఉండింది. 'సాహసించి' ఈ పని చేసినందుకే అశోక్ గెహలాట్ ప్రభుత్వాన్ని అభినందించడం.

ఇక్కడొక విషయం స్పష్టం చేయడం అవసరం. సంఘ్ పరివార్ ఆయుధ సామాగ్రినే కాక వారి అభిప్రాయాలనూ ఆలోచనలనూ కూడ నిషేధించాలని వాదించేవారు ఉన్నారు. మొన్న తొగాడియా అనంతపురంలో, కర్నూలులో, కడపలో జరిపిన సభలను జరగనివ్వొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన వారూ ఉన్నారు. ఆయుధాలపైన నిషేధానికీ అభిప్రాయాలపైన నిషేధానికీ తేడా చూడలేక పోవడం తెలివితక్కువతనం. విద్వేషాన్నీ హింసనూ ప్రేరేపించే ప్రవచనాలను చట్టం ఎట్లాగూ నిషేధించిందిగానీ మొత్తంగా ఒక అభిప్రాయాన్నే నిషేధించాలన్న ఆలోచన సరయినది కాదు. నిషేధిస్తే ఆలోచనలు అంతరించి పోవు. రహస్య జీవితంలోకి పోతాయి. అవి చెడ్డ ఆలోచనలయితే సామాజిక చైతన్యానికి ఒక పుండుగా మారతాయి. మంచి ఆలోచనలకే తప్ప చెడ్డ ఆలోచనలకు స్వేచ్ఛ ఉండకూడదన్న అభిప్రాయం సగటు మనుషులకు ఆకర్షణీయంగానే తోచవచ్చును గానీ, ఏది మంచి ఏది చెడ్డ అన్న ప్రశ్న దాని వెనువెంటనే వస్తుంది. దీనికి జవాబు అంతిమంగా ప్రజలే చెప్పాలి కాబట్టి అన్ని అభిప్రాయాలూ తెలుసుకునే స్వేచ్ఛ ప్రజలకుండాలి.

మనం తప్పు అనుకునే ఆలోచనలను నిషేధించమని ప్రభుత్వాన్ని కోరే బదులు, వాటిని తర్కబద్ధంగా ఎదుర్కుంటూ వాటికి వ్యతిరేకమైన ఆలోచనలను విస్తృతంగా ప్రజలలో ప్రచారంలో పెట్టాలి. సంఘ పరివార్ వంటి సంస్థలు చేస్తున్న విష ప్రచారానికి వ్యతిరేకంగా ఇటువంటి కౌంటర్ – ప్రచారం జరగవలసిన అవసరం చాలా ఉంది.

ద్వేషాన్నీ హింసనూ ప్రేరేపించే ఉపన్యాసాలపైన క్రిమినల్ కేసులు పెట్టి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేయడం ఎంత ముఖ్యమో, లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, మైనారిటీల హక్కులు మొదలయిన విషయాలతో మొదలు పెట్టి భారత దేశ చరిత్ర, భవితవ్యాల దాకా అన్నిటి గురించీ వారు మాట్లాడుతున్న మాటలనూ, చేస్తున్న వ్యాఖ్యలనూ సవివరంగా, హేతుబద్ధంగా తిప్పికొడుతూ పెద్దఎత్తున ప్రచారం చేయడం అంతకంటె ముఖ్యమని గుర్తించడం అవసరం.

మే 19, 2003

# కరువు, కరువు పనులు, కరువు దాడులు

ఇరుగు పొరుగున ఉన్న నాలుగు మండలాలలో మినహాయింపు లేకుండ ప్రతీ ఒక్క ఇంటికీ తెల్లకార్డుందంటే నమ్ముతారా? తెల్లకార్డు ఉండడమంటే ప్రభుత్వం గుర్తించిన దరిద్ర రేఖకు దిగువన ఉండడం. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు డివిజన్‌లోని జైనూర్, నార్నూర్, సిర్‌పూర్ (యు), తిర్యాని మండలాలలో ప్రతీ ఇంటికీ తెల్లకార్డు ఉందని ఆయా మండలాలు ఎం.ఆర్.వో.లే అంటున్నారు.

'ప్రతీ ఇంటికీ' అంటున్నామే తప్ప 'ప్రతీ కుటుంబానికీ' అనడం లేదు. కార్డులు ఇచ్చిన నాడు కుటుంబాలనే గుర్తించి ఉండవచ్చును గానీ అవి ఇచ్చి ఎంతలేదన్నా 12 ఏళ్లు గడిచాయి. ఇచ్చిన తరువాత 'బోగస్ కార్డులను' ఏరి వేసారే తప్ప కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒక్కొక్క ఇంటికి కేటాయించిన బియ్యం కోటా పెంచలేదు. ఈ 12 ఏళ్లలో పిల్లలు పుట్టారు. అంతకు ముందు పిల్లలుగా ఉన్న వారు పెరిగి పెద్దవారయి వేరు పడ్డారు. పెళ్లి చేసుకొని పిల్లల్ని కన్నారు. కానీ ఆ ఇంటికిచ్చిన బియ్యం కోటా పెంచలేదు, పెరిగి పెద్దవారయి తామే కుటుంబపెద్దలయిన వారికి కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒకనాటి కుటుంబానికి ఇంటి నెంబర్ మాత్రమే చిహ్నంగా మిగిలింది. అందుకే కార్డు ఉన్నది ఇంటికే నంటున్నారు తప్ప కుటుంబానికి కాదు.

ఇక్కడి నేలలు నిన్న మొన్నటి దాకా దట్టమయిన అడవిని మోసిన ఎగుడు దిగుడు నేలలయినప్పటికీ చాలా సారవంతమయిన నల్లరేగడి నేలలు. కొంచెం శ్రద్ధ పెట్టే పాలకులుంటే బంగారం పండించగలవు. కానీ ఇక్కడి జనం అత్యధికంగా ఆదివాసులు కావడం వల్ల వీరి విషయంలో శ్రద్ధ పెట్టవలసిన అగత్యం ఉన్నట్టు ఈ రాష్ట్రాన్ని ఏలిన ఏ పార్టీ భావించలేదు. నిజానికి ఇది అదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ తాలూకాలకే కాదు మొత్తంగా ఆ జిల్లాకే వర్తిస్తుంది. ఆ జిల్లాలో బలమైన స్థానిక శూద్ర వ్యవసాయదారుల కులమేదీ లేదు. దేశంలో అటువంటి ప్రాంతాలేవీ గడచిన యాభై ఏళ్లలో వ్యవసాయ అభివృద్ధిని సాధించలేదు.

ఆదివాసీ ప్రాంతమయిన ఉట్నూర్ డివిజన్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండడంలో ఆశ్చర్యపోవలసింది లేదు. ఆ ప్రజల కష్టాలను మొదట బయటపెట్టి అప్పటి నిజాం సర్కారు చేత కొన్ని సంస్కరణలు చేపట్టించిన ఘనత పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్త హెమెండార్ఫ్‌ది కాగా, తరువాతి తరంలో ఆ ప్రజల రాజకీయ చైతన్యానికి తన నమూనాలో నుంచి వారికొక గొంతునందిచ్చింది పీపుల్స్‌వార్.

1989లో కాబోలు ఈ రోజు వచ్చినట్టే తీవ్రమైన కరువు వచ్చింది. ఉట్నూర్ డివిజన్‌లోని ఆదివాసులు తీవ్రమైన ఆకలికీ అనారోగ్యానికీ గురయ్యారు. పీపుల్స్‌వార్ దళాల ప్రోత్సాహంతో తిర్యాని, సిర్పూర్ (యు), జైనూర్ మండలాల ఆదివాసులు తూర్పు వైపు గుట్టలు దిగి దంతేపల్లి షావుకార్లపైన దాడి చేసి ధాన్యం, విత్తనాలు తీసుకుపోయారు. అప్పట్లో పోలీసులు వంద మందికి పైగా ఆదివాసుల్ని 'టాడా కింద అరెస్టు చేసారు. ఆ కేసు కిందటి సంవత్సరం దాకా (అంటే ఒక దశాబ్దం పైగా) నడిచి చివరికి అందరూ నిర్దోషులుగా ప్రకటించబడ్డారు. కానీ కేవలం జైలు నిర్బంధం, కోర్టు కేసుల కారణంగా ముద్దాయిలయిన ఆదివాసులు అనుభవించిన ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

ఇది నక్సలైట్ ఉద్యమం ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగిన మొదటి కరువు దాడి. ఆనాడు పోలీసులు దానిని నేరం అని ఉండవచ్చు. టెర్రరిస్టు నేరమనీ అని ఉండవచ్చు. కానీ స్థానిక ప్రజలలో–ఆదివాసీయేతరులలో సహితం– ఆ కరువు దాడి పట్ల వ్యతిరేకత రాలేదు. దంతేపల్లి షావుకార్లకు ఎవరూ సానుభూతి చూపించలేదు.

ఆ తరువాత కూడ కరువులొచ్చాయి. ఇక్కడా అక్కడా కరువు దాడులూ జరిగాయి. కానీ వాటిలో ప్రజా బాహుళ్యం, భాగస్వామ్యం కంటె దళ సభ్యులు, మిలిటెంట్ల భాగస్వామ్యం ఎక్కువ ఉండింది. 1995–96 సంవత్సరాలలో కరీంనగర్‌జిల్లా కాటారం ప్రాంతంలో ఒక కొత్త వరవడి మొదలయింది. ఒక ఊరిలో జరిగే కరువు దాడిలో ఆ ఊరి ప్రజలు పాల్గొనరు. చుట్టుపక్కల ఊర్ల ప్రజలు పాల్గొంటారు. అంతేకాక కరువు దాడిలో ధాన్యంగింజలే కాక డబ్బు, బట్టలు, బంగారం, రేడియోలు ఇత్యాది కూడా ఎత్తుకు పోవడం, తీసుకుపోని వస్తువుల్ని ధ్వంసం చేయడం మొదలయింది.

ఈ సంవత్సరం ఉత్తర తెలంగాణ వెలుపల జరిగిన కరువు దాడులలో ఈ లక్షణాలన్నీ పునరావృతమయ్యాయి. పుస్తెల తాళ్లు తెంపడం గురించి రాద్ధాంతం చాలా జరిగింది గానీ ఒక రాజకీయ పార్టీ నిర్వహించే కరువు దాడులలో ప్రజలకు ఇయ్యవలసిన మార్గదర్శకత్వం గురించి కొంచెం ఎక్కువ చర్చ జరిగి ఉంటే బాగుండేది.

పుస్తెలకే విమర్శ పరిమితం కావడం వల్ల దబాయించి నోరు మూయించే అవకాశం పీపుల్స్‌వార్ నాయకత్వానికి లభించింది.

ఉట్నూర్‌కు తిరిగివద్దాం. ఈ సారి ఉట్నూర్‌లోనే కాదు, ఉత్తర తెలంగాణలో ఎక్కడా నక్సలైట్ల ఆధ్వర్యంలో గానీ ఇతరత్రా గానీ కరువు పీడిత ప్రజలు కరువు దాడులు చేయలేదు. కరువు లేక కాదు, ఆకలి లేక కాదు, దోచుకోవడానికి షావుకార్లు లేకా కాదు. నిజానికి విప్లవ కమ్యూనిస్టు పార్టీల ప్రచారం కారణంగా పోరాడే జిల్లాగా పేరు పొందిన ఆదిలాబాద్ జిల్లా ప్రజా జీవిత సంస్కృతిలో స్వతహాగా మిలిటెన్సీ చాలా తక్కువ. ఆదివాసీలయినా, ఇతరులయినా వారి జీవన సంస్కృతి నెమ్మదయినది. ఇది మంచిదా చెడ్డదా అనే విషయంలో అభిప్రాయభేదాలకు తావు ఉంటుంది గానీ, ఇది మాత్రం వాస్తవం.

ఏమయితేనేం, ఉట్నూర్ ఆదివాసులు అల్లరికి దిగకుండ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు గింజల బియ్యం వండుకొని తింటున్నారు. గింజలు దొరకని నాడు పస్తులుంటున్నారు. కరువు జన్మభూమి అనీ, గ్రామసభలనీ ప్రజలను పదే పదే సమీకరించి మీలో ఎంతమందికి పనులు కల్పించాలో, ఎంతమందికి ఉచిత బియ్యం ఇయ్యాలో తేల్చండని చెప్పే ప్రభుత్వం ఇప్పటిదాకా చేసింది చాలా స్వల్పం. కరువు జన్మభూమిలో నమోదు చేసుకున్న వారి సంఖ్యను బట్టి లెక్కగడితే ఎన్ని దినాల పని ప్రభుత్వం కల్పించవలసి ఉండిందో అందులో సగటున 7 లేక 8 శాతం మాత్రమే 'పనికి ఆహారం' పథకం కింద కల్పించింది. కిలో 3 రూపాయలకు ఇచ్చే చవక బియ్యం (దీనికి అంత్యోదయ అన్న యోజన అని పేరు) దారిద్ర రేఖకు దిగువన ఉన్న ఈ ప్రజలలో నూటికి పది మందికి ఇస్తున్నారు. ఉచితంగా ఇచ్చే 'అన్నపూర్ణ' బియ్యం నూటికి ఒకరికి ఇస్తున్నారు.

అవసరానికి ఎంత మాత్రం సరితూగని ఈ సంక్షేమం అట్లాగుంచి ఆదివాసీ ప్రజలే అనేదేమిటంటే, మాకు నికరమైన ఉపాధి కల్పిస్తే ఇవి అవసరమే ఉండవు కదా అని. అంటే పొలాలకు సాగు నీరు, యువతకు ఫ్యాక్టరీలలోనో వేరొక చోటనో ఉద్యోగాలు కల్పించమంటున్నారు. సాగునీటి వ్యవస్థను పెంపొందించడానికి ఉట్నూరు పీఠభూమి పైన ఉన్న ఎగుడు దిగుడు నేలలలో అవకాశం పుష్కలంగా ఉంది. ఏ గ్రామానికి పోయినా తమ పొరుగున ఉన్న ఒక వాగు గురించో, ఒక వంక గురించో, దానిపైన కట్టగల ఆనకట్ట గురించో చెప్తారు. పదే పదే జరిగే 'జన్మభూముల' పైన పెట్టే ఖర్చు నీటిపైన పెడితే ఈ పొలాలకు సాగునీరు లభిస్తుంది కదా, అప్పుడు వర్షాభావం ఉన్న సంవత్సరాలలో సహితం తినడానికి ఇంత ఉంటుంది కదా అంటారు.

ఐటిడిఏ  స్కూళ్ల పుణ్యాన అంతో ఇంతో చదువుకుంటున్న ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే 'పనికి బియ్యం' పథకం కోసం ఎదురుచూడరు కదా అంటారు. ఈ మాటలు వినడానికి మన  రాష్ట్ర ప్రభుత్వం  సిద్ధంగా లేదు. పోనీ తాను ఆర్భాటంగా ప్రకటించుకునే కరువు సహాయ పథకాలనయినా సమగ్రంగా అమలు చేస్తుందా అంటే పది శాతం  కూడ చేయదు. మరి ప్రజల గతి ఏం కావాలి?

జూన్ 9, 2003

# వేయి నాల్కల వాజ్‌పాయి

అటల్ బిహారీ అబద్ధాల బేహారీగా చరిత్రలో నిలిచిపోతాడని నమ్మడానికి కావలసిన లక్షణాలన్నీ ప్రదర్శిస్తున్నాడు. రెండు నాల్కలు కాదు, ఎన్ని నాల్కలతో మాట్లాడుతున్నాడో లెక్క పెట్టడం కష్టంగా ఉంది. అయినప్పటికీ అతని ప్రవచనాలను రాజకీయ విజ్ఞత గల ప్రకటనలుగా భావించి వాటిలోని నిగూఢమైన భావాన్ని వెలికి తీయడానికి ప్రయత్నించే విశ్లేషకులకు మాత్రం దేశంలో కొదవ లేదు.

శ్రీనగర్‌లో మాట్లాడుతూ ' ఈ సారి పాకిస్తాన్‌తో జరిపే చర్చలు విఫలమయితే మరొకసారి ప్రయత్నం చేసేది లేదు' అన్నాడు. చాలా ప్రమాదకరమయిన ఈ ప్రకటన పట్ల దేశంలో రావలసిన వ్యతిరేకత రాలేదు. మరొకసారి ప్రయత్నం చేయకపోతే శాశ్వతంగా యుద్ధం చేస్తాడా?

అయితే జర్మనీలో ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, 'ఈ చర్చలు విఫలమయితే నేను రాజీనామా చేస్తాను' అన్నాడు. చేస్తే చేశాడు. దేశానికొచ్చిన నష్టమేమీ లేదు గానీ అదీ ఇదీ ఒకటి కాదు. శ్రీనగర్‌లో చేసిన అధిక ప్రసంగానికి వివరణ ఇచ్చే బదులు జర్మనీకి పోయి అనవసర ప్రసంగం చేసాడు.

దీనికి అతనిని నిలదీయవలసింది పోయి, 'నువ్వు నిజంగా రాజీనామా చేస్తానన్నావా? నిజంగా చేసేస్తావా"? అని విలేఖరులూ, విశ్లేషకులూ అతనిని గాభరాగా అడగసాగారు. దానికి స్పష్టంగా జవాబు చెప్పకుండ, "అది నా కోసం నేను చెప్పుకున్న మాట" అని ఒకసారి అన్నాడు. 'నీ ప్రశ్న స్పష్టంగా లేదు' అని రెండవసారి అన్నాడు. వారి వాచాలత్వం చాలా స్పష్టంగా ఉంది కాబోలు.

పాకిస్తాన్‌తో మాట్లాడే విషయంలోనూ పూటకొక ప్రకటన చేస్తున్నాడు. శ్రీనగర్‌లో స్నేహ హస్తం చాపినప్పుడు చర్చలకు ముందు షరతు ఏదీ విధించలేదు. 'ఆశ్చర్యకరమైన వరాలు గుప్పించే పద్ధతిలో మాట్లాడాడు' అని కాశ్మీరీ పత్రికలు సంభ్రమంగా

వ్యాఖ్యానించాయి. అయితే కొండ దిగి హిందుస్తాన్‌లో అడుగు పెట్టిన వెంటనే తన ఖాకీ నిక్కరు మిత్రులు గుర్తుకొచ్చినట్టున్నారు. 'సీమాంతర ఉగ్రవాదం ఆగితేనే చర్చలు' అన్నాడు. ఇందులో కొత్త ఏముంది? దీని కోసం కాశ్మీర్‌కు పోయి ముఫ్తీ మహమ్మద్ సయీద్‌ను ఇబ్బంది పెట్టి వేలాది జనాన్ని సమీకరింప చేసి మిలిటెంట్ల నిషేధాజ్ఞల నడుమ బహిరంగ సభ నిర్వహించి వరాలు వర్షించినట్టు విధాన ప్రకటనలు చేయవలసిన అవసరం ఏముండింది?

అయితే ఆ తరువాత ఇంకెక్కడో మాట్లాడుతూ 'కాశ్మీర్ సమస్య త్వరలోనే పరిష్కారం అయిపోతుందనీ, 'ఆశ్చర్యం కలిగించగల నిర్ణయాలకు సిద్ధంగా ఉండాల'నీ అన్నాడు. కాశ్మీరీల మనోభావాలను గౌరవించేంత మరీ ఆశ్చర్యకరమయిన నిర్ణయం ఆయనే కాదు ఏ భారత ప్రధానీ చేయబోడు కాబట్టి, ఆయన హామీ ఇస్తున్న 'షాక్' ఏమిటబ్బా? అని విశ్లేషకులు తలలు బద్ధలు కొట్టుకుంటున్నారు. అంత శ్రమ పడనక్కరలేదు. బహుశా ఆజాద్ కాశ్మీర్‌ను పాకిస్తాన్ వద్దనే ఉండనివ్వడం అనే తీవ్రమైన త్యాగానికి ఆయన సిద్ధపడిపోయినట్టున్నాడు. మనల్ని కూడ దానికి సిద్ధం కమ్మంటున్నట్టున్నాడు. కాశ్మీర్‌లో తాము కాక ఆజాద్ కాశ్మీర్ కూడ భారత్‌లో భాగమయి పోతుందని నమ్మేంత మూర్ఖులు సంఘ్ పరివార్ వ్యాయామశాలల వెలుపల ఎవరూ లేరు. కాబట్టి ఆయన హెచ్చరిక తన మిత్రులను ఉద్దేశించినదే అయి ఉండాలి.

ఇరాక్ విషయం చూడండి. ఇరాక్ పైన అమెరికా చేసిన దాడి గురించి భారత ప్రభుత్వం చాలా కాలంగా ఏమీ మాట్లాడలేదు. యుద్ధమొస్తే పెట్రోల్ ధరలు పెరుగుతాయన్నది అటల్ బిహారీ చేసిన మొదటి వ్యాఖ్య. అయితే ప్రతి పక్షాలు ఒత్తిడి చేస్తే లైన్ కొద్దిగా మార్చుకొని 'ఐక్యరాజ్య సమితి అనుమతి లేకుండ దాడిచేస్తే సహించం' అనే తీర్మానానికి సిద్ధమయ్యాడు. 'విధ్వంసాన్ని నేను ఆపనుగానీ పునర్నిర్మాణ బాధ్యతలో నాకు కొంచెం చోటు ఇమ్మ'ని అడుక్కుంటున్న ఐక్యరాజ్యసమితికి అంత గౌరవం ఇవ్వడం అనవసరమయినప్పటికీ మౌనంగా ఉండడం కంటే ఇది కొంచెం మేలే.

యుద్ధం అయిపోయింది. ఇరాక్ పునర్నిర్మాణ 'బాధ్యత'ను అమెరికా తన భుజాల మీద వేసుకుంది. ఇరాక్ ఆర్థిక పురోభివృద్ధికి అవరోధంగా ఉన్న ఆంక్షలు ఎత్తివేయమని ఐక్యరాజ్య సమితిని ఆదేశించింది. ఐక్యరాజ్య సమితి ఓకే అనింది. అప్పటిదాకా ఆమెరికా దౌర్జన్యాన్ని వ్యతిరేకించిన ఒకటి రెండు దేశాలు సహితం దీనికి కాదనలేదు. అమెరికాకు చెందిన కార్పొరేషన్లు ఇరాక్ పునర్నిర్మాణం పేరు మీద కోట్లు దండుకోవడానికి మార్గం సుగమం అయింది.

అయితే ప్రపంచాన్ని చాలాకాలం ఏలదలచుకున్న అమెరికా ఈ లాభార్జనలో నలుగురికీ వాటా కల్పించి మద్దతు సమీకరించదలచుకుంది. ఇరాక్ భూభాగాన్ని ముక్కలు ముక్కలుగా విభజించి ఒక్కొక్క ప్రాంతంలోనూ పెత్తనం చేసి ప్రయోజనం పొందమని ఒక్కొక్క దేశానికి ఆహ్వానం పంపింది.

నీతి మాలిన ఈ ఆహ్వానం పొందిన దేశాలలో ఇండియా ఒకటి. వాజ్‌పేయి ప్రభుత్వం దీనిని వెంటనే, నిర్ద్వంద్వంగా తిరస్కరించి ఉండవలసింది. ఇరాక్ పైన అమెరికా చేసిన దాడి తప్పు అని (ఎంత పరిమితమయిన అర్థంలోనయినా కానీయండి) తీర్మానించిన దేశం ఆ దాడి నుండి వచ్చిన ఫలితాన్ని పంచుకోవడానికి ఏ విధంగా సిద్ధపడుతుంది?

అటల్ బిహారీ ప్రభుత్వం సిద్ధపడింది. సిద్ధపడడంలోనే విజ్ఞత ఉందని గొప్ప గొప్ప మేధావులు పత్రికలలో వ్యాసాలు రాసారు. మారిన ప్రపంచ నైజాన్ని గుర్తించి దానితో పాటు మనమూ మారాలన్నారు. నీతి లేని కాలంలో నీతి గురించి మాట్లాడొద్దన్నారు.

అయితే వందల సంవత్సరాల కరణీకపు తెలివితేటలకు వారసులయిన మన పాలకులు కొంచెం టైం కావాలని అమెరికాను అడిగారు. బహుశా, ఇరాక్‌లో నీ వ్యూహానికి సహకరించాలంటే కాశ్మీర్‌లో మా వ్యూహానికి నువ్వు సహకరించాలని అమెరికాను రేపు అడగబోతారేమో. పాకిస్తాన్‌ను కొంచెం తొక్కితే ఇరాక్‌కు వస్తామంటారేమో. ఏమంటారో ఏం చేస్తారో రేపు చూస్తాము. అయితే బడితె ఉన్న వాడిదే బర్రె అనే అమెరికా నీతిలో భారత్‌కు భాగం ఇస్తారనేది స్పష్టమే. అయితే నిస్సహాయత కొద్దీ ఆవేశపడుతున్నాము గానీ అటల్ బిహారీ ప్రవర్తనలో ఉన్నది అబద్ధము కాదు, అతని దృష్టిలో అది అవినీతి కాదు. ఈనాడు అమెరికా ప్రదర్శిస్తున్న రాజనీతే మన సంఘ్‌పరివార్ మెచ్చే నీతి. పుట్టుక రీత్యా ఉన్నతులయిన జాతులు ప్రపంచాన్ని శాసించడమే సరయిన ధర్మం అన్నది వారి గురువు గోల్వాల్కర్ తన గురువు హిట్లర్ నుండి నేర్చుకుని సంఘ సేవకుల వ్యాయామశాలల ద్వారా ఖాకీ నిక్కరు తెగకు నేర్పించిన నీతి. పాకిస్తాన్‌తో మాట్లాడడమేమిటి, కాశ్మీరీల మనోభావాలను గౌరవించడమేమిటి, ఇరాక్ వంటి బలహీనమైన దేశం పట్ల సానుభూతి చూపించడమేమిటి, అమెరికా తెచ్చిన వేటలో వాటా వద్దనడమేమిటి? ఈ దేశంలో అంతకంటే భిన్నమయిన నీతి ఇంకా బతికి ఉంది కాబట్టి అటల్ బిహారీ అప్పుడప్పుడు తడబడుతుంటాడు – అంతే.

# సీమాంతర ఉగ్రవాదం

అనంతపురం జిల్లాలోని తెలుగుదేశం సానుభూతిపరులను కూడగట్టి రాష్ట్ర సరిహద్దు దాటి పరగోడు రిజర్వాయర్ దగ్గరకు పోయి అక్కడ పని ఆపాలన్న ఆందోళన చేపట్టిన చంద్రబాబుకు ఎవరూ ఒక విషయం చెప్పినట్టు లేదు.

శ్రీశైలానికి దర్శనానికి పోయే వారిలో కన్నడిగులే ఎక్కువ. దర్శనం అయిపోయిన తరువాత వారు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు అడ్డం పడుకొని తెలుగుగంగ 'ఇరిగేషన్ కాంపొనెంట్'కు ఆంధ్రప్రదేశ్ నీళ్ళు తీసుకోకుండా అడ్డుకొమ్మని కర్ణాటక ముఖ్యమంత్రి కృష్ణ తన రాష్ట్రానికి చెందిన మల్లన్న భక్తులను రెచ్చగొడితే ఏమవుతుంది? ఎందుకంటే తెలుగుగంగలో మద్రాసుకు మంచినీళ్ళిచ్చే 'కాంపొనెంట్' మాత్రమే చట్టబద్ధమైనది. పనిలో పనిగా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలలో సాగునీటి కోసం మనం తీసుకోవాలని చూస్తున్న నీళ్ళకు బచావత్ అవార్డులో అనుమతి లేదు. దాని గురించి కర్ణాటక ప్రభుత్వం అప్పుడప్పుడు నిరసన ప్రకటనలు చేస్తున్నది గానీ గుంపును పోగు చేసి దానికి అడ్డం పడాలన్న ఆలోచన కర్నాటక ఇప్పటిదాకా చేయలేదు. ఇప్పుడు చంద్రబాబు దారి చూపించాడు కాబట్టి చేయొచ్చు.

నదీ జలాల వాడకానికి సంబంధించిన చేదు వాస్తవం ఏమిటంటే నియమ విరుద్ధమయిన నడవడిక మొదలుపెట్టింది మనమే. అన్ని నియమాలనూ మొదట అతిక్రమించింది మనమే. మనల్ని చూసి కర్నాటక నేర్చుకుంటున్నదని ఉక్రోషం ప్రదర్శించడం ఏం న్యాయం?

చంద్రబాబు ఊరికే రచ్చ చేయడం, ప్రతిపక్షాలు (వామపక్షాలతో సహా) తగుదునమ్మా అని 'కడదాకా నీతోనే ఉంటాం' అని అతనికి హామీ ఇవ్వడం చూస్తే పరగోడు ఎంత పెద్ద ప్రాజెక్టో, దానిని నిర్మించడానికి కర్ణాటక ఎంత పెద్ద అక్రమానికి పాల్పడుతున్నదో అని అనుకోవచ్చు.

రెండూ నిజాలు కావు. పరగోడు ఊళ్ళలోని సగటు చెరువు సైజు ప్రాజెక్టు. దానిని కర్ణాటక మంచినీటి పేరు చెప్పి నిర్మించుకొని సాగునీటి కోసం పారించుకున్నా తద్వారా తీసుకోగల నీళ్ళు కొంచెమే... తాను పొందగల ప్రయోజనం కొంచెమే... మనకు చేయగల నష్టం కొంచెమే.

పరగోడు చిత్రావతి నది మీద కడుతున్న ఒకానొక చిన్న రిజర్వాయరు. చిత్రావతి పెన్నకు ఉపనది. పెన్నమీద మనం అనంతపురం జిల్లాలో, కడప జిల్లాలో, నెల్లూరు జిల్లాలో ప్రాజెక్టులు కట్టుకున్నాము. అవి కర్ణాటకకు చెప్పి కట్టామా అని అడిగితే మన వాళ్ళకు చాలా కోపం వస్తుంది. మనం కింది భాగంలో ఉన్నాం. మనం ప్రాజెక్టులు కట్టుకుంటే కర్ణాటక కొచ్చిన నష్టమేమీ లేదు. కానీ ఎగువన ఉన్న కర్ణాటక మనకు చెప్పకుండ, మనల్ని ఒప్పించ కుండ ప్రాజెక్టులు కట్టుకుంటే మనకు రాగల నీళ్లు ఆగిపోతాయి. కాబట్టి మనం ఏకపక్షంగా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. వాళ్ళు మాత్రం మనల్ని మెప్పించి కట్టుకోవాలి ఇదీ మన వాదన.

దీనికి కర్ణాటక దగ్గర జవాబు లేదనుకుంటే పొరబాటే. నది పై భాగాన ఉండే వాళ్ళు కింద ప్రాంతపు కాచ్‌మెంట్ నుంచి నీళ్ళు తీసుకోలేరు. (కాచ్‌మెంట్ అంటే నదికి వర్షపు నీటిని చేరవేసే ప్రాంతం అని అర్థం). పై భాగాన ఉన్న వాళ్ళు తమ ప్రాంతపు కాచ్‌మెంట్ చేరవేసే నీటిని మాత్రమే వాడుకోగలరు. సులభంగా చెప్పాలంటే, పరగోడు నుంచి కర్ణాటక ఎంత నీరు పారించుకున్నా అదంతా కర్ణాటకలో కురిసి చిత్రావతిలో చేరిన వర్షం నీళ్లే. మన కాచ్‌మెంట్ నీటిని వాళ్ళు వాడుకోలేరు.

కింది ప్రాంతం వాళ్లు మాత్రం తమ కాచ్‌మెంట్ నీళ్లేకాక పై ప్రాంతం కాచ్‌మెంట్ నీళ్లు కూడ వాడుకోగలరు. కాబట్టి తమ పై ప్రాంతం వాళ్ళు ఏం చేసుకున్నా కింది వాళ్ళు అడగనవసరం లేదు గానీ పై ప్రాంతం నీళ్లు తమకు వదిలిపెట్టాలని డిమాండ్ చేసే కింది ప్రాంతం వాళ్లు దానికి కారణం చెప్పి ఆ హక్కు, ఆ అర్హత ఎక్కడి నుంచి వస్తాయో చెప్పుకోవాలి. ఉదాహరణకు పెన్నానదిలో మన కాచ్‌మెంట్ నీళ్ళు మొత్తం మనమే వాడుకుంటున్నాం. అంతేకాక కర్ణాటక తన కాచ్‌మెంట్ నీళ్ళు మొత్తం వాడుకోకూడదని, మనం కోరుకున్నంత మనకు విడిచి పెట్టాలనీ మనం అంటున్నాం. ఇదే పరగోడు గొడవ.

రెండు వాదనలూ వినగానే హేతుబద్ధంగా అనిపిస్తాయి కదూ? వాస్తవం ఏమంటే నదీ జలాల విషయంలో కర్ణాటక చాలా ఆలస్యంగా మేల్కొనింది. కర్ణాటకలో కృష్ణ, పెన్నా నదులు ప్రవహించే ప్రాంతం రాజకీయంగా పలుకుబడి లేని ప్రాంతం. మన రాష్ట్రంలో ప్రాంతీయ ఆధిపత్యం ఉన్నట్టే కర్ణాటకలోనూ ఉంది. పాతమైసూరు రాష్ట్రం,

ధార్వాడ్ హుబ్లి ప్రాంతం కర్ణాటకలోని ఆధిపత్య ప్రాంతాలు. ఇతర ప్రాంతాల అవసరాలకు అంత ప్రాముఖ్యం లభించదు.

అందువల్ల, కృష్ణ పెన్నా నదుల వినియోగం విషయంలో కర్ణాటక చాలా ఆలసత్వం ప్రదర్శించింది. వాళ్ళు వాడుకోకుండ విడిచిపెట్టిన నీళ్లంతా మన రాష్ట్రంలోకి ప్రవహించగా, మనం రకరకాల రూపాలలో దానిని వాడుకుంటున్నాం. అవి 'మన నీళ్ళు' అన్న అభిప్రాయానికి మనం వచ్చేసాము. కర్ణాటక నాలుగయిదేళ్ళుగా మేలుకొని తన హక్కులు వినియోగించుకోవాలని చూస్తున్నది. దానితో మన నీళ్లు మనకు దక్కకుండా ఆపేస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. అల్లరి చేస్తున్నారు.

ఎక్కడి కాచ్‌మెంట్ నీళ్లు అక్కడే వాడుకోవాలనీ ఏ రాష్ట్రంలో కురిసిన నీరు ఆ రాష్ట్రం ఆస్తేననీ నేను అనడం లేదు. వర్షం ఒకరు కురిపించేది కాదు కాబట్టి దాని మీద ఆస్తి హక్కులు ప్రకటించుకోకుండ దానిని ప్రకృతి వనరుగా గుర్తించి అందుబాట్లో ఉన్నవారు అవసరాన్ని బట్టి వాడుకోవడమే నీటి విషయంలో ఉచితమైన వైఖరి. కోలార్ కంటె అనంతపురంలో కరువు ఎక్కువ కాబట్టి కర్ణాటక చిత్రావతి నీటిలో కొంచెం అనంతపురానికి ఇవ్వాలని మనం అడగొచ్చు. అందులో తప్పేమీ లేదు. కానీ పై వాళ్లు తమ నీటి హక్కులు శాశ్వతంగా మనకు అర్పించి సన్యసించాలనీ అది మన హక్కు అనీ దబాయించడం, అల్లరి చేయడం అర్థరహితం.

కర్ణాటక మీద మనకు హేతుబద్ధమైన ఫిర్యాదులు లేవని కాదు. అప్పర్ తుంగ ప్రాజెక్టులో కర్ణాటక బచావత్ అవార్డు కింద తనకు ఉన్న హక్కు కన్నా ఎక్కువ వాడుకుంటున్నదన్న సందేహానికి ఆస్కారముంది. హోస్పేట డ్యాంలో పూడికవల్ల నిండకుండా ఉన్న నీళ్ళు అప్పర్‌తుంగలో నిలుపుకుంటున్నానని కర్ణాటక అంటున్నది. కానీ ఆ 'నిండకుండా ఉన్న నీటి'లో మన వాటా కూడ బచాబత్ అవార్డు ప్రకారం – ఉంది. తుంగభద్ర ఎగువ కాలువ, దిగువకాలువ, రాజోలిబండ డైవర్షన్ స్కీంల వాటా ఉంది. ఇది మనం న్యాయబద్ధంగా ఫిర్యాదు చేయగల విషయమే కానీ అప్పుడు కరువు పీడిత రాయలసీమ జిల్లాల అవసరాల కోసం మనం శ్రీశైలం నుండి తెలుగు గంగ ద్వారాను, ఎస్కేప్ చానెల్ ద్వారాను నియమ విరుద్ధంగా తీసుకుంటున్న నీటికీ, ఇప్పుడు కొత్తగా గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా తుంగభద్ర నుండి తీసుకోబోతున్న నీటికీ కూడ సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది.

ప్రజలకివేవీ తెలియదని చెప్పి ఏదో ఒక అల్లరి చేసి గుంపును పోగు చేసి ప్రయోజనం పొందాలని చూడడం క్షమించగల విషయం కాదు.

# Nigah - Balagopal

బాలగోపాల్ ఆకస్మిక మరణం కారణంగా **'నిగాహ్'** కాలమ్ ఆగిపోవడాన్ని మించిన బాధాకరమైన విషయం నా వరకు నాకు ఇంకొకటి ఉండదు. దాదాపు 230 వారాలు ఆయన కాలమ్ నడిచింది ప్రజాతంత్రలో. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లి (ఇపిడబ్ల్యూ) వంటి గొప్ప పత్రికల వాళ్లే అడిగి రాయించుకునే స్థాయి బాలగోపాల్‌ది. ఆయనకు మాత్రం అవేమీ పట్టవు. ఆ తేడాలు ఆయనకు ఉండవు. అందుకే మనం రాయకపోతే ప్రజాతంత్రకు ఎవరు రాస్తారు? అని ప్రశ్నించాడు.

– దేవులపల్లి అమర్

దైనందిన పరిణామాలపై చేసే పత్రికా వ్యాఖ్యలకు సర్వసాధారణంగా కొద్దిరోజుల తర్వాత విలువ ఉండదు. ఇందుకు మినహాయింపులు ఉండవని కాదుగాని తక్కువే. అది వచ్చేదెప్పుడు? బాలగోపాల్ వ్యాఖ్యలను చదివితే అర్థమవుతుంది. ఒక్క పరమాణువులో విశ్వం దాగి ఉందన్నట్లు, మన చుట్టూ రోజువారీగా జరిగే ఘటనలను, పరిణామాలను చుట్టుకుని ఉన్న అనేక విషయాలు, వాటి పరస్పరసంబంధం, లోతు, విస్తృతి అన్నీ ఉంటాయి అందులో.

– టంకశాల అశోక్



